# మద్రాసు క్రైస్తవ కళాశాల (స్వ. ప్ర)

# MADRAS CHRISTIAN COLLEGE (AUTONOMOUS)

Vol. : 27 Issue : 7 (2) Spl. Edition May - 2024 ISSN No. : 2457-0796

## అంతర్జాతీయ అంతర్జాల వెబినార్

## తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు - సమీక్ష

## "Sahitya Academy Award Winning Writings in Telugu - A Review"

22, 23 డిసెంబర్, 2023

UGC APPROVED JOURNAL

# మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక

నిర్వహణ

తెలుగు శాఖ

మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 7 (2) మే - 2024

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013



**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆయా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**



*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

# అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

## తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు - సమీక్ష

**22, 23 డిసెంబర్, 2023**

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

**ప్రథమ ముద్రణ** : మే, 2024

**ప్రతులు** : 500

**కాపీలకు** : **మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై**

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**

మేనేజర్, **మూసీ మాసపత్రిక,**

2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఫోన్ : 934 797 1177

**email : editormusi@gmail.com**

ISSN 2457-0796 UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 7 (2) హైదరాబాద్ మే - 2024

# మద్రాసు క్రైస్తవ కళాశాల (స్వ.ప్ర), తాంబరం, చెన్నై

## తెలుగుశాఖ

# తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు - సమీక్ష

**22, 23 డిసెంబర్, 2023**

గౌరవ సంపాదకులు

**డా. శ్రీపురం యజ్ఞశేఖర్,** శాఖాధ్యక్షులు, భాషల శాఖ, మద్రాసు క్రైస్తవ కళాశాల

సంపాదకులు

**డా. బి.వి.యస్. గౌతమ**

**మరపట్ల రాజు,** పరిశోధకులు

**తెలుగు శాఖ**

**మద్రాసు క్రైస్తవ కళాశాల**

**తాంబరం, చెన్నై**

మద్రాసు క్రైస్తవ కళాశాల (స్వయం ప్రతిపత్తి)
తెలుగు శాఖ
తాంబరం, చెన్నై - 600059
తెలుగు శాఖ

## అంతర్జాతీయ అంతర్జాల వెబినార్

**అంశం : తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు- సమీక్ష**

డిసెంబర్ 22 & 23, 2023
ప్రారంభ సభ : 22.12.2023 ఉదయం 9.30 గం॥
వేదిక : జూమ్

అధ్యక్షులు : **డా॥ శ్రీపురం యజ్ఞశేఖర్,**
శాఖాధ్యక్షులు, భాషల శాఖ, మద్రాసు క్రైస్తవ కళాశాల.

ప్రిన్సిపాల్ ప్రసంగం : **డా॥ పి. విల్సన్**
ప్రిన్సిపాల్, మద్రాసు క్రైస్తవ కళాశాల

ముఖ్య అతిథి : **ఆచార్య. మాడభూషి సంపత్ కుమార్**
సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

ఆత్మీయ అతిథులు : **డా॥ జినుగు వేంకట మాధవి లలిత**
రచయిత్రి, ఖతార్.

విశిష్ట అతిథులు : **శ్రీమతి మంగిపూడి రాధిక**
రచయిత్రి & శ్రీ సాంస్కృతిక కళాసారథి, సింగపూర్.

గౌరవ అతిథి : **శ్రీ కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి**
రచయిత, విమర్శకులు, ఆంధ్రప్రదేశ్

కీలకోపన్యాసం : **ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

వందన సమర్పణ : **శ్రీమతి సి.ఇ.గాయత్రిదేవి**
తెలుగు పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల

---

మద్రాసు క్రైస్తవ కళాశాల (స్వయం ప్రతిపత్తి)
తెలుగు శాఖ
తాంబరం, చెన్నై - 600059
తెలుగు శాఖ

## అంతర్జాతీయ అంతర్జాల వెబినార్

**అంశం : తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు- సమీక్ష**

డిసెంబర్ 22 & 23, 2023
ముగింపు సమావేశం: 23.12.2023 సాయంత్రం 4.00 గం॥
వేదిక : జూమ్

అధ్యక్షులు : **డా॥ శ్రీపురం యజ్ఞశేఖర్,**
శాఖాధ్యక్షులు, భాషల శాఖ.

గౌరవ అతిథి : **డా॥ జాషువా కలపాటి**
పూర్వశాఖాధ్యక్షులు, ఫిలాసఫీ, మద్రాసు క్రైస్తవ కళాశాల.

ముఖ్య అతిథి : **ఆచార్య. గార్లపాటి దామోదర నాయుడు**
విశ్రాంతాచార్యులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

విశిష్ట అతిథి : **డా॥ తొట్టెంపూడి గణేష్**
హైడెల్బెర్గ్ విశ్వ విద్యాలయం, జర్మనీ.

ఆత్మీయ అతిథులు : **డా॥ సగిలి సుధారాణి**
రచయిత్రి, పరిశోధకులు, హైదరాబాద్.
**శ్రీమతి దివ్యజ్యోతి**
మలేసియా.
**డా॥ మానస మునిరత్నం**
తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై

వందన సమర్పణ : **శ్రీ టి. సోమశేఖర్**
తెలుగు పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల

# విషయసూచిక


| | | | | |
|---|---|---|---|---|
| | అపూర్వ ప్రయత్నం | – | ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ | vii |
| | ముందుమాట | – | డా. శ్రీపురం యజ్ఞశేఖర్ | viii |
| 1. | ఆంధ్రుల సాంఘిక చరిత్రము – ఒక పరిశీలన | – | డా. పప్పుల వెంకటరమణ | 09 |
| 2. | ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సమీక్ష | – | గొంగులూరి కృష్ణవేణి | 14 |
| 3. | నాట్యశాస్త్రము (గుప్త భావ ప్రకాశికా సహితము) అనువాదము – పరిశీలన | – | ప్రొ. వి.యస్. మంగాదేవి | 20 |
| 4. | విశ్వనాథ మధ్యాక్కఱలు – యోగ తత్త్వానుశీలనం | – | డా. ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి) | 23 |
| 5. | గుర్రం జాషువా క్రీస్తుచరిత్ర – ఒక పరిశీలన | – | మరపట్ల రాజు | 27 |
| 6. | క్రీస్తుచరిత్ర – జాషువా దృక్పథం | – | వి. పద్మ | 31 |
| 7. | అమృతం కురిసిన రాత్రి – తిలక్ కవిత్వం | – | డా. సారిక విజయలక్ష్మి | 35 |
| 8. | నార్లవారి 'సీతజోస్యం' హేతువాద దృక్పథం | – | డా. ఎం. వెంకట గౌరి | 39 |
| 9. | స్వర్ణకమలాలు – కుటుంబ జీవనం | – | డా. ఎం. దేవేంద్ర | 44 |
| 10. | గాలివాన కథ – మనస్తత్త్వ విశ్లేషణ | – | ఈ. కళ్యాణి | 47 |
| 11. | అనువాద సమస్యలు – ఒక పరిచయం | – | సి. ఇ. గాయత్రీదేవి | 51 |
| 12. | మోహనా! ఓ మోహనా! … | – | కంచర్ల మహేష్ | 55 |
| 13. | మధురాంతకం రాజారాం కథలలో మానవీయ దృక్పథం | – | గొల్లపల్లి వనజ | 60 |
| 14. | రాయలసీమ అభ్యుదయ కథాదీప్తి – కేతు విశ్వనాథరెడ్డి | – | ఓ. హరీష్ | 64 |
| 15. | అజంతా 'స్వప్నలిపి' కావ్యం – కవితా దర్శిని | – | తుళ్ళూరు రవి | 68 |
| 16. | కథా రచయితలకు మార్గదర్శిగా 'కథాశిల్పం' | – | కొండ ప్రవళిక | 73 |
| 17. | శ్రీకృష్ణ చంద్రోదయము పద్యకావ్యం – విశ్లేషణ | – | బి.వి.యస్. గౌతమ | 79 |
| 18. | తనమార్గం కథలు – స్త్రీవాద భావనలు | – | డా. నేమాని శారద | 84 |
| 19. | విముక్త కథలోని స్త్రీ పాత్రలు – ఓల్గా దృష్టి | – | గంధం రోజమ్మ | 88 |
| 20. | విముక్త కథలు – స్త్రీ సాధికారత | – | డా. కర్రి శ్యామలాదేవి | 93 |
| 21. | గాలిరంగు కవితాసంపుటి సామాజిక విశ్లేషణ | – | నోసిన వెంకటేశ్వర్లు | 96 |
| 22. | గాలిరంగు – మానవత్వం | – | కె. విశ్వనాథ్ | 100 |
| 23. | బండి నారాయణస్వామి శప్తభూమి నవల – వస్తు వైవిధ్యం | – | డా. పడక వెంకటేశులు | 104 |
| 24. | శప్తభూమి నవల – నామౌచిత్యం | – | ఋకే ధనక నాయక్ | 108 |

| | | | |
|---|---|---|---|
| 25. "పాలమూరు పాలపిట్ట" గోరటి వెంకన్న వల్లంకితాళం | - | బానోత్ వెంకటేశ్వర్లు | 114 |
| 26. 'విమర్శిని' - తెలుగు నవలా పరిశీలన | - | తుమ్మలపల్లి సోమశేఖర్ | 117 |
| 27. మొలకల పున్నమి కథలు - రాయలసీమ సంస్కృతికి నిలయాలు | - | ఆర్. విజయకుమారి | 122 |
| 28. మొలకల పున్నమి కథలు - సామాజిక దృక్కోణం | - | డా. మోగంటి సుధామయి | 126 |
| 29. వేంపల్లి గంగాధర్ 'మొలకల పున్నమి' లో అంకురించిన - దళిత స్త్రీ అస్తిత్వం | - | వడేరి నరేష్ | 130 |
| 30. శ్రీ సాధన పత్రిక - సీమ సాహితీ వైభవం | - | డా. పెరుమాళ్ళ రవికుమార్ | 135 |
| 31. 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' కథలోని సామాజిక పరిస్థితులు - పరిశీలన | - | రెడ్డిపోగు మధు, డా. రత్నశేఖర్ కట్టెపోగు | 138 |
| 32. మిళింద కథలు - స్త్రీల జీవితానికి ప్రతిబింబాలు | - | డా. సి. విజయలక్ష్మి | 143 |
| 33. మిళింద కథలు - సామాజిక చిత్రాలు | - | డా. ఉడాలి విష్ణుప్రియ | 147 |
| 34. యాలై పూడ్చింది - ఒక పరిశీలన | - | కె. అమృతజ్యోత్స్న | 151 |
| 35. బాధిత ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మనః సంఘర్షణల దర్పణం... | - | షేక్ షానాజ్ బేగం | 155 |
| 36. 'నడత నా తల్లి' కవితా సంపుటి - ఒక పరిశీలన | - | డా. కసుకుర్తి ఈశ్వరమ్మ | 161 |
| 37. మానస ఎండ్లూరి 'మెర్సీ పరిశుద్ధ పరిణయం' కథ ఇతివృత్తం... | - | డా. శీలం ఇందిర | 166 |
| 38. డా. పత్తిపాక మోహన్ బాలగీతాలు - వైజ్ఞానిక అంశాలు | - | దేవరకొండ ప్రవీణ్ కుమార్ | 170 |
| 39. 'సంస్కారం' నవల - అస్తిత్వవాదం | - | డా. నూకల విజయలక్ష్మి | 175 |
| 40. 'పర్వ', 'యుగాంత' రచనల తులనాత్మక పరిశీలన | - | డా. అంకే శ్రీనివాసులు | 179 |
| 41. తెలుగు ప్రజల వలస గోస - గోపల్లె జనాలు | - | డా. సుధారాణి | 185 |
| 42. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథల్లో స్త్రీ పాత్రల వైశిష్ట్యం | - | బులుసు సీతారామమూర్తి | 189 |

# అపూర్వ ప్రయత్నం

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** సంచాలకులు,
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు



చెన్నై మహానగరంలో మద్రాసు క్రైస్తవ కళాశాల ఒక ఉన్నతమైన విద్యాలయం. మహామహులైన తెలుగు వారెందరో ఈ కళాశాలలో చదువుకొన్నారు. ఈ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ సిరిపురం యజ్ఞశేఖర్ గారు తనదైన చైతన్యంతో నిత్యం ఈ శాఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వివిధ అంశాలపై అనేక సదస్సులు నిర్వహించారు. ఆ పరంపరలో భాగంగా 22, 23, డిసెంబర్ 2023లో మద్రాసు క్రైస్తవ కళాశాల తెలుగుశాఖలో **"తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు – సమీక్ష"** పేరుతో ఒక అంతర్జాతీయ అంతర్జాల సదస్సు నిర్వహించారు. అదొక అపూర్వమైన సదస్సు. ఆయనతో నాకున్న సాన్నిహిత్యాన్ని పురస్కరించుకొని ఆ సదస్సుకు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయ ఆచార్యులు మొదలు పరిశోధక విద్యార్థుల వరకు ఎందరో చక్కని పత్రాలను సమర్పించారు.

సాధారణంగా ఏదైనా సదస్సును నిర్వహిస్తే నిర్వాహకులు ఒక కోణాన్ని సూచిస్తారు. పరిశోధకులు ఆ కోణానికి సంబంధించిన భిన్న ప్రక్రియలలో వెలువడిన రచనలు ఎన్నుకొని పత్ర సమర్పణ చేస్తారు. లేదా ఏదైనా ఒక ప్రక్రియకు సంబంధించిన అంశాన్ని సూచిస్తే భిన్న కోణాల్లో పత్రసమర్పణ చేస్తారు. కానీ ఇక్కడ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు సమీక్ష అనే సరికి రకరకాల ప్రక్రియలు, విభిన్న కోణాలు వ్యక్తమవుతాయి. ఇది సుమారు ఆరు దశాబ్దాల కాలంలో తెలుగులో వచ్చిన ఉత్తమ గ్రంథాలను అనుశీలన చేసిన సదస్సు. పరిశోధకులకు ఇలాంటి సదస్సు ఒక గొప్ప ప్రయోజనకారి, తెలుగులో సాహిత్య అకాడమీ పురస్కారాలు పొందిన గ్రంథాలను గురించి ఏక కాలంలో తెలుసుకొనే అవకాశం కల్పించింది. పురస్కారం పొందిన గ్రంథాలను కూడా చదువుకొనే సమయంలేని వారికి ఆయా గ్రంథాలలో అసలు విషయం ఏమిటో నేరుగా అవగాహన కలుగుతుంది. అందుకు ఇలాంటి సదస్సులు చాలా ఉపయోగపడతాయి. ఈ సదస్సు కూడా అలాంటి ప్రయోజనాన్నే సాధించింది. సదస్సులో సమర్పించిన వాటిలో మెరుగైన 53 పత్రాలను ఎంపిక చేసి ఒక సంకలనంగా తీసుకొని రావడం మరింత హర్షదాయకం, ఈ వ్యాస సంకలనం పరిశోధకులకే కాక సామాన్య పాఠకులకు కూడా ఇంట్లో దాచుకొనే చక్కని గ్రంథమవుతుంది. కారకులైన సదస్సు సంచాలకులు, తెలుగు శాఖాధ్యక్షులు, ఈ గ్రంథ గౌరవ సంపాదకులు డా. శ్రీపురం యజ్ఞ శేఖర్ గారికి, గ్రంథ సంపాదకులు శ్రీ బి.వి.ఎస్. గౌతమ గారికి హృదయ పూర్వక అభినందనలు. మరిన్ని మంచి కార్యక్రమాలకు ఈ కళాశాల వేదిక కావాలని ఆశిస్తున్నాను.

**డా. మాడభూషి సంపత్ కుమార్**
సంచాలకులు,
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

# ముందుమాట

**డా. శ్రీపురం యజ్ఞశేఖర్,** శాఖాధ్యక్షులు, భాషల శాఖ, క్రైస్తవ మద్రాస్ కళాశాల



విద్యార్థులు, పరిశోధక మిత్రులు, సాహితీ ప్రియులు మరియు విజ్ఞులైన తెలుగు సాహితీ ప్రపంచ పటంలో నిల్వదగిన మహనీయులందరికి  నమస్కారములు.

నేను మద్రాసు క్రైస్తవ కళాశాలలో 1996 నుండి తెలుగు ఉపన్యాసకుడుగా పనిచేస్తున్నాను. ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్నో సదస్సులు నిర్వహించాను. దాదాపుగా అన్నీ కూడా తెలుగు సాహితీ సరస్వతికి మెడలో కంఠాభరణంగా ధరింపచేసే విధంగా ఉన్న అంశాల మీదనే పరిశోధనలు చేయించి ఆయా సదస్సుల్లో వచ్చిన పత్రాలను పుస్తక రూపంలో తీసుకొచ్చాను. గత దశాబ్ద కాలంలో మద్రాసు క్రైస్తవ కళాశాల భాషల శాఖ – తెలుగు విభాగం చేసిన సదస్సులు వాటి అంశాలు వైవిధ్య భరితమైనవి. ఇందులో భాగంగా 2023 డిసెంబర్ మాసంలో నిర్వహించిన సదస్సు అంశం **“తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు ఒక సమీక్ష.”**

ఈ అంశం తీసుకుని సదస్సు నిర్వహించాలని పరిశోధక మిత్రులతో చర్చించిన వెంటనే ఆచార్యులు, సాహితీ ప్రియులు చాలా చక్కని అంశం అని వెంటనే స్పందించారు. తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన వాటిలో బాలసాహిత్యంలో అవార్డు పొందినవి, యువ సాహితీవేత్తల అవార్డు పొందిన రచనలు మొదలగు వీటన్నిటి మీద అద్భుతమైనటువంటి పరిశోధనా పత్రాలు వచ్చాయి. వీటన్నిటిని క్రోడీకరించి పుస్తక రూపంలో తీసుకొస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

ఇందులో భాగంగా మూసీ పత్రిక యాజమాన్యాన్ని వారి పత్రికలో ప్రచురించాలని సంపాదక మండలి కోరిన వెంటనే వారు కూడా వెంటనే స్పందించి ఈ పరిశోధన పత్రాలను యుజిసి కేర్ జర్నల్ అయిన ‘మూసీ’ పత్రికలో ప్రచురించి ప్రత్యేక సంచికగా తీసుకురావడానికి అంగీకరించారు. వారి సమన్వయంతో పుస్తకంగా రూపుదిద్దుకోవడానికి సహకరించారు. వారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ సాహితీ యజ్ఞంలో పాలుపంచుకున్న ఆచార్యులు, సాహితీవేత్తలు, విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారెందరో పాల్గొని సదస్సును జయప్రదం చేశారు. ఈ పుస్తకం రాబోయే తరాలకు ముఖ్యంగా తెలుగు పరిశోధకులకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. ఈ సదస్సు నిర్వహణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలుపంచుకున్న నా విద్యార్థులు, ఆంధ్ర భాషాభిరంజని సంఘం విద్యార్థి నాయకులు, తెలుగు పరిశోధక విద్యార్థులకు ధన్యవాదాలు.

సదస్సులో ముఖ్య అతిథి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి కీలకోపన్యాసం గావించిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి గారికి, సదస్సులో పాల్గొన్న అతిథులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ తెలుగు తల్లికి ఈ పుస్తకాన్ని సమర్పించుకుంటున్నాను.

**డా. శ్రీపురం యజ్ఞశేఖర్**

తెలుగు ఆచార్యులు

# ఆంధ్రుల సాంఘిక చరిత్రము - ఒక పరిశీలన

**డా. పప్పల వెంకటరమణ,** తెలుగుశాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం

సాహిత్య అకాడమీ జాతీయ స్థాయి బహుమతి గెలుపొందిన తెలుగు, కన్నడ భాషల పుస్తకాలలోని విశేషాలను సూక్ష్మ రూపంలో పాఠక లోకానికి అందజేయాలనే ఉద్దేశంతో రెండు రోజుల అంతర్జాతీయ అంతర్జాల వెబినార్ సదస్సు నిర్వహించి పరిశోధనా పత్రాలకు ఆహ్వానం పలికిన మద్రాసు క్రైస్తవ కళాశాల(స్వయం ప్రతిపత్తి) తాంబరం, చెన్నై వారికి నా కృతజ్ఞతాభివందనములు. ఈ అంతర్జాతీయ వెబినార్‌లో నా యొక్క పరిశోధన పత్రం తెలుగులో మొదటి జాతీయస్థాయిలో అవార్డు పొందిన శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర – ఒక పరిశీలన" అనే అంశమును ఎన్నుకొని పత్ర సమర్పణ కావించుకుంటిని. సురవరం ప్రతాపరెడ్డి గారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' చాలామంది మేధావుల మెప్పును, విమర్శకుల అభిమానాన్ని, అశేష ప్రశంసలను అందుకున్న ఉద్గ్రంథము.

పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా, పండితుడుగా, రచయితగా, ప్రేరకుడిగా, క్రియాశీల ఉద్యమకారుడుగా ప్రఖ్యాతిగాంచిన సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని ఇటిక్యాలపాడు గ్రామంలో జన్మించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ., తిరువాన్కూర్‌లో బి.ఎల్, అభ్యసించి కొంత కాలం పాటు న్యాయవాద వృత్తి నిర్వహించారు. ఈయన అనేక భాషలలో మంచి పండితుడు. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతము, పారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. 1926లో ఆయన నెలకొల్పిన గోల్కొండ పత్రిక తెలంగాణ సాంస్కృతిక గమనంలో మైలురాయి.

తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యానికి మారుపేరుగా నిలిచిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్య సామాన్యమైనది. తెలంగాణలో కవులే లేరని నిందా వ్యాఖ్యలను సవాలుగా తీసుకొని 354 మంది కవులతో కూడిన "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి ఒక అధ్యాయం. గోల్కొండ పత్రికకు అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి సంపాదకుడిగా, పత్రికా రచయితగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ గ్రంథాలయ ఉద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖ పాత్ర వహించారు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. తెలంగాణలో జరిగిన సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో నిజాం నిరంకుశత్వాన్ని ధిక్కరించి, భయంకరమైన భూస్వామ్య మరియు రాచరిక నియంతృత్వం నుండి ప్రజల విముక్తి కోసం కృషి చేసేటందుకు చురుగ్గా పాల్గొని నాయకత్వం వహించి ప్రసిద్ధి చెందారు. నిజాం హైదరాబాద్ రాష్ట్రంలోని మెజారిటీ సమాజాన్ని మరియు ముఖ్యంగా తెలంగాణలోని తెలుగు ప్రజలను అణచివేస్తున్న రోజులలో 1930 జోగిపేటలో జరిగిన ప్రముఖ ప్రజా పోరాట సంస్థ నిజాం ఆంధ్ర మహాసభకు మొదటి అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డాడు.

సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, గ్రంథాలయ ఉద్యమము అనే ముఖ్యమైన రచనలు చేసిరి. ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర ఉత్తమ సామాజిక చరిత్రగా పరిగణించబడుతుంది. ఇది కేంద్ర సాహిత్యం అకాడమీ నుండి మొదటి అవార్డును 1955లో గెలుచుకుంది. ఇది ఏడు సార్లు

మళ్లీ మళ్లీ ముద్రించబడింది. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేత హిందీభాషలోకి అనువదించబడింది. తెలుగు జాతికి ఇతను చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని ట్యాంకు బండ్‌పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం కూడా స్థానం పొందింది.

తెలుగు సాహిత్యం మీద పట్టు, చరిత్ర పరిశోధన మీద ఎడతెగని ఆసక్తి ఉన్నవాళ్లలో ముందు చెప్పుకోవాల్సిన పదిమందిలో అగ్రగన్యుడు సురవరం ప్రతాపరెడ్డి. తన రచనలకొక లక్ష్యము, తన పరిశోధనకు ఒక ఆదర్శము కల వ్యక్తి. తన కృషి సమాజ పరంగా సాగించిన ఉద్యమ శీలి. తెలుగు వారి గుండెల్లో నిలిచిన తెలంగాణ ముద్దుబిడ్డ. తన చుట్టూ ఉన్న జనంలో చైతన్యాన్ని రగిలించిన విప్లవ వీరుడు. సాహిత్య రంగంలో అత్యంత ఖ్యాతి గడించారు. సురవరం ప్రతాపరెడ్డి స్పృశించని సాహిత్య ప్రక్రియ లేదు. పరిశోధనాత్మక రచనలలో వారిది అందెవేసినచేయి. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి పట్ల వారి అభిమానానికి హద్దులు లేవు.

సమాజంలోని సామాన్య ప్రజల సాంఘిక జీవనాన్ని (ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, వినోదాలు, జీవనశైలి, ఇత్యాదులు) ప్రత్యేకంగా చిత్రిస్తే ఆ రచనను సాంఘిక చరిత్ర అంటారు. సాంఘిక చరిత్రలు ఆయా కాలపు ప్రజల జీవిత విశేషాలను విపులంగా తెలుసుకొనుటకు ఎక్కువగా ఉపయోగపడతాయి. తెలుగు భాషలో సాంఘిక చరిత్రలు అరుదుగా కనిపిస్తాయి. చారిత్రక రచనలు వ్రాయుటకు చాలామంది రచయితలు ప్రయత్నించారు. అట్టి వారిలో సురవరం ప్రతాపరెడ్డి అగ్రగన్యులు.

సాంఘిక చరిత్రను గురించి వివరిస్తూ శ్రీ సురవరం ప్రతాపరెడ్డి ఇలా అంటారు. రాజుల చరిత్రలు మనకు అంతగా సంబంధించినవి కావు. సాంఘిక చరిత్రలు మనకు పూర్తిగా సంబంధించినవి. సాంఘిక చరిత్ర, మానవ చరిత్ర, ప్రజల చరిత్ర అది మన సొంత కథ. అది మన జనుల జీవనమును ప్రతి శతాబ్దం నందు ఎట్లుండెనో తెలుపునటువంటిది. అది మన తాత ముత్తాతల చరిత్ర. వారి ఇల్లు కట్టుకునే విధానము, వారి కట్టుబొట్టు, తిండి, ఆటలు, పాటలు, పడిన పాట్లు, మనకిచ్చిపోయిన వారసత్వ సంపద ఇవన్నీ తెలిపి మనకు సహాయపడును. పైన పేర్కొన్న వాక్యాలు శ్రద్ధతో పరిశీలిస్తే ప్రతాపరెడ్డి లక్ష్యం ఏమిటో అర్థమవుతుంది. ఆ లక్ష్యసాధన కోసమే ఆంధ్రుల సాంఘిక చరిత్ర రూపొందింది. రెండు దశాబ్దముల పాటు నిర్విరామముగా కృషిచేసిన ఫలితమే ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచన రూపంలో ప్రచురితమైనది. సురవరం ప్రతాపరెడ్డి ఈ విశిష్ట రచనలో దాదాపు 1000 సంవత్సరాల ఆంధ్రుల సాంఘిక చరిత్ర నిక్షిప్తమై ఉన్నది.

సాహిత్యం ద్వారా సాంఘిక జీవనాన్ని నిరూపించడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత. ఒక సంస్కృతి యొక్క పుట్టుక, వికాసాలను గురించి ఆధారాలతో విశ్లేషిస్తే అది ఆ సంస్కృతి, సభ్యతల చరిత్రగా పరిగణించబడుతుంది. నిజమైన సాహిత్యం ఏ కాలానికి సంబంధించినదైనా ఆ కాలపు ప్రజా జీవితానికి అద్దం పడుతుందని చాలామంది రచయితల నమ్మకం. ఆంధ్రుల సాంఘిక చరిత్రలో మొత్తం ఎనిమిది ప్రకరణములు ఉన్నాయి. అందులో మొదటిది తూర్పు చాళుక్యయుగం. నన్నయ కాలము నుండి కాకతీయుల కాలం వరకు అంటే దాదాపు క్రీ.శ. 1000 నుండి 1200 వరకు తెలుగుదేశంలోని ఆచార వ్యవహారాలను సురవరం వారు ఈ ప్రకరణలో చర్చించారు. ఈ విషయాలకు ముఖ్యంగా నన్నెచోడుని కుమార సంభవం, తెలుగు భారతం, చాళుక్య సోమేశ్వరుడు రచించిన అభిలషితార్థ చింతామణి ఆధారాలుగా పరిగణించారు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి.

వివాహానికి సంబంధించిన ఆచార పద్ధతులను వివరిస్తూ ఆ కాలము తెలుగువారి ఇళ్లలో నాలుగు రోజుల పెండ్లి సాధారణమని, వివాహ కార్యక్రమాలు నిర్విరామంగా నాలుగు రోజులపాటు జరుగుతూ ఉండేవని పేర్కొన్నారు. మహాభారత కాలాన్ని పురస్కరించుకొని 'ఉత్తర' వివాహము నాలుగు రోజులు జరిగిందని, వివాహానంతరము బంధువులు ఎవరు ఇళ్లకు వారు వెళ్లిపోయినట్లుగా చిత్రించారు. అలాగే మేన మరదలని పెళ్లాడే ఆచారం తెలుగు వారిదేనని సురవరం వారు అభిప్రాయపడ్డారు. ఆ కాలపు వేషభాషలను గురించి ముచ్చటిస్తూ స్త్రీలు మట్టెలు ధరించడం కూడా తెలుగువారి ఆచారమేనని, వైదిక పద్ధతిలో ఇటువంటి ఆనవాయితీ లేదని వెల్లడిస్తూ తాళిబొట్టు ద్రావిడ ఆచారములోనిదని పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తూర్పు చాళుక్యయుగమును గురించి చేసిన చర్చలో ఆనాటి మత విషయమై ప్రస్తావించి, శైవమతవ్యాప్తికి కారణాలు, రాజరాజ నరేంద్రుని క్షత్రియ వంశ విశేషాలు, బ్రాహ్మణ జాతి ప్రాముఖ్యత, ఆనాటి కవుల కవితా రీతులు మొదలగునవి సహేతుకంగా

వివరించారు. ఆనాటి జనజీవన స్రవంతిలో వినోద విషయాలను వివరిస్తూ అంకమల్ల వినోదము, కోళ్లపందము, లావక పిల్లల కొట్లాట, మేష మహిష యుద్ధాలు, పావురాల పొట్లాట, గీతావాద్య నృత్యాలు, చతురంగము, పాములాట మొదలగు వినోదములు ఇందులో పేర్కొనిరి.

పరిపాలన వివరాలను గూర్చి తెలుపుతూ తూర్పు చాళుక్యుల కాలంలో పంచాయతీ సభ్యులు, సభలకు వచ్చే అభియోగాలు, శిక్ష తీర్మానాలు మొదలగు విషయాలను పంచాయతీ సభల ద్వారా నిర్ణయించేవారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర రెండవ ప్రకరణములో కాకతీయుల యుగము క్రీ.శ.1050 నుండి క్రీ.శ.1323 వరకు ఉన్నట్లు పేర్కొనిరి. ఈ ప్రకరణములో కాకతీయుల కాలమునాటి జీవన విధానమును కనులకు కట్టినట్లు చిత్రించిరి. కాకతీయుల పరిపాలనా కాలము నాటికి ఆంధ్ర ప్రాంతం అంతటా బౌద్ధమతం క్షీణించి జైనమత ప్రభావం ఎక్కువగా ఉండేది. జైనమత ప్రభావాన్ని వీరశైవులు అణిచివేశారు. కాకతీయుల పరిపాలనా కాలంలో మతసామరస్యము లేని కారణము వలన మతకలహాలు విరివిగా జరుగుతుండేవి. జైన, శైవ, వైష్ణవ మతాలు పరస్పరము పోరాడుకుంటుండేవి.

కాకతీయుల కాలంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన విషయము వారి వ్యాపార విధానము. ఆ కాలంలో ఇతర దేశాలతో వ్యాపార సంబంధాలు అభివృద్ధి చెందాయి. తూర్పు, పశ్చిమ ప్రాంతాల నుండి రేవుల ద్వారా రాజ్యములోనికి అనేక రకములైన వస్తువులు వచ్చేవి. రేవుల దగ్గర సుంకములు వసూలు చేసే పద్ధతి అమలులో ఉండేది. సుంకమలకు సంబంధించిన సమాచారం శాసనముల ద్వారా ప్రజలకు తెలియపరిచేవారు. ఓరుగల్లు కోటకు బయట భాగంలో 'మైలసంత' జరిగేది. ఆ సంతలో నువ్వులు, గోధుమలు, వడ్లు, జొన్నలు, బెల్లము, చింతపండు, నెయ్యి, మసాలా దినుసులు, రకరకాల కూరగాయలు అమ్ముతుండే వారిని "మార్కోపోలో" అనే యాత్రికుడు తన గ్రంథములో పేర్కొనిరి. కాకతీయుల కాలము నాటి సంస్కృతి సాంప్రదాయాలతో కూడిన జీవన విధానాన్ని రచయిత ఈ ప్రకరణములో తెలియజేసిరి.

ఆంధ్రుల సాంఘిక చరిత్రలోని మూడవ ప్రకరణం రెడ్డి రాజుల యుగానికి (క్రీ. శ.1324 నుండి 1434) సంబంధించినది. ఈ ప్రకరణములో రెడ్డి రాజుల పరిపాలనా కాలము నాటి ప్రజా జీవన విధానము, ఆచార వ్యవహారములు, పరిపాలన విధానం మున్నగు అనేక విషయాలను చర్చించిరి. రెడ్డి రాజుల పరిపాలనలో సామాన్య ప్రజలు అనుసరించిన మతము, వారి భక్తి విశ్వాసములు, వారు ఆరాధించిన దేవతలు, వ్యవసాయ పద్ధతులు, శివపూజ సమయంలో భక్తులు చేసే ఆత్మ బలిదానం, సామాన్యుల వేడుకలు, ఆటలు మొదలగు విశేషాలతో సాంఘిక జీవనం అతిరమ్యంగా వర్ణించిరి. శివశక్తి పేరుతో గోగులమ్మ, శ్రీ మండలి, నూకాంబ, ఘట్టాంబిక, మాణిక్య దేవి అనే శక్తులను, కామాక్షి, మహంకాళి తదితర దేవతలను పూజించే వారిని ప్రతాపరెడ్డి గారు పేర్కొనిరి. శివపూజల్లో ఆత్మబలిదానం ఇచ్చే వారిని వీరులుగా పరిగణించడం ఆనాటి ఆచారముగా ఉండేది.

రెడ్డి రాజుల కాలంలో వ్యవసాయ భూమిని మాగాణి, మెట్ట అని వ్యవహరించేవారు. వరి పండించే భూమిని మాగాణి అని, జొన్న, రాగి సాగు చేసే భూమిని మెట్ట అని పిలిచేవారు. ఆ కాలములో సామాన్యులు చదరంగము, పులి జూదము మొదలు ఆటలను ఆడేవారు. రెడ్డి రాజులు అత్యంత వీరశైవాభిమానులు. అందుచేత శైవ మతమునకు ప్రాధాన్యమిచ్చేవారు. రెడ్లు శైవులైనప్పటికీ పరమత సహనమును పాటించిరి. శైవ క్షేత్రములను ఎక్కువగా అభివృద్ధి చేసిరి. కానీ రెడ్డి రాజుల చివరి కాలంలో వైష్ణవ మతం తమిళ ప్రాంతం నుండి తెలుగులోనికి ప్రవేశించినదని రచయిత పేర్కొనిరి. రెడ్డి రాజుల పరిపాలన కాలంలో సముద్ర వ్యాపారం విరివిగా అభివృద్ధి చెందినట్లు తెలుస్తున్నది. ఈ కాలంలో కళాపోషణం బాగా జరిగినట్లు చారిత్రక ఆధారములు గలవు. ఈ ప్రకరణములో కవి సార్వభౌముడైన శ్రీనాథుడు రెడ్డి రాజుల కాలము వాడిని పేర్కొంటూ వారి కాలములో విద్యాధికారిగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ప్రకరణములో ముఖ్యముగా పేర్కొనవలసిన విషయం రెడ్లు, వెలమలు తెలుగువారు కాదని, ఉత్తరాది నుండి వచ్చిన రాష్ట్రకూటులు రెడ్లుగా పరిగణించబడేవారిని, అదే విధముగా తమిళ దేశం నుండి వచ్చిన వెల్లాలు అనేవారు తెలుగుదేశంలో వెలమలుగా ప్రసిద్ధి పొందారని శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు అభిప్రాయపడ్డారు.

మరియు వెలమలు సంఘసంస్కరణాభిలాషులని, రెడ్లు పూర్వాచార పరాయనులని, ఈ రెండు వర్గాల మధ్య ఎప్పుడు స్పర్ధలు ఉండేవని, శ్రీనాధుని కాలములో మాత్రం ఇద్దరూ సమానులుగా పరిగణించబడ్డారని ఇది చారిత్రక సత్యమని సురవరం పేర్కొనిరి.

ఈ గ్రంథంలోని నాలుగు ఐదు ప్రకరణములు విజయనగర సామ్రాజ్యానికి సంబంధించినవి ఈ ప్రకరణాలలో క్రీ.శ.1339 నుండి క్రీ.శ.1630 వరకు గడిచిన సాంఘిక చరిత్రను చక్కగా వివరించారు. విజయనగర సామ్రాజ్యం తుంగభద్రానది ఒడ్డున హరిహర బుక్కరాయలతో క్రీ.శ.1336లో స్థాపితమైనది. తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో అది అత్యంత విస్తరించి అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించి స్వర్ణయుగముగా ప్రసిద్ధిగాంచినది. విజయనగర సామ్రాజ్యమందు ఆంధ్రులదే పైచేయిగా ఉండేది. ఆంధ్రదేశము మహా వైభవముతోను, ఐశ్వర్యముతోనూ నిండి ఉండేది. ఆంధ్రులు ఉత్సాహవంతులై కళా పోషకులై దేశాంతరములందును ప్రఖ్యాతిగాంచిరి. సాహిత్య రంగంలో శ్రీకృష్ణదేవరాయల యుగము ప్రబంధ యుగముగా ప్రసిద్ధిగాంచెను. అష్టదిగ్గజములు అనే కవులు వీరికాలములో ప్రసిద్ధిగాంచిరి. ఈ కాలములో సుందర నిర్మాణములు, చిత్రలేఖనములు, శిల్ప సంపద దేశమంతటా విరివిగా పెంపొందెను. ధనికుల భోగళాలసత విజయనగర సామ్రాజ్యము కాలనాటి ప్రజా జీవన విధానము ఈ గ్రంథంలో అద్దం పడుతుంది.

విజయనగర సామ్రాజ్యం తూర్పున కటకము నుండి రామేశ్వరం వరకును, పడమట గోవా నుండి కన్యాకుమారి వరకును వ్యాపించి ఉండెను. అందువలన తూర్పున బర్మా, మలేషియా, ఇండోనేషియా, చైనా దేశాలలో వ్యాపారం జరిగిందని తెలుస్తుంది. పడమట గోవాలో, కాలికట్ రేవులో ఎక్కువ వ్యాపారం జరిగెను. వ్యాపార విశేషాలను వివరిస్తూ విజయనగర సామ్రాజ్యము నుండి బట్టలు, బియ్యం, ఇనుము, చక్కెర, సుగంధ ద్రవ్యాలు ఎగుమతి అయ్యెను. ఈ కాలములో మిరియాలకు చాలా గిరాకీ ఉండేదనియు, మలయాళదేశముందు మిరియాలు సమృద్ధిగా పండుట వలన వ్యాపారులు వాటిని అక్కడి నుండి తెప్పించి తెలుగుదేశంలో అమ్మేవారిని ప్రతాపరెడ్డి గారు అభిప్రాయపడిరి. విజయనగర పరిపాలనా కాలములో పరిశ్రమలు గూర్చి తెలుపుతూ తెలుగుదేశం ప్రాచీనము నుండి వజ్రాల గనులకు ప్రసిద్ధి చెందినదని, వజ్రకరూరు వజ్రాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతమని ఇటువంటివి రాయలసీమ ప్రాంతంలో చాలా ఉండేవని చారిత్రక ఆధారాలతో నిరూపించారు శ్రీ ప్రతాపరెడ్డి గారు. విజయనగర కాలమనాటి ప్రజల వేషధారణ గురించి తెలుపుతూ ఎరుక పాలెగాడు, వేటవేషం, కోమటి శెట్టివేషం, దాసరిసాని, కరణము, తురక జవాను, పురోహితుడు, ఎరుకలి, రాజు, భటుడు, బ్రాహ్మణస్త్రీ, రెడ్డి స్త్రీ మొదలైన పాత్రల వేషధారణ విశేషాలను సవివరంగా చిత్రించిరి. విజయనగర సామ్రాజ్య కాలములో పంచాయతీ సభలు ప్రతి గ్రామమందు స్థిరముగా ఉన్నట్లు తెలియుచున్నది. కుల వివాదాలు సంఘసంస్కారపు కట్టుబాట్లు, నేరముల విచారణ, పన్నుల వసూళ్లు గ్రామ ముఖ్యులే చేయుచుండిరి.

ఈ గ్రంథమునందు ఆరవ ప్రకరణములో క్రీ.శ.1600 నుండి క్రీ.శ.1750 వరకు జరిగిన సాంఘిక చరిత్రను చర్చించిరి. విజయనగర సామ్రాజ్య పతనము ఆంధ్రుల పతనానికి దారి తీసిందని ప్రతాపరెడ్డి అభిప్రాయము. హిందువుల పతనము, ముస్లింల విజృంభన జరిగినట్లు చారిత్రక ఆధారాలతో నిరూపితమైనది. క్రీ.శ.1565లో రాక్షస తంగడి యుద్ధం జరిగింది. ఆ యుద్ధము తరువాత ఆంధ్రదేశంలో రాజకీయ దౌర్బల్యం మొదలైనది. కొంతకాలము పెనుగొండలో ఆంధ్ర రాజుల పాలన సాగింది. అక్కడి నుండి చంద్రగిరికి మారినది. ఒకవైపు తురకల దుష్పరిపాలనతో పాటు మరోపక్క పిండారీలు, దోపిడీ గాండ్లు ఎక్కువై జనులను హింసించి, చంపి, దోచుకుని నానా ఘోరాలు చేసి ఆంధ్రులను భయభ్రాంతులకు గురిచేసిరి. క్రీ.శ.1700 తర్వాత తెలుగు వారి పతనం పూర్తి దశకు చేరుకొనెను.

ఈ గ్రంథము ఏడవ ప్రకరణములో క్రీ.శ. 1757 నుండి క్రీ.శ.1857 వరకు జరిగిన సాంఘిక చరిత్రను సమీక్షించిరి. మహమ్మద్ ఖిల్జీ ప్రారంభించిన తురకరాజ్య విజయ పరంపర క్రీ.శ.1757 ప్లాసీ యుద్ధముతో పరాజయం పొందింది. ఇంగ్లీష్

వారు భారత గడ్డమీద ప్రత్యక్షమైనారు. ప్లాసీయుద్ధం తర్వాత దేశం ఇంగ్లీషు వారి చేతిలోకి అతి వేగంగా మారిపోయినది. సుమారు వంద సంవత్సరములలోనే మొత్తం భారతదేశాన్ని ఇంగ్లీష్ వారు ఆక్రమించుకొనిరి. కానీ ఇంగ్లీషువారు వ్యాపారం ద్వారా, పన్నుల ద్వారా, దోపిడీల ద్వారా గ్రహించినదంతయు తిరిగి రాకుండా ఇంగ్లాండ్ చేరవేసేవారు. ఇది మన ఆర్థిక వ్యవస్థ పతనానికి దారితీసెను. ఉత్తర సర్కారులను, రాయలసీమ, గుంటూరు జిల్లాలను క్రీ.శ. 1800 లోపలనే ఇంగ్లీషు వారి ఆధీనములోనికి వెళ్ళిపోయెను. క్రీ.శ. 1857 సిపాయిల తిరుగుబాటు నాటికి తెలుగుదేశం అంతా ఇంగ్లీషు వారి వశమయ్యెను. ఇంగ్లీషు ప్రభుత్వ ప్రభావము దేశ ఆర్థిక వ్యవస్థ పైనే కాక దేశ జనుల ఆచార వ్యవహారములపై కూడా ఎక్కువైనది. దేశములో ఇస్లాం మత వ్యాప్తి ఆగిపోయి క్రైస్తవ మత వ్యాప్తి చెందుచుండెను. అనేక విధములైన సేవలు ద్వారా మిషనరీలు జనులను క్రైస్తవ మతంలోనికి ఆకర్షించుచుండెను. అంటరాని జాతుల వారు తమ కులాలను విడిచి క్రైస్తవ మతంలోనికి చేరిపోయిరి. హిందూమతము పై విశ్వాసమును, భక్తిని, ఆదరమును పోగొట్టే ప్రయత్నాలు విరివిగా సాగినవి. ఈ పరిస్థితుల్లో ఆర్య సమాజం, బ్రహ్మ సమాజము స్థాపన జరిగి సంఘసంస్కార ప్రయత్నాలు మొదలైనవి.

ఈ సమయంలోనే క్రీ.శ. 1885లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన జరిగెను. ఈ సంస్థ ద్వారా దేశంలో అనేక ఉద్యమములు లేవదీయబడును. మహాత్మాగాంధీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం జరిగి బ్రిటీష్ వారిని ఒక కుదుపు కుదిపినది. అతివాదులు, మితవాదులు, విప్లవకారులు అందరూ బ్రిటిష్ వారిని ఎదిరించిరి.

ఇంగ్లీషు పరిపాలన ఆర్థికంగా దేశానికి గొప్ప నష్టము కలుగజేసెను. దేశంలోని పరిశ్రమలు నశించెను. తరచుగా క్షామములు వచ్చి అపార జననష్టము జరిగేను. సామాన్య జనుల ఆచార వ్యవహారాలలోనూ, మత విశ్వాసాలలోనూ అనేక మార్పులు చోటు చేసుకొనెను. తంతి తపాలా, రైల్వే వ్యవస్థ, ముద్రణ యంత్రములు విరివిగా వాడి దినపత్రికల ప్రకటన ప్రచారం ఎక్కువగా ఉండెను. ఇంగ్లీష్ వారి ప్రభావం తెలుగు భాష పై చాలాపడెను. ఇంగ్లీష్ చదివిన విద్వాంసులు కందుకూరి వీరేశలింగం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కట్టమంచి రామలింగారెడ్డి, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు పలు రకాల సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసి తెలుగువారిలో చైతన్యం కలిగించిరి.

సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనే ఈ గ్రంథంలో దాదాపు 1000 సంవత్సరముల తెలుగుజాతి ఏ విధముగా బ్రతికినదో కళ్ళకు కట్టినట్లు చిత్రించబడినది. ఈ చరిత్ర ఒక జీవితకాలపు పరిశోధనా ఫలము అనుటలో అతిశయోక్తి లేదు.

**ఆధార గ్రంథములు**

1. ప్రతాపరెడ్డి సురవరం, ఆంధ్రుల సాంఘిక చరిత్ర (1996), ఓరియంటల్ లాంగ్వేజ్, హైదరాబాద్.
2. రమణ కె. ఎస్. (2009), సంక్షిప్త జీవిత పరిచయం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. ద్వా.నా. శాస్త్రి(1997), శత జయంతి సాహితీమూర్తులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
4. ఆరుద్ర(2002) సమగ్ర ఆంధ్ర సాహిత్యము(మొదటి సంపుటం), తెలుగు అకాడమీ, హైదరాబాద్.
5. ప్రొ. సత్యనారాయణ రావినూతల (2014) కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన తెలుగు పుస్తకాలు వ్యాసం.

# ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సమీక్ష

**గొంగులూరి కృష్ణవేణి,** పరిశోధక విద్యార్థిని, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు

**పరిచయం**

ప్రథమాంధ్ర సాంఘిక చరిత్ర నిర్మాతగా, చరిత్ర లోతులను ముట్టిన పరిశోధకాగ్రణిగా, సృజనాత్మకశీలియైన రచయితగా, నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించిన పోరాటయోధుడుగా, తెలంగాణా సాహిత్య సాంస్కృతిక చైతన్య వైతాళికుడుగా యావదాంధ్ర దేశంలో చిరయశస్సు గడించిన మహాపురుషుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి. ఇతను మే 28, 1896న మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇటిక్యాలపాడు గ్రామం లో రంగమ్మ, నారాయణ రెడ్డి దంపతులకు జన్మించారు. ఆగస్టు 25, 1953లో మరణించారు. పత్రికా సంపాదకుడుగా, పరిశోధకుడుగా, పండితుడుగా, రచయితగా, ప్రేరకుడుగా, క్రియాశీల ఉద్యమకారుడుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. స్థానిక చరిత్రల గురించి, స్థానిక ప్రజల కడగండ్ల గురించి అతను పడిన నిరంతర తపనకు ప్రతి అక్షరం ప్రత్యక్ష సాక్ష్యం.

**ప్రతాపరెడ్డి గారి రచనలు**

తెలంగాణలో కవులే లేరనే నిందావ్యాఖ్యలను సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన “గోల్కొండ కవుల సంచిక” గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి ఒక అధ్యాయం. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి సంపాదకుడిగా, పత్రికా రచయితగా ప్రసిద్ధి చెందాడు. “ఆంధ్రుల సాంఘిక చరిత్ర”, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, గ్రంథాలయోద్యమము ఇతని ఇతర ముఖ్య రచనలు. నైజాం నిరంకుశ పాలనలో, తెలుగు వారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషిచేశాడు. జీవితం చివరి దశలో రాజకీయాలలో కూడా ప్రవేశించి వనపర్తి శాసనసభ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యాడు.

తెలుగుజాతికి ఇతను చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం కూడా స్థానం పొందింది.

1955లోనే ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకు గాను “కేంద్ర సాహిత్య అకాడమి” అవార్డు లభించింది. ఆంధ్ర ప్రజల ఆచార వ్యవహారాలు, ఆహార విహారాలు, ఆటపాటలు మొదలైన వాటికి చోటు ఇచ్చింది. వివేచనాత్మకమైన పరిశోధనా సాహిత్యం సురవరం వారికి అఖండ ఖ్యాతిని ఆర్జించింది. ‘ఆంధ్రుల సాంఘిక చరిత్ర’ ఆయన పరిశోధనా శేముషికి నిలువెత్తు నిదర్శనం. ‘ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీలెవ్వరు?’ అంటూ రాజవంశాల ప్రశంసలకే పరిమితమైన దేశచరిత్రను సామాన్య జనజీవితం వైపు మరల్చి ప్రప్రథమంగా తెలుగువారి సాంఘిక చరిత్రను అందించారు. అందుచేతనే భారత ప్రభుత్వం

తెలుగు సాహిత్యానికి ఒసగిన బహుమతుల్లో తొలి తాంబూలం అందుకొన్నది ఈ గ్రంథం. ఆచార వ్యవహారాలు, మత సంప్రదాయాలను శాస్త్రీయ దృక్పథంతో, హేతువాదంతో పరిశీలించి వాటి నిగ్గుతేల్చిన పరిశోధక జిజ్ఞాసువు ప్రతాపరెడ్డి.

**ఆంధ్రుల సాంఘిక చరిత్ర**

చిలుకూరి వీరభద్రరావు కూడా సాంఘిక చరిత్ర రచనా ప్రయత్నం చేశారు కానీ అది పూర్తికాలేదు. సాంఘిక చరిత్రను రాసిన వారు మాత్రం ప్రతాపరెడ్డి. ఈ రకమయిన చరిత్రను రాయడంలో తన దృష్టి ఏమిటో ప్రతాపరెడ్డి ఇలా వివరించారు. "రాజుల చరిత్రలు మనకంతగా సంబంధించినవి కావు. సాంఘిక చరిత్రలు మనకు పూర్తిగా సంబంధించినట్టివి. అవి మన పూర్వుల చరిత్రను మనకు తెలుపును. మన తాత, ముత్తాత లెట్టివారై యుండిరో, మన అవ్వలు ఎట్టి సొమ్ములు దాల్చిరో, యెట్టి అలంకరణములతో నుండిరో, మన పూర్వులే దేవతలను గొలిచిరో, ఏ విశ్వాసాలు కలిగియుండిరో, ఏ యాటపాటలతో వినోదించిరో, దొంగలు, దొరలు, దోపిడీలు చేసినప్పుడు క్షామాదీతిబాధలు కలిగినప్పుడెటుల రక్షణము చేసుకొనిరో, జాడ్యాలకే చికిత్సలు పొందిరో, ఎట్టి కళలందు ప్రీతి కలవారై యుండిరో..." (ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ప్రథమ ముద్రణ పీఠిక (1992) తెలుసుకోవాలని మనకు కుతూహలం ఉంటుందని, 'మనము కూడా చరిత్రకెక్కదగిన వారమే'నని ఆయన చెప్పారు.

పునర్వికాసోద్యమ ప్రారంభ దశలో సామ్రాజ్య చరిత్రల్లో అన్వేషించిన అస్తిత్వాన్ని, తరువాతి దశలో సాంఘిక చరిత్రలో వెదుక్కోవడం ఇక్కడ కనిపిస్తుంది. సాంఘిక చరిత్ర రచనను ప్రతాపరెడ్డి 1920లలోనే ప్రారంభించారు. సుజాత 1929 మే సంచికలో ఆయన 'తెనాలి రామకృష్ణుని కాలమందలి ఆంధ్రుల సాంఘిక జీవనము' అన్న వ్యాసం రాశారు. తర్వాత అప్పుడప్పుడు కాకతీయుల కాలంలోని సాంఘిక చరిత్ర, కృష్ణరాయల కాలపు సాంఘిక చరిత్ర, కదిరీపతి కాలపు సాంఘిక చరిత్ర, రెడ్డియుగపు సాంఘిక చరిత్ర, ఆంధ్ర దశకుమార చరిత్రము తెలుపు తెనుగువారి సాంఘిక చరిత్ర మొదలగు వ్యాసాలు రాశారు. వాటన్నిటికీ ఇచ్చిన గ్రంథ రూపమే ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

"సాంఘిక చరిత్ర మానవ చరిత్ర - ప్రజల చరిత్ర, అది మన సొంత కథ !! అది జనుల జీవనమును ప్రతి శతాబ్దమందెట్లుండెనో తెలుపునట్టిది. అది మన తాతముత్తాతల చరిత్ర! వారి యిండ్లు, వారి కట్టు, వారి తిండి, వారి ఆటలు, వారి పాటలు, వారు పడిన పాట్లు, వారు మనకిచ్చిపోయిన మంచి చెడ్డలు, ఇవన్నీ తెలిపి మనకు సహాయపడును" (పుట.7) అని సాంఘిక చరిత్ర మీద ప్రాథమిక అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఎంతసేపూ రాజులు, రాజ్యాలు, నవాబులు వారి చరిత్రలేనా? మనవి, మన సామాన్య ప్రజానీకాన్ని, జనజీవన విధానాలను వారి అభీష్టాలకి ప్రాధాన్యత ను ఇచ్చిన గ్రంథాలు అరుదు. ఇటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వ్రాయబడినదే మన ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

రాజుల రాజ్యాల చరిత్ర రాయడం అంత కష్టము కాదు. కాని, సాంఘిక చరిత్ర రాయడం కష్టం. దీనికి ఆధారములు తక్కువ. తెలుగు సారస్వతం, శాసనాలు, స్థానిక చరిత్రలు (కైఫీయతులు), విదేశీ రచయితల చూచి రాతలు, శిల్పాలు, చిత్తరువులు, నాణెములు, సామెతలు, ఇతర వాఙ్మయాలలోని సూచనలు, దానపత్రాలు, సుద్దులు, జంగమకథలు, పాటలు, చాటువులు, పురావస్తు సంచయాలు (Collections) మొదలయినవి సాంఘిక చరిత్రకు ఉపయోగపడే సాధనాలుగా, ఆధారాలుగా పేర్కొనవచ్చు.

"కావ్య ప్రబంధాలలో నూటికి 90 పాళ్ళు సాంఘిక చరిత్రకు పనికివచ్చునవి కావు. పురాణాలు, మధ్యకాలపు ప్రబంధాలు ఇందుకు పనికిరావు. ఎందరో మహాకవులు వసు మను చరిత్రల వంటివి వ్రాసినవారు మనకు సాయపడరు.

"కేళీ నట ద్గేహ కేకి కేకారవో ! న్మేషంబు చెవుల దేనియలు చిలుక" (కవికర్ణ రసాయనము) వంటి వర్ణనలు మనకు సహాయపడవు.

"గొంగడి ముసుగుతో గొల్లలు చట్రాతి–పైన బందారాకు బరిచికొనగ" (శుక సప్తతి)

అన్న వర్షర్తు వర్ణన మనకు చాలా పనికివచ్చును.

"తతనితంబాభోగ ధవశాంశుకములోని యంగదట్టపు కావిరంగు వలన" (మను చరిత్ర) అంటే మనకు సరిగా అర్ధమే కాదు.

"చలువ దువ్వలువ కుచ్చెలయంచు ముత్తెముల్ వదనఖప్రభకు సలాము చేయు" (శుకసప్తతి) అని యంటే ఆ స్త్రీ కన్నుల యెదుట నిలిచి పూర్వకాలమందు మన యువతా విలాసమిట్లుండెనని తెలుపును.

ఒక్కొక్క మారు కొన్ని పుస్తకాలు పూర్తిగా చదివిన మనకు పనికివచ్చు మాటలు రెండో మూడో దొరుకును అంతే". (పుట 11) అని ప్రతాపరెడ్డి కావ్య ప్రబంధాలపై అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్రలో రచయిత ప్రధానంగా 8 ప్రకరణాలుగా విభజించుకొని ఆయా కాలాల వారిగా విపులంగా చర్చించారు.

తూర్పు చాళుక్య యుగము

కాకతీయుల యుగము

రెడ్డిరాజుల కాలము

విజయనగర సామ్రాజ్యకాలము (క్రీ.శ. 1339 నుండి 1530 వరకు)

విజయనగర సామ్రాజ్యకాలము (క్రీ. శ. 1530 నుండి 1630 వరకు)

క్రీ.శ. 1600 నుండి 1757 వరకు

క్రీ.శ. 1757 నుండి 1857 వరకు

క్రీ.శ. 1857 నుండి 1907 వరకు

"మన తెలుగులో సాంఘిక చరిత్రలు లేవు. వాటిని వ్రాయవలెనని పలువురు సంకల్పించినట్లున్నది. చిలుకూరు వీరభద్రరావు ఆంధ్రుల చరిత్రము రెండవ భాగములో వెలమ వీరుల చరిత్ర ప్రకరణాదిలో (పు.271) పుట అడుగున నిట్లు వ్రాసెను.

"ఆంధ్రుల సాంఘిక చరిత్రము ప్రత్యేకముగా విరచింపబడుచున్నది. కావున నీ విషయమై (వెలమాదిజాతుల విషయమై) యిందు సవిస్తరముగా జర్చింపబడును." (పుట. 9)

మొదటి ప్రకరణంలో తూర్పు చాళుక్య యుగంలో రాజరాజ నరేంద్రుని కాలంలో ఉన్న మతం, ఆచార వ్యవహారాలు, వస్త్రాలంకరణ, రంగులలో రకాలు, యుద్ధతంత్ర వ్యవహారాలు మొదలైన అంశాలన్నింటినీ పేర్కొన్నారు.

**ఉదా:** 1). రంగులలో వివిధ రకాల రంగుల బట్టలను పేర్కొన్నారు.

మంజిష్ఠ, లక్క కౌసుంభ (రంగుపూలు), సింధూర, హరిద్ర, నీలి మున్నగు రంగులందు ముఖ్యమైనవి.

2). వివిధ ప్రాంతాల నుండి తయారుచేసిన వస్త్రాలను తెప్పించేవారు.

**ఉదా :** "పోహలపురము, చీరపల్లి, అవంతి, నాగపట్టణము, పాండ్యదేశము, అల్లికకరము, సింహళము, గోపాకము, సురాపురము (ఉత్తర సర్కారులలోని సురాపురము అనునది.) గుంజణము, మూలస్థానము (ముల్తాన్) తోండిదేశము (తుండిరము–మద్రాసుకు దక్షిణ ప్రాంతము), పంచపట్టణము, మహాచీనము (చైనా), కళింగము, వంగము ఈ ప్రాంతాలనుండి వస్త్రములు తెప్పించెడివారు". (పుట. 30)

నన్నయ కన్న పూర్వం తెనుగు దేశములోని మనకు తెలిసిన ఆ కొద్దిపాటి విషయాలు తెలియని వాటితో సమానమే. నన్నయ కాలంలోని పరిస్థితులు కూడా మనకు సరిగా తెలియవు. మనకు కొంతవరకు తెలిసిన భాగము కాకతీయుల కాలమే.

కాకతీయుల కాలంలో మతం ప్రధాన అంశంగా కనిపిస్తుంది. ప్రారంభంలో బౌద్ధమతం నామమాత్రంగానే ఉంది. జైనమతం ప్రబలంగా ఉంది. తర్వాతి కాలంలో బసవేశ్వరుని నాయకత్వంలో వీరశైవం రాజ్యమేలింది. కాకతీయుల కాలంలో

కేవలం జైన, బౌద్ధ, వీరశైవం సాంప్రదాయుల వారే కాకుండా "అద్వైతవాదులు, బ్రహ్మావాదులు, పాంచరాత్రవ్రతులు, ఏకాత్మవాదులు, అభేదవాదులు, శూన్యవాదులు, కులవాదులు, కర్మవాదులు, నాస్తికులు, చార్వాకులు, ప్రకృతి వాదులు, శబ్ద బ్రహ్మపరులు, పురుష్యత్రయైె వాదులు, లోకాయుతులు" (పుట.37) మొదలైన మతాలవారున్నరు.

కాకతీయుల కాలంలో ప్రధానంగా పూజించిన దేవతామూర్తులను పరిశీలిస్తే వీరగుడ్డములు, మాచెర్లచెన్నడు, భైరవుడు, ఏకవీర, మైలారుదేవుడు – చమడేశ్వరి, వీరభద్రుడు వంటి ఆకాలంనాటి దేవతామూర్తులను పేర్కొన్నాడు. యుద్ధ తంత్రాలు, కళలు, సంఘసంస్కరనము, విద్యావ్యాపకము, చిత్రలేఖనం, చేతిపనులు, వ్యాపారము, ప్రజలు వినోదము, పాచికలలాట, పచ్చీసు, స్త్రీల అలంకారానికి సంబంధించిన అంశాలన్నింటినీ ఈ యుగంలో పేర్కొన్నాడు.

**ఉదా :** "పూర్వము తెనుగు స్త్రీల కేమి సౌందర్య మనిపించెనో యేమో! ముంగర, ముక్కర, నెత్తిబిళ్ళలు, దండకడెములు, వంకీలు మున్నగునవి యెక్కువగా ధరిస్తూ వుండిరి. జోమాలదండను వేసుకొనుచుండిరి. ఇప్పుడు స్త్రీలు (యువకులుకూడా) మైపూతలకై చాలా వ్యయము చేస్తున్నారు. స్నో, పౌడర్, నూనెలు, గోరురంగులు, వాటి యంగాంగములగు అద్దము, దువ్వెన, బ్రష్టు, మొదలయినవి వాడుదురు. ఆ కాలపు స్త్రీలకు పసుపే ప్రధానము. అది మెరుగు నిచ్చి వెంట్రుకలను పోగొట్టి క్రిమిసంహారియై పని యిచ్చెడిది. ఆనాటి స్త్రీలు గోళ్ళకు గోరంట ఆకు దంచి కట్టి రంగు వేసుకొనుచుండిరి. "వారు పెదవులకు యావకరసాన్ని (లక్క రంగును) పూసుకొనుచుండిరి". (పుట.69) కాళ్ళకు కూడా లక్కరంగే పూసుకునే వారని, పారాణి కూడా పూసుకునేవారని, కళ్ళకి కాటుకను పెట్టుకునే వారని ఇతరిత్ర అంశాలన్నిటినీ ఇతర కవుల రచనల ఆధారంగా పేర్కొన్నారు.

నేడు మనం మూఢనమ్మకంగా పేర్కొంటున్న తాయెత్తుల ప్రస్తావన కూడా (పుట.70) ఉంది. అయితే ఇది చేతులకి మాత్రమే కాకుండా, మొలతాడుకి, మెడలో కూడా కట్టుకునేవారని పేర్కొన్నారు. తాయెత్తు అనే శబ్దంపై అప్పకవి చేసిన వ్యాఖ్యానాన్ని ఇక్కడ కవి చర్చించారు.

తాయి (తల్లి), ఎతు (రక్ష) తల్లి శిశువుకు కట్టే రక్షగా పేర్కొన్నాడు. అయితే తల్లులు పిల్లలకి మాత్రమే కట్టారా? తమకే అవసరమైన తమ తల్లులచేతనో, కృతకమాతల చేతనో కట్టించుకొన్నారా? వృద్ధులు, యువకులు తమంతకు తామే మాంత్రికులతో రక్షలు ఇప్పించుకుని తాయెత్తు నీ కట్టుకొన్నరా? అనే సందేహాలను వెలిబుచ్చారు. "ఇది తావీజ్ అను అరబ్బీ పదమై యుండును. ఖురాన్ మంత్రాలను వ్రాసి రక్షగా తురకలు కట్టుకొందురు. దానినే మనవారు స్వీకరించినట్లున్నది". (పుట.71) అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రెడ్డి రాజుల యుగంలో రాజులు ఏమతం అయితే అవలంబిస్తారో బహుళ సంఖ్యాక ప్రజలు కూడా అదేమతం అవలంబిస్తారు. రెడ్డి రాజులు కూడా వీరశైవాన్ని ఆచరించేవారు. శైవక్షేత్రాలను ఉద్ధరించడం, శివుణ్ణి స్తుతించడం, శ్రీశైలానికి మెట్లు కట్టించారు. శైవశక్తి పేరుతో ప్రజలు అనేక దేవతలను కొలిచారు. గోగులమ్మ, శ్రీమండతల్లి, సూకాంబ, ఘట్టాంబిక మాణీకాదేవి వంటి దేవతలను ఆరాధించారని తెలుస్తుంది.

రెడ్డిరాజుల కాలంలో వ్యవసాయము విరివిగా సాగింది. పల్లవులు, కాకతీయుల దేశంలోని అడవులను కొట్టించి, గ్రామాలను ప్రతిష్ఠించి, వ్యవసాయాలకు భూములను ఇచ్చారు. దీనిని బట్టి క్రీస్తుశకం 1000 కి పూర్వము కర్నూలు, బళ్ళారి మొదలైన మండలాలు అరణ్యప్రాంతాలుగా ఉండేవని తెలుస్తుంది.

"ఆ కాలములో భూములను కొలుచుటకు "గడి" యనునొక నిర్ణయనుగు పొడవు దానిని కేసరిపాగడ యనిరి. భూములను కొలుచుటకు గాను కట్టెను వినియోగిస్తుండిరి. శాస్త్ర గ్రంథాలు వ్రాసిరి. నన్నయభట్టు సమకాలికుడగు మల్లన అనునతడు గణితశాస్త్రమును వ్రాసెను. అదింతవరకు ముద్రితము కాలేదు. దానిలో ఆకాలపు వ్యవసాయ స్థితిగతులు కొలతలు మున్నగునవి కలవందురు. సంస్కృత, గణితశాస్త్రములను తెనుగులోనికి పరువులు అనువదించిరి. క్షేత్ర గణితము అను పేరుతో పొలముల నక్షాలతో సహా తాటాకులపై పెద్దపెద్ద గ్రంథాలు వ్రాసియుంచిరి. కాకతీయుల కాలమందలి క్షేత్రగణితము నుండి మల్లంపల్లి సోమశేఖర శర్మ విపులముగా నుదాహరించినారు. దాని ప్రకారము,

**అంగుష్ఠపు వలయార్ధం**
**బంగుళమగు, మూడుపొడవు యవలెన్నంగా**
**సంగుళమగు, మరియును, మ**
**ధ్యాంగుళ మధ్యప్రదేశ మంగుళ మయ్యెన్.**

అట్టి 12 అంగుళములు = ఒక జేన,

32 జేనలు–ఒకగడ (కొలతకట్టె).

ఆ కాలమందు తూమెడుపొలము, పుట్టెడు పొలము అంటూ వుండిరి. నిన్న మొన్నటివరకు రాయలసీమలో ఇవే మాటలంటూ వుండిరి. అనగా తూమెడు విత్తనములు పట్టెడు భూమియని యర్ధము". (పుట. 93)

ఇప్పటి కాలంలో ఉన్నట్టు రెడ్డి రాజుల కాలం నాటికే కౌలు పద్ధతి, వచ్చిన పంటలో రాజులకి సగంపాలు, చేసినవారికి సగంపాలు అనే విధానం ఉండేదని తెలుస్తోంది. భూములను పట్టాకిచ్చు పద్ధతి ఆనాడు లేదు. భూమి మొత్తం రాజుదే అనే సిద్ధాంతం అంగీకరించబడి ఉండేది. భూమిని ఏటేటకో లేక నియమిత కాలానికో గ్రామ ప్రజలకు ఇచ్చేవారు. రైతులు తమ దగ్గర ఉన్న పశువుల లెక్క ప్రకారము కాండ్ల లెక్కతో కలిసి కృషిచేసి సమిష్టిలోనే సేద్యపు వ్యవసాయమును తీసివేసి అనగా "పన్నిద్ధరాయగాండ్రకు ధాన్యరూపముగా వారి కియ్యవలసిన దిచ్చివేసి ప్రభుత్వమునకు ఇయ్యవలసిన షడ్భాగపు పన్నును తీసి యుంచి మిగతాది కాడీల ప్రకారము పంచుకొనుచుండిరి. ఈ విధమగు సమిష్టి సేద్యములో రాజులు బ్రాహ్మణుల కిచ్చిన ఇనాములు అగ్రహారములు చేరియుండలేదు. సమిష్టి సేద్యపు భూమినుండి మొదలు (అగ్ర) బ్రాహ్మణుల ఇనాముల తొలగించి (హారము) భూమిని సాగుకు తీసుకొనుచుండిరి". (పుట. 93)

హరిహరరాయల కాలంలో పన్నులను నాణేల రూపంలో చెల్లించాలని ఆజ్ఞ ఇచ్చారు. అంతకు ముందు ప్రజలు పన్నును ధాన్యరూపంగ చెల్లించారు. నాణేలన్నింటిపైన వరాహ రూపమైన రాజముద్ర ఉండేది అని ఖచ్చితంగా చెప్పలేము. ఎందుకంటే రాజులు తమకు అనుకూలంగా విజయనగర నాణెములపై హనుమంతుడు, గరుడుడు, ఎద్దు, ఏనుగు, ఉమామహేశ్వరుడు, బాలకృష్ణుడు, దుర్గ, లక్ష్మీ నారాయణులు, రాముడు, శంఖుచక్రాలు వంటివి ముద్రించారు. "నాణెములను గుంజల లెక్క ప్రకారము ముద్రించిరి.

ఈ క్రింది నాణెములు ముఖ్యమైనట్టివి.

**బంగారువి :** గద్యాణము (వరహాలు), ప్రతాపలు (వీటినే మాడలు అనిరి.), పణము, కట, హాగ

**వెండివి :** తారము, చిన్నము.

**రాగివి :** పణము, జీతల్, కాసు మున్నగునవి.

రెండవ దేవరాయల నాణెములను గురించి అబ్దుర్రజాఖ్ అను ఈరానీ రాయబారి క్రీ.శ. 1443లో ఈ విధముగా వ్రాసెను.

నాలుగు కాటీలు ఒక వరహా,

వరహాలో సగము ప్రతాపము.

ప్రతాపములో పదవ భాగము పణము.

పణములో ఆరవభాగము తారము.

తారములో మూడవ భాగము నాణెములు. "సాధారణముగా వరహా 52 గుంజల ఎత్తుండెను." (పుట. 166)

విజయ నగరరాజుల కాలంలో వేషధారణ ఒక్కొక్కరికి ఒక్కొక్కవిధంగా ఉండేదని, కరణము, వైద్యుడు, వైష్ణవ భాగవతులు, ఇండ్లు కట్టేవారు, మాలదాసరి, భోగసానులు, వృద్ధ వేశ్య, దాసి, బ్రాహ్మణులు, సామాన్య ప్రజానీకం, వేటగాని వేషం, కోమతిసెట్టి

వేషం, భటుల పెద్ద, భటులు, కరణము, మాడిగజోగురాలు, తురక జవాను, పురోహితుడు, రెడ్డి, రెడ్డి స్త్రీ, ఎరుకలి, ఏవిధంగా ఉండేదో విపులంగా వర్ణించారు. జనుల పెళ్ళివేడుకలు, సంపన్నుల పెళ్ళివేడుకలు, పెళ్ళిలో పెట్టే భోజనాలు వంటి అనేక అంశాలను పేర్కొన్నారు.

**ముగింపు**

ఈ విధంగా కవి నన్నయ యుగం నుండి గోలకొండ ప్రభువుల వరకు గల ఆంధ్రుల 900 సంవత్సరాల సాంఘిక చరిత్ర సంగ్రహముగానే తెలుపబడినది. రాయదగిన విషయాలు ఇంకా ఉన్నాయి. అందుకు తగిన పండితులు కృషిచేసి మన సాంఘిక చరిత్రలు వ్రాసిన మనలో సాంఘిక చరిత్రలు లేని లోపం తొలగిపోతుంది. అయినప్పటికీ ఈ గ్రంథం ద్వారా కవి మనకు తెలియని ఎన్నో సాంఘిక, ఆర్థిక అంశాలను మనకు అందించారు. ఒక గ్రంథానికి మొట్టమొదటగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అనేది చిన్న విషయం కాదు. అసలు అవార్డు వచ్చిందంటేనే ఈ గ్రంథం యొక్క గొప్పతనం గురించి అవగతమవుతోంది.

**ఆధార గ్రంథాలు**

1. శ్రీనివాస్, కే. తెలంగాణ సాహిత్య వికాసం : 2015, తెలంగాణ ప్రచురణలు; హైదరాబాద్
2. రామారావు, ఎస్వీ. సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర: 2017, పసిడి ప్రచురణలు; హైదరాబాద్
3. ప్రతాపరెడ్డి, సురవరం. సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు: 2015, ఆంధ్ర సారస్వత పరిషత్తు; హైదరాబాద్

# నాట్యశాస్త్రము (గుప్త భావ ప్రకాశికా సహితము) అనువాదము - పరిశీలన

ప్రొ. వి.యస్. మంగాదేవి, తెలుగుశాఖాధ్యక్షులు, మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ

**"ఋగ్య జుస్సామ వేదే భ్యో వేదాచ్చా ధర్వణక్రమాత్**
**పాఠ్యం చాభినయం గీతం రసాన్ సంగృహ్య పద్మజః**
**వ్యరీరచ చ్ఛాస్త్ర మిదం ధర్మ కామార్థ మోక్షదం॥"**

సృష్టికర్తయైన బ్రహ్మ చతుర్ముఖుడు, దేవతల ప్రార్ధనకు అంగీకరించి చతుర్విధ పురుషార్ధదాయి అగు పంచమ వేదమైన నాట్య వేదమును రచించి, ప్రయోగార్థము భరతమునికి ఇచ్చెనని ప్రాచీనుల విశ్వాసము. ఈ నాట్యశాస్త్రము క్రీ.పూ. 4వ శతాబ్దికి చెందినదని విమర్శకుల అభిప్రాయము. భరతముని ప్రణీతమైన నాట్యశాస్త్రమును (మనోమోహన్ ఘోష్ ఆంగ్లభాషలోనికి అనువదించిరి) పోణంగి శ్రీరామ అప్పారావు తెలుగు భాషలోనికి అనువదించిరి. గుప్తభావ ప్రకాశికా అయిన ఈ నాట్యశాస్త్ర అనువాదమునకు 1960వ సంవత్సరములో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినది. పోణంగి శ్రీరామ అప్పారావు 'తెలుగు నాటక వికాసము' అను సిద్ధాంత వ్యాసమును సమర్పించి ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్ నుండి డాక్టరేటు పొందిరి. ఈ నాట్య కళకు సంబంధించిన నృత్యకళ, నాట్యశాస్త్ర పరిచయము, A Monographon Bharatas NatyaSastra, అభినయ దర్పణము ప్రతి పదార్థ సహితము, భారతీయ నాటక రంగము (అనువాదము) రచనలు చేసిరి. నాట్యకళపై వీరికి ఉన్న పరిజ్ఞానము, అనుభవం ఇప్పటి పరిశోధకులకు మార్గదర్శకము అనుసరణీయము.

ముప్పది ఆరు అధ్యాయములు గల నాట్యశాస్త్రమును అనువదించిన డా॥పోణంగి శ్రీరామ అప్పారావు గారి అనువాదమును పరిశీలించినప్పుడు వీరు అనువాద ప్రక్రియను సమగ్ర మొనరించుటకై 1)నాట్యశాస్త్ర పాఠబేధములను, 2)నాట్య శాస్త్ర వ్యాఖ్యానమైన అభినవగుప్తుని 'అభినవ భారతి'లోని విషయములను 3) నాట్యమునకు సంబంధించిన విశేషాంశములను 4) పాశ్చాత్య గ్రీకు నాటకరంగ విషయములను ప్రతి అధ్యాయములోను పొందుపరిచినారు.

అనువాదమును చేయుటలో సామాన్యులకు నాట్యశాస్త్రములోని విషయాలను సరళంగా, సుబోధకంగా, విద్వజ్జనామోదకంగా, సమగ్రంగా అంది పుచ్చుకొనే విధంగా అనువదించిరి. నాట్యశాస్త్రము అనువాదం చదువుకునే పాఠకులకు మూలమును చూడవలసిన అవసరం లేకుండునట్లుగా అనువదించిరి.

**పాఠ భేదములు**

పోణంగి శ్రీరామ అప్పారావు నాట్యశాస్త్ర అనువాదమునకు శ్రీమానవల్లి రామకృష్ణకవి సంపాదించి, సరిచూచిన బరోడా ముద్రణను, కాశీ ముద్రణను, బొంబాయి ముద్రణలలోని పాఠ్య భేదములను పరిగణనలోనికి తీసుకొని ఎక్కడ, ఏది సమగ్రమైన భావమును ప్రస్ఫుటం చేస్తుందో ఆ విషయమును ఆపాఠము నుండి తీసుకుని అనువాదమును సాగించిరి.

ఆరవ అధ్యాయములో రసములు గురించి వివరించునప్పుడు, ఆ అధ్యాయము యొక్క ప్రారంభములో ఏ పాఠ్య భేదములలో ఎన్ని శ్లోకములు గలవో వివరించిరి.

'కాశీ ముద్రణమునందు 83శ్లోకములను, 11 గద్యములు కలవు. బొంబాయి ముద్రణము నందు- 84 శ్లోకములును, 11గద్యములును కలవు. బరోడా ముద్రణము నందు -82 శ్లోకమును 11 గద్యములును కలవు. బొంబాయి, బరోడా ముద్రణములందు శాంత రసమునకు సంబంధించిన భాగము అధిక పాఠముగా గణింపబడినది. ఇందు 5శ్లోకములును, ఒక గద్యమునకు కలవు. కాశీ ముద్రణమందీ భాగము లేదు.

ఇంత చక్కని వివరణ వలన భరతుని నాట్యశాస్త్రమున మూడు పాఠాంతరములలోను శాంత రసము – రసముగా ప్రతిపాదింపబడలేదనియు, రెండు పాఠాంతరములలో శాంత రసము అధిక పాఠముగా చెప్పబడినదని పాఠకులకు తేటతెల్లమగును. ఈ విధముగా ప్రతి అధ్యాయము ప్రారంభములో పాఠ భేదములను చెప్పిరి.

**అధఃసూచికలు**

అనువాదములో నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానమైన అభినవగుప్తుడు రచించిన అభినవభారతిలోని అంశములను ఎలా ఉన్న వాటిని అలాగే గ్రహించుటయే కాక అప్పారావు తన స్వీయ వివరణను కూడా జోడించిరి. అయితే ఈ వివరణలను విశ్లేషణలను అన్నింటిని అథఃసూచికలలో చేర్చిరి.

6వ అధ్యాయమునందే నాట్యవేద సంగ్రహమును గూర్చి చెప్పుచూ...

**"రసా – భావా – వ్యభినాయాః – ధర్మీ – వృత్తి – ప్రవృత్తయః**

**సిద్ధిః – సరాః – తథా తోద్యం – గానం – రంగశ్చ – సంగ్రహః"** అను ఈ పదకొండు విషయముల స్వరూపమే నాట్యవేద సంగ్రహమని చెప్పిరి. "ఈ పదకొండు విషయములే. నాట్య శాస్త్రమందు చర్చనీయాంశములు. "అభినయ త్రయము అనగా ఆంగిక, వాచిక, సాత్వికాభినయములు మూడును, గీత – ఆతోద్యములు రెండును కలిసి నాట్యము పంచాంగమే అని భరతుని అభిప్రాయము" నాట్యము ఏకాదశాంగాత్మక మనెడి పై అభిప్రాయము కోహల మతమట ***(అభినవభారతి-ఒకటవ సం.పుట-26-4)*** అని అభినవభారతి వ్యాఖ్యమును అధ:సూచికలో పొందుపరిచారు.

**విశేషాంశములు**

ఈ నాట్యశాస్త్రమునకు సంబంధించిన విశేషాంశములను, అనువాదమున ప్రతి అధ్యాయమునకు సంబంధించిన విశేషాంశములను ఆ అధ్యాయమునందే చివర ఇచ్చుట చేత పాఠకులకు ఏ అధ్యాయమునకు, ఆ అధ్యాయము సరియైన అవగాహనకు వచ్చుటకు అవకాశము అధికముగా నున్నది. పరిశీలించినచో 6వ అధ్యాయము చివర విశేషాంశములలో సంస్కృత సాహిత్య విమర్శయందలి దశలు, రససంఖ్య, రససమీకరణ వాదములు, రసరాజత్వము, రసముల ఉత్పత్తి, శారదా తనయుని కథనము, శాంత రసము, రస భేదములు, రస భేదములు, రస నిష్పత్తి భిన్న మతములు, రసము, రస సామాగ్రి ఈ అంశములపై ఆలంకారికుల భిన్న అభిప్రాయములను చక్కగా వివరణలతో యివ్వడం, 8వ అధ్యాయం చివర 1) అభినయము, 2) రూపకము ప్రదర్శన ఆవశ్యకత – "నాట్యశాస్త్రము కవి – ప్రయోక్త ఇరువురిని ఉద్దేశించి ప్రవర్తితమైనదని అభినవగుప్తుడు పేర్కొనెను" అని, 3) ఆంగికాభినయ భేదములు, 4) అభినయము – నాట్యము ఈ విధంగా ప్రతి సూక్ష్మ విషయమును విశేషాంశములకు జోడించిరి.

**పాశ్చాత్య రంగస్థల విమర్శ**

భరతుని నాట్యశాస్త్రం అనువాదం అయినప్పటికి అప్పారావు పాశ్చాత్య రంగస్థల విషయాలకు ప్రామాణిక గ్రంథమైన అరిస్టాటిల్ 'పోయెటిక్స్'లోని ముఖ్యాంశాలను విశేషాంశాలలో జోడించిరి. అప్పారావు నాట్యశాస్త్రము 'పొయెటిక్స్'ల గురించి "భిన్న దేశాలలో, భిన్న కాలాలలో, విభిన్న దృక్పథాలతో రచింపబడినప్పటికినీ రెండు గ్రంథాలను పెక్కు విషయాలలో సమానాభిప్రాయాలనే వెలిబుచ్చిరి అని చెప్పిరి. నాట్యశాస్త్రం 'పొయిటిక్స్ తరువాతది అయినప్పటికినీ స్వతంత్ర గ్రంథమని ఆ రెండింటిలో పోలికలకు "సంవాదిన్యో మేధావినాం బుద్ధయః" (Great Menthink alike) అని చెప్పిరి.

నాల్గవ అధ్యాయము విశేషాంశములలో ఈ పాశ్చాత్య నృత్త–నృత్యములు–నృత్త–నృత్య–నాట్య స్వరూపములు. అంతేకాక ఆనాటి గ్రీకు నృత్యకళ కాల గర్భములో కలిసిపోయినది అని నేటి నృత్యములలో 'బేలే నృత్యము' (Ballet-Dance), ఒపేరా (Opera), మైమ్ (మూకాభినయములను) వివరించి చెప్పుట చేత ఆంగ్ల గ్రంథములు చదువలేని వారికి ఈ వివరణములు విశ్లేషణముల వలన గ్రీక్ థియేటర్ ఆర్ట్ గురించి అవగాహన పొందుటకు వీలు కల్పించిరి.

గ్రీకు ట్రాజెడీను (విషాద రూపకం) గూర్చి, గ్రీకుల నృత్య ప్రాశస్త్యమును గూర్చి కెథార్సిస్‌ను గూర్చి, అనేక విశేష విషయములను విశ్లేషణా సహితముగా వివరించుట చేత ఎవరైనా పరిశోధకులు ఈ పాశ్చాత్య నృత్య రీతులపైన గానీ, అందులోని విషయములపైన గానీ, విమర్శనాత్మక విశ్లేషణలు చేయదలుచుకుంటే ఈ నాట్యశాస్త్ర అనువాదమే ఒక ఆధారం అవుతుంది.

అనువాదము చివర అనుబంధములో నాట్యశాస్త్రకర్తలు – వ్యాఖ్యాతలు అను వ్యాసమును, నృత్త – నాట్య – నృత్య–రస అలంకార శాస్త్రకర్తలు – గ్రంథములు ఇలా నాట్యశాస్త్రమునకు అవసరమైన ప్రతి విషయాన్ని అందించారు.

భరతుని నాట్యశాస్త్రముపై డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు అనువాదము ఒక అద్భుత సృష్టి.

**ఆధారగ్రంథాలు**

1. ధ్వన్యాలోకము (ఆనందవర్ధనుడు) – శ్రీ వేదాల తిరువేంగళాచార్యులగారి అనువాదము – ఆంధ్రధ్వన్యాలోకము – హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు; 1950.
2. నాట్యశాస్త్రము (గుప్త భావ ప్రకాశికాసహితము) – పోణంగి శ్రీరామఅప్పారావు; అజంతా ప్రింటర్, హైదరాబాద్; 1983.
3. భరతకోశము – సంపాదకుడు. శ్రీ మానవల్లి రామకృష్ణకవి; తిరుమలతిరుపతి దేవస్థానము ప్రచురణ, తిరుపతి; 1951.
4. హస్తాభినయము – పి.యస్.ఆర్. అప్పారావు; తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాద్, ప్రథమ ముద్రణ1995.

# విశ్వనాథ మధ్యాక్కఱలు - యోగ తత్త్వానుశీలనం

డా. ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి), అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం

**1. పరిచయం**

తెలుగు సాహితీ ఆకాశంలో ధ్రువతారలా నిలిచిన వ్యక్తి విశ్వనాథ సత్యనారాయణ. కవి సామ్రాట్ బిరుదాంకితులు. తాను పట్టిన ప్రతి సాహిత్య ప్రక్రియను బంగారం చేసిన మహాకవి. జి.వి.సుబ్రహ్మణ్యం అన్నట్లు 'ఆయన వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక వైలక్షణ్యం' ఉంటుంది. ఆయన మధ్యాక్కఱలు అనే ఛందస్సును తీసుకొని అందులో పదిశతకాలను రాయటం కూడా ఆ విలక్షణత్వంలో భాగమే.

మధ్యాక్కఱ ఛందస్సులో పది శతకాలను రాసిన తెలుగు కవి మరొకరు లేరు. అది విశ్వనాథవారి ప్రత్యేకత. ఆ విలక్షణత్వమే ఆయన్ను మహాకవిని చేసింది. ఆయన ప్రతి కృతిలోను తనదైన వ్యక్తిత్వం ప్రతిఫలిస్తుంది. ఈ మధ్యాక్కఱలలోని పదిశతకాలలోను ఆయన వ్యక్తిత్వం ఛాయామాత్రంగా దర్శనమిస్తుంది. 1962లో తెలుగు కవిత్వ విభాగంలో 'విశ్వనాథ మధ్యాక్కఱలు'కు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించటం విశేషం.

**1.1 మధ్యాక్కఱలు – విశిష్టత**

'మధ్యాక్కఱ' అనేది తెలుగులో ఒక ఛందోప్రక్రియ. ఇందులోని పద్యాలకు నాలుగు పాదాలుంటాయి. ప్రతి పద్యపాదంలోను రెండు ఇంద్రగణములు + ఒక సూర్య గణము + రెండు ఇంద్ర గణములు + ఒక సూర్య గణము ఉంటాయి. మొత్తం ఆరు గణాలు. ప్రాస నియమం ఉంటుంది. నాలుగవ గణం లేదా ఐదవ గణం మొదటి అక్షరం యతిస్థానం.

మధ్యాక్కఱ అనే ఈ దేశీయ ఛందస్సులో పదిశతకాలు రాయటం విశ్వనాథ వారి ప్రత్యేకత. వేదాంత విషయాన్ని, భక్తి తత్త్వాన్ని సరళ సుందరంగా రచించటానికి మధ్యాక్కఱ అనువుగా ఉంటుంది. అందుకనే విశ్వనాథ ఈ ఛందస్సును ఎంపిక చేసుకొని ఉంటారు.

**1.2 శతకం – అనుకూలత**

శతకం అంటే వంద పద్యాలతో రచించే ఒక సాహితీ ప్రక్రియ. ఒకే మకుటం గల పద్యాలు కనీసం వంద రాస్తే అది శతకం. మిగిలిన సాహిత్య ప్రక్రియలకు ఉండే ఆలంకారిక, లాక్షణిక నియమాలు, బంధాలు శతక సాహిత్యానికి లేవు. కవికి ఇందులో స్వేచ్ఛ ఉంటుంది. ఒక పద్యంలోగాని, వంద పద్యాలలో గాని కవి తన భావాన్ని వ్యక్తీకరించుకోవచ్చు.

విశ్వనాథ తన మధ్యాక్కఱలలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలని, సమాజంలోని మంచి చెడులని వ్యక్తం చేశారు. సునిశితమైన విమర్శ కూడా చేశారు.

**1.3 విశ్వనాథ మధ్యాక్కఱలు – పది శతకాలు**

'విశ్వనాథ మధ్యాక్కఱ'లు అనే ఈ గ్రంథంలో పది శతకాలు ఉన్నాయి.

అవి 1) శ్రీగిరి శతకము 2) శ్రీకాళహస్తి శతకము 3) భద్రగిరి శతకము 4) కులస్వామి శతకము 5) శేషాద్రి శతకము 6) ద్రాక్షారామ శతకము 7) నందమూరు శతకము 8) నెకరుకల్లు శతకము 9) మున్నంగి శతకము 10) వేములవాడ శతకము.

ఈ పది శతకాలు భక్తి తత్త్వానికి చెందినవే. వీటిలో భక్తితో పాటు సునిశితమైన విమర్శ కూడా ఉంటుంది. ముఖ్యంగా జీవుని వేదన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

**2. యోగ తత్త్వం**

భారతదేశం యోగ భూమి.

**"తపస్వి భ్యోధికో యోగి జ్ఞానిభ్యోపి మతోధికః ।**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥"** భ.గీ.(6-46)

అని చెప్పి భగవద్గీత ప్రతి ఒక్కరిని యోగులుగా జీవించమని కోరింది. తపస్సు కన్నా, జ్ఞానం కన్నా, కర్మ కన్నా యోగం శ్రేష్ఠమని, యోగులుగా జీవిస్తే సమాజంలో సుఖసంతోషాలు, శాంతి సౌఖ్యాలు వర్ధిల్లుతాయని కృష్ణభగవానుని సందేశం.

యోగంలో అనేక సాధనా విధానాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి నాలుగు. అవి 1) కర్మయోగం 2) భక్తి యోగం 3) జ్ఞానయోగం 4) రాజయోగం. విశ్వనాథ మధ్యాక్కఱలలో ఈ నాలుగు యోగాలు ఎలా ప్రతిఫలించాయో పరిశీలిద్దాం.

**2.1 కర్మ యోగం - విశ్వనాథ మధ్యాక్కఱలు**

కర్మ అంటే పని. ప్రకృతిలోని అన్ని ప్రాణులు వాటి స్వాభావిక లక్షణాలననుసరించి ఏదో ఒక పని చేస్తూనే ఉంటాయి. ఎవరూ కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరంటారు గీతాకారుడు.

**"నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥"** (భ.గీ.అ.3-5)

పని చేయటమే కర్మ యోగం కాదు. కర్మ ఫలాన్ని కోరుకోకుండా కర్మ చేయటమే కర్మయోగం. అంటే నిష్కామ కర్మ. కర్మలను త్యజించటం కాదు, కర్మ ఫలాన్ని త్యజించటం నిజమైన వైరాగ్యం. ఇది లోక కళ్యాణకారకం.

విశ్వనాథ శ్రీ గిరి శతకంలో "ఇప్పటి నా స్థితి చూడనెడదలో గోర్కు లేమియు వెలికి గుప్పించి దూఁకెడు జాడలేదు" (శ్రీగిరి శతకం-13) అంటారు. అంటే తన మనస్సులో ఏ కోరిక లేదని, నిర్మలంగా ఉన్నానని చెపుతున్నారు. ఇది నిజమైన కర్మయోగం. ఇలాంటి కర్మయోగి కార్యాలన్నీ లోకోపకారంగా ఉంటాయి.

**2.2 భక్తి యోగం - విశ్వనాథ మధ్యాక్కఱలు**

మోక్ష సాధనాలన్నిటిలోను భక్తి శ్రేష్టమైనదని మహాత్ముల అభిప్రాయం. ఆదిశంకరాచార్యులు **"మోక్ష సాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ"** (వివేక చూడామణి) అన్నారు.

భగవంతుని మీద అత్యంత ప్రేమను కలిగి ఉండటాన్ని భక్తి అంటారు. ఉత్తముడైన భక్తుడు ఇంద్రియ నిగ్రహాన్ని, సమభావాన్ని, సర్వభూత హితభావాన్ని కలిగి ఉంటాడు. అంతేకాదు, సహనం, సంతుష్టి, నిశ్చలత్వాలు కూడా భక్తునిలో ఉంటాయి.

మనోబుద్ధ్యహంకారాలను భగవంతునిలో లీనం చేసేవాడే భక్తుడు. ఐతే, భక్తి సగుణోపాసన గాను, నిర్గుణోపాసన గాను ఉండవచ్చు. నిర్గుణోపాసన కన్నా సగుణోపాసన సులభంగా ఉంటుందంటాడు కృష్ణభగవానుడు. **"క్లేశోధిక తరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్"** (భ.గీ.12-5) అన్నాడు. అందుచేత భక్తులు సాకార సగుణ రూపంలోనే భగవంతుణ్ణి ఆరాధిస్తూ ఉంటారు. భాగవతంలో ప్రహ్లాదుడు శ్రీమన్నారాయణ మూర్తిని ఆరాధించాడు. భాగవతం నవవిధ భక్తి మార్గాలను పేర్కొన్నది.

సర్వకాల సర్వావస్థలలో భక్తులు భగవంతుని స్మరిస్తూనే ఉంటాడు. **"స్నానంబు చేయుచుఁదుడుచు కొంచును జపముసేయుచును, బ్రాణాలు తేలిపో నీవు కనిపించు భాగ్యమున్నదియె, యీ నాకటంచు నేనెంతగా దపియింతు నీ వెఱుగు, చో నాకుజాలు శ్రీశైల మల్లికార్జున మహాలింగ"** (విశ్వనాథ మధ్యాక్కఱలు - శ్రీగిరి శతకము - 40) విశ్వనాథ వారు ఈ పద్యంలో స్నానం చేస్తూ, తుడుచుకుంటూ, జపం చేస్తూ నిన్నే స్మరిస్తాను. నీ దర్శనం జరిగితే చాలు నాకు అంటూ, నేను ఎలా తపించిపోతానో - అది నీకు తెలిస్తే చాలు ఓ మల్లికార్జున మహాలింగా అంటున్నారు. అంటే సర్వకాల సర్వావస్థలలో భక్తుడు భగవంతుణ్ణి స్మరిస్తూ ఉంటాడని, భగవంతుణ్ణి దర్శించటానికి భక్తుడు పడే తపనను భగవంతుడు గుర్తిస్తే చాలునని అంటారు.

ఇది నిజభక్తికి తార్కాణం. ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. భక్తుడు భగవంతుణ్ణి దర్శించటం. భగవంతుని దృష్టిలో భక్తుడు ఉండటం. ఈ రెండవది చాలా కష్టం. దాన్ని సాధించటమే భక్తియోగ పరమార్థం. ఈ సూక్ష్మ రహస్యాన్ని విశ్వనాథ ఈ పద్యంలో చెప్పారు.

**2.3 జ్ఞాన యోగం – విశ్వనాథ మధ్యాక్కఱలు**

జ్ఞాన యోగంలో జ్ఞానం అంటే ప్రాపంచిక జ్ఞానం కాదు. జ్ఞాన యోగమంటే, ఆత్మ జ్ఞానాన్ని కలిగి ఉండటం. నేనెవరిని? అనే ప్రశ్న ద్వారా ఆత్మ పరిశీలన చేసుకోవటం.

**"మనో బుధ్యహంకార చిత్తానినాహం**
**నచశ్రోత్రం న జిహ్వా నచఘ్రాణనేత్రే**
**న చ వ్యోమ భూమి ర్నతేజోన వాయుః**
**చిదానంద రూపః శివోహం శివోహం"** (ఆదిశంకరాచార్యులు – నిర్వాణ షట్కం).

నేను మనస్సును కాను. బుద్ధిని కాను. అహంకారం, చిత్తం కూడా కాను. చెవి, నాలుక, ముక్కు, కళ్ళు, చర్మం అనే పంచజ్ఞానేంద్రియాలను కాను. పంచభూతాలనుకాను. చిదానంద రూపమైన శివుణ్ణి నేను. నేను శివుణ్ణి అంటారు ఆదిశంకరులు. ఇది సత్యజ్ఞానం. మానవులు ప్రాపంచిక విషయాసక్తికి లోనై ఈ శరీరం నేననే భ్రమలో ఉంటారు. బంధాలు అనుబంధాలు శాశ్వతమనే భ్రమలో ఉంటారు. ఈ భ్రాంతి అవివేకం వలన కలుగుతుంది. ఇదే అజ్ఞానం.

గ్రంథాధ్యయనం ద్వారా గాని, గురుబోధ వలన గాని, స్వానుభవం ద్వారాగాని ప్రాపంచిక బంధాలు శాశ్వతం కాదని తెలుసుకొని, ఆత్మ చింతనలో ఆనందావస్థలో ఉండటమే జ్ఞానయోగం.

విశ్వనాథ వారు జ్ఞాన యోగాన్ని మధ్యాక్కఱలలో చక్కగా వ్యక్తం చేశారు. **"నేనెంత! నాబ్రతుకెంత! సృష్టిలో నిజము నా వంటి, మానవుల్ మూడు కాలములఁబుట్టుచు మడియుచున్నారు...."** (విశ్వనాథ మధ్యాక్కఱలు – శ్రీగిరి శతకము –7) అంటారు. ఈ సృష్టిలో నాలాంటి మనుషులు మూడు కాలాల్లోను పుడుతూ చస్తూ ఉన్నారు. నేనెంత, నా బ్రతుకెంత అని తనలోని అహంకారాన్ని తుడిచిపెట్టేస్తారు కవి. ఇది జ్ఞాన యోగంలో పరిపక్వ దశ.

**2.4 రాజ యోగం – విశ్వనాథ మధ్యాక్కఱలు**

రాజయోగం అత్యంత ప్రజాదరణ పొందిన యోగ విధానం. 'రాజా' అనే సంస్కృత శబ్దానికి ముఖ్యమైన, అత్యుత్తమమైన అని అర్థం. అంటే అత్యుత్తమమైన, ముఖ్యమైన యోగ విధానమే 'రాజయోగం'.

రాజయోగం – హఠ యోగం అని సాధనా విధానాన్ని బట్టి రెండు మార్గాలుగా ఉంటుంది ఈ యోగం. రాజయోగం అనేది ప్రధానంగా మనసుకు సంబంధించింది. మనస్సును నిర్మలంగా ఉంచుకోవటం ఇందులో ముఖ్యం. మనస్సు నిర్మలంగా ఉండాలంటే ధ్యానం చేయాలి. ధ్యానంలో మనస్సు స్థిరత్వాన్ని పొందాలంటే, శరీరం అనుకూలించాలి. శరీరాన్ని ఆసన, ప్రాణాయామాలతో అనుకూలంగా మలుచుకొని, ఆహార నియమాలతో శరీరాన్ని శుద్ధిగా ఉంచుకోవాలి. అప్పుడు శరీరం మనస్సు ధ్యానానుకూలంగా మారతాయి. అలా సాధకుణ్ణి సమాధి స్థితి దాక తీసుకుపోవటం రాజ యోగం లక్ష్యం.

విశ్వనాథ మధ్యాక్కఱలలో రాజయోగ లక్షణాలు అనేకం ప్రతిఫలించాయి. మనస్సును నిగ్రహించే సమయంలో అనేక పాపపుటూహలు వస్తాయని, పుణ్యపుటూహలను కలిగించమని కవి శ్రీకాళహస్తీశ్వరుణ్ణి వేడుకుంటాడు.

**"బియ్యమ్ములో రాళ్ళు లేరనగుగాని వెసరాళ్ళలోన**
**బియ్యమేరి ప్రయోజనంబు సుంతకన్పించదు స్వామి**
**యయ్యయో పాపపుటూహలందు బుణ్యపుటూ హలేరు**
**టయ్యె నాబ్రదుకు శ్రీకాళహస్తీశ్వరా! మహాదేవ !"** (విశ్వనాథ మధ్యాక్కఱలు – శ్రీకాళహస్తి శతకం – 89)

ఇక్కడ కవి లోకం తీరును వివరిస్తున్నారు. ఆ వివరించే సమయంలో ఆత్మాశ్రయంగా చెపుతున్నారు. బియ్యంలో రాళ్ళే ఏరటం పోయి, రాళ్ళల్లో బియ్యం ఏరటం జరుగుతుందని వాపోయారు. రాజయోగి మనస్సు ఇటువంటి స్థితిలోను నిశ్చలంగానే ఉండాలి. అన్నింటికీ అతీతమైన స్థితిలో ఉండటమే రాజయోగం. ఆ స్థితిని ప్రసాదించమని కవి వేడుకుంటున్నాడు. ఇది రాజయోగ సాధన.

**ముగింపు**

విశ్వనాథ మధ్యాక్కఱలలో ఉన్న శతకాలన్నీ భక్తి ప్రధానమైనవే. ఐతే, భక్తిలోను లోకనీతి, లోకరీతిని వివరిస్తూ, ఆనుషంగికంగా ఉండే నాలుగు యోగాలను వాటిలో ఇమిడ్చారు.

భారతీయ ఆధ్యాత్మిక సాధనా మండపానికి నాలుగు స్తంభాలుంటాయి. అవే కర్మ, భక్తి, జ్ఞాన, రాజ యోగాలు. ఈ మౌలికాంశాలపై అవగాహన ఉన్న రచయిత కనుక విశ్వనాథ తన మధ్యాక్కఱలలో యోగతత్త్వాన్ని సంప్రదాయబద్ధంగా ప్రయోగించారు. ఇలాంటి సాహిత్యం సమాజానికి శాంతి సౌఖ్యాలనిస్తుందనటంలో సందేహం లేదు.

**ఆధార గ్రంథములు**

1. ఆదిశంకరాచార్యులు – వివేక చూడామణి – అచలపీఠము, వై రా – 2013.
2. వేద వ్యాసమహర్షి – శ్రీమద్భగవద్గీత – గీతా ప్రెస్ – గోరఖ్‌పూర్ – 2020.
3. సత్యనారాయణ, విశ్వనాథ – విశ్వనాథ మధ్యాక్కఱలు – శ్రీరామముద్రణాలయము – కరీంనగర్ – 1958
4. స్వామి వివేకానంద – కర్మయోగం – శ్రీరామకృష్ణ మఠం – మద్రాసు – 1983
5. స్వామి వివేకానంద – బుద్ధి యోగం – శ్రీరామకృష్ణ మఠం – మద్రాసు – 1983
6. స్వామి వివేకానంద – భక్తి యోగం – శ్రీరామకృష్ణ మఠం – మద్రాసు – 1983
7. స్వామి వివేకానంద – రాజ యోగం – శ్రీరామకృష్ణ మఠం – మద్రాసు – 1983

# గుర్రం జాషువా క్రీస్తు చరిత్ర - ఒక పరిశీలన

**మరపట్ల రాజు,** పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల, ఈస్ట్ తాంబరం, చెన్నై

**కులమతాలు గీచు గీతాలను జొచ్చి**
**పంజరాన గట్టు వడను నేను నిఖిల**
**లోక మెట్లు నిర్ణయించిన నాకు**
**తరుగు లేదు విశ్వనరుడనేను**

అంటూ 1895 సెప్టెంబరు 28న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించి విశ్వనతుడిగా ప్రకటించుకున్నారు. తెలుగు సాహిత్యంలో భావకవితోద్యమం ముమ్మరంగా నడుసున్న కాలంలో తన దైన ఆసక్తితో తన భావ వ్యక్తీకరణకు పద్యాన్ని ఆయుధంగా చేసుకొని రచనలు చేశారు. ఆధునిక భావాలను సైతం పద్యంలోనే రాసిన కవితావిశారదుడు. తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. అంటరానితనాన్ని స్వయంగా రుచి చూసిన జాషువా గారి భావ తీవ్రత నుండి పుట్టుకొచ్చిందే ఈయన కవిత్వం. అంటరాని తనం అనే జబ్బును తన రచనలతో బలంగా, ధీటుగా ఎదుర్కొన్న మహాకవి జాషువా. జాషువా గారి జీవితం వడ్డించిన విస్తరి కాదు. వద్దనకు వెతుకులాడిన జీవితం.

అలాంటి జాషువాగారి కలంనుండి గబ్బిలం, పిరదౌసి, స్వప్నకథ, కొత్తలోకం, ముంతాజ్ మహల్, అనాథ, మసాఫరులు, రుక్మిణి కళ్యాణం, వీరాబాయి, శివాజీ, బాపూజి, నేతాజీ, రాష్ట్రపూజ, నాగార్జున సాగర్, క్రీస్తు చరిత్ర, కాందిశీకుడు, స్వయంవరం, చిదానంద ప్రభాతం, దావీదు చరిత్ర మొదలైన రచనలు చేశారు.

1921లో క్రీస్తు జన్మ వృత్తాంతానికి ఎంచుకొని 'చిదానంద ప్రభాతం' నాటకం వ్రాసారు. ఈ నాటకమే పౌరాణిక నాటక లక్షణాలు ఉన్న తొలితెలుగు క్రైస్తవ నాటకంగా నిర్ధారించవచ్చునని ఆచార్య ఎండ్లూరి సుధాకర్ 'నవయుగ కవి చక్రవర్తి జాషువా' అనే గ్రంథంలో తెలియజేసారు. అంతేకాదు జాషువా రాసిన ఖండ కావ్యాలు సామాన్యునికి సైతం సుపరిచితాలు. తన స్వీయచరిత్రను “నా కథ” అనే పేరుతో మూడు భాగాలుగా పద్యాత్మకంగా రచించారు. తన మేనమామ కుమార్తె అయిన మేరీని వివాహం ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను సంతానాన్ని పొందారు. ప్రాథమికోపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, తెలుగు పండితునిగా, ఆనాటి మూకీ చలనచిత్రాలకు వ్యాఖ్యాతగా, ప్రపంచ యుద్ధ సమయంలో ప్రచారకునిగా,1956 నుండి 1960 వరకూ ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసర్‌గా సేవలందించారు. ఈయన రాసిన రచనలకుగానూ కవితాభిమానులు, సాహిత్య సంస్థల వారు వేలాది సన్మానాలు చేశారు. కవికోకిల, కవితావిశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ కవిచక్రవర్తి, విశ్వకవి సామ్రాట్ మొదలైన బిరుదుల్ని పొందారు. గండపెండెరం, కనకాభిషేకం, గజారోహణం చేసి, పగటి దివిటీల పల్లకిలో ఊరేగిన జాషువా గారికి గుంటూరు పట్టణం స్వేచ్ఛ పౌరసత్వానిచ్చి గౌరవించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో సభ్యునిగా కూడా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయం జాషువా గారికి “కళాప్రపూర్ణ” బిరుదుతోను, భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదుతోను సత్కరించారు.1965లో 'క్రీస్తుచరిత్ర' కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. జాషువా అందరి ఆదరణ అభిమానాలను పొంది 1971 జూలై 24న మరణించడం జరిగింది. జాషువా మరణించిన

"సుకవి జీవించు ప్రజల నాలుకలయందు" అన్నట్లుగా కవితాభిమానుల నాలుకల మీద జాషువా కవిత్వం ఎప్పుడు నాట్యం చేస్తూనే ఉంటుంది అనటంలో సందేహం లేదు.

జాషువా బాల్యంలోనే క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. జాషువా క్రీస్తుచరిత్రను మిత్రుల కోరిక మేరకు బైబిల్లోని కొత్త నిబంధనను కావ్యంగా మలిచారు. క్రీస్తు జీవితాన్ని, ఆయన క్రియలను, బోధనలను ఈ కావ్యంలో వివరించడం జరిగింది. "క్రీస్తు చరిత్ర" రచన నేపథ్యాన్ని గూర్చి 'ఒక మనవి' అనే శీర్షికలో కవి ఇలా వివరించారు. "క్రీస్తుచరిత్ర కావ్యంగా రాయాలన్న నా చిరకాల వాంఛ తీరింది" అంటారు. మత గ్రంథాలను, అందులోను బైబుల్ని ఛందోబద్ధం చేయటం కత్తిమీద సాము వంటిది. తెలుగు బైబిల్ భాష నీసడించు హైందవ మిత్రులకు, కళాభిరుచి గల ఆధునిక యువ క్రైస్తవ లోకానికి ఈ కావ్యం రుచిస్తుందనే ధైర్యం నాకున్నది అని జాషువా అన్నారు.

కవికోకిల జాషువా క్రీస్తుచరిత్రను సృష్టి, యోహాను జన్మవృత్తాంతం, క్రీస్తు జననం, జ్ఞానుల రాక, బాల్యము, యోహాను సేవ, స్నానము, శోధన, ప్రథమ శిష్యులు, మొదటి అద్భుతము, నికోదేమో, యోహాను చెరసాల శిక్ష, సమరయ స్త్రీ, ప్రధాని కుమారుని స్వస్థపరచుట, పక్షవాత రోగి, పర్వతము మీది ప్రసంగము, నయీనులో విధవ పుత్రుని బ్రతికించుట, యోహాను శిష్యులు, అత్తరుతో అభిషేకించిన స్త్రీ, యోహాను మరణం, విత్తువాడు, తుఫాను నిమ్మళించుట, దయ్యము పట్టినవాడు, యాయీరు కుమార్తెను బ్రతికించుట, అయిదువేల మందికి ఆహారము పెట్టుట, సముద్రం మీద నడుచుట, సురోపెనికయ స్త్రీ, రూపాంతరము, జారస్త్రీ, తప్పిపోయిన కుమారుడు, శాస్త్రులు, పరిసరియులు, ధనవంతుడు లాజరు, లాజరును లేపుట, మంచి సమరయుడు, నిత్యజీవము కోరిన ధనవంతుడు, పుట్టు గ్రుడ్డివాడు, ఎరుషలేము ప్రవేశము, అంజూరపు చెట్టు, పదిమంది కన్యకలు, ద్రాక్షతోటలో కాంతము, పస్కా, శిష్యుల పాదములు కడుగుట, చివరి రాత్రి, తుది బోధ, గెత్సెమనే తోట, తొలి విచారణ, యూదా ఆత్మహత్య, పొంతి పిలాతు తీర్పు, సిలువవేత, తల్లి శ్లోకము, మరణము, పునరుత్థానము, ఆరోహణము అనే అంశాలను మూల గ్రంథమైన బైబిల్ నుండి ఎన్నుకొని క్రీస్తు చరిత్రను అద్భుతంగా మలిచారు.
సృష్టి అనే శీర్షికలో జాషువా ఇలా రాశారు.

**మ. జగదారాధ్యుని ఆజ్ఞమీరి పెను లజ్జా కుంచిత గ్రీవులై**
**దిగులున్ జెందుచు నాకు జొంపముల భీతిన్ దాగి యున్నట్టి య**
**య్యుగళిం బ్రాక్తన దంపతిన్ దెగడిపొం దుద్యానయం దుండుగా**
**తగరంచున్ బహుధా శపించి తరిమెన్ దైవంబు క్రోధోద్ధతిన్**

దేవుడిచ్చిన ఆజ్ఞను అతిక్రమించిన ఆదాము, హవ్వలు సిగ్గుతో, భయంతో చెట్లమధ్య అంజూరపు ఆకులను కప్పుకున్న దంపతుల్ని దేవుడు చూచి, నేను తినొద్దన్న పండును మీరు తిని నా ఆజ్ఞను అతిక్రమించారు. గనుక "ఈ ఉద్యానవనం నుండి పోండని చెప్పి, స్త్రీ అయిన హవ్వను "నీవు మిక్కిలి వేదనతో పిల్లలను కందువుని, నీ భర్త నిన్ను ఏలునని చెప్పెను". అప్పుడు దేవుడు ఆదాముతో నీవు భార్యమాట విని ఆజ్ఞను మిరావు, నీ ద్వారా భూమి శపింపబడి యున్నది. నీవు బ్రతికినంత కాలం కష్టపడి భూమిలో పండే పంటను తిందువు అని దేవుడు శపిస్తాడు.
క్రీస్తు జననము అనే శీర్షికలో కవి ఏసుక్రీస్తు జన్మించిన సువార్తను ఇలా చెప్పారు.

**వలదు భయంబు మీకు, శుభవార్తను దెచ్చితి, లోక రక్షకుం**
**దలషుడు బేతలేము పురియం దుదయించె నతడె క్రీస్తు ము**
**ద్దుల గురియించుచున్ బసుల తొట్టి నొకానొక పాపపొత్తి గు**
**డ్డల శయనించి పొల్గుదుచుటం గనుగోగల రానవా లిదే**

రాత్రి వేళ కొందరు గొర్రెల కాపరులు పొలములో ఉండి మందకు కాపలా కాస్తున్నారు. ఆ సమయంలో ఒక దేవదూత ఈ గొర్రెల కాపరుల వద్దకు వచ్చిన సమయంలో వారి చుట్టు గొప్ప తెలుగు కమ్ముకొనెను. వారు భయభ్రాంతులకు

గురైన సందర్భంలో దూత భయపడకుడి, ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన సువార్తమానము మీకు తెలియజేస్తున్నాను. దావీదు పట్టణమందు నేడు మీ కొరకు రక్షకుడు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన యేసుక్రీస్తు. ఆ శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి, ఒక తొట్టిలో పడుకొని పాలు త్రాగడం మీరు చూచెదరు. ఇదే మీకు ఆనవాలు అని వారితో చెప్పెను.

**శా. దైవంబెవ్వడో! దయ్య మెవ్వడో! వినిర్ధారింపగా లేక, నా**
**నా వేదాంత విచిత్ర వాఙ్మయం మనంతంబై,జగం బెన్నియో**
**త్రోవల్ ద్రొక్క, గురుబువుల్ బ్రజల యందున్ బిచ్చి సిద్ధాంత వీ**
**రావేశంబు సృజింప సాగిరి, స్వలాభాయత్త చేతస్కులై**

బాల్యము అనే అధ్యాయములో పైన తెల్పిన పద్యాలలో దేవుడెవరో, దయ్యమెవరో నిశ్చయించలేక చిత్రవిచిత్రాలుగా వేదాంత వాఙ్మయం అనంతంగా సృష్టించబడింది. ప్రపంచం అనేక మార్గాలను పట్టిపోతుంటే, గురువుల పేరుతో బుద్ధిలేని కొందరు స్వలాభపేక్షతో పనికిరాని సిద్ధాంతాలతో ప్రజలలో వీరావేశాన్ని కలిగించసాగారు.

**ఆ.వె. పెండ్లి యింటమున్న పెను రాతి బానల**
**నింఢ స్వచ్ఛజలము నింపబండి**
**అసమయైన ద్రాక్షరసముగా జేసి వి**
**స్మయము గొలిపె, పెండ్లి మహము నడిపె**

మొదటి అద్భుతము అనే అధ్యాయంలో కానా అనే ఊరిలో ఒక వివాహము జరుగుచుండెను.ఆ పెండ్లి విందులో ద్రాక్షారసమై పోయినప్పుడు, అక్కడ వున్న ఆరు పెద్ద రాతి బానలను నీళ్ళతో నింపమని యేసు వారితో చెప్పెను. వారు ఆ ప్రకారమే చేయగా, అప్పుడాయన ఆ జలాన్ని అసమానమైన ద్రాక్షారసంగా మార్చి, ఆశ్చర్యాన్ని కలిగించి పెండ్లివిందును జరిపించెను.

**మ. జలముల్, వాయువు, నగ్నియున్ బరమ రాజన్యుండు,భూలోక వా**
**సులకుం బంచి యొసంగిపోయిన స్థిరాస్తుల్, స్పృశ్యతాస్పృశ్యతల్**
**కులగోత్రాలు ప్రపంచ సభ్యతకు సిగ్గుచేటు జమ్మిమ్మహ**
**కలుషం బెల్ల మహ పదార్థములకున్ గల్పింతు రల్పాశయుల్**

సమరయ స్త్రీ అనే శీర్షికలో జాషువా ఇలా రాశారు. నీరు, గాలి, నిప్పు అనేవి పరలోక ప్రభువైన దేవుడు పంచి ఇచ్చిన స్థిరాస్థులు. తాకటం, తాకనివ్వక పోవటం, కులగోత్రాలు ఇలాంటివన్ని ప్రపంచ సభ్యతకు సిగ్గుచేటైన విషయాలు సుమా! ఈ మహాపాపాన్ని పంచభూతాలకు సైతం అల్పబుద్ధులు కల్పిస్తున్నారని అంటారు.

**మ. పులుగుల్ దున్నవు,విత్తవెన్నడు,ధనంబుల్ గూర్చుకో వట్టి ప**
**క్షుల కాహార మొసంగు దైవత మనుంగుం బిడ్డలౌ మిమ్ము ఏ**
**స్తుల చేయించునే? ఏమి తిందుమని ఆదుర్దా రవంతేనియున్**
**వలదా పక్షుల కన్న శ్రేష్ఠులు గదన్నా! మీర లూహించినన్**

మత్తయి సువార్త 7:26లో ఉన్న వాక్యాన్ని జాషువా గారు ఈ విధంగా చెప్పారు. ఆకాశ పక్షులను చూడండి “అవి భూమిని దున్నవు, విత్తనాలు విత్తవు, అలాగే ధనాన్ని దాచిపెట్టుకోవు కదా! అలాంటి పక్షులను, సమృద్ధిగా పోషించు దేవుడు పక్షులకంటే శ్రేష్ఠులైన మనుష్యులను పోషించడా అన్నలారా! మరి ఏమి తినగలమనే ఆశ రవ్వంత కూడా వద్దు” అని వ్రాసారు.

విత్తువాడు అనే శీర్షికలో యేసు సముద్ర తీరమున దోనె ఎక్కి కూర్చున్న సమయంలో అనేకులు ఆయన చూట్టూ మూగగా, ఆయన వారికి అనేక సంగతులను తెలియజేసారు. వాటిని జాషువా ఇలా రాసారు.

**ఆ.వె. విత్తువాడు పోయి విత్తనంబులు చల్లెబీ**
**రాచబాట కొన్ని రాతినేల**

**కొన్ని ముండ్లు పొదల గురుసారతరభూమి**
**కొన్నిబడియె వాన గురిసెనంత.**

ఇదిగో విత్తువాడు విత్తటానికి బయటకు వెళ్ళెను. వాడు విత్తుచుండగా కొన్ని రోడ్డు ప్రక్కన పడెను. మరికొన్ని రాతినేలలో పడ్డాయి. కొన్ని ముళ్ళ పొదలలో పడ్డాయి. మరికొన్ని సారవంతమైన నేలలో పడ్డాయని చెప్పారు. వీటి ద్వార పరలోక రాజ్య మర్మములను గూర్చి తెలియజేసారు. అయిదు వేల మందికి ఆహారము పెట్టుట అనే శీర్షికలో కవి ఇలా వ్రాసారు.

**ఆ.వె. అయిదువేలమంది కన్న దానము జేసె**
**యేసునాథు డొక్క వాసరమున**
**రొట్టెలైదు రెండు చిట్టి చేపలతోడ,**
**అద్భుతముల కెల్ల నద్భుతముగా**

అద్భుతాలలోకెల్లా అద్భుతమైన సంగతేంటంటే అయిదు రొట్టెలను, రెండు చిన్న చేపలను సువార్త వినుటకు వచ్చిన అయిదు వేలమంది జనాంగానికి ఆ ఆహారమును ఆశీర్వదించి పంచి పెట్టెను. మరణము అనే శీర్షికలో యేసుక్రీస్తు సమాధిలో వున్న మూడు రాత్రులను గూర్చి కవి ఎంత సామభూతి వర్ణించాడో ఈ కింది పద్యం చూచి తెలుసుకోవచ్చు.

**ఉ. మూడు దినాలు క్రీస్తు ప్రభువున్ నిజగర్భమునందు డాచి, యీ**
**రేడు జగాల ముక్తి సవరింపక తప్పని దౌట, కాలుజే**
**యాడక మృత్యువెంత హృదయ వ్యథనొందెనో, స్వామి ప్రాణముల్**
**వీడెదు వేళయెంత పలవించెనో భద్రముచేయు వేళలన్**

ఆయన్ని బరించలేక మృత్యువెంత హృదయవేదన పడిందో కవి వివరించారు. స్వామి అనే పదంలో అభిమానాన్ని, గౌరవాన్ని పొందుపరచారు. స్వామి అనే పదాన్ని ఉపయోగించే బదులు యేసు లేక క్రీస్తు మొదలైన పదాలను ఉపయోగించి ఉండవచ్చు. నిజదేవుడైన క్రీస్తును కవి సర్వేశ్వరుడు, దేవుడు, జగత్కర్త, మోక్ష సింహసనాన్ని త్యజించినవాడు, యూదులకు రాజు, యేసునాథుడు, మనుష్య కుమారుడు, క్రీస్తు ప్రభువు, మనుష్య నందనుడు, దైవ నందనుడు, దయగల తండ్రి, నజరేతువాసి, ఇమ్మానుయేలు, నరసుతుడు, సృష్టి ప్రభు, రక్షకుడు, సుభోధకుడు, ప్రభూత్తముడు, లోకేశ్వరుడు మొదలైన పదాలను జాషువా ప్రయోగించిన సందర్భాలు క్రైస్తవ సిద్ధాంతానికి తోడ్పడేవే గాని కించపరిచేవి కాదు.

జాషువా కవిత్వం క్రీస్తును వర్ణించడంలో క్రైస్తవ వేదాంతులు చేసున్న సువార్తకు దోహద పడగలదని చెప్పవచ్చు.ఎక్కడ క్రీస్తు ప్రకటింపబడుతున్నాడో, ఎవరు ఆయన సువార్తను వింటున్నా వారి సాంప్రదాయాలకు అనుగుణంగా క్రీస్తుయేసు సువార్తలను జాషువా వర్ణించారు. జాషువా వేదాంత విద్యను అభ్యసించనప్పటికి దైవగ్రంథాన్ని సూక్ష్మంగా పరిశీలించి, పరిశోధించి పాఠక హృదయాలకు అర్థమయ్యే రీతిలో కొత్త పద్ధతిలో క్రీస్తు చరిత్రను పద్యములుగా తీర్చిదిద్దాడు. అందులోని ఒక్కొక్క పద్యం మేలిమి ముత్యంలా వుంటుందనటంలో సందేహం లేదు. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం జాషువా కవిత్వం తెలుగు పాఠకుల హృదయాల్లో మహత్తరమైన స్థానాన్ని సంపాదించిందని చెప్పవచ్చు.

కనుకనే మహాకవి, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా ఎన్నటెన్నటికిని మహాకవే.

**ఆధార గ్రంథాలు**

1. నవయుగ కవి చక్రవర్తి జాషువా - ఎండ్లూరి సుధాకర్, తెలుగు అకాడమి, హైదరాబాదు -2012
2. కవికోకిల గుర్రం జాషువా పద్యచంద్రిక - డా. గుమ్మా. సాంబశివరావు, యస్.ఆర్. పబ్లికేషన్స్ ప్రచురణ -2021
3. మహాకవి జాషువా వ్యక్తిత్వం - కవిత్వం - డా. ఆర్. ఆర్. సుందరరావు, సౌవార్తిక ప్రచురణ (జాషువా జయంతి సందర్భంగా), హైదరాబాదు -1986
4. క్రీస్తుచరిత్ర వ్యాఖ్యానం (ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు) - బూదాటి వేంకటేశ్వర్లు -2022

# క్రీస్తు చరిత్ర - జాషువా దృక్పథం

వి. పద్మ, తెలుగు ఉపాధ్యాయురాలు, జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల, వినుకొండ.

**ఉపోద్ఘాతం**

"క్రీస్తుచరిత్ర కావ్యంగా వ్రాయాలన్న నా చిరకాల వాంఛ తీరింది."[1] క్రీస్తుచరిత్ర కావ్యం ముందుమాటలో జాషువా రాసుకున్న వాక్యాలు ఇవి. క్రైస్తవుల పవిత్ర మత గ్రంథమైన బైబిల్‌ను ఛందోబద్ధకావ్యంగా రాయాలనేది జాషువా చిరకాల కోరిక. ఈ కోరికను జాషువా తన 68 ఏళ్ల వయస్సులో తీర్చుకున్నాడు. వయస్సు పైబడిన తరువాత ఆధ్యాత్మిక భావన మెండుగా ఉండటం కొందరిలో గమనిస్తూ ఉంటాం. కానీ జాషువాలో చిన్న తనం నుంచే దైవ చింతన కనిపిస్తుంది. జాషువా యువకుడుగా ఉన్నప్పుడే, 26 ఏళ్ల వయసులోనే బైబిల్ ఆధారంగా దావీదు చరిత్ర (అలభ్యం), చిదానంద ప్రభాతము (1921) అనే క్రైస్తవ ఇతివృత్త నాటకాలు రచించారు. దావీదు చరిత్ర నాటకంలో "కవిత్వము కఠిన పాకమనియు, పాటలు లేవనియు నెపంబులు పెట్టి క్రైస్తవులు నిరాదరించి ఉన్నారు." ఈ విషయాన్ని చిదానంద ప్రభాతం నాటకంలోని విజ్ఞాపనములో జాషువా వివరించాడు.[2] అప్పటినుంచి 1963 వరకు జాషువా క్రైస్తవ మత గ్రంథాల రచనకు పూనుకోలేదు. గొప్ప కవిగా పేరుపొందిన తరవాత 32 పద్య కావ్యాలు, నాటకాలు, నవలలు, ఖండకావ్యాలు రచించిన తరువాత 1963లో తన చిరకాల కోరిక అయిన క్రీస్తు చరిత్ర కావ్యాన్ని రచించారు.

ప్రాచీన హిందూ మత గ్రంథాలను, కావ్యాలను ఎందరో గొప్ప తెలుగు కవులు ఛందోబద్ధ కావ్యాలుగా రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. కానీ క్రైస్తవ మత గ్రంథమైన బైబిల్‌ను ఛందోబద్ధకావ్యంగా రాసే ప్రయత్నం జాషువాకు ముందు ఎవరూ చేయలేదనే చెప్పాలి. ప్రాచీన హిబ్రూ భాష నుంచి తెలుగులోకి బైబిల్ అనువదించారు. బైబిల్ గ్రంథంలోని పదాలు, పేర్లు, శైలీ చదువరులకు భిన్నంగా ఉంటుంది. అలాంటి కష్టమైన పదాలను పొందికగా, ఛందోబద్ధంగా తెలుగు కావ్యంగా మలచడం గొప్ప విషయం. అందుకే క్రీస్తుచరిత్ర ముందుమాటలో "మత గ్రంథాన్ని అందులో బైబిల్ ని ఛందోబద్ధం చేయడం కత్తి మీద సాము లాంటిది."[3] అని జాషువా చెప్పారు. కావ్య సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి కొంత భాషా పరిజ్ఞానం కావాలి. కానీ, జాషువా కావ్యాలలోని పద్యాలు పాఠకులకు సులభంగా అర్థమైపోతాయి. కావ్య రసాస్వాదనలో పాఠకులు తరిస్తారు. క్రీస్తుచరిత్ర తనకు ఎంతో ఇష్టమైన కావ్యం కాబట్టి జాషువా ఈ కావ్యాన్ని ఎంతో భక్తి భావనతో రాసినట్లు కనిపిస్తుంది. ప్రతి అక్షరాన్ని ఏరి కూర్చి రచించారు. అందుకే జాషువా రచనలన్నిటిలోకి క్రీస్తుచరిత్ర కావ్యం తలమానికంగా నిలిచిపోయింది. క్రీస్తుచరిత్ర కావ్యానికి 1964 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ కావ్యంలో మొదటి 10 పద్యాలు బైబిల్‌లోని ఆదికాండంలోని సృష్టి ప్రస్తావన వుంటుంది. ఆ తరువాత కొత్త నిబంధన గ్రంథంలో మత్తయి మార్కు లూకా, యోహాను సువార్తల ఆధారంగా ఏసుక్రీస్తు జీవిత విశేషాలు, ఆయన చేసిన మహత్యాలు, మానవ సమాజానికి చూపిన మార్గం, పంచిన ప్రేమ, సిలువలో మరణం వరకు ఉంటుంది. కావ్యం ముగింపులో "ఆమెన్" అనే పదం జాషువాలోని దైవభక్తికి నిదర్శనంగా కనిపిస్తుంది.

**జాషువాపై క్రైస్తవ మిషనరీల ప్రభావం**

బ్రిటిష్ పరిపాలన కాలంలో వినుకొండ ప్రాంతంలోని నిమ్న జాతీయులు పెద్ద సంఖ్యలో క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. అప్పటి వినుకొండలో పాఠశాలలు, చర్చిలు, వసతిగృహాలను అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ ఏర్పాటు చేసింది. మిషనరీ పాఠశాలల్లో చదువుకున్న దళిత క్రైస్తవులు విద్యావంతులయ్యారు. జాషువా నాన్న గుర్రం వీరయ్య, తల్లి లింగమ్మలు వినుకొండలోని మిషనరీ పాఠశాలలోనే చదువుకున్నారు. విద్యార్థులుగా ఉన్నప్పుడే వీరి మధ్య స్నేహం చిగురించింది. ఆ తర్వాత ప్రేమగా మారి వివాహానికి దారి తీసింది. గుర్రం వీరయ్య, యాదవ కులానికి చెందిన వాడైనా బాప్తిస్మం తీసుకొని క్రైస్తవ్యం స్వీకరించి లింగమ్మను వివాహం చేసుకున్నారు. ఆ తరవాత బైబిల్ ట్రైనింగ్ పూర్తి చేసిన వీరయ్య వినుకొండలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఉన్న మిస్సమ్మ తోట ఆవరణలో బాప్టిస్ట్ చర్చి ఏర్పాటు చేసిన వసతి గృహంలో నివసిస్తూ క్రైస్తవ మత బోధకుడిగా పనిచేసేవారు. వినుకొండలోని ఏబీఎన్ కాంపౌండ్ లో మిస్సమ్మ తోట ఆవరణలోనే జాషువా జన్మించారు. తండ్రి బోధనలు వింటూ చర్చి వాతావరణంలో జాషువా పెరిగారు. జాషువా మొదటి గురువు తన తండ్రి వీరయ్య. జాషువా ప్రాథమిక విద్య వినుకొండలోని మిషన్ పాఠశాలలో, టీచర్ ట్రైనింగు బాపట్లలోని అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ హయ్యర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ స్కూల్లో జరిగింది.

టీచర్ ట్రైనింగ్ అనంతరం వినుకొండకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చాటగడ్డపాడు(తండ్రి వీరయ్య స్వగ్రామం) లో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కావ్యరచన ప్రారంభించారు. తక్కువ కాలంలోనే మంచి కవిగా గుర్తింపు తెచ్చుకొని " కులమతాల గీచుకున్న గీతల జొచ్చి, పంజరాన గట్టువడను నేను..." అంటూ విశ్వ నరుడిగా ఎదిగారు. క్రైస్తవ్యం పట్ల ఉన్న ప్రేమ, జాషువా లోని దైవభక్తి రెండూ తన చిరకాల కోరిక అయిన క్రీస్తుచరిత్ర రాయడానికి ప్రేరణఅయ్యాయి. జాషువా రచించిన ప్రతి కావ్యం ఎంతో గొప్పదైనప్పటికీ, క్రీస్తు చరిత్ర కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

**క్రీస్తు చరిత్ర – జాషువా దృక్పథం**

జాషువాకి ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన 'గబ్బిలం' కావ్యం 117 పద్యాల్లో ఉంటుంది. క్రీస్తుచరిత్ర కావ్యం 530 పద్యాలలో ఉంది. "కళాభిరుచిగల ఆధునిక యువక్రైస్తవ లోకానికి ఈ కావ్యం రుచిస్తుందనే ధైర్యం నాకున్నది." [4] అని క్రీస్తుచరిత్ర ముందుమాటలో జాషువా చెప్పారు. దీనిని బట్టి క్రీస్తుచరిత్ర కావ్యం ఎంతో సుదీర్ఘంగా, వివరంగా, బైబిల్ మొత్తాన్నీ ఆకలింపు చేసుకొని ఎంతో ఓర్పు, నేర్పుతో చందోబద్ధమైన గొప్ప కావ్యంగా జాషువా మలిచారని అర్థమవుతుంది. క్రీస్తుచరిత్ర కావ్యం పాత నిబంధన గ్రంథంలోని సృష్టితో మొదలవుతుంది. మొదటి పది పద్యాలలో సృష్టి ఎలా మొదలైంది అనే వివరణ ఉంటుంది. ఆ తరువాత కావ్యము మొత్తం బైబిల్ లోని కొత్త నిబంధన గ్రంథం ఆధారంగా క్రీస్తు జననం, క్రీస్తు బాప్తిస్మం పొందడం, క్రీస్తు చేసిన అద్భుతాలు, క్రీస్తు బోధనలు, చివరి రాత్రి విందు, శిష్యులకు సందేశం, క్రీస్తును శిలువ వేయడం, ఆరోహణముతో కావ్యము ముగుస్తుంది. ఈ ఘట్టాలన్నీ బైబిల్‌లోని మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తల ఆధారంగా రాసినవి. క్రీస్తుచరిత్ర కావ్యం పరిశీలిస్తే జాషువాలోని మానవతా దృక్పథం అర్థమవుతుంది.

క్రీస్తుచరిత్ర కావ్యంలో సమరయ స్త్రీతో క్రీస్తు జరిపిన సంభాషణ ఉంటుంది. ఆ కాలంలో యూదులు అనేవారు సమరయుల్ని అస్పృశ్యులుగా భావించేవారు. అలాంటి సమరయ స్త్రీని తాగడానికి నీళ్లు ఇవ్వమని క్రీస్తు అడుగుతారు. దానికి ఆమె నిరాకరిస్తుంది. తాను అంటరానివారమని క్రీస్తుతో చెబుతుంది. అప్పుడు క్రీస్తు ఇలా అంటారు..

**మ. జలముల్, వాయువు, నగ్నియున్ బరమ రాజన్యుండు, భూలోక వా**
**సులకుం బంచి యొసంగిపోయిన స్థిరాస్తుల్, స్పృశ్యతాస్పృశ్యతల్**
**కులగోత్రాలు ప్రపంచసభ్యతకు సిగ్గుంజేటు జుమ్మిమ్మహా**
**కలుషంబెల్లమహా పదార్థములకున్ గల్పింతు రల్పాశయుల్**

(129 వ పద్యం)

"నీరు, గాలి, నిప్పు అనేవి భూలోక వాసులకు భగవంతుడు పంచి యిచ్చిన స్థిరాస్తులు. తాకనీయటం, తాకనీయకపోవటం, కులగోత్రాలు, ఇవన్నీ ప్రపంచ సభ్యతకు సిగ్గు చేటైన విషయాలు సుమా! ఈ మహా పాపాన్ని పంచభూతాలకు సైతం అల్పబుద్ధులు కల్పిస్తున్నారు."[5] అంటూ క్రీస్తు చెపుతారు. ఈ పద్యంలోని భావాన్ని గమనిస్తే జాషువా మొదటి నుంచి ఆకాంక్షించిన సమానత్వమనే భావనలు కనిపిస్తాయి. ఈ పద్యం ద్వారా జాషువాలోని మానవతా దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఏసుక్రీస్తు తన బోధనలను వినడానికి ప్రజలను కొండ మీదకి ఆహ్వానిస్తారు. కొండమీద ఏసుక్రీస్తు చేసిన ప్రసంగం ఎంతో గొప్పది. ప్రేమ, దయ, కరుణ వంటి భావనలతో కూడిన ఉపమానాలను క్రీస్తు తన అనుచరులకు బోధిస్తారు. ఏసుక్రీస్తు బోధనలన్నీ ప్రేమతో కూడినవి. ఈ బోధనలనే క్రీస్తుచరిత్ర కావ్యంలో పర్వతము మీద ప్రసంగము అనే ఘట్టంగా జాషువా రచించారు. క్రొత్త నిబంధన గ్రంథంలోని మత్తయి సువార్తలో "మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థన చేయుడి" [6] అని రాసి ఉంది. దీనినే జాషువా తనదైన శైలిలో ఛందోబద్ధమైన పద్య కావ్యంగా మలిచారు..

**కం. ప్రేమించు వారి మరలం**
**బ్రేమించిన ఫలములేదు ద్వేషించునరున్**
**బ్రేమింపు డపుడు మోక్ష**
**స్వామి సమక్షమున గొప్పఫలము లభించున్**

(154 వ పద్యం )

"ప్రేమించేవాళ్ళను మళ్ళీ ప్రేమించడం వల్ల ప్రయోజనం లేదు. ద్వేషించే మానవుడిని ప్రేమించినప్పుడు, మోక్షాన్నిచ్చే భగవంతుని సమక్షంలో గొప్ప ఫలితం ఉంటుంది." [7] క్రీస్తు చెప్పిన మాటనే జాషువా పద్య రూపంలో పాఠకుల హృదయాన్ని తాకేలా ఎంతో గొప్పగా చెప్పారు. ఈ పద్యంలోని భావాన్ని గ్రహిస్తే జాషువా లోని ప్రేమతత్వం, ప్రేమ దృక్పథం గ్రహించవచ్చు.

క్రీస్తు శిలువ వేయబడడానికి ముందు చివరిసారిగా తన శిష్యులతో భోజనం చేస్తూ సహోదర ప్రేమ గురించి ఎన్నో బోధలు చేస్తారు. ఇందులో ప్రేమ గురించి తన శిష్యులకు చెప్పిన బోధను జాషువా ఓ కందపద్యంలో ఇలా చెబుతారు..

**కం. ప్రేమించు కొనుం డొండొరు**
**ప్రేమించితి మిమ్ము నట్లు ప్రేమించుటయే**
**క్షేమంబగు నా తండ్రిన్**
**బ్రేమించినవాడు నన్ను ప్రేమించు నిలన్**

(407 వ పద్యం)

"మీరు ఒకరినొకరు ప్రేమించుకోండి. నేను మిమ్మల్ని ప్రేమించాను. అలా ప్రేమించటమే క్షేమకరం. ఈ భూమిమీద నా తండ్రిని ప్రేమించేవాడు నన్ను కూడా ప్రేమిస్తాడు."[8] అంటూ ప్రేమ తత్వాన్ని తన శిష్యులతో పంచుకుంటారు. పవిత్ర బైబిల్ గ్రంథంలో సువార్తికులు రచించిన గ్రంథాలలో, అధ్యాయాల్లో, వచనాల్లో ఎన్నో మర్మాలు దాగి ఉంటాయి. ఈ తాత్విక భావనను జాషువా అర్థం చేసుకుని క్రీస్తుచరిత్రను ఛందోబద్ధ కావ్యంగా తెలుగు ప్రజల ముందు ఉంచడం ఎంతో గొప్ప విషయం. అందుకే క్రీస్తుచరిత్ర కావ్యాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది.

**ముగింపు**

జాషువా తన చిన్నతనం నుంచే సమాజాన్ని అర్థం చేసుకున్నారు. సమాజంలోని అంతరాలను సున్నితంగా విమర్శించారు. "నిఖిల లోక మెట్లు నిర్ణయించిన, నాకు తరుగు లేదు, విశ్వనరుడ నేను" అని ప్రకటించుకున్నారు. ప్రకృతిని చూసి జాషువా ఎంతగా పులకించి పోయారో సమాజంలోని అసమానతలను చూసి అంతగా వేదన చెందారు. జాషువాలో దేశభక్తి, దైవభక్తి రెండు మెండుగా కనిపిస్తాయి. తన చిరకాల కోరికైన క్రీస్తుచరిత్ర కావ్యాన్ని జాషువా తన 68వ ఏట రచించారు. క్రీస్తుచరిత్ర

రచించిన తరవాత మరో మూడేళ్ల వరకు ఏ కావ్యాన్ని రచించలేదు. దీనిని బట్టి జాషువాలో క్రీస్తుచరిత్ర కావ్యం రాయాలన్న బలమైన సంకల్పం ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. క్రీస్తుచరిత్ర కావ్యాన్ని పరిశీలిస్తే జాషువాలోని ప్రేమ దృక్పథం, సామాజిక దృక్పథం, మత, తాత్విక దృక్పథం అర్థం చేసుకోవచ్చు.

**పాద సూచికలు**

1. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, ఎమెస్కో ప్రచురణలు, పుట 25
2. జాషువా సాహిత్యం దృక్పథం – పరిణామం, డా. ఎండ్లూరి సుధాకర్, పుట 29
3. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, ఎమెస్కో ప్రచురణలు, పుట 25
4. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, ఎమెస్కో ప్రచురణలు, పుట 25
5. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, ఎమెస్కో ప్రచురణలు, పుట 69
6. పరిశుద్ధ బైబిల్ గ్రంథము, క్రొత్త నిబంధన, మత్తయి సువార్త, 6వ అధ్యాయము, 44 వ వచనం
7. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, ఎమెస్కో ప్రచురణలు, పుట 77
8. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, ఎమెస్కో ప్రచురణలు, పుట 150

**పరిశీలించిన పుస్తకాలు**

1. క్రీస్తు చరిత్ర, గుర్రం జాషువా
2. పరిశుద్ధ బైబిల్ గ్రంథం
3. క్రీస్తు చరిత్ర, ప్రసిద్ధ ఆధునిక కావ్యాలు, వ్యాఖ్య : బూదాటి వెంకటేశ్వర్లు, ఎమెస్కో ప్రచురణ
4. జాషువా సాహిత్యం దృక్పథం – పరిణామం, డా. ఎండ్లూరి సుధాకర్, ప్రజాశక్తి బుక్ హౌస్
5. చెప్పులు కుడుతూ కుడుతూ, ఎమ్మా రోషాంబు క్లౌ, తెలుగు అనువాదం : వివిన మూర్తి, పల్లవి పబ్లికేషన్స్

# అమృతం కురిసిన రాత్రి - తిలక్ కవిత్వం

**డా. సారిక విజయలక్ష్మి,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతంపేట, పార్వతీపురం, మన్యం జిల్లా.

**ఉపోద్ఘాతం :** కవితా సతి నుదుట నిత్య రసగంగాధర తిలకంగా ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందిన తిలక్ పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకా మండపాక గ్రామంలో 1921 ఆగస్టు 1న జన్మించాడు. తిలక్ "ఎంత సుకుమారుడో అతని కవిత అంత నిశితమైనది. భాష ఎంత మెత్తనిదో భావాలు అంత పదునైనవి." ఆధునిక జీవితాన్ని అభివర్ణించడానికి వచన గేయాన్ని ఎంచుకున్నాడు. అది అతని చేతిలో ఒక ప్రత్యేక సౌందర్యాన్ని సంతరించుకుంది.

మొదట దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతోనూ, తర్వాత శ్రీశ్రీ ప్రభావంతోనూ కవిత్వం వ్రాసినా వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభా సంపదతో ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్ళిన ప్రముఖుడు తిలక్. తిలక్ సృజన శక్తి సర్వతోముఖంగా విజృంభిస్తున్న సమయంలో "అప్పుడే వికసించిన మల్లెపువ్వులా ఉండే తిలక్ వాడకుండానే, వాసన వీడకుండానే నలభై అయిదేళ్ళ నడి ప్రాయాన 1966 జూలై 1న అనారోగ్యంతో రాలిపోయాడు.

**బాలగంగాధర తిలక్ కవితా దృక్పథం:** తిలక్ "అమృతం కురిసిన రాత్రి" కవితా సంకలనం ద్వారా సామాజికమైన తన ఆలోచనలని కవిత్వీకరించి కవిత్వానికే సార్థకత కలిగించాడు. "ఆధునిక వచన కవిత్వానికి ప్రాణం పోసినవాడు తిలక్" అంతకముందు "ఒక మట్టి బొమ్మను దేవాలయంలో ప్రతిష్ఠ చేశారు. కానీ అది తిలక్ వాణి స్పర్శ తగిలే వరకు పలకలేదు. ఆయనను చూడగానే కేరింతలు కొడుతూ ఆటలాడింది..." అప్పటికి గానీ వచన కవిత్వానికి ఒక స్థాయి రాలేదు. గౌరవం లభించలేదు... (కుందుర్తి).

తిలక్ రచించిన "వచన గేయం" పరిమళభరితమైన బంగారు తీగలాగ సాగి ఆయన పనితనపు సామర్థ్యానికి లొంగి రసజ్ఞుల కంఠాభరణమై వాసికెక్కింది."

బాలగంగాధర్ తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంకలనాన్ని పాఠక మహాశయులకు వివరణాత్మకంగా పరిచయం చేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**అమృతం కురిసిన రాత్రి – కవితాధ్యయనం :** "అమృతం కురిసిన రాత్రి" తిలక్ చే రచించబడిన ఒక ప్రసిద్ధ తెలుగు కవితా సంపుటి. తిలక్ మరణానంతరం కుందుర్తి ఆంజనేయులు పీఠికతో 1968లో ముద్రణ పొందిన "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటి "ఉత్తమ కవితా సంపుటి"గా 1971లో "కేంద్ర సాహిత్య అకాడమీ" అవార్డు పొందింది. ఈ కవితా సంకలనంలో ప్రతీ కవితా ఖండిక స్వయం సంపన్న. దేనికదే చదివి ఆనందింపదగినది. ఒకదానితో మరొకటి వస్తు బాంధవ్యము లేనిది.

**నా కవిత్వం :** "అమృతం కురిసిన రాత్రి" కవితా సంకలనంలోని మొదటి కవిత "నా కవిత్వం" అనే శీర్షికతో ప్రచురితమైనది. ఈ గేయం 1941లో రచించబడినది. అప్పటికే విభిన్న రాజకీయ ధోరణులు సాహిత్య రంగంలోకి ప్రవేశించాయి. ముఖ్యంగా అభ్యుదయ కవులు రాజకీయ ప్రభావాలకు లోనై తమ తమ కవిత్వంలో ఆయా ధోరణులను వ్యక్తపరచటం ప్రారంభమైనది. నిబద్ధ కవితలు విరివిగా ప్రచురితమయ్యాయి. అయితే రాజకీయ పక్షాలకు రచయిత దాసోహం కావడం తిలక్ గారి సమ్మతం కాదు. ఆ భావనే ఈ కవితా ఖండిక పరోక్షంగా వ్యక్త పరుస్తుంది.

**"నా కవిత్వం కాదు ఒక తత్వం**
**మరి కాదు మీరు అనే మనస్తత్వం**
**కాదు ధనికవాదం, సామ్యవాదం**
**కాదయ్యా అయోమయం, జరామయం"**
**"నా అక్షరాలు కన్నీటి జనులలో తడిసే దయాపారావతారాలు**
**నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"[1]**

తన కవిత్వాన్ని పైన పేర్కొనిన (తొలి గేయంలో) తన కవితా శక్తినంతా కరుణ శృంగారాలతో నింపి విశ్వ శ్రేయస్కరం చేశాడు. "కరుణ"కు "దయాపారావతారాల"ను, "శృంగారాని"కి "అందమైన ఆడపిల్లల"ను, "విశ్వ శ్రేయస్సు"కు సూచనగా "విజయ ఐరావతాల"ను ప్రతీకలుగా (సంకేతాలుగా) చిత్రించాడు తిలక్.

**ఆర్త గీతం :** మరో అద్భుతమైన కవితా ఖండిక "ఆర్తగీతం". ఇది ఒక హృదయ విదారకమైన కవిత. ఈ కవిత చదువుతున్నప్పుడు దేవులపల్లి రచన "ఏడ్వనీండి నన్ను" మనకు స్ఫురిస్తుంది. కానీ ఈ రెండు కవితలలో చాలా వ్యత్యాసమున్నది. తిలక్ హృదయ వ్యధకు దారి తీసిన కారణాలు పాఠకుణ్ణి సహితం అత్యంత వేదనకు గురిచేస్తాయి. కవితలోని కొన్ని భాగాలు. ....

**"నా దేశాన్ని గూర్చి పాడలేను**
**నీ ఆదేశాన్ని మన్నించలేను**
**ఈ విపంచికకు శృతి కలుపలేను"**
**"ఈరోజు నాకు విషాదస్మృతి**
**విధి తమస్సులు మూసిన దివాంధరుతి**
**నా ఎడద మ్రోడైన ఒక దుస్థితి"[2]**

తాను చూచిన దృశ్యాలను హృదయానికి హత్తుకునేలా చిత్రించాడు తిలక్. "ఆర్తగీతం" కవితను సూక్ష్మంగా పరిశీలిస్తే తిలక్ మానవ కవి అనీ, మానవ ధర్మం త్రికరణ శుద్ధిగా పాటిస్తారనే నమ్మకం పాఠకులందరిలోనూ దృఢమౌతుంది. తిలక్ కోరుకునే దేశం ప్రాణమున్న మనుష్యులతో నిండినది. ఆ దేశంలోని మనుషులకు ఆయన కోరుకునేది... కడుపునిండా ఆహారం, బ్రతుకు పొడవునా స్వతంత్రం, కొంచెం పుణ్యం, కాస్త పాపం, కొంత కన్నీరు, మరికొంత సంతోషపు తేనీరు"! ఈ అవసరాలన్నీ తీరే కాలమెప్పటికైనా వస్తుందా? అని ఆయన మనోవ్యధ! దీనిని గురించి "అటు దేవునికీ ఇటు మనిషికీ తగిన జవాబు ఇవ్వలేక" తన నిస్పృహను వ్యక్తపరిచాడు.

**తపాలా బంట్రోతు :** 1959లో తంగిరాల వెంకట సుబ్బారావు అనే మిత్రుడు జిల్లా తపాలా శాఖ జరుపుకునే వార్షికోత్సవానికి పోస్టుమాన్ మీద ఏదైనా గేయం వ్రాయమని కోరగా తిలక్ రాసి యిచ్చిన గేయం ఈ కవితా ఖండిక. పోస్టమాన్ అంటే తిలక్ హృదయంలో ఏర్పడిన భావతరంగాలకు అక్షర రూపకల్పన ఈ గేయం....

**"ఎండలో వానలో ఎండిన చివికిన**
**ఒక చిన్న సైజు జీతగాడు**
**చెవిలో పెన్సిల్ చేతిలో సంచి**
**కాకీ దుస్తులు అరిగిన చెప్పులు**
**ఒక సాదాసీదా పేదవాడు**
**ఇంటింటికీ వీధి వీధికీ**
**ప్రతిరోజూ తిరిగేవాడు- ప్రైమ్మినిస్టరా ఏం?"[3]**

పోస్టుమాన్ గురించి చెప్పేదేముంటుంది? అంటూనే చెప్పదల్చుకున్నదంతా మనసు కదిలించేలా చెప్పటం ఈ కవితలో విశేషం. అది తిలక్ కే సాధ్యం.

**"ఉత్త పోస్టుమాన్ మీద ఊహలు రానే రావు..."** అంటూనే **"ప్రైమ్మినిస్టరా ఏం?"** అని ప్రశ్నించడంలో ఉంది చమత్కారం!

**"వర్తకుడికి, నర్తకుడికి ఖైదులో దొంగకి హంతకుడికి**
**ఉద్యోగశప్తుడైన నవీన యక్షునికి**
**మనిషికి రాక్షసునికి..."[4]** అంటూ ఉత్తరాలు అందుకునే వారిలోని వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాడు.

"తపాలా బంట్రోతు" కవిత చివరికొచ్చేసరికి చాలా హృద్యంగా అనిపిస్తుంది. **"ఇన్ని కళ్ళు పిలిచినా ఒక్క నయనం నీ కోటు దాటి లోపలకు చూడదు"[5]** అని ఎంత వాస్తవికంగా ఎంత గొప్పగా చెప్పాడో కదా తిలక్! ముఖ్యంగా ముగింపులోని రెండు పంక్తులూ పోస్టుమాన్ జీవన సరళికి గొప్ప కవితాత్మక నివాళి!

**"ఉత్తరం యిచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్ళిపోయే నిన్ను**
**చూసినపుడు**
**తీరం వదిలి సముద్రంలోకి వెళ్లిపోతున్న ఏకాకి నౌక చప్పుడు"[6]**

"ఎంతటి రమ్యమైన ఊహ! ఇటువంటి కవిత తిలక్ ముద్రతోనే సాధ్యం! ఇంతటి మహత్తర కవితను తిలక్ మాత్రమే సృష్టించగలడు"!

**అమృతం కురిసిన రాత్రి :** "అమృతం కురిసిన రాత్రి" గేయం 1962వ సంవత్సరంలో రచించినది. ఇది ఆత్మాశ్రయ కవిత. కవి ఊహాలోకంలో విహరిస్తూ పొందిన అనుభూతి పరంపర. అత్యంత ఆహ్లాదకరంగా తనను తాను వ్యక్తీకరించుకొనిన వివరణ.

అది రమణీయమైన రాత్రి. ప్రకృతి అంతా తియ్యదనముతో నిండి అమృతాన్ని వెదజల్లుతున్నది. అమృతం కురిసిన రాత్రి జనులందరూ నిద్రపోతున్నారు. ఆ సమయంలో కవి పయనం సాగుతుంది, ఎక్కడికో దూరంగా కొండ దాటి, కోన దాటి వెన్నెల మైదానంలోకి.

ఆ కవితా సమయ వర్ణనలు.....

**"ఆకాశం మీద అప్సరసలు**
**వయ్యారంగా పరుగులెత్తుతున్నారు**
**వారి పాదాల తారా మంజీరాలు**
**ఘల్లుఘల్లని మ్రోగుతున్నాయి"**
**-----------------**
**"నన్ను చూసి చూసి కిలకిల నవ్వి ఇలా అన్నారు**
**చూడు వీడు అందమైన వాడు**
**ఆనందం మనిషైనవాడు**
**కలలపట్టు కుచ్చులూగుతూన్న కిరీటం ధరించాడు"[7]**

**"అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నారు**
**అలసి నిత్యజీవితంలో సొలసి సుషుప్తి చెందారు.**
**అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు**

**ఆ ధైర్యంలో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు**
**అనంత చైతన్యోత్సవాహ్వానాన్ని వినిపించుకోలేకపోయారు**
**అందుకే పాపం**
**ఈనాటికీ ఎవరికీ తెలియదు**
**నేను అమరుడనని!"[8]**

"వెన్నెల్లో నడుస్తున్నట్లు... అమృతం త్రాగినట్లు మనమూ అమరులం అయినట్లు అనుభూతిని ఇచ్చే కవిత "అమృతం కురిసిన రాత్రి". స్వగతంగా గడిచిన ఈ కవితలో ఆత్మ ఘోషను రంగరించి ఆధ్యాత్మికతను చొప్పించాడు తిలక్. అద్భుతమైన అనుభూతిని పాఠకులతో పంచుకున్నాడు. అందుకే కాబోలు ఈ కవితనే సంకలనానికి శీర్షికగా ఎంచుకున్నాడు!

**ముగింపు :** తిలక్ ప్రగతిశీలుడైన మానవతావాది. వ్యావహారిక భాష, రసదృష్టి, వాస్తవికత దృక్పథం, అనితర సాధ్యమైన శైలి తిలక్‌లో మనకు గోచరించే కొన్ని కోణాలు. ఆధునిక కవితాయుగంలో కావ్య వస్తువు పరిధిని విస్తృతపరచి, సర్వ జీవిత తరంగాలకు వ్యాపింపజేసి, సంకుచితమైన జాతి, మత సరిహద్దులను చెరపివేసి అకుంఠిత మానవీయ పతాకాన్ని ఎగురవేసిన అభ్యుదయవాది తిలక్.

భావ కవిత్వంలోని భావ సౌకుమార్యం, భాషామార్దవం, అభ్యుదయ కవిత్వ లక్షణాలతో కలిసి వెలసిన తిలక్ కవిత్వం అభ్యుదయ భావ కవిత్వాల కలనేత.

**పాద సూచికలు :** "అమృతం కురిసిన రాత్రి"– 'కవితా సంపుటి'– దేవరకొండ బాలగంగాధరతిలక్

1. నా కవిత్వం, పుట. 1
2. ఆర్తగీతం, పుట. 43
3. తపాలా బంట్రోతు, పుట. 59.
4. తపాలా బంట్రోతు, పుట. 60
5. తపాలా బంట్రోతు, పుట. 61
6. తపాలా బంట్రోతు, పుట. 61
7. అమృతం కురిసిన రాత్రి, పుట. 81
8. అమృతం కురిసిన రాత్రి, పుట. 82

**ఉపయుక్త గ్రంథసూచి**

1. అమృతం కురిసిన రాత్రి – కవితా సంపుటి, దేవరకొండ బాలగంగాధర తిలక్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ – 500001, ఆంధ్రప్రదేశ్.

**గమనిక :** ఈ వ్యాసంలోని అభిప్రాయాలు రచయిత వ్యక్తిగతం. ఈ వ్యాసానికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.

# నార్లవారి 'సీత జోస్యం' హేతువాద దృక్పథం

**డా. ఎం. వెంకట గౌరి,** తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వ కళాపరిషత్, విశాఖపట్నం

**వ్యాస సంగ్రహం**

తెలుగు నాటకాలలో మొట్టమొదటిగా కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు అందుకున్న తెలుగు నాటకం "సీత జోస్యం". దీని రచయిత నార్లవెంకటేశ్వరరావు. వీరు రాసిన రెండు నాటకాలు రామాయణానికి సంబంధించినవి. వాటిలో బాగా పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన నాటకం 'సీతజోస్యం'. నిజానికి ఇది రామాయణానికి విమర్శనాత్మకంగా వచ్చిన నాటకంగానే చెప్పొచ్చు. ఈ రచనకు 1981 లో కేంద్రసాహిత్య అకాడెమీ పురాస్కారం లభించింది. ఈ నాటకం కేవలం 30 పుటలు మాత్రమే. కానీ ఈ నాటకానికి 'ఉపక్రమణిక' పేరుతో రాసిన పీఠిక మాత్రం 124 పుటలు ఉంటుంది. పేరుకే నాటకం అయినా, రామాయణాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించడానికే అన్నట్లు ఈ పీఠిక రాయబడింది. ఈ పీఠికలో రామాయణం, మహాభారతం, అష్టాదశ పురాణాలు వీటన్నిటి ప్రధాన ధ్యేయం వర్ణధర్మ రక్షణ, రాచరిక వ్యవస్థ రక్షణ అంటారు నార్లవారు. ఆద్యాంతం ఈ నాటకం అంతా హేతువాద దృక్పథంతోనే రాయబడింది. కాబట్టి ఇలాంటి గ్రంథానికి కేంద్ర సాహిత్య పురస్కారం లభించిందంటే ఏదో ఒక ప్రత్యేకత ఉంటేనే అది సాధ్యమవుతుంది. ఆ ప్రత్యేకతే రామాయణాన్ని హేతువాద దృక్కోణంలో చూడటం. ఈ విధంగా సాగిన ఈ నాటకాన్ని విశ్లేషించి పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**కవి పరిచయం**

నార్ల వెంకటేశ్వరరావు డిసెంబర్ 1, 1908లో జన్మించారు. వీరు బి.ఏ. పట్టభద్రులు, పత్రికా సంపాదకులుగా అఖిలాంధ్ర ప్రజానీకానికి, రచయితగా యావద్భారతావనికి సుపరిచితులు. ఈయన రచనలన్నీ ఇంచుమించు హేతువాద కోణంలోనే దర్శనమిస్తుంటాయి. ఈయన రచనలు ప్రజలకు ముఖ్యంగా యువతకు కొత్త రూపును, చూపును తెచ్చాయనడంలో సందేహం లేదు మరియు ఉత్తేజితుల్ని కావించాయి. సామాన్యుల జీవితాలనూ, పల్లెటూరి వాతావరణాన్ని చక్కగా చిత్రించిన వీరి "కొత్త గడ్డ" నాటకాల సంపుటి ఆంధ్రుల జీవితాలకు అద్దం పడుతుంది. 'కొత్త పాత', 'నార్లవారి మాట', 'కదంబం' మొదలైన రచనలు ఈయనకు మంచి పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి.

వేంకటేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. వీరు అన్ని రంగాల్లోనూ అమితమైన జ్ఞాన సముపార్జన చేసిన ప్రజ్ఞాశాలి. అందుకే 'నవ మేధావి నార్ల' అని ప్రముఖుల చేత, విమర్శకుల చేత ప్రస్తుతించబడ్డారు. సంస్కృత సాహిత్యాన్ని సమూలంగా ఆకళింపు చేసుకున్న నార్లకు వేద సాహిత్యంపై, పౌరాణిక గాథలపై నిర్థిష్టమైన అభిప్రాయాలున్నాయి. వివేచనా జ్ఞానానికి అవరోధంగా నిలిచిన వైదిక సాహిత్యం చుట్టూ సమాజం పరిభ్రమించడాన్ని నిశితంగా విమర్శించారు వీరు.

నార్లవారి రచనల్లో పౌరాణిక రూపకాలైన 'జాబాలి', 'సీత జోస్యం', 'నరకంలో హరిశ్చంద్రుడు', 'హిరణ్యకశిపుని హత్య' మొదలైన రూపకాలు సంప్రదాయ సాహిత్యానికీ, హైందవ సంప్రదాయాలకూ సవాలుగా నిలిచాయి. నార్ల వారిని నవమేధావి అని ఋజువు చేయడానికి హేతువాద దృక్పథంతో రాసిన పౌరాణిక రచనలు ప్రబల తార్కాణాలు అని చెప్పడంలో

అతిశయోక్తి లేదు. ఆంగ్ల సాహిత్యంతో అమితమైన పరిచయం ఉండడం వల్ల, పత్రికా సంపాదకుడిగా పనిచేయడం వల్ల భావంలో తీవ్రత, వ్యక్తీకరణలో స్పష్టత నార్ల వారి రచనల్లో కనిపిస్తాయి.

వేద సాహిత్యంపై, పౌరాణిక గాథలపై నార్ల వారికి కొన్ని నిర్ధిష్టమైన అభిప్రాయాలున్నాయి. దీనికి కారణం భారతీయుల జీవన ప్రవంతిలో అవి ప్రముఖ పాత్ర వహించడమే. వివేచనా జ్ఞానానికి అవరోధంగా నిలిచిన వైదిక సాహిత్యం చుట్టూ సమాజం పరిభ్రమించడాన్ని నార్ల నిశితంగా విమర్శించారు. నార్ల రచనల్లో భావ విప్లవ పరిధి మిక్కిలి విస్తారమైంది. వీరిపై కూడా కవిరాజు ప్రభావం ఉందని చెప్పవచ్చు.

ప్రతిభాపాటవాల దృష్ట్యా, దృక్పథ ప్రాధాన్యం దృష్ట్యా నార్ల సాహిత్యాన్ని వేలెత్తిచూపే అవకాశమే లేదు. ముఖ్యంగా వీరి 'జాబాలి', 'సీత జోస్యం', 'నరకంలో హరిశ్చంద్రుడు' మొదలైన రూపకాలు భావ విప్లవ స్ఫోరకాలు.

**సీత జోస్యం నాటకం – మూలం**

ప్రఖ్యాతం కాబడిన నాటకాలకు మూలమున్నట్లే నార్లవారి 'సీతజోస్యం' నాటకానికి మూలం ఉంది. రామాయణంలోని అరణ్యకాండలో 9, 10 సర్గలలో విస్తరించిన సీతకు సంబంధించిన కథను తీసుకుని దానిని విస్తరించి విమర్శనాత్మక ధోరణిలో ఈ నాటకాన్ని రాశారు.

**మూలంలోని సీత కథ**

రాముడికి పట్టాభిషేకం జరగబోయే తరుణంలో కైక భరతుడికి పట్టం కట్టమని, రాముడ్ని అడవులకు పంపమని దశరథుడ్ని కోరుతుంది. రాముడు సీత, లక్ష్మణులతో సహా వనవాసానికి వెళ్తాడు. అక్కడ యజ్ఞాలకు విఘ్నం కలిగిస్తున్న రాక్షసుల్ని సంహరించమని ఋషులు కోరగా, రాముడు దానికి పూనుకుంటాడు. జన్మస్థానంలోని ప్రజల్ని వైరం లేకుండా వధించడం మంచిది కాదని, అనేక రకాల ధర్మ ప్రబోధం చేస్తుంది సీత. సీత విన్నపాన్ని లెక్క చేయక మునుల్ని రక్షించడం తన ధ్యేయమని, వారికిచ్చిన మాట నిలబెట్టుకుంటానని అంటాడు రాముడు. ఈ కథనే విస్తృతపరచి చక్కని భావ విప్లవ స్ఫోరక రూపకంగా మలచారు నార్ల. ఇందులో సీత ప్రధాన పాత్రధారి. కథా సన్నివేశాల్లో అనేక మార్పుల్ని చేయడమే కాకుండా తిరుగుబాటు ధోరణిలో సీత దర్శనమివ్వడం ఈ రూపకంలోని ప్రధాన విశేషంగా చెప్పవచ్చు.

**సీత జోస్యం నాటకం –హేతువాద దృక్పథం**

నార్ల దృష్టిలో రామాయణం ఓ కల్పిత గాథ. అందుకే 'రామాయణంలో అసంభవ విషయాలు, అభూత కల్పనలు పెక్కులున్నా వాటికి ఆధారం ఏ స్వల్పంగానో లేకుండా లేదు' అంటారు రామాయణ వ్యాఖ్యానంలో పండిట్ మిశ్ర. ఈ నాటకం తెలుగు సాహిత్యంలో మిక్కిలి దుమారాన్ని రేపింది. దీనికి కారణం నార్ల సీతారాముల్ని దైవాంశ సంభూతులుగా కాక, కేవలం మానవ మాత్రులుగా భావించి, ఆ దృష్టితోనే ఆ పాత్రల్ని సృష్టించారు. ముఖ్యంగా సీతకు ఇందులో అధిక ప్రాధాన్యాన్నివ్వడం జరిగింది. అందుకే శ్రీ డి.రామలింగం దీనిపై వ్యాఖ్యానిస్తూ "సీత పాత్ర తిరుగుబాటుదారు వలె ఉంది. నార్ల వారు రామాయణాన్ని సీతాయణం చేశారు. అక్కడే తేడా వచ్చింది" అని అన్నారు. సీతారాముల వైఖరులు భిన్నంగా ఉండడానికి వాల్మీకి రామాయణంలోనే ఆధారం ఉందని, వాల్మీకి రామాయణంలోని సీతనే యధాతథంగా ప్రవేశపెట్టినట్లు రచయిత చెప్పుకున్నారు. నార్ల వారు జాబాలిలో తమ భావాల్ని, దృక్పథాన్ని జాబాలి ద్వారానే వ్యక్తీకరించడం ప్రత్యేకించి పేర్కొనతగ్గ విషయం.

సీత రామాయణ గతమైన అనేక అంశాల్ని సహేతుకంగా విమర్శిస్తుంది. సగరుని రెండో భార్యైన సుమతి భృగుమహర్షి వర ప్రభావం వల్ల నవ మాసాలు మోసి ఒక సొరకాయను కనగా దాన్ని పగలగొట్టగా వచ్చిన అరవై వేలమంది కొడుకుల్ని అరవై వేల ముంతలు తెప్పించి వాటిలో ఊరవేస్తూ వారిని అల్లారుముద్దుగా పెంచారు. తండ్రి మాట ప్రకారం సముద్రాన్ని వారు త్రవ్వుతూ పోగా భూమిని మోస్తుండే అష్టదిగ్గజాలు వారికి కనిపిస్తాయి. భక్తి పూర్వకంగా వాటి చుట్టూ ప్రదక్షిణ చేసి, వాటి కాళ్ళ కిందగా మరింత తవ్వుకుంటూ పోగా, వెయ్యి యోజనాల లోతున వారికి పాతాళలోకం తగిలింది.

ఈ కథ సీత లక్ష్మణుడితో మిక్కిలి వ్యంగ్యంగా, అందులోని అహేతుకమైన అంశాల్ని ఖండిస్తూ మాట్లాడుతుంది. అదే విధంగా ఇద్దరు ఋషులు సీతారాములు వనవాసం చేస్తున్న పర్ణశాలకు వస్తారు. అందులో రెండో ఋషి మొదటి ఋషిని గూర్చి పరిచయం చేస్తూ 'వారు వాలఖిల్య మహర్షులు. తాము వినే ఉంటారు. వాలఖిల్యు బ్రహ్మ రోమాల నుంచి జన్మించారని' అంటాడు. దానికి సీత 'ఔను వైఖాసనులు బ్రహ్మ దేవుని గోళ్ళ నుంచి పుట్టుకువచ్చారని విన్నాము. మరి తామెవరు? ఆయన చెమట చుక్కల నుండి ఊడిపడినవారు కారు గదా?' అని సీత వారిని పరిహాసిస్తుంది.

ఈ విధంగా సీత వారిని అవమానించడం అహేతుకమైన జన్మల్ని విమర్శించడమే. ఈ విధమైన సంభాషణల్ని ప్రవేశపెట్టడం ద్వారా పాఠకులకు రామాయణం కేవలం కల్పితగాథ అనే భావం కలుగుతుంది.

అతిథులుగా వచ్చిన ఋషులతో సీత మాట్లాడుతున్నంత కాలం లక్ష్మణుడు మర్యాదతో నిలబడే ఉన్నాడు. అప్పుడు సీత లక్ష్మణుడ్ని ఉద్దేశించి "నువ్వూ కూర్చో! మహర్షోత్తముల సెలవైందిగా తమ సమక్షంలో చేతులు జోడించి నిలబడలేదని శాపమేదో కలిగించరులే" అని పలకడంతో ఋషులు మిక్కిలి కోపిష్టులని, ప్రతి చిన్న విషయానికి విచక్షణారాహిత్యంగా శపిస్తుంటారనేదే ఇక్కడ సీత ఆంతర్యం.

త్రికాలజ్ఞులు, దివ్యదృష్టిగల ఋషులు రాముడు పర్ణశాలలో లేని సమయంలో వారి దర్శనం కోసం ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తుంది. ఋషులకు శపించే శక్తి ఉందని, అలాగే దివ్యదృష్టి ఉందని చెప్పడం కూడా మభ్యపెట్టడమేననే భావం ఇక్కడ వ్యక్తమౌతుంది.

అంతే కాకుండా దివ్యదృష్టికి గురువు గొప్పవారని చెప్పిన ఋషుల మాటలకు సమాధానంగా సీత "మీ గురుదేవుల శుశ్రూషతో తాము ద్వికాలజ్ఞులైనా అయి ఉండాలి. అయినా చూసిచూసి ప్రభువుల వారి దర్శనార్థం వారు లేనప్పుడు వేంచేశారేమో! ఇలాంటి క్షుద్ర విషయాలకు తాము తమ దివ్యశక్తులను వృథా చెయ్యరు కాబోలు" అని అంటుంది. ఇక్కడ కాలజ్ఞానంపై విమర్శే కాక, క్షుద్ర విషయాలకు దివ్యశక్తుల్ని వృథా చేస్తారనడంలో మన పురాణాల్లోని ఋషులకు అకారణంగా, స్వార్థం కోసం దివ్యశక్తుల్ని ప్రదర్శించే స్వభావంపై విమర్శ అంతర్లీనంగా కనిపిస్తుంది.

'రఘునందనులు ఈ భూమండలానికే ప్రభువులు' అన్న ఋషుల మాటలకు స్పందించిన సీత 'నాకు తెలియక అడుగుతున్నాగాని, ఈ భూమితోనే రఘు చక్రవర్తి పుట్టుకువచ్చాడా? రఘు చక్రవర్తి రాజ్యాలన్నీ ఇప్పుడు కోసల దేశ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నాయా? ఈ జనస్థానంపై దీని ప్రభువునకున్న సర్వసత్తాక ప్రతిపత్తిని గుర్తించడం మీకు మాకు అందరికీ క్షేమమేమో!' అని అంటుంది.

రాముడు కోసల దేశానికి రాజు గాని, మిగిలిన భూభాగాలకు రాజు కాదని, సీత ద్వారా వ్యక్తీకరించడంలో రాముడు దైవ స్వరూపుడుగా కాక మానవ మాత్రుడనే విషయాన్ని వ్యక్తీకరిస్తున్నాడు రచయిత.

రాక్షసులు క్రూర స్వభావులు కారని, వారు కోసల రాజ్యం లోనికి గాని, కాశీ రాజ్యం లోనికి గాని రాలేదనీ, అన్యాయంగా వారి సీమలోకి ఋషులే చొచ్చుకువచ్చి, వారి నివా స్థానాలకు చిచ్చుపెట్టి, బుగ్గిపాలు చేస్తున్నారని వివరిస్తుంది సీత. దానికి తమ హోమగుండాల్ని నీరుపోసి ఆర్పి, రాక్షసులే తమను వేధిస్తున్నారని ఋషులు అంటారు.

హోమగుండాల్ని మీరెందుకు వెలిగిస్తున్నారు? ఈ అడవులను కాల్చడానికి కాదా? వీటిని చదును చేసి, దున్నుకోవడానికి కాదా? అందువల్ల మీకు పంటలు పండవచ్చు, మీ గరిసెలు నింపవచ్చు, మీ సంసారాలు పచ్చగా ఉండవచ్చు. కాని ఇక్కడుండేవారి మాటేమిటి? వీరు కాయలేరుకుని, కందమూలాలు తవ్వుకుని బతకవలసినవారు కారా? పిట్టలను పట్టుకొని, జంతువుల్ని కొట్టుకొని పొట్టపోసుకోవలసిన వారు కారా? ఈ అడవుల్ని మీరు ధ్వంసం చేస్తే వారి బతుకులే ధ్వంసం కావా?" అని పలుకుతుంది సీత.

యజ్ఞాల పేరుతో అడవుల్ని కాల్చి, అందులో జీవించే రాక్షసులకు అన్నివిధాలుగా కీడు చేస్తుంది ఋషులేనని నిందించడం ద్వారా అన్ని కోణాల్లోనూ, సమాజ జీవనంపై నార్ల వారికి ఉన్న అవగాహన అర్థమవుతుంది.

ఒకానొక సందర్భంలో సృష్టికి ప్రతి సృష్టి చేయగల మీరు మిమ్మల్ని ఎందుకు రక్షించుకోలేకపోతున్నారని ఋషుల్ని ప్రశ్నిస్తున్నందుకు సీతను గద్దిస్తాడు రాముడు. దానికి 'మీరు గద్దించినా, మరి నేను మిన్నకుండేది లేదు, మిమ్ము ముఖస్తుతి చేసి, ఈ మునిముచ్చులు మీతో అమాయకులైన ఆటవికుల్ని అన్యాయంగా చంపిస్తున్నారు. వీరి మోసాన్ని కానలేరు మీరు" అని సీత నిర్భయంగా రాముడితో అంటుంది. అంతేకాకుండా అరణ్యవాసానికి వచ్చింది, ఆటవికుల్ని అతి దారుణంగా మారణాయుధాలతో వేటాడటం కోసం కాదని సీత రాముడికి హితవు చెపుతుంది. మునిగా జీవించదలచుకున్నవారు ఆయుధాల్ని త్యజించాలని సీత రాముడ్ని "ఆయుధానికి రక్త దాహం ఉంటుంది. అది నరబలిని కోరుతుంది. ఆయుధ ధారణ చేయగానే కారుణ్యమూర్తులైనా క్రూరులౌతారు. శాంతి ప్రియులైనా యుద్ధోన్మాదులౌతారు.

ముఖ్యంగా క్షత్రియుని చేతిలో ఆయుధాలుండరాదు. అవి అగ్నిహోత్రునికి సమీపంలో సమిధలుండడమే. మీ చేతిలో నిత్యం ఉంటున్న మీ ఆయుధాలే మిమ్ము హింసాకృత్యాలకు ప్రేరేపిస్తున్నాయి. నా ప్రార్థన మన్నించి కనీసం ప్రస్తుతానికైనా ఆయుధ విసర్జన చేయండి" అని అభ్యర్థిస్తుంది. ఇక్కడ యుద్ధోన్మాదాన్ని, మారణ హోమాల్ని వ్యతిరేకించడమే కాకుండా శాంతి కాముకతను, నిరాయుధీకరణ ఆవశ్యకతను చక్కగా వెల్లడించారు రచయిత.

పగ లేకుండా పరుల్ని చంపడం మంచిది కాదని, ఆటవికులు మనకు శత్రువులు కారని సీత రాముడితో "ఈ ఆటవికులకు మన పట్ల వైరం లేదు. మనతో వీరు ఏ విధమైన జోక్యం పెట్టుకోవడం లేదు. మనకు కించిత్తు అపకారమైనా తలపెట్టడం లేదు. మృగాలవలె వీరిని వేటాడ్డం దేనికి? రాక్షసులుగా వీరిని ఋషులు చిత్రిస్తూ ఉంటే నిజమేమో అనుకొన్నాను. కాని తీరా ఇక్కడికి వచ్చి చూస్తే, వీరు అన్నెం పున్నెం తెలియని ఆటవికులు, తమ బతుకు తాము బతకాలనే వీరు కోరుతున్నారు. నా మాట వినండి ఋషుల స్వార్థానికి వీరిని బలిపెట్టకండి" అని అంటుంది.

ఆర్య ఋషులు సంకుచిత స్వభావంతో ఆటవికుల్ని రాక్షసులుగా చిత్రించారని నిజానికి ఆటవికులు అమాయక జీవులనే నార్లవారి అభిప్రాయాల్ని ఈ రూపకాంతంలో సీత ద్వారా పలికించారు. ఈ రూపకంలో నాస్తికత్వం, హేతువాదం, మానవవాదం, సామ్యవాదం, జీవకారుణ్యవాదం మొదలైన దృక్పథాలు ఆయా సన్నివేశాల్లో కనిపిస్తాయి. ఆయా దృక్పథాల్లో అంతర్లీనంగా హేతుత్వ ధోరణి వెల్లడవుతుంది.

ఇలాంటి హేతువాద ధోరణి ఉన్న రంగనాయకమ్మ వ్యాఖ్యలు కూడా నార్లవారి విమర్శను సమర్థిస్తున్నట్లే ఉంటాయి. 'రామాయణం పురుషుల్ని సమర్థిస్తుంది, ధనవంతుల్ని, పై కులాలవారిని, రాచకులం వాళ్ళని సమర్థిస్తుంది, దోపిడీని సమర్థిస్తుంది. అదెప్పుడూ పురోగమన రచన కాదు దాన్ని రాసిన కాలంలో కూడా" (రామాయణ విషవృక్షం: ముప్పాళ్ళ రంగనాయకమ్మ, మూడవ సంపుటి, స్వీట్‌హోమ్ పబ్లికేషన్, పుట 24)అన్న మాటలు నార్లవారి దృక్పథాన్ని సమర్థించేలాగానే ఉన్నాయి.

**ముగింపు**

ఈ విధంగా సీతజోస్యం నాటకంలో అడుగడుగునా నార్లవారి హేతువాద భావజాలం దర్శనమిస్తూనే ఉంటుంది. రామాయణాన్ని తెలుగు ప్రజలు భక్తి పరవశంలో మునిగి మరీ చదువుతారు. కానీ దాని అంతరార్థం. పరమార్థం తెలుసుకోకపోవడం వల్లనే ఇలాంటి పరిణామాలు తెలుగు లోకంలో కనిపిస్తుంటాయని, కల్పితాలను వాస్తవాలుగా చూస్తున్నంతకాలం మనిషి వికసించలేడని, వాస్తవజీవితాన్ని గడపాలనే హితవు పరోక్షంగా ఈ నాటకం ద్వారా పలికారు. మొత్తానికి మతపరమైన విమర్శలు చేస్తూ రచనలూ చేసినా ప్రతీదానికీ హేతువాత ధోరణిలో సమాధానం ఈయన రచనల్లో కనిపిస్తుంది.

నవయుగాల బాట నార్ల మాటలో వీరి హేతువాద భావజాలం చాలా స్పష్టంగా గమనించవచ్చు.

**ఏల ఏప్పుడెవ్వడిత్యాది ప్రశ్నలే**
**పశువు నుండి వేరుపరిచె నరుని**
**ప్రశ్నతోనే నరుడు పరిణామ మొందెరా**
**నవయుగాల బాట నార్లమాట!**

**ప్రకృతినే జయించి, పరమాణువును చీల్చి**
**శాస్త్రవేత్త కూర్చే సకల సిరులు**
**రాజకీయ వేత్త రణమును కూర్చెరా!**
**నవయుగాల బాట నార్ల మాట!**

వంటి పద్యాలు నార్లవారి హేతువాద దృక్పథానికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. రంగనాథాచార్యులు, కె.కె – ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్, 1982
2. వేంకటేశ్వరరావు, నార్ల– సీతజోస్యం నాటకం
3. సిమ్మన్న. వెలమల – తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, దళితసాహిత్య పీఠం ప్రచురణ, విశాఖపట్నం, 2005

# స్వర్ణకమలాలు - కుటుంబ జీవనం

డా. ఎం. దేవేంద్ర, తెలుగుశాఖ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, హైదరాబాదు

అర్థశతాబ్దం పాటు నిరంతసాహితీసృజన చేసిన ఇల్లిందల సరస్వతీదేవి తెలుగుకథాసాహిత్యానికి ఒక 'స్వర్ణకమలం'. తన 35వ ఏట రచనను ప్రారంభించినప్పటికి రెండువందలకుపైగా కథలు, పదమూడు నవలలు, పెద్దకథలు, పిల్లలకథలు, పత్రికల్లో వ్యాసాలు ఇట్లా బహుముఖీనమైన కృషిచేసిన సాహిత్యమహిళాశిరోమణి. స్వర్ణకమలాలు కథాసంపుటికి కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు రావడమన్నది సరస్వతీదేవి రచనా ప్రతిభకు వచ్చిన గుర్తింపు. అంతేకాకుండా సాహిత్యం, సంఘసేవ రెండుకండ్లుగా భావించి ఒక బాధ్యతాయుతమైన స్థానంలో నిలిచిన విదుషీమణి.

ఇల్లిందల సరస్వతిదేవి 1918లో పశ్చిమగోదావరి జిల్లా సరసాపురంలో ఒక సంప్రదాయ కుటుంబంలో పుట్టారు. తండ్రి కామరాజు వెంకటప్పయ్య ఉద్యోగరిత్యా అనేకఊర్లు తిరగవలసివచ్చింది. తల్లి బాల్యంలో మరణించడవల్ల సరస్వతీదేవి తన పెద్దతల్లి ఆలనపాలనలో పెరగవలసి వచ్చింది. వీరి కుటుంబం విద్యావంతుల కుటుంబం. అదే బాటలో నడిచిన సరస్వతిదేవి ఎంతో ఆసక్తితో చదువుకున్నారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకు చిన్నవయసులో పెండ్లిళ్లు చేసేవారు. చదువుకుంటున్న వయసులోనే సరస్వతీదేవి వివాహం జరిగింది. సరస్వతీదేవి మెట్టినిల్లు తెలంగాణ ప్రాంతం. భర్త ఇల్లిందల సీతారామారావు. ఉస్మానియా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగంలో రీడర్‌గా పనిచేశారు. భార్యగా, తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే సరస్వతీదేవి చదవడం మానలేదు. ఆ రోజుల్లో శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం నుండి అనేక గ్రంథాలను, పత్రికలను తెప్పించుకొని చదివేవారు. ఆమె పఠనాశక్తిని గమనించిన భర్త కూడా అందుకు ప్రోత్సహించారు. ఆమె నిరంతర అధ్యయనం తరువాత రోజుల్లో ఒక సాహితీమూర్తిగా ఎదగడానికి బలమైన పునాది అని చెప్పవచ్చు.

1982లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న స్వర్ణకమలాలు కథాసంపుటి 1981లో ప్రచురించబడింది. అంతకుముందు వెలువరించిన 'పండుగబహుమానం', 'అక్కరకు వచ్చిన చుట్టము', 'ముత్యాలమనసు' అనే మూడు కథాసంపుటాలలోని నలభైరెండు కథలకు అదనంగా యాభైఎనిమిది కథలను చేర్చి వందకథలతో, పదకొండువందల ఏడు పేజీలతో 'స్వర్ణకమలాలు' కథాసంపుటి వెలువరించి కథాసాహిత్యంలో చెరగని ముద్రను వేసారు. రచయిత్రి వెలువరించిన తరువాతి కథాసంపుటి 'తులసీదళాలు' నూట ఎనిమిది కథలతో ప్రచురించబడింది. వీరురాసిన కథలన్ని ఆల్ ఇండియా రేడియోలో, భారతి, శోభ-స్రవంతి, ఆంధ్రభూమి, వనిత, యువ, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక అనామిక పత్రికలల్లో ప్రచురించబడ్డాయి.

'నిగూఢభీజ స్థితినుండి వెలికివచ్చిన విషయాంకురం కథావస్తువు' అన్నారు పోరంకి దక్షిణామూర్తి. నిత్యం మనం చూసే సంఘటనలు, పొందే అనుభూతులు, జరిగేవింతలు, సామాజిక అంశాలు, రాజకీయ పరిణామాలు, నాగరికపు హంగులు రచయిత దృష్టిలో పడగానే కథావస్తువులుగా మారుతాయి. జీవితాన్ని, సమాజాన్ని నిశితంగా పరిశీలించి ఆకట్టుకునే శైలిలో, అనుభూతి ఐక్యతతో ఇల్లిందల సరస్వతిదేవి కథలను రాసి జీవితకళాఖండాలుగా మలిచారని చెప్పవచ్చు.

వ్యక్తి, కుటుంబం, సమాజం పరస్పర సహాయసహకారాలతో కాలమనుగడ సాగుతుంది. భారతీయ వ్యవస్థలో కుటుంబం అత్యంత కీలకమైనది. వ్యక్తియొక్క జీవనవిధానం, సంస్కృతి, ప్రేమ ఆప్యాయతలు, బంధాలు ఇవ్వన్ని కుటుంబం వలనే సాధ్యమౌతాయి. రచయిత్రి కలంపట్టే నాటికి ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉండేది. రానురాను సమాజంలో చిన్నకుటుంబాలు పెరుగుతూవచ్చాయి.

ఇల్లిందల సరస్వతిదేవి ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలలో మంచిచెడులను కథావస్తువులుగా స్వీకరించారు. ఆర్థికకోణంతో చూసినప్పుడు ధనిక, మధ్యతరగతి, పేదకుటుంబాలుగా విభజించి చూడవచ్చు. సరస్వతీదేవి కథలు కుటుంబజీవన తాత్త్వికతను చెప్తూనే ధనిక, పేదవర్గాల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలను కూడా తెలియజేస్తాయి. 'బలియసీ కేవలమీశ్వరాజ్ఞ', 'కొండమల్లెలు', 'పండుగచీర', 'పితృహృదయం', 'అసమర్థుగు', 'బహుమానం', 'సహోదరులు', 'ముత్యాల మనసు', 'తండ్రిపోలిక', 'వేమూరివారి కోడలు', 'అద్దుతెరలు', 'ఎదిగిన కొడుకు', 'తల్లి మనసు' మొదలైన కథల్లో వివిధ బంధాల, అనుబంధాల గాఢతలు, చేదు అనుభవాలు చిత్రించబడ్డాయి.

స్వర్ణకమలాలు కథాసంపుటిలో మొదటికథ కొండమల్లెలు. ఈ కథ డిగ్రీ మొదటిసంవత్సరం విద్యార్థులకు పాఠంగా కూడా ఉంది. ఇందులో శివనాథం, గురవడు రెండు ప్రధానపాత్రలు. "శివనాథం తక్కువ జీతాల తెగలో వాడు. కలిగిన దాంట్లోనే జీవితానికి కావలసిన నాలుగు అమర్చుకోవాలనుకుంటాడు. అతడికేదయినా లేదు– చాలదనుకోవటానికే అసహ్యము. శకుంల దీనికి సరిగ్గా వ్యతిరేకము" భార్యకోరికలు తీర్చే ఆర్థికస్తోమత అతడికి లేదు. అందుకని అతడి జీవితాన్ని ఏదో ఒక అసంతృప్తి వెంటాడుతుంది. అందుకని శివనాథం ఆఫీసునుండి గంటముందు బయలుదేరి ఏటిగట్టు వెళ్ళి ఇసుకతిన్నెల్లో పడుకొని ఆకాశాన్ని చూస్తూ ఆ నీటి ప్రవాహ చప్పుడును వింటూ ఏకాంతంగా కూనిరాగాలు పాడుకొని రావటం అలవాటుగా మార్చుకున్నాడు. శివనాథం, శకుంతల మధ్యతరగతి కుటుంబానికి చెందిన భార్యభర్తలు. ఈ కథలో రచయిత్రి సమాంతరంగా గురువడు, పోచాలు పాత్రలను చిత్రించి కుటుంబంలో భార్యభర్తల మధ్య ఉండవలసిన సర్దుబాటును తెలియజేశారు. గురువడు, పోచాలు కూలీ, నాలీ చేసుకొని బతికే పేదకుటుంబం. జీవిత ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికి, గురువడు ఒకానొక సందర్భంలో అస్వస్థతకు గురైన సందర్భంలో భార్య పోచాలు కూలీపనికి వెళ్ళిసంసారం నెట్టుకొస్తుంది. కానీ భార్యభర్తల మధ్య అనురాగం తగ్గలేదన్న విషయాన్ని సాక్షీభూతంగా గురువడు, పోచాలు పాత్రలు ప్రవర్తిస్తాయి. శివనాథం జీవితంలోని అసంతృప్తిని పోగొట్టుకోవడానికి, గురువడి జంటను చూసి ఆనందపడతాడు. రచయిత్రి పాఠకుడిని ఒక సద్భావనవైపు తీసుకెళ్ళడానికి ఈ పాత్రలు ఎంతగానో తోడ్పడుతాయి. ఎలా ఉండాలి. ఎలా ఉండకూడదో అన్న విషయాన్ని స్ఫురణకు తెస్తాయి. ఈ కథలో మధ్యతరగతి, పేద ప్రాతినిధ్య పాత్రలను చూపిస్తూ డబ్బుకంటే ప్రేమగొప్పదన్న జీవనతాత్త్వికతను చిత్రించి సఫలీకృతులయ్యారు రచయిత్రి.

1958లో 'భారతి' పత్రికలో అచ్చయిన కథ 'బలీయసీ కేవలమీశ్వరాజ్ఞ'. అప్పటికి ఆంధ్రప్రదేశ్ ఏర్పడి రెండు సంవత్సరాలైంది. తెలంగాణ ప్రాంతంలో జమీందారి వ్యవస్థ మూలాలు బలంగా ఉండటంతో ధనిక, పేదవర్గాలు మాత్రమే ఉన్నాయి. మధ్యతరగతి చాలా ఆలస్యంగా ఏర్పడింది. ధనికవర్గానికి చెందిన జమీందారికి కథలోని ప్రధానపాత్ర. ఆర్థిక సంబంధ విషయాలలో ఏ లోటు లేదు. ఇంటినిండా పనివాళ్ళు కాబట్టి హోదాలో జీవిస్తున్న జమీందారికి ప్రేమానురాగాల విలువ పెద్దగా తెలియకుండానే జీవితం గడిచిపోయింది. యజమాని భర్తకు బాగాలేక ఎండాకాలం శీతల ప్రదేశాలకు వెళ్ళే ప్రయాణం ఆగిపోయింది. ఇల్లుచల్లగా ఉండటానికి భవనం చుట్టుతడకలు వేయించే పనిలోభాగంగా పరిచయమైన దంపతుల పాత్రలు చెల్లమ్మ, రామయ్యలు. ఇద్దరు కలిసిమెలసి పనిని ఎంతో ఇష్టంగా చేస్తుంటారు. జమీందారికి వాళ్ళను చూసినప్పుడు భార్యభర్తలకు ఇంతగా మాట్లాడుకునే విషయాలు ఏముంటాయి అనిపించేది. ఒకసారి వారిని గద్దించింది కూడా. అనుకోకుండా పనిచేస్తున్న క్రమంలో రామయ్య ఎక్కిన నిచ్చెన విరిగిపోయినందువల్ల రామయ్య కిందపడిపోతాడు. కాళ్ళువిరిగిపోతాయి. ఆ సందర్భంలో చల్లమ్మ అన్న మాటలు జమీందారిలో మార్పును తీసుకొస్తాయి. "అమ్మా మారుమనవు ఎవరికి కావాలి తల్లీ! మా మామ మనసిచ్చి మనసును ఆకర్షించుకున్నాడు. ఒక పొల్లుమాట, ఒక కలుబొట్టు ఎరుగడు. ఒకరి జోలికి పోడు" అన్న చెల్లమ్మ తను ఎప్పుడు కూడా భర్త ఒక పరిధిని విధించుకొని జీవించిందే తప్ప రామయ్య, చల్లమ్మల మధ్య ఉన్న అనురాగం తను అనుభూతి చెందలేదనిపించింది. వెంటనే భర్తగదికి వెళ్ళింది జమీందారిణి. ఎప్పుడు తన గదివైపు రాని భార్య, వచ్చేసరికి ఆ జమీందారు ఆనందానికి అవధులులేవు. పక్షవాతంతో బాధపడుతున్న భర్తకు పనివాళ్ళ చేత కాకుండా తనే సేవలు జేయడానికి పూనుకుంటుంది. రచయిత్రి ఈ కథలో దంపతుల మధ్య ఉండవలసినవి ప్రేమానురాగాలు తప్ప మరేమికాదన్న జీవన సత్యాన్ని చెప్పారు.

'పితృహృదయము" కథలో కూతురుపుట్టిన తర్వాత వెంకట్రామయ్య భార్య చనిపోయింది. మూడు నెలలపాపను పెంచిపెద్దచేసి, చదువుచెప్పించి, పెళ్ళిచేసి బాధ్యతను నిర్వర్తించిన తర్వాత మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడు వెంకట్రామయ్య. అప్పటినుండి కూతురు ఇంటికివచ్చే పరిస్థితులు లేవు. వీలున్నప్పుడు తండ్రే కూతురు దగ్గరికి వెళ్ళివస్తూ బాగోగులు చూస్తుంటాడు. కూతురుకు చెప్పరాని కష్టం వచ్చినప్పుడు కూడా తండ్రి ఇంటికి వెళ్ళడానికి సిద్దంగా ఉండదు. ఈ కథలో తండ్రిపట్ల కూతురికి, కూతురుపట్ల తండ్రికి ఉండే అనురాగం బాధ్యతాయుతమైనది. ఉన్నత మైనదికూడా.

"పండుగచీరె" కథలో రాజ్యలక్ష్మి మధ్యతరగతికి చెందిన ఇల్లాలు. భర్త భావనారాయణ కలెక్టరు ఆఫీసులో గుమస్తా. పల్లెటూరినుండి పట్నంకు వచ్చిన రాజ్యలక్ష్మికి ఎన్నో సరదాలు, మరెన్నో కోరికలు ఉంటాయి. వాటిని తీర్చే ఆర్థికశక్తి భర్తకు లేదు. దీపావళికి కొత్తచీరకట్టుకోవాలని సరదాపడుతుంది రాజ్యలక్ష్మి. భర్త అప్పుచేసి మరి భార్యకు చీరకొని తెస్తాడు. ఈ కథలో మధ్యతరగతి దంపతుల సాదక బాధకాలను రచయిత్రి విశ్లేషించారు. కథలో రాజ్యలక్ష్మి పెద్దగా చదువుకోలేదు. కాబట్టి ఉద్యోగము చేయలేదు. భర్తపై ఆధారపడి జీవించే స్త్రీపాత్ర ఆనాటి సామాజిక పరిస్థితులను తెలియజేస్తుంది.

'అసమర్థుడు' కథలో రంగారావు ఇంటిపెద్దకొడుకు. తండ్రి చెప్పినట్టు కుటుంబంలోని పిల్లలందరు నడుచుకున్నారు. అభివృద్ధి చెందారు. కాని పెద్దకొడుకు రంగారావుకు మాత్రం తండ్రిచెప్పినట్టు వినడం ఏ మాత్రం ఇష్టం లేదు. ఇంటర్‌చదివి ఏ ఉద్యోగాన్ని సంపాదించలేకపోయాడు. దానితో తండ్రికి పెద్దకొడుకు అంటే చిన్నచూపు. కాని రంగారావుకు తనమీద తనకు నమ్మకముంది. భార్యకూడా అతన్ని పూర్తిగా నమ్మింది. వ్యాపారం చేయాలని, ఏమిచేస్తే బాగుంటుందని కొంత ఆలోచించుకునే లోపల ఇంట్లో ఎన్నో అవమానాలు ఎదురవుతాయి. భార్య నగలను తీసుకొని వెళ్ళి మహానగరం ముంబాయిలో పెట్టుబడి పెట్టి, విజయం సాధించి, భార్యపిల్లలతో ఆనందంగా జీవితం గడుపుతుంటాడు. అతడు తండ్రిముందు అసమర్థుడు కాదని నిరూపించుకుంటాడు.

'సలహా' కథలో లక్ష్మీకాంతరావు, రాజ్యం భార్యభర్తలు. వీరిద్దరికి శ్రేయోభిలాషి, బంధువు నరసింహారావు ఉంటాడు. పెండ్లితర్వాత చాలా అన్యోన్యమైన జంటగా పేరుతెచ్చుకున్న రాజ్యం దంపతులు, కొన్ని కుటుంబ నిర్ణయాలు తీసుకోవడంలో వారిద్దరి మధ్య దూరం పెరుగుతుంది. ఆ సమయంలో ఒకరు ఇల్లు కొనాలని, మరొకరు కారు కొనాలని శపథం పట్టి కూర్చుంటారు. ఆ సందర్భంలో వీరిద్దరి మంచినికోరే నరసింహారావు పాత్ర యుక్తిని ప్రదర్శించి, తగిన సలహాలను ఇచ్చి భార్యభర్తల మధ్య ఉన్న సమస్యను పరిష్కరిస్తాడు.

'వేమూరివారి కోడళ్ళు', 'సహోదరులు' ఈ రెండు కథలు గ్రామీణవాతావరణంలో కుటుంబం సంబంధాలను తెలియజేసిన కథలు. చిన్నప్పుడు కలిసిపెరిగిన అన్నదమ్ములు పెరిగిపెద్దగై ఎవరి సంసారాలు వారికి అయ్యాక పాలొళ్లుగా మారిపోతారు. సహోదరులు కథలో రచయిత్రి ఒక సంఘటనను సృష్టించి అన్నదమ్ముల మధ్య ఉండాల్సింది పగలు, ప్రతీకాలు కాదు, ప్రేమ ఆప్యాయతలు ఉండాలని సందేశం ఇచ్చారు. అట్లాగే 'వేమూరి వారికోడలు' కథలో న్నత కుటుంబాల్లో కోడళ్ళ మధ్య ఉండే పోటీతత్త్వం, రాగద్వేషాలు, ఈర్ష్యఅసూయలు అన్నింటిని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. ఈ కథ చదివితే ఆడవాళ్ళ మధ్య ఉండాల్సింది అసూయకాదు ఐకమత్యంగా ఉండాలని బోధపడుతుంది.

ఇట్లా ఇల్లిందల సరస్వతీదేవి రాసిన చాలాకథలు కుటుంబవ్యవస్థను గురించి అనేకకోణాలను ఆవిష్కరించాయి. 'ఆకరివాడు' కథలో చిన్నవాళ్ళుగా పుట్టడడం వల్ల జీవితంలో జరిగే లోటుపాట్లు తెలియజేశారు. డైరీకథలో కూతురి ప్రేమను, ఆమె చిలిపిచేష్టలను తండ్రి అర్థంచేసుకోలేని సందర్భాలను చిత్రించారు.

ఈ విధంగా స్వర్ణకమలాలు కథాసంపుటిలో చక్కటి కుటుంబ జీవన సందేశాన్ని ఇచ్చే కథలు ప్రతి కాలానికి సందేశాన్ని అందిస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు**

1. సరస్వతి దేవి ఇల్లిందల, స్వర్ణ కమలాలు (కథా సంపుటి), 1981.
2. వెంకట సుబ్బయ్య వల్లంపాటి, కథాశిల్పం
3. హేమ, ఇల్లిందల సరస్వతి దేవి జీవితము – రచనలు (సిద్ధాంత గ్రంథం), ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1992.

# గాలివాన కథ - మనస్తత్వ విశ్లేషణ

**ఈ. కళ్యాణి,** తెలుగు అధ్యాపకులు, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల, మాచర్ల, పల్నాడు జిల్లా

**పరిచయం :** సమాజంలో మనుషులు వాళ్ళ మనస్తత్వాలు రకరకాలుగా ఉంటాయి. సుఖంగా సంతోషంగా బ్రతకడానికి మనుషులు నీతి నియమాలను ఏర్పరచుకొని విధి నిషేధాలను నిర్ణయించుకుంటారు. జీవితం సజావుగా సాగినంత కాలం ధర్మాధర్మాలను, ఆదర్శాలను గురించి మాట్లాడేవారు అనుకోని ప్రమాదం ఏర్పడితే, ప్రాణాలకు హాని కలుగుతుందంటే, అవకాశాలు తలుపులు తెరిచి ఆహ్వానిస్తే నమ్ముకున్న సిద్ధాంతాల కోసం నిలబడేవారు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టేవారెందరు? అవసరం మనిషి చేత ఏ పనైనా, ఎంతటి తప్పునైనా చేయిస్తుంది. అవసరం ధర్మాధర్మాలను, నీతి నియమాలను, విలువలను, విచక్షణను నశింపజేసి వ్యక్తుల అసలు రూపాన్ని బయటపెడుతుంది. ఈ విషయాన్ని దర్పణం పడుతూ గాలివాన కథ ద్వారా పాలగుమ్మి పద్మరాజు మానవ మనస్తత్వాన్ని మహోన్నతంగా ఆవిష్కరించారు.

**కీలకపదాలు :** నియమాలు, క్రమపద్ధతి, వేదాంతం, మాటకారి, సానుభూతి, ఆకలి, అవసరం, విలువలు, ధర్మచింత.

**విశ్లేషణ :** రావు ఒక న్యాయవాది. 50 ఏళ్ళ మనిషి చాలా ఆరోగ్యవంతుడు. ఆయన భార్య ఆయన కంటే పెద్దదిలా కనిపిస్తుంది. రావు గారికి నలుగురు పిల్లలు. పెద్ద కొడుకుకి 25 ఏళ్లు రాగానే తన తండ్రి న్యాయవాద వృత్తిని పూర్తిగా తానే చూసుకోవడం ఆరంభించాడు. ఆయన అంత సంపాదన ఉన్న వారు ఎవరు న్యాయవాద వృత్తిని వదులుకోరు. జీవితంలో కొన్ని నియమాలను పాటించాలనుకున్నాడు. అనుకున్న వాటిని తూచా తప్పకుండా పాటించే ధైర్యం కూడా ఆయనకు ఉంది. ఆయన ఇంట్లో ఒక క్రమ పద్ధతిని అతి కష్టం మీద అలవాటు చేశారు. తన పిల్లలను నెలకొకసారే సినిమాలకు వెళ్ళనిస్తారు. వాళ్ళింట్లో ఆయన కుమార్తెలు తల దువ్వుకునే పద్ధతిని సైతం రావే నిర్ణయిస్తారు. వాళ్ళ అలవాట్లు, నోములు, వ్రతాలు, స్నేహాలు, దుస్తులు వేసుకునే విధానం, అందం గురించి, మర్యాద గురించి అన్ని రావు అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయమైపోతాయి.

రావు గొప్ప వేదాంతి, గొప్ప వక్త కూడా. ఆయన జీవితాన్ని గురించి ఉత్సాహం తోటి ఉద్రేకం తోటి మాట్లాడగలడు. వేదాంతాన్ని గురించి ఉద్విగ్నంగా ఉపన్యసిస్తాడు. ఆయన ఉపన్యాసాల శీర్షికలు సామవేదము - రమ్యరసామోదము, సత్వము-తత్వము, ప్రకృతి-పరిష్కృతి వయోవిపాకము-మనోవివేకము ఇలా శబ్దాలంకారాలతో కూడి ఉంటాయి. రావు ఇల్లు ఇంట్లో అలవాటు పడ్డ సుఖాలు కూడా క్రమ పద్ధతిలో ఉంటాయి. ఆయనకు ఓవల్టిన్ అంటే ఇష్టం. కానీ ఆ ఇష్టాన్ని కూడా హద్దుల్లోనే ఉంచుకుంటాడు. రోజుకు రెండు సార్లు ఒక్కొక్క కప్పు చొప్పున మాత్రమే దాన్ని త్రాగుతాడు.

రావు ఆస్తిక మహా సమాజం వారి ఆహ్వానం మేరకు ఉపన్యాసం ఇవ్వడానికి బయలుదేరారు. రైలు పెట్టెలోని మూడు మొత్తలను నలుగురు ఆక్రమించుకున్నారు. రావు ఎక్కేసరికి ఆ నలుగురు చిరాకు పడుతున్నట్లుగా ముఖాలు పెట్టారు. రావు వేరే పెట్టే లోనికి వెళ్లే ప్రయత్నం చేయకపోయేసరికి వారిలో ఒక పెద్ద మనిషి పరుపు కొంచెం మడిచి రావుకి కొంచెం చోటు ఇచ్చాడు. మనిషి తాను సుఖంగా సౌకర్యవంతంగా ఉండాలనుకుంటాడు. దానికి ఎవరైన ఆటంకం కలిగిస్తే ఇబ్బంది పడతాడు. తప్పదనుకుంటే తనకు ఇష్టం లేకపోయిన సర్దుకుంటాడు అనే మనిషి నైజాన్ని పద్మరాజు ఈ సందర్భంలో తెలియజేశారు.

రావు రైలు ఎక్కిన తర్వాత గాలి వాన ప్రారంభమైంది. పెట్టెలో ఉన్న వాళ్లలో ఉన్న యువకుడు సిగరెట్లు కాల్చాడు. తన భార్యకు పొగ పడదని తెలిసినా మానేయలేదు. వద్దని ఆమె చెప్పలేదు. రైలులో పొగ త్రాగకూడదని రావు అభిప్రాయం కానీ ఆయన ఆ విషయాన్ని చెప్పలేకపోయాడు. అది సంస్కారం కాదని ఊరుకున్నాడు. మనిషికి తనకు నచ్చిన పనిచేసే హక్కు ఉండొచ్చు కానీ అది ఇతరులకు సమాజానికి ఇబ్బంది కలగజేసేది కాకూడదు. అటువంటి ఇబ్బంది కలిగినప్పుడు ప్రశ్నించే హక్కు ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ధర్మదేవతను కాపాడే న్యాయవాద వృత్తిలో ఆరితేరిన వారైనప్పటికీ రావు తన హుందాతనానికి ఎక్కడ భంగం కలుగుతుందో అని ఆలోచించాడే తప్ప సమాజం పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించలేకపోయాడు అన్న విషయాన్ని రావు ప్రవర్తనలో మనం గమనించవచ్చు.

గాలివాన క్రమక్రమంగా పెరుగుతూ ఉంది. ఇంతలో తలుపు తెరుచుకుని ఒక ముష్టిది పెట్టె లోపలికి వచ్చింది. తనకి ఆకలిగా ఉందని, తనని ఆకలితో చావనియ్యరనే ఆశతో వచ్చానని, దానం చేయమని ప్రాధేయపడింది. ఆమెకు ముప్పై యేళ్ళు ఉంటాయి. రావుకి ఆమె ముఖంలో స్థైర్యం కళ్ళలో తళుకు కనిపించాయి. ఆయనకి ఆమె మీద సానుభూతి కలగలేదు. ఆమె ఆయనను బిచ్చం అడిగితే రావు పో అని అన్నాడు. ఆమె తన మాటల నేర్పునంతా చూపించి అక్కడ ఉన్న వారి దగ్గర నుండి డబ్బు సంపాదించింది. రావు తప్పమిగిలిన అందరూ ఆమెకు డబ్బు ఇచ్చారు.

గాలివాన పెద్దదయింది. రావు దిగవలసిన స్టేషన్ దగ్గర అయింది. తాను ఎలా దిగాలా అని తాను చేరదలుచుకున్న ఊరు ఎలా చేరాలా అని రావు మధనపడ్డారు. సామానులు దించుకోలేకపోయారు. ముష్టి మనిషి సామానులు దించి వెయిటింగ్ రూమ్‌లో పెట్టింది. ఆమె సహాయాన్ని రావు అయిష్టంగానే అంగీకరించారు. ఇక్కడ అవసరం ఆయన నియమాన్ని భంగం చేసింది. రైలు పెట్టెలో ఆమెకు సహాయం చేయకుండా పో అని కసురుకున్న రావు వెయిటింగ్ రూమ్‌లో తన సామాను ఉంచినందుకు ఆమెకు డబ్బు తీసి ఇచ్చారు. ఆమె వద్దనలేదు ఇక్కడ అతని అవసరం అతనిని ఇష్టం కాని పని చేయించింది. మనుషులు కొన్ని నియమాలను పాటించాలి అనుకుంటారు. ఆ నియమాలను అతిక్రమించకుండా ఉండాలంటే ధైర్యం కావాలి పట్టుదల కావాలి సాగినంత కాలం అందరూ నియమాలను పాటిస్తారు. కానీ ఎప్పుడైనా అవసరం ఏర్పడుతుందో తాము పాటించే నియమాలకు నీళ్లు వదులుతారు అన్న నిష్ఠుర వాస్తవం ఇక్కడ మనకు అవగతం అవుతుంది.

రావు వెయిటింగ్ రూమ్ లోకి వెళ్ళాడు. గాలికి రూములోని కిటికీ రెక్కలు ఊడిపోయాయి. కొన్ని పెంకులు లేచిపోయాయి ఆ పరిస్థితి నుండి తనను ఎలా రక్షించుకోవాలో ఆయనకు తెలియలేదు. రావుకి భయం కలిగింది. చుట్టు ప్రక్కల మరొకరు కానరాలేదు. తెరిచిన తలుపులో నుంచి ముష్టి మనిషి లోపలికి వచ్చింది. ఆమె చలికి వణుకుతూ నీరు కారుతూ ఉంది. అది గమనించిన రావు తన పంచె ఇచ్చికట్టుకోమన్నాడు. రావుకి ఆకలి వేసింది. తన పెట్టెలో నుండి బిస్కెట్లు తీసుకున్నాడు. తాను కొన్ని తిన్నాడు ఆమెకు కొన్ని ఇచ్చాడు. ఆయన తలుపు వేయడానికి సాధ్యపడకపోతే ఆమె సహకరించింది. ఎక్కువ అయినా గాలి వానకి తలుపులు ఊడిపోవడంతో వారు ఇరువురు కలిసి బీరువ, డ్రాయర్ అడ్డంగా పెట్టారు. ఆయన గాలి వేగాన్ని అంచనా వేసి గది కూలిపోవచ్చు కదా అన్నప్పుడు ఆమె ఎక్కువైతే కూలిపోవచ్చని, భయపడవద్దని ధైర్యం చెప్పింది. తన అవసరానికి మనిషి అయిష్టమైన పనులైనా చేస్తాడు. దానికి సహాయము అనో, ధర్మము అనో సానుభూతి అనో ముసుగు వేస్తాడు. అది స్వార్థం. రావుకి ముష్టి దాని మీద సానుభూతి లేదు. వెయిటింగ్ రూమ్‌లో ఆ రాత్రి గాలి వానలో తనకు తోడుగా ఉంటుందని, తనకి ధైర్యం కలిగిస్తుందని భావించిన తరువాత రావు ఆమెకు తన పంచె ఇచ్చి తడి గుడ్డలు మార్చుకోమన్నాడు. తినడానికి బిస్కట్లు ఇచ్చాడు. ఆ గాలి వానలో ముష్టిది తనకి తోడు ఉండాలి. కనుక ఆమెకు సహాయం చేశాడు. చలికి వణుకుతుంటే చూడలేక పంచె ఇచ్చాను అనుకోవడం, ఆకలితో ఉంటే జాలిపడి బిస్కెట్లు ఇచ్చాననడం ఇవన్నీ అందమైన ముసుగులు తప్ప వాస్తవాలు కాదు.

రావు ఆమెను వివరాలు అడిగితే ఆమె తన సంపాదన గురించి చెప్పింది. తన పిల్లల గురించి బాధపడింది. రావు ఆమె వైపు అలా చూస్తున్నప్పుడు ఆమె ఆయన మనసులో అశీల్ల భావాలు ఉన్నాయని సూచించినందుకు ఆయనకు ఆమె మీద అసహ్యం వేసింది. అకస్మాత్తుగా పెద్ద చప్పుడుతో గది తలుపులు తెరుచుకున్నాయి. సామాన్లు చెల్లాచెదరయ్యాయి. రావు భయంతో ఆమెకు దగ్గరయ్యాడు. తాను అసహ్యించుకున్న ఆడదాన్ని కౌగిలించుకున్నాడు. ఆమె చిలిపితనాలు కొంటెతనాలతో ఆనందానుభూతిని పొందాడు. అప్పుడు ఆయనకు తాను చెప్పి ఆచరించే నీతి గుర్తుకు రాలేదు. ఈ సందర్భాన్ని సునిశితంగా పరిశీలించినట్లయితే కొందరు ఇతరులను గురించి చెడు అభిప్రాయాలను ఏర్పరుచుకుంటారు. తాము అలాంటి వాళ్ళం కాదు అనుకుంటారు. కానీ అవసరం కోసమో, వేరే కారణాల చేతనో, తాము ఎలా ఉండకూడదు అనుకుంటారో అలానే ప్రవర్తిస్తారు. రావు ముష్టి దాన్ని తాను ఎన్నడూ ఎరుగని మగవాడికి కూడా శరీరాన్ని అప్పగించి తేలికైన మనసుతో సుఖించగలదు అనుకున్నాడు. కానీ ఆ రాత్రి రావు తాను ఎన్నడూ ఎరుగని ఆడదానికి తాను అసహించుకునే బాహ్యరూపం కలిగిన ఆమె అయినా సరే తన శరీరాన్ని అర్పించి సుఖించాడు. ఆ సమయంలో ఆమె వెచ్చదనం లేకపోతే ప్రాణాలు పోతాయని ఆయన తన తప్పును తాను సమర్ధించుకున్నాడు. రావు ముష్టి మనిషిని చూసినప్పుడు ఆమెకు ధర్మాధర్మ చింతలో బాధపడే అంతరాత్మ లేదని అనుకున్నాడు. కానీ కుటుంబాన్ని అంతా శాసించి క్రమశిక్షణలో ఉంచుతూ, వకీలుగా కోర్టులో ధర్మాన్ని కాపాడుతూ, భార్యపిల్లలు ఉన్న రావు గాలి వాన రాత్రి ముష్టి మనిషి కౌగిలిలో కరిగిపోయాడు. అప్పుడు అతనికి అది అధర్మం అనిపించలేదు. అతని అంతరాత్మ అప్పుడు అప్పుడు ధర్మాధర్మచింతన చేయలేదు.

తెల్లవారింది. వాన తగ్గింది. రావు లేచి చూసుకున్నాడు. జేబులు తడుముకున్నాడు. విషయం అర్థమై "దొంగ ముండ" అనుకున్నాడు. బయటకి వెళ్లి గాలివాన బీభత్సాన్ని చూశాడు. పడిపోయిన టిక్కెట్లు గది సామాను క్రింద ముష్టి మనిషి శరీరం కనిపించింది. ఆమె ఒక చేతిలో తన పర్సురెండో చేతిలో కొన్ని నోట్లు ఉన్నాయి. అది టిక్కెట్లు అమ్మిన డబ్బు. ఆమెను తాకి చూసి ఆమె చనిపోయినట్లు నిర్ధారించుకున్నాడు. ఆ సమయంలో ఆయన ఆమెను దూషించలేదు. మనుషులు తప్పు చేస్తారు కానీ అదే తప్పు ఇతరులు చేస్తే దాన్ని విమర్శిస్తారు. ప్రచారం చేస్తారు. ముష్టిది తన పర్సు తీసుకున్నది. అని తెలుసుకున్న వెంటనే దొంగ ముండా అన్నారు. నిజానికి ఆమె దొంగతనం చేసింది తన సంసారాన్ని పోషించుకోవడం కోసం. రహస్యంగా ఇతరుల సొత్తును కాజేయడమే దొంగతనం అనుకుంటే రావు గారు కూడా ముష్టి దానితో తన భార్యకు తెలియకుండానే రాత్రిని రహస్యంగా పంచుకున్నాడు. ముష్టి దాని భర్త సొత్తును కాజేశాడు. అతను కూడా దొంగే. విచక్షణ ఉన్నవాడు కనుక ఆయన దానిని గ్రహించాడు. ఆమె దొంగ అనిపించుకోకుండా ఉండడానికి డబ్బును సొరుగులో ఉంచాడు. ఆమె శరీరంలో తనకు సంబంధించిన వస్తువు ఒక చిహ్నంగా ఉండాలని భావించి తన పేరు ఉన్న కార్డును తీసుకుని తన పర్సుని మాత్రం ఆమె చేతిలోనే ఉంచి అక్కడ నుండి వెళ్లిపోయాడు.

ముష్టి మనిషి చనిపోయినప్పుడు రావు అప్రయత్నంగా ఏడ్చారు.అంతటి గాలి వానలో తనకు తోడుగా సహాయంగా ఉండి శాంతిని, సౌఖ్యాన్ని, స్థైర్యాన్ని కలిగించిన ఆమె చనిపోయినందుకు ఆయనకు దుఃఖం కలిగింది. ఆయన మనసు ముష్టి మనిషిని అంగీకరించింది. ఆయన పాత భావాలు కొట్టుకుపోయాయి. అవసరంలో సహాయంగా నిలబడడమే మానవత్వం అని తెలుసుకున్నాడు. తన నీతి నియమాలు, క్రమశిక్షణ, అలవాట్లు. ఆలోచనలు తప్పని అర్థం చేసుకున్నాడు.ఆమెను బ్రతికించగలిగితే తన విలువలు, ధర్మచింత, వేదాంతం అన్ని విడిచిపెడదామనుకున్నాడు. ఆమె అతనిని మనిషిగా మార్చి మానవత్వాన్ని తట్టిలేపి తాను మరణించింది. ఆమె భౌతికంగా చనిపోయిన రావులోని మార్పు ద్వారా బ్రతికే ఉంది.

**ముగింపు :** మనిషి సంఘజీవి, తన సుఖ సంతోషాల కోసం తన చుట్టూ నీతి నియమాలు, ఆచార వ్యవహారాలు, మంచి మర్యాదలనే గోడలతో వ్యక్తిత్వం అనే కోటను నిర్మించుకొని వాటన్నింటిని పాటిస్తూ తాను ఒక మంచి వ్యక్తిగా నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తాడు. కానీ గాలివాన వంటి విపత్కర పరిస్థితులు వస్తే విలువలు అనే గోడలు బీటలు వారుతాయి. వ్యక్తిత్వం అనే కోట

గోడలు కూలిపోయే అవకాశాలు ఉంటాయి. మిట్టపల్లం ఏకమైనట్లు పేదలు ధనికులు ఏకమవుతారు. నియమాలు తొలగిపోతాయి. విలువలు మారిపోతాయి. ధర్మం, వేదాంతం, తమంతట తాము తప్పుకుంటాయి. మనిషి నిజరూపం బయటపడుతుందన్న విషయాన్ని పాలగుమ్మి పద్మరాజు ఈ కథ ద్వారా సాహిత్యలోకానికి తెలియజేశారు.

**ఆధార గ్రంధాలు :**

1. గాలివాన కథల సంపుటి–పాలగుమ్మి పద్మరాజు
2. కథాశిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర.

# అనువాద సమస్యలు - ఒక పరిచయం

**సి.ఇ. గాయత్రీదేవి,** పరిశోధక విద్యార్థిని, మద్రాసు క్రైస్త కళాశాల

**ఉద్దేశం**

తెలుగు సాహిత్యం అనువాదంతోనే ప్రారంభమైంది. కవిత్రయం తరువాత వచ్చిన కవులు కూడ సంస్కృత సాహిత్యాన్ని పురాణ, కావ్య, ప్రబంధాల రూపంలో మనకు అందించారు. ఇక ఆధునిక యుగంలో కూడ వివిధ భాషల నుండి అన్ని ప్రక్రియలోనూ అనువాదాలు పుంఖాను పుంఖాలుగా వెలువడుతున్నాయి. వెయ్యేండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యంలో అనువాద విజ్ఞానానికి సంబంధించి ఇంతవరకు వెలువడిన గ్రంథాలను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. ఈ నేపథ్యంలో అనువాదంలో విస్తృతమైన అనుభవం కలిగిన, రాచమల్లు రామచంద్రారెడ్డి ఎంతో పరిశోధన చేసి, తన అనుభవాలను కూడ జోడించి అనువాద విజ్ఞానం మీద ఒక మంచి గ్రంథాన్ని వెలువరించారు. సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్న రా.రా. "అనువాద సమస్యలు" అనే గ్రంథాన్ని తెలుగు సాహితీ ప్రియులకు పరిచయం చేయడమే ఈ పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశం.

**రచయిత జీవిత విశేషాలు**

సాహితీ ప్రియులచే 'రా.రా.'గా పిలవబడుతున్న రాచమల్లు రామచంద్రారెడ్డి 28 ఫిబ్రవరి, 1922లో జన్మించారు. కడప జిల్లాలోని సింహాద్రిపురం మండలం, పైడిపాలెం వీరి స్వగ్రామం. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన వీరు కవిత్వం, కథానిక, విమర్శ, అనువాదం అన్ని ప్రక్రియలోనూ రచనలు సాగించారు. సంవేదన, సవ్యసాచి పత్రికలను స్వయంగా నడిపారు. తన గిండి ఇంజనీరింగ్ చదువును వదులుకొని జాతీయోద్యమ పోరాటంలో పాల్గొన్న జాతీయాభిమాని రా.రా. కొంతకాలం విశాలాంధ్రలో పనిచేశారు. చాలా సంవత్సరాలు మాస్కోలో పనిచేశారు. గోర్కీ, చెఖోవ్, లెనిన్ రచనలను తెలుగువారికి అందించారు. 'అనువాద సమస్యలు' గ్రంథానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిని, 'సారస్వత వివేచన' గ్రంథానికి గాను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతిని అందుకున్నారు. వీరు 24 నవంబర్, 1985లో మరణించారు.

**అనువాద సమస్యలు- గ్రంథ విభాగాలు**

అనువాద సమస్యల గ్రంథాన్ని 1987లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వాళ్లు ప్రచురించారు. 265 పుటలు కలిగిన ఈ గ్రంథంలో 20 అధ్యాయాలున్నాయి. చివరగా 11 అనుబంధాలు చేర్చబడి ఉన్నాయి. సామాన్య పాఠకునికి కూడ అనువాదం మీద ఆసక్తి కలిగించే విధంగా రా.రా. ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దారు. ప్రారంభంలోనే మూల భాష, లక్ష్య భాష అంటూ సాంకేతిక పదాలను ఉపయోగించి పాఠకుడిని ఉక్కిరి బిక్కిరి చేయకుండా 'టైమెంత' అనే స్వారస్యమైన శీర్షికతో గ్రంథాన్ని ప్రారంభించారు. 'అనువాద సమస్యలు' గ్రంథంలోని అధ్యాయాలను ఇక్కడ సంగ్రహంగా పరిచయం చేయడం జరుగుతుంది.

**టైమెంత ?**

ఈ అధ్యాయంలో టైమ్, సెక్స్-జెండర్ అనే పదాలను ఏయే సందర్భాలలో ఏయే విధంగా రచయితలు, సామాన్య ప్రజలు ప్రయోగిస్తున్నారో రా.రా. ఆసక్తికరంగా వివరించారు.

**గొంతెమ్మ కోరికలా?**

సాధారణంగా అనువాదం అనేది పరభాషనుండి మాతృభాషలోనికి జరుగుతుంది. అనువాదానికి మాతృభాష నుడికారం బాగా తెలిసి ఉండాలన్నారు ఏకవచన, బహువచన పదాలు, భాషలోని లింగ భేదాలు, వాక్య నిర్మాణం భావానికి తగిన వాక్య నిర్మాణం చేయాలని చెప్పారు. భాషలోని యుక్తులన్నీ అనువాదకునికి కరతలా మలకమై ఉండాలని భాషలోని వైవిధ్యం, చమత్కారాలు, ప్రయోగాలు తెలిసి ఉండాలని వివరింపబడింది. అనువాదం ఎంత కష్టమైనదో వివరిస్తూ అనువాదకునికి ఉండవలసిన శక్తి సామర్థ్యాలు అన్నీ ఏకరు పెడితే అవి గొంతెమ్మ కోర్కెల్లా కనిపించొచ్చు అన్నారు.

**తెలుగువాని మొదటిపేరు?**

తెలుగువారికి ఇంటిపేరు పేరుకు మొదట ఉంటే, ఇంగ్లీషులో పేరు చివర ఉంటుంది. ఇంగ్లీషులో భావం అర్థమైనప్పటికీ తెలుగు భాషలో ఆ భావాన్ని పెట్టడం చేతకావడం ఇమడక పోవడం చేత ఇంగ్లీషు నుండి తెలుగు దినపత్రికలో వచ్చిన కొన్ని వ్యాపార ప్రకటనలను ప్రకటనల్లో ఎంత ఘోరమైన తప్పులు జరిగాయో ఉదాహరణలతో వివరించారు.

**Man అంటే మనిషేనా?**

ఎంతో సాధారణంగా కనిపించే పదాలు అనువాదం దగ్గరికి వచ్చేసరికి ఎంత అసాధ్యంగా తయారవుతాయో Man అనే పదం వివిధ సందర్భాల్లో తెలుగులోకి అనువదిత మైనప్పుడు ఏలా అర్థాలు మారుతుందో వివరించారు.

**అసలు సమస్య ఏమిటి?**

అనువాదం చేతకాని వారిని పక్కన పెడితే రెండు భాషలు తెలిసినవారు కూడా అనువాదం చేయడంలో సమస్యలు ఎదుర్కొంటారని ఉదాహరణలతో చెప్పారు. అనువాద సమస్యలను రెండు రకాలుగా వర్గీకరించారు. 1. పద సమస్యలు 2. వాక్య నిర్మాణ సమస్యలు. వాక్యాన్ని విభజించేటప్పుడు అనువాదకునికి అప్రమత్తత లేకుంటే ఎలాంటి నష్టాలు జరుగుతాయో వివరించారు.

**వాక్యభాగాల క్రమం**

ఇంగ్లీష్ తెలుగు భాషల మధ్య వాక్య నిర్మాణంలో భేదాన్ని తెలుపుతూ అనువాద సమయంలో వాక్య నిర్మాణం ఎలా మారుతుందో, మారకపోతే ఎలా కృతకంగా ఉంటుందో ఉదాహరణలతో వివరించారు. ఎలాంటి వాక్యాలు అనువాదంలో తిప్పలు పెడతాయో చెప్పారు.

**పదాలు**

ఒక భాష నుండి ఇంకొక భాషకు అనువాదం చేసేటప్పుడు ఒక్కోసారి మూల భాషలో ఉన్న పదాలకు అనువదించే భాషలో సమానార్థకాలు లేకపోవడం గురించి చెబుతూ రా.రా. గారు ఉదాహరణగా బంధుత్వాలు తెలుగులో విడివిడిగా ఉన్నట్లు ఇంగ్లీషు పదాల్లో లేకపోవడం గురించి ఉదహరిస్తూ Aunt, Uncle, Nephew, Niece అనే మాటలు ఉదాహరణగా చెప్పారు. ఇలాంటి పదాలకు సాంఘిక పరమైన కారణాలను కూడా వివరించారు. ఆయా దేశాల నాగరికతను నాగరికత వికాసాన్ని బట్టి భాషలోని పదాలు ఏర్పడతాయని అన్నారు. యూరప్‌లో మామిడిపండు లేదు కనుక ఇంగ్లీషువాళ్లు, మన దేశానికి వచ్చినప్పుడు తమిళంలోని 'మాంగాయి' నుండి 'మ్యాంగో' అనే మాటను సృష్టించుకున్నారు. అలాగే యూరప్‌లో ఉన్న పండ్లపేర్లు మన భాషలో లేవు.

Prude, prigfinical, sanctimonious లాంటి పదాలు మనకి లేకపోవడానికి మన నాగరికత ఇంకా అంత వికసించకపోవడమే అన్నారు రా.రా. ఇలాంటి మాటలు అనువాదకునికి ఎదురైనప్పుడే అనువాదకుని సామర్థ్యం తెలుస్తుంది. House : home, marriage : wedding లాంటి వేరువేరుగా ఉన్న ఇంగ్లీషు పదాలకు తెలుగులో వేరువేరు మాటలు ఎందుకు లేవు అంటూ ఈ అధ్యాయం ముగుస్తుంది.

**అనువాదం అంటే?**

అనువాదకుడిని ఇంగ్లీషులో translator అని, ఒకరి భాష ఒకరికి తెలియని ఇద్దరి మధ్య సంభాషణలు, ఏదైనా చర్చలు జరిపేటప్పుడు అనువాదకుడు అవసరం కదా! ఇలా నోటి మాటలతో అనువాదం చేసేటప్పుడు interpreter అంటారు.

ఆంధ్రీకరణం మాటలో 'అనువాదం' అనే అర్థం ఇమిడి ఉన్నట్లు, Anglicisation, Russianisation అనే మాటలు ఇప్పుడు వ్యాప్తంలో లేవు. అందుకు కారణాలను చెబుతూ ఒక భాషలో ఉన్న నియమాలు, సాంప్రదాయాలు మరొక భాషలో ఉండవని అన్నారు.

అనువాదం అంటే ఏమిటో చెప్పబోయి పక్కదారి పట్టినట్లుంది అంటూ– "నిజమే అనువాదాన్ని గురించి తెలుగులో వివరించడం అంటే సిమెంటు రోడ్డు మీద కొత్త కారులా ప్రయాణం లాగా సాఫీగా ఉండదు. దారి డొంకా లేని కీకారణ్యంలో మనమే కాలిబాట నిర్మించుకుంటూ ముందుకు పోవాలి కనుక, కంపచెట్లు, చిక్కుపొదలు విడిపించుకుంటూ, సూటిబాట సాధ్యం కానప్పుడు అటూ, ఇటూ మలుపులు తిరుగుతూ మలుపులు, మెలికలు తిరగక తప్పదు" (పుట. 63) అన్నారు.

"అనువాదం అంటే ఎంత కష్టమైందో, దానికి ఎంత విశాలమైన లోకజ్ఞానమూ, ఎంత విస్తారమైన గ్రంథ పఠనమూ, ఎన్ని సిద్ధాంతాలతో, మతాలతో, విజ్ఞాన శాస్త్రాలతో, ఎన్ని దేశాల చరిత్రలతో పరిచయం అవసరమో మీకు అర్థమైతే తప్ప, మీ మనసులో నాటుకుంటే తప్ప, అనువాదం అంటే ఏమిటో నేను చెప్పినా మీకు పూర్తిగా అర్థం కాదు కనుక అనువాద నిర్వచనానికి ఇదంతా ఉపోద్ఘాతం అనుకోండి" (పుట. 72) అంటూ మరికొన్ని ఉదాహరణలు చెప్పారు.

**టైమ్ కత ఏమిటో చూద్దాం**

మరోసారి తెలుగులో "టైం" గురించి వివిధ సందర్భాల్లో "తెలుగు పదాలతో" వివిధ రకాలుగా ఎలా చెప్పొచ్చు అన్నది ఓపిగ్గా చాలా ఉదాహరణలతో వివరిస్తారు. చివరకు వీటి అర్థాలకోసం డిక్షనరీ చూడండి అంటారు.

**అనువాద వివరణ**

1. మొదటి అభిప్రాయం ప్రకారం అనువాదకుడు మూలరచనలోని భావాలను అత్యుత్తమంగా అనువాదంలో వ్యక్తం చేయగలగాలి. దీని ప్రకారం అనువాదానికి మెరుగులు పెట్టడానికి అనువాదకునికి అధికారం ఉంది.
2. మూల రచయిత భావాలు, శైలి, వాక్యాల నిర్మాణం అన్నీ కూడా అనువాదకుడు శ్రద్ధగా గమనించాలి ఇది రెండవ అభిప్రాయం. దీని ప్రకారం మూల రచనను కొద్దిగా కూడ మార్చే అధికారం అనువాదకునికి లేదు. రెండు అభిప్రాయాలు పరస్పర విరుద్ధమైనవి.

మాతృభాషలో ఉన్న రచనలోని సారాంశం ఎంత స్పష్టంగా అర్థమవుతుందో, అదేవిధంగా లక్ష్యభాష మాతృభాషగా గలవారికి అనువాదంలో సారాంశం అంత స్పష్టంగా అర్థమవ్వాలి. అది మంచి అనువాదం. ఈ నిర్వచనాన్ని న్యాయమైనదిగా చెప్పారు.

**తియోడర్ సేవరీ సిద్ధాంతం**

థియోడార్ సేవరీ అన్న ఆయన అనువాదం కళ గురించి ప్రతిపాదించిన సిద్ధాంతం గురించిన విమర్శించారు.

**మాతృభాష కూడా కష్టమేనా?**

మాతృభాషలో వ్యాకరణ, సంగీత, సాహిత్య పరంగా తప్పులు ఎలా దొర్లుతాయో శ్రీ శ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, యద్దనపూడి సులోచనారాణి,ఆర్.సంధ్యాదేవి లాంటివారి సాహిత్యంలో దోషాలు ఎలా దొర్లాయో వివరిస్తూ జోసెఫ్ కాన్రాడ్ మాటల్లో I am not defending myself. I am only justifying myself అంటూ ముగించారు.

**అనువాద దోషాలు**

ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువదించే సందర్భంలో రా.రా. అనువాద దోషాలను విపులంగా వివరించారు. దోషాలను నాలుగు రకాలుగా విభజించి, ఈ దోషాలను విశ్లేషిస్తూ 54 ఉదాహరణలు చెప్పారు.

**తెలుగు అకాడమీ నిఘంటువు**

తెలుగు అకాడెమి నిఘంటువుకు ఒక విశేషం ఉంది. అది Oxford Dictonary ఆధారంగా చేసుకొని తయారు చేయబడిందనీ, అర్థాలు, వివరణలు, అనువాదం చేయబడ్డాయని తెలుగు అకాడమీయే ఆ నిఘంటువులో స్పష్టపరించింది. కనుక దీనిని అనువాద గ్రంథంగా కూడ పరిశీలించవచ్చు.

**వాక్య నిర్మాణ సమస్యలు**

ఇంగ్లీషు వాక్యం క్లిష్టంగా, అనేక ఉపవాక్యాలతో కలసి ఉన్నప్పుడు అర్థం చేసుకోవడంలో అనువాదకుడు పొరబడితే తప్పు జరుగుతుంది. ఇంగ్లీషు వాక్యాన్ని బాగా అర్థం అవుతున్నా కూడ ఆ భావాన్ని తెలుగువాక్యంలో నిర్మించడం చేతకానప్పుడూ తప్పుడు అనువాదమే వస్తుంది.

Beware of English, Inglish and Americanisms

ప్రపంచమంతటా ఇంగ్లీషు భాష విస్తరించడంతో భాషలో ప్రాంతీయ భేదాలు పుట్టాయి. దీనివలన ఒకొక దేశం ఇంగ్లీషు(మాతృభాష అయినప్పటికీ) ఒక్కోలా ఉంది. ఉదా: అమెరికన్లు American English అనీ, భారతీయులు మాట్లాడే ఇంగ్లీషును Indian English అని చాలాకాలంగా అంటున్నారు. 1985సంవత్సరంలో యన్. క్రిష్ణస్వామి Indian English గురించి వ్యాసం రాస్తూ, దాన్ని ఒకే మాటలో చెప్పడానికి INGLISH అనే మాట సృష్టించాడు.

**అనువాదం ఇంత కష్టమా?**

మరొకసారి అనువాదం ఎంత కష్టమో, ఎంతటెంతటి పండితులు అనువాదం చేయడంలో పప్పులో కాలు వేసింది ఉదాహరణలతో వివరించారు.

**అనువాదాలు ఎందుకు చేస్తారు?**

అనువాదం అంటే మూలభాషలోన ఉన్న విషయాన్ని లక్ష్యభాషలో మార్చడం. ఇక్కడ విషయం మూల రచయితదే. అణుమాత్రం అనువాదకునిది కాదు. లక్ష్యభాష మాత్రమే అనువాదకునిది. మూలభాషలోని వస్తువు నచ్చినపుడు ఆ గ్రంథాన్ని అనువదించేటట్లు ప్రేరేపిస్తుంది.

**చిల్లర సమస్యలూ, చివరి మాటా**

ఇంగ్లీషు భాషలో dash, hyphen చిహ్నాలను ఉపయోగిస్తారు. ఇంగ్లీషులో మధ్యంతర వాక్యభాగాన్ని ప్రధానవాక్యం నుండి వేరుచేయడానికి అడ్డగీతను ఉపయోగిస్తారు. తెలుగు వాక్య నిర్మాణంలో కూడ అడ్డగీతలను ఉపయోగించవచ్చు. ఇవే కాకుండా ఇంగ్లీషు అక్షరాలు వివిధ భాషల్లో ఉచ్చారణ ఎలా మారుతుందో లింగ వచన, విభక్తులు, సూక్ష్మ భేదాలు గురించి ఆసక్తికరంగా వివరించారు. చివరి మాటగా ఈ పుస్తకంలో చాలామంది రచయితలు చేసిన తప్పుకి వారిమీద కసితోనో, కక్షతోనో కాదని అనువాదంలో తప్పులు ఎలా దొర్లుతాయో వివరించడానికి మాత్రమేనని రా.రా.గారు చెప్పారు. భావి అనువాదకులకు కొన్ని సూచనలు తెలియజేశారు.

**ఉపసంహారం**

శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డిగారి 'అనువాద సమస్యలు' అనే పుస్తకం అనువాద కళను గురించి, అనువాద ప్రక్రియను గురించి తెలుసుకోదలచినవారు, అనువాద ప్రక్రియను వృత్తిగా స్వీకరించినవారు తప్పక చదువవలసిన ప్రామాణికమైన మంచి పుస్తకం.

**ఉపయుక్త గ్రంథం**

1. రామచంద్రారెడ్డి రాచమల్లు. రారా అనువాద సమస్యలు, 2011, యుగసాహితీ ప్రచురణ.

# మోహనా! ఓ మోహనా! ...

**కంచర్ల మహేష్,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

కవులెం చేస్తారంటే? నిర్జీవ వస్తువుకు జీవం పోస్తారు. సమాజాన్ని చైతన్యపరుస్తారు. శ్రామిక వర్గాల పక్షాన ఉద్యమాన్ని చేస్తారు... కవి తన కలం ద్వారా సమాజాన్ని తట్టి లేపుతు సుజల ప్రవంతిని కల్గిస్తాడు. కవి అంటేనే చైతన్య ప్రవంతి సుధానిధి. శ్రీశ్రీ చెప్పినట్టు కష్టజీవికి ఇరువైపుల వుండేవాడే కవి. అలాంటి కవులు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని నడిపే రథసారథులు. తెలుగు సాహిత్యంలో గుణాత్మకమైన మార్పుల కోసం ఎన్నో సాహిత్య ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. ఆ ఉద్యమాలు భావజాల పరంగా, వస్తువు పరంగా, అప్పటి పరిస్థితుల పరంగా ప్రక్రియను ఎంచుకొని సమాజాన్ని చైతన్యం వైపు నడిపించాయి. సాహిత్య ఉద్యమాలు కొందర్ని ఆలోచింపచేసాయి. మరికొందర్ని ఉత్తేజ పరిచాయి. ఇంకొందర్ని భావోద్వేగానికి గురి చేశాయి. ఉద్యమాల ఫలితంగా రాటుదేలిన అగ్ని శిఖలాంటి కవులు బయటికి వచ్చారు. వారు సమాజ పరిస్థితులు చూసి చలించిపోయారు. అందులో నుండి పురుడుపోసుకున్న వ్యక్తి శివారెడ్డి. సమాజం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది. సాహిత్యం సమాజ అవగాహనకు, చైతన్యానికి తోడ్పడుతుంది. సాహిత్యం, సమాజం రెండూ ఒకదానితో ఒకటి విడదీయరాని బంధంగా పెనవేసుకొని ఉంటాయి. సాహిత్యం వల్ల సమాజంలో జరుగుతున్న సాంఘీక, ఆర్థిక, రాజకీయ అంశాలను వివరించడం ద్వారా పాఠకుని హృదయాన్ని రంజింపచేయడం, చైతన్యపరచడం, ఆలోచింపచేయడం చూస్తుంటాం. కవి తన అనుభవాలను, బాధలను, సంఘర్షణలను, ఉద్వేగాలను కవిత్వం ద్వారా పాఠక లోకానికి అర్థం అయ్యే రీతిలో వివరిస్తుంటాడు. 1965వ దశకంలో దిక్కులను శాసించే దిగంబర కవిత్వం విజయం సాధించింది. 1970వ దశకంలో తెలుగు సాహిత్యంలో మార్పు కోరుతూ విప్లవ ఉద్యమానికి నాంది పలికింది. ఈ రెండు ఉద్యమాల మధ్య పుట్టుకొచ్చిన కవిత్వ "మేరుశిఖ శివారెడ్డి".

శివారెడ్డి కవిత్వం అంటే విప్లవ కవిత్వం. 1970లో జరిగిన సమూలమైన మార్పులను అంతక ముందు జరిగిన దిగంబర కవిత్వం అవపోసన పట్టిన శివారెడ్డి కవిత్వంలో ప్రతీకలై నిలిచాయి. బహుశా శివారెడ్డి మార్క్సిస్టు భావజాలం కలిగి పీడిత వర్గాలపట్ల వచన కవిత్వ మార్గం ఎంచుకున్నారు. ఒక సమావేశంలో శివారెడ్డి ఉపన్యాసిస్తు "నీ వ్యక్తిత్వం ఏమిటో నీ కవిత్వం నిర్ణయిస్తుంది" అని అంటారు. దీనిని బట్టి శివారెడ్డి గారికి కవిత్వం అంటే ప్రాణం అని భావించవచ్చు. విప్లవ సాహిత్యంలో మొదటితరం కవులు అందరు మార్పు కోసం వచ్చిన రకరకాలైన వస్తువులను తీసుకొని సమాజ సమస్యలపై ప్రజలకు ఆలోచన కలిగించారు. రెండవ తరంలో చెప్పుకోదగిన అతి ముఖ్యులు నగ్నముని, శివారెడ్డి. విప్లవ సాహిత్య ప్రస్తానం ముగుస్తుంది. అదే సమయంలో వచన కవిత్వం ద్వారా ప్రాణం పోసిన ఘనులలో శివారెడ్డి ఒకరు. ఆనాటి సమాజంలో సహజమైన భావాలు, ఉద్వేగాలు, సంఘర్షణలు, సమస్యలపై బాణం ఎక్కుపెట్టి సమాజ మార్పు కోసం కవి మెదడును తొలుస్తూనే ఉన్నాయి. ఆ ఆలోచనల సమహారమే జీవనది లాంటి కవిత్వాలు పుట్టుకొచ్చాయి. కవిత్వమే జీవితం – జీవితమే కవిత్వంగా రాసే కవులు కొందరే. ఆ కవుల పరంపరలో నిలిచిన వారే శివారెడ్డి.

కవిత్వం అంటే సమకాలీన సమాజ జీవన పోరాటాల ఆవిష్కృతి. గ్రామీణ ప్రాకృతిక సౌందర్యం, ఆలోచనల సరళి, ఆత్మీయ బంధాలు, తల్లి లేని బాల్యము విషాదపు గుర్తులూ శివారెడ్డి వ్యక్తిత్వాన్ని బాగా ప్రభావితం చేశాయి. ఆ అనుభవాలు,

భావుకత ఆయన కవిత్వానికి ప్రాణప్రాయంగా నిలిచాయి. సమాజంపై పెరుగుతున్న ఆలోచనలు, తొలుస్తున్న సంకోచాలకు అనుగుణంగా ఆయన కవిత్వం రాయడంలో కవులకే కవి లాంటి వారు. ఇటు మంచి, అటు చెడు ద్విపార్శ్వ భావాలను ఏక కాలంలో పలికించగలిగే కవి. శివారెడ్డి కలం ద్వారా ఎన్నో రచనలు వచ్చాయి అవి : రక్తం సూర్యుడు (1973), చర్య (1975), ఆసుపత్రి గీతం(1976) నేత్ర ధనుస్సు (1978), భారమితి (1983), మోహనా ఓ మోహనా (1988) దీనికి 1990లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. శివారెడ్డి కవిత (1991). శివారెడ్డి గ్రామీణ కవిత్వం మట్టి కవిత్వం. కవిత్వం రాయడం అంటే ఖడ్గంతో సావాసం చేయడమే, అలాంటి కవిత్వమే శివారెడ్డి కవిత్వంలో చూస్తాం. మానవ జీవితంలో విభిన్న కోణాలను జీవితపు లోతుల్లోకి తన కవిత్వాన్ని రెండు అంచుల ఖడ్గంలా ప్రసరింపచేశారు. తన కవిత సంపుటిలో ఎక్కువ భాగం ఉపమానాలకు, ప్రతీకలను నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వస్తువులకు ఆపాదిస్తున్నారు. ప్రమాదపు అంచున ఉన్న తెలుగు నాడిని బ్రతికించడానికి ఇలాంటి గొప్ప కవులెందరో తమ భుజాలపై వేసుకొని తెలుగు సాహిత్యానికి చైతన్యం కల్పిస్తున్నారు. నేటి తరపు కవులు. శివారెడ్డిగారి లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజ వస్తువులను స్వీకరించి తెలుగును బ్రతికించవలసిన బాధ్యత యువ రచయితలకు లేకపోలేదు శివారెడ్డి రచనలో భావుకత, బాధ్యత, ఉన్నతమైన ఆలోచనలు, భావోద్వేగ ప్రసంగాలు సమాజ చైతన్యాన్ని నిరంతరం గుర్తు చేస్తుంటాయి. అలాంటి రచనల సమూహానికి చెందినదే మోహనా! ఓ మోహనా ! కవితా సంపుటి ఈ కవితా సంపుటిలో 44 కవితలు ఉన్నాయి. ప్రతీ కవిత దేనికి అదే ప్రత్యేకతను చూపిస్తూ సమాజం పట్ల కవి బాధ్యతను స్పృశిస్తున్నాడు. మోహనా! ఓ మోహనా! అనే కవితా సంపుటి ద్వారా శివారెడ్డి సృజనాత్మకత తార స్థాయికి చేరింది. ప్రతీ కవితలో వస్తువు, రీతి, భావుకత, ఆర్ద్రత, నిర్దిష్టమైన శైలి, భాష సౌందర్యం కనిపిస్తుంది. శివారెడ్డి ఈ కవిత సంపుటిలో సమాజ అవసరాలపై యుద్ధాన్ని, పోరాటాన్ని తరచుగా మననం చేస్తారు. ఆయన కవిత్వం సరళం నుంచి సంక్లిష్టం వైపు సాగిపోయే అమోఘమైన పదజాలం వాడారు. కవిగా తన సాహిత్య ప్రస్తానంలో అక్షర సేద్యం చేస్తు తరువాత తరాలకు విత్తనాలు చల్లుతూ వస్తున్నాడు. మోహనా ! ఓ మోహనా ! కవిత సంపుటిలో విభిన్న కోణాలలో మనిషికి సమాజానికి ఉన్న సంబంధాన్ని, ఉద్యమాలకు, రాజకీయాలకు మధ్య సంబంధం, మనిషికి భూమికి మధ్య ఉన్న బంధాన్ని విశిష్ట వస్తువులుగా తీసుకొని రాస్తారు. ఒక కాలపు సామాజికచరిత్ర సాహిత్యంలో ప్రతిబింబించబడుతుంది. ఆనాటి మనుషుల భావోద్వేగాలు పెనుగులాటలు తరతరాలకు అందించటం ద్వారా సామాజిక పరిపక్వత జరుగుతుంది. కనుక శివారెడ్డి విశాలమైన జీవితాన్ని విభిన్న కోణాల్లో వస్తువులుగా స్వీకరిస్తూ జీవిత లోతును వివరిస్తున్నారు. ఇప్పటి సమాజం ఆరాట పోరాటాలతో దీనస్థితిలోకి వెళ్లింది. ఈ దీనస్థితికి కారణాన్ని తన కవితలో ఇలా చెప్తాడు.

**నా కింద పక్కలాగానో**

**నావ కింద నీళ్లలాగానో**

**కళ్ల కింద నీడలాగనో......** ఇలా ఓ చదివిన యువతి బతుకుదెరువు కోసం ఆరాటపడుతున్న దృశ్యాన్ని స్మృతి కవితగా చిత్రిస్తూ

**కోడి కూతల్లేవు ఉదయ సంధ్యలు**

**నీ నగ్న పాదాలు వస్తూనే వున్నాయి.....** ఇలా ఆమె నిరంతర శ్రమను ప్రతిబింబిస్తారు. నగ్న పాదాలు.... అని ప్రతీకతో ఆర్తి, ఆక్రోశం, బాధ వ్యక్తం చేస్తుంటారు. పై పాదాలు మొత్తం ఒక నిరాశ, నిస్పృహలను చూపించాడు. కాని ఉపాధి దొరికిన తర్వాత కళ్లలో వుండే ఆనంద భాష్పాలు చిత్రించారు కూడా

**ఇన్నాళ్ల అజ్ఞాతవాసం తర్వాత**

**ఈ ఆఫీసు తోటలో కూస్తున్న కోయిల**

**నువ్వేం తిన్నావో తెలియదు కాని**

ఇన్నాళ్ల తర్వాత నీ కంఠంలో కొత్తగా "జాలి" ధ్వనిస్తుంది... ఇక్కడ జాలిని భాష సౌదర్య అర్థంగా వాడారు. ఈ కవితలో శివారెడ్డి ప్రతిభ, సృజనాత్మకత తేటతెల్లం అవుతుంది.

**బతుకు మోహనా!బతుకు**

**బతకడాన్ని ఓ పెద్ద పాపకార్యం చేసిన**

**బతకడాన్ని ఓ పెద్ద బండ బరువు మోసిన...** ఈ విధంగా భాషశైలిని, ప్రాసలతో సులభంగా అర్థవంతంగా రాయడంలో శివారెడ్డిది అందెవేసిన చెయ్యి.

**ఆశ చావదు వేడి చావదు**

**అనంత నూతనోత్సవ మందార మాల వాడదు....** ఆయన కలంలో నుండి కొత్తధనం కనపడుతుంది నిరాశ, నిస్పృహ ఊబిలో నుండి నిత్యప్రేరణ కోణంలోకి నడిపించడానికి ఆశ, వేడిప్రతీకలుగా వాడారు. **'నాకూ భూమికీ ఒక అవినాభావ సంబంధం... కాదు నేనే భూమిలోంచి ఎదిగిన మానవ వృక్షం...** అని భూమికి, మనిషికి మధ్య పెనవేసుకున్న పరిమళ సుగంధాన్ని చిత్రిస్తూ **"మట్టే-మట్టి మీద మట్టే-మనిషి అంత మట్టి"** అనడంలో మట్టిజీవితం ప్రాణపదం. ఎందుకంటే శివారెడ్డి గ్రామీణ ప్రాంతవాసి. మట్టివిలువ, మనిషి విలువ తెలిసిన వ్యక్తి. చివరకు కవి వినూత్నరీతిలో 'భూమిలో స్నానం చేయడం తెలుసు నాకు. పశువులు తొక్కిన నేలని పుస్తకంగా భావించటం తెలుసు' అంటారు. పుట్టినవారు గిట్టక తప్పదు మనిషే మట్టి అన్నసత్యాన్ని గుర్తుచేస్తూ వస్తారు.

'దీపావళికి దీపాల మీదే రాయనక్కర లేదు... దీపావళికి గాయాల మీద రాయటం మంచిది.' అంటూ నేటి కాలపు కవిత్వ దీనస్థితిని చెపూ్త దీపావళి ప్రతి సంవత్సరం జరుపుకునే పండుగ గురించి రాస్తే ఏమొస్తుంది. ఆ రోజు జరిగిన సంఘటనల మీద రాస్తే సమాజానికి అవగాహన స్పృహ కలుగుతుంది అంటారు. 'జనం కోసం ఏర్పరచిన రాజ్యాంగం జనానికి విషతుల్యమౌతుంది. చట్టం పాలకవర్గ చేతుల్లో మంత్ర దండమౌతుంది...' రాజ్యాంగ బలహీనతలు రాజుకు బలమైనాయి. జనాలపై ఆధిపత్యాన్ని చలాయిస్తూ చేస్తున్న అవినీతి, అక్రమాలను ఎక్కుపెట్టి తూటాలను విసురుతూ జనచైతన్య స్పృహ కల్పించాలనే తపన ఈ కవితలో కనపడుతుంది. 'మనిషి సమూహంలో ఆనందిస్తాడు. మనిషి సముహంలో ఆగ్రహిస్తాడు. మనిషి సామూహిక ఆగ్రహమే ఉద్యమం.' మనిషినే వస్తువుగా స్వీకరించి సమూహ సమాజంలో మనిషి మూర్తిమత్వం ఎలా రూపొందుతున్నాడో చెపూ్త వస్తారు. 'ధ్వంసం చేయబడని పరమ విధ్వంసక శక్తి జనమే' అని గట్టిగా నమ్మే వ్యక్తి శివారెడ్డి. శివారెడ్డి గారిని శిఖరప్రాయంగా నిలబెట్టే కవిత **'వృద్ధాప్యం.'** బహుశా గ్రామీణ ప్రాంతాల్లో చూసిన దృశ్యాలు కావొచ్చు. శివారెడ్డి కవితలో శిల్పాలై కదులుతున్నాయి. ఈ కవితలో శివారెడ్డి వృద్ధాప్యంలో జరిగే ప్రతి సంఘటన మంచి ఉపమానాలతో, ప్రతికలతో వివరిస్తుంటాడు.' **వృద్ధాప్యం కుడితిలో ఈగ.. వృద్ధాప్యం సంతానం సాలెగూట్లో పురుగు..'** అని ఈగ, సాలే పురుగు, మంచుగడ్డ, కత్తుల ఊబి లాంటి చక్కటి ఉపమానాలు, భావుకతను ప్రదర్శించారు. ఒక దగ్గర **'కదల్లేని శరీరాన్ని పట్టుకున్న చీమలు... మనుషులకు లోకువ చీమలకు లోకువ ఈగలకు లోకువ'...** అని ముసలితనంలో పడే బాధలు మనస్సును కదలిస్తాయి. ఇవే కాదు ముసలితనంలో తనకు తోడుండే వివిధ రకాలైన వస్తువులను కూడా స్పృశిస్తూ చెప్తాడు. ఆ ముసలి వాడు వేసారి పోయి జీవితం మీద విరక్తి కలిగి ఇలా అంటాడు.

**"సంతనాలు నేరాలవుతున్నాయి**

**సంబంధాలు నేరాలవుతున్నాయి**

**వృద్ధాప్యం నేరమవుతుంది**

**జీవించడం నేరమవుతుంది"** అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ గోడ పక్కన విసిరేసిన చిల్లులు పడ్డ పాత డబ్బాతో వృద్ధాప్య జీవితాన్ని పోల్చాడు. గాయం ప్రతీకగా తీసుకొని **"నువ్వు గాయపడలేదా"** కవితలో శివారెడ్డి

అనుభవము, నిశితమైన పరిశీలన కనిపిస్తుంది. మనిషి జీవితమే గాయం. కొత్తగాయం పాతగాయం అనే ప్రశ్నేమిటి? గాయం మానిందెప్పుడు-గాయం తగలనిదేప్పుడు అంత గాయమైన బతుకులో కొత్తగా గాయాన్ని వెతకాల్సిన పనేముంది అంటాడు. గాయం గురించి విస్తారంగా చెప్పటంలో తాను మానవ స్వభావాన్ని సూక్ష్మదృష్టి కోణంతో లోతుల్లో పరిశీలిస్తాడు. **"మాట్లాడు"** అనే కవితలో మాట్లాడే స్వేచ్ఛ గురించి ఇలా అంటాడు. **"ఇంత మంది కలిసి ఎక్కించినవాడే మన కంఠాలపై అడుగులేసుకుంటూ నడుస్తున్నాడు"** అంటూ ఆ నాటి కాలపు రాజకీయ చర్యా శీలత అది ప్రజలపై చూపించే అధికారాన్ని పాలకుల అహంకారాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తాడు. ఫలితంగా మానవునికి స్వేచ్ఛ ఎంత ముఖ్యమో వివరిస్తారు. **"గొంతు"** అనే కవితలో అతని గొంతొక్కటే అంతై ఇంతై భువనమంతై ఈ భువనమెంతుందో అంతవరకు ప్రతిధ్వనిస్తుంది. మౌనంగా ఉండటం యుద్ధ నేరం. ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తూనే ఉండాలి అంటూ ప్రేరణాత్మకమైన అవగాహన కల్పించారు.

**'మాట'** కవితలో శివారెడ్డి మాట మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. మాటను రక్షించుకోవడం అంటే మనల్ని మనం రక్షించుకున్నట్టే. యుద్ధాలు ఇప్పుడు మనకేం కొత్తకాదు ఆరాట పోరాటాలు వస్తుంటాయి. పోతుంటాయి కానీ **"మాట మాత్రమే శాశ్వతంగా బతుకుతుంది. రాజకీయ చైతన్యం కలిగిన జనం గుండెల్లో మాటకు నిలబడే వ్యక్తి జన హృదయాలను శాసిస్తాడు. "మనిషి గొప్ప వస్తువు"** కవితలో శివారెడ్డి సృజనాత్మకత, విస్తృతమైన అధ్యయనం కనబడుతుంది. ఈ కవితలో నాణానికి ఇరువైపులా ఉన్న ప్రతిరూపాలను చూపించాడు.

**"ఎటు నిలబడుతావు"** కవితలో

**ఎటు నిలబడుతవో చెప్పు**
**మధ్యే మార్గాల ముండ మోపి ముసుగులక్కర లేదు**
**రెండు పక్షాలు**
**జనమున్నారు జన కంటకులున్నారు**
**ఇక్కడ కవి రాజకీయ విశ్లేషకులుగా కనపడుతారు.**

పార్టీలకు భజన చేసే వాళ్ళు, వర్గాలకు అతీతులు, మానవత వాదులు అని చెప్పుకునేవారు జన కంటకుల కోవాలోకి చేరుతారు. మధ్యే మార్గం అనేది మితవాదుల మార్గం అనే ఈ మార్గం వల్ల శ్రామిక శక్తులను ఏకం చేయటం సాధ్యం కాదు కనుక కవి మితవాదుల ముసుగులు వదిలేయాలని కటువుగా, ఘాటుగా విమర్శిస్తారు. **"కవి అంటేనే దేశం"** అనే కవితలో శివారెడ్డి మానవతా సంబంధాలను విశ్లేషించి, కవిగా తన దేశంపై బాధ్యతను నిష్కపటంగా విమర్శిస్తూ వస్తారు. 'మనుషుల్ని గుర్తు పట్టలేని స్థితిలో కవికి దేశం గుర్తుంటుంది. దేశం అంటేనే కవి కవి అంటేనే దేశం' అంటాడు. కవిత్వం చేసే పని, జనం చేసే పని గురించి కొత్తగా చెప్తూ **'నిఘా'** కవిత రాస్తాడు. పాలక వర్గాలు జన సమితి పైవేసే నిఘా అనేది నిరంతర ప్రవాహంలా జనం గుండెల్లో రహస్యాలను వింటుంది. ఆ పాలక వర్గాల అధికారాలను ఆటలను అరికట్టించడానికి జనం వేసే నిఘ కవిత్వం. ఈ కవిత్వం ప్రభుత్వ అరాచకాలను చీల్చి చెండాడే ఖడ్గం అని, ఆపరేషన్ శస్త్రం అంటు జనం గుండెల్ని ప్రోత్సహించడం. శివారెడ్డి కవిత్వంలో అణువు అణువు ఉప్పొంగికదిలేది పొంగిపొర్లేది. ఈ రాజకీయ చైతన్యమే. నిబద్ధత, నిశితమైనపరిశీలన, ఆక్రోశం, ఆవేశం, తార్కనానికి నిదర్శనం. **'అంతా అయిపోయినట్టు'** కవితలో యుద్ధం మొదలవక ముందే ముసలివారిలాగా విశ్రాంతి తీసుకుంటారెందుకు ఇప్పుడే మొదలైంది యుద్ధం సమాజ పీడితుల్ని తరిమికొట్టడానికి అంటు చైతన్యం పురికొల్పుతాడు. శివారెడ్డి స్పష్టతకు, సూక్ష్మ దృష్టి కోణానికి, మొత్తం జన సంచారాల్లో ప్రాణ ప్రతిస్పందన వెతుక్కునే వాడిగా, మనుషుల నాడిని పట్టుకుంటాడు. ఈ **'మీలోని'** కవితలో కవి మనిషి నాడిని వెతుకుతు, మనిషిలో వుండే అత్యున్నత శక్తిని ఎందుకు గుర్తించలేకపోతున్నారో చెప్తారు.

మీలోని సంగీతాన్ని మీరెప్పుడైనా విన్నారా

**సమస్తవస్తు వాద్యసమ్మేళనాన్ని సమస్తదేహంతో విన్నారా...** అంటు ముందు నిన్ను నువ్వు గుర్తించుకో అని చివరగా '**విచిత్రం! కళ్ళుండీ అందులమైనట్టు... చెవులుండి బదిరులమై పోతున్న జీవనవ్యాకులత...**' అన్ని ఉండి కూడా సమాజ స్పృహ కోల్పోయి మానవ జీవితార్థ వ్యాకులతకు పర్యాయంగా మారింది. ఒక్కసారి నీలో దాగిన అనంతమైన శక్తిని గుర్తించి నిన్ను నువ్వు సార్ధకం చేసుకో అంటారు. శివారెడ్డి మేధస్సు ఒక్క కవిత్వం మీదే కాదు సమస్త అంశాలపై చర్చించగల వక్త.

**'నా కళ్ళ ముందే'**అనే కవితలో' **మన ప్రాణం నుంచి కొంత ప్రాణం తీసి పద్యాలకి ప్రాణం పోయాలి'** ఇక్కడ శివారెడ్డి నిబద్ధత చాలా స్పష్టంగా చూడొచ్చు. శివారెడ్డి అంటే కవిత్వం-కవిత్వం అంటే శివారెడ్డి." **కవి అనే వాడు తనను కాల్చుకొని, కాల్చుకొని ఎర్రని ఇనుముగా మారుతే తప్ప మనం అనుకున్న ఆకారాన్ని వస్తువుకు ప్రాణం పోయగలం** అని ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటిస్తారు. కవి ఒక కవిత రాస్తున్నప్పుడు వస్తువులో నిమగ్నమై కవికి విషయంపై సంపూర్ణ అవగాహన, నిశిత పరిశీలన, రాసే ప్రతి అక్షరాలు పొదలపై నిబద్ధత ఎంత అవసరమో ఈ కవిత ద్వారా నేటి యువకవులకు చెప్తాడు. నా కవిత్వం ద్వారా ప్రేరణ పొంది గొప్ప గొప్ప విషయాలను సమాజానికి తెలియజేయుటకు చైతన్యవంతమైన వస్తువులతో కవితలు రాస్తున్న వారిని చూస్తు పొంగి పొర్లేను నాజీవన ధార. అంటు **"నా స్తన్యం తాగిన అక్షరాలు నాకళ్లముందు ఎదుగుతూ ఉంటాయి"** అంటాడు.

ఈ కవిత సంపుటి జీవితలోతుల్లోనుంచి వచ్చిందని భావించాలి. గ్రామీణ కవిగా, మట్టి కవిగా తన అనుభవాలకు, సృజనాత్మకతకు నిదర్శనం. కవిత్వం ఒక మానవోద్యమంగా వెలిగే దివిటి శివారెడ్డి. ఆయనలో ఉన్న సామాజిక దృక్పధం, సమాజ విశ్లేషణ, నిషితమైన పరిశీలన, నమ్మిన సిద్దాతం, నిబద్ధత, మట్టి విలువ-మనిషి విలువల ప్రాధాన్యం, సమూహదృష్టి, భయ, దుఃఖ వ్యతిరేకత, జన జీవన దృశ్య ప్రదర్శన, పరిష్కార ప్రతిఫలనం కల్గి ఉండటం. వచన కవిత్వాన్ని ఈటలుగా చేసి సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలపై ఎక్కుపెట్టి తూటాలను విసురుతు వస్తున్నాడు. కవిగా సమాజంలో తమ బాధ్యత నిర్వర్తిస్తున్నారు. మంచి కవిత్వం పాఠకుని గుండెల్లో పదిలంగా ఉంటుంది. ఆ మంచి కవిత్వానికి పెట్టిన పేరే శివారెడ్డి. శివారెడ్డి కవిత్వం పల్లె నుండి పట్నం వైపు పయనించి చిక్కని ద్రవంలా, చక్కని పరిమళంను వెదజల్లుతు అజ్ఞానికి సైతం జ్ఞానోదయం ప్రసాదించే అద్భుతమైన శక్తి తెలుగు సాహిత్యంలో ప్రతిష్టించిన ఘనుడు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. సీతారామారావు ఆర్. – తెలుగులో ఆధునిక కవితా ధోరణులను, 1992.
2. శివరామకృష్ణ పెన్నా, గుడిపాటి – శివారెడ్డి కవిత్వం విమర్శలు, విశ్లేషణలు, విప్ల కంప్యూటర్ సర్వీస్, నల్లకుంట, హైదరాబాద్, 2009.
3. నారాయణరెడ్డి సి – ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయములు, ప్రయోగాలు, విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ, 2015.
4. యాదగిరి కె. (సం.) – తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2003.

# మధురాంతకం రాజారాం కథలలో మానవీయ దృక్పథం

**గొల్లపల్లి వనజ,** పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు

తెలుగు కథా సాహిత్యంలో రాయలసీమ కథా సాహిత్యానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. సీమ రచయితలు కొందరు రాయలసీమలోని సమస్యలను ఆవేదనతోనూ, ఆక్రోశంతోనూ, అనుభవపూర్వకంగా తమ కథలలో వ్యక్తీకరిస్తే, కొందరు కథనంలోనూ, కథా నడకలోనూ సున్నితంగా వ్యక్తీకరించారు. అలాంటి వారిలో రాయలసీమ కథా రచయితలలో మొదటి తరానికి చెందిన మధురాంతకం రాజారాం ముందు వరుసలో ఉంటారు. మధురాంతకం రాజారాం చిత్తూరు జిల్లా మొగరాల గ్రామంలో 1930, అక్టోబర్ 5న ఆదిలక్ష్మమ్మ, విజయరంగం పిళ్ళై దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య ఒక ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. 1945 లో చిత్తూరులోని జిల్లా బోర్డు హైస్కూలు (ప్రస్తుతం పి.సి.ఆర్ కళాశాల) నుంచి ఎస్.ఎస్.ఎల్.సి పూర్తిచేశాడు. చదువుకునే రోజుల నుంచి ఆయన సాహిత్యం పట్ల అభిరుచి కలిగి ఉండేవాడు. రాజారాం వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. 1948లో టీచర్ ట్రైనింగ్ ముగిసిన తరువాత మొగరాల ప్రాథమిక స్కూల్లో ఉపాధ్యాయుడిగా నియమితులయినారు. అప్పటి నుండి దాదాపు నలభై సంవత్సరాలపాటు పనిచేసి 1988లో పదవీ విరమణ పొందాడు.

మధురాంతకం రాజారాం ముందు గేయ రచయితగా తన రచనా ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. రాజమండ్రి రౌతు బుక్ డిపో, చెన్నై, కొండపల్లి వీరవెంకయ్య కంపెనీల నుంచి వచ్చే కొవ్వలి లక్ష్మీనరసింహరావు, జంపన చంద్రశేఖరరావు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, ఎం. అప్పారావు పట్నాయక్ లాంటి రచయితల నవలలు చదివేవారు. తరువాత ఆయనకు ఆంధ్రపత్రిక, భారతి లాంటి పత్రికలతో పరిచయం ఏర్పడింది. అందులో రచనలు, పద్యాలు, గేయాలు చదివి ఆయన సాహితీరంగం వైపు ఇంకా ఉత్తేజితుడయ్యాడు.

1951లో ఆయన రాసిన పరమానంద శిష్యులు అనే కథా గేయం ఆంధ్రపత్రికలో ప్రచురితమైంది. మధురాంతకం రాజారాం రాసిన తొలికథ చిత్రగుప్తలో 1948లో ప్రచురించబడింది. ఆ తర్వాత నుండి ఆయన కథలు పుంఖానుపుంఖంగా వెలువడటంతో రాయలసీమ కథకుడిగా ఆయన పేరు తెలుగు కథా సాహిత్యంలో స్థిరపడిపోయింది.అప్పటినుండి ఈయన రాసిన కథలు 350కి పైనే ఉంటాయి. కథలతో పాటు రెండు నవలలు, సాహిత్య వ్యాసాలు, అనువాద రచనలు, బాలల కథలు, గేయాలు రాశారు. 1968లో ఆయనకు ఉత్తమ కథకుడిగా సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వాళ్ళు ఈయన కథలను ఐదు సంపుటాలుగా ప్రచురించారు. "మధురాంతకం రాజారాం కథలు" మొదటి కథాసంపుటికిగాను కేంద్రసాహిత్య అకాడెమీ బహుమతిని పొందారు. ఈ కథాసంపుటికి ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడెమీ పురష్కార గ్రహీత పాలగుమ్మి పద్మరాజు "మాటలు నేర్చిన మధ్యతరగతి" అనే ముందుమాటను రచించారు. ఈ కథాసంపుటిలో సర్కసుడేరా, మానవుడి విజయం, నమ్మరానివాడు, వ్రతభంగం, చేదునిజం, త్రిశంకుడి స్వర్గం మొదలైన నలభై కథలు ఉన్నాయి. ఈ కథలలో చాలావరకు సమాజంలోని మానవ స్వభావాన్ని రచయిత చిత్రీకరించాడు.

'సర్కసుడేరా' కథలో దైనందిన జీవితంలో మానవుడు బ్రతకడానికి సర్కసులో చేసే సాహస కృత్యాలకన్నా ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదకరమైన పనులను చేస్తున్నారని రచయిత ఈ కథ ద్వారా తెలియజేసాడు. ఈ కథలో కథకుడు సర్కసు

చూడటానికి వెళ్ళి అక్కడ సర్కసు వాళ్ళు చేసే ప్రతి కృత్యాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. తీగపై అవలీలగా నడచి వెళ్తున్న అమ్మాయిని ప్రాణాలకు తెగించి ఇనుపరేకుపై ఒంటికాలిపై నిలబడి టికెట్లను కొని బ్లాకులో అమ్మిన నాగులుకు చూపిస్తాడు. నాగులు రక్తంతో తడిసి నెత్తురు గడ్డలా ఉన్న తన కాలుని చూపిస్తాడు. దాన్ని చూసిన కథకుడు "డబ్బారేకు అంచుపైన అరగంట సేపు అసిధారావ్రతం సలుపగలిగిన నాగులు ఎదుట తీగపైని నడకను గురించి ప్రస్తుతించబోయినందుకు నాకు నేనే కించపడ్డాను" అనుకుంటాడు. సర్కసులో చేసే ప్రతి సాహస కృత్యానికి నాగులు అంత ఆశ్చర్యపోకుండా బయట కూటికోసం సర్కసుకంటే ప్రమాదమైన పనులు చేస్తున్నారని నాగులు కథకుడికి గుర్తుచేస్తాడు. చివరికి కథకుడే "నామాట మిగిలించాడు కాదన్న ఉ క్రోషాన్ని ఆవలికినెట్టి నిజమాలోచిస్తే నాగులు వాదంలో వాస్తవం లేకపోలేదు. కూటికోసం కోటి విద్యలయితే ఆ కోటి విద్యల్లో కత్తిమీద సాములాంటివెన్ని? మిత్తికోరల్ని సానపెట్టడం లాంటి వెన్ని? నాలుగు దూలాల్ని ఒక్కటిగా చేర్చికట్టి దానికి పడవ అని పేరుబెట్టి సముద్రంలో ఓపినంత దూరం తిరిగి చేపలు పట్టి తెచ్చుకొంటేగానీ పొట్టగడవని బెస్తవాడి బ్రతుకు కత్తిమీద సాముగాక మరేమిటి? పాతాళలోకం లాంటి భూగర్భంలో, కదలడానికీ మెదలడానికీ సావకాశం లేని చీకటి గొందుల్లో పారచేతబట్టి పనిచేసేవాడి బ్రతుకు మిత్తి కోరలకు సానపెట్టటంగాక మరేమౌతుంది? నిర్మాణంలో వున్న ఐదంతస్థుల మేడపైకి కర్రనిచ్చెన ద్వారా యిటుకరాళ్ళు మోసుకెడ్తున్న ఆడమనిషి సురక్షితంగా క్రిందికి దిగిరాగలదని ఎవరు చెప్పగలరు? చెంబును పైకితీయడానికి పదిగజాల లోతున్న బావిలో మునుగుతున్న గజ ఈతగాడు మళ్ళీ సజీవంగా తేలగలడన్న పూచీ యేముంది?" (మధురాంతకం రాజారాం కథలు, పుట : 14) అని వాస్తవాన్ని గ్రహిస్తాడు. "తీసుకో, తీసుకో అని కుర్రవాణ్ణి వూరించి, వాడు దగ్గరికి వచ్చే లోపుగానే మనం దాచిపెట్టుకునే తినుబండారంలా అంతలో మృత్యువుచేత చిక్కిబిక్కరించబోయి, యింతలో దూరంగా వెళ్ళి వెక్కిరించడమేనా మానవ జీవితం?" అని ప్రశ్నించుకుంటాడు కథకుడు.

'మానవుడి విజయం' కథలో మోసానికి, దోపిడీకి అలవాటుపడి రాక్షసుడిలా బ్రతుకుతున్న ఆదిశేషయ్య చివరికి మానవత్వాన్ని కలిగిన వాడిగా మార్పుచెందడం ఈ కథలోని వస్తువు. ఈ కథలో ఆదిశేషయ్య కష్టపడి పని చేసి బ్రతకడం నామోషీగా భావించి బ్రతకడానికి అడ్డదారులను ఎంచుకుంటాడు. కష్టాన్ని నమ్మడం మాని మోసపూరితమైన తెలివితో "ధర్మవరం నుంచి రాయలపేటకు వెళ్ళే రోడ్డులో పన్నెండో మైలురాతి దగ్గర గ్రుక్కెడు మంచినీళ్ళు దొరకక బాటసారులు తల్లడిల్లిపోతున్నారు. అందుకు తోడు ఆ ప్రాంతంలో తల చాటుకొక చెట్టయినా కనిపించదు. అక్కడ చేదబావి ఒకటి త్రవ్వి ఓ సత్రాన్ని నిర్మించాలి. అందుకోసం ఉదారహృదయులైన సజ్జనులు విరివిగా చందాలు, విరాళాలు ఇచ్చి తోడ్పడవలసిందిగా అభ్యర్థించడం విజ్ఞప్తి" అని కథకుడిని ఒక పత్రం రాసిపెట్టమని తీసుకుని తన సంపాదన వేటను మొదలుపెడతారు. దాని తరువాత కొన్నాళ్ళు మంత్ర తంత్రాలు ద్వారా డబ్బు సంపాదించాలనుకుంటాడు. మంత్రతంత్రాలతో చింతకాయలు రాలవని తెలుసుకుని మళ్ళీ ఊరు ఊరు మొత్తం కాలిపోయిందని విరాళాలకు వెళ్ళినప్పుడు ఆదిశేషయ్య పోలీసులకు దొరికిపోయి జైలు పాలవుతాడు. జైల్లో నానా చాకిరీ చేసి, అనారోగ్యం పాలయ్యి భార్యా పిల్లలు గుర్తుకొచ్చి చేసిన తప్పుకు పశ్చాత్తాప పడుతాడు.

'నమ్మరానివాడు' కథలో మధురాంతకం మనుషుల మధ్య ఉన్న నమ్మకాల బలహీనతను గురించి తెలియజేసాడు. సుబ్బయ్య తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు కావడంతో గారాబం ఎక్కువయ్యి సుబ్బయ్య చెప్పిందే చేసేవారు దానితో సుబ్బయ్య నిరక్ష్యరాస్యుడవుతాడు. సుబ్బయ్య తండ్రి భూదేవిని నమ్ముకుని తాను తినగలిగినంత తిని, ఆశించిన వాళ్ళకు ఇంత పెట్టి తన కట్టెను కడతేర్చుకుపోయిన రైతు. సుబ్బయ్య తండ్రి నుండి కులవృత్తిని కూడా సంపాదించుకోలేకపోతాడు. దూరపు బంధువైన రంగయ్య సుబ్బయ్యను తనతో పాటు వ్యాపారం చెయ్యమని ప్రోత్సహిస్తాడు. సుబ్బయ్య అవతలి వ్యక్తులను సులభంగా నమ్మే వ్యక్తి. సుబ్బయ్య వాటా రెండువందల యాభై రూపాయలు రావలసి ఉండగా "తొందరేముందిలే రంగయ్య మామా! నిదానంగా యిద్దువుగానీలే" అంటాడు. సుబ్బయ్యకు డబ్బు ఇవ్వదలచని రంగయ్య నెల్లూరులో మండీవాడు డబ్బు ఇవ్వాలి తీసుకు రమ్మని పంపుతాడు. సుబ్బయ్య ట్రైన్ దిగేలోపు సుబ్బయ్య జేబులోని ఐదువందల రూపాయల డబ్బును కాజేపిస్తాడు రంగయ్య. సుబ్బయ్యే

డబ్బును మాయం చేసాడని నేరం మోపి తన డబ్బును కాజేసినందుకు బాండు రాసివ్వమని బలవంతం పెడుతాడు. ఆ బాండులో ఏముందో తెలియని సుబ్బయ్య తప్పించుకోవాలని పారిపోతాడు. అది చూసిన పెద్దమనిషి ఏదయినా ఉంటే కోర్టులో తేల్చుకోండి అని మందలిస్తాడు.

'వ్రతభంగం' కథలో సాంబయ్య కుటుంబం పట్టుదలకు పర్యాయపదంలాంటిది. సాంబయ్య నలుగురు కొడుకులు తన చెప్పు చేతుల్లో ఉండాలనుకుంటాడు. తన చేతి నుండి డబ్బు పెట్టాల్సి వస్తుంది అని కొడుకు ప్రకాశం చదువును నిలిపివేయించి ఉద్యోగంలో చేరమంటాడు. ప్రకాశం తన సొంత డబ్బులతో పై చదువులు చదువుకుని ప్రయోజకుడవుతాడు. ప్రకాశం పెళ్ళికి కనీసం పిల్లతో పాటు పదివేల గట్టి నాణేలు కట్నం ఇచ్చే వాళ్ళు వెతుక్కుంటూ రావాలనుకుంటాడు. కానీ ప్రకాశం, రెండవ కొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకుని కట్నం తెస్తారనే తండ్రి వ్రతానికి భంగం కలిగిస్తాడు.

'బ్రతుకుబాట' కథలో శ్యామల తల్లిదండ్రులు ఆర్థిక స్తోమత లేకపోవడంతో శ్యామలకు సంబంధించిన బాగోగులను గురించి పట్టించుకోకపోవడంతో శ్యామల తన పెళ్ళి తానే చేసుకుని, చదువుకుని ఉద్యోగం చేసుకుంటుంది. పక్కవారు ఏమనుకుంటారో అని తన ఇష్టాలను, భావాలను చంపుకోకుండా కుండబద్దలు కొట్టినట్లు తన జీవితాన్ని ఒక మంచి బాటలో నడుపుకుంటున్న నిజాయితీ పరురాలు శ్యామల. శ్యామల సంపాదన మొదలయ్యాక తల్లిదండ్రులు, తమ్ముడు డబ్బులు కోసం జాబులు రాసారు. ఆ జాబులకు శ్యామల సమాధానం ఇవ్వకపోవడంతో శ్యామలను స్వార్థానికి మారుపేరుగా ప్రచారం చేస్తారు. ఈ కథలో మంచివారి పట్ల, నిజాయితీగల వారిపట్ల, ఎదుగుతున్న వారిపట్ల లోకం తీరును చిత్రీకరించారు రచయిత. ఈ కథలో అప్పల నరసయ్య మంచితనం, నిజాయితీ, పరులసేవకు పెట్టింది పేరు. నరసయ్య తన పెద్ద కొడుకును ఎంతవరకు చదివించాలో చదివించి, ముగ్గురు కూతుర్లకు పెళ్ళి చెయ్యడంతో బంధు బలగం ఎక్కువవుతుంది. దాంతో వారికి చీరలు, సారెలు పెట్టుపోతలు ఎక్కువయ్యి, ఉన్నదంతా దారాదత్తం చేసి, అది చాలక అప్పులు చేసి మరీ బంధువులకు, తనను సహాయం కోరిన వారికి పంచిపెడుతాడు. అప్పులు అన్నీ తడసి మోపెడు అవుతాయి. దాంతో అప్పల నరసయ్య కాస్త అప్పుల నరసయ్యగా పిలువబడుతాడు. చివరికి నరసయ్య అప్పులు కట్టలేక దివాలా తియ్యాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆస్తినంతా వేలం వేసి అప్పులవాళ్ళు తీసేసుకోవడంతో కట్టుబట్టలతో ఊరు వదలి వెళ్ళిపోతాడు. డబ్బంతా ఎక్కడో దాచేసి ఊరు వదలి వెళ్ళిపోయాడు అప్పుల నరసయ్య అనే నిందను ఊరి జనం అతనిపై మోపుతారు. కొన్నాళ్ళకు నరసయ్య అల్లుడి దగ్గర రెండువేల రూపాయలు అప్పు తీసుకుని అగ్గిపెట్టెల వ్యాపారం ప్రారంభించి వ్యాపారంలో అభివృద్ధి చెందుతాడు. దాంతో ఊరి జనానికి అతనిపై ఉన్న అపోహ మరింత గట్టిపడుతుంది. ఒకరి దగ్గర మాట పడకూడదనే ఉద్దేశంతో, వారి అపోహను పోగొట్టడానికి ఎవరెవరికి ఎంతెంత డబ్బివ్వాలో ఇచ్చేస్తాడు. దాంతో నరసయ్యకు మతి చెడిపోయిందని కొందరు, ఎలాంటి వాళ్ళకైనా వయసుడిగిపోయిన రోజుల్లో పాపభీతి పుట్టుకొస్తుందని కొందరు ఇలాంటి మాటలు అన్నారేగానీ అప్పల నరసయ్య నిజాయితీనీ, మంచితనాన్ని గ్రహించలేకపోతారు.

'త్రిశంకుడి స్వర్గం' కథలో కామేశం ప్రధాన పాత్రధారుడు. కామేశం కోరుకున్న స్థాయిని పొందలేక, ఉన్నదాంతో సాధారణ జీవితాన్ని గడపలేక ఉత్తిమాటలతో స్వర్గాన్ని చూపించి, అందని వాటికోసం ఆశపడే వ్యక్తిత్వం గలవాడు. ఈ కథలో కామేశం రైలు ప్రయాణంలో ప్రకాశానికి తారసపడుతాడు. తన గురించి చెప్పడానికి ఏమీ లేకపోయినా, జీవితంలో బాగా ఎదిగిన స్నేహితుల గురించి డబ్బు, బంగళాలు ఉన్న బంధువుల గురించి ప్రకాశానికి గొప్పలు చెప్పి సంతోషిస్తాడు. ఇద్దరూ ఒకే ఊర్లో బస చెయ్యాల్సి వస్తే ప్రకాశం హోటల్‌లో దిగుతాడు. కామేశం "హోటల్లో దిగితే ఇంకేమైనా ఉందీ! మా తమ్ముడు పీక నొక్కేయడూ! అని వారి ఇంటికి వెళ్తాడు. ప్రకాశం మరుసటి రోజు ఉదయం తన పుస్తకం కామేశం దగ్గర ఉండిపోవడటంతో కామేశం చెప్పిన పెద్ద మేడ గుర్తుకొచ్చి కామేశం కనిపిస్తే తన పుస్తకం తీసుకోవచ్చునని ఆ ఇంటికి వెళ్తాడు. ఆ ఇంటి గుమ్మం ద్వారానికి లోపల తాళం బిగించి ఉన్న ఇనుపకమ్మిల తలుపులు ముందు కామేశం కూలబడి ఉండటం చూసి అసలు నిజాన్ని

గ్రహిస్తాడు ప్రకాశం. ఇలా మధురాంతకం రాజారాం కథలలో సమాజంలో మానవుడి ప్రవర్తనాతీరు, స్వభావం, రకరకాల మనుషుల వ్యక్తిత్వాలు కనిపిస్తున్నాయి.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. కథావేదిక (ప్రథమ వార్షిక ప్రత్యేక సంచిక 1991 – 92), మద్రాసు: కథావేదిక, 1992.
2. చెంచయ్య, వి. సాహిత్యంలో వస్తు రూప శిల్పాలు, తిరుపతి: అభినవ ప్రచురణలు, 2017.
3. దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు, హైదరాబాదు: నవోదయ పబ్లిషింగ్ హౌస్, 2009.
4. దక్షిణామూర్తి, పోరంకి. కథానికా వాఙ్మయం, సికింద్రాబాదు: శివాజీ ప్రెస్, 1975.
5. మధుసూధనరావు, త్రిపురనేని. సాహిత్యంలో వస్తు శిల్పాలు. హైదరాబాదు: పర్స్పెక్టివ్స్ సామాజిక శాస్త్రం/సాహిత్యం, 1977.
6. రంగనాథాచార్యులు, కె.కె. తొలినాటి తెలుగు కథానికలు. హైదరాబాదు: డా. మాడభూషి రంగాచార్య స్మారక సంఘం, 2008.
7. రమాపతిరావు, అక్కిరాజు. సాహితీ వ్యాసంగం. హైదరాబాదు: పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్, 1994.
8. రాజారాం మధురాంతకం, మధురాంతకం రాజారాం కథలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1996.

# రాయలసీమ అభ్యుదయ కథాదీప్తి - కేతు విశ్వనాథరెడ్డి

**ఓ. హరీష్,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

**రచయిత పరిచయం**

సుప్రసిద్ధ కథారచయిత, విమర్శకుడు, విద్యావేత్త, జర్నలిస్టు ఆచార్య కేతువిశ్వనాథరెడ్డి. ఈయన కడపజిల్లా కమలాపురం తాలుకా, రంగసాయిపురంలో 1939లో జన్మించాడు. ఎం.ఏ., పిహెచ్.డి.వరకు విద్యాభ్యాసం చేశారు. కడప, కాళహస్తి, కందుకూరు ప్రభుత్వ కళాశాలల్లో, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో భిన్న స్థాయిల్లో ఉద్యోగి విధి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అంతేకాకుండా “కడప జిల్లా గ్రామ నామాలు” అనే అంశంపై డాక్టరేట్ పొందాడు.

**సాహిత్యరంగం**

ఈయన రాసిన తొలికథ ‘అనాదివాళ్ళు’ 1963లో సవ్యసాచిలో ప్రచురితమైనది. అంతేకాకుండా జప్తు (కథలు), కేతువిశ్వనాథరెడ్డి కథలు, ఇచ్ఛాగ్ని (కథలు), కేతువిశ్వనాథరెడ్డి కథలు (1998–2003), వేర్లు, బోధి నవలలు, దృష్టి, దీపధారులు, పరిచయం సంగమం (వ్యాసాలు) మొదలైనవి రచించారు. ఈయన రచనలు హిందీ, కన్నడం, మలయాళం, బెంగాలీ, మరాఠి, ఆంగ్లం, రష్యన్ భాషల్లోకి అనువాదమయ్యాయి.

**పొందిన సత్కారాలు**

1982లో “కడప జిల్లా గ్రామ నామాలు” అనే సిద్ధాంత వ్యాసానికి శ్రీ ఆలపాటి కృష్ణయ్య, సీతమ్మ పురస్కారం పొందాడు.

1992 –93 లో ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు.

1994లో భారతీయ భాషా పరిషత్ అవార్డు.

1996లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు.

రావిశాస్త్రి, తుమ్మల వెంకట్రామయ్య బంగారు పతకం మొదలైన అవార్డులను గ్రహించారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా కొన్నేళ్ళు బాధ్యతలను నిర్వహించిన కేతువిశ్వనాథరెడ్డి 2023 మే 22న గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చిన కథల సంపుటి నుంచి నా పరిశోధన వ్యాసానికి తగినన్ని కథలను మాత్రమే నేను తీసుకుంటున్నాను.

**‘మార్పు’ కథ**

కేతువిశ్వనాథరెడ్డి గారి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన కథలల్లో ఒకటి మార్పు అనే కథ. ఈ కథ ఉత్తమ పురుషలో ఉంటుంది. ఈ కథలో ప్రధానంగా ఉన్నత కులాలకు చెందిన పెద్దింటి రైతులు కూలీ జనాల శ్రమను ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో, అదే విధంగా శ్రమకు తగిన వేతనం కావాలన్నందుకు వారిని నీచాతి నీచమైన మాటలతో దుర్భాషలాడటం, గొడ్డు చాకిరీలు చేసుకొనే పెద్దింటోళ్ళ అరాచకాలను రచయిత ఈ కథలో వివరిస్తాడు.

ఊర్లో జరిగిన ఒక గొడవలో మాదిగిండ్లు తగలబడిపోయాయి. ఊర్లోని పెద్ద రైతులంతా ఒక మగ పురుగు కూడా లేకుండా పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ గొడవేదో మా యింటిని చుట్టుకుందేమోనని భయపడి సెలవు పెట్టి మావూరెళ్ళాను. వల్లకాడైన మాదిగిండ్లను చూశాను. మొండి గోడలు మాత్రమే ఉన్నాయి. ఇళ్ళు కాలుతున్నప్పుడు ఎంత భయంకరంగా ఉండి ఉంటుందో కాటికాపరులు మాత్రమే చెప్పగలరు. మరుసటి రోజు నేను జయచంద్రతో పార్కులో కలుసుకొని జరిగినదంతా చెప్పాను.

రోజుకు రూపాయి కూలీ ఇప్పుడెక్కడన్నా ఉందా? అందుకే ఇప్పుడింత గొడవ. తాతల కాలం నుంచి ఇస్తున్న రూపాయి కూలికే మాదిగలు పని చేయాలంటారు పెద్దింటి రైతులు. ఈ ధరల్లో అది గిట్టదన్నారు వాళ్ళు. కూలీ పెంచమన్నారు. దానికి రైతుల సమాధానం సారాయి తాగే నా కొడుకులకు ఎంతిచ్చినా ఒకటే.

ఏమన్నా మిగిలించుకుని చస్తారా? ఒళ్ళు పొగరెక్కి ఎప్పుడూ లేంది స్వతంత్రం వచ్చాక తిరగబడ్డం నేర్చుకున్నారు. మక్కెలు విరగదన్నేవాళ్ళు లేక వ్యవసాయం ఖర్చులు అమితంగా పెరిగి అల్లాడుతుంటే కూళీ పెంచాలట. పైగా రైతు ఖర్చులెన్ని? అడిగినంత కూళీ ఇస్తే రైతు ముండ మోయాల్సిందే. జయచంద్ర రైతులన్న మాటలకు సమర్థిస్తాడు. నాకు ఒళ్ళు మండింది. అప్పుడు నేను ఈ విధంగా అన్నాను. రైతులు చెప్పింది గిట్టుబాటు విషయంలో నిజమే మీరనేది. అయితే వందల ఎకరాలు, మిల్లులు ఉండేవాళ్ళు సంగతి వాళ్ళది పగటి దోపిడి మీరు నమ్మకపోవచ్చు పొద్దున పేడకళ్ళు, గంజి ఎత్తిపోయాలి. మధ్యాహ్నం రెండు గంటల దాకా పొలం పని చేయాలి. మిగతా అప్పుడు దంచడమో, ఆడ, మగ పిల్లా జల్లా అనే భేదం లేదు. వీళ్లిచ్చే రూపాయికి 12 గంటల పైగా గొడ్డు పని చేయాలి. నోరులేని గొడ్లు కూడా పనిచేయవు.

అందుకు కూలీ అడిగినందుకు ఇళ్ళను తగుల బెట్టారు. ఈ విధంగా చెప్పుకుంటూ ఉండగా రోడ్డుపైన ఏవో నినాదాలు విన్పించాయి. మేమిద్దరం రోడ్డు మీదకు వచ్చాం. రోడ్డు మీద ప్రదర్శన మా ఊరి హరిజనుల్లా వినిపించాయి. నా రక్తంలో ఏదో అలజడి మొదలైంది అని కథ ముగుస్తుంది.

ఈ కథ చదువుతుంటే ఆ దృశ్యమంతా మనకళ్ళ ముందు కదులుతున్నట్లు ఉంటుంది.

**సానుభూతి**

ఈ కథలో వర్గదోపిడి, శ్రమదోపిడి, వెట్టిచాకిరి అనేది ఏ విధంగా చేయించుకుంటారో స్పష్టంగా రచయిత కళ్ళకు కట్టినట్లు వివరిస్తాడు. ఈ కథ కూడా ఉత్తమ పురుషలో ఉంటుంది. మాదిగల పురోగమనం అనేది ఈ కథలో స్పష్టంగా ఉంటుంది.

కష్టాలంటే యేమిటో, కష్టాలు యెంత క్రూరమైనవో నాకు తెలుసు. మా కుటుంబానికి తెలుసు. మా వూర్లో ప్రతి యేడాది దేవర జరుగుతుంది. దేవరలో మొదటి బోనం మాదే. ఈ యేడాది ఏం పోయే కాలం వచ్చిందో మా వూరి మరో పెద్ద రైతు చెంచిరెడ్డి ఆ బోనం తమ కుటుంబానికి చెంది తీరాలన్నాడు. చెంచిరెడ్డి వాళ్ళకు మాకు పడేది కాదు.

మాదాయాదులు పాపిరెడ్డిది మావీ పక్క పక్క చేన్లే. పాపిరెడ్డి సేద్యగాడికి, మా సేద్యగాడికి మధ్య గొడవ జరుగుతుంది. దాని వల్ల మాకూ మా దాయాదులకు పొలం వల్ల కురుక్షేత్ర యుద్ధం మొదలైంది. ఆస్తి గొడవలు సామాన్యమైనవి కావు ప్రాణాంతకమైనవి.

ఇదిలా ఉంటే ఏటి ఒడ్డు కింది మాదిగలు ఇరవై యేండ్ల నుంచి సాగుచేసుకుంటున్నారు. అయితే భూమి, పట్టా మాది అయినప్పుడు మా భూమి మాకు దాఖలు పరచడం న్యాయం. మా అన్న న్యాయంగా అడిగి చూశాడు. వాళ్ళెందుకు వింటారు? తెలివి మీరిన జనం. బరితెగించిన జనం కదా? అయితే వాళ్లనేదేమంటే ఇంతకాలం భూమిని సాగు చేస్తుంటే ఎందుకూరుకున్నారు? పంట పక్వానికి వచ్చిందని గొసులు విప్పుకొని వచ్చారు. దొంగ పట్టాలు కొని, మేమియ్యం. యెందుకియ్యాల? ఏమైతే అది అవుతుంది అని తిరగబడ్డారు. ఇంత పొగరు వాళ్ళకే వుంటే ఆస్తి పరులు కెంత వుండాలి? అప్పుడు రైతులందరూ కలిసి చిల్లర జనం పొగరు అణచాల్సిందే అన్నారు.

ఇప్పుడు మావూళ్లో పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. మాదిగలోకవైపు, రైతులొక వైపూ. ఈ కథంతా నా క్లాసుమేటు రామకృష్ణతో అన్నాను. అయితే వాడు సానుభూతి మా మీద సానుభూతి చూపిస్తాడనుకుంటేకాని చూపకపోగా నిజమైన కష్టాలు మీవి కాదు బుద్ధి జ్ఞానం వున్నవాడెవడూ మీ ఏడ్పులకు బాధపడడు. మీ కష్టాలను మీరు తెచ్చిపెట్టుకున్నదే. నిజమైన అవస్థలంటే మీవూళ్ళో హరిజనులు పడే అవస్థల్లాంటివి. వాళ్ళ గోడుకు వాళ్ళు కారణం కాదూ – మీరే కారణం. కావలసినంత ఆస్తులున్నా మీ లాంటి వాళ్ళ కెందుకు సానుభూతి? అవేవీ లేని వాళ్ళకు అవసరం ప్రేమ, సానుభూతి మీ కెందుకూ? ఆ మాటలకు దక్కిన ఆస్తిని నిలబెట్టుకోడానికి మామీద తిరగబడిన మావూరి మాదిగలే నయం వీడకింటే. వీడి ప్రేమ, సానుభూతి లేకపోతే పోయె! అనిపించింది

**చీకటినాడీ – వెలుగునెత్తురూ**

ఈ కథలో కూడ క్రింది కులాల వారిని పై కులస్తులు ఏవిధంగా అణగద్రొక్కుతున్నారో సుబ్బులు వంటి అమ్మాయి తమ కులపోల్లను, వారి ఊరి జనాన్ని రామిరెడ్డి ఏవిధంగా శ్రమను దోచుకుంటున్నాడో తెలియజేస్తూ వారిలో మార్పును, చైతన్యాన్ని తీసుకురావడాన్ని ఇందులో కథా వస్తువుగా తీసుకోవడం జరిగింది.

90 ఎకరాల మాగాణి కలిగిన వాడు రామిరెడ్డి. ఆయన దగ్గర ఎంతో మంది కూళీ వాళ్ళు పనిచేస్తున్నారు. వారికి తగిన కూళీ ఇచ్చేవాడు కాదు. అడిగినప్పుడల్లా ఏవో తప్పుడు లెక్కలు చెప్పి వారిని మోసం చేసేవాడు. అయితే పుల్లన్న తన కొడుకు ఓబులేసుకి పెళ్లి కుదిరిందంటూ 500 రూపాయలు కావాలని రామిరెడ్డిని అడుగుతాడు. దానికి రామిరెడ్డి ఏవేవో మాట్లాడి డబ్బు ఇవ్వకుండా పంపేస్తాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న కాబోయే కోడలు సుబ్బులు రామిరెడ్డి చేసే మోసాలు, తప్పుడు లెక్కలు, కుట్రను, శ్రమదోపిడిని తెలియజేస్తుంది. ఊరి జనం మధ్యన రామిరెడ్డి మాదిగోళ్ళతో సమావేశం ఏర్పాటు చేయించినప్పుడు ఎడాపెడా తిడతాడు. అయితే చదువుకున్న సుబ్బులు ఏ మాత్రం భయపడకుండా రామిరెడ్డిని ఎదిరిస్తుంది. ఆ మాటలు విన్న మాదిగోళ్ళలో ఇంతకు ముందు ఉన్న భయం, బెరుకుపోయి వారి జీవితంలో వెలుగులు నింపుకొంటున్నారు. రామిరెడ్డి నాడుల్లో రక్తపుపోటు మొదలైంది. సుబ్బులు వెంట వచ్చిన కూలినాలి జనంలో నెత్తుటిలో వెలుగులు చిమ్ముతుంది. ఇకపైన ఏం జరిగినా అన్నిటికి తెగింపు ఉన్న ఊరిజనం.

**శృతి**

మంచి ఉద్యోగాల్లో ఉండే కొందరు వ్యక్తులు సాధారణంగా వేరే వారంటే లేదా క్రింది ఉద్యోగస్తుల్ని చులకనగా చూస్తుంటారు. ఎందుకంటే వారికన్నా మేమే గొప్ప వాళ్ళమన్న అహం. అయితే ఈ కథలో ప్రకాశం, చంద్ర ఒక కంపెనీలో మేనేజర్లు అయినప్పటికి కార్మికుల పక్షాన నిలబడి వారికి చేయూతనందిస్తారు. కార్మికులు శ్రమకు తగిన వేతనం కోసం సమ్మె చేస్తుంటే వారికి సహకరించడమనేది ఈ కథలో రచయిత అద్భుతంగా చిత్రిస్తాడు.

ప్రకాశం, అబ్దుల్లా, సేతు, మాధవన్ పాండే నలుగురూ మంచి స్నేహితులు. ఆ నలుగురు నాలుగు రాష్ట్రాల వాళ్లు. అయితే చదువుకున్నది కాన్పూరు ఐ.ఐ.టి.లో బి.టెక్ చదువు అయిపోయింది. తరువాత ఒకేచోట ఉద్యోగం వచ్చింది. అది కూడా కడప జిల్లాలో ఒక మారుమూల బొంబాయి పారిశ్రామికులెవరో కొత్తగా కట్టే సిమెంటు ఫ్యాక్టరీలో.

ఒక రోజు సాయంకాలం నలుగురు ఓ దుకాణంలో కాఫీ కొట్టు దగ్గర బెంచీమీద కూర్చొని కాఫీ తాగుతున్నారు. అప్పుడు ఇంటర్ మీడియట్ స్నేహితుల్లో చంద్ర కనబడి అరేయ్ ప్రకాశం కదా అని పలకరిస్తాడు. అప్పుడు నేను కూడా తనని గుర్తు పట్టి ఆనాటి రోజులు గుర్తుకు వచ్చాయి.

ఇలా జరుగుతూ ఉంటే కొన్ని రోజుల తరువాత చంద్ర ఎన్నో విషయాలు కార్మికులు పడుతున్నటువంటి ఆగచాట్లు శ్రమకు తగిన ఫలితం లేక వాళ్ళు పడే ఆగచాట్లను చంద్ర తన స్నేహితునకు తెలియజేస్తాడు.

చంద్ర కార్మికుల కోసం నిరంతరం కృషి చేసేవాడు. ఈ విధంగా నాకు చంద్ర దగ్గరయ్యే కొద్ది మిగిలిన నిలిపివేయాలని స్నేహితులు దూరం కావడం జరుగుతూ వచ్చింది. సరిగ్గా ఆ రోజుల్లోనే కూలీరేట్ల విషయం మీద, ఇతర కార్మిక సమస్యల మీద ట్రేడ్ యూనియన్ సమ్మెకు పిలుపు ఇచ్చింది. అయితే ఇది కొంత మంది పారిశ్రామికవేత్తలు తెలుసుకొని దీనిని వారి నాయకత్వాన్ని నువ్వే ఎలాగో అలా చెడగొడ్డాలని చెప్తారు. అయితే వారి ముందు సరే అని చెప్పి తన స్నేహితుడు చంద్రకు జరిగిన విషయం తెలియజేసి మరింతగా ప్రోత్సాహాన్నిస్తాడు.

ఉదయం వర్క్‌స్పాట్ దగ్గరకు వెళ్ళే వేళకు సమ్మె చేస్తున్న కార్మిక జనం ఇన్నాళ్ళు దరిద్రం ఓడుతూ అమాయకంగా కనిపించిన వాళ్ళలో పట్టుదల ఒకేపాట. ఒకే మాట – "కార్మికుల ఐక్యత వర్థిల్లాలి" అంటూ ఈ నినాదాల మధ్య కుల, మత, లింగ, వర్గ మనే భేదం లేదు. రెండు రూపాయల కూలీ పెంచడం కోసం ఆ నినాదం చేస్తున్నారా? కాదు అవి సుందరమైన భవిష్యత్తుకోసం సామూహికంగా తెగిస్తున్న నినాదాలు. సమైక్యంగా సాగుతోన్న జనం.

**ఆధార గ్రంథాలు**

1. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి – కథా శిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
2. విశ్వనాథరెడ్డి, కేతు – కేతు విశ్వనాథరెడ్డి కథలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
3. మల్లయ్య, కాలువ – నూటపదేళ్ళ తెలుగు కథ – విభిన్న ధోరణులు, తెలుగు అకాడమి, హైదరాబాదు.
4. హరిబాబు, యం, లక్ష్మీప్రసాద్, మొగిరాల – ఆంధ్రనాడు కథోత్సవ సంకలనం, అక్షర పబ్లికేషన్స్, తిరుపతి.

# అజంతా 'స్వప్నలిపి' కావ్యం - కవితా దర్శిని

**తుళ్ళూరు రవి,** పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం

పత్రికా విలేకరిగా, కవిగా పేరు పొందిన ప్రముఖుడు శ్రీ అజంతా. అజంతా అసలు పేరు పెనుమర్తి విశ్వనాథశాస్త్రి, తూర్పు గోదావరి జిల్లా కేశనికుర్రులో 1929 మే, 25న అజంతా జన్మించారు. తల్లిదండ్రులు పెనుమర్తి కామేశ్వరీ–శ్రీ రామమూర్తి దంపతులు. వీరిది సంప్రదాయ బ్రాహ్మణ – కుటుంబం. రామమూర్తిగారు సంస్కృతి పండితులు వృత్తిరీత్యా ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరు తల్లి కామేశ్వరమ్మ రామాయణం, భారతం మొదలైన ఇతిహాస, పౌరాణిక గ్రంథాలని చదువుకున్నారు.

అజంతా ప్రాథమిక విద్య దాదాపుగా గృహ వాతావరణంలో పూర్తయింది. నర్సాపూర్లో టైలర్ హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి. విజయనగరం మహారాజా కళాశాలలో ఎఫ్.ఏ. పూర్తి చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాల్తేరులో బి.కాం. కోర్సులో చేరాడు. విద్యార్థి దశలో అజంతాను బాగా ప్రభావితం చేసినవారు ఇద్దరు. ఒకరు విశ్వనాథ, మరొకరు కొత్తపల్లి వీరభద్రరావు. ఈ అధ్యాపకుల నుంచి అజంతా సాహిత్యపు పోకడలను తెలుసుకున్నాడు. వీరు ఆనందవాణి పత్రికకు అప్పట్లో ఎడిటర్గా పనిచేస్తున్నారు. అజంతాను చేరదీసి అసిస్టెంట్ ఎడిటర్గా నియమించారు. అప్పట్నించి మొదలై చివరిదాకా జర్నలిస్టుగానే అజంతా జీవితం కొనసాగించాడు. ఆనందవాణి, ఆంధ్రప్రభ ఆయన పత్రికారచన చేశాడు. ఆనందవాణిలో ఆ తర్వాత జై భారత్ పత్రికలో న్యాపతి సుబ్బారావు కింద కొన్నాళ్ళు పనిచేశాడు. ఆంధ్రప్రభ విజయనగరంలో హైదరాబాద్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. వివాహానంతరం సంసార జీవితం ప్రారంభించాడు. నిరుద్యోగిగా ఉన్న సమయంలో వ్యాపార జీవితం, వ్యాపార కళలు, అక్కడి దుర్భరమైన పేదవాళ్ళ బతుకులు ఆయన్ను కలవరపెట్టాయి. ఎక్కడికి వెళ్ళాల్సి వచ్చినా కాలి నడకనే వెళ్ళేవాడు. దాదాపుగా అజంతా దుర్భరమైన దారిద్ర్యాన్ని మద్రాసులో గడుపుతూ వచ్చాడు. వృత్తిరీత్యా ఆనందవాణిలో పనిచేస్తూ ప్రవృత్తిరీత్యా సాహిత్యజీవితం గడపడానికి మద్రాసు నగరం దోహదం చేసింది. శ్రీశ్రీ, ఆరుద్ర మొదలైన వారితో సహచర్యం లభించింది.

**రచనలు**

అజంతా కవిత్వం రాస్తున్న ప్రాథమిక దశలో హాసన్, విశ్వనాథ మొదలైన పేర్లతో ఎన్నో కవితల్ని రాస్తుండేవాడు. సమకాలీన కవిత్వాన్ని బాగా చదువుకున్నాడు. గ్రంథాలయాల్లో టి.ఎస్. ఇలియట్, చార్లెస్ డికెన్స్, డిలాన్ థామస్ మొదలైన పాశ్చాత్య సాహిత్యవేత్తలను అధ్యయనం చేశాడు. కవిత్వంగా దేన్ని చెప్పాలి అనే దానికంటే ఎలా చెప్పాలి అనే విషయాన్ని సాహిత్యాధ్యయనం ద్వారా ప్రస్ఫుటపరచుకున్నాడు. అజంతా కవితా రచన చేసే రోజుల్లో శ్రీశ్రీ అభ్యుదయ కవితా సారథిగా ఉన్నాడు. ఆనాటి కవుల్లో చాలా మంది ఆయన అనుసరణగా ఉన్నారు. ఆ కాలంలో అజంతా తనదైన కవితా ముద్రను, శైలిని, శిల్పాన్ని రూపొందించి ఆధునిక తెలుగు కవిత్వంలో తన స్థానాన్ని నిరూపించుకున్నారు. అభ్యుదయ కవితాయుగంలో తన కవితా యాత్రను ప్రారంభించాడు. ఈయన నిరాశావాదిగా చివరి వరకు కవితాయాత్ర కొనసాగించారు. ఇతని స్వప్నలిపి అన్న కవితా సంపుటికి 1997లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

స్వప్నలిపిలోని రహస్యాన్ని తెలియజేస్తూ అజంతా ఇలా పలికారు. "అన్నింటికీ కారకుడు మనిషి కనుక ప్రతి మనిషిలోను చూసుకోవడం నాకెంతో ఇష్టం. మనిషి ఎక్కడ వున్నా ఒకడే. పృథ్వీ తలంపై మనిషి అడుగుల చప్పుడు వినపడిన తొలిక్షణం నుంచి మనిషి అంతరాత్మ ఒక్కటే. నేను ప్రతి మనిషిలో వుంటాను. ప్రతి మనిషి స్వప్నంలో వుంటాను. స్వప్న సౌందర్యంలో

వుంటాను. బాధలో, దుఃఖంలో, మండుతున్న గాయాలలో వుంటాను. ఎడారిలో మనిషి ఆక్రందనలో వుంటాను. అదఃపతితుడైన మనిషిని ఆప్యాయంగా లేవనెత్తుతున్న కారుణ్య హస్తాలలో వుంటాను. అక్షరాలకు సంకెళ్లులేవు. భూగోళంపై సరిహద్దులు లేవు. మనిషి ఆత్మ ప్రకంపన ఒక్కటి. అతడు మాట్లాడే భాషకు ఆయువుపట్టు. ప్రతి అక్షరం ఒక మనిషి, ప్రతి మనిషి ఒక అక్షరం. మనిషి ముఖ కవళికలవలెనే, మనిషి అవయవ నిర్మాణం అక్షరాలకు కూడా ఒక ఆకారం, ఒక భంగిమ, భావానుగుణ్యమైన ఒక కదలిక, ఒక లయ. ఒక విన్యాసం, రంగు, రుచి ఉంటాయని నేను విశ్వసిస్తాను. స్వప్నలిపి రహస్యం ఇదే. దైనందిన జీవన బీభత్సంలో నేను చేస్తున్న విచిత్ర విన్యాసాలే నా కొత్త ఛందస్సు". ప్రాణులకుండే గుణాల్ని అక్షరాలకు చెప్పిన దీనిలో అజంతా మనసులోని నైజగుణం తెలుస్తుంది. ఈ విధమైన పోలిక ఏ కవి చెప్పలేదంటే. అతిశయోక్తికాదు. ఇవే భావాలు తన కవితల్లో ప్రస్ఫుటమవుతాయి.

ప్రస్తుత సమాజంలోని స్థితిగతుల్ని ఎంతో చక్కగా వర్ణించారు **"చీకటి చిత్రశాల"** కవితలో

**నా నివాసం ఎక్కడో శూన్యంలో చీకటి పాషాణాలపై**
**స్వప్న శృంఖలాలలో కావచ్చు గాక**
**కాని, శూన్యంలో చీకటి ప్రజ్వలనం నేను చూశాను.**
**శూన్యంలో నడుస్తున్నాను నడుస్తున్నాను.**
**చీకటి అగాదాలలో నడుస్తున్నాను.**
**చీకటి మృత్యు శిలలపై స్వప్నధూళిలో నడుస్తున్నాను.**
**నేను సజీవంగానే ఉన్నానా.**
**మరో జీవన ద్వారం తెరుచుకోవడమే నా మృత్యువు అంటే**
**ధ్యాన నిమగ్న స్థితిలో ఉన్న అగ్ని సర్ప మళ్ళీ ఎప్పుడు**
**కన్ను తెరుస్తుందో మరి నా శిరస్సు పై**

మృత్యువును ఒక్కొక్కరు ఒక్కోవిధంగా ఆధునికులు చెప్పారు. మృత్యువుని మరో జన్మకి తోరణంగా చెప్పిన అజంతా ఒక జన్మనుండి మరో జన్మకి వాహకంగా పరిణమిస్తున్న నిరాశని ధ్వనిగా ఆవిష్కరించారు. దీనిలో దీని వెనుక మనిషిని మటుమాయం చేసే రోడ్లు, నిటారుగా నిలబడి తలవంచుకున్న జెండాలన్న ప్రభుత్వ భవనాలు, పోస్టర్లు కప్పుకున్న బిచ్చగాళ్ళు, క్రిమికీటకాల అద్దె ఇల్లు, నరవాసన వెదజల్లే మృత్యుజిహ్వారాలు, మాఫియా ముష్కర ముఠాలు, నెత్తుటి వార్తలు మోసుకొచ్చే వార్తాపత్రికలు– టీ.వీ.లు, సేఫ్టీలాకర్లు దర్శనమిచ్చే రాక్షస నగరీకరణ ఉంది. నగర వాతావరణంలో జీవిస్తున్న అజంతా కవిత్వం భయానికి పర్యాయపదంగా వర్ణించారు. నగర జీవిత యథార్ధ దృశ్యాల్ని పొందుపరిచారిక్కడ.

ముక్త కవితను లేదా వచన పద్యాన్ని శక్తివంతం చేయాలనేది ఆయన పట్టుదల, ముక్త కవిత కావ్యంలో భాగమే అయినా ఒక్కొక్క ముక్తకం ఒక్కో ఖండకావ్య శక్తినీ, తాత్పర్యాన్నీ కలిగి ఉంది.

**చెప్పలేదా నేను చెప్పలేదా అంతా ఒకే శబ్దం అని**
**సర్వవ్యాప్తమైన శబ్దవలయంలో**
**మృత్యువు ఒక్క హెచ్చరిక మాత్రమే అని**
**ఆకురాలుతున్న శబ్దం ఒక ఆహ్వానం మాత్రమే అని**
**భయకంపితమైన శబ్దం మీద**
**ఒక గవాక్షం తెరుచుకోగా**
**నేను నా శరీరం ఒకేసారి నిలువునా బ్రద్దలై రెండు ముఖాలతో నేను**
**మరో గవాక్షంలో అడుగుపెడుతున్నప్పుడు**

**అంతా ఒక కదలిక మాత్రమే అని**
**మరణానంతరం కూడా మనిషి మాట్లాడుతూనే ఉంటాడని**
**శరీరాన్నియించిన ఒక జీవితం అట్టడుగున**
**శబ్ద పేటికలో ఒక అస్థిక వికసిస్తున్న శబ్దం నేనే**
**అంతా ఒక చిత్కళ.**

ఈ కవిత కొన్ని భాగాలుగా విడగొట్టి చెప్పడానికి అనువైన రీతిలో ఉంటుంది. ఏ భాగానికాభాగం ఒక సంపూర్ణమైన అర్థాన్ని, భావాన్ని కలిగి ఉంది. ఇదే అజంతా కవితా శైలిలోని ప్రత్యేకత. మృత్యువు కూడా ప్రకృతిలో సర్వసాధారణమేనని రుజువు చేస్తున్నాడు. ప్రతీ చెట్టు కాలం పూర్తి అయి ఆకుల్ని ఎలా పోగొట్టుకుంటుందో, మనిషి కూడా కాలం నిండిన తర్వాత రాలిపోవడమేనని వెల్లడిస్తున్నాడు. పద్య కవిత్వం కోసం సత్కవులను తలంచుకోవడం వలన పూర్వ కవులంటే ఆయనకున్న మమకారం, గౌరవం తెలుస్తుంది. అప్పుడప్పుడు పద్యాలు రాసినా వాటిని తన తీపిగుర్తులుగా నెమరు వేసుకుంటున్నాడు..

ప్రపంచ సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి, అనేక కవితా ధోరణుల్ని ఆకళింపు చేసుకొని తెలుగులో కవితా రచన చేసిన అతికొద్ది మందిలో అజంతా ఒకరు. తొలి రోజుల్లో అజంతాపై శ్రీశ్రీ ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. శ్రీశ్రీకి ముందూ వెనకా అంతా శూన్యం అని అజంతా విశ్వాసం.

1946–47లలో అభ్యుదయంలో వెలువడ్డ విప్లవం, ప్రతీకారం మొదలైన కవితల్లో శ్రీశ్రీ ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. కనుకనే బి.వి. రామకృష్ణ శ్రీశ్రీ జీవనచిధత్సాలను అజంతా తన మూడో కంటితో దర్శించి సఫలీకృతుడై ద్రష్టగా మిగిలాడు అని కితాబిచ్చాడు. శ్రీశ్రీ అంటే ఎంత అభిమానమో అజంతా చెప్పిన శ్రీశ్రీ అనే కవితలోనే గమనించవచ్చు.

**రెండు అక్షరాలు.**
**భూమ్యాకాశాల మధ్య రెండు ఖడ్గ ప్రహారాలు**
**ఒకవైపు ఖడ్గకాంతులు వెదజల్లుతున్న కన్ను.**
**మరోవైపు ఎన్నెల విలక్షణకాంతులు వెదజల్లుతున్న కన్ను**
**ఎడారి అంచులపై ఉపస్వీని రహస్య విన్యాసాలను ఆవిష్కరిస్తున్న చేతులలో**
**అక్షరాకృతి ధరిస్తున్న అరుణారుణ కిరణాలు అతడే మహాకవి శ్రీశ్రీ**
**అశాంతి, ఆవేదన మనిషిని విహ్వాలితం చేస్తున్న వేళ**
**మహాకవి శ్రీశ్రీని ఒకసారి తలుచుకుంటే చాలు**
**వాగ్దేవి ఆలయ ప్రాంగణంలో అక్షర మహిరీత్సవం చూడవచ్చు.**
**చీకటి పర్వత శ్రేణులలో అర్ధరాత్రి సూర్యోదయం చూడవచ్చు.**
**శ్రీశ్రీ శబ్దశక్తి సోకిన చోట**
**రాళ్ళు అక్షరాలుగా మారినా చెట్లు నాట్యం చేసినా ఆశ్చర్యం లేదు.**
**శ్రీశ్రీ పేరు వింటే చాలు.**
**జడప్రాయుడైనా నిద్ర మేల్కొంటాడు.**
**జీవన సంగ్రామంలో క్షతగాత్రులు సైతం ఒళ్లు విరుచుకుని**
**ముందుకు దూకుతారు.**
**శిరస్సు తెగిన మనిషి మళ్ళీ కళ్ళు తెరుస్తాడు.**

శ్రీశ్రీ గురించి వారి అనుసరణగా శిష్యప్రాయుల్లోగాని, ఇంతటి సత్యసన్నిహితంగా, ఆర్ద్రతతో చెప్పిన వాళ్లు అరుదు. శైలిలోగాని, రచనా విధానంలోగాని శ్రీశ్రీ తర్వాత స్థానం అజంతాకే దక్కుతుంది. దానికనుగుణంగానే శ్రీశ్రీ కూడా నా కవిత్వ వారసుడు అజంతా అని ప్రకటించడం గమనించవచ్చు.

శ్రీశ్రీ పేరులోగల రెండక్షరాల్లో ఎంత శక్తి వుందో వివరిస్తూ అది కవిత్వపరంగానేకాక, ధైర్యసాహసాల్లోను చివరికి రాళ్ళు సైతం అక్షరాకృతి ధరిస్తుందట. చెట్లు కూడా నాట్యం చేస్తాయట. ఎప్పుడూ మృతప్రాయుడుగా వుండేవాడు కూడా చైతన్యవంతుడవుతాడు. అందుకే శ్రీశ్రీ కవిత్వం అపూర్వం. అనన్యంగా వుంటుంది. శ్రీశ్రీ కవిత్వంలో ఆకలి, దారిద్ర్యం, అన్యాయాలు, అత్యాచారాల మీద, మనిషిని మనిషి దోచుకునే సాంఘిక వ్యవస్థ మీద ఇంకా ఎన్నో సంఘటనల్ని కళ్ళకు కట్టినట్టు చూయించాడు.

అజంతా అభ్యుదయ కవితా స్రవంతిలో భాగమై కవిత్వం రాస్తున్నాడు. ఆయా కాలాల్లో వచ్చే మార్పుల్ని బాగా ఆకళింపు చేసుకున్నాడు. వైరుద్యాల మధ్య నిలిచిచెట్లు కూలుతున్న దృశ్యాలు మొదలు కంప్యూటర్ చిత్రాలదాకా తన స్వప్నలిపి పరిభాషలో ఆధునిక జీవితాన్ని రూపు కట్టించాడు. మనిషికి పరిచయంలేని ఆధునికాంశాల్ని, అల్లకల్లోలాల్ని తన కవిత్వం ద్వారా విశదపరిచాడు. అక్షర హింస కవిత్వం కాదని చెప్పాడు. అజంతాను అదివాస్తవికుడుగానో, మృత్యు ఆరాధకుడుగానో భావిస్తున్నారు కొందరు. ఇది వాస్తవంకాదు. తన స్వప్నలిపి నేటికాలంలో దేశంలోని యథార్థ సంఘటనలు **"ఇండియా! ఇండియా!"** కవితలో ఈ విధానం కనిపిస్తుంది.

**నగర శరీరం మీద తెరజారుతున్నదా?**
**ఆరోజు న్యూస్ పేపర్ ముట్టుకున్నావో లేదో**
**అంతా నెత్తురు మయం!**
**ఒకే మృత్తిక నుంచి**
**ఒకే శరీరం నుంచి**
**ఒకే ఆత్మ నుంచి**
**ఒక గాయం నుంచి**
**స్రవిస్తున్న నెత్తురు!**
**ఒకసారి నా చేతులవైపు చూసుకున్నాను.**
**హెడ్లైన్ క్రింద ప్రముఖంగా ప్రచురించిన చిత్రంలో**
**ఒకవైపు**
**విజ్ఞాన సర్వస్వం పై కూర్చుని తాత్విక వృక్షాలపై**
**రాళ్ళు రువ్వుతున్న ఉన్మత్తులు**
**రాక్షస ధూళిలో కొట్టుకొనిపోతున్న ఒక యువతి భగ్న దేహాన్ని**
**రెండు చేతులా పట్టుకొని**
**ప్రపంచాన్ని భయంకరంగా శపిస్తున్న శిలా విగ్రహాలు!**

పత్రికలు ప్రజల్లో చైతన్యం తెచ్చాయి. ఎక్కడ ఏ విషయం జరిగినా అందరికీ తెలిసే రీతిలో కళ్లముందుంచుతున్నాయి. అందుకే దేశంలోని ఏ నగరాన్ని చూసినా జరుగుతున్న భయంకర దృశ్యాల్ని వర్ణించారిక్కడ ఇలాంటి యథార్థ సంఘటనల్ని చెప్పడానికి ధైర్యం కావాలి. కవితా రూపంలో ఆకట్టుకునేటట్లు చెప్పడం ఒక కళే. అది అజంతాలో బాగా ఉందని నిరూపించే కవిత ఇది. తన కవిత్వానికి ఏవేని అక్షరాలుగా నిలిచాయో తెలిపాడు. **"నాపై రువ్విన రాళ్ళు నా అక్షరాలు"** కవితలో–

**ఉరితాళ్ళు నా ఊహలు**
**సంకెళ్ళు నా మాటలు**
**నాపై రువ్విన రాళ్ళు నా అక్షరాలు**
**నాకు నిలయం లేదు.**

**నాకు విలయం లేదు**
**అశాంతిని ఆక్రమిస్తాను**
**అడవిలో వెన్నెలను దుస్తులుగా ధరిస్తాను.**
**అర్ధరాత్రి భీభత్సం మేలుకొనేటప్పుడు**
**శూన్యం మీద శూన్యంగా కూర్చుని**
**రాలుతున్న నక్షత్రాల మీద నా గీతం రచిస్తాను.**
**ఆకాశం కనబడని చోట**
**చీకటి ఉరికంబంలా నిలబడిన చోట**
**నిశ్శబ్దం మీద నిశ్శబ్దంగా కూర్చుని**
**గాలిలో దీపాల మీద నా గీతం రచిస్తాను**
**నాకు రూపం లేదు.**
**నా రూపం నా గీతం.!**

కవితా వస్తువులుగా, హృదయానికి హద్దుకునేటట్లు పోలికల్ని, సౌందర్యాత్మకంగా వాటిని సహజంగా అందరు గ్రహిస్తారు. దానికి భిన్నంగా అజంతా ఉరితాళ్ళు, సంకెళ్ళు, రాళ్ళు, ఊహల్ని అక్షరాలుగా భావించారు. అంటే బాధామయ జీవితాలనే కవితా వస్తువులుగా చెబుతానని వారి అభిప్రాయం. అదే పద్ధతిలో వారి స్వప్నలిపిలోని కవితలు కొనసాగాయి. ఇదే అభిప్రాయాన్ని స్వప్నలిపి పీఠికలో ఇలా పేర్కొన్నారు.

మనిషిలో అంతర్భూతమై ఉన్న స్వప్న శక్తిని, స్వప్నశక్తి సార్వభౌమాధికారాన్ని వినిర్గతం చేయడం ద్వారా అతడు ఆశిస్తున్న కొత్త ప్రపంచాన్ని ఆవిష్కృతం చేయగలగాలన్నది నా కవిత్వ పందా. కవిత్వం తప్ప నాకు మరో జీవితం లేదు. అందుకోసమే నేను కవిత్వం రాస్తున్నాను. కలం, కాగితం పట్టుకుని మాత్రం కాదు. అక్షరాలు వాటంతట అవి ప్రత్యక్షమైతేనే ఏదైనా, ఆ రహస్యం నాకు తెలుసు. స్వప్న విద్య నాకు పుట్టుకతో వచ్చినదే. అక్షరం తర్వాత మరో అక్షరం, చీకటి అవయవాలపై తెల్లని అక్షరాలు ఒక అక్షరాన్ని చుట్టుకొని ఎన్నో అక్షరాలు, వాక్యం తర్వాత మరో వాక్యం. అంతా ఒక చిత్కళచిత్ర, విచితవాక్య సముదాయం. నేను అక్కడే ఉంటాను. అక్షరం విచ్చుకొని స్వప్నధూళిలో ఆవిర్భవించిన కొత్త అక్షరంలో నేను వుంటాను. స్వప్నలిపి అంటే ఇదే. వరమాన జీవితం అగమ్యం, అస్పష్టం, అగోచరం, అర్ధరహితం... అజేయంగా వున్నదల్లా స్వప్న శక్తి సార్వభౌమాధికారం ఒక్కటే అది అప్రతిహతం.

స్వప్న కవిత గురించి విమర్శించే వారికి హృదయానికి తాకేటట్లు తన మనోగత భావాన్ని వారి ముందుంచాడు. ఎవరో అనుకుంటున్నట్లు స్వప్నంలో విహరించనని, అది పుట్టుకతో తనకు వచ్చిందని తెలియజేశాడు. స్వప్నశక్తి స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మించే స్పృహను మనిషికి కలగజేస్తుందనీ, అలాంటి ఆలోచనలతో అజంతా తన హృదయంలో పుట్టిన స్వప్న కవితను ప్రారంభిస్తూ చెప్పిన ఈ మాటలు సత్యసన్నిహితాలు చెప్పారు అజంత.

**ఆధారగ్రంథాలు**

1. అజంతా. స్వప్నలిపి. 1993. విజయవాడ: కవిత్వం ప్రచురణలు.
2. నాగయ్య, జి. 2019. తెలుగు సాహిత్య సమీక్ష. తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
3. నారాయణ రెడ్డి, సి. 1999. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగాలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. రామకృష్ణ, మిరియాల. 1980. శ్రీశ్రీ కవిత్వం వస్తువు- సంవిధానం. కాకినాడ: యమ్. లక్ష్మీదేవి పబ్లిషింగ్.
5. రామమోహన్ రాయ్, కడియాల. 1980. తెలుగు కవితా వికాసం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

# కథా రచయితలకు మార్గదర్శిగా 'కథాశిల్పం'

**కొండ ప్రవళిక,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

అనగనగా. . . . తెలుగులో

Long long ago once up on a time………… అని ఆంగ్లంలో

ఎక్ దఫా ఎక్ జిక్రి హై కి. …. అంటూ హిందుస్తానిలో కథలు ప్రారంభించడం అందరికి తెలిసిన విషయమే. భారతీయ సాహిత్యమే ప్రపంచ సాహిత్యానికి కథా భిక్షను పెట్టిందని పెద్దల విశ్వాసం. పురాణకాలం నుంచి కథా ప్రస్తావన ఉంది. యావత్ ప్రపంచ సాహిత్యంలోనే అత్యధికంగా ప్రచారంలో ఉన్న సాహిత్య ప్రక్రియ కథ. దేశ కాలమాన మార్పులు పరిస్థితులు ఎలా ఉన్న కథ సాహిత్యం నేటికి నిలిచి ఉంది. అమ్మ ఒడి నుంచి మొదలు తాతయ్య, నానమ్మ కథలు చెప్పడంలో, వాటిని పరిచయం చేయడంలో మొదటి వరుసలో ఉంటారు. పిల్లలను అల్లరి మానిపించడానికి దగ్గరికి చేర్చుకొని బుజ్జగిస్తూ కథలను చెప్పుతూ ఉంటారు. "కథ్" అనే సంస్కృత ధాతువుకు "చెప్పడం" అని అర్థం. దాని నుంచి వచ్చిందే కథా శబ్దం. దీనికి తెలుగులో తత్సమ రూపం "కథ", తద్భవం కత అని చెప్పవచ్చు. దీనిని ఆధునిక సాంకేతిక పరంగా 'కథానిక' అని పిలువవచ్చు. దీనినే ఇంగ్లీషులో short - story గా వ్యవహరిస్తున్నారు. దీనిని సౌలభ్యం కోసం సంక్షిప్త రూపంలో 'కథ' అని కొన్ని దశాబ్దాలుగా వాడుకలో కొనసాగుతుంది.

ప్రాచీనం నుంచి నేటి వరకు ప్రపంచ సాహిత్యంలో కథ నీతిబోధకంగా ఉంది. కానీ నేడు కథ ప్రపంచంలో ఉన్న అన్ని కోణాలలో నుంచి సమాజాన్ని, జీవితపు సంఘటనలను చిత్రించడం జరుగుతుంది. ఇలాంటి కథా గురించిన ప్రస్తావనే వల్లంపాటి రాసిన కథాశిల్పంలో చూస్తాము.

ప్రపంచ సాహిత్యంలో ఆధునిక కథ ఐరోపా/యూరోప్, మధ్య ఆసియా ప్రాంతాలలో కథా సాహిత్యం వికసించినట్లు చెప్పవచ్చని వల్లంపాటి వివరించారు. 1770లో ఇంగ్లాడ్ జరిగిన పారిశ్రామిక విప్లవం మరియు 1815 తరువాత దాని ప్రభావం యురోపియాన్ దేశాల్లో విస్తరించి అక్కడ సాంస్కృతిక పునరుజ్జీవనం సంభవించిందని, 19వ శతాబ్దంలో ముద్రణ ప్రారంభమైందని వెల్లడించారు. "జీవితంలో ఒక భాగాన్ని తీసుకొని దానికి వ్యక్తిత్వం ఇవ్వాలన్న ఆలోచన /కోరికల నుంచి కథకు రూపం ఇచ్చారు. కథ సాహిత్యాన్ని ఫోటోగ్రఫి, చిత్రకళ కూడా ప్రభావితం చేసినట్టుగా విమర్శకులు భావిస్తారు" అంటూ కథ సాహిత్యం గూర్చి ఓ.కానర్, హెచ్ జి.వెల్స్, హెచ్.ఇ. బిట్స్ వారి కథ పుట్టుకనూ, స్వభావానికి సంబంధించిన అంశాలను మరియు అభిప్రాయాలను వల్లంపాటి చర్చించారు. భారతీయ భాషాసాహిత్యంలో తొలి కథ బెంగాలిలోనే రచించబడింది.ఆ కథ పేరు "కాబూలివాలా", దీనిని ప్రముఖ బెంగాలీ రచయిత ప్రపంచ ప్రఖ్యాత సాహితివేత్త నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ రచించారు. తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ కీర్తి చేకుర్చిన మొట్టమొదటి ప్రక్రియ "కథానిక "గాలివాన – పాలగుమ్మి పద్మరాజు 1910లో గురజాడ అప్పారావు నుంచి మొదలుకొని నేటి వరకు కథానిక తన మనుగడను సాహిత్యంలో కొనసాగిస్తుంది.

**కథాశిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య**

"కథాశిల్పం" రచయిత వల్లంపాటి వెంకట సుబ్బయ్య మార్చి 15, 1937– జనవరి 2, 2007 చిత్తూరు జిల్లాకి చెందిన వ్యక్తి, వల్లంపాటి కథకుడిగా తన రచన వ్యాసంగాన్ని మొదలుపెట్టి గొప్ప సాహితి విమర్శకుడిగా ప్రఖ్యాతి పొందారు. ఆంగ్ల, కన్నడ భాషల నుంచి తెలుగు భాషలోకి ఎన్నో రచనలు అనువదించి గొప్ప అనువాదకుడిగా పేరుపొందారు. వీరు కథ, నవల, విమర్శ వంటి ప్రక్రియల్లో సాహిత్యాన్ని అభివృద్ధి చేసారు. వీరు రాసిన నవలాశిల్పం 1995, కథాశిల్పం 1996, విమర్శాశిల్పం 2002, అనుశీలన 1985 వంటి సాహితీ విమర్శ గ్రంథాలు వెలువరించారు. కథాశిల్పం 1996 – 97 లో ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథంగా తెలుగు విశ్వవిద్యాలయం వారి అవార్డును, 1999 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును పొందిన గ్రంథం. ముందుగా కథను చర్చించినట్టే "శిల్పం" అను పదాన్ని గూర్చి తెలుసుకోవలసిన అవసరం వుంది. దీనిని గురించి వల్లంపాటి నవలాశిల్పం అను విమర్శ గ్రంథంలో వివరించారు. అయితే నిఘంటువుల ప్రకారం శిల్పం అనగా 'ఆకృతి', "నిర్మాణం", "వర్ణము", "చిత్తరువు" వ్రాయుట,'రూపము', 'సంస్థితము', "స్వరూపము" వంటి నిఘంటు అర్థాలు కలవు.మనం ప్రక్రియ పరంగా గ్రహిస్తే కథను నడిపించే తీరు లేదా చెప్పిన విధానంను శిల్పం అని చెప్పవచ్చు. ఉదాహరణకు కథావస్తువు శిల అయితే దాన్ని అద్భుతంగా చెక్కడాన్ని "శిల్పం "అని అంటారు.కథకు శిల్పిగా రచయిత అవుతాడు.వల్లంపాటి గారు తన పుస్తకాలకు శిల్పం అని పేరు పెట్టడంలో ఉద్దేశం ఇది కళగా కాకుండా కళాత్మకంగా ఉండే సాహిత్యంగా పాఠకులకు, రచయితలకు ఉపయోగపడే విధంగా కథ వస్తువు ఉండాలనే దృక్పథం వారిది.

నవలాశిల్పం నవల చరిత్ర కానట్టే, కథాశిల్పం కూడా కథ చరిత్ర కాదు. ఈ పుస్తకం ప్రధాన ఉద్దేశం కథ వస్తువునూ, కథాశిల్పాన్ని వాటి మధ్య ఉన్న సంబంధాన్ని వల్లంపాటి గారు చర్చించారు.ఈ పుస్తకాన్ని మొత్తం ఎనిమిది అధ్యాయాలుగా విభజించారు.వీటిలో కథ సాహిత్య ప్రక్రియగా ఎలా వచ్చింది? కథవస్తువు ఏవిధంగా వుండాలి ? కథను ఎలా రాయాలి ? కథ రాయడంలో రచయిత ఏ అంశాలను పాటించాలి? కథలో ఎటువంటి కంఠస్వరం ఉపయోగించాలి ?కథకి ఇతర కాల్పనిక సాహిత్య ప్రక్రియలకు మధ్య తేడా ఏమిటి ? కథా అవతరణ, పాశ్చాత్యకథ సాహిత్యం, మన కథసాహిత్యంపై చూపిన ప్రభావం అనే అంశాలను తెలుగు, ఆంగ్లభాష కథలను ఉదాహరణగా తీసుకొని చర్చించారు. ఇలాంటి ప్రశ్నలన్నిటికి సమాధానమే 'కథాశిల్పం' గా చెప్పవచ్చు. ఇందులో మొదటి అధ్యాయం.

**సాహిత్య ప్రక్రియగా కథ**

కథ చరిత్ర సుదీర్ఘమైనదని, ప్రాచీన సాహిత్యంలో కథలు, పాశ్చాత్య దేశాలలో మరియు మన దేశంలో ఉన్నకథలు చాలా వున్నాయి. ఉదా : బోకేషియకథలు, మధ్యప్రాచ్య అరేబియన్ రాత్రులు, పంచతంత్రకథలు వంటివి. ప్రాచీనంలో కథ చెప్పడం వుంది కానీ అందులో శిల్పం లేదని ఆధునిక కథలో కథాశిల్పం ప్రధాన లక్షణంగా చెప్పారు. ఇందులో పాత్రల మనస్తత్వం ముఖ్యమైనదిగా చెప్పారు. ఆధునిక కథకు తక్షణత్వం, సమకాలీనత (immediacy,contemporaneity) ప్రాణభూతమైనవిగా పేర్కొన్నారు. కథ అనేది ఒకపాత్ర, ఒక సంఘటన, ఒక భావం మీదనో ఆధారపడి ఉంటుందని ఇందులో పాత్రాలు కథ వస్తువుని వ్యక్తం చేసే కేంద్ర బిందువును, ప్రాధాన్యతను కథలో నిరూపించడానికే ఉపయోగపడుతాయని చెప్పడంతో పాటుగా, ఆర్నాల్డ్ బెనెట్ కథ రాయడంలో తెలిపిన మూడు కారణాలను కూడా తెలిపారు. అవి 1. రచనలో పొరపాట్లు వస్తే కథలో తిరిగి చూడటం సులభం, 2. మనకు తెలియని, కష్టమైన విషయాన్నీ కథా రచనలోనైతే వదిలిపెట్టగలం, 3. రచనలో వచ్చే భావోద్వేగాన్ని కొంతకాలం మాత్రమే భరిస్తేచాలు అని ఇందులో ఉటంకిస్తూ నూతన రచయితలకు మార్గం చూపారు. మంచి కథ పాఠకునిమదిలో నిలిచి ఉంటుందని స్పష్టంగా చెప్పారు.

**అధ్యాయం 2 కథ అవతరణ**

పారిశ్రామిక నాగరికత ప్రపంచ సంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా కథను విశ్లేషించారు. పారిశ్రామిక విప్లవం

అనతరం వచ్చిన సామజిక, ఆర్థిక, విజ్ఞానశాస్త్ర అభివృద్ధి తరువాత సామజిక ప్రజలలో వచ్చిన అభద్రత భావనే కథానిక పుట్టుకకు కారణంగా చెప్పిన H.G. వెల్స్ అభిప్రాయాలను వెల్లడించారు. కథ సాహిత్యాన్ని చర్చించారు.

**అధ్యాయం 3 మంచి కథ –నాలుగు లక్షణాలు**

కథకు ఉండవలసిన లక్షణాలుగా 1. క్లుప్తత, 2. అనుభూతి ఐక్యత, 3. సంఘర్షణ, 4. నిర్మాణ సౌష్టవం, 1. క్లుప్తత క్లుప్తత కథా ప్రక్రియను కష్టమైన సాహిత్య ప్రక్రియగా తయారుచేస్తుందని చెప్పారు.

కథలో ప్రతి పదము దాదాపు నిర్దిష్టంగా ఉండాలి. అజాగ్రతగా, అశ్రద్ధగా ఉండటానికి చాలా తక్కువ చోటు ఉంటుంది." చెత్తకు కూడా కథలో చోటు తక్కువే" అంటాడు. సుప్రసిద్ధ అమెరికన్ రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత ఫాకర్న్ వంటి రచయితల భావాలను ఆకలింపు చేసుకొని కొటేషన్లను ఉటంకిస్తూ చెప్పారు. క్లుప్తత తానంతతానుగా రాదని రచయిత దాన్ని కష్టపడి సాంధించాలని చెప్పిన విషయాల కన్నా చెప్పకుండా వదిలి పెట్టిన విషయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని రచయితలకు సూచించారు. క్లుప్తత లోపించడానికి 3 కారణాలను వెల్లడించారు అవి : 1. సందర్భశుద్ధి లేకుండా కథలో వర్ణనలు చొప్పించడం, 2. రచయితకు పాఠకుని సమర్థత మీద, ఆలోచన శక్తి మీద గౌరవం లేకపోవడం, 3. అనవసరమైన సంభాషణలు, సంఘటనలు కథలో చెప్పించడం. ఇవి కథకు క్లుప్తత లేకుండా చేస్తాయని, వీటి విషయంలో జాగ్రత్త వహించాలని, ఉదాహరణకు మధురాంతకం కథలు, రావిశాస్త్రి "వేతన శర్మ"లో, బుచ్చిబాబు "అడవి కాచిన వెన్నెల", "ఎల్లోరాలో ఏకాంత సేవ" వంటి క్లుప్తత లోపించిన కథలను ఉదాహరిస్తూ చూపడం జరిగింది.

**2. అనుభూతి ఐక్యత :** మంచి కథకు ఉండవలసిన రెండోవ లక్షణంగా దీన్ని చెప్పవచ్చు. కథ పాఠకునిలో కలుగజేసే భావప్రకంపనలను అర్థం చేసుకోవాలన్నారు. మొదటి వాక్యం నుంచి చివరి వాక్యం వరకు కథ, కథాంశం అనే తీగ మీద నడవాలని సూచించారు. ఇందులో అనుభూతి ఐక్యతను సాధించడానికి ప్రధానంగా రెండు మార్గాలను ఎన్నుకోవాలని కథకులకు సూచించారు. అవి : 1. ఒకే సంఘటనకు పరిమితంగా పాత్రను చిత్రించటం, అనగా కథాంశం మొత్తం కథ సంఘటనలో వెలగాలని, 2. రచయిత ఎంచుకునే ప్రధాన సంఘటన, పాత్రతో గుణాత్మకమైన మార్పుకు కారణభూతంగా వుండాలి అని వల్లంపాటి వారు చెప్పారు.

**3. సంఘర్షణ :** సంఘర్షణ అనేకరకాలుగా ఉండవచ్చని, ఇద్దరి వ్యక్తులమధ్య, ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్య, రెండు భావాల, రెండు వర్గాల, సిద్ధాంతాల, జీవిత దృక్పథాల మధ్య ఎన్నిటి మధ్యనైన ఉండవచ్చని, ఇలాంటి సంఘర్షణలు చిత్రించిన కథలు మన సాహిత్యంలో చాలా ఉన్నాయన్నారు.

సంఘర్షణను గూర్చి ఆలోచించినప్పుడు, పరిష్కారాన్ని కూడా ఆలోచించాలి అని, సంఘర్షణకు రచయిత చక్కటి పరిష్కారం చూపలన్నారు. దీనికి ముగింపు పరిష్కారం కాదన్నారు. ఇందుకు ఉదాహరణగా కాళీపట్నం రామారావు "యజ్ఞం" కథలో బానిసత్వానికి అంతంగా సీతారాముడు తన కొడుకుని ముక్కలుగా నరికివేశాడు అని ముగించడంలో కథకు సరయిన పరిష్కారం చూపలేదని వల్లంపాటి అభిప్రాయం తెలిపారు.

**4. నిర్మాణ సౌష్టవం** (plot) : కథకు చక్కని నిర్మాణం ఉండాలని, దీని ద్వారానే కథాంశం పాఠకుని మదిని చేరుతుంది వల్లంపాటి చెప్పారు. కథకు కావాల్సిన నడక, ఎత్తుగడ, ముగింపు ఈ మూడింటిని అల్లడంలో నిర్మాణం గురించి మార్గం ఈ పుస్తకంలో చూపించారు. ఇది పూర్తిగా లేకపోతే కథ నీరసంగాను, ఎక్కువయితే కృత్రిమంగాను ఉంటుందన్నారు. ఆదిమధ్యాంతం గూర్చి చర్చిస్తూ ఉదాహరణగా V.చంద్రశేఖర్ 'జీవని' కథ, ఓ.హెన్రీ రాసిన "The gift of the mize", మపాసా రాసిన "The neck less" అనే కథలను ఉదాహరిస్తూ జరిగినదానికి, జరగవలసిన దానికి మధ్య అగాధాన్ని చూపడమే మంచిశిల్పంగా నిరూపణ చేసారు.

**4 అధ్యాయం – కథాంగాలు**

ఇవి రెండు రకాలుగా పేర్కొన్నారు. కథావస్తువు రచయిత జీవితంలోని, ఇతరుల జీవితాల నుంచి సేకరించి కథనం చేస్తారన్నారు. ఇందులో కథా సంవిధానం, పాత్రలు, దృష్టికోణం, కంఠస్వరం నేపథ్యం ఇవి కథాశిల్పంకి సంబంధించిన అంశాలుగా చెప్పారు.

**కథ సంవిధానం :** కథలోని సంఘటనల మధ్య ఉన్న సంబంధాన్ని సంవిధానం తెలియజేస్తుందని, రెండు సంఘటనల మధ్య ఉండాల్సిన కార్యకారణ సంబంధమే అని పేర్కొన్నారు.

**పాత్రలు :** కథను నడిపించేవారూ, కథావస్తువును భరించేవారూ, కథాంశాన్ని సూచించేవారు పాత్రలు. కథా రచయిత సంఘటనను ప్రదర్శింపచేయలన్నారు. పాఠకుడు పాత్రను తన ఊహ శక్తితో అర్థం చేసుకుంటాడు. పాత్రను గురించి అన్ని విషయాలు రచయిత చెప్పవద్దని, రచయిత కథాంశాన్ని ఎంత ఎక్కువ వీలైతే అంత పరోక్షసూచనకు వదిలిపెట్టాలని చెకోవ్ వంటి వారి విశ్లేషణని ఉదాహరించారు.

**నేపథ్యం :** కథ జరగడానికి కారణం ఉన్నట్టే, స్థలం, కాలం యొక్క చిత్రణే కథలో నేపథ్య చిత్రణ అని, కొన్ని కథలు ఎప్పుడైనా ఎక్కడైనా జరగడాన్ని కథలను ఉదాహరణలతో చెప్పారు. కథలు కొన్ని నేపథ్యాలలో మాత్రమే జరుగుతాయని వాటిని మార్చినప్పుడు అసంభావంగాను, అసహజంగానూ అనిపిస్తాయని అన్నారు. ఉదాహరణగా సింగమనేని "విముక్తి" కథ, మా.గోఖలే "బల్లకట్టు పాపయ్య" వంటి రాయలసీమ ప్రాంత కథలను, సత్యం శంకరమంచి "అమరావతికథలు" ఇలాంటివి కొన్ని ప్రాంతాలకు పరితమైనవాటిని పేర్కొన్నారు.

**దృష్టికోణం:** కథను ఏ దృష్టికోణంతో చెప్పాలి? ఎలా చెప్పాలి? ఎవరు చెప్పాలి? అని తెలిపేదే దృష్టికోణం. ఇందులో ఉత్తమ పురుష, ప్రథమ పురుష, సర్వసాక్షి, నాటకీయ దృష్టికోణాలతో రచయిత కథను చెప్పవచ్చని కథను రచయిత తాను చెప్పడం లేదా పాత్రలచేత చెప్పించడం జరుగుతుంది. ఉదాహరణగా కాళీపట్నం రామారావు రాసిన "వీరుడు–మహావీరుడు" కథను మరియు ఆంగ్ల రచయిత ప్లేబర్ యొక్క విశ్లేషణను వల్లంపాటి గారు వివరించారు.

**కంఠస్వరం :** కథకుడు కథను గంభీరంగా చెప్పాలా, వ్యంగ్యంగా, హాస్యంగా చెప్పాలా, నర్మగర్భంగా చెప్పాలా, కోపంతో, ద్వేషంతో చెప్పాలా అని నిర్ణయించుకోవాలని, అప్పుడప్పుడు వీటిని తగుపాళ్ళలో మిళితం చేసుకుంటూ కూడా కథ చెప్పవచ్చని వల్లంపాటి వివరించారు. ఉదాహరణగా పెద్దిభొట్ల సుబ్బరామయ్య రాసిన కథల్లో కంఠస్వరం విషాద గంభీరంగా, రావిశాస్త్రిది పాఠకున్ని రెచ్చగొట్టే వ్యంగ్యం, కొడవగంటి వారి వాదనస్వరం, అల్లం రాజయ్య అనుచున్నకోపం, చలం అనుచుకోలేని కోపస్వరం వంటివి ఉన్న కథలను ఉదాహరణలిస్తూ వల్లంపాటి ఉత్తమ కథకు ఉండే నిర్మాణ కంఠస్వరం గూర్చి తెలిపారు.

**5 అధ్యాయం – కథా కథనం**

కథాంగాలతో పాటు కథ కథన విధానాలను, రచయిత సృష్టించిన కల్పిత ప్రపంచానికి, వాస్తవ ప్రపంచానికి మధ్య సంబంధాన్ని అర్థం అయ్యేట్లు వల్లంపాటి పేర్కొన్నారు.

కథన నడిపించే తీరుని ఆరు రకాల పద్ధతులుగా చెప్పారు.

**1) వాస్తవిక కథనం :** కథలోని జీవితానికి ప్రాతినిథ్యం వహించే పాత్రలను, అదే జీవితానికి తగిన కథనం అని అన్నారు. వీటిలో సమగ్రంగా కొడవగంటి కథలున్నాయని పేర్కొన్నారు.

సంఘటనల్లో పెట్టి అంతరంగ, బహిరంగ జీవితాల మధ్యనున్న సంబంధాన్ని చిత్రించడం వాస్తవిక కథనంగా వల్లంపాటి వివరించారు.

**2) లేఖ కథనం :** వీటిలో రచయిత అదృశ్యంగా ఉండి పాత్రల, ఉత్తరాల ద్వారా కథను నడిపించ వచ్చన్నారు. పాత్రలు తక్కువగా వుండాలని, ఆ పాత్రలకు రచన పటిమ, నైపుణ్యం, ఆలోచన, చైత్యనం కలిగి, భాషా, శైలిలను ఇందులో ప్రదర్శించవచ్చు

అన్నారు. ఉదాహరణగా రంగనాయకమ్మ "పెళ్ళానికి ప్రేమలేఖ", చలం రాసిన "అదృష్టం", చాసో "బదిలీ" వంటి కథల గురించి ప్రస్తావించారు.

**3) ఊహకల్పన కథనం :** ఈ కథనంలో భావనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,పలాయనవాద ఊహ, వాస్తవన్ని అంటిపెట్టుకునే ఊహలగుర్చి వివరించారు.వీటిని 4 రకాల కల్పనలుగా విభాగించారు.

1. దేశ కాలాదుల మార్పు చేసేవి (గలివర్ ట్రావెల్స్), 2.పునఃసృష్టి కల్పనలు (బకాసురకథ)

3. జంతు గాథాలు (పంచతంత్రం), 4.విజ్ఞానశాస్త్ర కల్పనలు (చంద్రలోకంలో గ్రహాంతరయాత్ర).

**4) అంతరార్థ కథనం :** దీన్ని పాశ్చాత్య సాహిత్యంలో అలిగిరి అని,ఈ కథలలో ప్రధాన పాత్రలు భావాలు, వ్యక్తులు, సంఘటనలకు ప్రాతినిథ్యం వహిస్తాయని, వల్లంపాటి ఇందులో ఒక కథ తెర తొలగిస్తే మరొక కథ కనిపిస్తుందని చెప్పారు. ఉదాహరణగా రావిశాస్త్రి "పిపీలికం" గూర్చి తెలిపారు.

**5) చైతన్య స్రవంతి కథనం :** దీని వెనుక మనస్తత్వశాస్త్ర సిద్ధాంతాలను గూర్చి పేర్కొన్నారు. ఈ కథ పద్ధతిని మొదట ప్రవేశపెట్టింది 'కోనేటిరాయుని కథ'లలో శ్రీశ్రీ. ఇందులో ప్రవర్తనకు, ఆలోచన, మధ్య ఉన్న సంబంధ వైరుధ్యాన్ని చిత్రించే అవకాశాలను చర్చించారు.

**6) మాజిక్ రియలిజం :** ఇది పాశ్చాత్య సాహిత్యంలో మొదట వచ్చింది.గతం వర్తమానం కలసిపోయి మానవతీతశక్తులు (దయ్యాలు,భూతాలు)ప్రధానంగా సాగుతాయని, సహజంగా కాకుండ ఉత్ప్రేక్ష, అద్భుత రస ప్రధానంగా సాగుతాయని వివరించారు.

**6 అధ్యాయం – కల్పనా సాహిత్యం :** శాఖలు, ఉపశాఖలు దీనిలో నవల – నవలిక – కథ(ఫిక్షన్), స్కెచ్, గల్పిక, కవితాకథ, కథామాలిక వంటి వాటి గురించి వివరించారు. నవల గూర్చి నవలాశిల్పంలో వివరించారు.నవలిక గూర్చి కొడవగంటి అభిప్రాయాలను కథను పెంచిన, నవలను కుదించిన నవలిక కాదని ప్రస్తావించారు. ఉదాహరణగా శ్రీపాద గారి "వడ్లగింజలు", కొడవగంటి గారి "లేచిపోయిన మనిషి", పాశ్చాత్య సాహిత్యంలో చెకోవ్ గారి 'వార్డు నెం.6' వంటి రచనలు కథ సాహిత్యంలో ఉపయోగించడాన్ని వివరించారు.

ఉపశాఖల్లో ముఖ్యమైనది "స్కెచ్ లు" ఇవి వాస్తవికత మీదనే ఆధారపడి ఒకే పరిస్థితిని వివరిస్తుందని, దీన్ని కథతో పోల్చినప్పుడు వేరు వేరుగా కనిపిస్తాయని, స్కెచ్ ముగింపు ఆశ్చర్యానికి గురిచేస్తుందని కథకులకు వివరించారు. కథకంటే స్కెచ్ చిన్నదని, స్కెచ్ కన్న గల్పిక చిన్నదన్నారు. తెలుగు సాహిత్యానికి గల్పికను పరిచయం చేసింది కొడవగంటి కుటుంబరావు. గల్పిక అతిశయోక్తికి, వ్యంగ్యానికి ప్రాధాన్యతను ఇస్తుందని, కథలో కవిత్వాన్ని ఉపయోగించడంలో నేర్పరితనం కావాలన్నారు. వాతావరణ చిత్రణకు కవిత్వాన్ని ఉపయోగిస్తారని, సంఘటనలు, సర్దుబాటు చేయడంలో కథలో కవిత్వాన్ని ఉపయోగించే విధానానికి ఉదాహరణగా "మూన్ శట్" కథలో చెప్పారు. కథామాలికల రూపంలో ఉన్న అమరావతి కథలను వివరించారు.

**7 అధ్యాయం – పాశ్చాత్య కథా పరిణామం**

కథా పుట్టుకకు ఆర్థిక, సామజిక, సాంస్కృతిక విషయాలు ఎలా దోహదపడ్డాయో వివరించారు.1832 పాశ్చాత్య సాహిత్యంలో "మెట్ జన్ గర్ స్టయిన్" అమెరికన్ రచయిత కథను ప్రారంభించాడు. ఎడ్గర్ అలెన్ పో ప్రచురణ ద్వారా కథా ప్రారంభమైనదని భావన, రష్యన్ రచయిత గోగోల్ (1809) కూడా కథ సాహిత్యం ప్రారంభమవడానికి కారకులని చెప్పారు.కథ సాహిత్యంలో రెండు అలెన్ పో అసాధారణ మనస్తత్వం, ఊహ కల్పనా కథ వస్తువుగా కలిగిన మార్గం, రెండవది గోగోల్ యొక్క వాస్తవిక సాధారణ మనస్తత్వం కథ వస్తువుగా కలిగిన కథ సంప్రదాయాలను వివరించారు. స్పష్టత, సూటిదనం కలిగిన మాపాసా పద్ధతి, చెకోవ్, కేతరిన్, హెచ్. జి వెల్స్, టాల్ స్టయి, చివర్ర్, సారా జేవెట్, ఆబ్రొౌన్స్ బియర్స్, వంటి వారి కథలను పేర్కొన్నారు. ఇంగ్లడ్ కథ సాహిత్యానికి ప్రాణం పోసిన బ్రిటిష్ రచయిత రడ్ యార్డ్ క్లిపింగ్గ్ వారి ఉద్యమ అనంతరం కథలను వివరించారు. వల్లంపాటి వీటిని మూడు ప్రయోజనాలకోసం అధ్యయనం చేయలన్నారు. అవి

1. వారు జీవితం నుంచి కథా వస్తువుల్ని ఎంచుకున్న పద్ధతి కోసం, 2. కథా వస్తువును కథగా మలుచుకున్న తీరుని గూర్చి. 3. గొప్ప రచయితల కథలు చదవడం ద్వారా వారిని అనుకరించే విధానం గూర్చి తెలుస్తుందన్నారు. ఈ విషయాలను వల్లంపాటి నూతన రచయితలకు కావలసిన ముడిసరుకును సేకరించే విధంగా విశ్లేషించారు.

**8 అధ్యాయం – తెలుగు కథా పరిణామం**

బెంగాల్‌లో ప్రారంభమైన సంస్కరణ ఉద్యమం అనంతరం ఆంధ్రదేశంలో వ్యాపించింది. కథ పుట్టుక 1910లో తెలుగులో మొదటిదానిగా గురజాడ "దిద్దుబాటు"కథతో ప్రారంభం అయ్యిదని చెప్పవచ్చు. ఈ కథనంలోకి రచయిత జోక్యం చేసుకోవడం కానీ,ఎంతమాత్రమూ లేనీ క్లుప్తత, ఒక చదువుకున్న ఇల్లాలు–వేశ్యలోలత్వంలోకి జారిపోతున్న తన భర్తను దారిలోకి తెచ్చుకోవటమన్న కథాంశం మీదనే దృష్టినిలిపిన, అనుభూతి ఐక్యత బీభర్త మనసులో మంచి చెడ్డల మధ్య జరిగిన సంఘర్షణ నాటకీయంగా ప్రారంభమై కోసమలుపులో నిర్మాణ సౌష్టవం చక్కగా రూపుదిద్దిన దాన్ని వల్లంపాటి వివరించారు. గురజాడ మీ పేరేమిటి కథ –మత సమస్య గురించి చెప్తుతుంది, మెటిల్డాకథ –కుసంస్కారి అయిన ముసలిభర్తతో దీనమైన జీవితం గడుపుతున్న అందమయిన భార్య కథ, మతము–విమతము కథ – రక్త సంబంధము, ప్రేమ, మతానికంటే గొప్పవని చెబుతుంది. పెద్ద మసీదు, సంస్కర్త హృదయం – ఆనాడు ఉధృతంగా ఉన్న సంస్కరణ ఉద్యమంలోని బలహీతల్ని చిత్రించిన కథ. తరువాత వచ్చిన శ్రీపాద చేసిన ప్రయోగాలలో ఉన్న ప్రధాన అంశాలను "అన్నంతపని జరిగింది", "ఇలాంటి తువ్వాయి వస్తే", "వడ్ల గింజలు', "కలుపు మొక్కలు", "అన్నపూర్ణ", "యావజ్జీవంహెూష్యామి", "బ్రాహ్మణాగ్రహారం", వంటి కథల వివరణ ఇందులో తెలిపారు. శ్రీపాద నుంచి తెలుసునే అంశాలను పేర్కొన్నారు. ఇవి 1. కథనంలోకి రచయిత జోక్యం లేకుండా కథను "ప్రదర్శించడం" ఎలా అనేది, 2. కృత్రిమత్వం లేనీ సంభాషణలు రాయగల చాతుర్యం వివరించారు. ఇవి నూతన కథకులకు ఆదర్శప్రాయం అని పేర్కొన్నారు.

చింతా దిక్షితులకు రాసిన "సుగాలి కుటుంబం", "దాసరిపాట", "చెంచురాణి" అను కథలలో మొదటగా గిరిజనుల గురించి చిత్రించారు. "పెద్దమేడ" కథ తెలుగులో వచ్చిన మొట్టమొదటి అంతరార్థ కథ. కథా వస్తువులోను, శిల్పంలోను కొత్త దారులు వేసిన కథా రచయితలు త్రిపురనేని గోపిచంద్, చలం, కొడవంటి కుటుంబరావు, చాసో. కథ సాహిత్యాన్ని మాత్రమే రచించిన కరుణ కుమార్, భమిడిపాటి, మాదిరాజు రంగారావు వంటి రచయితల వారి కథలను, తెలుగు సాహిత్యంలో వచ్చిన కథ పరిణామాలను నాలుగు దశలుగా వివరించారు. ఇందులో కథకు గొప్ప భవిష్యత్తును సూచించారు. రచయితలు శిల్పాన్ని పాటించే విధానాలను వల్లంపాటి సుబ్బయ్య వివరించారు.

**ముగింపు :** ఈ పుస్తకం రాయడంలో వల్లంపాటి చాలా ఎక్కువ సంఖ్యలో రచయితల కథలను అధ్యయనం చేసి ఉంటారో ! మనం ఊహించవచ్చు. కొన్ని వందల కథల గురించి ఇందులో ప్రస్తావించారు. ఇందులో ఉన్న కథలకంటే పదిరెట్ల కథలను అధ్యయనం చేసిన వల్లంపాటి ఓపికకు నా నమస్సులు.

చదవాలి అనుకున్న వారికి, ఎవర్ని చదవడంతో మొదలు పెట్టాలో తెలియని వారికి, కథ రచనలో అర్థం కాకుండా అయోమయంలో ఉన్నవారికి కావలిసినంత సమాచారం ఇది చదివితే దొరుకుతుంది. క్లిష్టత లేకుండా, చాలా స్పష్టంగా రాసారు. కనుక తేలిగ్గా అర్థం అవుతుంది. కథ ఎలా ఉండాలో, కథ ఎలా పుట్టిందో – వంటి అంశాలపై మంచి అవగాహన కలుతుంది. కథా శిల్పం గురించి కథ చెప్పినట్టే రాశారు వల్లంపాటి సుబ్బయ్య.

**ఆధార గ్రంథాలు**

1. తెలుగు కథకులు – కథన రీతులు – సింగమనేని నారాయణ (సం.) – విశాలాంధ్ర పబ్లికేషన్స్ హౌస్, 2021.

2. కథాశిల్పం – వెంకట సుబ్బయ్య వల్లంపాటి

3. కథానిక స్వరూప స్వభావాలు – దక్షిణామూర్తి పోరంకి

# శ్రీకృష్ణ చంద్రోదయము పద్యకావ్యం - విశ్లేషణ

**బి.వి.యస్. గౌతమ,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మద్రాస్ క్రైస్తవ కళాశాల

తెలుగు పద్యరచనా వారసత్వాన్ని మరింత మాధురీ ధురీణం చేసిన వారిలో ప్రముఖులుగా పేర్కొనదగినవారు మహాకవి ఉత్పల సత్యనారాయణాచార్యులు. 1927 మార్చి 24న నేటి ఖమ్మం జిల్లా మధిర తాలూకా చింతకానిలో జన్మించారు. చిన్ననాటి నుంచి తెలుగుపట్ల మక్కువతో విశారద, బి.ఓ.యల్., ఎం.ఏ. తెలుగు వంటి కోర్సులను పూర్తిచేశారు. తెలుగుకుతోడు సంస్కృతం, హిందీ, ఆంగ్లభాషలపై పరిజ్ఞానం సాధించారు. ఇరవై ఏళ్ళ వయసులో మద్రాసుకు వెళ్ళి పత్రికా రచయితగా సారస్వత జీవితం ప్రారంభించారు. వరుసగా మాతృభూమి, జైహింద్, శుభోదయం, తెలుగుదేశం వంటి పత్రికలలో పనిచేశారు. మూడు దశాబ్దాలపాటు తెలుగు అధ్యాపకునిగా సేవలందించి వేలాదిమంది బాలబాలికల మనస్సుల్లో తెలుగుభాషా సాహిత్యం అందించారు.

**పురస్కారాలు**

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, ఉత్తమ అధ్యాపక పురస్కారం, బాలల అకాడమీ వారి బాలబంధు పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, శ్యామప్రసాద్ అవార్డు, పాలకొల్లు వారి సినారె కళాపీఠం అవార్డు, కటికనేని సోదరుల అవార్డు, మైసూరు దత్తపీఠం ఆస్థాన కవి పురస్కారం, రాష్ట్రప్రభుత్వ హంస అవార్డు వంటి బహుమానాలు అనేకం వీరికి లభించాయి. వీరి శ్రీకృష్ణ చంద్రోదయము కావ్యానికి 2003లో అత్యున్నత కేంద్రసాహిత్య అకాడమీ అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.

ఉత్పలవారి పద్యం సుందరం, గానం అతి సుందరం... వస్తువు ఆధునికం... శిల్పం అత్యాధునికం... తెలుగుపద్య వైభవం ఎలాంటిదన్న ప్రశ్నకు జవాబు ఉత్పల పద్యం... మాధుర్యం, వ్యంగ్యం, వక్రోక్తి చమత్కారం ఉత్పల పద్యలక్షణం. రచనకు శ్రీకారం చుట్టింది మొదలు గత 60 ఏళ్ళలో 70 రచనలు అందించిన ఉత్పల కరుణ రసావిష్కరణలో పోతనగా సాక్షాత్కరిస్తే శృంగార రస వర్ణనావరణంలో శ్రీనాథుడై నిలువెత్తు మూర్తిగా దర్శనమిస్తారు. మధురభక్తి తత్త్వ చిత్రణలో సాక్షాత్తు ఆ శ్రీకృష్ణుడే ఆవహించినట్లుగా అపురూప రస ప్రపూర్ణునిగా తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తారు. రచనా విధానంలో, విలక్షణశైలీ విన్యాసంతో తెలుగు కవిత్వాన్ని సమున్నత స్థాయికి అందించిన వ్యక్తి ఉత్పల సత్యనారాయణాచార్య.

**రచనలు**

చిన్ని కృష్ణుడు, పాతబస్తీ విలాసము,ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు ఉత్పలమాల, శతరూప, కచుని వీడుకోలు, గాంధారి, తపతి, శరణాగతి, స్వప్నాల దుప్పటి, రాస పూర్ణిమ. గజేంద్రమోక్షం, శ్రీకృష్ణ చంద్రోదయం కావ్య రచనలు. వ్యాస మంజుష, శ్రీమద్భాగవతీయ గోపీగీతం వ్యాసాలు. పిల్లల పుస్తకాలు గంగావతరణం, దాస్య విముక్తి, క్షీరసాగరమథనం, చిన్ని కృష్ణుడు, శమంతకమణి, నవల రాజమాత, వ్యాఖ్యానం యశోదానందగేహేని అనేక ప్రక్రియలు అందించారు.

ఈ జంటనగరాలు హేమంత శిశిరాలులో హైదరాబాద్ నగరాన్ని రమణీయంగా వర్ణించడంతో, సరికొత్త పద్యశిల్పాన్ని వెలార్చడంతో సాహితీలోకం పరవశించిపోయింది. వెంట వెంటనే స్వప్నాల దుప్పటి, వ్యాసమంజూష వంటి రచనలు

వెలువరించారు. సృష్ట్యాది స్త్రీ, పురుషుల కలయికను కావ్యవస్తువుగా స్వీకరించిన శతరూప కావ్యం సరికొత్తగా భాసించింది. పోతనామాత్యుని పట్ల అపార భక్త్యభిమానాలు కలిగిన ఉత్పల పోతన కీర్తి కౌముది అన్న సంస్థను నెలకొల్పారు. పోతన తన అనువాదంలో స్పృశించని వ్యాసభాగవతంలోని ఆరు శ్లోకాల ఫల వక్రయిణీ వృత్తాంతాన్ని 64 పుటలుగా రాసపూర్ణిమ పేరుతో చంపూకావ్యాన్ని రచించి కవిపండిత లోకంలో విఖ్యాతి పొందారు. మధ్యలో రాజమాత నవల ఇంకో రకంగా కొత్తదారి చూపింది. ఆ కోవలోనే గజేంద్రమోక్షం, పాతబస్తీ విలాసం, శ్రీకృష్ణ చంద్రోదయం కావ్యాలు పరంపరగా వెలువడ్డాయి. ఈ దశ ఉత్పలవారి కావ్యరచనా జీవితాన్ని ప్రకాశింపజేసింది.

ఉత్పలవారి శ్రీకృష్ణభక్తి వారి ఆధ్యాత్మిక ప్రవృత్తికి పరమోదాహరణం. వీరు ఏ ప్రక్రియ రాసినా దానిలో తప్పక శ్రీకృష్ణభక్తితత్త్వం మహనీయంగా దర్శనమిస్తుంది. నవల రాసినా, కవిత చెప్పినా, వ్యాఖ్య వెలియించినా, వ్యాసం కూర్చినా కృష్ణభక్తిలో వారి ప్రవృత్తి మునకలు వేస్తుంది. లోకానురక్తితోపాటు శ్రీకృష్ణభక్తిని పెంపొందించుకొనే ఒక ప్రత్యేక మార్గాన్ని వారు ఆవిష్కరించుకున్నారు. వీరి జీవితం ధన్యత పొందాక అనునిత్యం చేసిన సాహిత్య అధ్యయనం వల్ల కవితా రసోద్గారంగా ఈ కృష్ణచంద్రోదయము కావ్యం వెలిసింది.

**భగవదవతార రహస్య దివ్యజ్ఞానంబు గూడ**
**మోక్షసాధన మగుచున్నది కావున మత్కృతంబగు**
**శ్రీకృష్ణ చంద్రోదయ కావ్యంబు నవధరింపవేడెదను.**

అనే గద్యంతో ప్రారంభమై

**రాధాకృష్ణుల యుగళరూపంబు జనజీవనంబుల**
**బాహ్యాభ్యంతరంబుల నమృతమయ రసమయా**
**నందమయంబుల వొనరింపగలరు.**

అనే గద్యంతో ముగించారు. ప్రారంభంలో మోక్షసాధన ప్రసక్తి, ముగింపులో మోక్షస్వరూప నిర్ణయం కనిపించడం శ్రీకృష్ణభక్తి తత్పరులైన ఉత్పల వారికే చెల్లింది. దీనిలో మోక్ష స్వరూపాన్ని తెలియజేయడానికి ఉత్పల మూడు విశిష్టమైన పదాలు ప్రయోగించాడు. అమృతమయ, ధనమయ, ఆనందమయ అనేవి. ఈ మూడింటిలో రసమయం పరమాత్మ పర్యాయం అది శాంత రసానికి సంబంధించింది. ఈ కావ్యంలో శాంతరసానికి ప్రతీకలుగా శ్రీరాధాకృష్ణులు చిత్రించారు. అంతేగాక ఈ కావ్యం శ్రీకృష్ణునితో మొదలై రాధతో ముగుస్తుంది.

ప్రథమాశ్వాసంలో శ్రీకృష్ణుణ్ణి ఒక అవతారంగా కాక అవతారిను నిరూపించే ప్రయత్నం చేశారు.

**"అఖిల లోక సర్వావతారావతారి**
**శ్రీహరి స్వయముగ నవతరించినాడు**
**నిఖిల తారణోద్యక్తుడై నిజ పదార**
**వింద జీవాతు బృంద మానందమొంద".**

అని శ్రీకృష్ణుడి జన్మకథ కొత్త అయిన వారికోసం రచించారు ఈ కావ్యం. అందులోని రహస్యాలను అందించడం కోసం వెలసింది. ఆ రహస్యాల్లోని ఒక ముఖ్యమైన దానిని ప్రథమాశ్వాసంలో అందించాడు.

శ్రీకృష్ణుడు గర్భసంభూతుడు మాత్రమే కాదు, యశోదాగర్భ సంభవుడు అని కూడా. ఈ విషయం పోతన భాగవతంలో కాని, సంస్కృత భాగవతంలో కాని లేదు. గోపాలతాపిన్యాద్యుపనిషత్తులు, శ్రీకృష్ణయామలం, వైష్ణవతోషిణీ, వంశీధరాది వ్యాఖ్యలు

దీనిని ప్రస్తావించాయని ఉత్పలవారి అభిభాషణ. యశోదాపుత్రుడు, సచ్చిదానంద శ్రీకృష్ణుడనీ, దేవకీనందనుడు, ఈశ్వరస్వరూప శ్రీకృష్ణుడనీ, వీరిలో దేవకీనందనుడు యశోదా తనయుడిలో లీనమయ్యాడని మరో విశేషాంశం ఈ కావ్యంలో వెల్లడించారు. ప్రథమాశ్వాసంలో కవిత్వతత్వం కంటే తాత్త్వికత అధికమనే విషయాన్ని బోధిస్తుంది. ద్వితీయాశ్వాసంలో కవిలోని అభినివేశం అనేక రూపాలుగా ప్రదర్శించారు.

**ప్రజరాజ్ఞీ మనోజ్ఞవ పురపరాజిత లతా వికసిత**
**సుందరతమ ప్రసూనంబై విలసిల్లు శిశువును**
**లక్ష్మీ కరభాసురాబ్జ మసృణ**
**చ్చాయా చురా చదువున్"**

తృతీయాశ్వాసంలో ముఖ్యమైంది ఆదిభికు భిక్షాఘట్టం. ఇది ఈ కావ్యానికి ఆయువుపట్టు లాంటిది.

**స్రష్ట శ్యాముడు సృష్టియు శ్యామలమ్మ**
**జగము నందున శ్యాముడు, శ్యామునందు**
**జగము కలదు మీశ్యాముని శ్యామలతను**
**పొడగనిన వారు శ్యాములైపోదు రమ్మ**

దీనిలో కవిత్వానికీ, తత్వానికీ అభేదభావం చెప్పబడింది. తర్వాత అదిభిక్షువు......

**అంత వఱ కిట నుండి ఒక్కడుగు కదల కదల**
**నోతల్లి! నీదు ప్రాంగణము నందు**
**స్థాణువై యుందు గోకులేశ్వరుని నెన్ని**
**నాళ్ళకైనను గాంచి ధన్యత గడింతు**

అనే పద్యంలో కావ్య పరమార్థాన్ని స్పష్టంగా చెప్పారు.

చతుర్థాశ్వాసంలో బాలకృష్ణుని శృంగారం కథావస్తువు. దీనిలో శృంగారం కావ్యాల్లో వర్ణింపబడ్డ శృంగారం కాదని, శృంగం ఇయర్తీతి శృంగారః అనే నిర్వచనానికి లక్ష్యభూతమైనదే దీనిలోని శృంగారమని కవితామయంగా నిరూపించాడు. ఈ ఘట్టంలో ప్రతి పద్యం ఒక రసగుళిక. శృంగారాన్ని అతిగా వర్ణించి, చివరికి –

**కుసుమ గత రజమ్మది రజోగుణము కాదు**
**మరి తమిస్రమందలిది తమస్సు కాదు**
**శ్రీకృష్ణ దర్శన మందు లక్షితమునైన**
**చంచలతకాదు ఇంద్రియ చాపలమ్ము**

అని ఇంద్రియ చాపలమని ముగింపు పలికాడు.

ఈ కావ్యంలో బాలకృష్ణుడు తెలుగు వారికి ముద్దుబిడ్డ.

**ముద్దుపాదాలకు నిద్దంపు గడియాలు గజ్జెల మొలత్రాడు కటిని మెరయ**
**కరముల బంగారు కంకణమ్ములు గ్రాలమెడను ముత్తెపు దండ మిసలు గులుక**
**ఉరమున బులిగోరు నొప్పారు పతకమ్ము సందిట బిగిబాజు బందులు**
**..................................................**
**చుబుకమున జుదుచుక్కయు సొబగులీన నలరె శిఖిపింఛమౌళి**
**పీతాంబరము.**

పద్యంలో తెలుగువారి సొమ్ములతో వెలుగు నింపుకొనే బాలకృష్ణుడు తెలుగు సాహిత్యంలో వెలుగురేఖలా నిలిచిపోతాడు. కస్తూరీతిలకం, కాళ్ళకడియాలు, గజ్జెల మొలత్రాడు కంకణాలు బాజుబందులూ, కళ్ళకుకాటుక మొదలైనవన్నీ సహజాలంకారంగా భాసింపజేశాడు. సర్వ కవితా చమత్కార విశేషాలన్నీ శ్రీకృష్ణతత్త్వ రసప్రవాహంలో పరితులి ఓలలాడించడానికి తోడ్పడే ఉజ్జ్వల సాధనాలని ధ్వనిమయంగా తెలియజేశారు.

**నేనొక వీధినానుకొని నిల్చిన చెట్టును చైత్ర శోభలన్**
**కానరు నన్ను నాపువ్వులు కాయలుఉజూడరు ధూళి ధూసరం**
**బైన మొగంబు తేటపడు నటభిషేక మహంబొనర్చి ఆ**
**స్థాన పరస్థ గౌరవ మొసంగితి వెంత దయామయుండవ**

ఉత్పలవారిని గణపతి సచ్చిదానంద స్వామివారు ఆస్థాన కవులుగా నియమించారు. దానికి కృతజ్ఞతగా దీనిలో అలంకారంతో కూడిన చమత్కారం ఉంది. ఉత్పలవారు వీధినానుకొని నిలబడ్డ చెట్టు ఎల్లవేళలా వసంత శోభల్ని విరజిమ్ముతూ ఉంది. పూలు పూస్తాయి. కాయలు కాస్తాయి. అయితే దారిపక్క ఉన్నందువల్ల దుమ్ముపడి వాటి శోభ మరుగున పడిందట. అందువల్ల ప్రజలు వాటిని గమనించేవారు కాదు. వారి దృష్టి చెట్టు మీద నిలవాలంటే దూళితో కూడిన చెట్టును అభిషేకించాలి. ఈ పద్యం ఒక చమత్కార కవితా కల్పితం.

శ్రీకృష్ణుని కన్న తల్లిదండ్రులు దేవకీ వసుదేవులు, పెంచిన తల్లిదండ్రులు, యశోదానందులు చిత్రించారు. ఈ నలుగురేకాక మరి నలుగురు విశిష్ట పాత్రలున్నారు వారు గోకులాచార్యుడు శాండిల్య మహాముని భిక్షుకాకృతిలో వచ్చిన శివుడు, యదువంశాచార్యుడు గర్గమహాముని వృషభానుడు జ్ఞానులు. వీరు క్రమంగా శ్రీకృష్ణుని రూప, గుణ, నామ, తత్త్వ విభూతులను ఆవిష్కరించి వాసుదేవ తత్త్వ దర్శనాచార్యులుగా కవిత్వానికి తత్త్వానంద సాంద్రతను కల్పించారు.

సృష్టిలోఉన్న నాలుగు స్త్రీ ప్రవృత్తులు కూడా పాత్రల రూపంలో పోషించారు. వారు యమున, రోహిణి, గోపికలు, రాధ. ఈ నలుగురూ భగవద్భక్తిలో కనబడే నాలుగు ప్రవృత్తులకు ప్రతినిధులుగా భాసిస్తున్నారు. యమున సేవాభక్తికి, రోహిణి వాత్సల్యభక్తికి, గోపికలు స్నేహామృత భక్తికి, ప్రతీకలు. ఈ ప్రవృత్తుల ప్రత్యక్ష చిత్రీకరణమే ఈ స్త్రీ పాత్రల ప్రయోజనం. చెరసాలలో చతుర్భుజ రూపుడై విష్ణువు అవతరించాడు. అందరూ అతని రూపవైభవాన్ని

**జలతత్త్వంబడి శంఖమై ప్రబల తేజస్సత్త్వమే చక్రమై**
**అలఘు శ్రీభువనాంశకంబు కమలంబై యొప్పవాయ్వంశ సం**
**కలనంటే గదయై చతుర్భుజములున్ చైతన్య రూపంబులై**
**విలసిల్లన్ చెరసాలలోన హరి యావిర్భావ మొందెన్ కృపన్**

పంచభూతాత్మకమైన ప్రకృతినుండి స్వీయరూపాన్ని సృష్టించుకొన్న జగత్ సృష్టికర్త మహత్వ శక్తిని వ్యాఖ్యానించే ప్రతిభను ప్రదర్శించారు ఉత్పలవారు.

పాత్రలలో లీనమై వర్ణించినా అక్కడక్కడా తన ప్రౌఢపండిత కవి వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రకటించడం ఉత్పలవారి నైజగుణం. వ్రజభూమిలో నందనందనునితోపాటు నవవిధాలు జన్మమెత్తాయని చేసిన అలంకార చమత్కృతి ప్రబంధ విలాసం.

**వదనంబుగా మహాపద్మ నిధి భజించే పద్మనిధి నయన ద్వయమునయ్యో**
**మకరనిధి భజించే ముక్కు దొప్పలై యొప్పి గమాశ్రయించే శంఖంబు నిధియు**
**........................................................................**
**నందనందనుతోడ జన్మంబు నొంది పుణ్యమును బొంది శ్రీ వ్రజ భూమియందు**

చివరికి కావ్యంలో ఒక విచిత్ర చమత్కారముంది. ఈ కావ్య నాయకుడు శ్రీకృష్ణుడు. నాయిక రాధ. కాని వారిద్దరూ పసికూనలు. చంద్రబింబంలా నవ్వుతారు కాని మాట్లాడరు. ఆవజ్మానస గోచరమైన దివ్యానుభూతులువారు. నవ్వు వెన్నెలలు చిమ్మే శ్రీకృష్ణుడు చంద్రుడయ్యాడు. నవవిధ రసాలలో శాంత శృంగారాలే ప్రధాన రసాలు కాగలవని భావించే రూపగోస్వామి ప్రతిపాదించిన పంచవిధభక్తి ప్రస్థానాలలో శాంతభక్తి ఒక ఒడ్డు. మధురభక్తి మరొక ఒడ్డు. ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు చేరటమే ఉజ్జ్వల రసప్రస్థానం. ప్రథమ చతుర్థాశ్వాసాలు రెండు ఒడ్లు. మధ్యపారే నీటిలో రెండు మూడు ఆశ్వాసాలు తరంగాలు. మధ్య తరించవలసిన భక్తి తరంగాలు ప్రీతి. వత్సల రసాలు. ఈ ప్రస్థానాన్ని కావ్య కళాసుందరంగా ఆవిష్కరించిన రచన శ్రీకృష్ణచంద్రోదయం.

**ఆధార గ్రంథాలు**

1. నాగయ్య, జి. 2019. తెలుగు సాహిత్య సమీక్ష. తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
2. రామకృష్ణ, మిరియాల. 1980. శ్రీశ్రీ కవిత్వం వస్తువు – సంవిధానం. కాకినాడ: యమ్. లక్ష్మీదేవి పబ్లింగ్ హౌస్.
3. రామమోహన్ రాయ్, కడియాల. 1980. తెలుగు కవితా వికాసం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
4. రెడ్డి, యస్.యస్. 1981. ఉత్పల సంప్రదాయసత్ఫలం. హైదరాబాదు: ఆంధ్రపత్రిక దినపత్రిక.
5. సత్యనారాయణ, ఉత్పల. 1968. శ్రీకృష్ణ చంద్రోదయము. హైదరాబాదు: దక్షిణ భారత హిందీ ప్రచారసభ.

ISSN 2457-0796 UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 7 (2) హైదరాబాద్ మే - 2024

# తనమార్గం కథలు - స్త్రీవాద భావనలు

**డా. నేమాని శారద,** తెలుగు అధ్యాపకురాలు, డా. వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్టణం

*స్త్రీల రచనా ప్రపంచంలో ఛాయాదేవి పేరు తలుచుకోగానే గొప్ప ఉద్వేగభరితమైన స్ఫూర్తి వెలుగులా అంతటా నిండిపోతుంది... స్వతంత్ర ఆలోచనా ధోరణితో స్వయం శక్తి మీద నమ్మకంతో స్త్రీలకు సమాన హక్కులు కావాలని పోరాటం చేసిన కలం యోధురాలు అబ్బూరి ఛాయాదేవి* – **వి. ప్రతిమ**

తెలుగు సాహితీలోకంలో స్త్రీవాద సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉంది. పితృస్వామ్య భావజాలంపై తిరుగుబాటుగా 1980 దశకాల్లో ఈ సాహిత్యం సమాజాన్ని బలంగా కుదిపింది. స్త్రీ, పురుష వివక్షతలను గూర్చి చైతన్యవంతులైన రచయిత్రులు తమ సాహిత్యం ద్వారా సమాజాన్ని నిలదీశారు. నేటికీ ఈ స్త్రీవాద ఉద్యమం సాహిత్యంలో అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. అయితే తెలుగు సాహిత్యంలో ఈ స్త్రీవాద భావనలు మొలకెత్తడానికి పూర్వమే స్త్రీలసమస్యలను, అస్వతంత్రతను, అసహాయతను, వివక్షను ప్రశ్నిస్తూ, తన భావాలను తనసాహిత్యంలో దృఢంగా, ఆసక్తికరంగా, ఆలోచనత్మకంగా, సున్నితంగా వ్యక్తీకరించిన రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి.

అబ్బూరి ఛాయాదేవి బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీ స్రష్ట, బహుగ్రంథకర్త, విద్యావేత్త, నవలారచయిత్రి, నాటకకర్త, అనువాదకురాలు, కాలమిస్ట్, పత్రికా సంపాదకురాలు, వ్యాసకర్త, యాత్రా చరిత్రల రచయితగా ఎన్నో అంశాలలో ప్రతిభను కనబరిచిన అరుదైన స్త్రీరత్నం అబ్బూరి ఛాయాదేవి.

**జీవితం – విద్యాభ్యాసం – వివాహం :** అబ్బూరి ఛాయాదేవి అక్టోబర్ 13, 1933వ సంవత్సరంలో రాజమండ్రిలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు తమకు కుమారుడు కావాలని సూర్యుని ఆరాధిస్తే కుమార్తె పుట్టింది. అందువలనే ఆమెకు ఛాయాదేవి అనే పేరు పెట్టారు. ఆమె నిజాం కాలేజీలో ఎం.ఏ. పూర్తి చేశారు. 1953వ సంవత్సరంలో అబ్బూరి వరదరాజేశ్వరరావు గారితో వివాహం జరిగింది. ఆమె ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ గ్రంధాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేశారు. 2019వ సంవత్సరం జూన్ 28న ఆమె పరమపదించారు.

**రచనలు :** ఆమె తొలి కథ 'అనుభూతి' 1952లో కాలేజీ పత్రిక 'విద్యార్థి'లో ప్రచురింపబడి ఆమె కథాజీవిత ప్రారంభానికి తొలిమెట్టుగా నిలిచింది. 1965లో రాసిన ప్రయాణం కథ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. 'తనమార్గం' కవితా సంపుటి, వరద స్మృతి (సంకలనం), మృత్యుంజయ (లేఖలు), వ్యాసచిత్రాలు ఆలోకనం (కాలమ్స్), మాటసాయం (వ్యాసాలు), మన సమస్యలు– జిడ్డు కృష్ణమూర్తి సమాధానాలూ, జి.కె. జీవిత చరిత్ర.... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి.

**పురస్కారాలు :** మృత్యుంజయ గ్రంథానికి రాష్ట్రీయ ఉత్తమరచనా పురస్కారం, 2005వ సంవత్సరంలో 'తనమార్గం' కథల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులతో పాటు ఇంకా ఎన్నో పురస్కారాలను ఆమె పొందారు.

**తనమార్గం కథలు – స్త్రీవాద భావనలు :** 1975 వ సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించడానికి కొన్ని సంవత్సరాలు ముందుగానే ఛాయాదేవి స్త్రీవాద దృక్పథంతో కథలను రాశారు. ఆమె కథలు చాలా సున్నితంగా, సరళమైన భాషతో, పదునైన భావంతో, నిక్కచ్చితనంతో, స్త్రీ పక్షపాత ధోరణితో, చక్కని శైలితో, సామాజిక చైతన్యంతో ఉంటాయి.

'తనమార్గం' కథాసంపుటిలోని కథల్లో ఒకటి రెండు తప్ప అన్ని కథల్లో పితృస్వామ్య సమాజంలో స్త్రీలపై జరిగే అనేకవిధాలైన దోపిడీలను, అన్యాయాలను అత్యంత సున్నితంగా విప్పి చెప్పి పాఠకులను 'తనమార్గం' వైపు తిప్పుకుంటారు రచయిత్రి. ఈ సంపుటిలో ప్రయాణం, ఉపగ్రహం, సుఖాంతం, మూడు నాళ్ళ ముచ్చట, బోన్సాయ్ బ్రతుకు, శ్రీమతి–ఉద్యోగిని, కర్త–కర్మ–క్రియ, నలుగురి కోసం, అవకాశం, స్పర్శ, ఉడ్‌రోజ్, తనమార్గం, మొగ్గ, పరిధి దాటిన వేళ.... వంటి అనేక కథలు వున్నాయి.

రచయిత్రి తన రచనలను గురించి చెప్తూ "నా కథలు చాలావరకూ కుటుంబంలోనూ, సమాజంలోనూ, నేను చూసిన స్త్రీల స్థితిగతులు గురించి, స్త్రీ, పురుష వివక్ష గురించి రాసినవే. నాతోటి స్త్రీలకు జరిగిన అనుభవాలను కూడా నాకు జరిగినట్లుగానే స్పందించి రాశాను" అనడంలో రచయిత్రి 'సహానుభూతి' వ్యక్తమవుతుంది. ఒక బాధ్యత గల రచయిత్రిగా సమాజంలోని సమస్యలను తన రచనల ద్వారా ఎత్తిచూపి, సమాజాన్ని ధైర్యంగా ప్రశ్నించగలిగే సామాజికవేత్త మనకు దర్శనమిస్తుంది.

**కథా పరిశీలన**

**1. ఉపగ్రహం:** ఈ కథలో రచయిత్రి స్త్రీ భర్త నుండి కోరుకునే చాలా చిన్నచిన్న గుర్తింపులు, పొగడ్తలు, చిన్నపాటి సరదాలు, సరసమైన సంభాషణలూ, ఆప్యాయత, వాటిని సైతం తీర్చలేని (తీరుబడి లేని) మగ మహారాజుల అభిజాత్యాన్ని వివరించారు. భార్యలు తమ భర్తల చుట్టూ ఒక ఉపగ్రహంలా తిరుగుతుంటారనే సత్యాన్ని ఆవిష్కరించారు.

**2. సుఖాంతం :** ఈ కథలో స్త్రీ యొక్క అవిశ్రాంత జీవితాన్ని వర్ణించారు. స్త్రీకి చిన్నతనంలో చదువులు, వివాహం, భర్త, అత్తమామలు, పిల్లలు, వారి చదువులు, వివాహాలు, మనుమలు, వారి పెంపకం, తీరికలేని జీవనవిధానం, ఇంటి చాకిరి, గుర్తింపులేని కష్టం, విలువ లేని, విశ్రాంతి లేని ఇంటి పని ఆమెను ఎంతగా నిర్వీర్యం చేస్తుందో, చివరకు చావులోనే ఆమెకు విశ్రాంతి అనే భయంకర సత్యాన్ని ఈ కథలో వివరిస్తుంది. ఎటువంటి భంగాలు లేని ప్రశాంతమైన నిద్ర కోసం పరితపించే అవిశ్రాంత స్త్రీ కథే ఈ సుఖాంతం.

**3. మూడునాళ్ళ ముచ్చట :** స్త్రీలకు ప్రతీ నెలా వచ్చే పండుగే ఇది. ప్రకృతి స్త్రీకి ఇచ్చిన వరమిది. అయితే ఆచారం పేరిట ప్రతీ నెలా స్త్రీని బయట కూర్చోబెట్టడం, ఆ సమయంలో ఆమెకు పూర్తి విశ్రాంతినివ్వడానికే అని సమాజం సమర్థించుకున్నా ఆ ఆచారం మూఢాచారంగా మారి స్త్రీ పాలిట కొత్త శాపంగా రూపుదిద్దుకుంది. చదువుకొని ఉద్యోగం చేసే స్త్రీలకు ఇది ఒక ఇబ్బందిగానే ఉంటుంది. ఈ ఆచారాలను పూర్తిగా పాటించలేక, పాటించకుండా ఉండలేక స్త్రీల మనస్సు ద్వైదీ భావంలో కొట్టుమిట్టాడే ఒక యువతి కథే ఈ 'మూడు నాళ్ళ ముచ్చట'. ప్రస్తుత కాలంలో ఈ సమస్య కొంత తీరినా, పూర్తిగా పోలేదన్నది నిర్వివాదాంశం. నేటికీ ఈ ఆచారాన్ని నిరంకుశంగా పాటిస్తున్న గ్రామాలు, కుటుంబాలు మన సమాజంలో ఉన్నాయి. వాటి కారణంగా ఇబ్బందులను అనుభవిస్తున్న స్త్రీలు ఉన్నారు. అయితే ఈకథ చదివిన తర్వాత చాలామంది స్త్రీలు ఈ ఆచారాన్ని వదిలిపెట్టారని రచయిత్రి ఒక ఇంటర్వ్యూలో చెప్పడం ముదావహం.

**4. బోన్‌సాయి బ్రతుకు :** ఛాయాదేవి రాసిన కథల్లో గొప్ప ఆలోచనాత్మకమైన కథ 'బోన్‌సాయి బ్రతుకు'. పితృస్వామ్య సమాజంలో స్త్రీ, పురుషుల పెంపకంలోని వివక్షను ఈ కథ ద్వారా వివరిస్తుంది రచయిత్రి. ఎటువంటి ఆంక్షలు లేకుండా సహజ వాతావరణంలో స్త్రీని పెంచితే ఆమె కూడా సమాజాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తుందనే విషయాన్ని ప్రతీకాత్మకంగా చెప్పారు ఈ చిన్న కథలో రచయిత్రి. మన సమాజంలో స్త్రీ పెంపకం బోన్‌సాయ్‌లా వుందంటూ

**"....... నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్‌సాయ్ చూడు! చూట్టానికి కుదురుగా, ముచ్చటగానే వుంది సంసారపక్షపు స్త్రీలాగా. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యి కళ్ళతో కాపాడాలి దాన్ని. కాస్త తుఫానుకి కూడా తట్టుకోలేదు. తనే ఒకరి మీద ఆధారపడినపుడు మరొకరికి నీడ కూడా ఏమివ్వగలదు? మగవాడికీ, ఆడదానికీ పెంపకంలో వున్న తేడా వల్లనే కదుటే ఆడదాని బతుక్కూడా బోన్‌సాయ్ మాదిరి అయింది" తనమార్గం – బోన్‌సాయ్ బ్రతుకు.**

ఈమాట పితృస్వామ్య సమాజానికి చెంపపెట్టు. సమాజమంటే స్త్రీ పురుషులిద్దరూ అయినప్పుడు సమాజం అభివృద్ధి చెందాలంటే అందులో సగభాగమైన స్త్రీలు కూడా అభివృద్ధి చెందాలి. స్త్రీలను కూడా పురుషునితో సమానంగా వివక్షారహితంగా పెంచితే ఆమె సుకుమారమైన బోన్‌సాయ్‌లా కాక, భూమి లోపలి నుండి వేళ్ళూనుకున్న వటవృక్షంగా మారి తానే నలుగురికి నీడనిచ్చేదిగా మారుతుందనే కఠిన సత్యాన్ని ఈ చిన్న కథలో నొక్కి వాక్కాణించారు.

**5. మొగ్గ :** కుటుంబంలోని బంధాల విలువను వివరిస్తూ వ్రాసిన మంచి కథ మొగ్గ. అనుబంధాలకి అత్యంత ప్రాధాన్యమిచ్చే స్త్రీకి తనజీవితంలో భర్తా? కొడుకా? అనే విషమ సమస్య వచ్చినప్పుడు ఆమె మొగ్గు ఎవరి వైపు అనే విషయాన్ని ఎంతో గొప్పగా చెప్పిన కథ ఇది. కుటుంబంలో భర్త అయినా, కొడుకైనా స్త్రీని తమ అవసరాలకు వినియోగించుకునే వారే కానీ, ఆమె వ్యక్తిత్వానికి విలువనిచ్చి ఆమెని ఆత్మాభిమానం, స్వతంత్ర నిర్ణయశక్తి కలిగిన వ్యక్తిగా చూడకపోవడం ఈ వ్యవస్థ దౌర్భాగ్యం. చిన్నతనంలో కొడుక్కి కోపంవస్తే 'అమ్మ వద్దు పో' అంటాడు. పెద్దయ్యాక భర్తకి కోపం వస్తే 'పో కొడుకు దగ్గరికి' అంటాడు. అయితే స్త్రీ సహనమూర్తి. అప్పుడైనా, ఇప్పుడైనా మనసు గల స్త్రీ తన అవసరం ఎవరికి ఎక్కువగా వుంటే వారిని వెన్నంటే కాపాడుతూ ఉంటుంది అంటూ స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన కథ మొగ్గ .

**"....... భర్త పొమ్మంటే వీధిలోకి కాదు, వంటింట్లోకే వెళ్లాను. బానిసలా కాదు. ఆయన అవసరాలు తీర్చే తల్లిలా... ఈయనకి నేను తప్ప చూసే దిక్కెవరు? అంటుంది.** తనమార్గం–మొగ్గ

**6. తనమార్గం :** ఛాయాదేవి రాసిన కథల్లో మైలురాయి లాంటి కథ తన మార్గం. ఈ కథలో చిన్నతనంలో తల్లిదండ్రులపైనా, పెళ్లయ్యాక భర్తపైనా, ముసలితనంలో పిల్లలపైనా ఆధారపడే స్త్రీ జీవితపు సమస్యలను, ఎలా అధిగమించింది అనే విషయాన్ని ఈ కథలో చర్చించారు రచయిత్రి. ఆర్థిక స్వావలంబన లేని స్త్రీ భర్త మరణిస్తే సంసార జీవితంలోని ఒడిదుడుకులను తట్టుకొని, కొడుకుల నిరాదరణను భరిస్తూ 70 సంవత్సరాలు వయసులో స్వేచ్ఛగా జీవిస్తూ నిన్నటి వరకూ కోల్పోయిన చిన్న చిన్న సరదాలను తీర్చుకోవాలని ఉవ్విళ్ళూరుతూ, సమాజ కట్టుబాట్లకి ఎదురు తిరిగి, ఏటికి ఎదురీదడానికి సిద్ధపడిన ధీరవనిత వర్ధనమ్మ కథే. 'తనమార్గం' స్వార్థపరులైన కొడుకులనుండి, మమకారపు మాయా పంజరాన్ని ఛేదించుకొని నింగికెగిసే స్వేచ్ఛా విహంగం వర్ధనమ్మ.

**7. ఆయన కీర్తి వెనుక :** పురుషుడు ఉన్నత ఉద్యోగస్తుడైనా, గొప్ప స్వాతంత్రోద్యమ నాయకుడైనా, గొప్ప సామాజిక సంస్కర్త అయినా వారు సమాజంలో ఎంతో గుర్తింపును పొందుతారు. అయితే వీరు తమ స్వంత కుటుంబాన్ని వదిలి సమాజసేవకు అంకితమైనప్పుడు ఆ కుటుంబాన్ని నీడలా అంటి పెట్టుకొని, అత్తమామలను, పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టుకొని, వారి బాగోగులను జాగ్రత్తగా చూసుకునే కుటుంబ స్త్రీలు పడిన కష్టానికి గుర్తింపు ఏది? అని ప్రశ్నించే కథ "ఆయన కీర్తి వెనుక" స్త్రీల ఇంటి చాకిరికి, కష్టానికి గుర్తింపు వుండకపోవడాన్ని ప్రశ్నిస్తూ రాసిన కథఇది. పురుషుడు చేయాల్సిన పనులు కూడా స్త్రీ చేసినప్పుడు స్త్రీ కష్టం సమాజం ఎందుకు గుర్తించదు? సమాజం వరకూ ఎందుకు భర్తే, భార్య కష్టాన్ని గుర్తించదు అనే విషయాన్ని ఈ కథలో వివరిస్తారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న భర్తను విలేకర్లు ఇంటర్వ్యూ చేయడానికి వచ్చినపుడు భార్య సీతమ్మ తన పేరును, తన కష్టాన్ని కనీసం గుర్తించకపోవడాన్ని గమనించి దుఃఖపడుతుంది. తాను పడిన కష్టం భర్తగానీ, ఈ సమాజంగానీ గుర్తించదనే విషయం ఆమెకు బాధను కలిగిస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తనకు మాత్రం స్వాతంత్ర్యం రాలేదనే సీతమ్మ స్వగతంతో ఈ కథ ముగుస్తుంది.

**8. ఉడ్‌రోజ్ :** మానవసంబంధాలు, కుటుంబబాంధవ్యాలు కృత్రిమంగా మారడం ఈ కథలో వివరిస్తారు రచయిత్రి. వృద్ధాప్యాన్ని ఒక శాపంగా భావించకూడదు. కానీ నేటి ఉరుకుల, పరుగుల ప్రపంచంలో అపార్ట్‌మెంట్ సంస్కృతుల ఒంటరితనంలో బ్రతికే వృద్ధురాలి ఆత్మఘోష ఉడ్‌రోజ్. ఒక్కసారిగా వచ్చిపడిన అధిక విశ్రాంతిని భరించలేక, తన ఉనికిని గ్రహించని ఇంట్లో ఒక తల్లి పడే ఆవేదనే ఈ 'ఉడ్‌రోజ్' కథ.

ఈ కథ చివర ఆ తల్లి పడే ఆవేదన రచయిత్రి మాటల్లో :

**"మనిషికీ, మనిషికీ మధ్య మమత ఆ తీగంత దట్టంగా పెరగకూడదేమో అలా పెరిగితే పిల్లలైతే పెకిలించి పారేయగలరు. తల్లికి అల్లుకుపోవడమే తెలుసు."** తనమార్గం – వుడ్‌రోజ్

**9. పరిధి దాటిన వేళ :** పితృస్వామ్య సమాజపు అసలైన దౌర్భాగ్యం – మన వివాహ వ్యవస్థ. ఈ వ్యవస్థ స్త్రీ, పురుషులిరువురూ సమానులని కాక స్త్రీపై పురుషునికి సర్వాధికారాలు కట్టబెడుతుంది. దీనివలన స్త్రీలపై పురుష దౌర్జన్యాలూ, హింసవంటివి పెరిగాయి. స్త్రీ ఒక అబలగా తన స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం చిన్ననాటి నుండీ, జీవితాంతం ఎవరో ఒకరిపై ఆధారపడాలనేది మన సమాజ సిద్ధాంతం. రచయిత్రి ఈ కథలో ఈ విషయాన్నే ప్రశ్నిస్తుంది. ఎవరూ పట్టించుకోకపోతే తన అనారోగ్యానికి కావలసిన మాత్రలు కొనడానికి బయటకు వెళ్లడమే ఆమె చేసిన మహాపాపంగా చిత్రిస్తూ, భర్త, కొడుకు, కోడలు, కూతురు తప్పు పట్టడాన్ని భరించలేకపోతుంది కథానాయిక. భర్త ఆమెతో నువ్వు లేకపోతే రేపటి నుండి నా పనులన్నీ ఎవరు చేస్తారు అనడంలో అతని హిపోక్రసీ బయటపడుతుంది.

ఇంకా ఈ సంకలనంలో అవకాశం, రెండు కాదు ఇరవై రెండు... వంటి అనేకమైన కథలు వున్నాయి. అన్నికథల్లోనూ సున్నితమైన ఆర్ద్రత తొంగి చూస్తుంది. ఈ కథలన్నీ కుటుంబ స్త్రీల సమస్యలను విప్పి చెప్తాయి.

**ముగింపు :** ఛాయాదేవి కథలన్నీ చిన్న కథలు. కానీ భావంలో విశ్వవ్యాప్తమైనవి. వారి కథలోని పాత్రలన్నీ వాస్తవజీవితంలో అతి సామాన్యమైన పాత్రలు. మంచి, చెడులు, చిన్న బలహీనతలు, కాస్త అమాయకత్వం, కొంచెం లౌక్యం, కాలంతోపాటు మారే గుణం వున్న పాత్రలను సృష్టించారు. తాము పరిస్థితులతో సర్దుకుపోతున్నట్లు కనిపించినా, అది కూడా కుటుంబ క్షేమం కోసమే అనే విషయాన్ని ఛాయాదేవి తమ కథలోని స్త్రీ పాత్రల ద్వారా స్పష్టంగా, బలంగా చెప్తారు. స్త్రీలు అలా సర్దుకుపోవడం వల్లనే భారతదేశంలో కుటుంబవ్యవస్థ పటిష్టంగా ఉందనేది నిర్వివాదాంశం.

ప్రతిభావంతమైన రచయిత్రిగా చేకూరి రామారావుచే ప్రశంసించబడిన ఛాయాదేవి మార్గం స్త్రీలకు అనుసరణీయం. చక్కటి భావజాలం కలిగిన రచయిత్రిగా తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ధ్రువతార అబ్బూరి ఛాయాదేవి.

**ఆధార గ్రంథాలు**

1. తనమార్గం – అబ్బూరి ఛాయాదేవి
2. కథా స్రవంతి – అబ్బూరి ఛాయాదేవి కథలు
3. సాహిత్యం జెండర్ స్పృహ – డా. పి. కుసుమకుమారి
4. దృక్పథాలు – డా. ఎస్.వి. సత్యనారాయణ
5. తెలుగు కథానిక – డా. పోరంకి దక్షిణామూర్తి
6. కథా శిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య

# విముక్త కథలోని స్త్రీ పాత్రలు - ఓల్గా దృష్టి

**గంధం రోజమ్మ,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, బెంగుళూరు విశ్వవిద్యాలయం

**కవయిత్రి పరిచయం**

ప్రత్యేకమైన పరిచయం అవసరంలేని స్త్రీవాద చిరునామా, స్త్రీవాద సృజనకారిణి ఓల్గా. కొత్త పరికరాలతో స్త్రీవాద సాహిత్య అధ్యయనానికి, స్త్రీవాద ప్రస్థానానికి బాటలువేసిన తొలి అడుగు ఓల్గా. ఓల్గా పూర్తిపేరు పోపూరి లలితకుమారి. 27.11.1950లో గుంటూరు జిల్లా, చుండూరు మండలం, యట్లెపల్లి గ్రామములో జన్మించారు. వీరి తల్లిదండ్రులు పోపూరి వెంకటసుబ్బారావు, వెంకట సుబ్బమ్మ. ఈమె ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఎం.ఏ. చేసిన తర్వాత తెనాలిలో వి.ఎస్.ఆర్. కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేశారు. చలం, కొడవటిగంటి కుటుంబరావు రచనల వల్ల ప్రభావితమై స్త్రీ చైతన్యము అంశముగా రచనలు చేసి, తనకైన ఒక ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నారు. మనకందరికీ తెలుసు, స్త్రీల జీవితాలను అణిచివేస్తున్న పితృస్వామ్యాన్ని బహిర్గతం చేసి స్త్రీవాదాన్ని ఒక బలమైన తాత్వికశక్తిగా నిలబెట్టిన సాహిత్య ఉద్యమకారిణి ఈమె. కేవలం స్త్రీవాద రాజకీయ చైతన్యాన్ని పాఠకులైన స్త్రీ, పురుషులకు అందించడం కోసమే సాహిత్యాన్ని ఒక వాహికగా ఎంచుకున్నారు. అది సాహిత్యంలో ఒక పత్రికకు మాత్రమే పరిమితం కాక కవిత్వంతో మొదలై తన సాహిత్య పరిధిని విశాలపరుచుకోవాలనిపించి కథ, నవల, విమర్శ, నాటకం, పాటలు, సినిమాలు, టి.వి. రచనలు ఇలా ఏది రాసినా స్త్రీవాదమే ఆమెకు ప్రధాన వస్తువు అయింది. **ఓల్గా 'విముక్త' కథకుగాను 2015లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది.** వీరి విముక్త కథలు ఇతర భారతీయ భాషలకు కూడా అనువాదమయ్యాయి.

**స్త్రీకి కూడా శరీరం ఉంది, దానికి వ్యాయామం ఇవ్వాలి, ఆమెకి మెదడు ఉంది, దానికి జ్ఞానం ఇవ్వాలి, ఆమెకి హృదయం ఉంది, దానికి అనుభవం ఇవ్వాలి అంటారు చలం, స్త్రీ అనే రచనలో** తరతరాలుగా స్త్రీ అంటే ఇలాగే ఉండాలి. ఇటువంటి దుస్తులే ధరించాలి. ఇలాంటి పనులే చేయాలి. స్త్రీ అంటే ఈ పనులకి మాత్రమే పరిమితం అని హద్దులుపెట్టి తన ఆలోచనలకూ, ఆచరణలకూ, ఆవేదనలకి బంధాలు అనే సంకెళ్ళు బిగించారు. క్రమక్రమంగా ఆ సంకెళ్ళను తెంచుకొని విశ్వంలోనికి అడుగుపెట్టి సమాజంలో స్త్రీపాత్ర యొక్క అవసరం, సమాజానికి స్త్రీల ప్రాముఖ్యతను తెలియజేస్తూనే ఉన్నారు. వంటగదికే పరిమితం అయిన స్త్రీ, నేడు ప్రపంచంలో అన్ని రంగాలలో పురుషుడితో సమానంగా రాణిస్తున్నారు. ఇది గొప్ప విషయం, స్త్రీలు గర్వించదగ్గ విషయం. వారికి ఆసరాగా ఉన్న పురుషులను మెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తాము చెప్పదలచుకున్న విషయాలకు పురాణపాత్రలను, కథలను కథావస్తువుగా తీసుకోవడాన్ని తెలుగు సాహిత్యంలో మొదలుపెట్టింది త్రిపురనేని రామస్వామిగారు. కాలం మారుతున్న కొలది కాలానుగుణంగా ప్రాచీనకాలంనుండి నేటివరకు చాలామంది పురాణ కథలను తిరగరాస్తూనే ఉన్నారు. అదేకోవలో పురాణ స్త్రీలను, వారి చరిత్రలను ఉదాహరణగా తీసుకొని చక్కని కథలుగా అల్లి ప్రతి మహిళను ఉత్తేజపరిచేవిధంగా వారి దృష్టికోణం మార్చేవిధంగా ఓల్గా విముక్త కథలు సాగాయి.

సీతారాముల మధ్య ఉన్న ప్రేమను యిప్పటిదాకా సమాజం చూసినదృష్టి వేరు, ఓల్గా దృష్టివేరు. స్త్రీ, పురుష సంబంధాలలో ప్రధానమైన సమస్య అధికారం. అధికారాన్ని అనుభవించడమూ, అధికారాన్ని వదులుకోవడమూ రెండూ సీత ఈ విముక్త కథలలో నేర్చుకుంది. అందువలన పితృస్వామ్యపు సంకెళ్ళని తెంచుకొని సీత విముక్త కాగలిగింది.

**మొదటికథ – సమాగమం**

'సమాగమం' అనేపేరుతో సీత, శూర్పణఖను కలవడం వీరిరువురూ స్నేహితులుగా మారడాన్ని ఈ కథలో రచయిత్రి చక్కగా వివరిస్తారు. ఈ విముక్త కథను చదివేవారికైన వినేవారికైన సీతలాంటి దేవతామూర్తి రాక్షస స్త్రీ అయినా శూర్పణఖతో స్నేహం చేయడమేమిటి? అనే ఆలోచన కలిగిస్తుంది. ఏ స్త్రీ అయినా పెళ్ళి తర్వాత భర్తే సర్వస్వం అనుకుంటుంది. తన భర్తను మరొక స్త్రీ దక్కించుకోవాలనుకుంటే సహించలేదు. అలాంటిది సీత ఎలా శూర్పణఖతో స్నేహం చేసిందనే ఆలోచన కలుగజేశారు రచయిత్రి. ఆ ఆలోచననే గొప్ప అనుభూతిని కథను చివరవరకు చదవాలనే ఉత్సుకతను కలిగిస్తుంది.

సీత, శూర్పణఖను కలవడమే కాక శూర్పణఖతో చెప్పిన మాటలు కేవలం సీతకు మాత్రమేకాక ప్రతి మహిళ మనసును తాకి ఆలోచింపజేసేవిధంగా ఉంటుంది. ఓల్గా శూర్పణఖ వ్యక్తిత్వాన్ని మలచిన విధానం వర్ణనాతీతం. రాముడివలన కురూపి అయిన శూర్పణఖ సమాజం నుండి ఎన్ని అవమానాలు ఎదుర్కుందో, ఎన్ని బాధలు పడాల్సివచ్చిందో, ఆ వేదన, బాధల నుండి మనో నిబ్బరంలో ఒక గొప్ప ఆలోచనలను ఆచరణలో పెట్టిన విధానాన్ని ఎంతో చక్కగా అందమైన పదజాలంతో శూర్పణఖతో పలికించారు రచయిత్రి.

తనని ప్రేమించమని అడిగినందుకు ముక్కు చెవులు కోయించి శూర్పణఖను కురూపిగా మార్చాడు రాముడు. నేడు తనని ప్రేమించనందుకు అమ్మాయిల మీద యాసిడ్ దాడులు, అత్యాచారాలులాంటి ఘోరమైన చర్యలకు పాల్పడుతున్నట్లు న్యూస్‌పేపర్లలోను, టి.వి. వార్తలలోను నిత్యం చూస్తూనే ఉన్నాం. రాముడికాలం నుండి నేటివరకు స్త్రీల చరిత్ర బాధితుల చరిత్రగానే మారింది. కురూపి అయిన శూర్పణఖ నేను నా అందాన్ని కోల్పోయానని ఓ మూలన కూర్చొని ఏడ్వకుండా అంతర్ సౌందర్యాన్ని పొందడం కొరకు తనతో తానే యుద్ధం చేయాల్సివచ్చింది. సౌందర్యాన్ని ప్రేమించడానికి రూప, అరూపాల అసలు సారాంశాన్ని కనుగొనటానికి 'నాతో నేను పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. ఆ యుద్ధంలో నాకు సహకరించింది. ఈ అనంత ప్రకృతి' అంటుంది. ఈ కథలో శూర్పణఖ, శరీర సౌందర్యం లేకపోవడం వల్ల శూర్పణఖకు ఒంటరితనం, ప్రేమరాహిత్యమే మిగులుతుందనుకుంటే వీటన్నింటిని ఎదుర్కొని నిలిచింది. ఇతరులను ప్రేమించడం, ఇతరులచేత ప్రేమించబడటం కాక, ప్రతి స్త్రీ తనను తాను ప్రేమించుకోవాలనే సూచనను ఈ కథ అందిస్తుంది. సౌందర్యవంతంగా లేకపోవడం అనేది శూర్పణఖ ఆత్మన్యూనతగా మారలేదు. ఆ న్యూనతా భావం నుండి బయటపడేందుకు పెద్దయుద్ధమే చేశానంటుంది. అది యుద్ధం కావచ్చు, సంఘర్షణ కావచ్చు, తపస్సు కావచ్చు. తనను తాను గుర్తించడం జరిగింది. నేడు సమాజంలోని స్త్రీలు తనకున్న అందాన్ని చూసో, ఆస్తి అంతస్తులను చూసుకొని, మంది బలగాన్ని చూసుకొని గర్వించకుండా ఇవేమి లేనపుడు ఎలా ఆత్మధైర్యంగా ఉండాలో ఈ కథ ద్వారా రచయిత చెప్పదలిచారు. శ్రీరాముడిని ప్రేమించిన స్త్రీలకు వేదన తప్పదా? ఒకే పురుషుడి కోసం తపించిన ఇద్దరు స్త్రీల మధ్య ఉండాల్సిన అసూయ, కోపం మచ్చుకైనా లేకపోగా సహబాధితుల మధ్య చిగురించే స్నేహం ఒక బంధాన్ని ఏర్పరిచాయి.

**'సీత, శూర్పణఖల మధ్య ఫెమినిస్ట్ సిస్టర్ హుడ్‌ని ప్రతిపాదించడం రచయిత చేసిన ఒక సాహసం.'**

**రెండవకథ మృణ్మయనాదం**

గౌతమ మహర్షి భార్య అయిన అహల్య అపురూపమైన సౌందర్యవతి. అందానికి తగిన సౌశీల్యంగలది. ఆనాటి నుండే అందమైన స్త్రీలను భోగవస్తువులనుకుంటారు కొందరు పురుషులు. ఇంద్రుడు కూడా అలా తలచి అహల్యమీద కోరిక కలిగి గౌతముడు లేని సమయాన, గౌతముడిలా వేషం ధరించి అతని కోరిక తీర్చుకుంటాడు. అదే సమయంలో గౌతముడు రావడంతో అసలు విషయం బయటపడుతుంది. గౌతమ మహర్షి అహల్యను పరిత్యజిస్తాడు. అహల్య జరిగింది తెలుసుకుని చలనంలేని

శిలై ఇల్లూ వాకిలి లేకుండా, ఎండా, వాన, చలి తేడా తెలియకుండా అడవిలో ఎవ్వరికి కనబడకుండా ఉంటుంది. ఇది మనకి తెలిసిన కథ.

రచయిత విముక్త కథలలో రెండవ కథైన మృణ్మయనాదంలో నిండుగర్భవతైన సీత వాల్మీకి ఆశ్రమానికి చేరుకున్నప్పుడు అక్కడ అహల్యను కలుస్తుంది. సీత అహల్యను కలిసి మనసువిప్పి మాట్లాడినప్పుడు అహల్య మనోగతం తెలుస్తుంది. 'ఇంద్రుడు నన్ను వాంఛించాడు'. స్త్రీలను పురుషుల భోగవస్తువని కొందరు అనుకున్నట్లే అతను అనుకున్నాడు. 'నేను అతనికి లోబడనని చీకట్లో నా భర్త వేషంలో వచ్చాడు. అతను నా భర్తకాదని నేను గుర్తించానా లేదా? అనే ప్రశ్న లోకంలో అనేకమందిని వేధించే ప్రశ్న! నా భర్తకు మాత్రం ఆ తేడా లేదు. నాకు తెలిసినా తెలియకపోయినా ఆయనకొకటే' ఈ మాటలు అహల్యవి. స్త్రీని పురుషుడు తన సొంత ఆస్తిగా లేక వస్తువుగా భావించి ఆమెపై అధికారాన్ని, ఆధిపత్యాన్ని కలిగి ఉంటున్న దృక్పథంతో నివేదిస్తుంది అహల్య. మారువేషంలో వచ్చిన ఇంద్రుడికి, అతని వాంఛకు కాని దోషమంటలేదు. ఇంద్రుడికి అంటనిదోషం అహల్య వెంటవచ్చింది.

సమాజంలో కూడా స్త్రీ ఒక తప్పు చేసిందంటే ఆ తప్పుని ఆమె దాదాపు జీవితకాలం ఆ భారాన్ని మోయాల్సిందే. ఆమె స్వేచ్ఛకి, హక్కులకి, కోరికలకి, అధికారాలకి దూరంగా బ్రతకాల్సిందే. అలాకాదని ఆమె వాటిని ఆభరణాలుగా ధరిస్తే సమాజం నుండి, నేటి వ్యవస్థ నుండి అనేక సవాళ్ళు ఎదురవుతాయి. వాటిని ఎదుర్కొని ముందుకు సాగితే తమపై సమస్త అధికారాలు తమకే ఉండాలని ఆకాంక్షించే స్త్రీలకు బలమైన ప్రతినిధులుగా ఈ విముక్త కథలలోని సీత, శూర్పణఖ, అహల్యతోపాటు కథతో నడిస్తే మరో రెండు పాత్రలూ వారి అనుభవాలతో నిలబడతాయి. ఈ పాత్రలన్నింటికి దృక్పథ బలమే సీతకు చేకూరిన బలం. 'ఇతరుల అధికారానికి లొంగకుండా జీవించటం అంటే సమానత్వాన్ని కోరటం కాదు, పొందడం. సీతా అహల్యని అడిగిన ప్రశ్న నీమీద అధికారం నీ భర్తైన గౌతమమహర్షికి కూడా లేదా? మూడుముళ్ళబంధంతో లోకం ఆయనకు అధికారాన్ని ఇచ్చింది తప్పా నేను ఇవ్వలేదు. **'నేను ఇవ్వనంతవరకు నామీద అధికారం పొందలేరు'** ఈ కథల యొక్క సారం సారాంశం ఇదే. ఓల్గా అహల్యపాత్ర ద్వారా చెప్పించిన ఈ వాక్యం నేటి సమాజంలో స్త్రీ, పురుషులకు అన్వయింపుగా తీసుకుంటే నేనివ్వనంత వరకూ ఎవరూ నామీద అధికారాన్ని పొందలేరు. స్త్రీలు కాని పురుషులు కాని వారి మీద అధికారాన్ని ఇవ్వనంతవరకూ వారి శరీరం మీదకానీ మరే ఇతర విషయాల మీదకానీ ఎవ్వరు అధికారాన్ని పొందలేరు.

మృణ్మయనాదం కథలో రచయిత అహల్యను సీతకు మాత్రమేకాక మనందరికీ కనువిప్పు కలిగించే గురుమూర్తిగా ఆదర్శప్రాయంగా ఆవిర్భవింపజేశారు. సమాజంలో ఏది సత్యం, ఏది అసత్యం అన్న విషయాన్ని అహల్యతో చాలా తేలిగ్గా వివరణ ఇప్పించారు. **'సత్యం అంటే ఏమిటి అనే ప్రశ్నకు ఎవరికీ ఏ జవాబు అయితే శాంతినిస్తుందో అదే సత్యం'** అనే సమాధానం చెప్పించిన విధానం మనసుకి ఆదరణ కలిగించేవిధంగా ఎంతో అద్భుతంగా తెలియచెప్పారు. అంతేకాక స్త్రీ ఎవరికో కూతురిగా, భార్యగా, తల్లిగా మాత్రమేకాక తను తానుగానే బ్రతకాలి అని చెప్పడంలో స్త్రీ సాధికారతను ఎంత బలంగా వక్కాణించారో అర్థం చేసుకోవచ్చు. సత్యం అంటే ఏమిటో తెలుసుకున్నప్పుడు మనం మనకోసం బ్రతికినప్పుడు ఎటువంటి ఆటంకాలనైనా సునాయాసంగా దాటవచ్చు. ఎవరైనా సరే స్వతంత్రంగా తమ ఆలోచనలకు తగ్గట్టుగా ఎవరి కట్టుబాట్లకు లొంగకుండా బ్రతకాలి అని అహల్య పాత్ర ద్వారా చెప్పించి సమస్త మానవలోకానికి అహల్యని ఒక మంచి స్నేహితురాలుగా చేశారు.

**మూడోకథ సైకత కుంభం**

రామాయణంలో రేణుకభర్త అయిన జమదగ్ని తపస్సుకి భంగం కలిగించిందని జమదగ్ని ఆజ్ఞమేరకు కుమారుడైన పరశురాముడిచే తల ఖండించబడుతుంది. సగం తెగిన శిరస్సుతో చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ ఎంతో మానసిక వేదనకు గురైన రేణుక కథ. స్త్రీవాద సాహిత్యంలో సావిత్రి బందిపోట్లు అనే కవిత చివరిలో...

**'పెళ్ళంటే పెద్దశిక్ష అని**
**మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని**
**మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే**
**మమ్మల్ని విభజించి పాలిస్తోందని'** ఇలా సూటిగా మనసుకి గుచ్చుకునేలా, అల్పాక్షరాలలో అనల్పార్థాలు వచ్చేలా రచనచేశారు. ఈ కవితను రేణుక కథకు అన్వయింపుగా తీసుకుంటే భర్తల సందేహ అనుమానాలకు గురైన మరుక్షణమే నైతిక సంక్షోభంలో పడవలసి వస్తుంది స్త్రీ. ఈ సంక్షోభం స్త్రీలకు తీవ్ర మానసిక సంఘర్షణకు ఆత్మవేదనను మిగులుస్తుంది. ఆత్మబలాన్ని దెబ్బతీస్తుంది. కనీస స్వేచ్ఛను కోల్పోయి వారి పాలనలోనే జీవిస్తుంది.

సైకత కుంభం కథలో సీతను రాముడు పరిత్యజించగా వాల్మీకి ఆశ్రమానికి చేరుకున్న సీత వాల్మీకి సహాయంతో రేణుకను కలిసినప్పుడు రేణుక ఆమె గాథను వివరిస్తుంది. ఈ కుండ చేయడానికి ఎంతో ఏకాగ్రత కావాలి, నా ఏకాగ్రత గురించి తెలియని వాళ్ళంతా నా పాతివ్రత్యంతో ఇసుకకుండను తయారుచేస్తున్నది అనుకున్నారు. నా పాతివ్రత్యానికి ఏమీ లోపం లేదు కనుక అనుకోమని నేనే ఊరుకున్నాను, ఏకాగ్రత ఎప్పుడైనా భగ్నం కావచ్చు. కారణం ఏదైనా కావచ్చు. నా విషయంలోను ఒక పురుషుడు కారణమయ్యాడు. ఒక పురుషుని చూసినంత మాత్రాన నా పాతివ్రత్యం భంగపడిందని నా భర్త గ్రహించాడు. అతని ఆగ్రహం నన్ను చంపమని కుమారుడికి ఆదేశమివ్వగా నా కుమారుడిచే నా తల ఖండించబడిందని జరిగిన దానిని సీతకు రేణుక వివరించింది. ఒకవేటుతో అటు పాతివ్రత్యం ఇటు మాతృత్వం రెండూ పరాభవించబడ్డాయి. భర్తకు కుమారుడికి మానసికంగా దూరమైంది రేణుక. అనుభవం ద్వారా గ్రహించిన సత్యాన్ని సీతకు చెప్తుంది. భర్తతప్ప వేరే ప్రపంచం లేదనుకుంటారు స్త్రీలు. నిజమే, కానీ ఏదో ఒకరోజు భర్త తన ప్రపంచంలో నీకు చోటులేదంటే అప్పుడు స్త్రీలకు ఏ ఆధారం ఉంటుంది. ప్రత్యేకంగా పుత్రులకు జన్మనివ్వడం, భర్త వంశాన్ని అభివృద్ధి చేయడమే జీవితగమ్యం అనుకుంటారు స్త్రీలు. ఆ పుత్రుడు పురుషుల వంశాంకుడేనని ఆ తల్లి గ్రహించేలోపు తల్లిచేయి వదిలి తండ్రి ఆధీనంలోకి వెళ్తారు లేదా వారే ఆమెకు శాసనకర్తలుగా పాలకులుగా మారుతారు.

రేణుక అందరి సత్యం ఒక్కటే కాదని వారివారి జీవితానుభవం పెరుగుతున్న కొద్ది సత్యం మారుతూ వస్తుందని రచయిత ఈ కథ ద్వారా సీతతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరికి తెలియజేశారు. ఏ స్త్రీలకైనా పాతివ్రత్యం, మాతృత్వం, ఏకాగ్రత ఈ మూడింటిలో ఏచిన్న లోపమున్నా సమాజం నుండి గాని, కుటుంబం నుండి గాని అనుమానాలను, అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రేణుకదేవి పాత్ర ద్వారా తెలియపరిచారు రచయిత్రి. 'బంధాలు, బంధుత్వాలు మనం ఏర్పరచుకున్నవే, వాటికన్నా ఈ ప్రకృతిని ప్రేమించడం, పూజించడం మన అందరి కర్తవ్యం, బాధ్యత అని, ప్రకృతి మన గురువని రేణుకాదేవితో పలికించారు ఓల్గా. ఇదే అక్షర సత్యం.'

**నాలుగవ కథ – విముక్త**

రామాయణంలో అరణ్యవాసానికి రాముడితో సీత, లక్ష్మణులు వెళ్తారు. లక్ష్మణుని భార్య అయిన ఊర్మిళ పదునాలుగు సంవత్సరాలు తన భర్తకుదూరమై తానుపడిన బాధ, వేదన, ఆగ్రహం, ఒంటరితనం వీటన్నింటిని అధిగమించి తాను పొందిన తపశ్శక్తి, దానిద్వారా కనుగొన్న సత్యాలను విముక్త కథలో ఎంతో చక్కగా వివరించారు రచయిత్రి.

అరణ్యవాసాన్ని పూర్తిచేసుకొని వచ్చిన సీతతో ఊర్మిళ పలికిన మాటలు. 'నా చుట్టూ ఉన్నవారితో నాకున్న సంబంధంలోని అధికారాన్ని గుర్తించినపుడు సమస్తం తెలిసిన భావం కలిగింది. సర్వదు:ఖాలకు మూలం అధికారమే అక్కా, ఇంకొక చిత్రం తెలుసా? ఈ అధికారాన్ని మనం పొందాలి. వదులుకోవాలి. నేను ఎవరి అధికారానికి లొంగను. నా అధికారంతో ఎవరినీ బంధించను. అప్పుడు నన్ను నేను విముక్తం చేసుకున్న భావన. నాలో ఇక ఒకే ఆనందం' అంటుంది ఊర్మిళ. సీత కంటే వయస్సులో చిన్నదైనా ఆమె తెలుసుకున్న సత్యాలు, భర్తను వదిలి పద్నాలుగు సంవత్సరాలు ఆమె, ఆమెతో చేసిన యుద్ధాన్ని

తపస్సుగా మార్చుకున్న తీరు ఏ బంధాలకి బానిస కాకుండా, ఏ బంధాన్ని బానిస చేయకుండా భర్తకు దూరమైన ఆమె నిద్రపోలేదు. నిత్య జాగృదావస్థలో ఉండి తనని తాను వెతుక్కుంది.

అధికారాన్ని తీసుకో, అధికారాన్ని వదులుకో అప్పుడు నీకు నువ్వు దక్కుతావు. నీకు నువ్వు చెందుతావు. మనతో మనమే యుద్ధం చేయాలి. మనకు ఏది ప్రశాంతతను ఇస్తుందో అదే అంగీకరించాలి, స్వీకరించాలి. ఏ బంధమైనా, వస్తువైనా నాది అనుకుంటే దూరమైన ప్రతిసారి భరించలేని బాధ, వేదన నిరీక్షణ తప్పదు కానీ, నాకు నేనే నాలో నేనే అనుకుంటే ఎవరు ఉన్నా లేకున్నా, ఏది ఉన్నా లేకున్నా మనసుకి ఎంతో ప్రశాంతత కలుగుతుంది. ఈ మనోనిబ్బరం ప్రత్యేకంగా స్త్రీలు పొందలేకపోవడానికి కారణం. భార్యా, భర్త సంబంధాల్లోని అధికార, అనధికారాలే.

ఊర్మిళ సీతతో చెప్పిన మాటల ఆంతర్యం తరువాత అర్థమయింది సీతకు. ఆ అనుభవం ఒక ఆలోచనగా మారింది. అది ప్రశ్నగా మొలకెత్తుతుంది. రాముడినుండి తనకు ఎప్పుడు విముక్తి దొరుకుతుంది? అన్న ప్రశ్నకు సమాధానం రాముడి దగ్గరలేదు. అది సీతదగ్గరే ఉందని గ్రహించగల చైతన్యమే తన విముక్తికి దారి. రాముడు తన పిల్లలను స్వీకరించాక తన నిర్దోషత్వాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం లేకుండాపోయింది సీతకి. శాంతిస్మిత వదనంతో ఎంతో తపస్సు చేస్తే తప్ప అంతటి నిగ్రహం, మనోధైర్యం రాదు. ఊర్మిళ మాటలతో సీత వాటిని సాధించగలిగినట్టుగా ఓల్గా ఎంతో చక్కగా వివరించారు. రచయిత ఊర్మిలచేత చెప్పించిన మాటలు పాఠకులకు శక్తి వస్తుంది. ఆత్మధైర్యం పెరుగుతుంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని ఎదుర్కోగల శక్తి, మనోధైర్యం, నిబ్బరం లభిస్తుంది. ఇంతకంటే మరేమి కావాలి నేటి మహిళకి.

రామాయణంలోని స్త్రీ పాత్రలకు జీవంపోసి నేటిసమాజంలో స్త్రీల వేదనకు ప్రాతినిధ్యం వహించిన కథలు ఈ విముక్త కథలు. ఇవాల్టి సమాజంలో అనేక ఆంక్షలు, అవమానాలకు, హింసలకు గురై వాటినధిగమించి లేస్తున్న స్త్రీలు కొందరైతే వాటిలోనే కూరుకుపోయి వాటిని దాటలేక, దాటాలని తెలియక నానాయాతన పడుతున్న స్త్రీలెందరో. తమను హింసించే భర్తలనుండి విముక్తం కావాలనే స్పృహ లేకుండా వారిని ద్వేషిస్తూనే, అసహ్యించుకుంటూనే వారిని గట్టిగా పట్టుకునే స్త్రీలు కొందరు. అలాంటి వారి కొరకు ఈ విముక్త కథలు ఓ దారిని చూపిస్తాయి. గమ్యాన్ని చేరుస్తాయి. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందిన ఈ కథల పుస్తకం మహిళా లోకానికే కాక సమస్త ప్రజానీకానికి దిశా నిర్దేశం చేసిన, చేస్తున్న కథలు.

**ఆధారగ్రంథాలు**

1. స్త్రీవాద తాత్వికత – ఓల్గా సాహిత్యం
2. ఓల్గా నుంచి గంగకు
3. స్త్రీ – చలం
4. స్త్రీల సమస్యలు – పరిచయం
5. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి

# విముక్త కథలు - స్త్రీ సాధికారత

డా. కర్రి శ్యామలాదేవి, తెలుగు అధ్యాపకురాలు,
అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల (స్వ), కాకినాడ

తెలుగుసాహిత్యంలో 2015వ సంవత్సరానికి గానూ కేంద్ర సాహిత్య పురస్కారాన్ని గెలుచుకున్న కథల సంపుటి విముక్త. ఓల్గా కలంపేరు కలిగిన పోపూరి లలితకుమారి స్త్రీవాద దృక్పథంతో రచనలు చేస్తూ, స్త్రీవాద రచయిత్రిగా ఖ్యాతి పొందారు. వీరి కలం నుండి జాలువారిన విముక్తి కథలు కన్నడం, తమిళం, నేపాలీ, ఒరియా, హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదమయ్యాయి. తమిళ భాషలో అనువదించిన గౌరీ కృపానందన్‌కీ 2015 లోనే అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం విశేషం.

ఆధునిక సాహిత్య యుగంలో ప్రాచీన సాహిత్యాన్ని ముఖ్యంగా పురాణేతిహాసాలను పాశ్చాత్య సిద్ధాంతాల దృక్పథంతో విశ్లేషిస్తూ పునర్లిఖించడం మొదలైంది. త్రిపురనేని, చలం, నార్ల వేంకటేశ్వరరావు పలువురు రామాయణ, మహా భారతాలను హేతువాద దృష్టితో వ్యాఖ్యానించారు. ఓల్గా రామాయణ కావ్యంలోని ప్రసిద్ధ స్త్రీ పాత్రలను స్త్రీవాద దృక్పథంలో రచించిన కథలు విముక్త. స్త్రీ అస్తిత్వ చైతన్యమే లక్ష్యంగా, స్త్రీ సాధికారతే ధ్యేయంగా రచింపబడిన ఈ కథలు సమాజంలో తరతరాలుగా జీర్ణించుకుపోయిన, జీర్ణించుకుపోయేలా చేసిన వ్యవస్థా ధర్మాల విలువలను ప్రశ్నిస్తూ, ఆధిపత్యపు ధోరణిలో దాగివున్న స్వార్థపూరిత ఆలోచనలను నిలదీస్తూ ఆవిష్కరింపబడినవి. ముఖ్యంగా పురుష స్వామ్య వ్యవస్థ స్త్రీల చుట్టూ సృష్టించిన పాతివ్రత్యం, మాతృత్వం వంటి సంకుచిత భావాల శృంఖలాలను గుర్తించి, వాటి నుంచి విముక్తి పొందాలనే చైతన్యాన్ని, తమ ఉనికిని తాము తెలుసుకుని, తమపై తమకు గల అధికారాన్ని పొందాలనే దిశానిర్దేశం చేస్తాయి.

రామాయణంలో ప్రధానపాత్ర సీత. భార్యగా రాముడిని ఎంతో ప్రేమించి, రామునితో ఎంతో ప్రేమించబడి క్షత్రియ ధర్మం పేరిట రామునితో అనుమానింపబడి, అవమానింపబడి పరిత్యజించబడుతుంది. రామ సాన్నిహిత్యం కోసం వనవాసం చేసిన సీత, రాముని కోసం శీల పరీక్షకు తలొగ్గిన సీత, రాముని మాటతో అడవులు చేరిన సీత, భర్త ప్రేమకోసం అనుక్షణం పరితపించిన సీత చివరకు రాముడినే వదులుకునే స్థాయికి తన చిత్తాన్ని, వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం విముక్త కథల సారాంశం.

రామాయణంలోని సీత ప్రధాన సూత్రధారిగా, సీత దృక్పథంలోంచి వెలువడిన విముక్త కథల సంపుటిలో సమాగమం, మృణ్మయనాదం, సైకత కుంభం, విముక్త, బంధితుడు అనే ఐదు కథలున్నాయి. రామాయణ ఇతివృత్తం కనుక కథాగమనాన్ని ప్రత్యేకంగా వివరించవలసిన అవసరం లేదు. కానీ కథల్లోని సంఘటనలు మాత్రం రచయిత్రి సృజనాత్మక భావనల్లోంచి అంకురించినవి.

రామాయణంలోని ఇతర స్త్రీ పాత్రలైన శూర్పణఖ, అహల్య, రేణుకాదేవి, ఊర్మిళ లోకంచే, తమ కుటుంబం చే, భర్తలచే తాము పొందిన అవమానాలు, అనుభవాలను పంచుకున్నప్పుడు సీతలో మొదలైన అంతస్సంఘర్షణ, చేసుకున్న ఆత్మపరిశీలనే పరిణతి గల మనస్సుతో తనను తాను తీర్చిదిద్దుకునేలా చేసి, తనపై తనకు గల అధికారాన్ని గుర్తించి సాధికారతను సాధించేలా చేసింది.

**<u>సమాగమం :</u> సీత, శూర్పణఖల కలయిక సమాగమం కథ**

"రామ లక్ష్మణుల క్రూరమైన పరిహాసానికి పాపం కురూపియైపోయింది... శూర్పణఖను అవమానిస్తే రావణుడు తననపహరించి రాముడి మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు.

పురుషుల పగలూ ప్రతీకారాలూ తీర్చుకోవడానికేనా స్త్రీలుంది?... అదంతా రాజకీయం...” కథలో శూర్పణఖను తలుచుకున్నప్పుడు రచయిత్రి సీతలో పలికించిన భావాల ద్వారా పురుషులు, తమ స్వార్థం కోసం ఏవిధంగా స్త్రీలను బలిచేస్తారో అర్థం చేసుకోవడం తెలుస్తుంది. రామరావణులు కేవలం తమ రాజకీయ లబ్ధికోసం, పురుషాహంకార తృప్తికోసం తమను శారీరకంగా, మానసికంగా హింసించి తమ తమ పరాక్రమాలను నిరూపించుకున్నారని గ్రహిస్తుంది.

రామునివల్ల నిరాకరింపబడి, హింసించబడి కురూపిగా మారిన శూర్పణఖకు ఒంటరితనం, ప్రేమరాహిత్యమే మిగులుతుందని భావించిన సీతకు జీవితాన్ని ఎదిరించి నిలబడిందని, అందానికి అర్థం తెలుసుకొని ఆనందంగా జీవిస్తుందని తను చేసిన యుద్ధము, తనకు తానే గురువైన వైనాన్ని శూర్పణఖ మాటలు ద్వారా విన్న సీత మదిలో సంఘర్షణ మొదలైంది.

శూర్పణఖ సీతను శ్రీరాముని భార్యగా గుర్తించనపుడు ‘నేను సీతను, జనకుని కుమార్తెను, జానకిని, భూపుత్రిని’ అని ఆత్మాభిమానంతో పలికినా, రామునిచే పరిత్యజించబడ్డాననే దు:ఖంతో విలపిస్తుంది. పురుష సాహచర్యంతోనే స్త్రీ జీవితం సంపూర్ణం కాదనే విషయాన్ని శూర్పణఖ జీవితం ద్వారా గమనించిన సీత రాముడిని ప్రేమించడం, రాముని చేత ప్రేమించబడడంలోనే తన సంపూర్ణం లేదని తెలుసుకుంటుంది. ‘నా బిడ్డలు నన్నొదిలి నగరానికి వెళ్ళాక భూపుత్రిక నవుతాను’ అని ఆత్మవిశ్వాసంతో పలకడం సీతలో మొదలైన చైతన్యానికి నిదర్శనం.

**<u>మృణ్మయనాదం</u> : అహల్యకు సంబంధించిన కథ మృణ్మయనాదం**

‘అందమైన స్త్రీలను భోగవస్తువులనుకుంటారు గదా పురుషులు...’ అని అహల్య సీతతో పలికిన మాటలు పురుషులకు స్త్రీలయందు కలిగివుండే వస్తుభావ దృష్టిని తెలుపుతుంది. గౌతముని భార్యయైన అహల్యను చీకటిలో ఆమె భర్త వేషంలో వెళ్ళి లోబరచుకుంటాడు ఇంద్రుడు. వచ్చినవాడు తన భర్తకాదని అహల్య గుర్తించిందా? లేదా? అనే విషయంతో గౌతమునికి పనిలేదు. తాత్కాలికంగానైనా తన వస్తువు పరహస్తగతమై అపవిత్రమై పోయిందనే గౌతముని వస్తుభావ జాలాన్ని నిలదీస్తూ ఎవరి సత్యం వారిదని, సత్యాసత్యాలు నిర్ణయించగల శక్తి ఈ ప్రపంచంలో ఎవరికీ లేదని నిర్ధారిస్తుంది.

పురుషాధికారానికి లోబడి ప్రవర్తించినంతకాలం ఏంచేసినా ప్రాయశ్చిత్తం, పరిష్కారాలుంటాయి. కానీ అధికారాన్ని ప్రశ్నిస్తే, మూలాలను నిలదీస్తే ఎదురయ్యే వ్యతిరేకతను తేటతెల్లం చేస్తుంది అహల్య. అందుకే నాలా మాట్లాడేవాళ్ళని లేదా ప్రశ్నించేవాళ్ళని భరించడం కష్టమని అంటుంది. సీత గౌతముడు ఆమెను పరిత్యజించారన్నపుడు ‘పాపం నన్ను పోగొట్టుకున్నాడు’ అని ధైర్యంగా, స్థిరంగా అనగలిగింది.

‘ఎన్నడూ విచారణకు అంగీకరించకు... అధికారానికి లొంగకు’ అని అహల్య సీతతో చెప్పిన మాటలకర్థం ఆ క్షణంలో తెలియకపోయినా, రావణ సంహారానంతరం సీతను శీల నిరూపణ కోసం అగ్ని పరీక్ష చేసుకోమన్నప్పుడు తనపై తనకు గల అధికారం లోకం చెప్పే నీతి సూత్రాలు, ధర్మ శాస్త్రాలకు లోబడి పోవడాన్ని తెలుసుకుంటుంది సీత. రాముని భార్యగా శీలపరీక్షకు తలొగ్గిన వేదనలోంచి తేరుకొనేలోగా లోకనిందచే పరిత్యజించబడుతుంది. భార్యల విషయంలో మగవాళ్ళందరూ ఒకటేనన్న అహల్య మాటల ఆంతర్యాన్ని గ్రహించి దుఃఖిస్తుంది.

రాముని కోసం కాక తనకోసం తాను నిర్ణయాలు తీసుకునే వరకూ తాను పొందుతున్న దుఃఖం వెంటాడుతూ ఉంటుందనే విషయం అహల్య ద్వారా తెలుసుకున్న సీత పాతివ్రత్యం, మాతృత్వమే స్త్రీల జీవితగమ్యం కాదనే సారాన్ని అవగతం చేసుకుంటుంది.

రాముడు పుత్రులను వారసులుగా గ్రహించి అయోధ్యకు రమ్మన్నప్పుడు చిరునవ్వుతో తిరస్కరించగలిగింది. ‘నీ పిల్లలను వదిలి నువ్వుండగలవా సీతా’ అన్న రాముని ప్రశ్నకు తన దృష్టిలో పిల్లలు ‘విశ్వంలోని అనంత ప్రాణశక్తికి ప్రతీకలని, వారు విశ్వానికంతటికీ చెందినవారని’ చెప్పి, మీరు కేవలం అయోధ్యకూ, సూర్యవంశానికీ మాత్రమే చెందిన వారిగా భావిస్తే మీ నమ్మకం ప్రకారం మీరు నడుచుకొమ్మని చెప్తుంది. తనను తాను తెలుసుకున్న సీత విశ్వంలో తనకు లేనిదంటూ ఏమీలేదని, తాను భూపుత్రిని అంటూ సగర్వంగా చెప్పడం సీతలోని సాధికార శక్తికి నిదర్శనం.

సైకతకుంభం : రేణుకాదేవికి సంబంధించిన కథ సైకితకుంభం

'భర్తల గురించి, కుమారుల గురించి నాకు తెలిసినట్లు మరెవరికీ తెలియదు' అని రేణుక సీతతో తన జీవితంలో పాతివ్రత్యం, మాతృత్వం మిగిల్చిన దుఃఖాన్ని చెప్పి, ప్రతి స్త్రీ తన పాతివ్రత్యం సైకతకుంభం వంటిదేనని తెలుసుకుంటే నిశ్చింతగా బ్రతకవచ్చని చెప్పడం, పురుషస్వామ్య వ్యవస్థ నిర్మిత పాతివ్రత్య భావనల్లోని డొల్లతనాన్ని వివరిస్తుంది.

మృత్యువు దాకా వెళ్ళిన రేణుకకు భర్త సంతానం, సైకితకుంభ విద్య దర్శనమిచ్చాయని, అల్పకారణాలతో ఛిన్నాభిన్నమయ్యే ఈ మూడు జీవితాన్ని కత్తి అంచున వేలాడదీసినపుడు, భర్త కుమారులు అనే బంధాలు స్త్రీలకు అవసరమా? అనే ప్రశ్నతో, అవసరం లేదనే తీర్మానంతో అందరికీ దూరంగా బతుకుతున్నానని సీతతో చెప్పడం వెనుక స్త్రీలకు భర్త, మాతృత్వం కంటే వేరే ప్రపంచం ఉందనే అంశాన్ని ప్రతిపాదిస్తుంది. భర్త ప్రేమలోనూ, పిల్లపై ప్రేమలోనూ తనకు లేని అధికారాన్ని గుర్తించి, రెంటినీ నిర్మమకారంగా వదులుకోగల మానసిక స్థితిని పెంపొందించుకోగలిగింది.

పురుష ప్రపంచం సృష్టించిన నీతి నియమాల చట్టాల కింద నలిగిన స్త్రీలలో తాను మొదలు కాదు, చివరా కాదనే సత్యాన్ని తెలిసి తానొంటరి కాదనే చైతన్యాన్ని పొందింది సీత. లవకుశలను వారసులుగా స్వీకరించిన రాముడు సభలో అందరిముందూ సత్యం పలకమని చెప్పాడని చెప్పిన వాల్మీకితో 'నాకంత అవసరం ఉందంటారా? ఆ ప్రయాసకు అర్థముందంటారా? అనేంతగా... స్థిర, స్థిత అంతరంగాన్ని నిర్మించుకుంది సీత.

**విముక్త :** 'నీమీద అధికారాన్ని నువ్వే తీసుకో, ఇతరులపై అధికారాన్ని వదులుకో, అప్పుడు నీకు నువ్వు చెందుతావు, నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలటమంటే మాటలు కాదక్కా-? ఊర్మిళ సీతతో చెప్పిన మాటలు పద్నాలుగేళ్ళ ఏకాంతవాసంలో ఊర్మిళ సాధించిన సాధికారతకు చిహ్నం.

లక్ష్మణుడు శ్రీరామునితో వనవాసానికి వెళ్ళాలనే నిర్ణయాన్ని ఊర్మిళ ప్రమేయం లేకుండానే తీసుకున్నప్పుడు, ఆమె తనలో కలిగిన కోపాన్ని అన్వేషణగా మార్చుకొని తనపై తనకు గల అధికారాన్ని తెలుసుకుంటుంది. సర్వ దుఃఖాలకూ అధికారమే మూలమని, ఎవరి అధికారాన్ని వారే పొందాలని, అందుకోవాలనీ, ఎవరి అధికారానికి లొంగక, అధికారంతో ఎవరిని బాధించక తననుంచి తాను విముక్తం పొందడం ద్వారా లభించే ఆనందం, శాంతి అందరికీ అర్థంకాకే అధికార ఛత్రంలోపడి దుఃఖంతో కుళ్ళిపోతున్నారని చెప్పడం సీతలో నివురుగప్పిన నిప్పల్లే దాగివున్న అశాంతి వెనుక గల కారణాన్ని పరిశీలించుకోవలసిన స్థితిని కల్పించింది.

రాముడు అశ్వమేథయాగం చేస్తున్నాడని తెలిసిన క్షణం నుండి తన స్థానంలో ఎవరుంటారనే ప్రశ్నతో రగిలిపోతున్న సీతలో ఊర్మిళ అనవసర ప్రశ్నలతో తనను తాను హింసించుకోవద్దని, రాముని నుండి విముక్తం పొంది నీవనే యథార్థాన్ని తెలుసుకోమంటుంది. రాముడు లవకుశలను స్వీకరించి తన నిర్దోషత్వాన్ని సభలో ప్రకటించుకోమన్నాడని వాల్మీకి చెప్పినపుడు అంతవసరం ఉందంటారా నాకు అంటూ పిల్లల నుండి కూడా విముక్తురాలై తనకు తానే యథార్థమనే సత్యాన్ని తెలుసుకుంది సీత.

ఈ విధంగా విముక్త కథల్లోని ప్రధాన పాత్రలైన సీత, శూర్పణఖ అహల్య, రేణుక, ఊర్మిళ అందరూ పురుష ప్రపంచం సృష్టించిన అధికార, ఆధిపత్య చట్రాలకింద నలిగి అవమానాలు, తిరస్కారాలకు గురై దుఃఖించినవారే. కానీ ఆ దుఃఖంలోంచే తమ అస్తిత్వాలను గుర్తించి, సాధికారతను సాధించారని చెప్పిన రచయిత్రి కల్పనాశక్తి అద్భుతం.

ఓల్గా కథల్లోని ఇతివృత్తం రామాయణంలోనిదే అయినా ఆధునిక యుగంలోనూ స్త్రీల పరిస్థితి అదే స్థితిలో ఉండడాన్ని తెలియపరుస్తూ, మార్పురాని పితృస్వామ్య వ్యవస్థ భావనలను ప్రశ్నించాయి. చైతన్యాల మూలమైన ప్రకృతిలో అంతర్భాగమైన స్త్రీలు జడత్వ భావనలతో స్థిరీకరణం చెందకుండా అంతశ్శక్తిని గుర్తించి చైతన్య పథంలోకి సాగాలని ప్రేరేపించాయి.

**ఆధార గ్రంథాలు**

1. విముక్త కథలు - ఓల్గా
2. నీలి మేఘాలు - అస్మిత ప్రచురణ
3. స్త్రీవాద వివాదాలు - ఎస్.వి. సత్యనారాయణ

# గాలిరంగు కవితా సంపుటి సామాజిక విశ్లేషణ

**నోసిన వెంకటేశ్వర్లు,** పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము, గుంటూరు, ఆంధ్రప్రదేశ్

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవులలో ఒకరిగా షేక్ ఖాజా హుస్సేన్‌ని చెప్పవచ్చును. ఈ కవి పేరు ఎప్పుడూ తెలుగు సాహిత్యంలో వినలేదే అని చాలా మంది అనుకుంటుంటారు. అయితే తమ అసలు పేర్లకంటే కలం పేర్లతోనే ప్రసిద్ధి చెందిన కవులు ఎంతోమంది తెలుగు సాహిత్యంలో ఉన్నారు. అలాంటి వారిలో ఈ దేవీప్రియ ఒకరు. దేవీప్రియ అనేది ఖాజాహుస్సేన్ కలం పేరు. అయితే ఆయన తెలుగు సాహితీ అభిమానులకు మాత్రం దేవీప్రియగానే సుపరిచితం.

దేవీప్రియ 1949 ఆగష్టు 15న గుంటూరులో షేక్ హుస్సేన్ సాహెబ్, షేక్ ఇమాంబీ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు షేక్ ఖాజా హుస్సేన్. గుంటూరులోని ఆంధ్రక్రైస్తవ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. కాలేజీ రోజుల్లోనే కవితలు, పద్యాలు రాయడం ప్రారంభించాడు.

తెలుగు సాహిత్యంలో దిగంబర కవుల ప్రభావంతో " పైగంబర కవులు " అనే పేరుతో ఐదుమంది కవులు "యుగచైతన్యం" అనే పేరుతో రెండు కవితా సంకలనాలు ముద్రించారు.

**పైగంబర కవులు**

1) సుగమ్ బాబు, 2) కిరణ్ బాబు, 3) దేవీప్రియ, 4) కమలాకాంత్, 5) ఓల్గా

చెడిపోయిన సమాజాన్ని బాగు చేయాలన్న ఆలోచనలతో **"పైగంబర కవులు"** అనే పేరుతో ఈ ఐదుగురు కవులు తెలుగు సాహిత్యంలోనికి బయలుదేరారు. దురదృష్టవశాత్తు పైగంబర కవుల కవిత్వం పాఠకుల హృదయాలను రంజింప జేయలేక కాలక్రమంలో కాలగర్భంలో కలిసిపోయారు.

పైగంబర కవులలో ఒకడిగా చెప్పుకుంటున్న దేవీప్రియ పాత్రికేయుడిగా, అనేక పత్రికలలో పని చేశారు. పాత్రికేయుడిగా దేవీప్రియ రాజకీయ వ్యంగ్యానికి ప్రసిద్ధి చెందారు. తెలుగు వార్తా పత్రిక ఆంధ్రప్రభ లో "రన్నింగ్ కామెంటరీ" అనే పేరుతో ప్రస్తుత రాజకీయ సంఘటనలపై కార్టూన్ కవిత్వం ద్వారా తెలుగు పత్రికారంగంలో కొత్త ఒరవడిని సృష్టించారు. సినిమారంగంలో కూడా పని చేశాడు. ప్రజా గాయకుడు గద్దర్ జీవితం మీద ఆంగ్లంలో పూర్తి నిడిచి డాక్యుమెంటరీ ఫిలిం **"మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిఫ్"** పేరుతో నిర్మించి దర్శకత్వం వహించారు.

**దేవీప్రియ రచనలు**

1) అమ్మ చెట్టు
2) సమాజానందస్వామి
3) రన్నింగ్ కామెంటరీ
4) గాలిరంగు
5) ఇన్షా అల్లాహ్ మొదలైన రచనలు ఎన్నో చేశారు.

దేవీప్రియ 2011 లో రాసిన "గాలిరంగు" వచన కవితా సంపుటికి 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాదాపు 5 దశాబ్దాల పాటు పాత్రికేయుడిగా, కవిగా సేవలందించిన దేవీప్రియ 71 సంవత్సరాల వయసులో 2020 నవంబరు 21న మరణించారు.

**గాలిరంగు కవితా సంపుటి – కొన్ని కవితల విశ్లేషణ**

"గాలిరంగు" కవితా సంపుటిలో సామాజిక అంశాలు మనిషి ఎలా ఉన్నాడు, ఎలా ఉండకూడదో, ఎలా బ్రతకాలో తెలిపే విషయాలు, రాజకీయ అంశాలతో పాటు భవిష్యత్ నిర్ధారణ అంశాలు కూడా ఎన్నో ఉన్నాయి.

ఇందులో "చిరమాలిన్యం" అనే కవితలో కవి మనిషిగా పుట్టిన మనం ఇతరుల పట్ల సానుభూతి కలిగి ఉండడం, పొరుగు వారి దుఃఖంలో పాలుపంచుకోవడం, మానవత్వం చూపాలి అంటూ అంతర్గతంగా తెలియజేశారు. మనం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ ఇతరుల కష్టాలలో పాలుపంచుకోకపోతే మానవ జన్మ వృథా అని చెప్పారు.

**"సిగ్గుతెలిసి ఆకులు ధరించాం**
**రాళ్ళని మలిచి ఆయుధాలు చెక్కుకున్నాం**
**సాటి జంతువులని చంపి ఆకలి తీర్చుకున్నాం"** అనే కవితలో దేవీప్రియ ఆదిమానవులుగా ఉన్నప్పుడు మనకు సిగ్గు తెలిసి వచ్చి మన శరీరాన్ని ఆకులతో కప్పి వేసుకున్నాము. రాళ్ళను ఆయుధాలుగా తయారు చేసుకొని జంతువులని చంపి మన ఆకలి తీర్చుకున్నాము అని చెబుతూనే చిరమాలిన్యం కవితలో చివరి పంక్తులలో

**"కానీ సోదరా !**
**మనిషి మాలిన్యాన్ని**
**ఇన్ని నులివెచ్చని కన్నీళ్ళతో కడిగి**
**శుభ్రం చేసుకోలేకపోయాం....! "** అని అంటారు. అంటే మనకు ఆదిమానవ యుగంలోనే సిగ్గు తెలిసింది. కానీ మనిషి తనలోని మాలిన్యాన్ని మాత్రం నులివెచ్చని కన్నీళ్ళతో కడిగి శుభ్రం చేసుకోలేకపోయాడు అని అంటారు. చిరమాలిన్యం అనగా చిరకాలం నుండి మనిషి మనసులో పేరుకోపోయిన మలినం లేదా మురికి అని అర్థం. ఇక్కడ మలినం అంటే చెత్త, దుమ్ము అని అర్థం కాదు. మనిషిలోని స్వార్థం, ఈర్ష్య, అసూయ మొదలైనవి అని అర్థం.

ఈ కవితలో ఇంకా

**మాటలు నేర్చుకున్నాం**
**నిప్పుని రాజేశాం**
**సామ్రాజ్యాలు ఆక్రమించాం**
**గ్రహాల మీద అడుగులు వేశాం**
**నిరంకుశుల్ని నాశనం చేశాం** అని రాశారు. అంటే అక్షరాలు రాసుకున్నాము పదార్థాలను రుచి కోసం నిప్పుల మీద కాల్చుకొని తిన్నాము. అనేక రాజుల సామ్రాజ్యాలను ఆక్రమించుకున్నాము. చివరికి మనిషి అంతరిక్షంలోనికి కూడా వెళ్ళాడు. నిరంకుశులను, నియంతలను కూడా నాశనం చేశాడు అంటూ మనిషి ఆదిమయుగం నుండి నేటి వరకు అభివృద్ధి చెందిన విధానాన్ని ఎంతో గొప్పగా చెప్పాడు. అయితే మనిషి ఎంత గొప్పగా ఎదిగినప్పటికీ మనిషి తనలోని ఈర్ష్య, అసూయ, ద్వేషాలను విడిచిపెట్టలేదని చెబుతాడు. మనిషి కన్నీళ్ళతో తనను శుభ్రం చేసుకోలేకపోతున్నాడని కవి బాధపడుతున్నాడు. మనిషి తనలోని స్వార్థమును, ద్వేషాన్ని వదిలిపెట్టకుండా ఎన్ని విజయాలు సాధించినా లాభం లేదు అని కవి ఈ చిరమాలిన్యం కవితలో చెప్పారు.

ప్రస్తుత సమాజంలో ఎన్నో విధాలుగా తక్కువ జాతి వ్యక్తులను, చిన్న చిన్న ప్రాణులను ఉన్నత వర్గాల వారు, బలమైన జంతువులు వాటిని/వారిని ఇబ్బంది పెడుతూ తాము సంతోషపడుతుండడం మనం చూస్తూ ఉంటాము. అయితే ఎక్కడైనా సరే ఎదురు తిరిగి నిలబడినవాడే గెలవగలడు అది సమాజమైనా, అడవి అయినా ఒకటే అని "న్యాయం" అనే కవితలో

**జీవన పోరాటం**
**అడవిలోనూ మైదానంలోనూ అదే**
**గాలిలోనూ నీటిలోనూ అదే**
**సంఘర్షించి గెలిచిన జంతువుకే వేటమీద హక్కు**
**నిభాయించుకొని నిలిచిన మానవుడికే**

నేలమీద నివసించే అధికారం" అని దేవీప్రియ చెప్పారు. ఎవరైతే ఏటికి ఎదురీదుతారో వారే ధైర్యవంతులు, సమర్థులు వారు దేనినైనా సాధించగలరు అని చెప్పారు.

**"చివరి చెమటబొట్టు**
**తనువు తరువు చిటారు ఆకునుంచి**
**రాలి రాతితల మీదపడి పగిలే వరకు**
**జీవకణం ప్రతిక్షణం**
**పరిశ్రమించవలసిందే"**

మనిషి తన చివరి రక్తపుబొట్టు వరకు, చివరి శ్వాస వరకు కష్టపడి జీవించవలసిందే, ప్రతిక్షణం అతను శ్రమను ఊపిరిగా చేసుకొని బ్రతుకు బండిని కొనసాగించవలసిందే అంటూ "అలసట" కవితలో చెప్పారు. అందుకే పెద్దలు "శ్రమయేవజయతే" అన్నారు.

సృష్టిలో ప్రతి మనిషికి ఇంకొక మనిషితో ఎప్పుడూ ఏదొక అవసరం ఎప్పుడో ఒకప్పుడు తప్పక కలుగుతుంది. అయితే నేటి సమాజంలో మనిషి ఇంకొక మనిషిని పట్టించుకోక దేవుడు గురించి ఆలోచిసూ ఉంటారని చెబుతూ "మానవ పురాణ" కవితలో

**"ఇంకెన్నాళ్ళు ఈ**
**మహిత మానవశక్తి విస్మరణ కాండ**
**ఎన్నాళ్ళు కలలు కంటారు**
**కోటానుకోట్ల దేవతల దీవెనలను గురించి**
**కొండలు బద్దలు కొట్టి**
**మహానదుల మార్గం మళ్ళించి చవుడు నేలల్లో**
**వెండిపూలు పూయించిన మనిషి గాథ**
**అవసరం లేదా మనకి"** –అని ప్రశ్నిస్తాడు.

నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించు అని, మానవ సేవయే మాధవ సేవ అని గొప్ప గొప్ప గ్రంథాలు చెబుతుంటే మనిషి సాటి మనిషిని పట్టించుకోకుండా భగవంతుడినే పూజిస్తూ ఉంటాడు. ముందు మనిషికి సాయం చేయమని భగవంతుడే చెబుతున్నాడు. కానీ మనిషి మాత్రం కనిపించే సాటి మనిషిని పట్టించుకోక కనిపించని దేవుడిని పూజిస్తూ ఉంటాడు. అది తప్పు అని మనుషులకు జ్ఞానబోధ చేశాడు దేవీప్రియ.

మనిషి అందం, డబ్బు, అధికారం, హోదా, కులం, స్థాయి మొదలైనవన్నీ చూసుకొని నా అంతటివాడు లేడనుకొని అందరినీ చిన్నచూపుతో చూస్తుంటాడు. అలాంటి వాడికి తెలియదు మనిషి జీవితం నీటి బుడగ వంటిదని, మనిషి ఎప్పుడు చనిపోతాడా అతనికే తెలియదు అంటూ –

**ఏ ఏరు ఎప్పుడు పొంగుతుందో**
**ఏ పడవ ఎక్కడ మునుగుతుందో**
**ఏ ఏనుగు ఎక్కడ కూలుతుందో**
**తెలియదు తెలియదు తెలియనే తెలియదు...**
**బండబారిన పాటిమట్టికి తగిలి తల**
**వెయ్యి ముక్కలయ్యే వరకు**
**తెలియదు తెలియదు తెలియదు.**

మనిషి బ్రతికి ఉన్నన్ని రోజులు అందరికీ తలలో నాలుకలాగా ఉండాలని ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు అన్నీ అశాశ్వతమైనవేనని "తెలియనిది" అనే కవితలో చెప్పాడు.

దేవీప్రియ రాసిన "గాలి రంగు" కవితా సంపుటిలో ఎన్నో అద్భుతమైన కవితలు ఉన్నాయి. కలవేకువ, బంతిపూలు, వేదాంతం, అలసినప్పుడు మొదలైన ఎన్నో కవితలలో సామాజిక ప్రయోజనాన్ని ఆకాంక్షించే అంశాలు ఎన్నో ఉన్నాయి.

**ముగింపు**

దేవీప్రియ రాసిన గాలి రంగు కవితా సంకలనంలో ఎన్నో అమూల్యమైన విషయాలతో మనలనే ఆలోచింపజేసే విధంగా రాయడం జరిగింది. మనిషి నీవు ఏమిటో తెలుసుకొని బ్రతుకు అంటూ ఈ కవితా సంకలనంలోని ప్రతి కవితలో ఏదో ఒకచోట మనలను తడుతూనే ఉంటాడు.

షేక్ ఖాజా హుస్సేన్ (దేవీప్రియ) గాలి రంగు కవితా సంపుటిలో మంచి కవిత్వముంది. తత్త్వము ఉంది సత్యముంది. సముజ్వల భావోన్మేషనముంది. మానవతా వాదముంది. విశ్వజనీనత ఉంది. సృజన ఉంది. సమాజాన్ని ఉద్దీపింప జేయగల పునరుజ్జీవింపజేయగల కవితా దర్శనముంది. అందుకే దేవిప్రియ నిజంగా కవితా దార్శనికుడు అని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. గాలి రంగు కవితా సంపుటి – దేవీప్రియ కవిత్వం
2. తెలుగు సాహిత్య చరిత్ర – ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
3. తెలుగుబాట 8వ తరగతి పాఠ్య పుస్తకం – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ

# 'గాలిరంగు' - మానవత్వం

**కె. విశ్వనాథ్,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

పరిచయం అక్కరలేని కవి దేవిప్రియ. అసలు పేరు షేక్ ఖాజాహుస్సేన్. కవిగానూ, జర్నలిస్టుగానూ తెలుగు సాహిత్య పత్రికారంగాలకు అపారమైన సేవలు అందించారు. పనిచేసిన రెండు రంగాలను కొత్తపోకడలతో భవిష్యత్ తరాలవారికి మార్గదర్శిగా నిలిచారు.

దేవిప్రియ అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద, పిట్టకూడా ఎగిరిపోవాల్సిందే, చేప చిలుక, ఎందుకుంటుంది వంటి కవితా సంపుటాలను వెలువరించారు. పత్రికల్లో రన్నింగ్ కామెంట్రీ కూడా చాలా పేరు ప్రఖ్యాతలు పొందాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన గొప్ప కవితా సంపుటి 'గాలిరంగు' దేవిప్రియ అంతరంగంలోని భావాలు తరంగంలాగా ఒకటి తర్వాత ఒకటి ఒడ్డుకు చేరినట్లు ఇందులోని భావ పరంపర మనకు కనిపిస్తుంది. ఇందులో ఒక్కోచోట కాఠిన్యం, గాంభీర్యం, క్రోధం, కరుణ, అమాయకత్వం, వ్యంగ్యం, కలబోసిన కవిత్వం. సమాజం పట్ల బాధ్యతాయుత, నిబద్ధతతో తాను ఏమి రాస్తున్నాడో ఎరుక కలిగిన ఒక సామాజికుడు దేవిప్రియ.

సమాజంలోని వ్యవస్థల అవ్యవస్థలను గురించి రాసినా, సగటు మనిషి వేదనాభరిత జీవితం వర్ణించినా, శ్రమైక జీవనం గురించి చెప్పినా, తాత్వికత వ్యంగ్యం, జోడెడ్లబండిలా నడిపిస్తాడు. మెత్తమెత్తగా చెబుతూనే మనలోని మాలిన్యం పైకి కత్తి దూస్తాడు. పాఠకునికి ఒక భావావేషాన్ని ఆలోచనను తట్టిలేపి భుజం తట్టి సాటి మనిషిగా మనిషి కోసం పోరాడమని చెప్పిన కవిత్వం 'గాలిరంగు' నిండా ఉంది.

గాలికి ఎవరు రంగులేస్తారు? అసలు గాలికి రంగు ఉంటుందా? రంగు చూడగలమా? ఎవరైనా చూశారా? అన్నీ ప్రశ్నలే? అన్ని ప్రశ్నలకు సమాధానం లేనిదిగా మనకు తోస్తున్నా దాని మూలం తెలిసిన వారికి గాలిరంగును చూడ్డం, రంగు వేయడం అసంభవమైన విషయం కాదు. అయితే అది మనం చూడగలిగిన, మనం అనుకునే సప్తవర్ణాలలో ఏవీ కావు. గాలిరంగు కవిత్వం చదివిన తర్వాత పాఠకునికి దేవిప్రియ చూసిన రంగేంటొ, వేసిన రంగేంటొ తెలుస్తుంది. అయితే ఆయన రంగులు వేసే మనిషి మాత్రం కాదని గ్రహించాలి. గాలికి తన, తమ తారతమ్యం లేదు. లింగ, జాతి, మతం, కులం, దేశం ఇలా ఏదైనా రాయి, రప్ప, పురుగు వంటి భేదం లేదు. దాని ధర్మం ఒకటే సమానత్వం, దాని కర్తవ్యం నిర్వర్తించడం. ఆ మూలం తెలిసిన వారు కావడంవల్లే దేవిప్రియ గాలిరంగు మానత్వంగా గుర్తించారు తప్ప రంగును వేయలేదు.

ఈ గాలిరంగు కవిత్వంలో బహుముఖీయమైన పార్శ్వాలను చూస్తాం. ఛిద్రమవుతున్న కలల భారతాన్ని చలనం లేని 'స్తంభంలాంటి' రాజకీయ నాయకుల వైనాన్ని పొంతన లేని రాజకీయ 'గారడీలను' పేదరికంలో మగ్గుతున్న శ్రామికుల జీవితాలని, జీవితంలోని చిరు జ్ఞాపకాలని ఇలా దేని గురించి చెప్పిన దానిలో వాస్తవికత పునాదిపైనే ఉంటాయి. అందమైన ఊహాలతో గుండెలను సైతం ద్రవింప చేయగల నేర్పు కవి సొంతం.

వర్తమాన సంక్షోభిత భారత చిత్రపటం 'గాలిరంగు' అనే కవితలో కనిపిస్తుంది. కవిత ఆసాంతం చదువుతుంటే ఒక కావ్యాన్ని ఒక పేజీలో కుదించాడు అనిపిస్తుంది. ఒక్కో పాదానికి కనీసం ఒక పేజీనైనా వ్యాఖ్యానం చేయాల్సిన కవిత ఇది.

దుష్టులు, దుర్మార్గులు, శకునులు, రక్తపిపాసులు నేడు నాయకులుగా చలామణి అవుతున్న జాతీయ ఆకాంక్షను సముద్రాల కావల దాచి పెడుతున్నారని చెబుతూ–

**"వేదికలూ, నివేదికల మధ్య**
**ప్రశ్నలూ, జవాబుల మధ్య**
**నిరుపేద భారతం నలిగి నరకం అనుభవిస్తూ ఉంటుంది"** (గాలిరంగు)

నాయకుల చేతలు వేదికలు దిగాక నివేదికల అందాక మర్చిపోవడం మూలన పడేయడం మామూలే. సామాన్యుల జీవితాలలో ఎటువంటి మార్పు ఉండదు. అస్తిత్వం కోసం, ఉనికి కోసం చేసే పోరాటలను తిరుగుబాటుగాను విద్రోహశక్తులు గాను చూపుతుంది. ప్రభుత్వాలపై వ్యతిరేకత పెల్లుబుక్కిన రోజు సెంటిమెంటును రాజేసి సమస్యను పక్క దారి పట్టించడం వంటి నిజాలు కవి నిక్కచ్చిగా చెప్తాడు.

**"నిస్సహాయంగా నువ్వు నేను**
**నిస్సహాయంగా అతడు నేను**
**నిస్సహాయంగా నింగి నేల**
**గాలిరంగునైనా ఊహించగలనేమో కానీ**
**రానున్న రేపటి రూపే చూపుకు అందడం లేదు."** (గాలిరంగు)

అనడం పేదల జీవితాలపై అలుముకున్న నీలినీడలు మనిషిలోని స్తబ్ధత నుండి నిస్సహాయత నుండి బయటపడలేకపోతున్నాడు అనేది కవి వేదన.

ప్రజలను మభ్యపెట్టడానికి తలా తోకాలేని మాటలతో చేసి మాటల రాజకీయ గారిడీలో

**"ఏటిని నిట్టనిలువుగా నిలబెడతా**
**నిప్పుని నీటితో మండిస్తా**
**ఏనుగుని తొండం మీద నడిపిస్తా**
**ఎవరెస్టుని చపాతీలా చదును చేస్తా**
**ఎవరూ చేయలేనిది ఇంకొకటి కూడా చేస్తా...**
**నేను గాలికి రంగులేస్తా.....!"** (గారడి)

వ్యంగ్యంగా మన నాయకుల తీరుతెన్నేలా విమర్శించడం కనిపిస్తుంది.

మనిషి భూమికి ఆకాశానికి నిచ్చెనలు వేసినా గ్రహాలను శోధించినా "మనిషిలోని మాలిన్యాన్ని ఇన్ని నిలువెచ్చునికి కన్నీళ్ళతో కడిగి శుభ్రం చేయలేకపోయాం." మనిషి తన కోసం, సాటి మనిషి కోసం ఆరాటపడి మనిషి ఘోష అన్వేషణ మనకు కనిపిస్తుంది, ఎంత ఎదిగినా ఏమి సాధించినా మనిషిలోని అసూయ, ద్వేషం. వంటి వాటిని వదల్లేని తనం మనది. వాటిని దాటుకున్నప్పుడే నిజమైన మనిషి ఉద్భవిస్తాడు.

చరిత్ర ఎవరిది? కావ్యాలెవరివి, జీవితం ఎవరిది? పునాదులను వదలి, గోపురాన్ని వర్ణించి చిత్ర నిజంగా ఆ చరిత్రనే–

**"ఏ హెూమరు**
**ఏ వాల్మీకి**
**ఏ వ్యాసుడు**
**ఏ కంబోడు**
**ఏ నన్నయ్య**
**రాశాడు, రక్తబీజాలు చల్లుకుంటూ**

**ఇతిహాస ఊసర క్షేత్రాల్లో**
**మందార పాదముద్రలు వదిలి వెళ్ళిన జన వీరు గాథలు?"** (అచరిత్ర)

ఈ ప్రశ్నలకు సమాధనం ఎవరిస్తారు.?

"సామాన్యుల జీవన విధానం ఎట్టిది? చరిత్రంటే ఇది అని ప్రచారం చేసే కుహనా చరిత్రకు ఈ వాక్యాలు ఒంటికీ, మనసుకీ పట్టనివి. శ్రమైక జీవనం గురించి ఏ ఒక్క కవికి కనిపించలేదు.

"రవి కాంచని చోట కవి కాంచును" అన్నది నుడి. కానీ స్వర్గాలను దర్శించి రాయగల కవులు, సాటి మనిషి వ్యధార్థ జీవనాన్ని వర్ణించడంలోనే ఎందకో వెనకబడ్డాడు. దేశంలో కుప్పలు తెప్పలుగా పారుతున్న ఆధ్యాత్మిక వ్యాపారాన్ని, భక్తిమాటున సాగుతున్న చీకటి కోణాన్ని, దేవునిగా ప్రచారం చేసుకొనే వైనాన్ని

**"ఇప్పుడు**
**రోజుకొక నవప్రవక్త**
**ఊరుకొక నీతిప్రయోక్త**
**చదలు పుట్ట పగిలినట్లు**
**చిందర వందర చీదర బాదర**
**సమాధానం దొరకని**
**ప్రశ్నలకి ముంగిట మౌనమే మహాజ్ఞానం"** (ఉనికి)

ప్రచారం చేసుకొనే కుహాన వ్యవస్థను ప్రశ్నిస్తాడు. దేశాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో నేడు ఇదీ ఒక భాగమనే చెప్పవచ్చు. మనిషి ఎంత గొప్ప పని చేసినా, అది ఎదో అతీత శక్తిగా ప్రచారం చేసే పాత మనస్తత్వం వదిలి మానవ శక్తిని గుర్తించాలని, గానం చేయాలని సృష్టికి - ప్రతిసృష్టి చేసిన "మానవపురాణం". పారాయణం చేయాలని కవి ఆకాంక్ష కింద పంక్తిలో చూస్తాం.

**"కొండలు బద్దలుకొట్టె**
**మహానదుల మార్గం మళ్ళించి చవుడు నేలల్లో**
**వెండుపూలూ పూయించిన మనిషిగాథ**
**అవసరం లేదా మనకి" (మానవ పురాణం)**
**దీని గుర్తించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ.**
**"రాచపీనుగులను కాపాడే**
**రాతపిరమిడ్ల**
**దివ్యనిర్మాణ పురాణ పారాయణం కాదంటూ"** (మానవ పురాణం)

ప్రజలకు ఉద్బోధచేయటం, ఎరుకను కలిగించడం ఈ కవితలో కనిపిస్తుంది. కరువు సీమల్లోని ప్రజలు దేవున్ని, నాయకులను, నమ్మడం మాని

"పలుగూ పారా అందుకుని పదవోయ్ పదాపదా" అంటూ ముందుకు నడిపించడం చూస్తాం.

రాష్ట్రంలో విభజన రేఖలు అలముకుంటున్న వేల సున్నితంగా వ్యంగ్యంగా హెచ్చరిస్తూనే

**"ప్రపంచ కుటీరంలో**
**తెరుచుకోని ఇంకొక కిటికీ**
**గోలకొండపత్రిక రెక్కలు రెపరెపలాడనీ**

**చరిత్రలో చేరని మరొక తెలుగు అధ్యాయం**

**చల్నేదో బాల్ కిషన్"** (చెల్నేదో)

అంటూ ఆహ్వానిస్తూ..

**"ఏ ఒడ్డున నిలబడినా**

**మనిషి మనిషి కోసం పోరాడనీ**

**తెలుగు పలుకు**

**తెలుగు లిపి**

**సజీవ మానవ శాసనం మీద**

**చిరస్థాయిగా నిలిచిపోనీ"(తెలుగు శాసనం)** అంటారు.

మానవీయతకు పెద్ద పీట వేయడం కవి విశాల హృదయం ఆవిష్కృతమైన కవితా పంక్తులు. ఇది తెలుగు ప్రజలు నిర్ణయించుకున్న "తెలుగు శాసనం"గా కవి గౌరవిస్తాడు.

'గాలిరంగు' కవిత్వంలో ప్రతి కవితా వాక్యాలను కోడ్ చేయవలసినవే కాని, అది ప్రస్తుతం అసందర్భం. ఈ సంపుటిలో వివిధ పార్శ్వాల నుండి రాసిన వాటిని ఇక్కడ కొన్నింటిని కోడ్ చేయడం జరిగింది. కవి తీర్చిదిద్దిన కొన్ని ఊహాచిత్రాలను, ఇక్కడ ప్రస్తావించడం సమంజసంగా ఉంటుంది.

**"కిందిరెప్ప భూమి**

**పై రెప్ప ఆకాశం**

**నడుమ ఉన్న నాజూకూ గాజుగోళం"**

అనడంలో ఎంత సహజంగా ఉందో. దానికి మించిన ఒక అనుభూతినిస్తుంది. "కంటి"ని భూమితో పోల్చడంలో కవి ఉద్దేశం, కంటిలా భూమిని రక్షించుకోవడం అనే ధ్వని కూడా ఇక్కడ ధ్వనిస్తుంది. భూమిని రక్షించుకోకపోతే భవిష్యత్తు అంధకారమయ్యే స్థితి వస్తుందనే ఒక హెచ్చరిక కనిపిస్తుంది.

సూర్యున్ని ధినమణిగా పేర్కొంటూ

**"పగలంతా గగనంలో**

**పాకిపాకి పచ్చిమ సరస్సులో**

**తలంటు స్నానానికి దిగుతున్న ధినమణి"**

లాంటి భావచిత్రాలు చదువుతుంటే అనుభూతిని ఆశ్వాదించాలే తప్ప వ్యక్తీకరించలేని స్థితికి వెళ్ళిపోతాం. ఇలాంటి భావచిత్రాలు 'గాలిరంగు' కవిత్వం నిండా ఉన్నాయి. కానీ కేవలం మచ్చుకు రెండు మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

గాలిలా ఏ సంకెళ్ళకు కట్టుబడకుండా, సాటిమనిషిగా మనిషిపై మానవత్వం చూపాలి అనేది ఈ కవిత్వం ఆంతర్యం. మనిషికి జీవించడానికి గాలి ఎంత అవసరమో మానవత్వం కూడా అంతే. అందుకే దేవిప్రియ 'గాలి' రంగును "మానవత్వం"గా గుర్తించారు. గాలిలా సర్వవ్యాప్తంగా మానవత్వపు పూవులుగా పరిమళించాలనే కవి ఉద్దేశం నెరవేరాలనే ఆకాంక్షతో కవి రేపటిపై పెట్టుకున్న ఆశ కూడా విదితం అవుతుంది. మనలోని మాలిన్యాన్ని క్షలనం చేయడం కవిత్వం కర్తవ్యం ఆ పని గాలిరంగు కవిత్వం చేయగలదని ఆశిస్తూ.... సెలవు.

**ఆధారగ్రంథాలు :**

1. గాలిరంగు కవితా సంపుటి – దేవిప్రియ
2. తెలుగు కవితా వికాసం – కడియాల రామమోహనరాయ్

# బండి నారాయణస్వామి - శప్తభూమి నవల - వస్తు వైవిధ్యం

డా. వడక వెంకటేశులు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

పాశ్చాత్య సాహిత్య సంస్కృతుల ప్రభావం వలన, ముద్రణ యంత్రాల వ్యాప్తివల్ల విద్యావిధానంలోను, ప్రజల ఆలోచన సరళిలోను గొప్ప మార్పు సంభవించినది. అప్పటి వరకు ప్రబంధ ఆఖ్యాయికాది కావ్యాదులలో కేంద్రీకరింపబడిన రచయిత దృక్పథం వాస్తవికత వైపు మరలినది. తత్ఫలితంగా తెలుగు రచయితలు పాశ్చాత్య సాహిత్యంలోని ప్రక్రియలను చేపట్టడానికి పూనుకొన్నారు. ఇలా విస్తృతి చెందిన ఆధునిక సాహిత్య ప్రక్రియ నవల.

నవల గద్య కావ్యం సమాజ జీవితాన్ని చిత్రీకరిస్తుంది. సహజమైన శైలి నవలకు ప్రాణం వంటిది. నవలలో పాత్రలు, కథాకథనం రచయిత చెప్పదలుచుకున్న విషయం సహజంగా ఉంటుంది. చారిత్రక, రాజకీయ, జీవిత వాస్తవాలను లోతుగా చిత్రీకరించగలదు నవల.

శప్తభూమి నవల రాయలసీమ ప్రాంతంలో 1775 సంవత్సరం కాలపు చారిత్రక నేపథ్యంలో రాసిన నవల. 2019 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన నవల. రచయిత అనంతపురం జిల్లా వాస్తవ్యులు బండి నారాయణస్వామి ఆనాటి శాసనాల (కైఫీయత్తు, గెజిట్లు, శిలాశాసనాలు, వీరగల్లు) ఆధారంతో, చారిత్రక సంఘటనల కాల ప్రమాణాలకు అనుగుణంగా అప్పటి సమాజపు విభిన్న కుల మతాల సామాన్య ప్రజలు ముఖ్య పాత్రలుగా, అప్పటి పాలెగాళ్ల మధ్య పోరాటాలతో జోడించి తెలుగు వారి చరిత్ర పట్ల మన అవగాహన పరిధిని పెంచేలా రెండు భాగాలుగా రాసిన నవల.

తెలుగు వారి చరిత్రకు సంబంధించిన సాహిత్యంలో రాచరికం చుట్టూ జరిగిన విషయాలే మనకి ఎక్కువ పరిచయం. గతకాలంలో సామాన్య ప్రజల జీవన విధానాలు, కరువు కాటకాలు వారిపైన విధించిన పన్నులు, కుల, మత వివక్ష, వాటి మార్పులు వారి స్థితిగతుల గురించి గ్రంథస్థం చేసిన ప్రయత్నాలు అట్టే జరిగినట్లు అనిపించదు. సంస్కృతి పేరుతో మనం ఎందుకు చేస్తున్నామో తెలియకుండా ఇప్పటికీ పాటించే చాలా ఆచారాలు, దురాచారాలు, నమ్మకాలు మాత్రం మన గతంలో నుండి బయలుదేరినదే.

శప్తభూమి నవల రచయిత బండి నారాయణస్వామి పద్దెనిమిదవ శతాబ్దపు చారిత్రక, దళిత చారిత్రక నవలగా ప్రస్తావించినప్పటికీ స్త్రీలపై జరిగిన దురాగతాల, అత్యాచారాల చరిత్రని విస్మరించలేదు. ఏ వర్గపు స్త్రీలపై అయినా, దళిత స్త్రీలు, కోమటి పడుచు, గొల్ల పడుచు, బ్రాహ్మణ స్త్రీ, వివాహిత స్త్రీలు, కాపు స్త్రీలు, పనివాళ్ళు, ముక్కుపచ్చలారని ఆడపిల్లలపై జరిగిన అరాచకాలు, హత్యాచారాలు, బలవంతపు సతీసహగమనాలు, పుట్టబోయే బిడ్డల భవితని కూడా శాసిస్తూ బసివినిగా మార్చటాలు, అత్యాచారాలనంతరం వారి గతులు పరిస్థితులు చదువుతుంటే సామాజిక స్పృహ ఉన్న ప్రతి ఒక్కరికి వీపు మీద చరిచినట్లుగా ఉంది. అనంతయ్య శ్రేష్టి తన కూతురిని అడవిలో వదిలిపెడితే, ఎర్రనాగిరెడ్డి భార్యని కొండ దారుల్లో వదిలిపోవటం, వివాహిత స్త్రీలు అత్యాచారానంతరము వేశ్యగృహాలకు చేరటం, ఆత్మహత్యలకు పాల్పడడం, గొల్ల పడుచు వేశ్యా గృహాలకి తరలింబడడము, బీరప్ప నెలల బిడ్డని తెలిసీ – దేవదాసీ స్త్రీలకు అమ్ముకోవటం, బొచ్చుతో కూడిన చచ్చిన కుందేలు పచ్చి మాంసానికై బీరప్ప కోమటి పడుచుని చావ కొట్టటం, బ్రాహ్మణ స్త్రీ మోసపు పెళ్లి వలన ఇంటింటికి తిరిగి తన సంతానాన్ని

దత్తత చేసుకొమ్మని అభ్యర్థించటం, ఆడబిడ్డతో సహా ఆత్మహత్య చేసుకోవటం. చదువుకుంటే నేటి సమాజంలోని పరువు హత్యలు, సుగాలీలు ఆడపిల్లల్ని అమ్ముకోవటం గుర్తు చేస్తూ కళ్ళని చెమరుస్తాయి. మరొక సందర్భంలో రచయిత పెంపుడు పిల్లని అడవిలో వదిలిన కొద్ది రోజులకే అడవి పిల్లిగా మారినట్లు చెబుతుంటే సమకాలీన రాజకీయాల్లో అవివేకికి రాజ్యాధికార మొస్తే అనతి కాలంలోని అరాచకాన్ని సృష్టించడం గుర్తుకు రావటం సహజం. రాజవంశీకులు, అమర నాయకులూ, దళిత శారీరక బలాఢ్యులు, అవకాశమున్న స్వాముల రాత్రికాలను ఎండకడతాడు రచయిత.

ఇక సున్నితమైన మత మార్పిడి అనే అంశం పద్దెనిమిదవ శతాబ్దంలోనే ఎలా జరిగింది వివరించారు. తొలుత బసివినిగా తర్వాత వేశ్య గృహాలకి చేర్చబడినవారు. బలవంతంగా బసివినిగా మార్పించబోయిన మేరీ, స్వమతంలోని వారు చేసే హేళనలని భరించలేక దేవదాసి పుత్రుడైన మన్నాదాసు పేరు మార్చుకొని క్రైస్తవాన్ని స్వీకరించటాన్ని కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు.

అనంతపురం సంస్థానాధీశుడిగా ఉన్న హండే సిద్దరామప్పనాయుడు నుంచి ప్రారంభమవుతుంది కథ. 'బిల్లే ఎల్లప్ప' అనే గొఱ్ఱెల కాపరి (కురవ కులం) తన వడిసెల, కాపరి కుక్కల సాయంతో బుక్కరాయ సముద్రం చెరువుకు గండి కొట్టాలనే శత్రువు (తాడిమర్రి సంస్థానం) పన్నాగాన్ని భంగపరిచి అడ్డుకుని సిద్దరామప్పనాయుడుకు ప్రీతి పాత్రుడవుతాడు. కురవ కుల కట్టుబాట్లకు విరుద్ధంగా గుర్రమెక్కి 'ఎల్లప్ప జెట్టి' అవుతాడు. బాలకొండ బీరప్ప కూతురు ఇమ్మడమ్మకి బిల్లే ఎల్లప్ప, కొడెనీలడు మేనబావలు. రాయలసీమ ప్రాంతం వర్షాధారితమైనందున అక్కడక్కడా ఉన్న చిన్నా పెద్దా చెరువుల కింది ఉన్న ఆయకట్టు భూమి ఆనాడు ఎంతో విలువైనది. ఇమ్మడమ్మకు కోడెనీలడే ఇష్టమైన చెరువు సౌకర్యం లేని కొండాపురం ఊరిలో ఉండే కొడెనీలడికిచ్చి పెళ్లి చేయడానికి ఇష్టం లేదు బీరప్పకు. కరువు సమయంలో పోషించలేక సొంత బిడ్డను భోగం వాళ్లకు అమ్ముకోవడం, తిండిలేక ఎలుకలు, పిల్లి మాంసం పిల్లలకు తినిపించడం వంటి బాధలు అనుభవించిన బీరప్ప (ఒక రొట్టెకు మూడు కాసులకు పిల్లనమ్ముకుంటున్న కరువుకాలమది) కోడెనీలడికి కాకుండా ఒక మండలానికి నాయకుడైన బిల్లే ఎల్లప్పకే ఇమ్మడమ్మనిచ్చి పెళ్లి జరిపిస్తాడు. కానీ ఇమ్మడమ్మ కోడెనీలడినే తలుచుకుంటూ ఎల్లప్పను దరిజేరనీయదు.

హరియక్క బోయ ఆడపడుచు. తన తండ్రి చిత్రలింగ నాయకుడిని దొంగదెబ్బ తీసి చంపిన పెమ్మరాజు తిమ్మప్పను మల్లయుద్ధంలో ఓడించి రణం కుడుపు ఓడిన వాళ్ళ రక్తాన్ని ఎసరుగా చేసి అన్నం వండి కులదైవానికి సమర్పించుకోవడంతో తాండవ మాడిన పౌరుష వనిత. దేవర దున్న లాగా గ్రామలపై పడి తిరుగుతున్న కోడెనీలడని చూసి మనసు పారేసుకుంటుంది. హండే రాజును ఒప్పించి పెళ్ళి కూడా చేసుకుంటుంది. హరియక్క కోడెనీలళ్ళ జంటను చూసిన తర్వాత ఎల్లప్పను దరిజేరనీయనందుకు బాధపడుతుంది ఇమ్మడమ్మ. కానీ కోడెనీలడు ఒక్కరోజు కూడా హరియక్కతో ఉండకుండా పారిపోయి ఎల్లప్ప మండలాధీనంలో వానలు పడడానికి జరుపుతున్న జాతరలోని 'గాలిదేవర'ను దొంగిలించి తన గ్రామానికి తీసుకెళ్ళబోతాడు. బొద్దె ఎల్లప్ప దాన్ని అడ్డుకుని కొడెనీలడుని హతమారుస్తాడు. ఎల్లప్ప 'భార్య ప్రియుణ్ణి' చంపిన తరవాత అహంకారంతో బలవంతంగా భార్యను ఆక్రమిస్తాడు. ఇంక నేను ఎల్లడితో కాపురం చేయలేనని పుట్టింటికి చేరుతుంది ఇమ్మడమ్మ. ఇలా నవల ఇతివృత్తంలో ముఖ్యపాత్రలుగా ఎల్లప్ప ఇమ్మడమ్మలు కనిపించినా నాటి సామాజిక స్థితిగతులను మన కళ్ళముందు మెదిలించడానికి రచయిత సృష్టించిన పాత్రలన్నీ కథా సంవిధానంలో సహజమైనవీ, విశిష్టమైనవీను. కరువు సమయంలో సామాన్య ప్రజల కష్టాలు కంటికి కనపడేలాగా చెప్పగలిగారు.

పద్మసాని – దేవదాసి. తనను పట్టించుకోక పోవడంతో పద్మసాని రాజు ప్రాపకాన్ని వదిలేసి ఓ బీడు మైదానాన్ని ఎంచుకుని అందులో చెరువు తవ్వించి తన తల్లి పేరు మీద జక్కులూరును స్థాపిస్తుంది. అంతేకాకుండా చుట్టు పక్కల మండలాల్లో అమరనాయకుల చేతిలో పీడించబడుతున్న జనాలకు తన ఊరిలో ఆశ్రయం కల్పిస్తుంది. అది చుట్టు పక్కల మండలాధీశులకు మింగుడుపడదు. ఆమె కొడుకు ఇంగ్లీషు చదువులు చదువుకోవడానికి మద్రాసు పోయి అక్కడే క్రైస్తవ మతం పుచ్చుకుంటాడు.

తన మతం చేసే దురాచారాలతో పాటు తన తల్లిని అసహ్యంగా చూడటానికి కారణమైన బసివిని వ్యవస్థను, తన తండ్రి ఎవరో తెలియని వాడని లోకం హేళన చేయడం వంటివన్నీ అతడికి హైందవ మతం మీద అయిష్టం పెంచుతాయి. పద్మసాని పెంపుడు కూతురు నాగసాని తన పద్మసానికి అసలు కూతురు సాగసాని. తను పద్మసానికి అసలు కూతుర్ని కానని, కరువు కాలంలో బిడ్డని అమ్ముకున్న బీరప్ప ఉజ్జనమ్మల కూతుర్ని అని తెలుసుకుంటుంది. పన్నెండేళ్ల కొకసారి కలిసే కురువల 'పరస'లో తన వాళ్ళని కలుసుకోవచ్చనే పెంపుడు తల్లి సూచనతో బయలుదేరుతుంది. తన అక్క, అమర నాయకుడు ఎల్లప్ప భార్య అయినా ఇమ్మడమ్మను చూసి నిర్ఘాంతపోయింది. ఇమ్మడమ్మ తన భర్త ఎల్లప్పను వదిలేసిన తర్వాత ఏడు పెళ్ళిళ్ళు చేసుకున్న సంగతి తెలిసి నాగసాని ఆశ్చర్యపోతుంది.

క్రూరమైన వ్యక్తిత్వం కలవాడు మండలాధీశుడైతే జరిగే పరిణామాలు వీరనారాయణరెడ్డి ద్వారా చూపారు. నాటి సమాజంలో మాదిగ కుల స్త్రీలపై వీరనారాయణరెడ్డి చేసే లైంగిక దాష్టీకాలు అప్పటి స్థితిని కళ్ళకు కట్టినట్లు చెప్పారు. వీరనారాయణరెడ్డి పగబట్టి ఒక సామాన్య మాదిగకుల వ్యక్తికి పుట్టబోయే తన కూతురి జీవితాన్ని బసివిని వ్యవస్థకు మార్చి శాసించగలిగిన వ్యవస్థని వివరించారు.

ఎంత ధనమున్నా, ఉన్నత కులమైనా, రాజు దగ్గర గొప్ప పరపతి ఉన్నా, అధికారంలో ఉన్న కుటిలమైన అధికార కామదాహానికి ప్రియమైన కూతుర్ని బలి చేసుకున్న వైశ్య కులపెద్ద అనంతయ్యశ్రేష్టి బాధ ఆ కథ అయ్యాక కూడా మన వెంట ఉంటుంది. కంబళి శరభుడు – అమాయక హరిచంద్రుడు. మాల కులంలో పుట్టి ఎవరితరం కాని నల్లగుండు ఎత్తగలిగిన మహాబలశాలి. ఊరి కట్టుబాట్లకు బలి అయిన సామాన్యమైన మనిషి.

రచయిత చక్కని వెలుగు పదాలు వాడి ఆ తరంలో ప్రజల వేషాదారణ, ఆహార విశేషాలతో కథని నడిపిన తీరు ఎంతో బాగుంది. కాలంలో జరిగిన మార్పులతో పన్నెండేళ్లకొకసారి కలిసే కురవల 'పరస'లో వీరినందరినీ కలిపి వారి జీవనంలో జరిగిన మార్పులను చూపించారు. కనుమరుగైన దురాచారాలు – ఈ కాలానికి రూపు మాసిపోయిన ఎన్నో దురాచారాలు కళ్ళకు కట్టినట్లు వర్ణించిన తెలుగు భాష అద్భుతం. అప్పటి దురాచారాలు సతి, వీరమంటపం, గాలదేవర ఆచారాలు వివరించారు. సతి – అమరనాయకుడైన నాగప్ప ప్రెగడ వారసత్వానికి అడ్డు ఉండకూడదని భర్తను పోగొట్టుకున్న పదమూడేళ్ల అన్న కూతురిని సతీసహగమనం పేరిట మంటల్లో తోయడం వంటి దురాచారాలు కనబడతాయి. ముఖ్యంగా 'సతి' ఎంత వేదనాభరితంగా ఉంటుందో కళ్ళకు కట్టినట్లు వివరించారు. వీరమంటపం – బిల్లే ఎల్లప్ప తన రాజుకు పట్టిన దుస్థితి చూడలేక శ్రీశైల మల్లికార్జున స్వామి సన్నిధిలో వీరమంటపం (ఆత్మార్పణం) ఎక్కడానికి సిద్ధమవుతాడు. వర్షాలు కురవాలని, తన రాజు రాజ్యాన్ని నవాబుల పాలు కాకుండా ఉండాలని, సగం ప్రపంచం మునిగిపోయినా పర్వాలేదు. కానీ అనంతపురం పై కుంభవృష్టి కురవాలని కోరుకుంటాడు. శరీరంలో అవయవాలన్ని ఒక్కొక్కటి కత్తిరించి దేవతలకు సమర్పణ చేసుకుంటాడు.

గాలిదేవర – జాతర జరిపించే నిర్వహణని ఒక వ్యక్తికి అప్పగిస్తారు గ్రామ పెద్దలు. ఇది జరిగే సమయంలో ఎవరయితే ఆ ఫలాన్ని తెస్తాడో, వాడు మొనగాడు. వాటికి కట్టుబాట్లు వర్తించవు. ఏ ఇంట్లోకైనా వెళ్ళవచ్చు. ఆడువారి మీద పడవచ్చు, ఎవరి మీద అయినా చేయి చేసుకోవచ్చు. ఎవ్వరు ఏమి అనకూడదు. కాని ఒక నియమం ఉంది. దేవర మనిషిగా మారినవాడు నోరు తెరచి మాట్లాడకూడదు. సైగలు చేయరాదు.

ఇప్పటికీ ఉన్న దురాచారాలు – గాలి గున్నప్ప పరస (ఇప్పటికీ రాయలసీమలోని ప్రతి సంవత్సరం తరగకుంట ప్రాంతంలో జరుగుతుంది అని రచయిత 256 పేజీలో ఉదాహరించారు) కొత్తగా పెళ్ళి చేసుకున్న మాదిగ దంపతులు గుండు కొట్టించుకని, గుండు చుట్టూ సున్నం బొట్లు పెట్టించుకుని అపరాధ రుసుము చెల్లించడం. ముఖ్య పాత్రలు అన్నీ ఏదో ఒక దురాచారానికి లోను కావడం కనిపిస్తుంది. దాని వల్ల ఇప్పటికి మనకి (కాలం మారినా) వారు చాలా దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది.

శప్తభూమి అంటే శాపగ్రస్థమైనది అని అర్థం. ఒక్కొక్క సామ్రాజ్యం నుండి మరొక సామ్రాజ్యం అభివృద్ధి క్రమంలో రతనాలసీమ అనిపించుకున్న రాయలసీమ ప్రాంతం వానలు కురవక చెరువులు ఎండిపోయి పంటలు పండక, కరువు కాటకాలతో ప్రజలు వలస పోతుంటే, కప్పం కట్టలేని హండె రాజు సిద్దరామప్పనాయుడు కోటను ముట్టడిస్తే, కప్పం కట్టలేక, యుద్ధానికి దిగలేని స్థితిలో పడిపోతాడు. టిప్పుసుల్తాన్ తరుపున గుత్తి తాబేదార్ అనంతపురం కోట తాళాలు తీసుకుని సిద్దరామప్పనాయుణ్ణి తన దివాణంలోనే ఖదీ చేస్తాడు. కాల పరిణామంలో టిప్పుసుల్తాన్ పోయి నిజాం నవాబు వచ్చాడు. నిజాంను వదిలించుకుంటే సీమ దొరలు (ఇంగ్లీషువాని) పాలబడి సీడెడ్ జిల్లాల క్రిందకి వచ్చిన రాయలసీమ ప్రాంతం దేశీ, విదేశీ దోపిడికి గురి అయిన క్రమం అర్థం అవుతుంది. ఎంతటి బలవంతులైనా ఎల్లప్ప జెట్టి, తిమ్మప్పనాయుడు, సిద్దరామప్ప, కోడెనీలుడు, ఎర్రనాగిరెడ్డి, నల్లనాగిరెడ్డి, రామప్ప వంటి వారు కాలగమనంలో కలసిపోక తప్పదని చెప్పటం జరిగింది.

**ఆధార గ్రంథాలు**

1. శప్తభూమి - నారాయణస్వామి, బండి
2. నవలా శిల్పం - వెంకట సుబ్బయ్య, వల్లంపాటి
3. తెలుగు నవలా వికాసం - నాగభూషణశర్మ, మొదలి
4. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ - శ్రీరామమూర్తి, కోడూరి

# శప్తభూమి నవల - నామౌచిత్యం

**బుకే ధనక నాయక్,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు

**1. ఉపోద్ఘాతం**

శప్తభూమి నవల రచయిత బండి నారాయణస్వామి. ఈ నవలకి 2019లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాన్ని దక్కించుకున్నారంటే నవల యొక్క రచనా తీరు ఎంత గొప్పదో గ్రహించదగ్గ విషయము. రాయలసీమంటే రాతుల మధ్యలో ఉన్న ప్రాంతము. కరువు, కాటకాలకు మాత్రమే చిహ్నంగా పేరుమోసిన ప్రాంతం. అయితే రాయలసీమ నేలకి శప్తభూమి అని పేరు పెట్టడానికి కారణాలను పాఠకులకు తెలియజేయాలన్నదే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

**2. శప్తభూమి నవల ఇతివృత్తం**

శప్తభూమి అంటే శపించబడిన భూమి అని అర్థం. శప్తభూమి నవల వర్ణనతో, ఊహలతో కల్పించిన రచన కాదు ఇది రాయలసీమ చారిత్రక కథా నేపధ్యంతో మొదలైన నవల. రెండు సంస్థానాల మధ్య వైరంతో మొదలైన కథ. (హండేరాజు) సిద్ధ రామప్ప నాయుడు అనంతపురం సంస్థాన దొర. తాడిమర్రి సంస్థాన రాజు రామప్పనాయుడు. 18వ శతాబ్దంలో రెండు సంస్థానాల మధ్య నీటిపారుదల కోసం ఏర్పడిన మినీ యుద్ధం. ఈ వైరంతో రక్తపాతం ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. మనిషి చెయ్యి, కాళ్ళు విడివిడిగా రక్తంలో పారుతున్న సంఘర్షణ అది. ఈ రెండు సంస్థానాలకు చుట్టుప్రక్కల ఉన్న ఎర్ర కొండాపురం, రాయలచెరువు, బాలకొండ, అగ్రహార గ్రామం, చెరువులోపల్లి, ప్యాపిలి, జొన్నగిరి చుట్టుప్రక్కల గుక్కపట్టేడ్చి మెడకు ఉరేసుకున్న పరిస్థితి వచ్చింది. రాయలసీమ ప్రాంతంలో తడి, తేమ లేక కరువు తాండవమాడుతున్న రోజులు మొదలయ్యాయి. తాడిమర్రి గ్రామ దుండగులు అనంతపురం సంస్థాన ఆధీనంలో ఉన్న బుక్కరాయసముద్రం చెరువుకి గండి పెట్టడానికి సిద్ధమయ్యారు. ఈ రెండూ సంస్థానాలకు సంబంధమే లేని చెరువులోపల్లి గ్రామ వాస్తవ్యుడు గొర్రెల కాపరి బిల్లే ఎల్లప్ప దుండగులను తరిమి కొట్టి బుక్కరాయసముద్రం చెరువుని కాపాడి వారిని అనంతపురం సంస్థాన రాజుకు పట్టించెను. దీనికి ప్రతిఫలంగా బిల్లే ఎల్లప్ప సాహస చర్యలను మెచ్చి అనంతపురం సంస్థాన రాజు సిద్ధ రామప్ప నాయుడు బిల్లే ఎల్లప్పకు జెట్టి పదవిని సమర్పించాడు. జెట్టి అంటే సైన్యాధికారి అని అర్థం. పదవిలో కొనసాగుతూ తనకు పదవిని సమర్పించిన రాజు కోసం ప్రాణత్యాగం చేసిన బిల్లే ఎల్లప్ప వీరుడి కథ ఇది. కరువు, వలసలతో పోరాడుతున్న సంస్థాన ప్రజల కోసం తన రాజు ఔన్నత్య పాలన కోసం శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని వర్షాన్ని ప్రసాదించమంటూ దానికి ప్రతిఫలంగా తన కాళ్లు, చేతులు, గుండె, మొండెంను భాగాలు భాగాలుగా మల్లిఖార్జున స్వామినికి అర్పించి ప్రాణ త్యాగం చేశాడు బిల్లే ఎల్లప్ప. అయినప్పటికీ శ్రీశైల మల్లిఖార్జునుడు వర్షాన్ని ప్రసాదించలేదు. ఈ సంఘటనతో రాయలసీమ భూమిపై ఒక్క వర్షం చినుకు కూడా స్పర్శించదని రాయలసీమ యదార్థ గాథని బండి నారాయణస్వామి వివరించాడు ఈ నవలలో.

**3. శప్తభూమి నవల – నామౌచిత్యం**

శప్తభూమి నవల వృత్తాంతమంతా గ్రామీణ ప్రాంతంలోనే కొనసాగింది. ఈ నవలలో చారిత్రక అంశానికే ప్రాధాన్యతనిస్తూ మూఢనమ్మకాలను విశ్వసించే ప్రజలకు సామాజిక, సామూహిక స్పృహ రావాలనే అంశాన్ని రచయిత తెలపకనే తెలిపాడు.

శప్తభూమి నవలలో రాయలసీమ ప్రాంతం శపించబడింది అని భావించడానికి కొన్ని ప్రధానమైన అంశాలు కనిపిస్తున్నాయి అవి :

**3.1 కరువులు**

కొండాపురం గ్రామంలో బాలకొండ బీరప్ప, ఉజ్జయినమ్మ భార్యాభర్తలు. వీరికి 2 సం॥ల ఆడపిల్ల మరియు 6 నెలల మరో చిన్న పాప. అది వైశాఖ మాసం కొండాపురం గ్రామం మొత్తం ఎడారిలా కనిపిస్తుంది. ఆకలితో ఉజ్జయినమ్మ కడుపు డొక్కల నుంచి వెనకటి వెన్నుముక కనబడుతుంది. ఇద్దరు బిడ్డలకు ఆకలితో గొంతు తడారి నోటమాట రాకుండాది. కరువును జయించాలంటే కొండాపురం వదిలేసి కొత్తపల్లికి వలస ఒక్కటే మార్గమని నిశ్చయించుకుని బయలుదేరారు. వెళ్ళే మార్గమధ్యంలో **"పుష్టిగా బలిసిన రాబందులు శవాల చుట్టూ బరువు బరువుగా గెంతుతున్నాయి. శవాల కళ్ళను పరమ ఇష్టంగా పొడుచుకుని తింటున్నాయి"** (నారాయణస్వామి బండి, శప్తభూమి, ప్రథమార్థం) బీరప్ప ఏదైనా తెచ్చి తన భార్యాబిడ్డల కడుపు నింపి కాపాడుకునేందుకు వాళ్ళని ఒక చెట్టు కింద కూర్చోబెట్టి తన కాళ్ళకి చెప్పులు లేకపోయినా కాళ్ళకు కొన్ని ఆకులు తెంపి చెప్పులుగా చుట్టుకొని ఆ ఎడారంతా తిరిగాడు కప్ప దొరికినా దాన్ని చంపితిని కడుపు నింపుకోవచ్చు అనుకున్నాడు కప్పలేదు. బల్లి లేదు, చీమ లేదు, పాము లేదు, ఉడత లేదు ఏ జీవి లేదు. ఏది కనిపించినా కడుపు నింపుకోవచ్చు అన్న ఆశతో చెట్టెక్కాడు బీరప్ప. పుట్టెక్కాడు బీరప్ప. రాళ్ళల్లో వెతికాడు, గుంతల్లో చేయి పెట్టి లాగాడు, ఏ జీవి లేదు ఏ పదార్థం లేదు తినడానికి, దూరంగా ఏదో సింహం గర్జించినంత శబ్దం వినిపించింది భయపడ్డాడు అయినా ఆ సింహాన్ని చంపైనా ఆకలి తీర్చుకోవాలన్న ఆశతో దాన్ని వెతకసాగాడు. కానీ అక్కడ సింహం కాదు వృద్ధురాలు నగ్నంగా చెట్టుకింద కూర్చున్న 80 ఏళ్ళ మతిస్థిమితం లేని ఓ పిచ్చి వృద్ధురాలు. చేతిలో చనిపోయిన ఒక కుందేలుని పీక్కుతింటుంది ఆమె. కొన్ని రోజులుగా ఎండిపోయిన ఆ పెదాలతో ఆ వృద్ధురాలు కుందేలుని తింటూ ఉంటే రక్తపు చుక్కలు మట్టి కడుపులో బొట్టు బొట్లుగా పడుతున్నాయి. ఆ కరువు భూమి రక్తపు చుక్కలను మెల్లగా ఆస్వాదిస్తుంది. ఆమె రక్తాన్ని నోటితో జుర్రుతూవుంది. కుందేలు వెంట్రుకలు నోటికి అడ్డుపడుతూ ఉంటే ఆ వెంట్రుకలని థూ థూ అని ఉమ్మేస్తుందామే. కుందేలును ఆశగా చూశాడు బీరప్ప. ఆమెను ఒక కట్టెతో కొట్టి ఆ కుందేలును లాక్కొని వెళ్ళాలని అనుకున్నాడు కానీ ఆత్మాభిమానం అడ్డొచ్చింది చేసేదేమీ లేక భార్య పిల్లల్ని కాపాడుకోవాలన్న సంకల్పంతో ఆమెని తలమీద గట్టిగా కొట్టి ఆ కుందేలు శవాన్ని లాక్కొని పరిగెత్తసాగాడు బీరప్ప. ఈ సంఘటనతో రాయలసీమ ప్రాంతంలోని కరువు ఏ ఉద్రిక్తతను నెలకొల్పిందో అర్థం అవుతుంది. మనిషిని మనిషి చంపుకు తినడం ఇదే కాబోలు అంటారు రచయిత బండి నారాయణస్వామి.

**3.2 వలసలు**

కొత్తపల్లి గ్రామ కరువుల వలస మొదలైంది. గొర్రెల కాపర్లు గొర్రెలను తోలుకుంటూ వెళ్తున్నారు. కుంటి గొర్రెలని, అప్పుడే పుట్టిన గొర్రెపిల్లల్ని, భుజానికెత్తుకొని కాళ్లు ఈడ్చుకుంటూ బయలుదేరారు. వలస వెళ్ళే మార్గంలో ఆడవాళ్లు, పసిపిల్లలకు పాలు ఇవ్వడానికి చనుల నుంచి పాలు రాక తమ రెండు చేతులతో చనులను గట్టిగా పిండి వచ్చిన రక్తపు చుక్కతో పసిపిల్లల గొంతులను తడుపుతున్నారు. వీళ్లంతా మళ్ళీ తిరిగి వచ్చేది బీరప్ప పసర రోజే. పుష్కరం తర్వాత బీరప్ప పసర జాతర రానే వచ్చింది. నలుమూలల అడవి ప్రాంతాలకు వలస వెళ్లిన గొల్లలు పుష్కరం తర్వా వాళ్ళ బంధువులను ఇంటివాళ్ళను చూస్తూ కౌగిలించుకొని ఏడుస్తున్నారు.

**"అన్నా పెద్దమ్మ కనిపించదే? అత్త మామ కనిపించదే?**

**ఇంకెక్కడి పెద్దమ్మ రా తమ్ముడా! ఇంకెక్కడి మామ రా అల్లుడా! పండెండేళ్ళల్లో చనిపోయినారు"** (నారా సింహాన పల్లె సావులు కథ) అని తలుచుకొని గుండెలు బాదుకుంటున్నారు. చావు కబుర్లు కొత్తగా విన్నవారు తలపట్టుకుని కూలబడుతున్నారు. గతాన్ని చెప్పుకుంటూ సంఘటనలను వివరిస్తూ దగ్గరవుతున్నారు. ఈ సంఘటనతో బ్రతుకు కోసం కుటుంబ

బాంధవ్యాలను కొద్దిరోజుల పాటు దూరం చేస్తూ వలస వెళ్లి బతకడానికి ప్రయత్నిస్తూ అనుకోని సంఘటనల ద్వారా ప్రాణాలు కోల్పోయి ఆ బంధు బాంధవ్యాలను శాశ్వతంగా కోల్పోయారని కళ్ళ ముందు చిత్రీకరణ జరుగుతుంది.

**3.3 ఆర్థిక స్థితిగతులు**

కొండాపురం గ్రామానికి వీరనారాయణరెడ్డి దొర. ఇతని పెద్ద కొడుకు నల్లారెడ్డి, చిన్న కొడుకు ఎర్రనాగిరెడ్డి కొండాపురం గ్రామంలోని స్త్రీ పురుషులకి ఉపాధి కల్పనలో వీరనాగిరెడ్డిది ఆధిపత్యం సాగుతుంది. కూలీల చేత పొలంలోని వరి పంట కోయించి వాటిని ధాన్యంగా మార్చి బస్తాలకి ఎక్కించే పనిని నల్లా నాగిరెడ్డి, ఎర్ర నాగిరెడ్డి చేయిస్తుంటారు. వడ్లు, కంది, పెసర, మినుము ధాన్యాన్ని బస్తాలలోకి ఎక్కించే పని కేవలం స్త్రీలకు మాత్రమే అప్పగిస్తారు. కూలీకి వచ్చిన స్త్రీల పట్ల నల్లా నాగిరెడ్డి, ఎర్ర నాగిరెడ్డి దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ చీకటి గదిలోకి వడ్లబస్తాలు లెక్కపెట్టి రమ్మని ఆడవాళ్ళని పంపించి వారిపై లైంగిక దాడికి పాల్పడతారు. ఆడోళ్ళకు ఎక్కువ కూలీ ఇస్తానని మభ్యపెడతారు ఒప్పుకోని స్త్రీలని ఆ చీకటి గది నుంచి బయటికి రానివ్వకుండా తాళ్ళతో కట్టిపడేసి బలవంతంగా అనుభవిస్తారు. పెళ్లి చేసుకుంటానంటూ చిన్న కొడుకు ఎర్ర నాగిరెడ్డి నీల రెడ్డమ్మని నమ్మించి శారీరకంగా దోచుకుని ఆమెపై వ్యామోహం తగ్గిన తర్వాత ఆమెకీ తనకి సంబంధం లేనట్టు తెగదెంపులు చేసుకున్నాడు. కొడుకులు మాత్రమే కాదు తండ్రి వీరనాగిరెడ్డి కూడా అదే కోవకు చెందినవాడు. ఆర్థికంగా కూలీలను, గ్రామ ప్రజలను, సైనికులను, వ్యవసాయదారులను దొరలు, అధికారులు దోచుకుంటున్న సంఘటనలు తారాస్థాయిలో కనిపిస్తాయి ఈ నవలలో.

బీరప్ప ఉజ్జయినమ్మ తమ ఇద్దరి బిడ్డలను సాదుకునే స్తోమతలేక ఒక బిడ్డను అమ్ముకోవాల్సిన పరిస్థితికి వచ్చారు. ఏమి చేయలేని నిస్సాహాయ స్థితిలో చిన్న పాపను పద్మసాని అనే వేశ్యకు 50 రూ.లకు అమ్మివేసినారు.

**"లాలీ లాలీ లాలీ....!!**
**లాలెమ్మా లాలీ.....**
**ఎడవాకూ ఏడవాకూ ఎర్రనాతల్లీ....**
**ఏడిస్తే నిన్ను ఎవరు ఎత్తుకుంటారు.....**
**ఏడిస్తే నీ కళ్ళు నీలాలుకారూ...**
**నీలాలు కారితే నే చూడలేనూ..."** (నారాయణస్వామి బండి, శప్తభూమి, ద్వితీయార్థం, భాగం 25). అంటూ పాపను ఆడిస్తూ ప్రేమగా పెంచుకుంటుంది పద్మసాని.

**3.4 రాజకీయ పరిస్థితులు**

సిద్ధ రామప్ప నాయుడు అనంతపురం సంస్థాన దొర. ఈయన గుత్తి సుబేదారునికి 25 లక్షలు చెల్లించేది ఉంది. వాటిని ఎట్లా చెల్లించాలి కరువు కాటకాలతో వున్న ప్రజలకు ధాన్యమంతా పంచిపెట్టాడు. వచ్చిన ఆదాయాన్ని వచ్చినట్లుగా ప్రజలకి, సుబేదారునికి పంచుతూనే ఉన్నాడు. కానీ సుబేదారుకి ఇంకా చెల్లించవలసిన ఖాతా ఎక్కువ ఉంది. చెల్లించకపోతే సిద్ధ రామప్ప నాయుడుని ఆ సంస్థాన కోట యొక్క తాళాలను అప్పగించి మోకాళ్ళ మీద నిలబడి క్షమించమని బ్రతిమాలి చాకిరి చేయాలని హెచ్చరించాడు గుత్తి సుబేదారు. సిద్ధ రామప్ప నాయుడు సైన్యాధికారి అయిన జెట్టి బిల్లే ఎల్లప్ప దొరికి అండగా నిలిచాడు కానీ ఆర్థికంగా సహాయపడలేకపోయాడు కారణం తెలిసిన విషయమే కరువు. జెట్టి బిల్లే ఎల్లప్ప తన సైన్యంలోని సైనికులకి ఆయుధాలు ఇచ్చి పొరుగూరైన తాడిమర్రి గ్రామంలోని ఆర్థిక సంపాదనని కొల్లగొట్టాలని హెచ్చరించాడు.

అనంతపురం సంస్థాన సైనికులు తాడిమర్రి గ్రామం పైన విరుచుకుపడ్డారు. దొరికిన ఆడవాళ్ళ మెడలోని తొలుసులు, చేతి గాజులు, కాళ్ళ కడియాలు, మెట్టెలు, తాళిబొట్టు, ఇంటిలోని కంచు, బంగారం, ఇనుప తలుపు గొళ్ళెం, వంట పాత్రలు, ధాన్య బస్తాలన్నింటిని దోచుకొని అనంతపురం సంస్థానానికి ధారాదత్తం చేశారు సైనికులు. తాడిమర్రి రామప్ప నాయుడు దీనికి ప్రతిఫలంగా అనంతపురం సంస్థానంపై ప్రతిదాడికి దిగాడు ఇది ఇప్పటి సంఘర్షణ కాదు బుక్కరాయలు చెరువు కోసం

వందేళ్ళ క్రితం ఏర్పడిన వైరం. ఈ సంఘటనతో ఈ రెండు సంస్థానాల మధ్య వైరం మరింత ఉద్రిక్తతకు లోనై మరో రక్తపాత యుద్ధానికి దారి తీసింది.

**3.5 లోపించిన ప్రజల చైతన్యం**

ఎర్ర కొండాపురం వీర నారాయణరెడ్డి తన కుమారులైన నల్ల నాగిరెడ్డి, ఎర్ర నాగిరెడ్డి స్త్రీల మీద చేసిన లైంగిక దాడిలో స్త్రీలలో చైతన్యం లేకపోవడం వలన చీకటి గదిలో బంధించబడిన స్త్రీలకు రక్షణ లేకుండా పోయింది. స్త్రీలలో చైతన్యమే ఉంటే ఉన్మాద చర్యకు ప్రతిచర్య జరిగేది. కానీ స్త్రీలలో చైతన్యము, శారీరక బలం, మానసిక ధైర్యం లేకపోవడం వలన ఈ శారీరక లైంగిక దోపిడి సాగుతూనే ఉంది. తాడిమర్రి గ్రామంలో జరిగిన దోపిడీలో ప్రజలలో చైతన్యం లోపించడం కారణంగానే దుండగులు వారి ఆర్థిక వనరులను దోపిడీ చేయగలిగారు ప్రజలలో చైతన్యము బలంగా ఉంటే దుండగులపై ప్రతి చర్య జరిగి వారి ఆస్తులను, ఆర్థిక సంపదను రక్షించుకునే అవకాశం ఉండేది. ప్రతి ఏడు వలస వెళ్ళే ప్రజలు వారిలో చైతన్యాన్ని నెలకొల్పి ఉంటే నీటిపారుదల గల ఒక ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని ఆ సంస్థాన రాజుతో ఒప్పందాలు చేసుకునేవారు కానీ వారిలో అవగాహన చైతన్యం లోపించింది. అక్షరాస్యత లేకపోవడం వలస కూలీ పనికి వెళ్ళే కూలీలు తమకు వచ్చిన సంపాదన లెక్కపెట్టే క్రమంలో ఆర్థిక దోపిడీకి లోనయ్యారు. ప్రజలలో చైతన్యం సామూహిక, సాంఘిక స్పృహ లేనందువల్ల రాచరిక, అరాచకీయలకు, దోపిడీకి లోనవుతున్నారు. ఆనాటి రాయలసీమ ప్రజలు.

**3.6 మూఢాచారాలు**

శప్తభూమి నవలలో మూఢాచారాలు అధికంగా కనిపిస్తున్నాయి. ప్రాణత్యాగం చేయడం, కులాంతర వివాహాలు చేస్తే మరణం సంభవిస్తుందని నమ్మడం, సతీసహగమనం చేయకపోతే మరికొన్ని రోజుల్లోనే వితంతువు మరణిస్తుందని విశ్వసించడం తారా స్థాయిలో కనిపిస్తుంది.

1) జెట్టి బిల్లే ఎల్లప్ప శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని కొలిచి తన సంస్థానంలో వర్షం కోసం ప్రార్థించి తన శరీరంలోని అంగాంగం స్వామికి అర్పించి తన ప్రాణాన్ని త్యాగం చేశాడు. **"అష్టదిశలలోని అష్టభైరవుల్లారా! నా అష్టాంగల రుధిరంతో మిమ్మల్ని అభిషేకిస్తాను, ఆరాధిస్తాను, నా దేవుని కోసం నేను ఇట్ల, నా మాంసాన్ని ఖండిస్తున్నాను"**[2] (నారాయణస్వామి బండి, శప్తభూమి, ద్వితీయార్థం) అంటూ ఎల్లప్ప గండకత్తెరతో తన శరీర భాగాన్ని ఖండించుకున్నాడు.

2) బీరప్ప పసర రాయలసీమ ఆచారం ఉత్సవం. ఈ బీరప్ప పసర జాతరలో జంతుబలులు అధికంగా కనిపిస్తున్నాయి. గొర్రెలు, పొట్టేలు, మేకలు, దేవర దున్నపోతుల తలలను కోసి ఆ రక్తాన్ని బీరప్ప స్వామి విగ్రహంపై కుమ్మరించి చుట్టుప్రక్కల గొర్రె, మేక, దున్నపోతు కాళ్ళను పేర్చి పసుపూ కుంకుమ వేపాకులతో నీళ్ళు చల్లి గ్రామస్తులంతా దర్శనం చేసుకుంటారు. ఆ ఊరంతా ఆరోజు జాగారం చేయాలి జాగారం చేయని ఏ కుటుంబమైనా ఆ సంవత్సరం పాటు ఆర్థికంగా మానసికంగా మరియు ప్రాణ నష్టం కూడా జరుగుతుందని విశ్వసించేవారు.

3) అగ్రహార గ్రామం దొర నాగప్ప ప్రగడ సతీసహగమనం పట్ల అత్యంత మక్కువ గలిగిన వ్యక్తి. తన సవతి తల్లి కూతురు బాల్యంలోనే వితంతువు కావడం వలన ఆమెను ఖచ్చితంగా సతీసహగమనం చేయించాలని ఉత్కంఠ కలిగినవాడు. 12 ఏళ్ళ పసి వితంతువు సతీసహగమనం చేయాల్సిన రోజు వచ్చింది. ఆ బాల్య వితంతువు సహగమనానికి వ్యతిరేకిస్తూ ప్రాణాన్ని కాపాడుకోవడానికి ఊరు వదిలి పారిపోతుంది. నాగప్ప ప్రగడ దాసీలతో ఇలా అంటున్నాడు.

**"ఏమి చేస్తున్నారు మీరు పట్టుకోండి"**

పాప కిందికి వేలాడబడి నేలకేసి కాళ్ళు తప తప కొడుతుంది.

**"నేను రాను నేను రాను"** అని బోరున ఏడుస్తుంది.

**"చూస్తారేమిరా పట్టుకొని తోయండి"** అంటూ మంటల్లోకి తోయించాడు నాగప్ప.

అమ్మా అనే అరుపులను కూడా కాలే కట్టెలు మూసివేసినాయి. (నారాయణస్వామి, శప్తభూమి, భాగం 17)

4) అగ్రహార గ్రామంలో చాలా వింతైన మూఢాచారాన్ని బలంగా విశ్వసించే వాళ్ళు గ్రామస్తులు. పెళ్లైన కొత్త జంట బీరప్ప పసర రోజు గ్రామస్తులందరికీ అన్నదానం చేసి నూతన వధూవరులిద్దరూ తల నీలాలు తీసి గుండు చేయించుకోవాలి. పెళ్లైన కొత్తజంట గుండు చేయించుకోకపోతే వారికి సంతానం కలగదు. గ్రామానికి కరువు సంభవిస్తుందని విశ్వసించే ఆచారం ఆ గ్రామంలో పతాక స్థాయిలో ఉంది.

**3.7 కుల వ్యవస్థ**

కంబలి శరబడు ఎర్ర కొండాపురంలోని మాదిగ వంశానికి చెందిన సామాన్యుడు. ఎర్రకొండాపురంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే వివిధ రకాలైన దళిత కులస్తులు వ్యాపారం కోసం గ్రామంలోకి ప్రవేశించవచ్చు. సాయంత్రం ఆరు తర్వాత ఆ గ్రామంలో దళితులకు ప్రవేశం లేదు దళితులు గుడిసెలంతా ఎర్రకొండాపురం గ్రామ పొలిమేరలో మాత్రమే ఉంటుంది. కంబలి శరభుడు ఆహార ప్రియుడు అమాయకుడు. ఇతను నిబంధనలను ఉల్లంఘించిన ఎర్రకోండాపురంలో ప్రవేశించినందుకు **"సగం గుండు గీయించి, సగం మీసం గొరిగించి ఆపైన ఎర్రకొండాపురం అమరనాయక మండలం నుండి శాశ్వతంగా బహిష్కరించారు"** (నారాయణ స్వామి బండి, శప్తభూమి, ప్రథమార్థం) ఈ సంఘటన ఆ కాలం నాటి అగ్రకులాల దౌర్జన్యాన్ని, దళిత కులాధీన, నిరాధికార స్థితిగతులను వివరిస్తుంది.

**3.8 బీరప్ప పసరా**

ఈ జాతర ప్రత్యేకత వలస వెళ్లిన కులవృత్తుల వారంతా పుష్కరానికోసారి కలుసుకునే మహత్తరమైన కుల సాంస్కృతిక ఉత్సవం. కురుమ లేదా కురులు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఒక కులం, కురుమ ప్రజలు బీరయ్యను తమ కుల దైవంగా పూజిస్తారు. కురుమలు బీరయ్య పట్నాలు అనే పండుగను జరుపుకుంటారు. ఇది ప్రతి 12 సంవత్సరాలకొకసారి జరుపుకునే కురువ తెగల మహత్తర ఉత్సవ వేడుక. కురవ సమాజంలో ఇదే అతి పెద్ద పండుగ. దీనిని కురువల ఆచార ప్రధాన ఘట్టం అనవచ్చు పైన పేర్కొన్న అంశాలన్నీ రాయలసీమ ప్రాంతంలో నేటికీ కనిపిస్తున్న దృశ్యాలే.

**"చుక్క రాలదు నేల తడవదు**
**మొక్క పుట్టదు చెట్టు ఎదగదు**
**చుట్టూ క్షామం ఎక్కడాలేదు క్షేమం**
**క్షామం ఉన్న నేల క్షమం లేని చోటు మనిషికి శాపమే కదా?"** కనుక ఇది శప్త భూమేనని భావించాలి అని అంటారు ఎన్.వి. కృష్ణారావు.

**4. శప్తభూమి నవల సామాజిక సందేశం**

సాంకేతి పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు చేస్తున్న సువిశాల జ్ఞాన సుసంపన్నమైన దేశం మనది. కులమతాలకు అతీతంగా సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక చైతన్యానికి చిహ్నంగా ప్రపంచ నలుమూలలా ఖ్యాతిని విస్తరింపజేస్తున్న ఉపఖండం మనది. ప్రకృతి పంచభూతాలను దైవంగా స్వీకరించి వాటి రక్షణకై చట్టాలు, చర్యలు, నియమ నిబంధనలు రూపొందించుకున్న రాజ్యాంగం మనది. ఇంతటి విశిష్టత ఉన్న **"మన భారతదేశంలో కులమతానికి అగ్రతాంబూలాన్ని ఇచ్చి స్వీయ, సామూహిక నరహత్యలు చేస్తున్న సంఘటనలు ఇప్పటికీ అక్కడక్కడ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి."** కత్తి పద్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. (కులం అంటే ఏమిటి, కత్తి పద్మారావు) కత్తి పద్మారావు దళిత చైతన్య సభ (విజయవాడ) ఉపన్యాసం ప్రకారం స్త్రీ మాతృమూర్తిగా భావించే ప్రస్తుత సమాజంలో... ఇప్పటికీ వీర నారాయణ రెడ్డి, నల్లా నాగిరెడ్డి లాంటి ఆరాచకులు అక్కడక్కడ సమాజంలో వెలుగులోకి వస్తూనే ఉన్నారు. ప్రజలలో చైతన్యం లోపించడం కారణంగానే అణగారిన వర్గాలవారు అధికార వర్గాలను ధీటుగా ప్రశ్నించలేకపోతున్నారు. బీరప్ప పసర రాయలసీమ జానపదుల పవిత్రమైన ఆచారమే అయినప్పటికీ

నరబలులు, జంతుబలుల కారణంగా అపవిత్రం జరుగుతుందన్న విషయం సమాజం గుర్తించాలి. పురాతన ఆచార వ్యవహారాలను విశ్వసించాలి, గౌరవించాలి, పాటించాలి వాటి పేరుతో జరిగే మోసాలు, అన్యాయాలు, నరబలులను, జంతు బలులను నిషేధించాలి. కరువు ప్రాంతాలలో వర్షం పడదనే భావన నుంచి వైదొలగి ప్రకృతి రక్షణకు పాటుపడాలనే గూఢార్థాన్ని గ్రహించాలి. ఆదిపత్యం కోసం యుద్ధమే శరణమనే భావాన్ని విస్మరించి సంధి, ఒడంబడికలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**ముగింపు**

శప్తభూమి నవల రాయలసీమ చారిత్రక నేపథ్యంతో ముడిపడిన కథల సంకలనం. ఈ నవలలో దాదాపు 95 పాత్రల చిత్రీకరణ జరిగింది. ఏ కథలోనైనా కథానాయకుడు ప్రతినాయకుడు ఉంటారు. కానీ ఈ నవలలో ఏ పాత్రలు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఏ పాత్రకు ప్రాధాన్య లోపించలేదు. "రాయలసీమ ఆచార వ్యవహారాలను సూచిస్తూ రాయలసీమ ఆహార వంటకాలను పరిచయం చేస్తూ, రాయలసీమ కులవృత్తులను చూపిస్తూ, రాయలసీమ సంస్కృతిని, అరాచక పరిస్థితులని, రాయలసీమ నేల, కరువు వలసలను" (విఆర్ రాసాని వలస నవల) అని, వి.ఆర్ రాసాని వలస నవలలో శప్తభూమిని ఉద్దేశించి చెప్పిన విధంగా పాఠకుని మనసుకి, కళ్ళకు అద్దంపట్టేలా బండి నారాయణస్వామి ఈ నవలను చిత్రీకరించారు. స్త్రీల పట్ల చులకన భావం, స్త్రీలు కేవలం శారీరక సుఖం కోసం మాత్రమే ఉపయోగపడుతారాన్న అహంకార భావాన్ని ఆ కాలం నాటి రాజకీయ అరాచకీయ పురుష ఆధిక్యం చలామణిలో ఉండేదని దేవదాసీ మరియు వేశ్య వృత్తిలో కొనసాగుతూ ఆ వృత్తిపై ఇష్టం లేకపోయినా తన జీవితాన్ని, కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టడానికి శరీరాన్ని బలవంతంగా అమ్ముకోవలసిన పరిస్థితులు మరియు స్త్రీల మానసిక స్థితిగతులను బండి నారాయణ స్వామి మహోన్నతంగా వివరించారు.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. నారాయణ స్వామి బండి, శప్తభూమి నవల (2022), అన్విక్షకి పబ్లిషర్స్ ప్రై.హైదరాబాద్
2. రామకృష్ణారెడ్డి దేవిరెడ్డి, తెలుగు సర్వస్వం 2012 (బుక్–3),పెన్నేటి పబ్లికేషన్స్, కడప
3. రామలింగారెడ్డి కాటంరెడ్డి, తెలుగు అధ్యాపక విజయం (2019), అక్షర పబ్లికేషన్స్ కర్నూల్
4. వెంకటసుబ్బయ్య వల్లంపాటి, నవల శిల్పం (2021) నవచైతన్య పబ్లికేషన్స్, విజయవాడ
5. ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య సమీక్ష (2019) వాగ్దేవి ప్రెస్, హైదరాబాద్
6. రాసాని వి.ఆర్. వలస నవల (2021) విశాలంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ
7. భార కుప్పయ్య బండి నవలు, మాండలిక సంభాషణలు (2022) ధాత్రి పబ్లికేషన్స్, కర్నూల్

# "పాలమూరు పాలపిట్ట" గోరటి వెంకన్న వల్లంకితాళం

**బానోత్ వెంకటేశ్వర్లు**, తెలుగు పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

ప్రపంచవ్యాప్తంగా వున్న గొప్ప ప్రజావాగ్గేయకారులు స్ఫురణలో కొచ్చినప్పుడు, గోరటి వెంకన్న గుర్తుకొస్తాడు. లేదు గోరటి వెంకన్న గుర్తుకొచ్చినప్పుడు – విశ్వ ప్రజావాగ్గేయకారులు గుర్తుకొస్తారు. కొన్ని వేల సంవత్సరాల దేశసంచారుల, బైరాగుల, భక్తికవుల సారమంతా వారసత్వమంతా వెంకన్న పుణికిపుచ్చుకున్నాడు. ఒక ఆశ సాంప్రదాయపు జీవలక్షణాన్ని, తాజాదనాన్ని తత్కాలపు మేలిమి గుణాల్ని అందుకున్నాడు. పాటలని దృశ్యకావ్యంగా, అద్భుతంగా మలిచినవాళ్ళు జనజీవన వాగ్గేయకారులు.

ఈ సుదీర్ఘ ప్రయాణంలో వెంకన్న ఈ ఉన్నత స్థాయినందుకున్నాడు. పాటకి ఒక శాశ్వతత్వన్ని అద్భుతమయిన అందాన్ని లాలిత్వాన్ని మృదుత్వాన్ని, ఒక గొప్ప మెలకువను తను ప్రసాదించాడు. జీవితమంత సునిశితంగా, లోతుగా, గంభీరంగా, ధైర్యంగా అన్నిరంగుల మేలిమికలయికని ఈ దశలలో వెంకన్న పాట అందుకుంది. ఆయన స్పృశించని కోణం లేదు. ప్రకృతిని యింతగా సంలీనం చేసుకున్న కవి అరుదుగా కనిపిస్తాడు.

వెంకన్న పాటలు విన్నాక మనలో మనం దృశ్యమానం చేసుకున్నాక, మన రూపురేఖలే మారిపోతాయనుకుంటా. తీయని సుగంధాన్ని దేన్నో వెదజల్లుకుంటూ వెడతాడనుకుంటా. ప్రతి అంశంలోనూ అందాన్ని, శోభని చూడగల సౌందర్యవాది. సౌందర్యవాది తాత్త్వికుడయితే వెంకన్నలా వుంటాడు. తెలంగాణ మరో స్కాట్లాండ్ గోరటి వెంకన్న మరో రాబర్ట్ బర్న్. అందుకే స్కాటిష్ కవి బర్న్ తన జన్మభూమి స్కాట్లాండ్ కీర్తిగానం చేసినట్లే, పాలమూరు కవి వెంకన్న తన పురిటిగడ్డ తెలంగాణ అస్తిత్వ పరిరక్షణకు దాని గుణగానం చేశాడు, చేస్తున్నాడు. గోరటి మార్గతత్త్వం, దేశికవనం బతకాలి. బతుకుతుంది కూడా.

**"అందాల తనువెల్ల వంపుకున్న అడవి**
**అలరించి తలపించె ఆకుపచ్చని కడలి"**

షెల్లీ సముద్రాన్ని 'వాటర్ మెడో' అన్నాడు. అలవోకగా అద్భుతమయిన ఇమేజెస్ పడుతూవుంటాయి. అవి జీవితం నుంచి, ప్రకృతినుంచి, పరిసరాలనుంచి నేరుగా వచ్చాయి. చాలా అపురూపంగా, హాయిగావుంటాయి. మనదయినతనమేదో వాటికంటుకుని ఉంటుంది. 'నీడల ఊడ' అనే పాట చూడండి.

**"పూసిన పూలకు దోసిలొగ్గితె వాసన పరిమళమెంపు నుర**
**కోసి మెడలో వేసుకు తిరిగితేవాడి తాడయి మిగులునురా"**
**జీవనసారం నిలుపుకున్న పామరులే నిజసిద్ధులుగ**
**బావిల కప్పల బెకబెక అరిసే బోధకులెర్రి మొద్దులుర"**

వెంకన్న సారం నిలుపుకున్న, వడకట్టిన సిద్ధుడుగా పరిణామం చెందుతూ వస్తున్నాడు. 'నల్లతుమ్మ చెట్టు' గాని, 'బెదలగువ్వ' గాని, 'కానుగ నీడ' గానీ, ఏ పాటయినాసరే తనే పాటలా బయటికొస్తాడు. 'సిగమొగ్గ' పేరుతో ఉత్తరాంధ్ర మీద గొప్పపాట కట్టాడు. ఉత్తరాంధ్ర చరిత్రని, దాని పోరాట పటిమని, దాని నైసర్గిక స్వరూపాన్ని, దాని జీవతత్త్వాన్ని అద్భుతంగా పట్టుకున్నాడు. ఎప్పటికప్పుడు పుట్టుకొచ్చే సంఘటన మీద రాసినా, దాన్నొక తాత్త్విక స్థాయికి తీసుకెళ్ళేనేర్పు, దాన్నొక కవితగా మలిచే గాఢత, వెంకన్నలో పుష్కలంగా వుందని ఈ సంపుటి రుజువు చేస్తుంది.

**"తెలిసిన దారిని మరిసి**
**తెలియక నడిసితె హోయి**
**వలసిన మురిపాల నొదిలి**
**నడిసి పోవ కలల కదిలి"** – 'మరపు'

'పిట్టగొరికిన పండు'ను పోలిన పాటలు ఈ పుస్తకం నిండా. అందుకే అవి తీపి. 'కొండ వాలున రాలిన కొసరు సినుకులబొట్లు' ఈ కైతలు. వయసు మీరిన పెద్దవాళ్ళు మాట్లాడే కృతకమైన మృతభాషను చిటికెలో చేతితో తుడిచివేసే సాధనాలు ఇవన్నీ. తెలివిమీరిన కవుల పరిభాషలను తెగనరికే సునిశిత శాస్త్రాలు అన్నీ చదువుకుని చెడిపోయిన వారికి కవి చేసిన ప్రకృతివైద్యం ఇది. మనల్ని మన బాల్యంలోకి వేలు పట్టుకొని తీసుకుని వెళ్ళే తత్త్వాలు ఇందులో అడుగడుగునా తారసపడతాయి. బడికి వెళ్ళి నేర్చుకున్న చెత్తను వదిలించుకునే వెసులుబాటును "వల్లంకితాళం" మీకు కల్పిస్తుంది

"నల్లంచు రవిక వల్లంకిపిల్ల" ను చూడగోరే వారికే ఇందులో ప్రవేశార్హత. భాష సొగసులను వినగోరే వారికి బహిరంగ ఆహ్వానం ఈ పుస్తకం. మెలకువ నుంచి కలలోకి, జ్ఞాపకం నుంచి మరుపులోకి వెళ్తే/వెళ్ళగలిగితే తప్ప విముక్తి సాధ్యపడదనే తాత్త్వికతను మీరు ఇందులో దర్శింపవచ్చు. దీని సారాంశం కూడా అదే.

**"కలను చెరిపి ఎదను**
**కదిపె మెలకువ కన్న**
**కలలుగనె కునుకులో**
**ఇలను మరసితె మేలు"** – 'కవికోవెల'

మెలకువ నిద్రలేమిగా, జ్ఞాపకం గుదిబండగా మారిందని కవి సూచన. మెలకువలో మనిషి చేస్తున్న పని వ్యర్థ కలాపంగా, జ్ఞాపకం ముందరి కాళ్ళకు బంధంగా మారిన వైన్యాన్ని సహించలేని అసహనం కవిని ఈ ప్రతిపాదనకు పురిగొల్పింది.

**"తాళిబద్ద నాటినుంచె**
**తానుజిక్కె కంచెల**
**పెనవేసిన పసుపుతాడె**
**తనమెడకొక పాముల**
**అనుమానపు నీరు తగిలె**
**అనురాగపు తేనే పగిలె"** – 'కటుకావర'

పెండ్లైన రోజునుండి ఆమెకంచెలో పడ్డట్లయింది. భర్త కట్టిన పసుపుతాడు పాములా మారి కాటు వేస్తున్నది. సూజావుగా సాగవలసిన దాంపత్య జీవితం, పురుషాధిపత్యం కొరకై అనుమానించి అవమానపరచడం పురుషాధిపత్యాన్ని పై పాటలోని పంక్తుల ద్వారా కవి స్త్రీ జీవనంలోని బాధమయ సందర్భాలను ఉటంకిస్తున్నాడు.

**"సాటి మనిషి నెలివేసి**
**వేటి కంత ఎగిసేవు**
**నీకు నీవె ఎక్కువని**
**ఎలా పొంగి పొయ్యేవు"** – 'వెలిగుడి'

ఈ గీతం అధికులమని, అధిక కులమని విర్రవీగే అమానవీలకు సూటిగా గుచ్చుకునేలా ధర్మాగ్రహంతో, ఆవేదనతో ఆలోచనాత్మకంగా, అతి సహజంగా, సరళమైన భాషలో అలతి అలతి పదాలతో కూర్చబడింది.

**"అద్దాల అంగడి మాయ**

**దాని సూపుకు నరుని బతుకు**

**బొంగరమై పాయెర"** –'అద్దాల అంగడి'

బహుళజాతి కంపెనీలు నడిపే మార్కెట్ సంస్కృతిని, కవి ఇక్కడ 'అద్దాల అంగడి' అంటున్నాడు. వస్తువు అవసరం లేకపోయినా కొనేదాకా మనసును నిలువనీయదు అదే మార్కెట్ సంస్కృతిలోని ప్రత్యకత. ప్రపంచీకరణ పారిశ్రామికీకరణ వలన ప్రకృతి విధ్యంసమైన దీన దృశ్యాలను వివరిస్తూ 'దిగులుగుడు' పాటలో "మనిషి చేసిన లోభిచేతకు మట్టిపై అలమబ్బు కోసం/నెర్రెల జడలతో నెలరూపె మారె యిదెవరి పాపం" అంటూ ప్రశ్నిస్తాడు. ప్రకృతికి సంబంధించిన పాటలు ఎన్ని రాసినా ఇంకా రాయాలని తపించే ప్రకృతి కవి వెంకన్న. ఆయన రాసిన మరో బహుళ ప్రజాదరణ పొందిన పాట "నల్లతుమ్మ" అంటూ పల్లెల చిరునామాను చెప్పిస్తాడు.

"తల్లివోలె పాదాలను / తడుముతున్నదీ పయనం/ మళ్ళీ పసితనములోకి మలుపుతున్నదీ సమయం అంటూ సంచార ప్రీతిని 'సీకటి బయలు' పాట ద్వారా ప్రకటించుకున్నాడు కవి.

**"మెరుపులాంటి పదములకు**

**మరుపనేది ఒక వరం**

**కలల పలవరింతవోలె**

**కవిత గొంతునొలకాలె".** – 'మరపు'

తాత్వికునికి, కార్యసాధకునికే కాదు కవికి కూడా మరపు ఆయువుపట్టు. కవి స్వానుభవం నుంచి చేసిన ప్రతిపాదన ఇది. చిన్ననాటి నుంచి పెరిగి పెద్దయ్యేదాకా తాను చదివిన కవిత్వాన్ని మరచి పోకుండా వుండి వుంటే వెంకన్న నుంచి 'వద్ది మద్దెల మీద వల్లంకితాళాలు' వెలువడేవి కావు. "అడివే పోయినంక బతికేమి ఫలం" (శివుడా...) అంటూ మన ఆదివాసులు చెంచులతో జతకలిసి వెంకన్న నుడివిన మాట నాగరికులకు కనువిప్పు. "కలల పలవరింత. కవిత గొంతునొలకాలె" అని చెప్పగల దారుఢ్యం మహాకవి శ్రీశ్రీ తరువాత మళ్ళీ ఇన్నాళ్లకు మనం గోరటి వెంకన్నలో చూస్తున్నాం.

'సిద్దుల ఎరుక', 'నీడలఊడ', బెడలగువ్వ', 'తుమ్మచెట్టు', 'కానుగనీడ', 'కావికోవెల', గునుగుకొమ్మ', 'సిగమొగ్గ', 'నెనరు', 'శివుడా...', 'అద్దాల అంగడి', 'దిగులుగూడు', 'తాడులేనినీడ', 'కలల తుల్లింత', 'పుప్పొడిమైకం', 'వెలిగుడి', 'సింగిడికోణం', 'వెన్నెల' వంటి గీతికలను మన మాతృభాషలో, తల్లి ఒడిలో పసిపిల్లలుగా మారిపోయి చదివే/ వినే (అదృష్టం బాగుంటే) భాగ్యం మనకు కలిగించిన కవి గోరటి రుణం తీర్చజాలనిది.

వెంకన్నకడ్డేముంది. జీవనరథ్యలో వున్నాడు. జీవనస్థలిలో బతుకు పండుగ జరుపుకుంటున్నాడు. అతని పాటలన్నీ బతుకులను ఊరేగించటం, గొప్పగా మురిసిపోవటం, గొప్పగా ఆనందించటం, నృత్యం చేయటం. బతుకు గొప్పదనాన్ని మనముందు వారబోసుకుంటూ వెడుతున్న వెంకన్నకి అభినందనలు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. వల్లంకి తాళం – గోరటి వెంకన్న.
2. పూసిన పున్నమి – గోరటి వెంకన్న.
3. అల సెంద్రవంక – గోరటి వెంకన్న.
4. రేల పూతలు – గోరటి వెంకన్న.
5. ఏకునాదం మోత – గోరటి వెంకన్న.
6. గోరటి వెంకన్న కవితా పరామర్శ –పెన్నహొశివరామకృష్ణ.

# 'విమర్శిని' - తెలుగు నవలా పరిశీలన

**తుమ్మలపల్లి సోమశేఖర్,** పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం ఈస్ట్, చెన్నై – 600059

**ఉపోద్ఘాతం**

తెలుగు సాహిత్య మహా ప్రపంచంలో మహోన్నతమైన స్థానం పొందిన ప్రక్రియ నవల. నవల అనేది ఆధునిక ప్రక్రియ. దీనిని ఆంగ్లంలో నావెల్ (novel) అని పిలుస్తారు. ఈ ప్రక్రియ పలు పాత్రల ద్వారా సమాజ స్వరూపాన్ని, మనిషి మనుగడని, సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించేలా అందంగా, సృజనాత్మకంగా, విపులంగా వివరించి చెప్పగలిగే ఏకైక ప్రక్రియ నవల. ఈ నవలా ప్రక్రియ ద్వారా అనేకమంది నవల రచయితలు సమాజ స్వరూపాన్ని వారి నవలలలో వివరించే ప్రయత్నం చేశారు. నవల ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు తెలుగునవలపై ఎందరో పరిశోధనలు, సమీక్షలు, చర్చలు, సమావేశాలు, వ్యాసాలు, ఉపన్యాసాలు, చెప్పడం, రాయడం జరిగింది. ఇంకా దానిపై పరిశోధనలు కొనసాగుతూ ఉన్నాయి. అంతటి ఖ్యాతి కలిగిన ప్రక్రియ నవల. అటువంటి తెలుగు నవల ప్రక్రియ గురించి కొలకలూరి ఇనాక్ గారు తన 'విమర్శిని' అనే వ్యాస సంకలనంలో స్థూలంగా ప్రస్తావించడం జరిగింది.

విమర్శిని అనే వ్యాస సంకలనం మొత్తం 312 పేజీలు కలిగి ఉంది. ఈ వ్యాస సంకలనాన్ని రచించిన వారు ప్రముఖ కవి, రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి కొలకలూరి ఇనాక్. ఈ వ్యాస సంకలనానికి 2018లో 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' రావడం జరిగింది. ఈ వ్యాస సంకలనంలో రచయిత మూడు అధ్యాయాలుగ విభజించి వ్యాసాలను రాయడం జరిగింది.

మొదటిది 'తెలుగు వెలుగు' ఈ అధ్యాయంలో పలు సందర్భాలలో రాసిన 15 వ్యాసాలను తెలియజేశారు. ఈ వ్యాసాలలో భాషాపరమైన అంశాలతో పాటు, కథ, కవిత్వం, జానపద సాహిత్యం వంటి అంశాలపై వారి భావాలను పంచుకోవడం జరిగింది. అలాగే రెండవ అధ్యాయం 'తెలుగు నవల' ఈ అధ్యాయంలో తెలుగు నవల, తొలి తెలుగు నవల, చారిత్రక నవల, సాంఘిక నవల, హాస్యనవల, మనో వైజ్ఞానిక నవల, వంటి అంశాలపై స్థూలంగా చెప్పడం జరిగింది. మూడవ అధ్యాయం 'తెలుగు కథానిక' ఈ అధ్యాయంలో తెలుగు కథానిక, వర్తమాన సాహిత్య స్వరూపం, కథానిక నిర్వచనం, కథానిక పరిణామం, తెలుగు కథానిక వస్తువు, తెలుగు కథానిక పాత్ర చిత్రీకరణ వంటి అంశాలపై స్థూలంగా లఘు పరిశీలన చేయడం జరిగింది. ఈ వ్యాసంలో ప్రముఖంగా రెండవ అధ్యాయం 'తెలుగు నవల'. గురించి మాత్రమే సమీక్ష చేయడం జరిగింది. అలాగే ఈ పుస్తకంలో వీరు రాసిన వ్యాసాల గురించి కొలకలూరి ఇనాక్ వారి సింహావలోకంలో ఇలా చెప్పారు.

ఆంధ్ర, ఉస్మానియా, శ్రీవేంకటేశ్వర, తెలుగు, మద్రాసు, కాకతీయ విశ్వవిద్యాలయాలలోని అకడమిక్ స్టాఫ్ కాలేజీలలో 1975–2012 మధ్య కాలంలో పునఃశ్చరణ తరగతులకు, ఓరియెంటేషన్ కోర్సులకు భిన్నాంశాలపై ఇచ్చిన అనేక ఉపన్యాసాలలో అరడజను తెలుగు నవలల గురించి మాట్లాడినట్లుగా తెలిపారు. అప్పుడు ప్రస్తావించిన విషయాలు ఇప్పటికీ ఆంధ్రోపన్యాసకులు, ఆచార్యులు గుర్తుచేస్తూ వాటిని వ్రాసి ఉంటే బాగుండేదని అనడంతో వాటిని మళ్లీ పునఃశ్చరణ చేస్తూ విమర్శిని అని వ్యాస సంకలనంలో వాటిని చేర్చడం జరిగిందని పేర్కొన్నారు. (విమర్శిని – కొలకలూరి ఇనాక్, పేజీ. 146)

**రచయిత పరిచయం**

మానవత్వమే లక్ష్యంగా సాహిత్య సేద్యం మొదలుపెట్టి మనిషి కుల, మత, వర్ణ, వర్గ, లింగ భేదంతో కాకుండా మనిషిని మనిషిలా చూసినప్పుడే సమాజం మానవత్వంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా మారి మంచి సమాజంగా మారుతుందన్న సత్సంకల్పంతో ఆశావాదిగా ఆరున్నర దశాబ్దాలుగా రచనలు చేస్తూ ఎందరినో మానవత్వ హృదయాలుగా తీర్చి దిద్దిన మహోన్నతమైన వ్యక్తి కొలకలూరి ఇనాక్. వీరి ప్రతిభ అసాధారణమైనది. ప్రతి రచనలోనూ వైవిధ్యంతో కూడిన వాస్తవిక జీవితం కనిపిస్తుంది. దళితుడిగా పుట్టి వీరు దళితుల ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని మేళవించి దళితులలో ఐక్యతను తెచ్చే ప్రయత్నం కనిపిస్తుంది. వారి ప్రతి రచనలోను, వీరు వందకు పైచిలుకు పుస్తకాలను రాసిన అరుదైన సాహిత్యవేత్త. వీరు తెలుగు సాహిత్యలోకంలో అస్తమించని రవి తేజస్సుతో విరాజిల్లె కవి అని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రము లేదు.

వీరు కవిగా, రచయితగా, కథకుడిగా, విమర్శకుడిగా, నవలాకారుడిగా, అనువాదకుడిగా, పరిపాలన దక్షకుడిగా, కర్మయోగిగా, ప్రతి రంగంలోనూ వీరి కలం సాహిత్య గంగాజలంగా పరవల్లుతొక్కింది. ప్రతి పనిలో వీరి ప్రతిభా నైపుణ్యం విజయవంతం అయింది అనడంలో సందేహమేలేదు. వీరి రచనలకు గల్లి నుండి ఢిల్లీ దాక అనేక పురస్కారాలు, బహుమతులు వచ్చాయి. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, కేంద్ర ప్రభుత్వం అందించే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, జ్ఞానపీఠ ట్రస్ట్ వారు అందజేసే అత్యున్నతమైన అరుదైన మూర్తిదేవి పురస్కారంతో పాటు తెలుగుభారతి, మల్లెమాల, దువ్వూరి రమణమ్మ, ఎన్టీఆర్ లలిత కళా పురస్కారాలతో పాటు కేంద్ర ప్రభుత్వం వారు 2014వ సంవత్సరంలో 'పద్మశ్రీ' పురస్కారంతో వీరిని ఘనంగా సత్కరించడం జరిగింది.

తెలుగు సాహిత్యంలో ప్రతి ప్రక్రియలోనూ వీరి చేయి అందవేసిన చెయి అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి ప్రక్రియలోనూ వీరి ప్రతిభా పాటవాలు కనిపిస్తాయి. ఏ ప్రక్రియలోనైనా వీరు చేసే రచనలు సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం, సామాజిక బాధ్యతను కలిగిస్తాయి.

వీరి ప్రతి రచన మనిషిని అధమ స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగేలా చేసేటందుకు వీరి ప్రతి అక్షరం ఆ దిశగా కృషి చేస్తుంది. ఈ రకమైన రచనలు చేసేటందుకు వారు చేసే కృషి అంతా ఇంతా అని చెప్పే దానికి అవ్వదు. నిరంతరం తనతో తాను, తనలో సమాజాన్ని దర్శించి తను దర్శించిన సమాజాన్ని మాత్రమే అక్షరబద్ధం చేస్తారు ఇనాక్.

**కొలకలూరి ఇనాక్ నవలలు**

తెలుగు సాహిత్యంలో నవల అనేది ఉత్తమమైన ప్రక్రియ. ఈ నవల ప్రక్రియ ద్వారా తెలుగు సాహిత్య లోకంలో అనేక నవలలు వచ్చాయి. అనేకమంది నవలాకారులుగా మారి తెలుగు పాఠకుల అభిమానాన్ని, మన్నలను అందుకున్నారు. అదే విధంగా ఇనాక్ వారి నవలా ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఇప్పటి వరకు 15 నవలలు రాశారు. అవి సమత, అనాధ, సౌభాగ్యవతి, సౌందర్యవతి, ఎక్కడుంది ప్రశాంతి, ఇరులలో విరులు, రెండు కళ్ళు మూడు కాళ్లు, మాజీ మనిషి, అనంత జీవనం, సర్కారుగడ్డి, పులులబోను నేను, రంధీ, కన్నతల్లి, వలస, పై మెట్లు వంటి నవలలు రాశారు. ప్రతి నవలలోనూ సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం, సామాజిక బాధ్యత ఉండేలా ప్రతి నవలలను తీర్చిదిద్దడంలో వీరు విజయం సాధించారు. వీరు రాసిన నవలలు ఇతర భాషలలోకి అనువాదం అయ్యాయి. నవలలతో పాటు కవిత్వం, కథ, కథానిక, నాటకం, వ్యాసం, ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగు సాహిత్యంలో ఉన్న అనేక ప్రక్రియలలో వారి పాత్ర ఉంది. అన్ని ప్రక్రియలలో పేరు మోసిన రచయితగా చెప్పుకోవచ్చు. వీరు ఇప్పటికే నిరంతర సాహిత్య కృషిలో ఉండడం సరస్వతి కటాక్షంగా అమ్మవారి అనుగ్రహంగా భావించవచ్చు. అరుదైన సాహిత్య చక్రవర్తిగా వీరిని కొనియాడవచ్చు.

**తెలుగునవల**

తెలుగు నవల గురించి రచయిత కొలకలూరి ఇనాక్ తన విమర్శిని అనే వ్యాస సంకలనంలో ఈ విధంగా ప్రస్తావించడం జరిగింది. తెలుగు ప్రజల జీవితాలలో అనేక మార్పులు రావడానికి, వారి ఆలోచనలలో చైతన్యం ఏర్పడటానికి ఆంగ్లేయుల విద్యా, సాహిత్యం, సాన్నిహిత్యం, పాలన వంటి అంశాలు కారణం అయ్యాయని చెప్పడం జరిగింది. ఆంగ్లేయుల పాలన వలన సంఘంలోనూ, సాహిత్యంలోనూ కొత్త కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. 'పద్యమే సాహిత్య అభివృద్ధికి ప్రధాన సూత్రంగా ప్రాధాన్యం ఉన్న రోజుల్లో ముందుగా వచనం మొదలయ్యింది.' తొలిగా వ్యాస రూపంగా కనిపించింది. అప్పటికి వ్యాసం అనే పేరు లేనప్పటికీ అది ఉపన్యాసంగా ఉండవచ్చునని రచయిత భావించారు. వచన రచనలో వ్యాసం మొదటిది అని పైవిధంగా రచయిత పేర్కొన్నారు. (పేజి. 147 విమర్శిని – కొలకలూరి ఇనాక్)

ఆధునిక తెలుగు సాహిత్య లోకంలో వచనంలో తొలి ప్రక్రియ వ్యాసంగ మొదలై ఆ తదుపరి మొదలైన ప్రక్రియ నవలయని రచయిత ఈ వ్యాస సంకలనంలో పేర్కొన్నారు. నవల ప్రక్రియ తెలుగులో మొదలైనప్పుడు నవల అనే పేరుకు బదులుగా నవీన ప్రబంధమని, వచన ప్రబంధమని పిలిచేవారు. మధ్య రూప ప్రబంధం వచన రూప ప్రబంధంగా మారిందని రచయితలు తెలియజేశారని కొలకలూరి ఇలా పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కొత్త చైతన్యానికి దారి తీసిందని రచయిత తెలియజేశారు. మేధావులు వ్యాసం గురించి ఆలోచిస్తుంటే, సృజనకారులు నవలల గురించి ఆలోచించారని తెలియజేశారు. (పేజి.147 విమర్శిని – కొలకలూరి ఇనాక్)

రచయిత అభిప్రాయంలో నవల అంటే జీవన చిత్రీకరణయని, జీవితం సమకాలీనమేనని, రచయితలు జీవించి ఉన్న కాలమని, అలాగే ప్రత్యక్ష జీవన విధానం నవలలో ప్రతిబింబించటం దాని ప్రధాన అంశమని, రచయితలు, మేధావులు, గుర్తించారని తెలియజేశారు. అంతేకాకుండా సమకాలీన జీవితంలో కనిపించే వస్తువులు, ఇతివృత్తాలు, పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు నవలలో కనిపించాలన్న కోణంవల్ల ఏ కాలంలో జీవించే మనుషులు ఆ కాలంలో వెలువడ్డ నవలల్లో కనిపించాలని, అలాగే వాళ్ళ ఆశలు, ఆకాంక్షలు, అనుభవాలు, కష్టసుఖాలు, ఆలోచనలు, జీవ వైవిధ్యం వంటి అనేక విషయాలు నవలల్లో ప్రతిబింబించేలా ఉండాలని తెలియజేశారు. అలాగే చూడని, తెలియని, అనుభవం కాని, సన్నిహితం కాని, సహజంగా లేనివి, వాస్తవం కానివి, మనిషి కాని, అతడి ప్రవర్తన కాని, ప్రయత్నం కాని, కృషి కాని, నవలలో గోచరమయ్యే అవకాశం లేదంటూనే సహజ మానవుడు, సామాన్య ప్రాణి, రోజు వారి బ్రతుకుల్లో నిత్యం చేసే పోరాటం, అతడి ఆరాటం నవలలో కనిపిస్తుందని తెలియజేశారు. (పేజి. 148 విమర్శిని – కొలకలూరి ఇనాక్)

నవలలు ప్రధానంగా బహిర మానవుడు , అంతర మానవుడు అనే రెండు రకాల వ్యక్తిత్వాలు ఉంటాయని తెలియజేశారు అలాగే ఏ నవల కైనా అనంతకోటి బ్రహ్మాండ నాయకుడు మనిషి అని చెప్పారు. నవలకు నాయకుడిగా నవలలు మనిషి ఉంటాడు దేవుడు ఉండడు దైవ సంతానం ఉండదు, దైవ భక్తులు ఉండరు, దైవీయ వ్యవస్థ ఉండదు, మానవీయ వ్యవస్థ మాత్రమే ఉంటుందని నవలకు మనిషి మాత్రమే నాయకుడని దేవుడు కాదని తెలియజేశారు. అలాగే నవలలు మనిషి జీవితం సమకాలీన జీవితం మాత్రమే ఉంటుందని తెలియజేశారు. అలాగే నవలలో గతం గురించి గాని, చారిత్రకం గురించి గాని అంత ముఖ్యమైన అంశం కాదని పేర్కొన్నారు. ఏ నవలలోనైన సంఘమంతా ప్రతిబింబించదన్న విషయాన్ని తెలియజేశారు. పరిమితంగా, పాక్షికంగా, ప్రతిఫలనం ఉంటుందని చెప్పారు. నవలలో స్థలం, నిర్ణీతం, నిర్దిష్టం మాత్రమే కనిపిస్తాయని చెప్పారు. కాలం అఖండమే అయినా కాల శకలమే ప్రత్యక్షమవుతుందని తెలియజేశారు. పాత్రలు ఎన్నిఉన్నా నవలలో మాత్రం పరిమిత పాత్రలు మాత్రమే ప్రతిబింబిస్తాయి అని తెలియజేశారు. అలాగే నవల గురించి రచయిత ఇలా అంటారు ఎంతో కాలం నుంచి చంపుతున్న సమస్యకు ఒకే ఒక్క నవల సమాధానాలు చెప్పవచ్చు అటువంటి సామర్థ్యం శక్తి నవల ప్రక్రియకు ఉందని తెలియజేశారు. అలాగే రచయిత నవల గురించి ఏ ప్రక్రియ చూపలేనంత ప్రయోజనం నవల చూపించగలదని అది విశాలమైన

సాంద్రత కలిగిన ప్రక్రియ యని తెలిపారు.(149 పేజి. విమర్శిని – కొలకలూరి ఇనాక్) ఇంకా ఈ తెలుగు నవల అనే వ్యాసంలో కొలకలూరి ఇనాక్ నవల లక్షణాల గురించి నవల స్వరూపాన్ని గురించి వారి అభిప్రాయాన్ని తెలియజేశారు.

**తొలి, మలి తెలుగు నవలలు**

తొలి తెలుగు, మలి తెలుగు నవలల గురించి రచయిత తన అభిప్రాయాలని ఈ విధంగా తెలియజేశారు. తెలుగులో తొలి నవల శ్రీరంగరాజచరిత్ర (1872) మలి నవలగ రాజశేఖర చరిత్ర అని తెలియజేశారు. తొలి నవల రచయిత నరహరి గోపాలకృష్ణమ శెట్టి. మలి నవల కర్త – అనువాదకుడు కందుకూరి వీరేశలింగం పంతులు. దాని రచనకు ప్రేరణ లార్డుమేయో బెంగాలీలో నవలా రచనకు ఇచ్చిన ప్రోత్సాహ ప్రకటన. (150 పేజి. విమర్శిని – కొలకలూరి ఇనాక్)

అనువాదానికి మూలం వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు నవల. ఇద్దరి నవలా సృష్టికి ఆంగ్లేయుల దృష్టి రచన ప్రేరకాలు.

ఇద్దరి నవలలు రెండింటిని చరిత్ర అన్నాయి కానీ నిజంగా చరిత్ర కాదు, రాజుల్ని జమీందారుల్ని చెప్పినట్లున్నా అదంతా కల్పితమే. నవలా జీవితం సమకాలీన సమాజ సంబంధమైనది మాత్రమే. నూటేభై ఏళ్ళు గడిచినా, ఇంతబాగా సుగాలీలు, లంబాడీలు, బంజారాలు పాత్రలైన నవలా సాహిత్యం – చాలా రచనలు వెలువడ్డాయి – ఇంత సహజంగా జీవిత సన్నిహితంగా రాలేదనే చెప్పవచ్చు.

వ్యవసాయం వృత్తిగా ఉన్న ఒక రాజు కుటుంబంలోని అమ్మాయిని లంబాడీ స్త్రీ దొంగతనంగా ఎత్తుకుపోయి పెంచి పెద్ద చేసింది. పెళ్ళీడుకొచ్చినప్పుడు వీళ్ళకు ఇష్టం లేకపోవటం వల్ల పెళ్ళి చేసుకోవాలని తలచిన పెళ్ళికొడుకు విలన్‌గా మారటం, తోవతప్పి రంగరాజు అదే యువకుడు ఈ సోనాబాయిని చూడటం, కష్టాలు గట్టెక్కి పెళ్ళాడటం కథాంశం. ఇంతమాత్రమే అయితే అది పరిమిత జీవితం. లంబాడీల జీవనం, ఆచారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, విశ్వాసాలు, ఆహార విహారాలు ఆచార వ్యవహారాలు దీక్షగా నవలలో నిక్షిప్తం చేశాడు రచయిత. నల్లమల అడవుల్లో నివసించే తాండా జీవితం శ్రద్ధగా క్రోడీకరించాడు. రాజశేఖర చరిత్రలోని జీవితం ఆంగ్లేయులది. దాన్ని ఆంధ్రీకరించేటప్పుడు అది తెలుగువాళ్ళ జీవితంగా భాసించేట్టు చేయగలిగాడు రచయిత. అయినా అది అతుకుల బొంతే. దాన్ని తెలుగు జీవితంగా భావించిన ఆంగ్లేయుడు దీన్ని ఇంగ్లీషు భాషలోకి 'ది ఫార్చ్యూన్ వీల్'గా తర్జుమా చేశాడు. దీన్ని చూచిన ఆంధ్రుడు అసలు సిసలు తెలుగు జీవితంగా ఉందని మళ్ళీ అదృష్ట చక్రం పేరిట తెలుగులోకి తెచ్చాడు. ఇంత చరిత్ర చూస్తుంటే రాజశేఖర చరిత్ర తెలుగువాళ్ళ జీవన దర్పణంగా ఉందని భావింపవచ్చు. మెరమెచ్చులకు పోయి, ఆస్తిపాస్తులు హరించుకుపోగా, దేశాంతర్గతుడైన మనిషి, తిరిగి సంపన్నుడై స్వస్థానం చేరుకోవటం నవలలో కనిపిస్తుంది. సంపన్నుల్ని ఆశ్రయించి, పబ్బం గడుపుకొనే జనం ప్రలోభాలు గత్యంతరం లేక పేదరికం అనుభవించిన సంపన్నులు, మళ్ళీ సంపదకోసం పోరాటం, ఇది ఆసక్తికరంగా ఉండే తెలుగు వాళ్ళజీవితం.

రచయిత తెలుగు తొలి, మలి నా వలన ప్రస్థాపనలో రెండు నవలల గురించి ఉన్నది ఉన్నట్టుగా సత్యాన్ని బద్దలు కొట్టారు. ఈ రెండు నవలల్లో చారిత్రక అంశాలు లేవని అవి కల్పితాలను మాత్రమే నన్ను విషయాన్ని ఈ నవలలోని వస్తువుని, ఇతివృత్తాన్ని గురించి క్లుప్తంగా స్థూలంగా చెప్పడం జరిగింది. ఇప్పటికీ ఈ రెండు నవలల్లోని ఇతివృత్తం నిత్య నూతనం అన్న విషయాన్ని ఇనాక్ చెప్పడం అద్భుతం. ఈ రెండు నవలలు సాంఘిక నవలలుగా రావడం వలన ప్రక్రియకు మార్గ నిర్దేశంగా మారింది అనడంలో సందేహం లేదు. ఈ రచనల ఆధారంగా ఆ తదుపరి హాస్య నవలలు, మనోవైజ్ఞానిక నవలలు, చారిత్రక నవలలు, డిటెక్టివ్ నవలలు వంటి అనేక నవలలు తెలుగు సాహిత్య ప్రపంచంలోకి తొంగి చూశాయి.

**ఉపసంహరణ**

విమర్శిని వ్యాస సంకలనంలో కొలకలూరి ఇనాక్ మూడు రకాలుగా విభజించారు. తెలుగు వెలుగు అనే అధ్యాయంలో భాషా పరమైన అంశాలతో పాటు కథ, కవిత్వం వంటి వాటిపై పలు సందర్భాలలో రాసినటువంటి వ్యాసాల గురించి ప్రస్తావించడం జరిగింది. అలాగే రెండవ అధ్యాయంలో తెలుగు నవల గురించి, తొలి తెలుగు నవల, మలి తెలుగు నవల గురించి వివరించారు.

వీటితో పాటు సాంఘిక నవల గురించి హాస్య నవల గురించి, వైజ్ఞానిక నవల గురించి ప్రస్తావించడం జరిగింది. మూడవ అధ్యాయంలో కథానిక గురించి చెప్పడం జరిగింది.

ఈ వ్యాసంలో విమర్శిని అనే వ్యాస సంకలనంలోని తెలుగు నవల, తెలుగు తొలి, మలి నవలల గురించి కొలకలూరి ఇనాక్ అభిప్రాయాలను గురించి వివరించడం జరిగింది. అలాగే నవలపై వారి అభిప్రాయాలను, ఆలోచనలను ఈ వ్యాసంలో చెప్పడం జరిగింది. అలాగే రచయిత గురించి పరిచయం చేయడం జరిగింది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. 'నాన్న' కొలకలూరి ఇనాక్ జీవిత చరిత్ర – ఆచార్య కొలకలూరి మధు జ్యోతి
2. 'సృష్టి-దృష్టి' – ఆచార్య కొలకలూరి మధు జ్యోతి
3. 'విమర్శిని' – ఆచార్య కొలకలూరి ఇనాక్
4. ఇతర పత్రిక వ్యాసాలు, సమావేశాలు.

# మొలకల పున్నమి కథలు - రాయలసీమ సంస్కృతికి నిలయాలు

**ఆర్. విజయకుమారి,** సంజయ్‌గాంధీ కాలనీ, తిరుపతి అర్బన్

**ప్రవేశిక**

ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాధాన్యం పొందిన ప్రక్రియ కథ లేదా కథానిక. సమకాలీన సామాజికాంశాలను కథలు చక్కగా చిత్రిస్తున్నాయి. 1975 నుంచి కథలు లెక్కకు మిక్కుటంగా వెలువడ్డాయి. 1900 సంవత్సరంలోనే కథలు పురుడు పోసుకున్నా, స్వాతంత్ర్యానంతరం ఒక ప్రక్రియగా గుర్తింపుకు నోచుకున్నాయి. లబ్ద ప్రతిష్ఠులైన కథకులతోబాటు వర్ధమాన కథకులు కూడా రోజు రోజుకు తయారవుతున్నారు. సమకాలీన సమాజాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తున్నారు. ఆక్రమంలో చూసినపుడు లబ్ధప్రతిష్ఠుడైన డా. వేంపల్లె గంగాధర్ రాయలసీమ ప్రజల జీవితాన్ని ప్రతిబింబిస్తున్నది. ఈయన కలం నుండి దాదాపు యాభై కథలు వెలువడ్డాయి. అందులో ప్రముఖ కథా సంపుటి 'మొలకల పున్నమి'. ఈ కథా సంపుటిలో యామయ్య స్వామి దర్రం, శిలబండి, మూడు పదున్లవాన, మొలకుల పున్నమి, మాండవ్యం, దేగల రాజ్యం, ఏదులాంతర్ల సెంటరు, దీపమాను, పూల చేతులు, దింపుడు కల్లం ఆశ, మైనం బొమ్మలు, శ్రీమాన్ దొరవారికి, మంత్రసాని వైద్యం అనే కథలున్నాయి. ప్రతి కథలోను రాయలసీమ సంస్కృతి చిత్రించబడింది. అందువల్లనే ఈ సంపుటికి కేంద్రసాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించింది.

**యామయ్య సామి గుర్రం**

'యామయ్య సామి గుర్రం' కథలో యామయ్య గుర్రం వారు ఒక గ్రామానికి వస్తే ఆ ఊరి వారి హడావుడి ఎలా ఉంటుందో కథకుడు వేంపల్లె గంగాధర్  తెలిపాడు.

"తెల్లారాక గ్రామ పెద్దతో పాటు మరో ఇరవై మంది పక్కూరికి వెళ్ళి యామయ్య సామిని కలిశారు. మా వూరికి రావాలని ఆహ్వానించి వసులైన నగదు ఆయన ముందుంచాడు. సామి ఒప్పుకున్నాడు. తెల్లారేపాటికి మీ ఊర్లో వుంటానని చెప్పాడు. ఈ సంగతి తెలిసిన మా ఊర్లో ప్రజలకి కాళ్ళు చేతులు ఆడలేదు. ఎక్కడ పని అక్కడ వదలి గోడలకు సున్నాలు పూశారు. పానకం, వడపప్పు, పాయసం, ఎన్నెన్నో చేసుకున్నారు. రాత్రికి రాత్రి ఊరు ఊరంతా ఉత్సవంలా తయారైంది. ఎటు చూసినా మామిడి తోరణాలు, రంగు కాగితాలతో గ్రామం శోభిల్లింది' అంటాడు అయితే నేడు యామయ్య స్వామి వారు తెరమరుగయ్యారు.

యామయ్య స్వామి అనే సంచారవృత్తి వారు రాయలసీమలోని ప్రతి పల్లెను తిరిగేవారు. వారిని ప్రతిగ్రామం వారు చాలా పవిత్రంగా చూసేవారు. వారు తిరిగిన గ్రామం సుభిక్షంగా ఉంటుందని ప్రజల నమ్మకం. అనంతపురం జిల్లా కదిరి తాలూకా కటారుపల్లెలోని వారి వృత్తి యామయ్య వృత్తి. వీరు చాలా నిష్ఠాగరిష్ఠులు.

**శిలబండి**

'శిలబండి' అనే కథలో గ్రామ దేవతకు ఎలా మొక్కుబడి చెల్లిస్తారో రచయిత వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపారు.

"శిల బండి ఒక మొక్కుబడి. ఎడ్లబండిపైన ఎత్తయిన తాటిమాను కట్టి పై అంచుల్లో మేకపిల్లను కొక్కీకి తగిలించి యాలాడగడతారు. అది రక్తం కార్చుకుంటూ అరుస్తూ ఉంటాది. దాన్ని అలా రెండు రాత్రులు యాలగట్టి మూడోరోజు అంకాళమ్మకు గర్భగుడిలోనే బలిఇచ్చి ఆమె శిలను రక్తంతో తడిపి శాంతింపజేశారు. శిలబండి కట్టినోళ్ళు అంకాళమ్మకు దున్నపోతును కూడా బలి ఇవ్వాలి. జాతరకు వచ్చినోళ్ళందరికి విందు ఇవ్వాలి. అదంతా చాలా ఖర్చుతో కూడుకున్న యవ్వారం" అని తెలిపాడు.

రాయలసీమలోని నాగారపమ్మ, గర్నిమిట్టమ్మ, గంగమ్మ, అంకాళమ్మ, అనంతపురమ్మ వంటి గ్రామ దేవతలకు వేసవి కాలంలో జాతర జరుపుతారు. ఆ జాతరలో ఈ 'శిలబండ్లు' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ శిలబండ్లనే 'చాందినీ బండ్లు' అని కూడా అంటారు. వీటికి అయ్యే ఖర్చు లక్షల్లో ఉంటుంది.

**వికృత ధోరణులు**

"మూడవ పదున్ల వాన" కథలో యానివర్సిటీలో చదివే రైతు కొడుకు భౌతికంగా ఎలా తయారయ్యాడో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

"తీక్షణంగా ఒకసారి నిరంజన్ వైపు చూశాడు. పూర్తిగా మారిపోయాడు. జులపాలు చెవుల మీద నుండి మెడ మీద నుండి భుజాల గాలికి విసురుగా కదుల్తున్నాయి. ఎడమవైపు చెవి తమ్మెకు బంగారు కమ్మ తళుక్కుమంది. అంకిరెడ్డి మనసు కళుక్కుమంది. తొడల్దాకా గొల్లోల మాదిరి చేతుల్లేని మందం చొక్కా, చేతిలో సెల్‌ఫోన్, నోట్లో ఏదో గుట్కా లాంటిది నముల్తూ... కళ్ళముందు నిరంజన్... తన కొడుకే.

ఇదేందిరా నాయనా. ఏందిరా ఇట్ల. కొండలో కోతి మాదిరి మారిపోయావు. కనుక్కోలేక పోయిన గదరా! ఈ జులపాలేంది. కమ్మలేంది, నిక్కరేంది, చొక్కా ఏంది, సెల్లేంది. మనకు అవసరమట్రా..." అనేశాడు అంకిరెడ్డి.

శరీర అలంకరణకు నేటి యువత ఎలా వికృతంగా మార్చుకుంటున్నదో అంకిరెడ్డి పాత్ర ద్వారా చక్కగా చిత్రించాడు కథకుడు. ఆ రూపంలో వారిని మనం చూడలేక పోతున్నాము. మన సంప్రదాయానికి భిన్నంగా నేటి యువత మసలుకుంటున్నది. దీనికి ప్రధానకారణం సినీ హీరోలేననవచ్చు. వారిని యువత మూర్ఖంగా అనుసరిస్తున్నది. ఈ దృక్పథంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది.

**మొలకల పున్నమి**

'మొలకల పున్నమి' కథలో చనిపోయిన కుటుంబ సభ్యుల సమాధుల వద్ద రాత్రి వేళ కన్నెపిల్లలు ఎలా పూజలు చేస్తారో కథకుడు ఇలా తెలిపాడు.

"వయసులోవుండే కన్నెపిల్లలంతా బహుచక్కగా ఈ మొలకల పున్నమినాడు నవధాన్యాలకు మొలకలు తెప్పించడంలో పోటీ పడినారు. చాలా బాగుంది. మొన్నెప్పుడో పుట్టమన్ను తెచ్చి దాంట్లో అన్ని రకాల ధాన్యాలను పోసి ఈ పున్నమినాడు గుడిలోకి తెచ్చారు. మీకు మంచి మొగుళ్ళు రావాలని ఈ గంగమ్మ తల్లి సాక్షిగా కోరుకుంటుంటారు. నానబెట్టిన బియ్యంలో నల్లనూగులు బెల్లం కలిపిన ప్రసాదం తీసుకోండి. మీకిష్టమైన వాళ్ళకివ్వండి. ఇక్కడ మట్టి ప్రమిదల్లో వెలిగేదీపాలను మీకిష్టమైన వారిని మదిలో తల్చుకుని ఆ ఏటిగట్టునున్న కోనేరులో వదలండి. మీ కోరిక ఫలిస్తుంది." అంటూ పెద్దలు కన్నె పిల్లలను ఆశీర్వదిస్తారు. మొలక పోసిన కుండీలను తమ పెద్దల సమాధులపై ఉంచి పూజలు చేసి టెంకాయ కొడతారు. ఈ కార్యక్రమం మే నెలలో పౌర్ణమిరోజు రాత్రి సుమారు ఏడుగంటల నుంచి పది గంటల వరకు జరుగుతుంది. ఆ తరువాత ఆ వెన్నెల్లో ఆడ, మగ అనే తేడా లేకుండా ఆబా అబాలగోపాలం ఆటలు ఆడతారు. పాటలు పాడతారు. ఈ కార్యక్రమం తెల్లవారుజాము వరకు సాగుతుంది.

**పీర్ల పండుగ**

'మాండవ్యం' కథలో పీర్ల పండుగరోజు అగ్ని గుండాన్ని తొక్కే తీరును కథకుడు వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు.

"రోజులు గడుస్తాండాయి. పీర్ల మండగొచ్చింది. ఊర్లో సంబరాలు మొదలయ్యాయి. మనకు వుండేకాడికి పండగ చేయాలని చెప్పినాడు. వానలు పడాలని, కరువుపోవాలని కోరుకుంటా గుండం తవ్వమన్నారు. ఊరి పెద్దలందరూ అట్నే లేమని ఒప్పుకునిరి.

రాత్రికంతా గుండం తయారైంది. నరక్కచ్చిన తాటిమాన్లు రగులుకున్నాయి. ఎర్రని నిప్పులైనాయి. సెగను ఎగజిమ్ముతుండాయి. గుండమైతే తయారైంది గానీ నడిసేటోళ్ళు ఎవరుండారు? ఎప్పుడూ నడిసే పీరన్న మామ మంచాన పడినాడు.

గుండం రగులుకుంటూనే ఉంది. యింక వీర శివుడే ముందుకొచ్చినాడు. సేతిలోకి పెద్ద పీరును తీసుకొని గుండంలోకి అడుగులేసినాడు. అడుగులు పడే కొద్ది నిప్పులు ఎగిరెగిరి పడతాండాయి. అలివిగాని జనం... తోసుకుంటూ... దొబ్బుకుంటూ చూడడానికి ఎగబడతాండారు.

ఆన్నుంచి ఈ పక్కకు, ఈన్నుంచి ఆ పక్కకు మూడు సార్లు నిప్పుల్లో నడిసినాక పీరును సావిడిలో పెట్టి కళ్ళు తిరిగి పడిపోయినాడు వీరశివుడు" అంటూ పీర్ల పండగ రోజు అగ్నిగుండప్రవేశం జరిగే తీరును కళ్ళకు కట్టినట్లు తెలిపాడు కథకుడు. ఈ పీర్ల పండుగలో హిందూ ముస్లింలు తారతమ్యం లేకుండా పాల్గొంటారు. ఈ వేడుకలు రాయలసీమ అంతటా ఘనంగా జరుగుతాయి. ఈ పండుగ హిందు, ముస్లింల మధ్య ఐక్యతను పెంచుతున్నదని చెప్పవచ్చు.

**జైనుల జాతర**

'ఏడు లాంతర్ల సెంటరు' కథలో బూతు జాతర జరిగే తీరును కథకుడు చక్కగా తెలిపాడు.'

'జైనపాడు దగ్గర బూతు జాతర జరుగుతాందని దొర గారికి కబురొచ్చింది. భక్తులు తమ కోర్కెలు నెరవేర్చాలని జైన తీర్థంకరుడు పార్శ్వనాథుని విగ్రహానికి పూజలు చేస్తారు. పిల్లలు పుట్టని గొడ్రాళ్ళు సంతానం కోసం అర్ధరాత్రివేళ దిగంబరులైన పూజలు, నాట్యాలు చేస్తూ పార్శ్వనాథుని ఆలింగనం చేసుకుంటారు. ఇలాంటి నృత్యాలను నిషేధిస్తున్నట్లు దొర పత్రం కూడా జారీ చేశారు. కానీ జాతర జరగతా ఉందని తెలిసేసరికి ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

**"జైనపాడు దగ్గరికి వస్తోంది.**
**దూరంగా ఎవరిదో పాట విన్పిస్తోంది**
**గండ్ల చీర కట్టరండి ఓ అమ్మలారా**
**వేపదీపం పెట్టరండి ఓ అమ్మలారా**
**సామీ సుట్టు తిరగండి ఓ అక్కలారా**
**గంధం చెక్క సాదరండి ఓ అక్కలారా"**

అంటూ స్త్రీలు పాటలు పాడుకుంటూ వేడుకలు జరుపుకుంటారు. జైనులు దిగంబరులు. వారిని కౌగలించుకుంటే పిల్లలు పుడతారన్నది కొందరి విశ్వాసం. అయితే అలా జరిగేతీరు సక్రమంగా లేదని ఊరి పెద్ద నిషేధిస్తాడు. అయినా ఒక సాంప్రదాయానికి అలవాటు పడ్డ ప్రజలు అంత తేలికగా మారరు కదా!

**సమాధికి పూజలు**

'దీపమానుకథ'లో వూరి పెద్ద సమాధిని ఎంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారో రచయిత వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు.

"తెల్లారక ముందే ఆ ఊర్లోని ఆడోళ్ళు దీపమానుకాడ కసువులు కొట్టి, పేడనీళ్ళు చల్లి ముగ్గులేసి దీపానికి నూనె పోసి మనసులో తల్సుకొని మొక్కోని పోతాడు.

**దాన్ని సమాధి అంటే ఊరి జనం ఊరుకోరు.**
**అది వాళ్ళకు దేవుడుండే దేవళంతో సమానం.**
**ఆ సమాధిక్కు గౌరవమది.**
**ఆ జనానికున్న భక్తి భావమది.**

అవును వూరి కోసం బతికిన మనిషి.

జనం కోసం నిలబడిన మనిషి. బుక్కపట్నం వీరశివారెడ్డి సమాధి అది. అక్కడి పిడికెడు మట్టి కూడా వీర శివారెడ్డి వీరత్వాన్ని గుర్తుచేస్తుంది." అంటారు కథకుడు.

ఊరికి మంచి చేసిన వ్యక్తి మరణిస్తే ఆ వ్యక్తి సమాధికి పూజలు చేసే అలవాటు రాయలసీమలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఆ వ్యక్తిని దైవంగా చూస్తారు. అలాంటిదే అనంతపురం జిల్లాలోని 'ముసలమ్మ' వృత్తాంతం. అతివృష్టి మూలంగా చెరువు తెగిపోకుండా ఉండడానికి ముసలమ్మ ఆ చెరువులో దూకి ఆత్మార్పణ చేసుకుంటుంది. ఆ కట్టపై గుడికట్టి పూజలు చేస్తున్నారు.

**మంత్రసాని**

'మంత్రసాని వైద్యం'కథలో మంత్రసాని గురించి కథకుడు వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు.

"కాంతమ్మ మావూరి మంత్రసాని" అయమ్మ చేయిపడితే ఎంతటి కష్టమైన కాన్పు అయినా కలత లేకుండా అయితాదని అందరి ఆడోళ్ళ నమ్మకం.

నుదిటికి పావలా బిళ్ళంత కుంకుమ బొట్టు పెట్టుకొని రెండు సేతల నిండాకు ఎర్రటి మట్టి గాజులు తొడుక్కొని పెద్దంచు పట్టు చీరను పదిలంగా కట్టుకొని కొప్పునిండా పూలెట్టుకొని ఎక్కడ ఏ శుభకార్యం జరిగినా సంప్రదాయంగా ఆయమ్మ వచ్చి చేరేది"అంటాడు కథకుడు.

నేడు విదేశీ సంస్కృతి ప్రభావంతో స్త్రీ పురుషులు వికృతంగా తయారవుతుండగా, పల్లెటూరిలో ఉండే మంత్రసాని కాంతమ్మ ఎంతో సాంప్రదాయబద్ధంగా కట్టుబొట్టుతో దర్శనమిచ్చేది. దీన్ని బట్టి చూస్తే చదువుకున్న వారికంటే పట్నవాసులకంటే పల్లెల్లో చదువురాని వాళ్ళే సంస్కృతిని సాంప్రదాయాన్ని పాటిస్తున్నారని చెప్పవచ్చు.

ఈ విధంగా వేంపల్లె గంగాధర తన కథల్లో రాయలసీమ సంస్కృతిని చిత్రించారు. ఇవి భావితరాల వారికి చరిత్రగా దోహదపడతాయనవచ్చు.

**ఉపకరించిన గ్రంథాలు**

1. మొలకల పున్నమి – డా॥ వేంపల్లి గంగాధర్
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం – ఆర్వీయస్ సుందరం
3. ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి – ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం
4. ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సురవరం ప్రతాపరెడ్డి

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 7 (2) హైదరాబాద్ మే - 2024

# మొలకల పున్నమి కథలు - సామాజిక దృక్కోణం

**డా. మోగంటి సుధామయి,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతానగరం, తూర్పు గోదావరి

**ఉపోద్ఘాతం**

కథాసాహిత్యం భారతదేశంలోని అన్ని భాషలలోనూ ప్రజలలో మమేకమై అనాదికాలం నుండి ప్రవహిస్తూవుంది. వేదాలలో, ఉపనిషత్తులలో, ఇతిహాసాలలో, పురాణాలలో, జానపదులనోళ్ళలో అన్నింటా తానై ఆనందాన్ని కలిగిస్తూ వుంది. తెలుగులో సాహిత్యసృష్టి జరగడానికి ముందే సంస్కృతంలో కల్పనలతో కూడిన కథాసంకలనాలెన్నో వచ్చాయి. శాలివాహనుల కాలంనాటి బృహత్కథ ప్రంచంలో ఎన్నో కథలకు పుట్టినిల్లు. గాథాసప్తశతి, దశకుమార చరిత్ర, పురాణేతిహాసాలు అన్ని కథాగుచ్ఛాలే.

**1 ప్రాచీన తెలుగు సాహిత్యంలో కథలు :** హరవిలాసం, శుకసప్తతి, హంసవింశతి, సింహాసనద్వాత్రింశిక, పంచతంత్రం మున్నగు కథాకావ్యాలలో ప్రబంధకథలలో తెలుగు సాహిత్యం తన వైభవాన్ని చాటుకుంది. ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక అనే కథాభేదాలను మన ప్రాచీన సాహిత్యశాస్త్రజ్ఞులు గుర్తించారు. ప్రసన్నకథాకలితార్థయుక్తిని నన్నయ వెయ్యేళ్ళకు ముందే ప్రకటించారు.

**ఆధునిక కథాప్రస్థానం :** నేటి కాలంలో కథ సరళమైన వచనంలో సాగేప్రక్రియ. 70 యేళ్ళ నుండి తెలుగు కథ ఉత్తమ సాహిత్యప్రక్రియగా రూపొందింది. దైనందిన జీవితానుభవాలతో జనసామాన్య భాషలో ప్రజల ఆచారవ్యవహారాలలో బ్రతుకు బరువులలో పాఠకులలో ఆలోచన రేకెత్తించే విధంగా ఉత్తమకథలు రూపొందాయి. తెలుగులో ఉత్తమకథకులుగా గురజాడ, విశ్వనాథ, వేలూరి, బుచ్చిబాబు, గోపీచంద్, చలం, శ్రీపాద, చింతాదీక్షితులు, రావిశాస్త్రి, బండారు అచ్చమాంబ, పేరెన్నికగన్న వాళ్ళు. పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' ప్రపంచకథల పోటీలో ద్వితీయస్థానం పొందడం తెలుగుకథ నిర్మాణ వైవిధ్యాన్ని సూచిస్తుంది.

2) "బాహ్య జగత్తులో వస్తువు ఎంత అద్భుతమైనదైనా అది కథకుని అంతరంగ జగత్తులో ఆవిర్భవించే ఒక కళాదృష్టిలో సమన్వయంకుదిరి తనదైనప్పుడుగాని లేకపోతే రచయిత ఆ వస్తువుని స్వీకరించడం అనవసరమను కుంటాను". బుచ్చిబాబు కథానిర్మాణం గురించి అభిప్రాయపడతారు.

2) కథా దాని కమామీషు నన్ను మార్చిన పుస్తకం, వ్యాసాలు కడపజిల్లాకు చెందిన కథకుడు, కవి, పరిశోధకుడు, వేంపల్లి గంగాధర్ మొలకల పున్నమి కథలను పరిశీలించడం అందులోని సామాజిక అంశాలను విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశం.

2011 కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారమందుకొన్న ఈ తొలి తెలుగు రచయిత మొలకల పున్నమి అనే 13 కథలను రాయలసీమ మాండలికంలో బ్రతుకు కథలుగా ఆవిష్కరించారు.

**కథావిశ్లేషణ : యామయ్య సామిగుర్రం :** కథకుడు ఈ కథను తానే చూస్తున్నట్లు ప్రథమ పురుషలో వ్రాసాడు. జానపద కళలింకా పచ్చగానే ఉన్నాయనడానికి ఇది నిదర్శనం. యామయ్య సామిగుర్రం ప్రదర్శన చేస్తే వర్షాలు వస్తాయని, పైరులు పచ్చగా ఉంటాయని, ప్రజలందరి విశ్వాసం. ఊరంతా పండగసంబరాలలో యామయ్య సామిని ఆహ్వానిస్తుంది. పసుపు రంగు తలపాగాతో నిండైన విగ్రహంతో యామయ్యసామి ఊరులోకి వస్తాడు. 'ఇసుకలో వేసిన రూపాయినాణాన్ని గుర్రం మీద పోతూనే అందుకుంటా చూడండి' అని క్షణంలో అందుకోవడం, 15 అడుగుల వెదురు బొంగుమీద నుండి గుర్రంతో సహా

దాటడం చేయగానే ఎడారి ప్రాంతంలాంటి ఆ ఊళ్ళో మబ్బు లేసి వానకురవడం మొదలౌతుంది. 25 అడుగుల పొడవున్న గుంతలో తాటిమాన్లు పెట్టి నిప్పురాజేసి దానిమీద నుంచి గుర్రంతో ఎగరడం వంటి క్లిష్టమైన పనులుచేసి, యామయ్యసామి ప్రజలందరినీ అబ్బురపరుస్తాడు. ఏటిగట్టునున్న పాతరాళ్ళబావి మీద గుర్రాన్ని ఎగిరించమని ఊరిపెద్ద చెప్పగానే యామయ్య ఎంతో నిర్భయంగా రాళ్ళబావిని గుర్రంతో దాటుతూ రాళ్ళబావిలో పడి చనిపోతాడు. వెంటనే వారం రోజులపాటు కుండపోత వానలు కురిసి ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారిపోతుంది. ఇది వరకు యామయ్యసామి గుర్రం లాంటి జానపదకళా ప్రదర్శనలకు జనం ఎలా నీరాజనాలు పట్టేవారో! అలాంటి కళాకారులు తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా తమ వంశపారంపర్య కళలను ఎలా బ్రతికించేవారో ఈ కథ చదివిన తరువాత పాఠకుడు బరువెక్కిన గుండెతో గ్రహిస్తాడు. రాళ్ళబావిని చూసిన యామయ్యసామి ముఖంలో 'ఏదో అస్పష్టభావం ఏదో అనుమానం' అని రచయిత యామయ్య మనస్సుని మనముందుంచుతూ కూడా అతను ఆడిన మాటకోసం, ఊరులో వానలు కురవడం కోసం ఆపనికి సిద్ధపడడాన్ని సూచిస్తాడు.

**<u>శిల బండి</u> :** ఈ కథలో రెడ్డి యువకుడు ప్రేమించిన ఒక అందాల రాణి చిన్నమ్మ తక్కువ కులానికి చెందినదైన గుణవంతురాలు. ఆమెను ఆ యువకుని తండ్రి కన్నుగానని కామంతో నాశనం చేయడాన్ని రెడ్డియువకుని ముఖతః రచయిత చెప్పించిన తీరు హృదయాన్ని కలచివేస్తుంది. కథానాయకుని తండ్రి దురాశతో ఎందరో పేదరైతుల భూమిని ఆక్రమిచుకొని, అడ్డువచ్చిన తమ్ముని కూడా చంపిచేసాడని, అతనంటే అందరికీ భయం. చిన్నమ్మని ప్రేమిస్తున్నానని తండ్రితో రెడ్డి చెప్పలేకపోతాడు. రెడ్డి అన్న ప్రతాప్, ఎడ్లబండిమీద నుండి పడిగాయాల పాలైతే సామీజీ ఒక సలహా ఇస్తాడు. శిలబండి రాయలసీమలో ఒక మొక్కుబడి. ఎడల బండిమీద తాటిమాను కట్టి పైన మేకపిల్లను కొక్కికి తగిలిస్తారు. రెండు రోజులు పోయాక రక్తం కారుస్తూ వున్న దానిని అంకాలమ్మకు గర్భగుడిలోనే బలి ఇచ్చి ఆమె శిలను రక్తంతో తడిపి శాంతింపజేస్తారు. దున్నపోతును కూడా బలిస్తారు.

అంకాలమ్మ రాయల సామంతుడైన వీరభద్రుని భార్య. అతడు కరువుతో అల్లాడుతున్న సీమకోసం పెన్నానది నుండి సొరంగం త్రవ్వించి వారిని బ్రతికించాడు. కప్పంకట్టలేని ప్రజల పక్షాన రాయలకే ఎదురునిలిచాడు. అతన్ని చంద్రగిరి చెరసాలకు తరలించాలని రాయలు భావిస్తే ప్రజలందరూ ఎదురు తిరిగారని వీరభద్రుని తలనరికి వేపమానుకు వేలాడగట్టారు. దేవతగా మారిన ఆమెకు 10 ఏళ్ళకొకసారి జాతర చేస్తారు. అంకాలమ్మకు దిష్టితీస్తున్న చిన్నమ్మను చూస్తూ తండ్రి ఎవరావిడ అని అడుగుతాడు, కొండారెడ్డి చిన్న నవ్వునవ్వేసరికి రెడ్డికి భయం కలుగుతుంది. తన తండ్రి, స్నేహితుడు కొండారెడ్డి ఇద్దరకు కూలి ఆడవాళ్ళ జీవితాలను నాశనం చేస్తారని రెడ్డికి తెలుసు. రెడ్డి చెలికాడు అంజి పరుగున, వచ్చి సిన్నమ్మని రెడ్డి తండ్రి పాడుచేసాడని కొండారెడ్డి కూడా బలాత్కరించబోతే రాయితో కొట్టిచంపి, తరువాత జనం ఏమి చేస్తారో అని తనూ కూడా చనిపోయిందని చెప్పగానే రెడ్డి కుప్పకూలిపోతాడు. బాగా తినిత్రాగి తండ్రి బండి కట్టిఇంటికి తీసుకెళ్ళమంటే కొండల మీదనుండి తీసుకెళ్ళతూ దాహం తీర్చుకోవడానికి బండి ఆపుతాడు. అది పల్లంలోకి దొల్లిపోయి తండ్రి మరణిస్తాడు. జాతరకొచ్చిన తప్పెటగాళ్ళతోనే శవయాత్రచేసి తండ్రి అంత్యక్రియలు చేస్తాడు. మేనమామతో చివరకిలా అంటాడు. 'నాన్న ఆక్రమించుకొన్న పొలాలన్నీ ఎవరివి వారికిచ్చేయమని'. 'అప్పుడు మేనమామ నిజమేరా! ఎన్ని శిలబళ్ళు కట్టినా ఈ అరిష్టంపోదు ఆ పని చేసివస్తాను' అని సంతృప్తితో అంటాడు. ఈ కథలో జాతరలో జానపదకళాకారులు, అంకాలమ్మదేవత పూజావిధానం బలులు ఆచార వ్యవహారాలు, జాతరలో అంగళ్ళు, ఆహారవిహారాలు, భూస్వాముల భోగలాలసత, కూలి ఆడవాళ్ళని వాళ్ళు లైంగికంగా వేధించడం వాళ్ళ దౌర్జన్యాలు, కరువుకాటకాలు వస్తే, జనం దేవతలకు జాతర నిర్వహించి చేసే ఆడంబరాలు అన్ని కళ్ళకు కట్టినట్లు రచయిత చెప్పి సామాజికంగా ఎదిగిన వర్గాలు, అణగారిన వర్గాలను ఎలా బలితీసుకొంటున్నాయో రెడ్డి భగ్నప్రేమ కథ ద్వారా సహజంగా చెప్పారు.

మూడు పదుండ్ల వాన నేటి బడుగురైతుల గుండె కోతను వర్షించిన సజీవ చిత్రణ. అంకిరెడ్డి సుభద్ర దంపతులు తిరుపతిలో చదువుతున్న కొడుక్కి డబ్బులు పంపడానికి కాడెద్దులను, ఆరు ఎకరాల పొలాన్ని అమ్మమని సుభద్ర పోరుపెడితే అలాగే చేస్తాడు. అంకిరెడ్డి తనకిష్టంలేకపోయినా కూతురు పెళ్లికి కొంత పొలం అమ్ముతాడు. తరువాత కొడుకు అమెరికా

వెళ్ళాలంటే డబ్బు పంపుతాడు. చివరికి తననెవరో మోసంచేసారని అమెరికా వెళ్ళలేదని కొడుకు ఇంటికి వస్తాడు. ఇన్ని రకాల భద్యతలు మోసి నేలలేని రైతులా మిగిలిన అంకిరెడ్డి నిరాశతో వాగులోకి దూకేస్తాడు. మూడు పదుడ్ల వాన కురిసి రైతులందరూ చేలలోకి వెళ్ళుతుంటే భార్య పోరు, కొడుకు చదువు, కూతురు పెళ్ళిఅనే మూడు పదున్ల వానలో తడిసి ముద్దై నిర్వేదంలో తన జీవితాన్ని ముగిస్తాడు.

ఆరుగాలం శ్రమించి చేతికి పంట వచ్చేసమయానికి ఇంటి బాధ్యతలలో పొలాలని అమ్ముకొన్న రైతులందరికీ అంకిరెడ్డిని ప్రతినిథిగా చూపించి నేటి సమాజంలో పాలకుల బాధ్యతని సూటిగా నిలదీస్తాడు.

పుస్తకానికి శీర్షికగా పెట్టిన మొలకల పున్నమి కథలో 'పుట్టమన్నులో నవధాన్యాలు పోసి మొలకెత్తించి నువ్వులు, బెల్లం కలిపిన ప్రసాదాన్ని వారికి ఇష్టమైనవారికి పెట్టి దీపాలను కోనేటిలో వదిలితే వారి కోరిక తీరుతుందని 'పూజారి చెప్పిన మాటకు శ్యామల అను అందగత్తె తన వెంటపడుతున్న కామందు కొడుకుని పట్టించుకోకుండా అనాథ అయిన సాంబడు చనిపోయాక. అతని సమాధి దగ్గర ఆ దీపాన్ని ఉంచి, ఆ ప్రసాదాన్ని సమాధికి తినిపించడం అది చూసి కామందు కొడుకు కుప్పకూలిపోవడం ఒక మరపురాని కథ. ఈ కథలో తెలుగు ఆడపిల్లలు ఎప్పుడో మరిచిపోయిన గొబ్బిళ్ళ పాటలు, సందర్భోచితంగా చేర్చడం రచయిత సాంస్కృతిక అభిరుచికి అద్దం పడుతుంది. గంగమ్మ తల్లి జాతర తప్పెట గుళ్ళు, కోలాటం, కట్టెలాట, చెక్కభజన, కులుకు భజన లాంటి సీమ సంస్కృతిలోని కథలన్నీ కళ్ళకు కడతాయి. గూడెంలోని ఆడోళ్ళను కామదృష్టితో చూసే తరతరాల విషసంస్కృతి సాక్షాత్కరిస్తుంది.

మాండవ్యం కథలో కొత్తకాపురానికి వచ్చిన ఒక కోడలి వల్ల ఊళ్ళో కరువు కాటకాలు వచ్చాయని జనం అనుకోవడం విని ఆమె ఆత్మహత్య చేసుకోవడం, ఆమె భర్త వీరశివుడు పులిని చంపిన పరాక్రమవంతుడైనా, పిచ్చివానిగా మారిపోవడం చివరికి అతని ఆర్తి వల్ల వానలు కురిసి మాండవీనది నిండడం. ఈ కథలో భక్త సిరియాలుని కథ చెప్పడానికి రంగసముద్రం కళాకారులని రప్పించడం, కాటికాపరితో అంజనం వేయించడం వంటి ప్రజల నమ్మకాలను సహజంగా చిత్రించిన రచయిత వానలు కురవక పల్లెపెట్టిన కన్నీరుని ఆర్తితో ఒడిసిపట్టాడు. దేగల రాజ్యం కథ నేటికీ శవరాజకీయాలు నడుపుతున్న అగ్రరాజ్యాల ఆధిపత్యం పోరులో కూలిజనం నామరూపాలు లేకుండా నాశనం కావడాన్ని విషాదంగా చిత్రిస్తుంది. రాజకీయాలలో అన్నదమ్ములు, మానమర్యాదలు, మంచి, చెడ్డలు ఏవీ ఉండవని స్పష్టంగా దుమ్మెత్తిపోస్తూ వీరనాగుల పాత్ర పకీర్‌రెడ్డిని చంపడంతో ముగుస్తుంది. పల్లెలో కులాలవారీ యాస, భాష, ఆచారాలు, కట్టెదుంట బొమ్మలా కనిపిస్తాయి. 'అడ్డుగోడలను బద్దలు కొట్టుకొని మనిషిగా బయట పడటమంటే మాటలు కాదు. రహస్య హృదయాంతర విషాదం ద్వేషాగ్నిజ్వాలలు ప్రసరిస్తుంటే గుప్పెట కప్పడం అందరికీ సాధ్యంకాదు'. అని ఏడు లాంతర్ల సెంటర్ కథలో అలనాటి తెల్లదొరలకెదురు తిరిగిన వీరనాయుడు అంతరంగాన్ని ఆవిష్కరిస్తాడు రచయిత. గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమంతో ప్రభావితుడైన వీరనాయుడు దొరను ఎదిరించి భారత పతాకాన్ని ఎగురవేయడం, ఉరిశిక్ష పడటం, అతని త్యాగనిరతి మనలను కదిలిస్తాయి. అలనాటి గ్రామాలలో పిల్లలు పుట్టని స్త్రీలు జైన మత పార్శ్వనాథున్ని పూజించడం, గ్రామాచారాలు, పండుగలు కొలువులు, ఆహారం, చక్కగా వర్ణించబడ్డాయి. దీపమాను కథ ఊరి జనం ఆకలి తీర్చడం కోసం తన రాళ్ళమేడను అమ్మిన వీరశివారెడ్డి దయా హృదయాన్ని తెలిపేది. ఎడ్ల పందాలు, శివారెడ్డి సమాధి వున్న రావిచెట్టు నేటికీ చరిత్ర పుటల్లో సీమ పిల్లల్లో పౌరుషాన్ని నింపేవే అంటారు రచయిత.

పూలచేతులు కథలో జానకమ్మ పూల వ్యాపారం చేస్తూ కూతురికి పెళ్లి చేయడం. భర్తను పోగొట్టుకోవడం. మన ప్రాచీన తెలుగు సాహిత్యంలోని మెరవణి గద్యలో చెప్పడం నిజంగా అత్యంత అద్భుతంగా ఉంది. సమాజంలో వ్యసనాలకు బానిసైన మనుషుల జీవితాల విషాదం కనిపిస్తుంది. దింపుడు కళ్ళం కథలో ఊరికి ధర్మాత్ముడైన ధర్మారెడ్డి చనిపోయినప్పుడు జనం పడిన బాధను సాంస్కృతికంగా సజీవంగా నిలిపింది. అంతిమ సంస్కారాలలో సీమవాసుల పద్ధతులన్నీ చూపిస్తూ తరతరాల చరిత్రను రాసింది. మైనం బొమ్మల కథ సుగాలీ తాండాలో అందమైన ఆడపిల్లలు తమ కుటుంబాన్ని పోషించడానికి సుదూరాలకు

వెళ్లడం, తాండాలలో జాతరలు, వినోదాలు, బ్రతుకు పోరాటాలు, కన్నీళ్ళు, కష్టాలు, ప్రకృతి వర్ణనలతో సుగాలీల సామాజిక దైన్యాన్ని వెల్లడించేది. శ్రీమాన్ దొర వారికి కథలో పల్లెప్రజల ఆకలి, దీనత్వం, రాజకీయాలు, ఆర్థిక అసమానతలు సీమ మాండలికంలో సజీవంగా కదలాడతాయి.

గుంటూరు శేషేంద్రశర్మ అన్నట్లు 'సమాజాన్ని మరమ్మత్తు చేయగల శక్తి ఈ కథలకు ఉంది. సమకాలీన సమాజానికి అద్దం పట్టే వీటితో నేను ఏకీభవిస్తాను. సీమ గుండె చప్పుడు ఈ కథలో ప్రతిధ్వనిస్తుంది. సృజనాత్మకత శక్తిగల రచయిత మనోవైజ్ఞానిక సిద్ధాంతాల అవగాహనతోనూ, అదిలేకుండానూ పాత్రల అంతరంగంలోని చీకటికోణాలను అవి సృష్టించగల మానసిక సంక్షోభాలను అవగతం చేసుకోగలడు.

3 కథావస్తు స్వీకరణలో, పాత్రచిత్రణలో, సన్నివేశ కల్పనలో, కథానిర్మాణ నైపుణ్యంలో, భాషాసౌందర్య పరిపోషణలో, ఏ రచయితకు పురోగమన ధోరణి వుందో, ఏ కవికి సర్వమానవ మంగళకరమైన ఆలోచన ఉందో 4 ఆ రచయిత, కవి మాత్రమే నిలుస్తారు, గెలుస్తారు. వేంపల్లి గంగాధర్ అలాంటి కవి, మొలకల పున్నమి అలాంటి రచన. (సాహిత్యానుభూతి పేజీ. 8 4–తె.క.ర. పేజీ. 204)

**ఆధారగ్రంథాలు**

1) తెలుగు కథారచయితలు – పరిశీలనాత్మక వ్యాససంకలనం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1982, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్.
2) బుచ్చిబాబు–కథా – దాని కమామీషు–నన్ను మార్చిన పుస్తకం వ్యాసాలు, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ–1965.
3) గంగాధర్ వేంపల్లి–మొలకలపున్నమి కథా సంపుటి–2011.
4) శ్రీరామమూర్తి కోడూరి–సాహిత్యానుభూతి (సాహిత్యవ్యాసాలు) చినుకు పబ్లికేషన్స్–గాంధీనగర్, విజయవాడ–2016.

# వేంపల్లి గంగాధర్ 'మొలకల పున్నమి' లో అంకురించిన - దళిత స్త్రీ అస్తిత్వం

వడేరి నరేష్, పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

**ఉపోద్ఘాతం**

"హితేన సహితమ్ సాహిత్యం" హితాన్ని కోరుకునే తెలుగు సాహితీ ప్రక్రియలలో కథ ఒకటి. గ్రామీణులకు, జానపదులకు సైతం జ్ఞానాన్ని మౌఖిక రూపంలో చేరవేయుటలో కథా సాహిత్య ప్రక్రియ చాలా ఉపయోగకారి. ఆధునిక తెలుగు సాహిత్యంలో విస్తృత ప్రచారం పొందిన వచన ప్రక్రియ కథ. వివిధ ఉద్యమాలు సైతం కథలరూపంలో వచ్చాయి. ఆఖ్యాన వచన వాఙ్మయంలో నవల తరువాత పుట్టిన కథా విశేషమే కథానిక.

ప్రాచీన వాఙ్మయములోని కథలన్నీ మానసిక ఉల్లాసం కోసమో లేదా కాలక్షేపం కోసమో వ్రాసినవే. పాలవేకరి కదిరీపతి రచించిన శుకసప్తతి గ్రంథంలో చిలుక 70 రాత్రులలో రాణిగారిని నిద్రపుచ్చుటకోసం రాయబడింది. ఆధునిక రచనలలోని కథాసాహిత్యం ప్రజలను నిద్రావస్థనుండి జాగృతావస్థలోనికి తీసుకురావడానికి వచ్చిన నేపథ్యం గల సాహిత్యం. గురజాడవారి దిద్దుబాటుతో ప్రారంభమైందని బావిస్తున్న తెలుగు కథ ఈనాడు అనంత ముఖాలుగా వికసించింది. మన తెలుగునాట కథకులెందరో ఉన్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క దృక్పథం. దళిత వాద దృక్పథం, స్త్రీవాద దృక్పథం, ప్రపంచీకరణ దృక్పథం, రాజకీయ దృక్పథం, అస్తిత్వవాద దృక్పథాలతో వివిధ ధోరణులతో రచయితలు తమ కథలను వెలువరించారు.

**రచయిత పరిచయం**

వేంపల్లి గంగాధర్ కడపజిల్లాకు చెందినకవి, కథకుడు. కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న తొలి తెలుగు రచయిత. రాష్ట్రపతి భవన్ 'ఇన్ రెసిడెన్సీ ప్రోగ్రామ్'కు ఎంపికయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో 2014 సెప్టెంబర్ 8వ తేదీనుండి 26వ తేదీ వరకు విశిష్ట అతిథిగా వీరు విడిదిచేశారు. కేంద్ర సాహిత్య అకాడమీవారి 'రైటర్స్ ట్రావెల్ గ్రాంట్' ప్రోగ్రామ్ ద్వారా రవీంద్రనాథ్ ఠాగూర్ 150వ జయంతిని పురస్కరించుకొని 2011 ఏప్రిల్ 27నుంచి మే 7వ తేదీవరకు శాంతినికేతన్‌లో పర్యటించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. వీరి పాపాగ్ని కథలు 'కడప ఆకాశవాణి కేంద్రం' నుంచి ధారావాహికగా ప్రసారమయ్యాయి. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎం.ఏ విద్యార్థులకు వీరి నవల 'నేల దిగిన వాన' పాఠ్యాంశంగా వుండేది. వీరు రచించిన 'మొలకల పున్నమి' కథా సంకలనానికి 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది.

**రచనలు**

నేల దిగిన వాన, యురేనియం పల్లె, సి.పి.బ్రౌన్‌కు మనమేమి చేశాం, అనంతపురం చరిత్ర, మొలకల పున్నమి, హిరణ్యరాజ్యం, దేవరశిల, గ్రీష్మభూమి కథలు, రావణ వాహనం కథలు మొదలైనవి.

**మొలకల పున్నమి కథా సారాంశం**

ఆంధ్రదేశంలో భౌగోళిక పరిస్థితుల రీత్యా వెనుకబడిన ప్రాంతం రాయలసీమ. ఈ రాయలసీమను రాళ్ళ సీమ, రేనాడు, దత్తమండలం అని పిలుస్తారు. ఈ సీమలో కడప జిల్లా ఒకటి. కడప జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న భూస్వామ్య

వ్యవస్థకు, దళిత స్త్రీ కూలీలమధ్య వున్న సంబంధాలను, దళిత స్త్రీ కూలీలకు జరిగే అన్యాయాన్ని గురించి తెలియజేసేదే ప్రస్తుత కథా సంకలనంలోని ఒక కథ మొలకల పున్నమి.

మొలకల పున్నమి కథలో ప్రధాన పాత్ర శ్యామల. ఇతర పాత్రలు– సాంబుడు, పీరమ్మవ్వ, భూస్వామి కుమారుడు.

ప్రస్తుత కథా నాయిక శ్యామల దళిత స్త్రీ కూలీ, పెళ్లికాని పిల్ల, అందగత్తె. ఇరుగుపొరుగు స్త్రీలతో కలిసి శ్యామల గ్రామంలో వున్న పెద్దకారు సన్నకారు రైతుల పొలం పనులకు వెళ్ళేది. ఒక భూస్వామి పొలం పనులకు తరచుగా వెళ్తున్న సందర్భంలో భూస్వామి కుమారుడు వయస్సులో వున్న శ్యామల అందం మీద కన్నేశాడు. ఏ విధంగానైనా అనుభవించాలని ఆమె నుండి శారీరక సుఖాన్ని పొందాలని తలచాడు. భూస్వామి కుమారుడికి క్షణక్షణం మనసులో ఈమె గుర్తొస్తూ వుండేది. ఒకానొక రోజు ఇంట్లో పనివాడిగా వున్న సాంబడి దగ్గర తన మనసులో వున్న భావాన్ని వ్యక్తపరచాడు. ఆ సాంబడు ఇలాంటి వ్యవహారాలలో నన్ను లాగకండి అని తప్పించుకున్నాడు. అయినా భూస్వామి కుమారుడికి తన మనస్సులో వున్న దుర్బుద్ధి తొలగలేదు. ఒకానొక సాయంకాలం శ్యామల తోటి కూలీ అయిన పీరమ్మవ్వ దగ్గర భూస్వామి కుమారుడు సింతమాన్ల బాయికాడికి రమ్మని ఆ యమ్మిని పిలుచుకు రమ్మని కబురు పంపగా శ్యామల తిరస్కరించింది. కొద్దిరోజుల తర్వాత భూస్వామి కుమారుడు తన పొలంలో పనులకు గాను కూలీలను కబురు పెట్టడానికి కూలీ వాడలోకి వెళ్ళగా, అక్కడున్న కుక్కలు భౌభౌమని భయపెట్టి పరుగులు తీయించగా నీళ్ళ నూతిలోకి పడేటట్లు చేశాయి. అక్కడికి వచ్చిన శ్యామల, పీరమ్మవ్వ, తోటి జనాదులు క్షేమంగా గట్టుకు చేర్చారు. ఆ సన్నివేశాన్ని చూసి శ్యామల తెగ నవ్వుకుంది.

పంట పొలాలకు నీళ్ళు కట్టడంకోసం భూస్వామి ఇంటి పనివాడయిన సాంబుడు ఒకానొక రోజు సెండుమల్లెపూలతోట దగ్గర నీళ్ళు కడుతూ వుంటే సాంబడిని నల్లనాగుపాము కాటేసింది. అతడు అక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న భూస్వామి కుటుంబం, ఇరుగుపొరుగు ప్రజలందరూ చేరి పొలంలోనే అతని అంతిమ సంస్కారాలు చేశారు.

భూస్వామి కుమారుడుకి మాత్రం మనసులో శ్యామల పదే పదే గుర్తొస్తుంది. దళిత వాడలో వెలసిన గంగమ్మతల్లికి మొలకల పున్నమి రోజున రాత్రి దేవళం జరుగుతుందని చాటింపు వేశారు. ఈ దేవళానికి భూస్వామి కుటుంబాన్ని పీరమ్మవ్వ ఆహ్వానించింది. సామి మీరు కూడా తప్పక రావాలని శ్యామల కూడా వస్తుందని భూస్వామి కుమారుడికి ప్రత్యేకంగా ఆహ్వానించింది. భూస్వామి కుమారుడు పీరమ్మవ్వకు అరమూట బియ్యం, పచ్చిశెనగ కాయలు ఇచ్చి పంపుతాడు. శ్యామల పేరు వినగానే భూస్వామి కుమారుడికి శరీరంలో వున్న నరాలు మొత్తం జివ్వుమన్నాయి. మొలకల పున్నమి రానేవచ్చింది. సాయంకాలం అయింది. భూస్వామి కుమారుడు కూలీల గూడెం వైపు బయలు దేరాడు. ఎట్టయినాగానీ ఈ యాల ఆ అమ్మిని అనుభవించాలనే కోరిక గాఢంగా వున్నది. గంగమ్మ గుడికాడ జోరుగా పలకలు మోగుతున్నాయి. చెక్కభజనలో గురువులయ్య గొంతు వినబడతాండాది. వయస్సులో వుండే కన్నెపిల్లలంతా బహుచక్కగా ఈ పున్నమినాడు నవధాన్యాలను మొలకలు తెప్పించడంలో పోటీపడుతున్నారు. గుడికాడ సందడి ప్రారంభమైనది.

చెక్కభజనలో గురువులయ్య గొంతును అనుసరిస్తూ శ్యామల పాట అందుకున్నది.

**"రావణా నీ ఆగడాలు చాలించుకోవయ్యా**
**అగ్నిలాంటి సీతమీద మనసు నీకు ఏలయ్య**
**తద్దింకి తాంతై... తద్దినక తాంతై"** (పుట. 39)

**"మొక్కులు మొక్కుకుంటాం గంగమ్మ తల్లి**
**సల్లంగ మమజూడు గంగమ్మ తల్లి**
**ఎండి కోరలు సేసిత్తాం గంగమ్మతల్లి**
**ఎండి ముక్కెర సేసిత్తాం గంగమ్మతల్లి"** (పుట. 37)

అని తన సొంత గొంతుకతో పాడుతూ వుండగా... ఇదే అదునైన సమయమని గంగమ్మ గుడి దగ్గరకు భూస్వామి కొడుకు ప్రవేశించాడు. గురువులయ్య పెళ్లికాని అమ్మాయిలందరికీ మంచి మొగుళ్ళు రావాలని ఈ గంగమ్మ తల్లి సాక్షిగా కోరుకుంటాడాను అని చెప్పి నానబెట్టిన బియ్యంలో నల్లనువ్వులు, బెల్లం కలిపిన ప్రసాదం, మట్టి దీపపు ప్రమిద తీసుకొని ఇష్టమైన వారి చేతిలో పెట్టండి అని గురువులయ్య ఆజ్ఞాపించాడు.

కన్యలందరూ దీపపు ప్రమిదను కోనేరు దగ్గర పెట్టడానికి బయలుదేరగా ఆ సమూహం నుండి శ్యామల విడిపోయి పొలాల మార్గాన పట్టింది. శ్యామలను అనుసరిస్తూ భూస్వామి కుమారుడు కూడా మార్గంపట్టాడు. కటిక చీకటిగా వున్నది. దారి అగుపించలేదు. శ్యామల పొలాల మార్గంలో కొండలు, గుట్టలు, రాళ్ళూరప్పలు దాటుతూ భూస్వామి పొలంలోని చెండుమల్లె పూలతోటలోకి ప్రవేశించింది. తోటలోని సాంబడి సమాధి దగ్గరకు సమీపించింది. సమాధిదగ్గర దీపపు ప్రమిదను వుంచి ప్రసాదాన్ని సాంబడి సమాధికి తినిపిస్తున్నది. ఆ దృశ్యాన్ని చూసి భూస్వామి కుమారుడు నివ్వెరపోయాడు. శ్యామల ఏడుస్తూ వర్షంలో తన ముఖానవున్న కుంకుమ బొట్టును చెరిపేస్తూ తన చేతులలో వున్న గాజులను పగలగొట్టుకుంది. శ్యామల ఆ వర్షంలో సమాధిమీదనే పడి విలపిస్తూ వున్నది. ఇది ఈ కథా సారాంశం.

**దళిత స్త్రీ శ్యామల అస్తిత్వం**

ఈ కథలో ప్రధానపాత్రగా దళిత స్త్రీ శ్యామల కనిపిస్తుంది. భూస్వామి కుమారుడు ఈ కథనంతా చెపుతున్నట్లుగా రచయిత చెప్పడం విశేషం. ఈ కథ సెండుమల్లెపూల తోట దగ్గర వర్ష వర్ణనతో ప్రారంభమై, చివరకు అక్కడే అదే సన్నివేశంతో ముగిస్తాడు. శ్యామల చాలా అందమైనదని, రచయిత ఆమె అందాన్ని గురించి ఈ కథలో చాలాచోట్ల వర్ణిస్తాడు. "ఔ... వస్తాంది ఆ యమ్మి శ్యామల! పూసిన కాడికి కోసిన సెండుమల్లె గంప నెత్తికెత్తుకుని గట్టు దావెంబడి నడిసొస్తాందే ఆయమ్మి అందం దిక్కే సూడాలనిపిస్తాంది... మొన్న ఆ సింతమాన్ల బాయికాడికి ఆయమ్మిని పిల్చుకరమ్మని పీరమ్మవ్వకు చెప్పంపితే 'నే నట్టాటిదాన్ని కాన'ని చెప్పమనిందట. యింగ సేసేదేందుంది? అయినా నా కుర్రతనం ఎట్టా నిద్రపోతాది? ఆయమ్మిని అందుకునేదాకా దాని అందమే గుర్తొచ్చి సంపుతాంటే.. ఆయమ్మి తడిసిన సొగసు సెండ్ల వయ్యారం ఇంగోపక్క రవ్వంతసేపు ఊపిరాడలేదు. ఆయమ్మి వెనకాల వస్తాండే కూలికొచ్చిన ఆడోళ్ళు లేకుంటే దాని పని జెప్పిందు. దానెక్క తప్పించుకుంది. నన్ను చూసి సూడనట్టు సూస్తాపాయె ఆయమ్మి. నేనేమో ఆయమ్మి ఎల్లబారిపోయిన దిక్కుకే చూస్తాంటి" (పుట. 30-31). ఈ విధంగా ఈ కథలో శ్యామల అందాన్ని వర్ణిస్తూ, ఆమెను ఎలాగైనా లోబరుచుకోవాలనే ఉద్దేశ్యం గల వాడుగా భూస్వామి కొడుకు కనిపిస్తాడు.

అలాగే శ్యామల గొబ్బిపాట పాడుతూ వీధివెంట వచ్చినప్పుడు-

> **"పాప నిధుల శిశుపాలుని తిట్టిన**
> **కోపకానికిని గొబ్బిళ్ళో**
> **యేపున గంసుని యిడగుల బెట్టిన**
> **గోపబాలునికి గొబ్బిళ్లో..."**

అంటూ శ్యామల పాటపాడే వారిలో వుందని, అప్పుడు ఆమె అందాన్ని వర్ణిస్తూ 'ఆయమ్మి సిగలోకిజేరిన సెండుమల్లి సూర్యుణ్ణి కోసుకొచ్చి కురుల్లో కూర్చినట్లుంది. ఆయమ్మి సొగసుకు సెండుమల్లె వెలుగు సక్కగా కుదిరింది. అట్నే చూస్తుండి పోతి" (పుట. 32-33) అంటాడు.

ఈ కథలో శ్యామల దళిత స్త్రీ అయినప్పటికీ బాగా పాటలు పాడుతుందని రెండు, మూడు సందర్భాల్లో వర్ణిస్తాడు. గొబ్బిపాట పాడే సందర్భంలోనూ, గంగమ్మ గుడికాడ జరిగే దీపారాధన సందర్భంలో గంగమ్మకు మొక్కులు మొక్కుకొని చెల్లించుకుంటామంటూ పాటలు పాడినట్లు కనిపిస్తుంది.

భూస్వామి కొడుకు శ్యామల అందాన్ని చేజిక్కించుకోవాలని అనుకొని అందుకోసం పీరమ్మవ్వనే కాకుండా తన దగ్గర పనిచేసే పాలేరు సాంబశివుడిని కూడా సహాయం చేయమని అడుగుతాడు. అందుకు సాంబుడు పడిపడి నవ్వుతూ 'నీ యవ్వారం నాకు తెల్దా. ఆయమ్మి సంగతి అంటండవంటే ఆ తిరకాసు నాకు తాల్దా!' అంటాడు. అందుకు వెటకారంగా ఔ.. వుంది నాకూ ఆయమ్మికి మధ్యన జంజాటం' అంటాడు. అలాగే ఆమెతో మాట్లాడి సరిజేసిపెట్టమంటాడు. అందుకు 'సామీ.. ఏదో కల్లంకాడ పొలంకాడ పనిసేసుకునేటోడ్ని, నన్నెందుకు ఇరికిస్తావు లంపలాటలోకి. నీకో దండం..' అంటూ సాంబుడు తప్పించుకుంటాడు.

సాంబుడు చనిపోయాక గంగమ్మ దేవళం దగ్గర మొలకల పున్నమి పండుగకి భూస్వామి కొడుకుని రమ్మని పీరమ్మవ్వ పిలవగా నేనెందుకులే అంటాడు. అందుకామె శ్యామల అక్కడే వుంటదని చెప్తుంది. శ్యామలను గుర్తుచేయగానే 'శ్యామల అని గుర్తుజేసే సరికి మళ్ళీ ఒంట్లో నిద్రపోతాండే నరాలన్నీ ఒక్కసారి జివ్వుమన్నాయి. ఇది రాతిరి జేసుకునే పండగ్గాబట్టి యమ్మి దొరికినా దొరుకుతుంది. ఎట్టయినా గానీ ఈ యాల ఆయమ్మిని అనుభవించాలనే కోరిక' అంటూ తాను దేవళం దగ్గరకు వెళతాడు. ఆడపిల్లలందరూ నవధాన్యాలను మొలకలు తెప్పించి, అందులో నానబెట్టిన బియ్యం, నల్లనూగులు, బెల్లం కలిపిన ప్రసాదాన్ని తమకు ఇష్టమైన వారికి ఇవ్వాలని, అలాగే మట్టి ప్రమిదల్లో వెలిగే దీపాలను వారికిష్టమైన వారిని మదిలో తలచుకొని ఏటిగట్టునున్న కోనేరు వదలాలని గురువులయ్య చెపుతాడు.

గురువులయ్య చెప్పినట్లు శ్యామల కోనేరు దగ్గరకు వస్తుందని భూస్వామి కొడుకు కాపుకాస్తాడు. ఎలాగైనా ఈ రోజు ఆమె అందాన్ని అందుకొని తీరాలని అనుకుంటాడు. అందరూ కోనేరు దగ్గరికి వచ్చినా ఆమె దారి మార్చుకొని వెళుతూ వుంటే ఆమెవెంటే పడతాడు. ఆయమ్మిని ఎట్లాగైనా అందుకొని అనుభవించాలనే ఉబలాటం ఉప్పెనై పొంగుతూ గుండె తనకలాడుతుందంటాడు. ఆమె ఎక్కడా ఆగకుండా రాళ్ళగుట్టలవెంట వెళుతూ వుంటే ఒక్కసారిగా అతనికి భయం వేస్తుంది. అలా వెళుతూ వెళుతూ సాంబడి సమాధి దగ్గరకు వెళ్ళి 'సేతికుండే గాజులు పగలగొట్టుకుంది. నుదిటి బొట్టు చెరిపేసుకుంది. పడి పడి ఏడుస్తాంది. పైట కొంగులోంచి నూగుల బెల్లం వుంటతీసి సమాధికి తినిపిస్తాంది'. తాను మాత్రం నిల్చున్నచోటే కుప్పకూలిపోయినట్లు రచయిత చిత్రించాడు. ఈ కథ చివరలో జరిగిన ఈ సన్నివేశంలో శ్యామల సాంబడిని తన భర్తగా భావించినట్లు కనిపిస్తుంది. అందుకే భూస్వామి కుమారుడు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వున్నట్లుగా రచయిత చెపుతాడు. దీనిద్వారా దళిత స్త్రీలు మనస్సును ఒకరికి అర్పిస్తే, చనిపోయినా సరే వారినే తలచుకొంటూ జీవిస్తారనే విషయాన్ని రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

శ్యామల కులంలో తక్కువదైనా, గుణం గొప్పదిగా తీర్చిదిద్దాడు. అలాగే తోటి దళిత స్త్రీలతో చేరి ఎర్రని ఎండలో కాయకష్టంచేసే కష్టజీవిగా చిత్రించాడు. ఎన్నోసార్లు భూస్వామి కుమారుడు శ్యామలను లొంగదీసుకోవాలని ప్రయత్నించినా తప్పుచేయని శీలవతిగా కనిపిస్తుంది శ్యామల. పీరమ్మవ్వ బలంవంతం చేసినా తప్పుచేయడానికి ఒప్పుకోని ధీరురాలు. మనసారా ఇష్టపడిన సాంబడిని కోల్పోయి తన దు:ఖాన్ని సైతం మనసులో దిగమింగుకున్నది. తమ ప్రేమను సమాజం ఒప్పుకోదని మనసులోనే దాచుకున్నది. శ్యామల గురువలయ్య గాత్రంతో చేరి పాటలుపాడే మంచి గాత్రశుద్ధి కలది. గురువులయ్య పాటలను అనుసరిస్తూ పాటలు పాడేది. చీకటిలో సైతం ఒక్కతే పొలంనుండి వచ్చివెళ్ళే ధైర్యశాలిగా కనిపిస్తుంది. ఇష్టపడిన సాంబుడు మరణించినా, మరోవ్యక్తిని మనసులోకికూడా రానివ్వని గొప్ప మనోనిబ్బరంగల స్త్రీ. ఈ కథలో శ్యామల అస్తిత్వాన్ని రచయిత పలు కోణాల్లో చిత్రించి, కథానాయికగా తీర్చిదిద్దడంలో కృతకృత్యుడయ్యాడనడంలో ఎలాంటి సందేహంలేదు.

**ఉపసంహారం**

ఈ కథలో రచయిత రాయలసీమ గ్రామీణప్రాంత స్త్రీల బతుకులను అద్దంలో చూపించాడు. సమాజం నుండి వెలివేయబడ్డ దళిత స్త్రీలు కేవలం శారీరక శ్రమను చేసుకుంటూ వ్యవసాయ పనిని మాత్రమే నమ్ముకొని వున్నారు. దళిత స్త్రీలు విద్యకు దూరంగా ఇంటిపని, వంటపనికే సరిపోతున్నారు. సమాజంలో దాదాపు పారిశుద్ధ్య పనులు (పాకీపనులు) చేసేది దళిత స్త్రీలే.

మొలకల పున్నమి కథలో శ్యామలను శారీరకంగా వాడుకోవాలనే భూస్వామి కొడుకులాంటి వారు నేటి సమాజంలో ఎందరో వున్నారు. నేటి సమాజంలో శారీరక సుఖంకోసం దళిత స్త్రీలను కోరుకున్నప్పుడు అదే పై వర్గాలలోని పురుషులు దళిత స్త్రీలను వివాహం చేసుకొనుటకు వెనుకంజ వేస్తున్నారు. ఈ మోసపూరిత సమాజంలో దళిత స్త్రీలు అక్షరాశ్యులుగా మారి వారి జీవనాన్ని ప్రగతి పథంలో వుంచి అంటరాని తనానికి దూరంగా వుంటూ సమసమాజ స్థాపనలో మొదటి అంజ వేయాలని రచయిత కాంక్ష, మనందరి ఆకాంక్ష.

**ఉపయుక్త గ్రంథాలు**

1. కథా శిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య
2. మొలకల పున్నమి – వేంపల్లి గంగాధర్
3. రాయలసీమ సమాజం – సంస్కృతి – బండి నారాయణస్వామి (సంపాదకుడు)

# శ్రీసాధన పత్రిక - సీమ సాహితీ వైభవం

డా. పెరుమాళ్ళ రవికుమార్, నంధ్యాల

సీమ సాహితీ స్వరం శ్రీ సాధన పత్రిక గ్రంథకర్త అప్పిరెడ్డి హరినాథరెడ్డి. వీరు అనంతపురం జిల్లా, గాండ్ల పెంట మండలంలోని తాళ్ళకాల్వ గ్రామంలో ఉత్తమ్మ, రాఘవరెడ్డి దంపతులకు 1980 జూన్ 20న జన్మించారు.

వీరు రాయల సీమ ముఠాకక్షల కథలపై పరిశోధన చేసి పి.హెచ్.డి. పట్టా పొందారు. రాయలసీమ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, సమకాలీన సమస్యలపై 80 వ్యాసాలు, 8పరిశోధనా పత్రాలను సమర్పించారు. వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం, రాయలసీమ ఫౌంధేషన్ తదితర సంస్థల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రాయలసేమలో వెలువడిన అలనాటి పత్రికలను పరిశోధించి అందులోని సాహిత్య, సామాజిక అంశాలను వెలుగులోకి తీసుకురావటానికి మహత్తర ప్రయత్నం చేస్తున్న మహనీయుడు. అప్పిరెడ్డి హరినాథ రెడ్డి. కుప్పం విశ్వ యంలో ఎం.ఏ పూర్తి చేశారు. బూదాటి వెంకటేశ్వర్లు వద్ద డాక్టరేట్ చేసి ప్రస్తుతం ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.

రాయలసీమ నుండి నడిచిన పత్రికలలో పప్పూరు రామాచార్యుల సంపాదకత్వంలో వచ్చిన 'శ్రీ సాధన' పత్రిక అగ్రగామి. దీనిని రాయల సీమ 'భారతి' అని కూడా అంటారు. ఈ పత్రిక అన్ని గ్రంథాలయాలలో అందుబాటులో లేనిది. శ్రీ హరినాథరెడ్డి పత్రిక ప్రతులను సంపాదించి అందులో వచ్చిన కవితలన్నింటిని 'శ్రీసాధన కవిత్వం' పేరుతో ప్రచురించారు. తర్వాత 'శ్రీసాధన' పత్రికలో వచ్చిన మొత్తం సాహిత్యమును ప్రక్రియల పరంగా పరిచయంచేసి 'సీమ సాహితీ స్వరం–శ్రీ సాధన పత్రిక'అనే గ్రంథం ప్రచురించారు. ఈ గ్రంథానికి 2014 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. తర్వాత 'శ్రీసాధన' పత్రికలో వచ్చిన మొత్తం సాహిత్యమును ప్రక్రియల పరంగా పరిచయం చేసి 'సీమ సాహితీ స్వరం–శ్రీ సాధన పత్రిక' అనే గ్రంథం ప్రచురించారు. ఈ గ్రంథానికి 2014 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. శ్రీసాధన పత్రికలో వచ్చిన సాహిత్య పరిచయం ఈ గ్రంథం.

సాధన పత్రిక పుట్టు పూర్వోత్తరాలను కూడా రచయిత తెలియజేశాడు. ఇదొక బాధ్యతాయుతమైన పరిశోధన. ఒక సిద్ధాంత గ్రంథంలాగా మంచి ప్రణాళిక వేసుకొని హరినాథ రెడ్డి ఈ గ్రంథంను రచించారు. ఒక్కొక్క ప్రక్రియలో వచ్చిన రచనల్ని ఒక్కొక్క అధ్యాయంలో చర్చించారు. ఈ అధ్యాయాలన్నింటిని చదివిన తర్వాత ఏమనిపిస్తుందంటే రెండు అంశాలను చెప్పుకోవాలి. ఒకటి తెలుగు సాహిత్య చరిత్రను తిరిగి రచించాలి. కోస్తాప్రాంత సాహిత్య ప్రధానంగా వచ్చిన తెలుగు సాహిత్య చరిత్రలను, తెలంగాణ, రాయలసీమ సాహిత్యాలను సమన్వయంగా చేసి ఖాళీలను పూరించి సమగ్ర తెలుగు సాహిత్య చరిత్రలను రచించాలి.

ఇప్పటి దాకా తమ వెనుకబాటు తనాన్ని గుర్తించిన రాయలసీమ సాహితీపరులు తాము తామనుకున్నంత వెనుకబడలేదని ముందుబడిన ప్రాంతంతో కొంచెం అటు ఇటుగా కలిసే నడుస్తున్నామని గుర్తించాలి. ఇక మీదట మన వెనుకబాటుతనాన్ని గురించి కాక మన పురోగమనాన్ని గురించి మాట్లాడుకోవాలి. అని ముందుమాటలో బూదాటి వెంకటేశ్వర్లు అంటారు.

1926లో పప్పూరు రామాచార్యుల సంపాదకత్వాన అనంతపురం కేంద్రంగా వెలువడిన పత్రిక 'శ్రీసాధన పత్రిక' అని తెలిసింది. వెలుగులోకి రాని సీమసాహిత్యానికి సంబంధించిన చాలా అంశాలు ఈ పుస్తకంలో కన్పిస్తాయి.సాధన పత్రికలో దేశ విదేశాలలో జరిగే విషయాలతో పాటు ప్రత్యేకించి రాయలసీమ ప్రాంతాలలోని జాతీయోద్యమం, సంఘ సంస్కరణ, సేవా సంస్థలు, ప్రజల స్థితిగతులు, కరువులు, క్షామ నివారణ, సాగు నీటి సమస్యలు, అభివృద్ధి, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి మొదలైన ఎన్నో విషయాలు ప్రతిబింబిస్తాయి. రాయలసీమలోని అనేక ఆధునిక సాహిత్య ప్రక్రియల వికాసానికి పట్టుకొమ్మగా సాధన పత్రిక నిలిచిందని చెప్పవచ్చును. పత్రికా నిర్వహణలో పప్పూరు రామాచార్యులు చూపిన నిబద్ధత తరువాత తరాల వారికి అడుగుజాడగా నిలిచింది అనడంలో అతిశయోక్తి లేదు.

శ్రీసాధన పత్రిక గురించి సర్దేశాయి తిరుమలరావు, శ్రీ గాడిచర్ల సర్వోత్తమ రావు ఏర్పరిచిన ఒరవడిలో పప్పూరు వారు పత్రికా రచన సాగించారు. సత్యం కఠోరమైనది. కావున సత్య వాక్య రచన వలన ఆచార్యుల వారికి కష్ట నిష్టూరాలు తప్ప లేదని పేర్కొన్నారు. తిరుమల రామాచంద్రరావు కూడా తన అభిప్రాయాన్ని చెప్తూ... సాధన పత్రిక సాధించిన విజయాలు ఘనమైనవి. సంఘంలోని కుళ్ళును, ప్రభుత్వ ఉద్యోగములలోని అవినీతిని సాధన పత్రిక తీవ్రంగా విమర్శించేది. ఉద్యోగులకు సాధన పత్రిక అంటే గుండె గుభేలుమనేదని తిరుమల రావు గారు అభిప్రాయ పడ్డారు. శ్రీ సాధన పత్రిక మొత్తం రెండు వందల అరవై ఐదు పుటలలో పదహారు భాగాలుగా విభజించి రాయడం జరిగింది. శ్రీసాధన పత్రిక పూర్వాపరాలు, కవిత్వం, కథా సాహిత్యం, నాటికా సాహిత్యం, నాటక సాహిత్య విశ్లేషణ ఆదోని పురాణ సంఘ ఉపన్యాసాలు, లేఖా సాహిత్యం, యాత్ర చరిత్రలు, శాసనాలు, శీర్షికలు, వ్యావహారిక, గ్రాంథిక భాషా వాదాలు, పత్రికల వివరాలు, పుస్తక విమర్శలు, సాహిత్య సంస్థలు – కార్యక్రమాలు, సాహిత్య విమర్శ వ్యాసాలు, సాహితీ సహృదయ చూడామణి –పిట్ దొరసానమ్మ మొదలైన అంశాలుగా విభజించి పరిశోధనను సాగించారు. అప్పిరెడ్డి హరినాథరెడ్డి.

పప్పూరు రామాచార్యులకు 'పినాకిని' పేరు మీదుగానే పత్రిక నడపాలని ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదు. రామాచార్యులు తన ముద్రణాలయం పేరు మీదుగానే శ్రీ సాధన వారపత్రికను అనంతపురం జిల్లా కేంద్రంగా స్థాపించారు. 1926 ఆగష్టు14న మొదటి సంచిక వెలువడింది. ప్రధాన సంపాదకుడు పప్పూరు రామాచార్యులు, సహసంపాదకుడుగా కర్ణ మడకల రామకృష్ణమాచార్యులు ఉండేవారు. ప్రతి శనివారం పన్నెండు పుటలతో సాధన పత్రిక వెలువడేది.

సాధన ముద్రణాలయంలో ఇతర పుస్తకాలు కూడా ప్రచురించే వారు. సాధన ప్రతి సంచికలోను మొదట పుట ప్రధాన శీర్షిక క్రింది భాగాన భారతంలోని...

**ఆ.వె.** **'కార్యగతుల తెరగు కలరూపు చెప్పిన**
**నధికమతులు దానినాదరింతు**
**రల్పబుద్ధులైనయట్టి వారలకది**
**విరస కారణంబు విషమువోలె'** అనే పద్యాన్ని ప్రచురించేవారు. కావిత్వ విషయానికి వస్తే ఈ సాధన పత్రికలో 1926 నుండి 1968 వరకు దాదాపు నూటా అరవై దాకా కవితలు ప్రచురితమయ్యాయి. గేయం, కీర్తన, వచన కవిత్వం, చిన్నచిన్నపద్యాలు, దీర్ఘ గేయం, కవిత్వం వెలువడింది.

అనంతపురం జిల్లా మరియు పరిసర ప్రాంతాలలోని పరిస్థితులు ఈ కవితలలో ప్రతిబింబిస్తాయి. సాధన పత్రికలో జాతీయోద్యమంలో భాగంగా సంఘసంస్కరణ, హరిజనాభ్యుదయం, స్వదేశీవస్త్రవాదకం, అహింసాతత్త్వం, మద్యపాన నిషేధం తదితర అంశాలు ఇందులో కనిపిస్తాయి. సంప్రదాయ కవిత్వంలో రాయలసీమకు ప్రత్యేకత ఉంది.

సరసకవి కృష్ణారావు రాసిన ధర్మజుని యద్వేగము, ఘట కర్ణుడు, చాపాచార్యుడు మొ॥ పద్య ఖండికలు,రెడ్డి భీమారావు రాసిన ఫల్గుణ ప్రస్తుతి, భీష్మ సౌజన్యము పద్య ఖండికలు, పాదిరాజు కృష్ణారావు రాసిన భజగోవిందం, కసాపురం నీళ్ళనారాయణప్ప

రాసిన శ్రీభగవద్గీతోపదేశ సంగ్రహము, యం.శివయ్య రాసిన ప్రణయోత్కలిక,యువకవి కలం పేరుతోగల ప్రణయ ప్రకృతి పద్యాలు, విద్వాన్ విశ్వం అనువాదమైన 'ఏరినపూలు', తలమర్ల కళానిధి రాసిన 'గిజిగాడు' కవితలు ప్రచురితమయ్యాయని తెలియజేశారు. గా.వీ.రా అనే కవి రాసిన భారతీయ ప్రబోధం, సాదలి రామస్వామి రాసిన పాట, శ్రీఖాద్రీ నరసింహ సోదరులు రాసిన భక్తకల్పద్రుమ శతకము, బత్తలపల్లి నరసింహారావు రాసిన కర్తవ్యము అనే కవిత జాతీయోద్యమ కవిత్వం క్రింద వివరించారు. జాతీయోద్యమంలో భాగంగా స్వదేశీ వస్త్రాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ వచ్చిన కవిత్వం ముద్రించబడింది. రామకృష్ణ సీతారామ కవులు రాసిన 'రాడము' శ్రీమతి కర్రా సుబ్బలక్ష్మమ్మ రాసిన 'భరతమాత'కవితను ప్రచురించారు. అలాగే కరణం వెంకట శేష గిరిరావు రాసిన జంతుహింస, ఓబళం నారాయణ రెడ్డి రాసిన మద్యపాన నిషేధ ప్రచారము అనేకవిత, పప్పూరు రామాచార్యులు రాసిన 'కల్లు పెంట'నాటిక, మంచిరాజు నల్లయ్య మద్యపానంబునికనైనా మానరయ్యా అనే పద్యాలు, కరణమ కృష్ణారావు రాసిన ఓటరుల సందేహ పంచరత్నములు, కూమరశర్మ రాసిన హితోపదేశం ఓట్లకు సంబంధించిన కవితలు. దీనుల మొర, శ్రీశ్రీ ప్రతిజ్ఞ, టి. గురుమూర్తి రాసిన 'హృదయ వేదన', విద్వాన్ విశ్వం రాసిన 'అనందం' అనే కవిత సొంటి శ్రీనివాస మూర్తి రాసిన 'నిరుద్యోగం', విద్వాన్ విశ్వం రాసిన' ఘోరం' కవిత, లేపాక్షి పంచాంగం సూరప్ప రాసిన లేపాక్షి దుర్గాలయం, ఏ.వి. సుబ్బారెడ్డి రాసిన 'హోలికుడు', కె.శేష శర్మ రాసిన 'మేఘమా', కృష్ణారావు రాసిన 'ప్రజాసం తాపము' ఈవిధంగా శ్రీసాధన పత్రికలో అర్ధ దశాబ్ద కాలంపాటు కవిత్వం వెలువడింది. ఆయా కాలాలలోని సామాజిక పరిస్థితులను, పరిణామాలు ఈ కవిత్వంలో చోటుచేసుకున్నాయి. రాయలసీమలో కథాసాహిత్యం కొంత ఆలస్యంగా ప్రారంభమైనదనే విమర్శ ఉంది. 1941లో గుత్తి రామకృష్ణ రాసిన 'చిరంజీవి' కథ తొలి రాయలసీమ కథ అని రాచపాళెం చంద్ర శేఖరరెడ్డి పేర్కొన్నారు. సౌందర్య వల్లి మాసపత్రికలో 'కడపటి పైసా' అనే కథను రాయలసీమ మొదటి కథగా చెప్తారు.

శ్రీ సాధన పత్రికలో 1926-1941 వరకు దాదాపు 20కి పైగా కథలు ముద్రించబడ్డాయి.అందులో ఆధునిక సమాజంలో విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులని అవగాహన చేసుకొన్న ఒక స్త్రీ పాత్ర ద్వారా 'ఒక చిన్న కథ' అనే కథలో తెలియజేశారు.'ఒక కథ-ఇరువురు యాత్రికులు' అనే కథ,మన బెబ్బులి,భగీరథ ప్రయత్నం, సన్యాసం, పి.యస్. ఆచార్య రాసిన 'దాహపు దొంగ కథ', ప్రభాకరుడు రాసిన 'గెలుపెవరిది', యల్. నరసింహారావు రాసిన 'సుశీలమోహనులు', 'ప్రేమ బలి', యర్రగుంట నారపరెడ్డి రాసిన 'సముద్ర మథనం', 'స్వరాజ్య సంపాదనము', పాణ్యం సంజీవ శాస్త్రి గారి 'వెలి' కథ, యం.వి.శాస్త్రి రాసిన 'ప్రభాత భేరి'మొదలగు కథలను శ్రీ సాధన పత్రికలో అచ్చు వేయడం జరిగింది. ఈ కథలన్ని కూడా రాయలసీమ కథకులే రాసారు. రాయలసీమలోని సమకాలీన పరిస్థితులను ఈ కథలలో చిత్రించారు. విద్వాన్ విశ్వం రాయలసీమ వాసి. విద్వాన్ విశ్వం 'నాపెళ్లి సంబరం', 'మొగ మహారాజు', 'ఎందుకు', 'నీతులు', 'ఎక్కడికి?', 'ఎక్కడున్నము' అనే కథలు శ్రీ సాధన పత్రికలో ముద్రించబడ్డాయి. ఈ కథలన్నింటిలో స్త్రీల మానసిక చిత్త వృత్తిని, స్త్రీల పట్ల ఉన్న వివక్షతను నిరసించుట, స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలు కనిపిస్తాయి.

నాటక సాహిత్యాన్ని పరిశీలిస్తే 1912 లో సర్వరాయుడు రచించిన 'గ్రామ కచేరి' అనే ఏకాంకిక తొలి తెలుగు స్వతంత్ర ఏకాంకికగా చెప్పవచ్చును. ఏకాంకికలలో సమకాలీన, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ప్రతిబింబిస్తాయి. 1930లో పి.వి.రాజమన్నార్ 'తప్పు ఎవరిది' నాటికతో తెలుగు నాటికా సాహిత్యంలో నూతన శకం ప్రారంభమౌతుంది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. సీమ సాహితీ స్వరం శ్రీ సాధన పత్రిక – డా. అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి
2. సీమ కథా తొలకరి – డా. తవ్వా వెంకటయ్య
3. మొదటి తరం రాయలసీమ కథలు – డా. అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి

# 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' కథలోని సామాజిక పరిస్థితులు - పరిశీలన

**రెడ్డిపోగు మధు,** పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం
**డా. రత్నశేఖర్ కట్టెపోగు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం

**'నా కవితా వధూటి వదనంబు నెగాదిగా జూచి రూపు రే**
**ఖా కమనీయ వైఖరులుగా గాంచి భళీ భళి! యన్నవాడె మీ**
**దేకులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో**
**బాకున్ గ్రుమ్మినట్లగును పార్దివచంద్ర! వచింప సిగ్గగున్'**

(ఈ పద్యం కవికోకిల గుర్రం జాషువా గబ్బిలం లోనిది. ఈ కథకు, ఈ పద్యానికి చాలా దగ్గరి సంబంధం వుంది కాబట్టి ఇక్కడ ప్రస్తావించవలసి వచ్చింది)

సమాజానికి తెలియని, సమాజం చూడని జీవితం దళితులది. దళితులు రాసుకునేటప్పుడు ఆ సమాజపు లోతులు, ఇతివృత్తాలుగా రాయటం ఆరంభమైంది. వీరికి పూర్వం దళితుల గురించి చాలామంది రాశారు. అయితే వారి రాతలు దూరపు కొండలు నునుపుదనమే అన్న చందాన వున్నాయి. దళితులు మోస్తున్న బరువును చూసిన, అనుభవించిన దళితులే నేడు రాస్తున్నారు. అటువంటి వారిలో పసునూరి రవీందర్ ఒకరు.

పసునూరి రవీందర్ కథలలోని ప్రధాన పాత్రలు రాజులో లేక దేవుళ్ళో వుండరు. దానికి కారణం ఏ దేవుడు కులసమస్యను ఈ నాటికీ కూడా పరిష్కరించలేక పోవటం, ఏ రాజు వెలివాడల జీవితాలను మార్చలేకపోవటం. వారి కథలలోని పాత్రలన్నీ తను అనుభవించిన బాధలు, తన చుట్టూ జరిగిన సంఘటనలుగా చెప్పవచ్చు. అలాగే సమాజంలో నాటినుండి నేటివరకు దళితులపై జరుగుతున్న వివక్ష, దానిని ఎదుర్కొంటున్న మనుషుల జీవిత సంఘటనలను, తాను ఎదుర్కొన్న వివక్షను, తన చుట్టూవున్న మనుషుల పేర్లను పాత్రలుగా స్వీకరించి రాశారు.

**పసునూరి రవీందర్ – పరిచయం**

పసునూరి రవీందర్ వరవ్వ, వీరస్వామి దంపతులకు వరంగల్‌లో జన్మించారు. విద్యార్థి దశనుండే పాటే తన ఊపిరిగా, వాటిని రాస్తూ, పాడుతూ విద్యార్థి నాయకుడుగా ఎదిగాడు. కాకతీయ యూనివర్సిటీ నుండి ఎం.ఏ., హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి 'ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ' అనే అంశంపై ఎం.ఫిల్ డిగ్రీ పూర్తిచేశారు. అక్కడే 'తెలంగాణ ఉద్యమపాట' అనే అంశంపై పిహెచ్.డి డిగ్రీని పొందారు.

వీరి మొదటి రచన వలస పక్షులు కథ (2001). ఆయన కలంనుండి జాలువారిన రచనలు– మాదిగపొద్దు (కవితా సంపుటి), లడాయి (దీర్ఘకవిత), ఇమ్మతి (సాహిత్య విమర్శ వ్యాస సంపుటి), అవుటాఫ్ కవరేజ్ ఏరియా (కథాసంపుటి). ఈ కథా సంపుటికి 2015 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్నారు. వీరు పాటనుండి కవిత్వంలోకి, కవిత్వం నుండి కథ, విమర్శ ప్రక్రియలను తక్కువ కాలంలోనే తనదైన శైలిలో రాస్తూ తెలుగు సాహిత్య వినీలాకాశంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

కథ, కథానిక ప్రక్రియల ద్వారా గురజాడ నుండి నేటివరకు సమాజాన్ని ప్రతిబింబించే ఉత్తమకథలు ఎన్నో సమాజంలో మార్పును తీసుకురావడానికి దోహదం చేశాయి. సామాజిక దృష్టితో, వాస్తవికతతో మానవ జీవితంలోని అన్ని కోణాలను స్పృశించి రాయబడిన కథ 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా'.

**అవుటాఫ్ కవరేజ్ ఏరియా – కథాసారాంశం**

ఈ కథలోని ప్రధాన పాత్రలు రజిత, సురేష్, వరవ్వ, రెడ్డెమ్మ, సుజాత. రజిత సురేష్ భార్య. వరవ్వ సురేష్ తల్లి. సురేష్ కుటుంబం, రెడ్డెమ్మ, సుజాతల కుటుంబాలు పట్నానికి కొద్ది దూరంలో వుండే కాలనీలో వుంటారు. సురేష్ తన భార్య రజితను, పిల్లలను తీసుకొని పల్లెనుండి పట్నానికి ఉద్యోగ నిమిత్తం వస్తాడు. పల్లెలో సురేష్ తల్లి వరవ్వ పట్నంలోని తన కొడుకుతో ఫోన్ మాట్లాడంతో కథ ఆరంభమౌతుంది.

ఊరినుండి సురేష్ తల్లి తనకు ఫోన్ చేసి సోమవారం బయలుదేరుతున్నానని చెప్పగానే, అమ్మా! సోమవారం బయలుదేరుతున్నావా! ఎందుకే, ఆదివారం మధ్యాహ్నం రావచ్చుకదా! రైల్లో జనం తక్కువగా వుంటారని సురేష్ అంటాడు. తల్లి సమాధానం చెప్పబోయే లోపు మల్లి సురేష్ ఏదో చెప్పబోతుండగానే సిగ్నల్ కట్ అయింది. సిటీలో ఇంటి అద్దె బాధ పడలేక సిటీకి అవతలున్న కాలనీలో వుంటున్నందుకు సురేష్‌కు ఈ సిగ్నల్ సమస్య వచ్చిపడింది. ఫోన్‌వస్తే వాకిట్లోకో కాంపౌండ్ బయటికో వచ్చి మాట్లాడడం అలవాటయ్యింది. ఎన్నిసార్లు హలో, హలో అన్నా మాటలు వినబడకపోయే సరికి ఇక లాభం లేదనుకుని బయటికొచ్చాడు. నెట్‌వర్క్ కనెక్ట్ కాగానే కాలు కదపకుండ నిలబడ్డాడు. కదిలితే ఎక్కడ సిగ్నల్ కట్ అవుతుందోనని కదలకుండా తల్లితో మాట్లాడి సంబరపడ్డాడు.

సురేష్ పట్నానికివచ్చి నెలరోజులైనా తన తల్లిమాత్రం ఒక్కసారి కూడా రాలేదు. ఊళ్ళో ఒక్క దానివే ఏం చేస్తావు పట్నంలో మాతోపాటు ఉందువు రమ్మంటే 'అవ్వో వొద్దుబిడ్డా, ఉన్న ఊరే కన్నతల్లి లాంటిది' అని రానేరానని తెగేసి చెప్పేది. కాని ఇప్పుడు మాత్రం ఏ రాత్రి ఏ కల కలవర పెట్టిందోగాని కొడుకుని చూడాలనిపించి వస్తున్నానని చెప్పింది. ఇక సురేష్‌కే కాదు అతని భార్య రజిత కూడా ఆనందపడింది. వారికా విషయం పండుగలా ఉంది. ఆ ఆనందంలో సురేష్ ఆఫీసుకు బయలుదేరాడు. అంతలో రజిత సురేష్‌ను బావా అని పిలవగానే 'ఏందికత అన్నట్లు చూసిండు'. ఏం లేదు మనింటి పక్కనున్న రెడ్డమ్మ ఆంటీ సుజాతక్క వాళ్లు చార్మినార్ దగ్గర చీరలు కొనుక్కోటానికి పోదాం అంటున్నారు. మరినువ్వు వెయ్యికోట్లో రెండువేలకోట్లో ఇస్తే పెళ్ళిరోజుకు చీర కొనే పని తప్పుతుంది అని నెమ్మదిగా చెబుతుంది. స్కాముల కాలంకదా పైసల్ని కోట్లరూపంలో మాట్లాడుకుంటూ అందరినీ ఆటపట్టించడం వారికి అలవాటు.

సురేష్‌కు రజిత షాపింగ్‌కు వెలతాననటం పెద్దగా ఆశ్చర్యం కలగలేదు, కాని ఈ సారి పక్కింటి అమ్మలక్కలతో వెలతాననటం ఆశ్చర్యం కలిగించింది. సరే పంపిద్దామని మనసులో అనుకొని రజితను ఆట పట్టిద్దాం అని 'పైసలు చెట్లకు కాస్తున్నాయా! ఎప్పుడు పడితే అప్పుడు కావాలంటే ఎట్లొస్తాయి? జీతం ఫస్టుకొస్తుంది కదా' అన్నాడు. రజిత సురేష్‌తో ఇలా అంటావనే చిన్నదో పెద్దదో జాబ్ చేస్తానంటుంది. ముందు పెళ్ళి, తర్వాత పిల్లలు, పిల్లల తర్వాత వాళ్ల సదువులని చెప్పి, చివరకు పర్మినెంట్‌గా వాళ్లకు ఆయాను చేశావంటుంది. ఇప్పుడేమో అడగక అడగక ఒక చీర కొనమంటే కతలు చెప్తున్నావని అనడంతో, తల్లీ నీకో దండం ఇదిగో నా పర్సుల పదిహేను వందలు ఉన్నాయి. తీసుకొని సారే కొంటావో చీరే కొంటావో నీ యిష్టం అని తప్పించుకుంటాడు.

బడికి వెళ్ళిన పిల్లలు ఇంటికి వచ్చేలోపు తిరిగి రావాలని ఇంటి పక్కనున్న అమ్మలక్కలతో షాపింగ్‌కు బయలుదేరుతుంది. తనకంటే వయస్సులో పెద్దోళ్ళు. అందరితో కలిసిపోయినా రజితకు అంతా కొత్తగా వుంది. కాలనీల ఇరుగు పొరుగుతో సురేష్‌కు విభేదాలు లేవు. అందరూ ఎక్కడెక్కడి నుంచోవచ్చి బతుకుతున్నోళ్ళే. కాబట్టి అందరూ చుట్టాల్లాగా కలిసిపోయినతీరు రజితకు బాగానచ్చింది. పండుగలు, పుట్టినరోజు కార్యక్రమాలు జరిగినప్పుడు ఒకరికొకరు కలిసిపోయి రకరకాల వరుసలతోటి

పిలుచుకుంటూ కలిసి మెలసి ఉండటం సురేష్‌కు బాగా అనిపించింది. సురేష్‌కు ఉరుకుల పరుగుల ఉద్యోగానికి తోడు, కట్టాల్సిన చిట్టీలు, ఇంటికి పంపే పాత అప్పులు లేవు. కాబట్టి ఇక యిప్పట్లో ఈ ఇల్లు ఖాళీ చేయొద్దని, ఓనరుకు సురేష్ అద్దె డబ్బులు ఒకరోజు ముందుగానే ఇచ్చేవాడు.

ఆఫీస్ నుండి ఇంటికి వచ్చిన సురేష్‌తో రజిత షాపింగ్ ముచ్చట్లను పూసగుచ్చినట్లు చెబుతుంది. నిజంగా ఈ కాలనీలో మనుషులు తనకు బాగా నచ్చారని చెప్తుంది. రెడ్డెమ్మ ఆంటీ పేరులోనే రెడ్డీ కానీ మనిషి మాత్రం చానా మంచిదంటుంది. ఎన్నిసార్లు కలిసి మాట్లాడుకున్నా, నన్ను ఏనాడు కులం అడగలేదు. అదే వారి ఊళ్ళో అయితే రెడ్లవరకెందుకు, కనీసం కాపోల్లు, ముత్రాశోల్లు కూడా వారిని ఎంతో నామోషిగా చూసేవారు, తక్కువ జాతివారని తిట్టేవారంటుంది. వారి నాయనవాళ్ళ ఎడ్లు వాళ్ళ పొలంలో పడ్డాయని యేడాది పొడుగునా చాలాసార్లు 'లేకికులం' అని తిట్టారని, కానీ ఈ పట్నంలో మాత్రం కులంలేదు, గిలంలేదు. అందరూ ఈ విధంగా సమానంగా ఉంటే బాగుంటుంది కదా? అని ప్రశ్నిస్తుంది. ఆ ప్రశ్నవిన్న సురేష్‌కు నవ్వొచ్చి 'ఓసి పిచ్చిదాన నువ్వు ఇంట్లో ఉండి కులంలేదు, గిలంలేదని మాట్లాడుతున్నావు. పట్నంలో కూడా కులం ఉంటుంది. కాకపోతే బయటికి కనిపించకుండా దాని పని అది చేసుకుంటు పోతుంది. దానితో దెబ్బతిన్నోళ్ళకేమో అది కనిపిస్తుంది. దాన్ని పాటిస్తూ, ఆదిపత్యం చెలాయించే పెద్ద కులపోల్లకు అది లేనట్టుగా భ్రమింపజేస్తుంది. అందుకే బాధపడేటోళ్ళు బాధపడుతుంటారు' అని రజితకు జ్ఞానోదయం అయ్యేటట్లు చెప్తాడు. కాని రజిత 'ఏమోబావా నమ్మలేను ఇక్కడ పక్కింట్ల ఉన్నడెవడో తెలియదు. ఇగ వాళ్ళ కులమేదో ఆరాతీసి తెలుసుకోవటం ఎవరివల్ల అవుతుంది' అంటుంది.

ఇంకా రజితకు అర్థంకాలేదని 'మన ఇల్లు కిరాయికి వెతుకుతున్నప్పుడు చూడలేదా! అంతెందుకు మా ఆఫీస్‌లో రెండొందల మంది ఎంప్లాయిస్ ఉంటే అందులో సెవంటీ పర్సెంట్ రెడ్లే తెలుసా! ఆ మధ్య నేను సుప్రజ హాస్పిటల్‌లో అడ్మిట్ అయినప్పుడు చూశాను, అక్కడ పనిచేసే డాక్టర్లందరూ పెద్దకులపోళ్ళే! అక్కడ ఊడ్చేవాళ్లు, తుడిచేవాళ్లు మాత్రమే దళితుల'న్నాడు.

ఈ దేశంలో బాగుపడ్డ చానామందికి కులం ఒక ఆధారమయితే, అదే కులం కోట్లాదిగా ఉన్న కింది కులాలోల్లకు గుదిబండలా తయారయిందంటూ నిట్టూర్చాడు సురేష్. ఈ సంభాషణ జరుగుతుండగానే రజిత మధ్యలో సురేష్‌ను ఆపి ఇంక పడుకో, రేపు మా అత్త వస్తుంది, ఉదయమే రైల్వేస్టేషన్‌కు వెళ్ళి తీసుకురావాలని అంటుంది.

భర్త దూరమైన ఆయన కోరిక మేరకు తన కొడుకుని చదివించింది. భర్త బతికున్నప్పుడు 'కింది కులపోల్లకు సదువొక్కటే ఆస్తి' అని చెప్పేవాడని గుర్తుచేసుకుంది. సురేష్ వాళ్ళ అమ్మను స్టేషన్ నుండి ఇంటికి తీసుకొస్తాడు. సురేష్ ఉంటున్న ఇల్లు చూసి 'బిడ్డా ఎంత ఇల్లు కిరాయి. మన ఊళ్ళో ఉండే పటేళ్ళ, దొరల ఇండ్ల లెక్కున్నది' అంటుంది. వరవ్వ ఇంట్లోకి అడుగు పెట్టగానే రజిత మొగం పున్నమి నాటి వెన్నెలలాగా వెలుగుతుంది. రజిత ఊళ్లో విషయాలన్నీ తెలుసుకుంటుంది. ఇంటి అద్దె విషయం కొడుకు చెప్పకపోవటంతో కొడుకు స్నానానికి వెళ్ళాక కోడలుతో 'ఏ కులపోల్లది బిడ్డా ఈ యిల్లు? మనం తక్కువ కులమోళ్ళం అని తెలిసే ఇచ్చారా' అని అడుగుతుంది. ఇంటి ఓనరు సిటీలో ఉంటారు. అద్దె వాళ్ళ అకౌంట్లో వేస్తాడు నీ కొడుకు అని చెప్పి, ఇంటి పక్కనున్న వారికి వాళ్ళ అత్తను పరిచయం చేస్తుంది. వరవ్వ చుట్టుపక్కల వాళ్ళను రోజు పలకరించుకుంటూ అందరితో కలిసిపోయి వాళ్ళ ఇండ్లలోకి వెళ్ళి ముచ్చట్లు చెప్పేది.

ఒకరోజు వరవ్వ రెడ్డెమ్మ ఇంట్లోకి ఎప్పటిలాగే వెళ్ళి మాట్లాడుతూ ఉండగా రెడ్డెమ్మ కోడలు టీ తీసుకొస్తుంది. మాటల్లో రెడ్డెమ్మ కొడుకు పెళ్ళి గురించి, కట్నం గురించి చెబుతుంది. అంత కట్నం మా కులంలో ఇవ్వరు. మహా అయితే లక్షో లక్షన్నరో ఇస్తారు. అదీ గవర్నమెంటు ఉద్యోగం అయితేనే మా కింది కులపోళ్ళలో అంతే అంటుంది. టీ గ్లాసులు తీసుకెళ్ళటానికి వచ్చిన కోడలును రెడ్డెమ్మ 'ఆ గ్లాసు అక్కడే ఉంచు పనిమనిషి వచ్చి కడుగుతుందిలే' అంటుంది. వెంటనే వరవ్వకు విషయం అర్థమై ఇంటికి వెలుతుంది.

వరవ్వ ఆ మరుసరిరోజే ఊరు వెళతానని కొడుకుతో చెప్పి వెలుతుంది. అప్పటినుండి రజిత చుట్టుపక్కల వాళ్ళతో మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటుంది. గల గలా మాట్లాడే రజిత ఎందుకు ఇలా ఉంటుందో అర్థంకాని సురేష్‌కు తల్లి ఊరికి వెళ్ళాకా విషయం తెలియటంతో కథ ముగుస్తుంది.

**అవుటాఫ్ కవరేజ్ ఏరియా కథ – సామాజిక పరిస్థితులు**

ఈ కథలో రచయిత మనకు చెప్పదలచుకున్న విషయం 'మనం ఎక్కడికెళ్ళినా కులం ఉంటుంది. కాకపోతే తన రంగును మారుస్తూ ఉంటుంది'. కొత్తగా చేరిన కాలనీలో అందరూ కలసిమెలసి ఉండటంచేత పల్లెల్లో ఉన్న కులసమస్య పట్నంలో వుండదని రజిత సురేష్‌తో వాదిస్తుంది. పండుగలకు పుట్టినరోజులకు ఒకరింట్లో వండిన పదార్థాలు పంచుకోవటం, కలసి మెలసి షాపింగ్‌లకు వెళ్లటం వలన రజిత పట్నంలో కులం లేదు అనే భ్రమలో ఉంటుంది. ఇదే విషయమై సురేష్ వాదించినపుడు రజితకు కొన్ని సంఘటనలు గుర్తుచేస్తూ చెబుతాడు. అద్దె ఇంటి కొరకు తిరిగే క్రమంలో కొందరు వెజిటేరియన్స్‌కు మాత్రమే ఇల్లు ఇస్తామని చెప్పటం, హాస్పిటల్లో అడ్మిట్ అయినప్పుడు అందులో ఉండే డాక్టర్లందరూ పెద్దకులపోల్లేనని తెలుసుకోవటం, నర్సు పనులు చేసేవాళ్ళు బిసీలని, ఊడ్చేవాళ్లు తుడిచేవాళ్లు దళితులనే విషయాన్ని తెలియజేస్తాడు. ఇక్కడ రచయిత సురేష్ పాత్ర ద్వారా వ్యాపారస్తులలో ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో ఉన్న వాళ్ళందరూ అగ్రకులస్తులేని చెప్పడం, క్రిందిస్థాయి ఉద్యోగస్తులందరూ దళితులనే విషయాన్ని చెప్పించాడు.

నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఆధునిక కాలంలో కూడా పాయఖానాలు కడిగేందుకు, ఫ్లోర్ తుడిచేందుకు దళితులను నియమిస్తున్నారన్నారు. ఆధునికతను పునికి పుచ్చుకున్న అగ్రవర్ణాలు మరింత శక్తిమంతులు అవుతున్నారన్నారు. శాస్త్ర సాంకేతిక వికాసంవల్ల బ్రాహ్మణ బనియాలు మునుపెన్నడూ లేని రీతిలో బిలియనీర్లు అయ్యారన్నారు. దళితులు, శూద్రులు, ఆదివాసీలు, ధర్మపరివర్తిత్ మైనార్టీలు కేవలం ఆధునికతకూ దాని సాంకేతికతకూ వినియోగదార్లుగా వున్నారన్నారు. ఆధునిక యజమాని అగ్రకులస్తుడు. దాని బాధితుడు బహుజనుడు అన్న విషయం ఈ కథద్వారా మనకు అర్థమవుతుంది.

రజిత వరవ్వకు తన దోస్తులను పరిచయం చేస్తుంది. వరవ్వ కూడా వారితో తొందరగా కలిసిపోతుంది. పట్నంలో ఒక్కరోజు కూడా ఉండలేను అనుకున్న వరవ్వకు వారు దొరికేటప్పటికి ఇంకా కొన్ని రోజులు వుందామని అనుకుంటుంది. కాని ఉన్నట్లుండి ఒకరోజు వరవ్వ కొడుకుతో తాను ఊరికి పోతానంటుంది. అదేందమ్మా ఇంకా నాలుగు రోజులు ఉండొచ్చుకదా అంటాడు సురేష్. వరవ్వకు పట్నం నచ్చలేదేమో, పట్నం మనుషులు నచ్చలేదేమో, ఎప్పుడెప్పుడు ఊరెల్లిపోదామా అని చూస్తుందేమోనని అనుకుంటాడు. ఊరిలోని బంధువులు, అరెకరం భూమి, రాత్రిపూట బొడ్రాయికాడ చెప్పే చిందోళ్ల కథ వరవ్వకు ఇష్టం. కానీ నేడు ఊర్లు కూడా మారిపోయాయని, కథలు చెప్పేవాళ్లు లేకపోయినా, అప్పటి సంగతులన్నీ తన ఈడు ముసలోల్లతో గుర్తు చేసుకుంటూ కాలం గడుపుతుంటుందని అనుకుంటాడు.

వరవ్వ ఇంత తొందరగా ఊరు వెళ్ళటానికి అసలు కారణం రెడ్డెమ్మ. వరవ్వ రెడ్డెమ్మల సంభాషణలో భాగంగా కులం గురించి ప్రస్తావన రాగా, వరవ్వ మాదిగోళ్ళం అంటే ఏమనుకుంటారో అని, హరిజనులం అని చెప్పటంతో రెడ్డెమ్మ ముఖం మారిపోతుంది. ఇంతలో టీ కప్పు తీసుకెళ్ళటానికి వచ్చిన కోడలు నీలిమను రెడ్డెమ్మ నువ్వు లోపలికి పో; పనిపిల్ల వచ్చి తీస్తుందని చెప్పటంతో వరవ్వకు విషయం అర్థమై, పట్నంలో వుండబుద్దికాక ఊరెళతానని చెప్పి బయలుదేరి వెళుతుంది. మన కులం తెలియనంత వరకు మనతో అందరూ మంచిగానే ఉంటారు. దగ్గరకు రానిస్తారు. కానీ ఒక్కసారి మనకులం ఏంటో తెలిశాక మనం ఎంత ఉన్నతంగా ఉన్నా, కలసి ఉన్నా, మనల్ని దూరంగా ఉంచుతారనే విషయం వరవ్వకు తొందరనే అర్థం అయింది. కానీ రజితకు ఈ విషయం తెలియటానికి చాలా కాలం పట్టింది.

రజిత కులం వరవ్వ ద్వారా తెలిసినప్పటినుండి రెడ్డెమ్మ, సుజాత మునుపటిలా లేరు. రజిత పిల్లల్ని కూడా వాళ్ళ పిల్లలతో కలిసి ఆడుకోనీయలేదు. ఆ విషయం తెలిసి తనతో ఎవ్వరూ మాట్లాడటం లేదని ఏడుస్తుంది. రజిత బాధకు కారణం

సురేష్‌కు అర్థంకాలేదు. వరవ్వ ద్వారా విషయం తెలుసుకొని రజిత ఏడుస్తూనే ఉంటుందని, సురేష్ రజిత సెల్‌కి ఫోన్ చేయబోతే కనెక్ట్ కాలేదు. ఎంత ట్రై చేసినా ఒకటే సమాధానం 'యు ఆర్ ట్రయింగ్ టూ రీచ్ ది మొబైల్ ఈజ్ ఇన్ అవుటాఫ్ కవరేజ్ ఏరియా'. ఔను ఈ లోకానికి మా బతుకులు ఎప్పుడూ 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా'నే అనుకున్నాడు సురేష్. ఈ కథకు, ఈ కథా సంకలనానికి కూడా ఈ శీర్షికనే సూచించడం అన్ని విధాలా సమంజసంగా కనిపిస్తుంది. సురేష్ తాను, తన జీవితం, తన ఫోన్ అన్నీకూడా ఈ సమాజానికి అవుటాఫ్ కవరేజ్ ఏరియానే అని భావించడం ఈ కథకు ప్రాణంపోసిందని చెప్పవచ్చు. ఇటువంటి కథలున్న ఈ కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం రావడం నిజంగా ఆహ్వానించదగింది. సాహిత్యం సమాజ హితాన్ని కోరుకుంటుందనే సత్యాన్ని ఇలాంటి రచనలు చదివినప్పుడు మనకర్థమవుతుంది, ఋజువవుతుంది. ఆ విషయంలో రచయిత కృతకృత్యుడయ్యాడనడంలో ఎలాంటి సందేహంలేదు.

పల్లెల్లో మాత్రమే కులం ఉంటుంది. పట్నంలో కులం పట్టింపులు ఉండవని అనుకున్న రజితకు మనం ఎక్కడికి వెళ్ళినా, ఎంత ఉన్నత స్థితిలో ఉన్నా, మన చుట్టుపక్క వారితో సమానంగా జీవిస్తున్నా, ఎంత కలసి మెలసి ఉంటున్నా కులవివక్ష తప్పనిసరిగా ఉంటుందని, అది కేవలం తన రంగును మాత్రమే మార్చుకుంటుందనే విషయాన్ని రచయిత సురేష్, వరవ్వ, రెడ్డెమ్మ పాత్రద్వారా అర్థవంతంగా ఈ కథలో తెలియజేశాడు. ఈ భూమిపై మనిషి జీవించినంతకాలం కులమనేది తన నీడలా వెంటాడుతూనే వుంటుందనే సజీవ సత్యాన్ని రజితకు కళ్ళకు కట్టినట్లు చెప్పాడు. దాంతో చివరకు రజిత నెట్‌వర్క్ దెబ్బకు రెక్కలు తెగిన పక్షిలా తండ్లాడుతూ తన అస్తిత్వమేమిటో తెలియని స్థితిగా పేర్కొన్నాడు.

**ముగింపు**

ఈ కథలో వూరు మారినా, కాలం మారినా, ఎంతపెద్ద చదువులు చదివినా కులమనేది మనల్ని వదలదనే విషయాన్ని రచయిత వివరించాడు. కులం అనేది పల్లెల్లో అయినా పట్నంలో అయినా ఒకే విధంగా ఉంటుందని, కాకపోతే ప్రాంతాలను, పరిస్థితులనుబట్టి రంగును మార్చుకుంటుందని, అది తన నిజ స్వభావాన్ని మాత్రం అసలు మార్చుకోదనే విషయాన్ని రచయిత ఈ కథద్వారా చెప్పిన విధానం చాలా అర్థవంతమైంది. అలాగే నేటి సమాజానికి అర్థమయ్యే భాషను, పరిభాషను వాడుతూ, తెలంగాణా మాండలికంలో ఈ కథ రాయబడింది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. అవుటాఫ్ కవరేజ్ ఏరియా – పసునూరి రవీందర్
2. దళిత సాహిత్యం సౌందర్య తత్త్వం – కొలకలూరి మధుజ్యోతి
3. కథాశిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య

ISSN 2457-0796
UGC CARE List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -27 : సంచిక - 7 (2) హైదరాబాద్ మే - 2024

# మిళింద కథలు - స్త్రీల జీవితానికి ప్రతిబింబాలు

**డా. సి. విజయలక్ష్మి**, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), ఎం.సి.హెచ్.యస్. మాలవ్యాజి స్ట్రీట్, బాలాజికాలనీ, తిరుపతి.

**ప్రవేశిక**

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక్క ఉదుటున దూసుకువచ్చిన వాదం స్త్రీ వాదం. తరతరాలుగా అణచివేతకు వివక్షకు గురైన స్త్రీలు చైతన్యవంతులై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. స్త్రీవాదులు తమ ఆలోచనలను భావాలను వివిధ ప్రక్రియల్లో ఆవిష్కరించారు. ఆ క్రమంలో చూసినపుడు స్త్రీవాదులకు కథ ప్రక్రియ చక్కగా దోహదపడిందని చెప్పవచ్చు. ఓల్గా, గోగుశ్యామల, వినోదిని, పి.సత్యవతి, జూపాక సుభద్ర, ఎండపల్లి భారతి వంటి వారు స్త్రీ వాద దృక్కోణంతో కథలు రాశారు, రాస్తున్నారు.

1980 దశకంలో స్త్రీ వాద దృక్పథంతో రచయిత్రులు కథలు రాశారు. ఈ పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ అణచివేతను ప్రశ్నిస్తూ నిర్భయంగా కథలు రాశారు. జండర్, కులం, మతం, జాతి, లైంగిక స్వభావం, వివక్షలను ఎదిరించే తత్వాన్ని స్త్రీలలో పెంపొందించారు. అలాంటి రచయిత్రులలో అగ్రగణ్యులు ఎండ్లూరి మానస. ఈమె 'మిళింద' అనే కథా సంపుటిని వెలువరించారు. ఈ సంపుటికి 2020లో కేంద్రసాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించింది. ఇందులో ఇరవై రెండు కథలున్నాయి. అవి: 1. అవిటి పెనిమిటి, 2.బొట్టు, 3.అంతిమం, 4.ఉల్లిపాయ – నిమ్మకాయ, 5.మైదానంలో నేను, 6.బొట్టు కుక్క, 7.గౌతమి, 8.ఉల్భత్, 9.మెర్సీ పరిశుద్ధ పరిణయం, 10.అర్ధజీవి, 11.బొట్టు భోజనాలు, 12.నటీనటులు, 13.అదే ప్రేమ, 14.బొట్టుగుర్తు, 15.అంగీకారం, 16.మోహన్ మాథ్యూస్, 17.జెన్నీఫర్, 18.అమ్మకోలేఖ, 19.దొంగబొట్టు, 20.ఒకరోజు, 21.అబద్ధం. ఈ కథల్లో స్త్రీలు వైయక్తికంగా, సాంస్కృతికంగా, కుటుంబ జీవన పరంగా, విద్యపరంగా, ఆత్మాభిమానం పరంగా ఇంకా వివిధ రంగాల్లో ఎలా అణచివేతకు, వివక్షకు గురవుతున్నారో రచయిత్రి మానస విస్పష్టంగా కళ్ళముందు సాక్షాత్కరింప జేశారు. సమాజంలో స్త్రీలు ఎంత దుర్భరంగా, అభద్రతతో, అవమానంతో జీవిస్తున్నారో రచయిత్రి నిస్సంకోచంగా నిర్భయంగా చెప్పారు.

**ఇంటి వెట్టిచాకిరి**

'అవిటి పెనిమిటి' కథలో స్త్రీ ఇంటి పనుల్లో ఎలా తలమునకలై పోతుంటుందో చక్కగా తెలిపారు కథకురాలు. ఆ విషయాన్ని పద్మావతి పాత్ర ద్వారా రచయిత్రి ఎండ్లూరి మానస ప్రకటింపజేశారు. ఆమె మాటల్లోనే చూద్దాం. "ఏవే! నా మొహాన కాఫీ కొట్టే ఉద్దేశముందా లేదా? దినపత్రిక తిరగేస్తూ అరిచాడు విష్ణువర్ధన్.

'ఆ తెస్తున్నానండీ' చురుక్కుమన్న వేలిని నోట్లో పెట్టుకొని వెంటనే కుళాయి కింద కడుక్కొని భర్తకి కాఫీ ఇచ్చింది పద్మావతి. స్నానం చేసి తయారైన కూతురు బుజ్జి తన చేతిలో దువ్వెన, రిబ్బన్లు పట్టుకొని పద్మావతి చుట్టూ తిరుగుతోంది జడలు వెయ్యమని. ఒక పక్క కూరమాడిపోతోంది, అన్నం పొంగిపోతుంది. ఇంకా పెసరట్లేయ్యాలి.

ఎప్పట్నుంచో నాలుగు బర్నర్లున్న స్టవ్ కొనుక్కుందామంటే విష్ణువర్ధన్ వినకపోగా, ఉండే ముగ్గరికి నాలుగు పొయ్యిలవసరమా? అంటాడు. పోనీ మూడు బర్నర్లున్నవి కొంటాడా అంటే అదీ లేదు. ఈ చికాకుకి తోడు అట్లపెనం ఎంత వెదికినా కనబడదు.

ఉండవే! చంపేస్తున్నావ్. ఇంత వయసొచ్చాక కూడా నేను జళ్ళు వేయడమేంటి? కూతురి నెత్తిమీద కోపంతో ఒక్క మొట్టికాయ వేసింది పద్మావతి." – అని ఒక స్త్రీ ఉదయాన్నే ఎలా టెన్షన్‌కు గురవుతుందో చెప్పారు.

ఒకవైపు భర్తకు సేవచేయాలి. వంట చేయాలి. కూతురికి జడ అల్లాలి. భర్త, కూతురికి క్యారియర్ కట్టాలి. వీటన్నిటికంటే ముందుగా అంట్లు తోమాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇల్లాలు ఉదయాన్నే అష్టావధానం చేయాలి. ఒక్కోసారి శతావధానం కూడా చేయాల్సి ఉంటుంది. ఇక ఉద్యోగం చేసే స్త్రీ పనైతే మరీ దారుణంగా ఉంటుంది పరిస్థితి.

**అత్యాచారాలు**

నేడు స్త్రీలు సర్వత్ర అత్యాచారానికి గురవుతున్నారు. మూడు నెలల పసిపాప మొదలు పండు ముసలి వరకు అత్యాచారానికి గురవుతున్నారు. సామూహిక అత్యాచారానికి కొందరు, హత్యాచారానికి కొందరు గురవుతున్నారు. నేడు స్త్రీ జాతికి ఇంటా బయట రక్షణ లేదు. ప్రభుత్వం నిర్భయ, దిశ, పోక్సో వంటి ఎన్ని చట్టాలు తెచ్చినా మగజాతి భయపడడం లేదు. మార్కులు వేస్తామనో, డాక్టరేట్ ఇస్తామనో, పెళ్ళి చేసుకుంటామనో గురువు తన శిష్యురాండ్రపై అత్యాచారానికి పాల్పడుతున్నారు. ఉద్యోగం ఇస్తామని మరి కొందరు ప్రలోభపరుస్తున్నారు. ఉద్యోగంలో వెసులుబాటు కల్పిస్తామని, ఇంకొందరు స్త్రీలను ఇబ్బంది పెడుతున్నారు. ఇక క్రీడారంగంలో ఉన్న స్త్రీల సంగతి చెప్పనక్కరలేదు. ఈ రంగం ఆ రంగం అవసరం లేదు. అన్ని వర్గాల, రంగాల స్త్రీలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారు. మరికొందరు మగవారు స్త్రీలను బలవంతంగా, దౌర్జన్యంగా ఎత్తుకెళ్ళి పాడుబడిన ఇళ్ళలో, పొదల్లో, వాహనాల్లో అత్యాచారం చేస్తున్నారు. అలా వాహనంలో తిప్పుతూ అత్యాచారం చేసిన ఒక ఘటనను ఎండ్లూరి మానస 'మెర్సి పరిశుద్ధ పరిణయం' అనే కథలో హృదయ విదారకంగా చిత్రించారు.

"కారెక్కిన మెర్సీని అరక్షణంలో వివస్త్రను చేశారు ఆ ముగ్గురు రాక్షసులు. ఆమె అరుపులు వినబడకుండా ముందే కిటికీ అద్దాలన్నీ మూసేశారు. ఆమెకు ఏం జరుగుతోందో తెలిసేలోపు అతి జుగుప్సగా ఆమె నోట్లో నోరు పెట్టి జుర్రాడు ఒకడు. ఆమె మర్మాంగాన్ని చీల్చి సుఖపడుతున్నడు అటెండర్. మరొకడు కసిగా ఆమె శరీరాన్ని కొరుకుతూ రక్తం తాగుతున్నాడు. ఆమె సిగ్గు మెల్లగా చచ్చిపోతోంది. ఒక్కొక్కరు ఆమెలోకి దూసుకుబోయేకొద్దీ ఒళ్ళు మొద్దుబారిపోతోంది. ఆమె మనసు శూన్యమవుతోంది. వాళ్ళు తాకుతుంటే తన ఒంటినిండా యెహోవా దేవుడు ఫరో మీద కురిపించిన కప్పల వర్షం పడుతున్నంత అసహ్యంగా ఉంది. మెర్సీ ఆలోచనలు మరణిస్తున్నాయి. అంతరంగం నిశ్శబ్దమౌతోంది. శరీర బాధంతా కన్నీరుగా కారుతోంది.

కారు తిరుగుతూనే ఉంది. ఎటుపోతుందో ఆమెకు తెలీదు. డ్రైవర్ తన వెనుక జరిగేది సర్వసాధారణమైన సంగతిలా తనకేం పట్టనట్టు హుందాగా తనపని తను చేసుకుపోతున్నాడు. ఆ నీచులు ఎంతో దుర్మార్గంగా చెరిచిన మెర్సీ నగ్న శరీరాన్ని చూసి కర్కశంగా నవ్వుకుంటున్నారు" అని చిత్రించారు. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. 2009లో ఢిల్లీ నగరంలో నిర్భయపై అత్యాచారం చేస్తూ బస్సును నగరమంతా తిప్పారు. ఆ ఘటనలో ఏడుమంది ఆమెపై అత్యాచారం జరిపారు. మర్మాంగాన్ని రాడ్లతో కుళ్ళపొడిచారు. చివరికి ఆ అమ్మాయి మృత్యువుతో పోరాడి అశువులు బాసింది. ఆ ఘటనతో ప్రభుత్వం నిర్భయ చట్టం తెచ్చింది. అయినా ప్రయోజనం లేదు.

**భర్త నిర్లక్ష్యం**

కుటుంబ జీవితంలో భార్యాభర్తలిద్దరూ సమానమే. ఒకరు ఎక్కువ కాదు, మరొకరు తక్కువ కాదు. చిన్న చిన్న సమస్యలు వచ్చినా సర్దుకుపోవాలి. అంతేగాని తెగేదాకా లాగకూడదు. భర్త భార్యను తన తల్లి, అక్క, చెల్లికి ఇచ్చినంత గౌరవం ఇచ్చి ఆదరించాలి. తనను నమ్మి వచ్చిన అమ్మాయిని అత్యంత ప్రేమగా చూసుకోవాలి. అలా కానప్పుడు భార్య తిరగబడుతుంది. దాంతో కుటుబంలో కలతలు, కలహాలు వస్తాయి. దాంపత్యజీవితంలో అశాంతి నెలకొంటుంది. ఈ విషయాన్ని కథకురాలు ఎండ్లూరి మానస 'అంగీకారం' అనే కథలో రాజకుమారి పాత్ర ద్వారా ఇలా పలికిస్తుంది.

"మొగుడిగా, తండ్రిగా మీకేం బాధ్యతలూ లేవు. అంతేగా? పొదుపు మాకు. ఖర్చు వాళ్లకి! మీ కుటుంబం మీద మీకున్న ప్రేమ అదంతా నన్ను ప్రేమించుకుంటే నాకూ ఏదొ రోజు గ్రాము బంగారమన్నా కొనిచ్చేవారు. నోరు తెరిచి ఏదైనా అడిగితే ఏంటి సందర్భం? అని తప్పించుకుంటారు. ఈ ఇరవై ఏడేళ్ళలో ఒక్క సందర్భం కూడా దొరకలేదు కదా! అదే మీ వాళ్ళకు కొనాలంటే రోజుకో సందర్భం పుట్టుకొస్తుంది నీకు. వివరాలు దాచడంలో, నన్ను కంట్రోల్ చేయడంలో పనులు చెప్పడంలో మాత్రమే నన్ను భార్యగా చూశావు గానీ, మరే విషయంలనైనా కనీసం మనిషిగా చూశావా! అదే నన్ను ప్రేమించుంటే అప్పుడప్పుడు చిరుగొడవలు పడ్డా మన జీవితం సుఖంగా ఉండేది. రెండ్రోజులు నేను మాట్లాడకపోతే నీ నిద్ర నీది. నీతిండి నీది. నేనెలా పోయినా నీకు సంబంధం లేదు. ప్రతి చిన్న విషయంలో నన్ను అవమానించడం తప్ప నాతో ఏకీభవించడం చేతనవ్వదు నీకు. నా కూతురికి కూడా నీలా ప్రేమించలేని వాడ్నే తీసుకురా! నాలాగే ఏడుస్తూ చస్తుంది బతికినంతకాలం" అని భర్తను మందలిస్తుంది. తాను భర్త దగ్గరగా ఎలా చులకనగా చూడబడుతున్నదో, ఎలా భర్త నిర్లక్ష్యానికి గురవుతున్నదో సహజ సిద్ధపు మాటల ద్వారా, హావభావాల ద్వారా తెలిపింది. ఇలాంటి బాధిత భార్యలు నేటి సమాజంలో ఎందరో ఉన్నారు. మెట్టినింట ఎందరో స్త్రీలు గృహహింసకు గురవుతున్నారు. ఇలాంటి వివక్ష దాంపత్య బంధానికి ఆటంకమవుతుందని రూఢిగా చెప్పవచ్చు.

**వేశ్యావృత్తి**

వేలాది సంవత్సరాలనుంచి స్త్రీ జాతిని పీడిస్తున్న సమస్య వేశ్యావృత్తి. ఇది ఒకప్పుడు స్త్రీ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండేది. కొందరు స్త్రీలు రాజువద్ద ఉండేవారు. అయితే నేడు అది కొత్తరూపు సంతరించుకున్నది. వేశ్యాగృహాలు రూపుదాల్చాయి. ఘర్ వాలాలు వాటిని నిర్వహిస్తున్నారు. పసిపిల్లల మొదలు పండు ముసలివాళ్ళ వరకు అందులో వందలాదిమంది ఉంటారు. ఒక్కొక్క స్త్రీ రోజుకు తక్కువంటే ఇరవై మందికి సుఖమివ్వాలి. వారిలో కొందరైతే కసిగా, వికృతంగా, క్రూరంగా స్త్రీలను అనుభవిస్తారు. ఆ స్త్రీలకు విశ్రాంతి అంటూ ఉండదు. విటులు కోరినట్లు సుఖాన్ని అందించడమే వారి పని. అలా కాదంటే ఘర్ వాలాలు క్రూరంగా హింసిస్తారు. వీరు ఏజంట్లద్వారా బాలికలను స్త్రీలను తెప్పించుకుంటారు. కొందరు కుటుంబసభ్యులు తిండి లేక వేశ్యాగృహాలకు పంపుతున్నారు. ఇలా లెక్కగడితే హైదరాబాద్, ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, పూనా వంటి ప్రదేశాల్లోని వేశ్యాగృహాల్లో లక్షలాది మంది స్త్రీలు వివిధ జబ్బులతో దుర్భరంగా జీవిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వాలు వారిని ఉద్ధరించుటకు తగిన చర్యలు తీసికోవడం లేదు. ఈ నేపథ్యంలో ఒక వేశ్య తన అనుభవాన్ని ఇలా తెలిపినట్లు కథకురాలు ఎండ్లూరి మానస ఇలా తెలిపారు.

"రెండేళ్ళ పాటు నా మొగుడూ వాడి ఫ్రెండ్స్ నన్ను పాడుచేసి ఐదు లక్షలకి ఇక్కడ అమ్మేశారు. ఆ రోజు నుంచి ఇక్కడ ఎంతో మంది నన్ను పాడుచేస్తూనే ఉన్నారు. మనకో న్యాయం లేదు, చట్టం లేదు.

రాధికనేం చేశారో తెలీదా? పారిపోయిన దాన్ని తీస్కొచ్చి మూడ్రోజులు అన్నంపెట్టకుండా రోజుకు నలభై మందిని పంపారు! చావు దాకా వెళ్ళి బతికింది. అయినా మనం ఇంటికి వెళితే స్వాగతం చెప్పడానికి ఎవరూ సిద్ధంగా ఉండరు. మనం మాత్రం ఏం మొహం పెట్టుకొని వెళ్తాం? మనకున్న రోగాలు తెలిస్తే గుండాగి చస్తారు మనవాళ్ళు" – అంటుంది ఒక వేశ్య. ఆమె నిజంగా వేశ్యకాదు. ఆ వృత్తిలోకి భర్త చేత మోసంతో నెట్టబడింది. ఇక ఆ కోపం నుండి బయటక పడలేక కుమిలిపోతున్నది. ఇలాంటి అభాగినులు లక్షల్లో ఉన్నట్లు తెలుస్తున్నది.

ఇలా స్త్రీలు ఇంటా బయట ఎదుర్కొంటున్న సమస్యలను ఎండ్లూరి మానస చిత్రించి సమాజాన్ని జాగృతం చేయడానికి తనవంతు కృషి చేసిందనవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. మిళింద – (కథల సంపుటి) – ఎండ్లూరి మానస, 2018.
2. మొలకల పున్నమి – వేంపల్లి గంగాధర్, 2010
3. కడప కథ – సం॥ తవ్వా ఓబుల్ రెడ్డి
4. కథానిక స్వరూప స్వభావాలు – డా. పోరంకి దక్షిణామూర్తి
5. ఆచార్య కొలకలూరి ఇనాక్ కథలు – కొలకలూరి ఇనాక్, 1998
6. బండి నారాయణస్వామి కథలు – బండి నారాయణస్వామి, 2002
7. మధురాంతకం రాజారాం కథలు – మధురాంతకం రాజారాం – 1996
8. సమాజ పరిణామంలో స్త్రీ – డి.బి.యస్.ఆర్.సి.హెచ్. మూర్తి

# మిళింద కథలు - సామాజిక చిత్రాలు

**డా. ఉడాలి విష్ణుప్రియ,** తెలుగుశాఖాధ్యక్షులు, సెంట్ ఆన్స్ మహిళా కళాశాల, మెహదీపట్నం, హైదరాబాదు

సహితస్య భావః సాహిత్యమ్... అంటే హితంతో కూడినది, హితాన్ని చేకూర్చేది సాహిత్యం. సాహిత్యం చదివినవారు మానవునిలో మాధవుడిని చూడగలగాలి. ఏది హితం, ఎవరికి హితం అని ఆలోచిస్తే సమాజానికి హితం చేకూర్చేదే సాహిత్యం. అందుకే సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. మనీషిగా చూడడానికి, దురాచారాలను రూపుమాపటానికి, సాంఘిక శ్రేయస్సును దర్శించడానికి సాహిత్యం, సహితస్య భావః సాహిత్యం అయింది.

**"సౌరభములేల చిమ్ము పుష్ప వ్రజంబు**
**చంద్రికలనేల వెదజల్లు చందమామ**
**ఎలా సలిలంబు పారు .. గాడ్పేల విసరు**
**ఎలా నా హృదయంబు ప్రేమించు నిన్ను..."?**

ఏమీ ఆశించకుండా నిర్మలంగా స్వచ్ఛంగా ఉండేదే ప్రేమ అని శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నారు. సాహిత్యాన్ని చదవడం పక్కన పెట్టిన సమాజం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంది. సాంకేతికంగా పలు అభివృద్ధి పథంలోకి ఎదుగుతున్న సమాజం విలువల్ని పాటించేటప్పుడు మాత్రం ఎంతో దిగజారిపోతోంది. సంఘంలోని సమస్యలను, దురాగతాలను ఎట్టి చూపించే సాధనాల్లో కథా సాహిత్యం మేటి అయినది. కథ అనేది సామాన్య పాఠకునికి దగ్గరగా ఉంటుంది.

కథా సాహిత్యానికి కొన్ని వందల ఏళ్ళ చరిత్ర ఉంది. ఒకరే కొన్ని కథలను రాసి ప్రచురిస్తే కథ సంపుటి అంటారు. అనేక మంది రాసిన కథలను ఒక పుస్తకంగా ప్రచురిస్తే దానిని కథా సంకలనం అంటారు. ఆ దిశలో రచయిత్రి మానస ఎండ్లూరి రాసిన "మిళింద" కథల సంపుటి గురించిన కొన్ని సమకాలీన అంశాలను ఈ వ్యాసం మూలంగా ప్రస్తావించడం జరిగింది. మిళింద కథాసంపుటి 2020 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కారాన్ని అందుకుంది. 22 కథలతో పొదగబడిన ఈ కథా సంపుటిలో మన చుట్టూ పరిభ్రమించే సామజిక ఛాయలు కనిపిస్తున్నాయి. స్త్రీ స్వేచ్ఛ, ట్రాన్స్‌జెండర్, స్వలింగ సంపర్కులు, కులమత భేదాలు, మనుషుల మధ్య ప్రేమ... ఇలా వీటన్నిటి చుట్టూ ఈ సంపుటిలోని కథావస్తువులు పాఠకుల్ని ఆకట్టుకుంటాయి.

స్త్రీ మీద జరిగే అత్యాచారాలను పలు కోణాల్లో రచయిత్రి ఈ కథల్లో స్పృశించింది. "అంతిమం" అనే కథలో మద్యం మత్తులో ఓ కొడుకు తన స్నేహితులతో కలిసి తన తల్లి పైనే అత్యాచారానికి పాల్పడిన చేదు నిజాల్ని ఈ కథ చదివిన వారెవరూ జీర్ణించుకోలేరు. కథ చివరలో ఈ నిజం తెల్సిన కొడుకు తన తల్లి చితిలోకే దూకి ఆత్మాహుతికి పాల్పడి సంఘం దృష్టిలో తల్లి ప్రేమకు నిజమైన తార్కాణంగా మిగిలిపోతాడు. "చితి మీద ఘోర అవమానంతో తల్లి ఆత్మ విలపిస్తోంది... అమ్మ ఆత్మను చూసి సత్తిబాబు ఆత్మ సిగ్గుతో చావలేక, మనిషై పారిపోలేక చావు తర్వాత అత్యాచారం లాంటి నరకాన్ని చూసాడు..." అని తల్లి శవంతో శవమై మంటల్లో బూడిదై ఆహుతైన కొడుకు పతనాన్ని ఈ సమాజం పతనానికి నిదర్శనంగా చూపుతుంది రచయిత్రి.

ఇదే వరసలో "మెర్సీ పరిశుద్ధ పరిణయం" కథ కూడా చేరుతుంది. ఇందులో కథానాయిక మెర్సీ తక్కువ కులానికి చెందిన క్రైస్తవ స్త్రీ. అనాథ. కాలేజీ విద్యార్థిని అయిన మెర్సీని అదే కాలేజీలో పని చేసే అటెండర్ మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడడం.. కానీ ఆమెని ప్రేమించిన ఆదర్శప్రాయుడైన విక్టర్ ఆమెను విశాల హృదయంతో స్వీకరిస్తాడు. "ఆ దొంగ నాయాళ్ళు తక్కువ కులమని మనల్ని దూరం పెడతారు. మన ఆడవాళ్ళని ఉంచుకున్నప్పుడు, పాడు చేసేటప్పుడు మాత్రం అంటరానితనం పని చెయ్యదు. వాళ్ళ ఆడబిడ్డల్ని కన్నెత్తి చూసినా గుడ్లు పీకి నాలుకలు తెగ్గోస్తారు. మన మీద ఎన్ని దాడులు జరిగినా క్షమాగుణం కలిగి ఉండమనే మతం మనది. మన చట్టాలు కూడా మనకి ఆ విషయంలో ఎంతో సాయం చేస్తాయి. ప్రేమించిన పిల్లకి అఘాయిత్యం జరిగితే వదిలేసేటంత దగుల్బాజీవి కాదు మెర్సీ.." అని ఆమెని విక్టర్ వివాహం చేసుకుంటాడు. ఈ కథలో దేహానికి గాయమైంది కానీ మనసుకు కాదు అని రచయిత్రి విక్టర్ పాత్ర ద్వారా సమాజానికి సందేశం ఇస్తుంది.

భార్యని పని చేసే యంత్రంగా భావించే భర్తల మనస్తత్వాన్ని సూటిగా వ్యక్తీకరించిన మరో కథా కుసుమం.. "అవిటి పెనిమిటి". ఇందులో ప్రధాన పాత్ర పనిమనిషి దుర్గ. అభ్యుదయ భావాలకు ప్రతీకగా ఈ పాత్రని మలిచిన తీరు ఆకట్టుకుంటుంది. పురుషాధిక్యతను ప్రదర్శించే పాత్ర విష్ణు. దుర్గ భర్త పోలియోతో కాళ్ళు చచ్చుబడినా భార్యకు చేదోడు వాదోడుగా అన్ని పనులు చేసి పెడుతుంటాడు. ఎంతో ప్రేమగా ఉంటాడు. కానీ విష్ణు భార్య పద్మావతి చదువుకుని ఉద్యోగం చేస్తున్నా భర్త చేతి ఊతకర్రలా ఉంటుంది. ఈమె భర్త ఎత్తిన గ్లాసు కింద పెట్టని పురుషాహంకారి. పద్మావతికి నలతగా ఉన్నా ఆమెకి చిన్న సాయం చేయకపోగా, దుర్గ లాంటి వారు సాయం చెయ్యబోయినా వారిస్తాడు. అతన్ని ఎదిరించి పల్లెత్తు మాట అనడానికి పద్మావతి వెనుకాడినా.. పని మనిషి దుర్గ మాత్రం అతని దౌష్ట్యాన్ని చూస్తూ మౌనంగా ఉండిపోలేదు. ఆమె ఈ తరం స్త్రీలకి ప్రతీకగా గొంతు విప్పింది. విష్ణు అవిటితనాన్ని ఎత్తి చూపింది. నీలాంటి వాడి దగ్గర పని చెయ్యనంటూ అతన్ని దులిపేస్తుంది. పని వదిలేసి వెళ్ళిపోతుంది. ఈ సందర్భంగా రచయిత్రి "జీతం తీసుకునే పని మనోచైనా సెలవు పెడుతుందేమో గానీ, ఉద్యోగం చేస్తూ వంట మనిషిగా స్థిరపడ్డ భార్యకి సెలవు పెట్టె అవకాశం ఉంటుందా..?" అని ప్రశ్నిస్తుంది. "ఆఫీసుకు వెళ్ళేటప్పుడు చెప్పులేసుకోవడానికి, భర్తకి వెళ్ళొస్తానని చెప్పడానికి పెద్ద తేడా ఉండదు. రెండూ అనుమతుల్లేకుండా యాంత్రికంగా చేసే పనులే.." అంటుంది. నవ సమాజంలో స్త్రీ యాంత్రిక జీవితానికి నిలువుటద్దాలు ఈ వాక్యాలు!

స్త్రీలు పెట్టుకునే బొట్టును కథా వస్తువుగా తీసుకుని పలు కోణాల్లో చర్చించిన వైనం మనల్ని కట్టిపడేస్తుంది. "బొట్టు" అనే కథలో హిందువైన ప్రిన్సిపాల్ తన వద్దకు వచ్చిన బొట్టు లేని క్రైస్తవ విద్యార్థిని ఆశాజ్యోతికి కాలేజీ సీటుని నిరాకరిస్తుంది. రచయిత్రి ఈ కథకు ముక్తాయింపునిస్తూ.. "ఆశాజ్యోతి ఆశలు అడియాసలై ఆమె నుదుటి మీద లేని కుంకుమబొట్టు కళ్ళలోంచి కన్నీటి బొట్టై రాలింది. వాళ్ళు వెనుదిరగగానే ప్రిన్సిపాల్ కామాక్షి గబా గబా ఫోన్ ఆన్ చేసి కాంటాక్ట్ లిస్ట్ తీసి 'జి' కేటగిరీలో 'గరికపాటి' అనే నెంబర్‌ని డిలీట్ చేసింది. అతన్ని కలిసిన రెండు సార్లు మొహానికి బొట్టెందుకు లేదో ఇప్పుడర్థమైంది. ఈ గరికపాటి ఆమె అనుకున్న 'ఘనాపాఠి' కాదని..! అని కథని ముగిస్తుంది.

ఇక ఇంటి నుంచి తన చిన్నారి కుక్కపిల్లతో బాటు తప్పిపోయిన పిల్లకి ఆశ్రయమిచ్చినా, ఆ ఇచ్చిన వారు తమ మతం కాదని తెలిసి కనీసం థాంక్స్ కూడా చెప్పకుండా వెళ్లిపోయే కుహనా మనస్తత్వం పోకడల్ని "బొట్టు కుక్క" కథలో చూస్తాం! "కుక్కపిల్ల నా కళ్ళలోకి చూస్తోంది.. నేను దాని బొట్టువైపు చూసాను. మతమే కాదు ఇప్పుడు కులం కూడా తెలిసింది. కమ్మోరి అమ్మాయి వెంట వచ్చిన కుక్కపిల్ల. దాని జాతి కుక్కల్ని అది గుర్తు పడుతుందేమో. పాపం మనుషులే వారి వారి జాతుల్ని ఇప్పటికీ చెప్తే గానీ గుర్తు పట్టలేకపోతున్నారు!!" అని మత పిచ్చి పట్టిన వారికి ఈ రచయిత్రి గడ్డి పెడుతుంది.

ఈ కథలకు సంబంధించిన సమీక్షల్లో సైతం ఈ కులాన్ని, మతాన్ని ప్రజలు గుడ్డిగా ఎందుకు అనుసరిస్తారనే విషయాన్ని గమనిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడవుతాయి. హిందువులలో అత్యధిక సంఖ్యాకులు వర్ణాంతర భోజనాలకు వర్ణాంతర

వివాహాలకు అంగీకరించరెందువల్ల? ఈ ప్రశ్నకు జవాబు ఒక్కటే. హిందువులు పవిత్రంగా ఎంచుకునే సిద్ధాంతాలకు విశ్వాసాలకున్న వర్ణాంతర భోజనాలకు వర్ణాంతర వివాహాలకున్నా, పొసగదు. కులమనేది హిందువులను కలవకుండా చేసే ఒక ఇటుక గోడో, ముళ్ళ తొవో కాదు. సులభంగా తొలగించి పారవేయడానికి! హిందువులలో కులం అనేది ఒక భావం. ఒక విశ్వాసం. ఒక మనస్థితి. కులాన్ని తొలగించడం అంటే భౌతికమైన ఒక అడ్డంకిని తొలగించడం కాదు. మనోభావనలోనే ఒక మార్పును సాధించడం. కులం చెడ్డదే కావచ్చు. మానవుడు మరో మానవుడి పట్ల అమానుషంగా ప్రవర్తించేంతటి దుష్ప్రవర్తనకు కారణం కులమే కావచ్చు. అయితే ఒక సత్యాన్ని మనం గుర్తించవలసి ఉంది. హిందువులు కులం పట్ల అంత పట్టుదలగా ఉంటారంటే అందుకు కారణం వాళ్ళు అమానుష ప్రవృత్తి కలవరా, తల తిరుగుడు మనుషుల్లో కావడం కాదు. వీళ్ళు కులాన్ని పట్టుకుని అంతగా వేలాడుతారంటే వాళ్ళు పూర్తిగా మతం అంటే పిచ్చి నమ్మకం కలవాళ్ళు కానక. హిందూ ప్రజలు కులమంటే పట్టింపు కలిగి ఉండడం కాదు. నిజానికి నా ఉద్దేశంలో అసలు తప్పు ఏదంటే అది వాళ్ళ మతం. కులం అనే పిచ్చి నమ్మకాన్ని వాళ్ళ మనసులో నాటిన వాళ్ళ మతం. అటువంటప్పుడు మనం ఎదుర్కోవాల్సిన వస్తువు కుల వ్యవస్థను అనుసరిస్తున్న ప్రజలది కాదు. అట్టి కుల వ్యవస్థతో కూడిన మతాన్ని వాళ్లకు ప్రబోధిస్తున్న శాస్త్రాలు. అందువల్ల వర్ణాంతర భోజనాలకు, వర్ణాంతర వివాహాలకు వ్యతికేకులైన వారిని విమర్శించడం వాళ్ళ కానీ, హేళన చేయడం వారనంతర భోజనాలు, అక్కడక్కడా వర్ణాంతర వివాహాలు జరపడం వళ్ళ కానీ ఏమీ ప్రయోజనం ఉండదు. మనం అనుసరించవలసిన సరైన మార్గం ఏమిటంటే శాస్త్రాల పట్ల, వాటి పవిత్రత పట్ల ప్రజలకు గల విశ్వాసాన్ని తొలగించడం! ఇదే సంపుటిలోని "బొట్టు భోజనాలు" కథలో మానస అనే పాత్ర కులం నుంచి మత ప్రాంగణంలోకి అడుగు పెట్టింది. మార్గం ఆమెకు కనపడింది. ఆ మార్గంలో వేగంగా ప్రయాణం చేయగలదని నమ్మకం ఈ కథలు కలిగిస్తున్నాయన్నది ఈ కథల్ని సమీక్షించిన ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అభిప్రాయం!

ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమ చిగురించడానికి వారిద్దరూ ఆడ, మగ కావాల్సిన అవసరం లేదన్న అంశాన్ని "అదే ప్రేమ" కథలో ఉటంకిస్తారు. స్వలింగ సంపర్కాన్ని కొన్ని దేశాల్లో నిషేధించినా ప్రపంచంలో సింహభాగం దీనిని చట్టబద్ధం చేసాయి. ఈ కథ వస్తువుతో అర్జున్, గోపాల్ అనే ఇద్దరు మగవారి మధ్య ఏర్పడిన ప్రేమని అందంగా వర్ణిస్తారు రచయిత్రి. కథ చివరి వరకు వీరి మధ్య సంభాషణని ఓ అబ్బాయి, ఓ అమ్మాయి మాట్లాడుకుంటున్నట్టుగానే నడిపిస్తూ.. ముగింపులో చిన్న కొసమెరుపులా వాళ్లిద్దరూ అబ్బాయిలేనని పేర్కొనడం ఆసక్తిదాయకం. విశ్వవ్యాప్తంగా మారుతున్న మానవ సంబంధాలను స్వతహాగా ఒక స్త్రీ అయినా సాహసోపేతంగా తన కథకు వస్తువుగా ఎంచుకోవడం గమనార్హం!

"మైదానంలో నేను" అనే కథలో భార్య భర్తల మధ్య మనసులు ఇచ్చిపుచ్చుకుంటేనే వారి బంధం కలకాలం నిలుస్తుందనే వాదనకి కొన్ని చేర్పులు చేస్తూ వారి మధ్య శారీరక సంబంధం కూడా వారి బంధాన్ని దృఢ పరచడంలో కీలక పాత్ర వహిస్తుందనే విషయాన్ని రచయిత్రి ఈ కథలో పేర్కొంటారు. కథానాయిక తన భర్త చలం నవల "మైదానం"లో కథానాయకుడు అమీర్ లాగా ఉండాలని ఆశ పడుతుంది. మొదట్లో పెళ్ళైన వారి కాపురం సినిమాల్లో చూపించే విధంగా ఉంటాయని కలలు కంటుంది. అలాగే నవలా నాయికల జీవితంలాగే తన జీవితం కూడా ఉంటుందని అనుకుంటుంది. ఆ దిశలోనే మైదానం నాయకుడి పాత్రలో తన భర్తని వూహించుకుంటుంది. కానీ దానికి విరుద్ధంగా అతని ప్రవర్తన ఉండడం చూసి నిరాశ పడుతుంది. ఒక దశలో ఆ విషయం అతనికి వివరించడమే కాదు. ఆ మైదానం నవలని ఆసాంతం చదివి వినిపిస్తుంది. చివరికి ఆమె భర్త తన ఆంతర్యం గ్రహించాక తాను ఇన్నాళ్లు కోల్పోయింది ఏమిటన్నది తెలుస్తుంది. "నువ్వు చదివి వినిపించిన మైదానం నవల అర్థం చేసుకోవడానికి నేను సొంతంగా మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. ప్రేమను బైట పెట్టడం ఎంత అవసరమో తెలుసుకున్నాను. ఇన్నాళ్లు నేను ప్రదర్శించిన పశుకామానికి సిగ్గు పడుతున్నాను. క్షమించు.. నీ జీవితంలో నేనొక ప్లీడర్ మొగుడిగా కాక అమీర్‌గా మిగిలిపోవాలని నిర్ణయించుకున్నాను.." అనడం ముక్తాయింపు!

మనం మర్చిపోయిన, నిర్లక్ష్యం చేసిన ఎన్నో జీవితాలను ఈ కథలు వెలుగులోకి తెచ్చాయని చెప్పొచ్చు. కథలు ఇలాగే రాయాలి, ఇలాగే ఉండాలని గిరి గీసుకున్న ఒక సంప్రదాయానికి ఈ మిళింద కథా సంపుటి తిలోదకాలిచ్చింది. కాలం ఒక్కో సమయానికి ఒక్కొక్కరిని ఎన్నుకుంటుంది.. ఈ కాలపు కొన్ని కథలు చెప్పడానికి ఎన్నుకోబడిన రచయిత్రి మానస ఎండ్లూరి. కేవలం ఆడ, మగ అనే వర్గాల్ని మాత్రమే గుర్తించే సమాజంలో స్వలింగ సంపర్కుల్ని, ట్రాన్స్‌జెండర్ల జీవితాల్ని అద్భుతంగా ధైర్యంగా అక్షరీకరించిన కలం ఈ రచయిత్రిది. ఇది ఈ తరం కథా సంపుటి. వెలుగు రేఖలు ప్రసరించని ఎన్నో జీవితాలపై ఎత్తి పట్టిన దివిటీ!

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. మిళింద – మానస ఎండ్లూరి
2. కృష్ణపక్షము – శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి.

# యాలై పూడ్చింది - ఒక పరిశీలన

## (2022 కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార్ గ్రహీత – పల్లిపట్టు నాగరాజు)

కె. అమృతజ్యోత్స్న, తెలుగుశాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు

**తెలుగు సాహిత్యంలో పల్లిపట్టు నాగరాజు స్థానం – శైలి**

పల్లిపట్టు నాగరాజు గారు తన సాహిత్యంలో ఎక్కువగా వచన కవిత్వంను ఆశ్రయించారు. రాయలసీమ వాసి కావడం చేత తన కవితలలో, కథలలో ఆముద్రిత రచనలలోనూ రాయలసీమ మాండలికాలు ఎక్కువగా ఉంటాయని భావించవచ్చు.

రాయలసీమలో కవులకు కొదవలేదు. ఎంతమంది ఉంటారో ఎంతమంది కొనసాగుతారో తెలియదుగానీ కాలమనే ఖడ్గాన్ని ధరించినవారు తమ కవిత్వంలో ఆనందం కల్గిస్తారు. అరచేతితో భవిష్యత్‌ను చూపిస్తారు. తమ కవిత్వంతో స్ఫూర్తినిస్తారు. దళిత సమస్యల్ని, నేటి మత రాజకీయాల్ని, దేశభక్తి విషయాల్ని, సీమ బహుజనుల వీధి భాష ద్వారా కవిత్వంను వ్రాయగల ప్రతిభాశాలి "పల్లిపట్టు నాగరాజు". సీమ సీమస్యల్నే ఇతివృత్తాలుగా స్వీకరించి ఇతర ప్రాంతాల తెలుగు వచన కవులు చేయని కృషిని వీరు చేశారు. 2022 కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార్ గ్రహీత పల్లిపట్టు నాగరాజు.

**ప్రధాన విషయం**

యాలైపూడ్సింది కవితాసంపుటి నందలి కవితా విశ్లేషణ: పల్లిపట్టు నాగరాజు సాహిత్యం – పాత్రల స్వభావచిత్రణ.

**1. స్త్రీ పాత్రా స్వభావ చిత్రణ**

"రుక్కత్త" గురించి చెప్పడమంటే మురికి లేని మనసు,

ఓ దుక్క కావ్యాన్ని సదవడమే"

"రుక్కత్త" పద్యం ద్వారా చేపల పాపత్త కల్మషం లేని మనసు గురించి వ్రాసారు. పుట – 48

"రుక్కత్త" కవిత చదువుతున్నప్పుడు చేపలు అమ్ముకునే ఒక సాధారణ మహిళ గురించి, ఆమె పలకరింపులోని ప్రేమాభిమానాల గురించి చదువుతుంటే మలినంలేని మనసుల్ని వారు చూసినట్టున్నట్టుగా వారి కవితలలో నాకు కనిపిస్తున్నట్టు ఉంటుంది. ఇంకా కర్రి సూరీడు – నల్లచందమామ', 'సపాయమ్మలు' 'రుక్కత్త" ఈ కవిత్వాలలో స్త్రీ పాత్రల వర్ణన బాగుంది.

**2. రాజకీయ – సామాజిక పాత్రల స్వభావ చిత్రణ**

**"వారగా బొండప్పా**

**యాలై పూడ్సింది**

**వాకిలి చిమ్మాలా కల్లాపుజల్లాలా"** అంటూ ముగించే కవితలో ప్రజాసమస్యల్ని పట్టించుకోని అధికార యంత్రాంగాన్ని అడిగే తీరును వర్ణించడం జరిగింది. (పుట – 88)

ఈ కవితలో ఓ స్త్రీ ఆవేదనను కోపాన్ని, ఈసడింపును, ఆవేశాన్ని అన్నింటినీ ఒకే కవితలో చూపించిన తీరు అద్భుతం.

**3. ఆత్మాశ్రయ పాత్ర స్వభావ చిత్రణ**

"నా మిత్రుడా

అమ్మ లాంటి బందలి పోలమ్మని" పుట – 42.

**"నా సావాసగాడా**
**మా బడి గోడల్ని"** (పుట - 43)
**"నా జతగాడా**
**ఎంగిలి పూసి తుడిసి ఎక్కాలు రాసిన రాతిపలకని"** (పుట -44)

"ఆడినానని జెప్పు" కవిత్వం ద్వారా తన ఊరి గురించే కాదు తన చిన్న నాటిదృశ్యాలను మరచిపోని కవి. ఈ కవితలో బతుకు తెరువుకై నగరాల్లో జీవిస్తున్నప్పటికీ మనం మరచిపోయిన కొన్ని సంగతులను, మనుషులను, చిన్న నాటి దృశ్యాలను నెమరు వేసుకొంటున్నట్టుగా అందరినీ పలకిస్తున్నట్టు "అడిగానని జెప్పు" అంటూ రచించిన తీరు పాఠకుల హృదయాల్ని లోలోపల కదలిస్తుండనడంలో సందేహం లేదు.

"పిచ్చుక వాలిన కిటికి', 'నిషేధ స్వరం', 'దారి', 'నేను పలానా', 'నిద్రరాని కళ్ళు', చిగురు కొమ్మలపై సూర్యోదయం', 'వరండాలో వాన" ఈ కవిత్వాలలో తనే ఓ పాత్రలా మాట్లాడిన తీరు - వర్ణన బాగుంది.

**4. దళిత సమస్య స్వభావ చిత్రణ**

**"మాట్లాడే ప్రతి మాటా**
**మాయ మాటలు గాకుండా**
**మాటలు చర్చ జరగాలి"** అంటూ దళిత సమస్యల్ని సూటిగా ప్రశ్నించారు.

మరో కవితలో

**"ఛీ....ఛీ.......**
**ఎన్ని తూరులైనా గుండునో,**
**మీసాల గెడ్డాన్నయితే గొరుగుతున్నా మేగానీ,**
**మీ బుర్రలోపల బురదను కడగలేకపోతున్నామే"**

అంటూ "మంగలినాయ్యం" కవితలో (పుట - 78) జాతిసమైక్యతగా ఉండాలని కుల ఊబిలో ఇరుక్కోకండి అంటూ శరీర కల్మషం లేకుండా చేసినట్లే మానసికంగా కూరుకు పోయిన కుల మత భేదాలు అనే కల్మశాల్ని పాలద్రోలండి అంటూ దళిత సమస్యల్ని చెప్పారు.

**5. రాయలసీమ బ్రతుకు స్వభావ చిత్రణ**

"వాన అంటరాని నేల"

ఈ రాయలసీమ అంటూ వాపోయారు పల్లిపట్టు. (పుట -62)

కేవలం సీమ నుడికారంతో నింపేయడమే కాకుండా అనేక కవితల్లో సీమ కరువు, సీమ రైతు, సీమ శ్రమ జీవులుగా కనబడతారు.

**"ఇది వానకు అంటరాని నేల**
**చుట్టూ నదులు పారుతున్నా**
**ఇక్కడ కరువు ప్రవహిస్తూ ఉంటుంది".** (పేజి. నెం. 62. కరువు ఋతువు)

అంటూ కరువే ఋతువుగా సాగే రాయలసీమ ప్రాంతం గురించి "వాన అంటరాని నేల" అంటూ వాపోయారు పల్లిపట్టు.

**6. ఆదర్శ పాత్ర స్వభావ చిత్రణ**

**"చుక్కరాలని ఈ మట్టిలో**
**దుక్కమే నవ్వుతుంటది**

**దుక్కమే ఏడుస్తుంటది.........”** అంటూ వ్రాసిన “యాలై పూడ్సింది” కవిత్వంలోని ‘కరువు ఋతువు’ లో (పుట –62) సీమరైతు బ్రతుకు కనబడుతుంది.

**7. జంతు పాత్ర స్వభావ చిత్రణ**

“కవుడూ కుచ్చడం తెలీని మూగజీవాల ప్రేమ వాసన”

అంటూ ‘దూడమూతి వాసన’, ద్వాజంతు ఆధునిక చిత్రీకరించడం వాటి కపటంలేని ప్రేమని వర్ణించడం జరిగినది. (పుట – 123)

**8. ఆధునిక సాంకేతిక విజ్ఞాన పాత్ర స్వభావ చిత్రణ**

“సైబరక్వేరియంలో చేపలైన జీవితాలు” (పుట – 56)

అంటూ సాగే కవితలో ఫోన్ కి, వాట్సాప్ కీ, ‘ట్విట్టర్’ కి నేటితరం బానిసలౌతున్నారంటూ వాపోయారు

**“ఆకాశాన్ని శోధిస్తూనే అఖాతల్లోకి ముడుచుకుంటూ**
**శిఖరాలెక్కుతూనే**
**శిథిలాల్లోకి జారిపోతూ**
**ఏవేవో తరంగాల అలలపై**
**ఈదుతున్న సమూహాలు**
**సైబరక్వేరియంలో చేపలైన జీవితాలు”** అంటూ

అక్వేరియంలో గోల్డ్ ఫిష్‌ల మాదిరిగా నేటితరం ఫోన్‌కి, వాట్సాప్ కీ, ‘ట్విట్టర్” కి బానిసలుగా మారి సమూహంలో ఉన్నా ఒంటరిగా బ్రతుకుతున్నారు అని వారి పసితనాన్ని కాపాడాల్సిన బాధ్యత మనకి ఉందని. “నేటి బాలలే రేపటి పౌరులు” అనే నినాదం మరిచిపోరాదని నేటివర్తమానం విస్మరిస్తే ఈ బాలల భవిష్యత్తు అగాధంలోకి జారిపోతుంది అంటూ “ఈ మనిషి తనపు చేప పిల్లల్ని ఎలా భద్రపరచుకోవాలి?” అంటూ వాపోయారు పల్లిపట్టు.

**నవకవులకు ఒక ప్రేరణ – యాలైపూడ్చింది**

రాయలసీమ గ్రామీణ వాతావరణంలో రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన పల్లి పెరిగిన పల్లిపట్టు నాగరాజు గారు. ఆమట్టి పరిమాళాల్నే అక్షరాలుగా అద్దాడు. రాయలసీమ కవులు రాయలసీమ సమస్యల్నే ఇతివృత్తాలుగా స్వీకరించి ఏ ఇతర ప్రాంతాల తెలుగు వచన కవులు చేయని కృషిని వీరు చేశారు.

దళిత సమస్యల్ని, నేటి మత రాజకీయాల్ని, దేశభక్తి విషయాల్ని, సీమ బహుజనుల వీధి భాష ద్వారా కవిత్వంను వ్రాయగల ప్రతిభాశాలి “పల్లిపట్టు నాగరాజు”.

రాయలసీమ ప్రాంత వాసులైన వేమన గారు వారి పద్యాలతో, అన్నమయ్య గారి కీర్తనలలోనూ, వీరబ్రహ్మం గారి రచనలలోనూ కొన్నింటిలో మనకు బలమైన ధిక్కార స్వరం కనిపిస్తుంది. ఈ ధిక్కార స్వరాన్ని వారసత్వంగా పుచ్చుకొని తను కవితల రూపంలో “యాలై పూడ్సింది” గా మనముందుకు తీసుకు వచ్చారు పల్లిపట్టు నాగరాజు.

పల్లిపట్టు నాగరాజుకి “యాలై పూడ్సింది” రచనకు దోహదం చేసిన అంశాలుగా మనము వారి ఊరు, వారి కులం, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఇలా అనేకం చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. కొత్తగా వచ్చే ఆధునిక కవులకు వారిలో దాగివున్న కవి హృదయాన్ని తట్టిలేపే ఆయుధంగా “యాలైపూడ్సింది” చెప్పవచ్చు. ఇది ఒక్కటి చదివితే చాలు బహుమూల సమస్యల్ని ఒక్క సారిగా తడిమి చూసినట్టు ఉంటుంది. అతిచిన్న వయసులో కేంద్ర సాహిత్య అకాడమియువ పురస్కార్ అవార్డు రావడం ఈ కాలంలో తెలుగు సాహిత్య లోకంలోకి ప్రవేశించే, ప్రవేశించిన వారికి స్ఫూర్తినీయులు పల్లిపట్టు.

**ముగింపు**

పల్లిపట్టు నాగరాజు సాహిత్యం అద్భుతం వస్తు ఊపిరిపోసుకొని శ్రోతులను ఊగిపోయేలా సాగుతాయి. వాస్తవంగా, కరుణ రసపూరితంగానూ, చురకలంటించేలా, మనసును చైతన్య పరిచేలా, హృదయ ఆహ్లాదకరంగానూ సాగుతాయి. కేవలం రాయలసీమ ప్రాంత సమస్యల్నే కాక ప్రతి బతుకులోని బహుమూలల్ని స్ఫురించేలా కవిత్వం వ్రాసినట్లు ఆ ప్రయత్నం చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

గ్రామీణ వాతావరణంలో దళిత రైతు కుటుంబంలో పుట్టడం చేత కాబోలు తన కవితా సాహిత్యంలో బహుజన సామాజిక నేపథ్య అంశాలు ఎక్కువగా కనిపిస్తాయి.

ఓ పూలదండలో రకరకాల పూలున్నట్లు పల్లిపట్టు నాగరాజు వ్రాసిన "యాలైపూడ్సింది" లోనూ భావ కవితలతో, అభ్యుదయ కవితలతో, దళిత కవితలతో, ప్రేమ కవితలతో, స్త్రీ కవితలతో, ఆధునిక కవితలతో, రాయసీమ మాండలికాలతో, పల్లె పదాలతో, విమర్శనా బాణాలతో, ప్రేమానూరాగాల పలకరింపులా, మట్టి పరిమళాలతో తెలుగు సాహిత్యానికి పల్లిపట్టు నాగరాజు ఇచ్చిన ఓపూలమాలగా అభివర్ణించవచ్చు.

ఎందఱోకవులు వస్తుంటారు, పోతుంటారు. ఎన్నో పుస్తకాలు వస్తుంటాయి, పోతుంటాయి, కానీ కొందరు కవులే నిలబడతారు. కొన్ని పుస్తకాలే పాఠకుల మదిలో చెదరని ముద్రలేస్తాయి. అలా అందరి మనస్సులో చేరేలాగా వ్రాసిన కవితా సంపుటే "యాలైపూడ్సింది". మొదటి కవితా సంపుటి "యాలైపూడ్సింది" తో ఉగాది పురస్కారంతో పాటు, కేంద్ర ప్రభుత్వ కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న పల్లిపట్టు నాగరాజు నేటి యువ కవులకు ఆదర్శప్రాయులు.

తొలి పుస్తకంలో చెరగని ముద్రవేసిన పల్లిపట్టు నాకు మలి పుస్తకం ఆరాటాన్ని రేపుతున్నాడు. కవిత్వ పట్టు, లోగుట్టు తెలిసిన యువ కవి రాజు నాగరాజు తన కవితాక్షరాలే ఆయుధాలై సమాజ మార్పు కోసం కృషి చేసే ఈదళిత సూరీడు తెలుగు సాహిత్యంలో వెలుగొందాలని ఆశిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు**

1. 'యాలైపూడ్సింది' కవితా సంపుటిపై తెలుగు పత్రికలు - సమీక్షలు
2. అక్షర సూరీడు" - పల్లిపట్టు (సాక్షి పత్రిక 25-08-2022)
3. నిర్భయ గొంతుకై ప్రశనలెక్కు పెట్టిన యాలైపూడ్సింది" (నవ తెలంగాణ 28-08-2022)
4. కవిత్వ పట్టు తెలిసిన పల్లిపట్టు" (సృజన నేడు 25-12-2022)
5. దళిత విప్లవజమిలి నేత పల్లిపట్టు" - కేతిరెడ్డి యాకుబ్ రెడ్డి (భూమిపుత్ర 27-07-2022)
6. మట్టి మాటలే యాలై పూడ్సింది". (సాహిత్య ప్రస్తాన పత్రికా ఏప్రియల్ 2021)

# బాధిత ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మనః సంఘర్షణల దర్పణం - కాలుతున్న పూలతోట నవల

**షేక్ షానాజ్ బేగం,** తెలుగు అధ్యాపకురాలు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు, నెల్లూరు

సయ్యద్ సలీం 1959 జూన్ ఒకటో తేదీన జాఫర్, అన్వర్‌బీ దంపతులకు ఒంగోలు సమీపంలో త్రోవగుంట అనే గ్రామంలో జన్మించారు. మానవత్వాన్ని మించిన మతం లేదనీ, అదే తన అభిమతంగా, కథలు నవలలు కవితలు రాశారు. జీవన్మృతులు, వెండిమేఘం అనే నవలలు రాశారు. 2004లో రూపాయి చెట్టు కథల సంపుటి ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. మెహర్, బురఖా, తలాక్, ఆరో అల్లుడు వంటి కథల ద్వారా ముస్లిం సంప్రదాయాల్లో, ఆచార వ్యవహారాల్లో ఉన్న రుగ్మతల్ని ఖండించారు. ఆయన రాసిన కాంచనమృగం నవల ఆటాసంస్థ నిర్వహించిన పోటీల్లో బహుమతి పొందింది. మెహర్, బురఖా, తలాక్, ఆరో అల్లుడు వంటి కథల ద్వారా ముస్లిం సంప్రదాయాల్లో, ఆచార వ్యవహారాల్లో ఉన్న రుగ్మతల్ని ఖండించారు. సలీం సంస్కరణవాది. ఇప్పటివరకు వీరు మూడు కవితా సంపుటాలు,10 కథా సంపుటాలు, 25 నవలలు వెలువరించారు. సమకాలీన సమస్యల వాస్తవ జీవితాలకు అద్దం పట్టినట్లు రచించడంలో సలీం దిట్ట. ఈయన అంతరించిపోతున్న పులుల సంఖ్యను పత్రికల్లో చదివి దానికి కారణాలను తెలుసుకొని కల్వేశ్వరం అడవులకు వెళ్ళి పులుల వేటాడే పోచర్ల జీవిత ఇతివృత్తాన్ని వివరిస్తూ అరణ్యపర్వాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు. సమాజంలో స్త్రీలకు ఆయువు పట్టులాంటి గర్భసంచిని తీసివేయడానికి అనవసర శస్త్రచికిత్సలు చేసి నిరక్షరాశ్యులైన ఆడవారిని పొట్టన పెట్టుకుంటూ వ్యాపారం చేస్తున్న వైద్య మాఫియాను వివరిస్తూ గర్భగుడి నవలను రచించారు. ఆకట్టుకునే శైలిలో రసవత్తరంగా ఆద్యంతం చదివించేలా చేయడం వీరి రచనా ప్రత్యేకత. సమాజంలో ఎదగడానికి వైకల్యం, పేదరికం అడ్డుకాదని సంకల్పం ఉంటే అత్యున్నత స్థానానికి వెళ్ళవచ్చనే విషయాన్ని తెలిపే నవల పడి లేచే కెరటాలు, కరోనా సృష్టించిన విధ్వంసాన్ని చిత్రిస్తూ రాసిన నవల లోపలివిధ్వంసం, ముస్లిం మహిళాసాధికారతను చిత్రిస్తూ రాసిన నవల వెండిమేఘం, సున్నీ ముస్లింలకు, దూదేకులకు మధ్య ఉన్న అంతరాలను చిత్రించిన నవల దూదిపింజలు, సమాజంలో వర్ణాంతర వివాహాల వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారం చూపే నవల అనూహ్యాపెళ్లి, జీవిత పరమార్ధం కోసం ఒక వ్యక్తి పడిన తపనకు అక్షర రూపం అన్వేషణ నవల. పుట్టుచెవిటిగా పుట్టి సంగీతరాగాలకు రంగులుదిద్ది జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఓ అమ్మాయి కథ మౌనరాగాలు ఇలా చెప్పుకుంటే వీరి రచనలు వేటికవే ప్రత్యేకం.

నేడు ప్రపంచాన్ని వణికిస్తున్న అతి పెద్ద సమస్యల్లో ఒకటి హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఈ వ్యాధి గురించిన సరైన అవగాహన లేకపోవటం వల్ల జరిగిన, జరుగుతున్న అనర్థాలెన్నో. హెచ్.ఐ.వి ఉందని తెలీగానే అది మరణ కారణమనుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్న వాళ్ళూ, ఏ తప్పూ చేయకుండానే రక్త మార్పిడి సమయంలో హెచ్.ఐ.వి బారిన పడి నమాజ బహిష్కరణకు గురౌతున్న అభాగ్యులు, కూతురికి ఆ రోగం సోకిందని తెలిశాక గర్భిణీ అన్న కనికరం కూడా లేకుండా వూరి బయట స్మశానంలో వదిలేసి వచ్చిన తల్లిదండ్రులు, ఓ విద్యార్థికి హెచ్.ఐ.వి ఉందన్న కారణంతో అతన్ని స్కూల్ నుంచి వెళ్ళగొట్టేదాకా ఉద్యమించిన మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు వంటి అంశాలు ఆయనను ఈ కథాంశంతో నవల రాయడానికి ప్రేరేపించిన అంశాలు. ఈ నవల మొదట "నవ్య" వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించబడి 2006లో పుస్తక రూపంలో వెలువడింది.

శాంతకుమారి ఈ నవలను "నయీ ఇమారత్ కె ఖండహర్"గా హిందీలో అనువదించారు. ఈ నవలలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రోగుల యొక్క గౌరవప్రదంగా జీవించే హక్కు గురించి, వాళ్ళ విషయంలో సమాజం యొక్క నైతిక బాధ్యత గురించి, హెచ్.ఐ.వి సోకిన పిల్లలు చదువుకునే హక్కు గురించి చర్చించటం వల్ల ఈ అనువాదానికి 2009వ సంవత్సరానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, న్యూఢిల్లీ వారి అవార్డు దక్కింది. ఈ నవలకు 2010 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

AIDS అనేది ఎక్వైర్డ్ ఇమ్యూన్ డెఫీసియన్సీ సిండ్రోంకు పేరు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి చివరికి చనిపోతారు. సంభోగాల వల్ల, రక్త మార్పిడి వల్ల, తల్లి నుండి బిడ్డకు, కలుషిత సిరంజిల వల్ల, ఎయిడ్స్ అనే వ్యాధి సంక్రమిస్తుంది. ముందు ఈ వ్యాధిని ప్రాణాంతక వ్యాధిగా భావించేవారు. దీనిని మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భిన్న నేపథ్యాల నుండి వచ్చిన ఇద్దరు ఆ వ్యాధి సోకి, ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నారో ఈ నవలలో చిత్రించారు సయ్యద్ సలీం. ఒకరు విద్యావంతుడైన ఉద్యోగస్తుడు, మరొకరు భర్త ద్వారా వ్యాధి సోకిన నిరక్ష్యరాస్య మహిళ.

కాలుతున్న పూల తోట నవలలో ఒక ముఖ్యమైన పాత్ర సుధీర. పేరులో ఉన్న ధీరత్వం జీవితంలో ఈమెకు లేదని తెలుస్తుంది. ఈమెకు చిన్నప్పుడే తండ్రి చనిపోతాడు. 13 –14 సం॥ పసి వయసులోనే సవతి తండ్రి చేతిలో కన్యత్వాన్ని పోగొట్టుకుంటుంది. తల్లికి చెప్పినా కళ్ళతో చూసేవరకు నమ్మలేదు. ఆమె జీవితం బాల్యంలోనే దుర్భరమైనది. తనకు ప్రేమ కావాలి స్వచ్ఛమైన ప్రేమ. సుధీర అందగత్తె కావడం వలన ఇంటర్ చదివే రోజుల్లో చాలామంది ప్రేమలేఖలు రాశారు. వారిలో కుమార్ కూడా ఒకడు. సుధీర బాగా చదివి బ్యాంక్ ఉద్యోగం తెచ్చుకుంది. కుటుంబ నేపథ్యంలో వివాహ వ్యవస్థ మీద నమ్మకం లేక, వివాహం స్త్రీలకు ఆంక్షలు విధిస్తుందని వివాహం చేసుకోకుండానే తనకు బాగా తెలిసిన నచ్చిన మగాడితో నచ్చినట్లుగా జీవితం గడుపుతూ ఎయిడ్స్ వ్యాధికి గురయ్యి ఆత్మహత్య చేసుకున్న అధీర గా సుధీర పాత్రను చిత్రించారు రచయిత. తనతో ఉన్న ప్రతి మగాడికి ఈ విషయాన్ని చెప్పి ఎయిడ్స్ నిర్ధారణా పరీక్ష చేయించుకోమని చెప్తుంది. ఆమె చనిపోయేవరకు ప్రేమ, ఆత్మీయతల కోసం సంఘర్షణ పడుతుంది. విచ్చలవిడి శృంగారంలో పాల్గొంటే ఎయిడ్స్ వ్యాధికి గురి కాక తప్పదు అనే విషయాన్ని చెప్పేందుకే సుధీర పాత్రను పాఠకులకు పరిచయం చేసినట్లు స్పష్టంగా అర్థమౌతుంది.

కుమార్ విద్యావంతుడు, హైదరాబాదులో బ్యాంక్ మేనేజర్గా పని చేస్తుంటాడు. భార్య మాధురి, ఇద్దరు పిల్లలు సాఫీగా సంసారం సాగుతూ ఉంటుంది. కుమార్ అనుకోకుండా బ్యాంకు పని మీద చెన్నైకి వెళ్ళి తన కళాశాల సహాధ్యాయి సుధీరతో మూడు రోజులు అరక్షిత శృంగారంలో పాల్గొంటాడు. రెండు నెలల తర్వాత సుధీర హైద్రాబాదుకు వచ్చి తనకు ఎయిడ్స్ శోకిందని కుమార్ని టెస్ట్ చేయించుకోమని చెప్తుంది. అప్పటి నుండి కుమార్లో మానసిక సంఘర్షణ మొదలవుతుంది. తనకు ఎయిడ్స్ వచ్చిందని తన ద్వారా తన పిల్లలకు, భార్యకు వస్తుందని, తానే హెచ్.ఐ.వి వైరస్ నని, తనకు తుమ్మువచ్చినా దగ్గు వచ్చినా, తలనొప్పి, జ్వరం వచ్చినా అదే తనను కబళిస్తుందని తన వ్యాధి భార్యాబిడ్డలకు రాకూడదని విషయాన్ని మాధురికి చెప్పకుండా ఆమెను దూరం పెడతాడు. టెస్ట్ చేయించుకొని ఆ వ్యాధి ఉందని తెలిస్తే సమాజంలో తన భార్యాబిడ్డల జీవితాలు నాశనమవుతాయని తన పేరుప్రతిష్టలు మంటకలిసి పోతాయని, భయం ముసుగులో ప్రతిక్షణం నరకాన్ని అనుభవిస్తుంటాడు. తాను చేసింది చిన్న తప్పు. అయినా దానికి శిక్ష ఇండియన్ పీనల్ కోడ్ కంటే కఠినమైన మరణశిక్ష అని మధనపడతాడు. విషయాన్ని భార్యకి చెప్పలేదు, డాక్టర్ని కలవలేదు, మిత్రుల సలహా తీసుకోలేక మానసిక వ్యధను అనుభవిస్తుంటాడు. మాధురి కుమార్ ప్రవర్తనలోని మార్పును గుర్తించి హాస్పిటల్కు వెళ్ళమంటుంది. ఎయిడ్స్ గురించి ఎవరూ మాట్లాడుకుంటున్న టి.వి. లో ప్రకటనలు వచ్చినా బెంబేలెత్తి పోతుంటాడు. చివరకి ధైర్యం చేసి క్లినిక్కి వెళ్ళి తానో రచయితనని ఎయిడ్స్ గురించి వ్యాసం రాస్తున్నానని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల గురించి, అనేక విషయాలను సేకరిస్తారు. ఈ పాత్ర ద్వారా సగానికిపైగా ఎయిడ్స్కు సంబంధించిన సమాచారాన్ని పాఠకులకు తెలియజేస్తారు రచయిత. మరో పాతికేళ్ళలో ప్రపంచ జనాభా ఎయిడ్స్ వ్యాధితో

తుడుచుకుపోతుందని, వారానికి పది కేసులైనా తన దగ్గరకు వస్తాయని, అందులో 90% యువతేనని చెప్తాడు. ఈ వైరస్ శరీరంలో ప్రవేశించిన తర్వాత యాంటీబాడీలు ఉత్పత్తి కావడానికి ఆరు నెలలు పడుతుందని, ఈ కాలాన్ని విండో పీరియడ్ అంటారని, ఈ సమయంలో రోగి మామూలుగా ఉంటాడని, వ్యాధి లక్షణాలు బయటపడటానికి 5 సం॥లు పడుతుందని చెప్తాడు. అప్పుడు రోగికి హెచ్.ఐ.వి. వైరస్‌తో పాటు రకరకాల ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్ కారక వైరస్‌లు విజృంభించి, సి.డి. కణాలు తక్కువై 13 నెలలోపు మరణిస్తారని చెప్తాడు. వ్యాధి అని తెలియగానే రోగి కుంగిపోతాడే తప్ప వెస్టన్ బ్లాట్ టెస్ట్ చేయించుకోరని చెప్తాడు. గాయాలుండి ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారిని కలిస్తే తొందరగా ఎయిడ్స్ వస్తుందని, ఎక్కువమంది యువతే ఎయిడ్స్ వ్యాధికి గురి అవుతున్నారని చెప్తాడు. యువత ప్రభుత్వం చేస్తున్న ప్రచారాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, క్షణికావేశాలకు లోనై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్తాడు. కుమార్ తో పనిచేసే శ్రీకాంత్ తాగుబోతు, తిరుగుబోతు కూడా అతనితో కుమార్ ఇలా విచ్చలవిడిగా తిరిగితే ఎయిడ్స్ వ్యాధి రాదా అని ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా శ్రీకాంత్ తాను కండోమ్‌ను వాడతానని అందుకే తనకే రోగాలు రావని చెప్తాడు. కుమార్‌కి తరచూ జ్వరం వస్తూ నీరసించి పోవడంతో పాటు బరువు విపరీతంగా తగ్గిపోతాడు తాను చావు అంచులకు చేరానని భావించి టెస్టు చేయించుకోవాలనుకుంటాడు. తెల్సిన వాళ్ళు తారసపడతారేమో అనే భయంతో నాణ్యతా ప్రమాణాలు లేని క్లినిక్‌లో రక్త పరీక్ష చేయించుకొని, తనకు ఎయిడ్స్ పాజిటివ్ అనే రిపోర్టు చూసి ఆత్మహత్య చేసుకోవాలని, నిర్ణయించుకొని, కావాలనే ఆక్సిడెంట్ గురై హాస్పిటల్‌లో డాక్టర్ ద్వారా తనకు ఎయిడ్స్ లేదని, ముందు చేయించుకున్న రిపోర్ట్ నాణ్యత ప్రమాణాలు లేనిదని డాక్టర్ ద్వారా తెలుసుకుంటాడు. ఇన్నాళ్ళూ భయంతో పూలతోటలాంటి జీవితాన్ని చేతులారా కాల్చుకున్నానని, జరిగిన విషయాలను మాధురికి చెప్పి జాగృతిని పొందుతాడు. భయం మనిషిని ఎలా కాల్చుకు తింటుందో భయంతో కుమార్ పడ్డ అంతఃసంఘర్షణను ఈ పాత్ర ద్వారా చిత్రించారు సలీం.

కుమార్ పని చేసే బ్యాంక్‌లో పనిచేసే కృష్ణమూర్తి అతని భార్యకు ఎయిడ్స్ శోకింది. అది ఎలా వచ్చిందో తెలియక ఒకరిమీద ఒకరు నిందలు వేసుకుంటున్న దంపతులకు రక్తమార్పిడి ద్వారా ఎయిడ్స్ శోకిందని తెలియజేస్తాడు కుమార్. వారిద్దరూ ఆత్మహత్య చేసుకొని మరణిస్తారు. కృష్ణమూర్తి దంపతులు సామాజిక సంఘర్షణను ఎదుర్కొన్నారు. పాలవాడి నుండి పేపర్ బాయ్ దాకా ఎయిడ్స్ ఉందని అందరూ వెలివేస్తారు. సమాజమే కృష్ణమూర్తి దంపతుల మరణానికి కారణమని, భయం మనిషిని ఎలా హరిస్తుందో మశూచి అమ్మవారి కథను సంజయ్ పాత్ర ద్వారా తెలుస్తుంది. సమాజానికి భయపడి వాళ్ళు తొందరపడ్డారని HAART. ఎయిడ్స్ వ్యాధి వస్తే చనిపోతారనే విషయం ఒకనాటి మాట, ఇప్పుడు హైలీ యాక్టివేటెడ్ యాంటీ రిట్రో వైరల్ థెరపీ ద్వారా రోగి తన జీవిత కాలాన్ని పొడగించుకొని జీవించవచ్చుని అని డాక్టర్ సంజయ్ పాత్ర ద్వారా సందేశం ఇప్పించారు సలీం. కృష్ణమూర్తి భార్యకి ప్రసవ సమయంలో ఆమె అన్న రక్తం ఎక్కించడం ద్వారా ఎయిడ్స్ సోకింది. రక్త మార్పిడి ద్వారా ఎయిడ్స్ వ్యాధి భార్య నుండి భర్తకు వస్తుందనే విషయం ఈ పాత్రల ద్వారా తెలియజేశారు.

ఈ నవలలో ముఖ్య పాత్ర నాగమణిది. ఈమె భర్త కోటయ్య పెళ్లయిన కొత్తలో కండలు తిరిగి బలంగా ఉండేవాడు. పెళ్లయిన మూడేళ్ల వరకు బాగానే ఉన్నాడు తరువాత అనారోగ్యంతో మనిషి అస్తిపంజరంలా మారి పోయాడు. జ్వరం తగ్గక పోయేసరికి కోటయ్యను ప్రభుత్వ ఆసుపత్రిలో చూపిస్తుంది నాగమణి. టెస్టులు చేసి ఆసుపత్రి వర్గం కోటయ్యను ఎయిడ్స్ శోకిందని చెప్పి, డాక్టర్లు నర్సులు కూడా అసహ్యించుకుంటారు. కోటయ్యకు ఎయిడ్స్ అని డాక్టర్ మూర్తి నాగమణికి చెప్పి, అతను నెల రోజుల్లో చనిపోతాడని చెప్తాడు. నాగమణిని కొడుకు శ్రీను కూడా రక్త పరీక్ష చేయించుకోమంటాడు. రోగులను మర్యాదగా చూసుకోవాల్సిన డాక్టర్లు, నర్సులు అతనిని పురుగు కంటే హీనంగా చూడటం, కర్రలతో కొట్టడం ఎంత దారుణం! నాగమణి అతికష్టం మీద కోటయ్యను ఇంటికి చేరుస్తుంది. ప్రక్కరోజు తల్లీబిడ్డలిద్దరూ టెస్టులు చేయించుకొని పాజిటివ్ అని తెలుసుకుంటారు. రెండు రోజుల తర్వాత టి.వి. వాళ్ళు కెమెరా పట్టుకొని, కోటయ్య ఇంటికి వచ్చి తనకు ఎయిడ్స్ శోకిందని ప్రభుత్వాసుపత్రి వాళ్ల ద్వారా తెలిసిందని టి.వి.లో వార్తను ప్రసారం చేసి నిలువ నీడ లేకుండా చేస్తారు. కోటయ్య చనిపోయినప్పుడు

కూడా ఎవరు సహాయపడరు. మున్సిపాలిటీ వాళ్ళు కూడా సహకరించరు. అతి కష్టంతో తానే గుంటనుతవ్వి పూడ్చిపెట్టి, రైల్వే స్టేషన్‌కు చేరి అభిమానాన్ని చంపుకొని బిచ్చమెత్తి జీవిస్తుంది. రైల్వేస్టేషన్‌లో మస్తానమ్మతో పరిచయమవుతుంది. అక్కడ కానిస్టేబుల్ సింగయ్య అర్ధరాత్రి పూట నాగమణిని బలాత్కరిస్తాడు. అవమానంతో ఉన్న నాగమణి తనకు ఎయిడ్స్ ఉందని తిడుతుంది. ఈ విషయాన్ని నిర్ధారించుకొని సింగయ్య కొడుతూ ఉంటే, మస్తానమ్మ అడ్డుతగిలి హాస్పిటల్ పాలవుతుంది. నాగమణికి జబ్బు గురించి తెలిసినా మస్తానమ్మ ఓదారుస్తుందే తప్ప అసహ్యించుకోదు, తాను చూసుకుంటానని చెప్పి మరణిస్తుంది.

ఆ తర్వాత నాగమణి విజయవాడలోని ఆరోగ్యమాత ఆలయం చేరి బిచ్చగత్తెగా మారి శీనుని స్కూల్‌లో ఒకటో తరగతిలో చేర్పించింది. బతుకు పోరాటంలో శీనులో హెచ్.ఐ.వి క్రిమి ఉందని శీను దానితో పోరాడుతూ గెలవలేక ఓడిపోతున్నాడని నాగమణి గుర్తించలేకపోయింది. ఫలితంగా శీనుకి తరచూ జ్వరం రావడం నాగమణి విజయవాడలో గవర్నమెంట్ హాస్పిటల్‌లో చూపించింది. ఒంగోలులో చూపించిన కాగితాలను చూసి హాస్పిటల్ సిబ్బంది అసహ్యించుకొని మందులు ఇచ్చారు. ఒకరోజు శీనుకి జ్వరం ఉన్నా స్కూల్‌కి వెళ్ళాడు. శీను ఎలా వున్నాడో చూద్దామని నాగమణి వెళ్ళింది. హాస్పిటల్ కాంపౌండర్ వచ్చి ఎయిడ్స్ రోగి చదివే స్కూల్‌లో తమ పిల్లలను చదివించమని మరికొందరి తల్లిదండ్రులను తీసుకువచ్చి శీనును హెడ్‌మాస్టర్ చేత వెళ్ళగొడతారు. ఈ విషయం జర్నలిస్టుకు తెలిసి వార్తను సేకరించి “ఎయిడ్స్ శోకిందన్న నెపంతో విద్యార్థి బహిష్కరణ“ అనే వార్త ద్వారా నాగమణి అక్కడినుండి గెంటబడి, చర్చి ఫాదర్ డేనియల్ సహాయంతో పాజిటివ్ పీపుల్ కేర్ సంస్థలో బిడ్డతో సహా చేరుతుంది. ఆ సంస్థ వాతావరణం ఋష్యాశ్రమంలా ప్రశాంతంగా ఉంది. అక్కడి వారందరికీ ఎయిడ్స్ ఉందని తెలిసి నాగమణి ఆశ్చర్యపోతుంది.

ఈ నవలలో మాధవి పాత్రను ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులందరికీ కూడా మార్గదర్శకంగా నిలిపారు రచయిత. మాధవికి భర్త ద్వారా ఎయిడ్స్ సోకింది. తాను చనిపోవడం వల్ల ప్రయోజనం లేదని తన ద్వారా నలుగురికి మేలు జరగాలని, ఎయిడ్స్ గురించి అవగాహనను కలిగించాలనే ఉద్దేశ్యంతో పాజిటివ్ పీపుల్ కేర్ సంస్థను స్థాపించింది. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తమకు జబ్బున్నదని ధైర్యంగా చెప్పాలని, దాచుకోవడం వల్ల అనర్థాలు జరుగుతాయని స్వయంగా వేశ్యావాటికలకు, మురికివాడలకు వెళ్ళి అవగాహన కలిగించడం కోసం వాళ్ళు నివసించే ప్రదేశాలకు వెళ్ళి జాగృతం చేయసాగింది. ఫలితం, ఇద్దరితో మొదలైన పాజిటివ్ కేర్ సంస్థ 44 మంది చేరటం. ప్రశాంత వాతావరణంలో యోగా మెడిటేషన్ చేస్తూ మంచి తిండి తింటూ, డాక్టర్ల చేత కౌన్సిలింగ్ చేయించుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. వాళ్ళకు వచ్చిన పని చేసుకుంటూ సంతోషంగా కాలం గడపవచ్చు అనే విషయాన్ని ఈ పాత్ర ద్వారా రచయిత తెలియజేశారు. పత్రికలు, పుస్తకాలు చదవడంవల్ల అవగాహన, ఆత్మధైర్యం కలుగుతాయని విశ్వాసం. “హెచ్.ఐ.వి ఎయిడ్స్ సమగ్ర విజ్ఞానం” సమరం రాసిన పుస్తకం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులచే తప్పకుండా చదివింపజేసేది మాధవి.

నాగమణిలో ఉన్న వాగ్చాతుర్యం, ధైర్యం ఓపికలను గమనించిన మాధవి నాగమణిని తన ఆశలకు, ఆశయాలకు వారసురాలుగా ఎంచుకుంది. మాధవి తనతో పాటు ప్రతిచోటికి తీసుకువెళ్లి అందరినీ చైతన్యపరిచేది. తరవాత మాధవి, నాగమణి అవగాహన కార్యక్రమాలను చాలా చేపట్టారు. నాగమణి ఓపికగా వేశ్యావాటికలకు వెళ్ళి అవగాహన కలిగిస్తూ, తనకు తారసపడిన ఎయిడ్స్ రోగుల్ని పాజిటివ్ పీపుల్ కేర్ లో చేరమని సలహాలు ఇస్తూ ముందుకు సాగిపోతుంది. నాగమణి ఆరోగ్యంగా, చాలా ఉత్సాహంగా వ్యాధిగ్రస్తురాల్లా కాకుండా మామూలు మనిషిలా మారింది. ప్రభుత్వం నిర్వహించే ఆశా కార్యక్రమానికి హాజరవుతుంది. వ్యక్తికి సి,డి.-4, సి,డి.-8 కణాల ప్రాధాన్యత వైరల్ లోడ్ ఎంత ఉందని విషయం ఆపర్చునిటీ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే పరిస్థితులను తెలియజేయాలని, ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రాముఖ్యతని తెలియజేస్తారు. ఒకవేళ భార్యాభర్తలిద్దరికీ ఎయిడ్స్ ఉన్న కండోం వాడాలని, ఎందుకంటే ఒకరికీ వైరల్ లోడ్ తక్కువ ఒకరికి వైరల్ లోడ్ ఎక్కువగా ఉంటే గనుక తక్కువగా ఉన్న వారికి ఎయిడ్స్‌తో పాటు వివిధ లైంగిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువని ఎయిడ్స్

సంబంధించిన అనేక అంశాలను ఈ సంస్థ ద్వారా నాగమణి, మాధవిల పాత్రల ద్వారా ఎక్కువ విషయాలు తెలిసేటట్లు చేశారు రచయిత. మధ్యలో శీను మరణం నాగమణిని అంతగా బాధించలేదు. అందరి మధ్య అంత్యక్రియలు జరిగినందుకు సంతోషించింది. హెచ్.ఐ.వి. బాధితుల సమస్యలను ప్రస్తావించడానికి దేశవ్యాప్తంగా పదిమంది హెచ్.ఐ.వి డెలిగేట్స్ ఎంచుకుంది. భారత ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్. ఆంధ్రప్రదేశ్ నుండి నాగమణి ఎంపికైంది. ఈ విధంగా ఈ సందర్భంగా విజయవాడలో ఒక సభను ఏర్పాటు చేసి "ఆమె ఎయిడ్స్‌ను జయించింది." అనేటువంటి వార్త టి.వి.లో మారుమోగించారు. ప్రతి ఒక్కరూ నాగమణిని అభినందించారు. నాగమణి రోజులు గడిచే కొద్దీ ఆమె పాజిటివ్ పీపుల్ కేర్ సహాయంతో తనను కాంతిపుంజంలా మార్చుకుంది. తనలోని చీకటినే కాదు ఎదుటి వ్యక్తిలో జీవితాల్లోని చీకటిని కూడా పారద్రోలడానికి కంకణం కట్టుకుంది. ఎంతోమంది హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తుల నిరాశ నిండిన జీవితాల్లో ఆశా కిరణాలను వెదజల్లింది. ఎయిడ్స్ సోకిందనే భయంతో ఆత్మహత్యకు పాల్పడబోతున్న అభాగ్యులకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది. మన పార్లమెంట్లో ఎయిడ్స్ గురించి మాట్లాడే అదృష్టాన్ని గొప్ప సత్కారాన్ని పొందిన నాగమణిని అందరూ అభినందనందించారు. ఆమె ధైర్యానికి పోరాట పటిమకు ఇది నిదర్శనం. ఏ టి.వి. ద్వారా ఆమె జీవితం రోడ్డున పడ్డదో అదే టి.వి.లో ఆమె మర్యాదలు పొందుతుంది. ఇంటర్వ్యూలు ఇస్తుంది.

**ముగింపు :** ఈ నవలలో ప్రతి పాత్ర ద్వారా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సంభంధించిన చాలా విషయాలను చర్చకు పెట్టారు రచయిత. సుధీరది ప్రేమకోసం సంఘర్షణ, కుమార్‌ది వ్యాధి వచ్చిందేమోనన్న సంఘర్షణ, కృష్ణమూర్తి దంపతులది సమాజం చిన్నచూపు చూసిందనే సంఘర్షణ, నాగమణిది జీవిత సంఘర్షణ. ఇన్ని సంఘర్షణల మేళవింపుగా ఎయిడ్స్ గురించిన సమస్త సమాచారాన్ని సందర్భానుగుణంగా తన రచనలో తెలియజేశారు రచయిత. వైద్యపరమైన అంశాల విశ్లేషణతో వ్యాధిన పడినవారికి, పడబోయేవారికి పెద్దబాలశిక్షలాగా ఈ నవల ఉపకరిస్తుంది. ఎయిడ్స్ బాధితులను ఉద్యోగాలకు రానివ్వకుంటే హైకోర్ట్ ఎయిడ్స్ వారిని ఉద్యోగాలు చేసుకోవచ్చని తెలిపింది. ఎయిడ్స్ ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు నడుపుతున్నారు. మనకు ముందు నుండి కలరా, మశూచి, కుష్టు, ఇటీవల వచ్చిన కరోనా మొదలైన వాటికి టీకాలు మందులు కనిపెట్టినా, ఎయిడ్స్‌కి శాశ్వత పరిష్కారం మాత్రం కనుగొనలేకపోతున్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులంటే ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. ఆ కారణంగా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తాము న్యాయపరంగా జీవించే హక్కును కోల్పోతున్నారు. ఈ నిశ్శబ్దాన్ని ఛేదించండి, అంటున్నా ! స్పందన ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనేది నమ్మక తప్పని నిజం. ఈ నవలలో ప్రస్తావించిన అంశాలు లోకంలో కోకొల్లలు. అయితే చిత్రంగా ఈ నవలలో చదువుకున్న వ్యక్తి ఒక నిరక్షరాస్య మహిళ కంటే తనకు లేని జబ్బును ఉన్నదిగా ఊహించుకొని, తనతో పాటు కుటుంబాన్ని కూడ కష్టాలపాలు చేసి చివరికి జ్ఞానోదయం కలిగినా పోయిన మనఃశాంతిని పొందలేరు కదా! సమాజం చిన్నచూపు చూస్తే ఏమి జరుగుతుంది. వారెవరైనా మనల్ని ఉద్ధరిస్తారా! సహాయపడతారా! అటువంటి వారి కోసం తమ నిండు జీవితాలను పణంగా పెట్టి ఆత్మహత్యలు చేసుకోవడం ఎంతవరకు సబబు. ఈ విషయం గుర్తించాలనే సలీం కుమార్ పాత్రను ఎంచుకున్నారు. పొట్టపొడిస్తే అక్షరం ముక్క రాని నాగమణి భర్తను, సమాజాన్ని నిందించలేదు, తనకు ఎదురైన కష్టాలను లెక్కచేయక, ఎన్ని అవమానాలను ఎదుర్కొన్న ఎవరిని ద్వేషించలేదు. మస్తానమ్మ రూపంలో ఫాదర్ డేనియల్ రూపంలో, మాధవి రూపంలో, డాక్టర్ మూర్తి రూపంలో మానవతావాదులుగా ఈ నవలలో కనిపిస్తారు. వారి స్ఫూర్తితోనే ఎయిడ్స్‌ని జయించిన వ్యక్తిగా నాగమణి మనకు దర్శనమిస్తుంది.

2020–30 కల్లా ఎయిడ్స్ కేసులు పూర్తిగా రూపుమాపాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్రంగా కృషి చేస్తుంది. ఎయిడ్స్ సోకిన వారికి యాంటీ రిట్రో వైరల్ మందులను అందించి రోగుల ఆయుష్షును పెంచుతుంది. భారత ఎయిడ్స్ నియంత్రణ మండలి ARSH ను రూపొందించి, పలు కార్యక్రమాలతో ముందుకు వెళుతుంది. ఎయిడ్స్ రోగగ్రస్తులను గౌరవంగా చూద్దాం. ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా అరికట్టడంలో పౌరులుగా మన కర్తవ్యాన్ని నిర్వర్తించి మానవత్వాన్ని చాటుదాం. ఎయిడ్స్ గురించి తెల్సిన విషయాలే కదా అని నిర్లక్ష్యంచేయకూడదు. ఇంతగా ప్రభుత్వం కృషి చేస్తున్నా ఎయిడ్స్ చాపక్రింద నీరులా కేసులు

నమోదౌతూనే ఉన్నాయి. ఎక్కువగా భర్త నుండి భార్యకు, వారినుండి బిడ్డలకు సంక్రమిస్తున్నాయి. భారత ప్రభుత్వం వారికి రెడ్ రిబ్బన్ క్లబ్ ద్వారా మరి స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రభుత్వాసుపత్రులలో ATI మందులను అందుబాటులోనికి తెచ్చారు. ఇప్పటికీ ఈ వ్యాధికి సంబంధించిన ప్రకటనలు మాధ్యమాల్లో వస్తున్నాయంటే ఈ వ్యాధిని అరికట్టడానికి ప్రభుత్వం ఎంత కృషి చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యాధికి గురయిన వారిని సమాజంలో గౌరవంగా చూసినప్పుడే రచయిత ఆశయం పూర్తిగా నెరవేరినట్లే. ఆ రోజు కోసం ఎదురుచూద్దాం. WHO ఆశయాల మేరకు 2020-30 కల్లా ఎయిడ్స్ కేసు ఒక్కటి కూడా నమోదుకాని రోజు రావాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు**

1. కాలుతున్న పూలతోట నవల - సయ్యద్ సలీం
2. అంతర్జాలం

# 'నడక నా తల్లి' కవితా సంపుటి - ఒక పరిశీలన

**డా. కసుకుర్తి ఈశ్వరమ్మ,** తెలుగు అధ్యాపకురాలు, డి.కె. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), నెల్లూరు

పద్మభూషణ్, జ్ఞానపీఠ అవార్డుగ్రహీత డా.సి.నారాయణరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన ఆచార్యుడిగా, పరిశోధకుడిగా, వక్తగా, కవిగా, గేయ రచయితగా ప్రతి రంగంలోనూ తనదైన ముద్రను నెలకొల్పిన మహాకవి. నారాయణరెడ్డి అరవైకి పైగా కావ్యాలను, వేలాదిగా సినిమా పాటలను రచించాడు. ఈయన పద్యాన్ని హృద్యంగా, గేయాన్ని చెవులకు ఇంపుగా, వచన కవిత్వాన్ని అంత్యప్రాసలతో రచించి సహృదయుల ప్రశంసలు అందుకున్నాడు. ఈయన సంప్రదాయాన్ని జీర్ణించుకున్న అభ్యుదయ కవి. ఈయన వచనలో అభ్యుదయం, విప్లవం, మానవత, సమతలతో పాటు చైతన్యం పరవళ్లు తొక్కుతూ కనిపిస్తుంది. కవిగా నారాయణరెడ్డి నిరంతర చైతన్యశీలి కాబట్టి నడక నా తల్లి – పరుగు నా తండ్రి అని అన్నాడు. అంతేకాదు సమత నా భాష – కవిత నా శ్వాస – అంటూ కవిత్వాన్ని సమతాదృష్టితో మరణించే రోజు వరకూ రాశాడు. నారాయణరెడ్డి క్రమశిక్షణ గల వ్యక్తి. ప్రతిరోజూ ఉదయం నడకను ఓ వ్రతంగా సాగించేవాడు. ఆ నడకలోనే కవితలు, కావ్యాలు, సినీగీతాలు ఊపిరిపోసుకునేవి. నడక అంటే నారాయణరెడ్డి దృష్టిలో సంస్కృతి. అందుకే 'నడకను నా తల్లి' అనగలిగాడు. అంతేకాదు తాను ఉన్నతమైన భావాలతో రూపొందించిన కవితా సంపుటానికి "నడక నా తల్లి" అని పేరుపెట్టాడు. నడక – నా తల్లి కవితా సంపుటిలో అరవై ఒక్క కవితలున్నాయి. ఈ కవితలో భావ, అభ్యుదయ, విప్లవంతో పాటు మానవీయత, సమతాభావం కనిపిస్తాయి.

ఈ సంపుటిలో "ఎవరికి ఈ సన్మానం" అనే కవితలో సి.నా.రె. హృదయ వైశాల్యం కనిపిస్తుంది. తాను పుట్టిన గడ్డపై బాల్యంలోని మధురస్మృతులు గుర్తుకు తెచ్చుకుంటాడు ఈ కవితలో .....

అనుభవాల వెన్నముద్ద – లారగించినా, మనసుకు అంటారు

జిడ్డంటని నారాయణ – రెడ్డికి ఈ సన్మానం అని అంటూనే ఈ సన్మానం తనకు జరిగిందంటే అది జన్మనిచ్చిన తల్లి బుచ్చమ్మకు, తండ్రి మల్లారెడ్డికి తన ఉనికికి కారణమైన స్వగ్రామం హనుమాజీపేటకు, ఆ పేటలోని మట్టికి, తనకు విద్యనేర్పిన గురువుకు సన్మానం జరిగిందని అంటారు.

ఒకరోజు నారాయణరెడ్డి డాబా మీద వెల్లకిలా పడుకొని ఆకాశంలోని మేఘాలను చూసి "కురిసిన శిల్పాలు" కవిత రాశాడు. ఆ సందర్భంలో అతనికి మేఘాలు అందమైన శిల్పాల్లా కనిపించాయి. అందుకే

**"ఆకాశమే ఒక పెద్ద మ్యూజియం – అందులో ప్రతి మేఘం ఓ శిల్పం"** – అని అంటారు

ఎవ్వరికీ ఉపయోగపడని అందం వృథా అనుకున్నారు కాబోలు

**"ఒక్క నీటి చుక్క కోసం – ఊపిరులు చేతులెత్తి అరిచే ధరిత్రిని**

**తడివేళ్లతో తడమని మా అందమెందుకు"** అని మేఘాలతో పలికించారు. చివరకు మేఘాల అందాలు కరిగిపోయి వర్షం కురుస్తుంది. అప్పుడు భూమి ఆనందం తొణికే కోటికళ్లతో నీళ్లను గుటగుటా తాగింది. ఫలితంగా పంటలు పండి లోకం సుభిక్షంగా ఉంటుందని ఆనందపడ్డారు.

అలాగే "తెగ కురిసిపో" అనే కవితలో మేఘం అనవసరం సంశయం లేకుండా తెగింపుతో కురవాలి. చిగురులెత్తే చేను వెన్ను తట్టిపోవాలి. అనవసరమైన మాటలు ఆపి కన్నీళ్లను తుడిచి పొమ్మంటారు మేఘంతో అంతేకాదు

"గుండెల్లో పొగవేసే – గుసగుసలిక చాలు చాలు

దమ్ముంటే అధికారం – దద్దరిల్లగా అరచిపొమ్మని మేఘంతో చెబుతారు

అక్షరాలకు కూడా మనసు ఉంటుంది. అవి అన్యాయానికి ఎదురొడ్డి పోరాడతాయి. అని "అక్షరాలు అరుస్తాయి" కవితలో ఇలా అంటారు.

మచ్చిక చేయగలిగితే అక్షరాలు – మనసున్న పులిపిల్లలు

అవిచేసే హాని – అన్యాయానికి గాని – అని అంటూనే అందరికీ అక్షరం వపర్ ఇలా చూపించాడు. అక్షరం విలువ – ముసలి బికారి మూలుగంత

**అదేగట్లు తెంచుకుంటే – అరణ్యాన్ని తాగే ఏనుగంత**

**పుట్టలోని పాము అక్షరం – అధికారమా జాగ్రత్త! అనవసరంగా వేలు పెట్టకు** – అని హెచ్చరించారు. తరువాత దేశాన్ని "దేశం నాళ్లలో" అనే కవితలో దేశంలోని వివిధ మతాల వారి కలుషిత మనస్సుల్ని ఇలా ఆవిష్కరిస్తారు.

పండుగనాడు నా దేశం – గుండెను ఉతికి తొడుక్కుంటుంది

వేళ్లమీద జపమాలలు నడుస్తాయి – నోళ్లనిండా ఈశ్వర్ అల్లాలు మొలుస్తాయి

పిండివంటల కమ్మని ఆలోచనలు మెరుస్తాయి –మళ్లీ గుండెకు మకిలి పడుతుంది

మతం ముసుగులో మాధ్యం బుసలు కొడుతుంది. అంతేకాదు భారతదేశం పటంలో ఒక రాష్ట్రం వారు మరొక రాష్ట్రాన్ని ఈసడించుకుని చూస్తున్నారని ఈ కవితలో అంటారు.

దేశంలో, కాగితంలో – ప్రాంతాల అడ్డుగీట్లు –గట్ల గట్ల నడుమ – భాషలు ప్రవహిస్తాయి గంగలా, గౌతమిలా–అవతలి మాట అంటుకుంటుందని – ఇవతలి గట్టుకు ఉలికిపాటు –నీళ్లకు లేని కుళ్లు బుద్ధి గట్టుకెందుకున్నట్లు – అని ప్రశ్నిస్తారు. తరువాత కొత్తపుటలు, ఎక్కుపెట్టిన శిరస్సు, పక్షికి రెక్కే కదా ప్రాణం, గమనించు మిత్రమా, అగ్ని గంగలో, కృతజ్ఞతలు, కొండవాగు ఏమన్నది, కొత్తదనం, ఉగాదిపాట, పుట్టినరోజు, తొలి అడుగు కవితల్లో అభ్యుదయం కనిపిస్తుంది.

"కొత్తపుటలు" కవితలో....నా కావ్యం –మన్నుదిన్న పాము కాదు –మార్పులా పడగెత్తే చైతన్యం – అంటారు. అలాగే "ఎక్కుపెట్టిన శిరస్సు" అనే కవితలో నా ఆకృతి

**నిటారుగా నిల్చున్న హరిత చైతన్యం –నా అంతరంగం**

**విముక్తి జాతి ప్రతిష్టించిన విజయధ్వజం** – అంటూ ఆశాభావం వ్యక్తం చేశాడు.

'గమనించు మిత్రమా!' కవితలో... నడిచింది ఒక్క మైలు అంతలోనే ఆత్రమా – తొలిపొద్దు వేళలోనే తలపైన ఛత్రమా

నీ అడుగులకో తుది గమ్యం అందాలంటే – ఎడతెగని ఎదురుదెబ్బలు గమనించు మిత్రమా! అని అంటారు. అలాగే మసకబారిన మన గుండెలమసక తొలగించుకోవాలని ఎన్నో ఎత్తుపల్లాలు జీవన యానంలో ఎదురవుతాయి. ప్రతినిత్యం జీవితంలో సంఘర్షణ ఉండే మానవ హృదయాల్ని మదించాలి. అప్పుడే మనం అనుకున్న అమృతం దొరుకుతుంది. మతం పేరుతో ఏ మనిషినీ హింసించవద్దు. కొత్తను గతం పేరుతో నిరసించవద్దు. కాలవాహిని మనల్ని భయపెట్టినా తలవంచవద్దు అని అంటారు.

అలాగే "అగ్ని గంగలో" అనే కవితలో.... ఎవరైనా మనల్ని ఆయుధాలతో బెదిరిస్తే గర్జించాలి. అంటూనే ....'జీవిస్తున్నాను మృతశిఖను పూలు ముడవాలని – మరణిస్తున్నాను బ్రతుకు మంటపై నడవాలని – అంటూ మానవ జీవిత భ్రమణం చావు పుట్టుకల మధ్య ఉందని తెలిపారు.

అలాగే ఒక మౌనం వినిపిస్తే, ఒక ధ్యానం విసిరేస్తే, చీకటి ఒక కిరణం అరువిస్తే, ఒక శిశువు క్షేమంగా ప్రసవిస్తే కృతజ్ఞతలు తెలిపారు. విష వృక్షాల పట్ల అప్రమత్తంగా వుండాలని దాని మూలాలు తొలగించాలన్నారు. అంతేకాదు.

నాటిన సరికొత్త మొక్క ఎదిగి ఎదిగి – నవచేతన ఫలితానికి కృతజ్ఞతలు – తెలిపారు.

అలాగే "కొత్తదనం" అనే కవితలో... ప్రతి మనిషి కొత్తదనంతో జీవించాలని కవి ఆశపడతారు. ప్రతి మనిషి విశ్వమానవతతో జీవించాలని అంటారు. అందుకే ....

**గుడి, మసీదు ఒకటేనని గొప్పలు చెబితే చాలదు –పరమవైదికుడు ఖురాను ప్రవచిస్తే కొత్తదనం**

**ఈశ్వర్ అల్లా ఒకరని ఎన్నాళ్లని ప్రసంగాలు – ముల్లాలు శివస్తుతులను వల్లిస్తే కొత్తదనం** – అంటూ.... సర్వమత సమానత్వాన్ని ప్రవచించారు.

"ఉగాదిపాట" కవితలో.... తన పాట గాంధీబొమ్మపై ఉన్న నెత్తుడి మరకల్ని కడిగింది. తన పాటలో ఎన్నో జీవిత సత్యాలున్నాయి. మన రాష్ట్ర రాజధానిలో ప్రతిబోర్డుపైన తెలుగు రాతను, తన పాట వెదకింది. తెలుగు కనిపించక ఆవేదన చెందింది.

అలాగే "తొలి అడుగు" కవితలో మనకు ఓటమి ఎదురైనా ముందుసాగితే రేపటి తరం మరింత ముందుకు వెళు తుందంటారు. అందుకే

**ఈ ఓటమి తుది విజయానికి తొలి అడుగు**

**ఈ ఓటమి నవ విక్రాంతికి తొలి అడుగు** – అని అంటారు.

తరువాత "ఉద్యమం ఉరిమిందంటే", "విత్తనాల సభ" వంటి కవితల్లో విప్లవ కవిత్వం కనిపిస్తుంది. ఉద్యమం ఉరిమిందంటే కవితలో... ఉద్యమం దీక్షను ఇలా వివరించారు.

**అలలెత్తిన సాగరమెన్నడూ కోరదు విశ్రాంతి – ఉడుకెత్తిన నెత్తురుకెప్పుడు అంటదు విశ్రాంతి**

**పడగెత్తిన పాలక జాతుల వంచన ఎదురొడ్డీ – శిరసెత్తిన శక్తులు సాగితే ఆగదు విశ్రాంతి** అని అంటారు. అలాగే "విత్తనాలసభ" అనే కవితలో వానలు లేక వ్యవసాయం జీవితం దుర్భరమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్న సందర్భంలో

తిరగబడిన ఓ విత్తనం – ఉరిమింది బాణంలా – తనలో రగిలే జీవశక్తికి – తార్కాణంలా అని విత్తనం శక్తిని తెలియజేశారు. తరువాత గాంధీ గుర్తుంటాడా? పగడం నెత్తురు, ఆ కళ్లు, త్యాగనిధి కవితల్లో దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన త్యాగమూర్తుల త్యాగాలను వివరించారు. అటువంటి వారిని జీవితాంతం గుర్తుంచుకోవాలని అంటారు "గాంధీ గుర్తుంటాడా" కవితలో... స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ నిజంగా మనకు గుర్తుంటాడా" అని భారతీయుల్ని ప్రశ్నిస్తారు.

మనకు మన దైనందిన కార్యక్రమాలు గుర్తుంటాయి. మహనీయుల త్యాగాలను మరచిపోతున్నామని ఆవేదన చెందుతారు. అలాగే పగడం నెత్తురు అనే కవితలో మన దేశానికి అహింస, విప్లవం రెండు అవసరమని అంటూ గాంధీ, నేతాజీలను స్మరిస్తారు. ఈ సందర్భంలో

**అహింసా వాణీ మహాత్మా! – ఆయుధ పాణి సుభాష్!**

**పరీక్షించాను మీ ఇద్దర్నీ –చరిత్ర పొరల్ని తవ్వుకుని**

**ఇద్దరూ కావాలి – ఇద్దరూ రావాలి** – అని వారిని పిలుస్తారు.

అలాగే 'ఆ కళ్లు' అనే కవితలో... మృతసైనికుల కళ్లను ఇలా వర్ణించారు.

**'పారే నదిలోన నీళ్లు – మృత సైనికుల కళ్లు**

**వెతుక్కుంటూ పోతున్నాయవి – వెన్నువిరిగిన విజయాన్ని'** అని అంటారు. ఓడిపోయి సైనికుల ప్రాణత్యాగాల్ని

జాతీయ పతాకం కోసం ప్రాణాలర్పించిన దేహాలను వర్ణించారు. చనిపోయిన వారి కళ్లు ఆశతో గెలుపుకోసం ప్రవహిస్తున్నాయని ఆశ పునాది ఎంత బలమైందో సి.నా.రె. ఈ కవిత ద్వారా నిరూపించారు.

అలాగే "త్యాగనిధి" కవితలో టంగుటూరి పంతులు పౌరుషాన్ని ఇలా వివరించారు.

**తలవంచుకు పోయే గొర్రెల జాతికి పౌరుషాగ్ని**

**నూరిపోసిన టంగు – టూరీ! ఆంధ్రుల కేసరీ** – అంటూ స్వరాజ్య సమరం నడిపిన త్యాగనిధి అని కొనియాడారు.

తరువాత తెలుగు ముందడుగు, ఇది తెలుగు గడ్డ, అవధి లేని సంభరం కవితల్లో రాష్ట్రాభిమానం, భాషాభిమానం పుష్కలంగా కనిపిస్తుంది. ముందుగా "తెలుగు మందడుగు" కవితలో గురజాడ గుండెగా, గిడుగు గొడుగు అండగా పలు రుచులకు మరిగిన తెలుగుజాతి కలకండగా పులకించాలంటారు. వచ్చినాడు, వచ్చాడు, వచ్చిండు వంటి మాటల యాసలు వేరైనా భాష ఒక్కటేనన్నాడు. పరిపాలనలో తెలుగుభాషా విస్తృతి పెరగాలని ఆశపడ్డారు. పరభాషాభిమానం ఎక్కువై, స్వభాషాభిమానం మందగించినప్పటికీ తెలుగుభాషాభిమానం రామదండులా ఒక్కటై సాగుతుందని కవి చెబుతారు. ఆ సందర్భంలో తెలుగు ఇలా తల్లిని పలకరిస్తారు.

**ఏమమ్మా తెలుగమ్మా – ఎక్కడ నీ చిరునామా!**

**గుభాళించి పోనీ నీ – కొప్పు మల్లెచెండుగా** – ఉండాలనుకుంటారు. అంతేకాదు తీయనైన తెలుగు గొప్పదనాన్ని, తీయదనాన్ని, తెలుగు కీర్తిని, తెలుగువారి జీవన విధానాన్ని "ఇది తెలుగు గడ్డ" కవితలో వివరించారు. అలాగే తెలుగువారి లోపాలను, బలహీనతలను జయించి సన్మార్గంలో సాగాలని ఆశపడ్డారు. ఈ సందర్భంలో

**ఇది తెలుగు గడ్డ, గాండ్రించు పులిబిడ్డ – ఈ**

**గొంతులో పిల్లికూతలొద్దురా – ఈ గుండెలో గొర్రెదాటొద్దురా** – అంటూ తెలుగువారి పౌరుషాన్ని వివరిస్తూనే తెలుగువారు స్వతంత్రంగా తెలివితో నడవాలని అంటారు.

అలాగే "అవధిలేని సంభరం" కవితలో... ఆంధ్రరాష్ట్ర నిర్మాణం భాష ప్రాతిపదికన ఏర్పడింది. కాబట్టి తగవులు లేకుండా తెలుగువారు కలసిమెలసి ఉండాలని ఆశించారు. అంతేకాదు

**ప్రతి ఆశకు ఒక లక్ష్యం – ప్రతి భాషకు ఒక రాష్ట్రం**

**ధక్కా మొక్కలు తిన్న – మొక్కవోడు** ఈ వాక్యం అని అంటారు. అలాగే నన్నయ్యను తెలుగు కవితకు కన్నయ్య అని సంబోధించి అతని పలుకును క్షీరాబ్ధి మేలుకొలుపుగా కీర్తించారు.

వరస మారుతున్నది – అనే కవితలో

**"తరం మారుతున్నది –స్వరం మారుతున్నది**

**వందేమాతరం గీతం – వరసమారుతున్నది .."** అని వందేమాతర గీతంలోని వాక్యాలు నేటితరంలో మారిపోయాయని వివరించారు. నేడు ప్రజలు తినడానికి తిండిలేక, తాగడానికి నీళ్లు లేక అల్లాడిపోతున్నారు. సస్యశ్యామలంగా ఉండాల్సిన భూములు వర్షాలు లేక ఎండిపోతున్నాయి. దేశాభివృద్ధి కుంటుపడిందని మారిన పరిస్థితులను కళ్లకు కట్టినట్లు వివరించారు.

తరువాత ఎన్నిసార్లు చెక్కితే ఎంత ఆవిరి ఎగిరిపోతే కవితల్లో మానవ జీవన చిత్రణలోని సంఘర్షణ కనిపిస్తుంది. ముందుగా 'ఎన్నిసార్లు చెక్కితే' అనే కవితలో...

**ఎన్నిసార్లు చెక్కితే ఓ శిల్పం – ఎన్నిసార్లు తీర్చితే ఓ చిత్రం**

**కబుర్లు చెప్పకే కాలమా! – ఎన్నిసార్లు చస్తే ఓ జీవితం** అంటూ.... శిల్పం, చిత్రం తయారుకావాలంటే ఎంతో శ్రమపడాలని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటేనే అది ఒక జీవితం అవుతుందని అంటారు.

'ఎంత ఆవిరి ఎగిసిపోతే' – అనే కవితలో....

**'ఎంత ఆవిరి ఎగిసిపోతే – ఒక్క మేఘం**

**ఎంత ఊపిరి ఒదిగిపోతే – ఒక్క యోగం**

**ఎంతనాదం నాభిమూలం చీల్చుకుంటూ**

**గొంతువాకిలి దాటిపోతే ఒక్క రాగం'** అంటూ ఒక వస్తువు ఒక ఆకృతిని దాల్చాలంటే తీవ్ర పరిణామం జరగాలని చెబుతారు. ప్రముఖ కేరళ సంఘసంస్కర్త నారాయణ గురు సంస్మరణార్థం రాసిన కవితలో.... నారాయణ గురు చేసిన సంస్మరణలు స్మరించి, ఆయనను గౌరవించి, నారాయణ గురువుకు

**గురు నీది కేరళం – సరే నాది ఆంధ్రం**

**ఇద్దరిదీ భారతీయాత్మ – ఇదుగిదుగో వందనం** – అని నమస్కరించిన తేజస్వి సినారె. తన కవితాత్మను దేశమంతా విశాలంగా మనకందించి సాహితీలోకంలో ధృవతారగా వెలుగొందారు అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు అని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. నారాయణరెడ్డి సి, ఆధునికాంధ్ర కవిత్వం, 1975, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్.
2. నారాయణరెడ్డి సి, ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు – ప్రయోగములు, 1977, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. సుబ్రహ్మణ్యం జి.వి, అక్షరాల ఆలోచనలు, 1988, యువభారతి, సికింద్రాబాద్.
4. నారాయణరెడ్డి సి, సమీక్షణం, 2000.
5. నారాయణరెడ్డి సి, వంశీ ఆర్ట్ థియేటర్, తేజస్సు నా తపస్య, 2000, హైదరాబాద్.
6. నారాయణరెడ్డి సి, కాలం అంచు మీద 1985, కేతన్ పబ్లికేషన్స్, హైదరాబాద్.
7. నారాయణరెడ్డి సి, మట్టి మనిషి ఆకాశం, 1998, మనస్వినీ ప్రచురణలు, హైదరాబాదు.
8. నారాయణరెడ్డి సి, తెలుగు, గజళ్లు 1986 చేతన సాహితి సాంస్కృతిక సంస్థ గుంటూరు.

# మానస ఎండ్లూరి 'మెర్సీ పరిశుద్ధ పరిణయం' కథ ఇతివృత్తం, పాత్ర చిత్రణ, సామాజిక స్పృహ, సాదృశ్యాలు

**డా. శీలం ఇందిర,** తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిర, ఖమ్మం

**ఉపోద్ఘాతం**

మానస ఎండ్లూరి నెల్లూరులో జన్మించారు. విద్యాభ్యాసం అంతా రాజమండ్రి, ఏలూరులో కొనసాగింది. వారి తల్లిదండ్రులు ప్రముఖ రచయితలైన ఎండ్లూరి సుధాకర్, పుట్ల హైమావతి గార్లు. మానస ఎండ్లూరి మొదటి రచన మిలింద (2018) కథా సంపుటి. ఈ పుస్తకానికి గాను 2020 కేంద్ర సాహిత్య అకాడమీ యువ అవార్డును సాధించారు. ఈ సంపుటిలో ఇంకా పూర్తిగా అంతరించని, కొత్త రూపం తెచ్చుకున్న అంటరానితనాన్ని, కుల వివక్షను స్త్రీ పురుష అసమానతలను, సమాజంలో ఏక లింగ వివాహాలపై ఉన్న అభిప్రాయాలను చాలా చక్కగా స్పష్టంగా వివరించారు.

మిలింద కథా సంపుటిలో మొత్తం ఇరవై రెండు కథలున్నాయి. వాటిలో తొమ్మిదవ కథ "మెర్సీ పరిశుద్ధ పరిణయం" ఈ కథలో పాత్రలు తక్కువైనప్పటికీ స్త్రీలపై జరిగే లైంగిక దాడులను కళ్ళకు కట్టినట్లుగా వర్ణిస్తుంది.

**ఇతివృత్తం**

కథకు ఇతివృత్తం శరీరం వంటిది. దళిత స్త్రీకి జరిగిన అన్యాయమే ఈ కథకు ప్రధాన ఇతివృత్తం. విక్టర్, మెర్సీ ఒకే కాలనీకి చెందిన యువతీ యువకులు. విక్టరీ చిరుద్యోగి. మెర్సీ డిగ్రీ చదువుతుంది. ఆమెకు తల్లిదండ్రులు లేరు. అమ్మమ్మ సంరక్షణలో ఉంటుంది. వీరంతా ఆదివారాల్లో శిలువ బెల్ట్ పాస్టర్ ఇంటి దగ్గరకు వచ్చి ప్రార్థనలు చేస్తుంటారు.[1] ఈ సందర్భంలోనే మెర్సీని విక్టర్ చూస్తాడు మెర్సీ పెద్ద అందగత్తె కాకపోయినప్పటికీ ఆమె ప్రవర్తన, నెమ్మదితనం నచ్చి ప్రేమిస్తాడు. సంవత్సర కాలంగా ఆమె వెంటపడుతూ తన ప్రేమను తెలియజేస్తూ పెళ్లి చేసుకుంటానని అడుగుతుంటాడు. కొన్ని సందర్భాల్లో కోప్పడతాడు. అయినా మెర్సీ అతని మాటలు పట్టించుకోదు, చదువు మీదే శ్రద్ధ పెడుతుంది.

ఒక ఆదివారం విక్టర్ ఊళ్లో లేదు. మెర్సీ చదివే కళాశాలలోనే పనిచేసే అటెండర్ శిలువ బెల్ట్ పాస్టర్ ఇంటి దగ్గరకు వచ్చి ప్రార్థన మొదలవుతున్న సమయంలోనే సురేఖ మేడమ్‌కు యాక్సిడెంట్ అయిందని అబద్ధం చెప్పి మెర్సీని ఒక కారులో తీసుకెళ్తాడు. కారులో అతని తో పాటు ఇంకో ఇద్దరు ఉంటారు. వారు ఆమెపై దారుణంగా అత్యాచారం చేసి, హింసించి వివస్త్రగా పొదల్లో పడేస్తారు.

ఎవరో దయతలిచి ఆసుపత్రిలో చేరుస్తారు. మెర్సీ చాలా రోజులు మనిషి కాలేక పోతుంది. పోలీసులకు కూడా ఏమాత్రం సహకరించలేక పోతుంది విక్టర్ దగ్గరుండి సేవలు చేస్తాడు. అమ్మమ్మ కుమిలి కుమిలి ఏడుస్తుంటుంది. కొద్దిరోజుల తర్వాత విక్టర్ తన తల్లిదండ్రులు, మెర్సి అమ్మమ్మ అనుమతితో ఆమె ని వివాహం చేసుకొని తనకు కొత్త జీవితం ఇస్తాడు. అంతేకాక దోషులను శిక్షించటం కోసం న్యాయ పోరాటం చేయటం మొదలు పెడతాడు.

**పాత్ర చిత్రణ**

కథకు ఇతివృత్తం పునాది అయితే పాత్ర చిత్రణ ఆ పునాదిపై లేచిన సౌధం లాంటిది. ఎంత చిన్న కథలోనైనా పాత్రలు ఉండాలి పాత్రలు లేనిదే కథ లేదు. ఈ కథలో విక్టర్, మెర్సీ రెండు ప్రధాన పాత్రలు.

**మెర్సీ**

మెర్సీ పరిశుద్ధ పరిణయం కథలో మెర్సీ ది అన్యాయానికి గురైన పాత్ర. మెర్సీ బక్క పల్చగా ఉంటుంది. గుంట కళ్ళు, పుల్లలాంటి చేతులు తల మీద చున్ని వేసుకొని నెమ్మదిగా ఉంటుంది[2]. ఆమెకు తల్లిదండ్రులు లేరు. అమ్మమ్మ దగ్గరే పెరుగుతుంది. ప్రతి ఆదివారం శిలువ బెల్ట్ పాస్టర్ ఇంటి దగ్గరకు వచ్చి బైబిల్‌లోని వాక్యాలు శ్రద్ధగా రాసుకుంటుంది. దీన్నిబట్టి ఆమె ఆ వయసు వారిలా కాక దైవభక్తి కలిగిన అమ్మాయని తెలుస్తుంది. తన పరిస్థితులను అర్థం చేసుకొని కేవలం చదువు మీదే శ్రద్ధ పెడుతుంది.

ఎంత బీదరికంలో ఉండి అమ్మమ్మ దగ్గర పెరుగుతున్నా శ్రద్ధగా చదువుకునేది తప్ప ఏ ఆకర్షణలకు లొంగేది కాదు ఇది ఆమె బలమైన వ్యక్తిత్వానికి నిదర్శనం విక్టర్ ప్రేమిస్తున్నానని ఎంత వెంటపడినా ఆమె ఒప్పుకోదు. అందరిలా నాకు తల్లిదండ్రులు జీవించి ఉంటే ఇతను నా వెంట ఇలా పడేవాడా అని బాధపడేది. ఇది ఆమె సంస్కారానికి పద్ధతికి నిదర్శనం.

విక్టర్ మాట్లాడమని వేధిస్తూ ఫోన్ పగలగొట్టినప్పుడు దేవుడా ఇతనికి మంచి బుద్ధిని ఇవ్వు, నాకు రక్షణను కల్పించు అని కన్నీటి ప్రార్థన చేస్తుంది. ఇది ఆమెకు గల ఓర్పు, మంచి మనసుకు నిదర్శనం.

అటెండర్ వచ్చి సురేఖ మేడమ్ కు యాక్సిడెంట్ అయిందని చెప్పిన వెంటనే గుడ్డిగా అతన్ని అనుసరిస్తూ వెళ్ళిపోతుంది. అతను చెడ్డవాడని కూడా ఆలోచించదు. మెర్సీ కి గల గురుభక్తికి పై సంఘటన నిదర్శనం.

ఆ దుర్ఘటన జరిగిన తరువాత విక్టర్ మెర్సీ అమ్మమ్మను ఒప్పించి వివాహం చేసుకుంటాడు. నా జీవితం ఎలాగూ నాశనం అయిపోయింది. జాలిపడి నన్ను వివాహం చేసుకున్నావు కదూ! ఎందుకు? అని విక్టర్‌ను ప్రశ్నించడంలో ఆమె నిజాయితీ కనిపిస్తుంది. పద్ధతి గల అమ్మాయిగా, చదువు మీద శ్రద్ధ గల విద్యార్థిగా, దైవభక్తి, బాధ్యత గల బలమైన వ్యక్తిత్వం గల స్త్రీగా మెర్సి మనకు ఈ కథలో కనిపిస్తుంది.

**విక్టర్**

మెర్సీ పరిశుద్ధపరిణయం కథలో విక్టర్ ది ఉదాత్త పాత్ర. పైకి దుందుడుకు స్వభావం గల యువకునిగా కనిపించినప్పటికీ లోపల బాధ్యతగల వ్యక్తి, ఉత్తమ ప్రేమికుడు.మెర్సీ పెద్ద అందగత్తె కాకపోయినప్పటికీ ఆమె వ్యక్తిత్వం నచ్చి విక్టర్ వెంటపడుతుంటాడు.

శిలువ బెల్ట్ పాస్టర్ ఇంట్లో ప్రార్థన జరిగే సమయాలలో ఆయన కీర్తన చెప్పిన వెంటనే అందరూ బైబిల్ లోని వాక్యము, పేజీ వెతుకుతూ ఉంటారు. అందరికంటే ముందే విక్టర్ వెతికి దాన్ని పైకి చదివి మెర్సీ మెప్పు పొందటానికి చూస్తుంటాడు. ఇది అతని చిన్నపిల్లల మనస్తత్వానికి నిదర్శనం. మెర్సీతో మాట్లాడటానికి విక్టర్ ఎన్నో సందర్భాలలో ప్రయత్నిస్తుంటాడు. పాస్టర్ ఇంటి దగ్గర తప్ప ఆమెను కలుసుకోవటానికి ఎక్కడ అవకాశం ఉండదు కానీ మెర్సీ మాత్రం ఇలాంటి పవిత్ర ప్రదేశాల్లో ఈ విధంగా మాట్లాడటానికి సిగ్గు లేదా అంటూ తిరస్కరిస్తుంటుంది. బయటకు రమ్మంటే వస్తావా! మరి నిన్ను ఎక్కడ కలుసుకోవాలి? ఎక్కడ మాట్లాడాలి? నీకోసం ఏమి సాహసాలు చేయాలి? శిలువ వేసుకోవాలా?[3], అంటూ విసురుగా ఫోన్ పగలగొడతాడు. ఇది అతని ఆవేశానికి నిదర్శనం.

మెర్సీ మీద అఘాయిత్యం జరిగిన తరువాత కూడా ఆమె మీద ప్రేమ అభిమానం ఏమాత్రం తగ్గలేదు. ఆసుపత్రిలో ఉన్న ఆమెను మునుపటి కంటే ఎక్కువ శ్రద్ధగా కంటికి రెప్పలా చూసుకుంటాడు. ఇది అతని ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనంపై సంఘటన ద్వారా విక్టర్ నిజమైన ప్రేమికుడు అని తెలుస్తుంది.

పెళ్లయిన తర్వాత మొదటి రాత్రి కూడా మెర్సీ ఏమీ మాట్లాడదు. జాలిపడి పెళ్లి చేసుకున్నావా? అని ఆమె అడిగిన ప్రశ్నకు విక్టర్ ఎంతగానో దుఃఖిస్తాడు. మెర్సీ చేతుల్లో ముఖం ఉంచి ఏడుస్తూ ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే ప్రియురాలికి అన్యాయం జరిగితే చూస్తూ ఉంటాన నుకున్నావా నీకు అన్యాయం చేసిన వారిని వదిలిపెట్టను[4]. ఆ రోజే చంపేసేవాడిని కానీ నేను జైలుకెళ్తే నీ పరిస్థితి ఏమవుతుంది? ఆ వెధవలకి శిక్ష పడటానికి ఎవరు పోరాటం చేస్తారు? అని ఆలోచించి వదిలిపెట్టాను.

నీ మీద జాలితో కాదు ప్రేమతో వెంటనే నా నిర్ణయం ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకున్నాను అంటాడు. ఇది అతని మంచితనానికి నిదర్శనం. ఇప్పటికీ మన దేశంలో స్త్రీ శీలానికి అధిక ప్రాధాన్యత ఉంది. ఎంత ప్రేమించిన అమ్మాయి అయినప్పటికీ అత్యాచార బాధితురాలిని వివాహం చేసుకోవాలంటే ఎంతో పెద్ద మనసు ఉండాలి అది విక్టర్ లో ఉంది. పై సంఘటన అతని ఉదాత్త ప్రవృత్తికి నిదర్శనం ఈ కథ ద్వారా విక్టర్ ఎంతో ఉదాత్త స్వభావం కలవాడిగా బాధ్యతగలవాడిగా గొప్ప ప్రేమికుడిగా కనిపిస్తాడు.

**సామాజిక స్పృహ**

చదువుకునే వయసులో అమ్మాయిలు చదువు మీదనే దృష్టి ఉంచాలి. మన యొక్క మంచి ప్రవర్తనే మనకు రక్షణ కల్పిస్తుంది ఈ కథలో మెర్సీ మంచి గుణాలు, దైవభక్తి ఆమెను కాపాడాయని చెప్పవచ్చు ఆమె ప్రవర్తనే విక్టర్ ఇష్టపడేలా చేసింది.

తను బాగా ఇష్టపడిన అమ్మాయి అన్యాయానికి గురైనప్పుడు వదిలివేయకుండా ఆసరా ఇవ్వాలనీ అదే నిజమైన ప్రేమ అనే సందేశం ఈ కథలో అంతర్లీనంగా కనపడుతుంది. మెర్సీ చదువుకునే కళాశాలలో పనిచేసే అటెండర్ దుర్మార్గుడని ఆమెకు చూచాయగా తెలుసు, అంతా తెలిసినప్పటికీ అతను చెప్పిన చిన్న మాటను నమ్మి అతని కారు ఎక్కటం మెర్సీ చేసిన తప్పు. దీని ఫలితం ఆమె జీవితకాలం అనుభవించాల్సి వచ్చింది. వయసులో ఉన్న ఆడపిల్లలు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి లేకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందం అవుతుంది.

**సాదృశ్యాలు**

**1. చేతులు**

బోసి మెడ, పుల్లలాంటి చేతులతో బైబిల్ పట్టుకొని భుజాల పైనుంచి తల మీదుగా తెల్లని చున్నీతో ముసుగు వేసుకొని ఉంచిన తలతో పాస్టర్ గారి ప్రసంగం వింటూ ముఖ్యమైన బైబిల్ వాక్యాల కింద ఎర్ర సిరాతో గీతలు గీస్తోంది. ***(మిలింద – మెర్సీ పరిశుద్ధపరిణయం – పుట –89)***

**2. శత్రువులు**

శత్రువులు సీయోనులోని కన్యకలను చెరిపినట్లు తామారును అమ్మోను బలాత్కారం చేసినట్లు... కారెక్కిన మెర్సీని అరక్షణంలో వివస్త్ర ను చేశారు ఆ ముగ్గురు రాక్షసులు. ***(మిలింద – మెర్సీ పరిశుద్ధ పరిణయం– పుట –93)***

**3. కప్పల వర్షం**

వాళ్లు తాకుతుంటే తన ఒంటినిండా యెహోవా దేవుడు ఫరో మీద కురిపించిన కప్పల వర్షం పడుతున్నంత అసహ్యంగా ఉంది. ***(మిలింద – మెర్సీ పరిశుద్ధ పరిణయం– పుట –93)***

**4. చంటి పాప**

మెర్సీని చంటి పాపలా చేతుల్లోకి ఎత్తుకొని ఆటోలో కూర్చోబెట్టి తీసుకెళ్లాడు విక్టర్ ***(మిలింద – మెర్సీ పరిశుద్ధ పరిణయం – పుట –94)***

**5. రాతి బొమ్మ**

తలవంచుకున్న రాతి బొమ్మలా కూర్చుండి పోయింది మెర్సి. ***(మిలింద – మెర్సీ పరిశుద్ధ పరిణయం – పుట –96)***

**6. గువ్వ**

ఆమె విక్టర్ విశాల హృదయం పై గువ్వలా ఒదిగి ధారాపాతంగా దుఃఖిస్తుంది. ***(మిలింద – మెర్సీ పరిశుద్ధ పరిణయం – పుట – 96)***

**7. మరియ**

ఏ పాపము ఎరుగని మరి అలాంటి మెర్సి ఈరోజు కొందరి నీచుల వలన నరకం అనుభవిస్తుంది. ***(మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం - పుట -97)***

**8. అగ్నిపర్వతం**

విక్టర్ మొహమంతా కన్నీటితో తడిసిపోయింది, గొంతు జీర పోయింది. మళ్లీ ఏడుస్తూ అగ్నిపర్వతంలా ఎగిసిపడ్డాడు. ***(మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం - పుట -97)***

**9. మృగం**

యెహోవా నామమున ఎలీషా తనని అపహాస్యం చేసిన బాలురుని శపించిన వెంటనే అడవిలో నుంచి రెండు ఆడ ఎలుగుబంట్లు వచ్చి నలభై రెండు మంది బాలురను చీల్చినట్లుగా తనను ఈ మనుషుల నుండి రక్షించడానికి ఏం మృగమైనా వస్తే బాగుండునని దేవునికి మొరపెట్టుకుంటుంది మెర్సీ.

**ముగింపు**

సాహిత్యానికి సమాజాన్ని మార్చగలిగే శక్తి ఉంది. మిలింద కథా సంపుటిలోని కథలన్నీ అత్యంత శక్తివంతమైనవి. మెర్సీ పరిశుద్ధ పరిణయం అనే కథ సమాజంలో స్త్రీలపై అందునా దళితులపై జరిగే అత్యాచారాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ కథ ద్వారా పాఠకులలో సమాజం పట్ల ఒక రకమైన సానుభూతి కలిగి ఉత్తమ సంస్కారం ఏర్పడుతుంది.

**పాద సూచికలు**

1. మానస ఎండ్లూరి - మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం - పుట - 88
2. మానస ఎండ్లూరి - మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం - పుట - 89
3. మానస ఎండ్లూరి - మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం - పుట - 91
4. మానస ఎండ్లూరి - మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం- పుట - 98

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. మానస ఎండ్లూరి - మిలింద - మెర్సీ పరిశుద్ధ పరిణయం.
2. దక్షిణామూర్తి పోరంకి - కథ పుట్టుపూర్వోత్తరాలు.
3. దక్షిణామూర్తి పోరంకి, - కథానిక స్వరూప స్వభావాలు.
4. వెంకట సుబయ్య వల్లంపాటి - కథా శిల్పం.
5. వీర్రాజుశీలా, - కథానికా - నిర్మాణ శిల్పం.

# డా. పత్తిపాక మోహన్ బాలగీతాలు - వైజ్ఞానిక అంశాలు

**దేవరకొండ ప్రవీణ్ కుమార్,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్టణం

**"లాలయేత్ పంచవర్షాణి దశవర్షాణి తాడయేత్**
**ప్రాప్తేతు షోడశేవర్షే పుత్రం మిత్రవదాచరేత్"**

ఐదు సంవత్సరాల వయసు వచ్చేవరకు పిల్లల్ని లాలించి, బుజ్జగించాలి. పది సంవత్సరాల వరకు దండోపాయంతో మంచి నడవడిక నేర్పాలి. కానీ పదహారేళ్ళొచ్చాక కుమారుణ్ణి మిత్రుడిలా చూడాలట. ఇక్కడ పుత్రుడు, పుత్రిక అనే తేడా – లేకుండా సంతానానికి సంబంధించిన విషయంగా ఈ శ్లోకం కనబడుతోంది.

ఆహారం, రక్షణ, మైథునం అనేవి సృష్టిలో ప్రతి జీవికి కనీసావసరాలని శాస్త్రాలు చెబుతున్నాయి. జీవి బతకడానికి ఆహారం, రక్షణతో పాటుగా తన వంశాన్ని పెంపొందించుకోడానికి మైథునం అవసరం. తన జాతిని తన వంశాన్ని అభివృద్ధి చెందించుకోవడమే ప్రతి జీవి యొక్క లక్ష్యం. తన సంస్కృతిని, వారసత్వాన్ని తన తర్వాతి తరాలకు అందించాలనే తాపత్రయమే వంశాభివృద్ధి. "జంతూనాం నరజన్మ దుర్లభం" అన్నట్లుగా జంతువులన్నిటికన్నా మానవజన్మ ఉత్తమమైంది. కంటికి కనిపించని సూక్షజీవుల నుండి ఎన్నో పెద్ద పెద్ద జంతువుల వరకూ అన్నీ తమతమ వంశాన్ని వృద్ధి పొందించుకుంటూనే ఉంటాయి. ఈ ప్రయత్నంలో ఎక్కడైనా ఆటంకం వచ్చి, తర్వాతి తరం లేందటే, ఇక ఆ జాతి మనుగడలో లేనట్టే, లేకపోతే అంతరించిపోయినట్లే. ఇలా సృష్టిలో ఎన్నో జాతులు అంతరించిపోయాయి. కొత్తజాతులు ఆవిర్భవిస్తున్నాయి.

మనిషి బుద్ధిజీవి, సంఘజీవి. సమస్త జీవరాశిలో మానవులు కొంత వివేకమున్నవారు. ఈ వివేకమే మనుషుల్ని మిగతా జంతుజాలం నుండి వేరే చేస్తుంది. కాబట్టి మానవుడు తమ తర్వాతి తరమైన పిల్లలను, తమ కన్నా ఉన్నతశ్రేణిలో ఉంచే ప్రయత్నం ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా చేస్తూనే ఉంటాడు. ఈ వంశాభివృద్ధి క్రమంలో పుట్టిన దగ్గర్నుండీ ఎదిగి, జీవించే మనిషి జీవితాన్ని ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించి బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యాలుగా చెబుతారు. నవమాసాలు తల్లిగర్భంలో జీవం పోసుకుని, భూమ్మీదకు వచ్చిన దగ్గర్నుండి బంధాలను పెంచుకుని తన చుట్టూ ఉన్న వాళ్ళను చూస్తూ ఎదిగే అమూల్యమైన కాలాన్నే మనం బాల్యంగా అభివర్ణించవచ్చు.

శిశువు పుట్టిన దగ్గర్నుండి 12 సంవత్సరాలు వచ్చేవరకూ ఉన్న కాలాన్ని 'బాల్యం' అంటారని జ్యోతిశ్శాస్త్రం చెబుతోంది. ఈ బాల్యంలో ఉన్న వారే బాలబాలికలు. జీవన్మరణ పోరాటాలు, ఆర్థిక సంబంధమైన విషయాలు, ఈర్ష్యా ద్వేషాల్లాంటివేమి లేకుండా, తెలియకుండా ఉండే స్థితే బాల్యం. ప్రతి మనిషికి బాల్యమొక అద్భుతం. ఈ అమూల్యమైన వరాన్ని తెలుగు సాహిత్యంలో కవులెందరో అందంగా వర్ణించారు. అందులో బాలల కోసం అందించే సాహిత్యం బాల సాహిత్యం. పిల్లలలో చైతన్యాన్ని విజ్ఞానాన్ని పెంపొందించి చిన్న చిన్న గేయాల ద్వారా అలతి అలతి మాటలతో పిల్లలకు తేలికగా అర్థమయ్యేలా కవిత్వం చెప్పడం పత్తిపాక మోహన్ శైలి విన్యాసాలలో ఒకటి.

ఈ పరిశోధనా వ్యాసంలో మోహన్ గారి బాల గీతాలలో ఉన్న వైజ్ఞానిక చైతన్య అంశాలను పరిచయం చేసి వివరిస్తున్నాను. ముందుగా రచయిత వివరాలను తెలుసుకుందాం. డా॥ పత్తిపాక మోహన్ 5-1-1972న కరీంనగర్ జిల్లా, చందుర్తి మండలం

లింగంపేటలో జన్మించాడు. తల్లి శ్రీమతి గంగాబాయి, తండ్రి శ్రీ లక్ష్మీ రాజం. మోహన్ చేనేత కుటుంబంలో పుట్టి పెరిగి, ఆ చేనేత వృత్తి నేపథ్యం నుండే కవిత్వం రాశాడు. తొలిగురువు, తాత బ్రహ్మ శ్రీపత్తిపాక శంకరయ్య ప్రభావం ముందు నుంచి ఇతనిపై అధికంగా ఉండేది. తెలుగు సాహిత్యంలో ఎం.ఏ, పిహెచ్.డిలని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. తర్వాత ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితునిగా చేశారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి స్ఫూర్తితో వ్యాఖ్యాన రంగంలో వెళ్ళి అగ్రస్థానాన్ని పొందారు. అలా 'వ్యాఖ్యానదక్షుడుగా సినారె, మల్లెమాలల ప్రశంసలను మరియు 'వ్యాఖ్యాన కేసరి' అనే బిరుదును అందుకున్నాడు. అంతేకాకుండా బాలసాహిత్యంలోనూ ప్రగతిశీలమైన ఎన్నో రచనలను చేసి ప్రసిద్ధి పొందారు. ఇటీవల బాలసాహిత్యంలో ప్రతిష్టాత్మకమైన 'కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం-2022'ను అందుకున్నారు. ఈతని రచనలు చందమామ రావే, వెన్న ముద్దలు, ఆకుపచ్చని పాట, జయహో బాలసాహిత్యం మొదలైనవి.

పత్తిపాక మోహన్ రాసిన బాలగేయాలన్నీ పిల్లల్లో చైతన్యాన్ని కలిగించడమే కాకుండా విజ్ఞానశాస్త్రం పట్ల ఆకర్షితులను చేస్తూ వాటి మీద పిల్లలకు అవగాహన పెంచే విధంగా ఎంతో సుమధురంగా ఉంటాయి. ఇందులో చందమామరావే అనే కవితా సంపుటిలో.

ఈ గేయాల్లో ఇంచుమించుగా అన్నీ బాలబాలికలకు అందుబాటులో వున్నవే ఉన్నాయి. గేయాలన్నింటిలో గానయోగ్యత ఉంది. మాతృభాషను – "అమ్మభాష"గా పలికిన ఒక గేయంలో మోహన్ ఇలా అంటాడు.

**"తల్లి భాషయే మిన్నరా**
**తల్లి భాషయే వెన్నరా**
**నేర్చి పలికితే ఎప్పుడూ**
**మాతృభాషయె వన్నెర"[1]**

మాతృభాషా ప్రాశస్త్యాన్ని అంత్యానుప్రాసాతో రమణీయంగా అభివ్యక్తీకరించాడు మోహన్, అని ముందుమాటలో సి.నారాయణరెడ్డి కొనియాడారంటే ఈ గేయాల ప్రాశస్త్యం అర్థమవుతుంది.

చందమామరావే అనే బాలగేయాల సంపుటిలో మొత్తం 30 గేయాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా ఇంచుమించుగా పిల్లలందరికీ విజ్ఞానాన్ని పెంపొందించే విధంగానే ఉన్నాయి. అందులో ముఖ్యంగా 'అమ్మా, అమ్మా చెప్పమ్మా' అనే గేయంలో కొన్ని ప్రశ్నలను వేసి పిల్లలు ఉత్సుకత రేకెత్తే విధంగా ఇలా రాశారు.

**"విశాలమైన ఆకాశాన్ని**
**పైన ఎందుకని పెట్టారు?**
**మేఘాలన్నీ తెల్లగ ఉంటే**
**నీలం ఎందుకు పూశారు?"[2]**

అనే పంక్తుల్లోని ప్రశ్నలలో ఆకాశంలో మేఘాలు తెల్లగా కనిపిస్తున్న ఆకాశం నీలంగా కనిపించడానికి గల రామన్ ఎఫెక్ట్ అనే వైజ్ఞానిక శాస్త్రాంశం పిల్లలకి చెప్పాలనే తలంపు కనిపిస్తుంది. ఏదైనా విషయాన్ని బోధించేటప్పుడు ప్రశ్నోత్తర పద్ధతి సర్వ ప్రమాణికమైనదిగా పెద్దలు చెప్తారు. పిల్లలు తెలుసుకోవాల్సిన విషయాన్ని వారి ప్రశ్నల ద్వారా రాబట్టగలగడం ఇందులోని ప్రధానాంశం.

**"సుందరమైన ఈ భూగోళం**
**గిరగిర ఎందుకు తిరిగేను**
**ప్రాణులన్నీ భూమిపై ఉన్నా**
**పడకుండా ఎలా ఆగేను?"[3]**

అనే ప్రశ్నల ద్వారా న్యూటన్ కనుక్కున్న గ్రావిటీ గురించి విషయాలు పిల్లలకి తెలుసుకోవాల్సిన జిజ్ఞాస కలుగుతుంది. ఈ గేయంలో ఇటువంటి విజ్ఞాన శాస్త్రాంశాలు ఇంకొన్ని ఉన్నాయి.

కుటుంబంలో అమ్మ ప్రాధాన్యాన్ని గురించి తెలియజేస్తూనే చిన్నచిన్న పనులలో పిల్లలు కూడా అమ్మకు సహాయం చేయాలి అనే చైతన్యాన్ని కలిగించే గేయం అమ్మకిదే వందనం!... ఇందులో

**"పిన్న పెద్ద అందరం**
**ప్రేమగుంటే సుందరం**
**ఎవరి పనులు వారు చేస్తే**
**ఆ ఇల్లే నందనం..."**[4]

అనే పంక్తుల్లో పిల్లలు అమ్మకు చిన్నచిన్న పనుల్లో సహాయం చేయాలని తెలియజేశారు. పల్లె తల్లి అనే మరో గేయంలో "పచ్చని పల్లెటూర్లు దేశానికి వెన్నెముకలు" అనే సూక్తిని ఎంతో రమణీయంగా పిల్లలకు అర్థమయ్యేతీరుగా అందించారు.

**"కులమతాలు మరిచిపోతే**
**వెనుకబాటు ఏదుంది?**
**ప్రజలంతా కలిసి ఉంటే**
**పల్లెకు తిరిగేముంది?..."**[5]

అనే పంక్తుల ద్వారా పిల్లలకు సామాజిక చైతన్యం కూడా అవసరమని, సమాజంలో ఏ భేదభావాలు లేకుండా ప్రజలంతా సహోదరభావంతో మెలగాలని సరళ పదజాలంతో అర్థమయ్యేలాగా అందించారు.

ఇందులోనే 51 పుటలో ఉన్న 'ఇంద్రధనస్సు' అనే గేయంలో

**"సూర్యకాంతి సోకగానె**
**సుందరంగా వచ్చింది**
**వాన చినుకు కురవగానే**
**మబ్బు చాటునక్కింది"**[6]

అని ఇంద్రధనస్సును వర్ణిస్తారు. అంటే సూర్యుడు ఉంటుండగా వాన మబ్బు వస్తే ఇంద్రధనస్సు ఏర్పడుతుంది. సూర్యకాంతి మబ్బుల ద్వారా ఒక్కసారిగా పరిక్షేపం చెంది ఏడు రంగులుగా విడిపోతుంది. ఇది వాన పడకముందు మాత్రమే కనిపిస్తుంది. వాన పడటం ప్రారంభమయ్యాక ఇంద్రధనస్సు కనబడదు. ఇదంతా విజ్ఞానశాస్త్రమే. ఇందులో కాంతి ప్రయాణం, సూర్యకాంతి పరిక్షేపం చెందడం వంటి ఎన్నో తెలుసుకోవాల్సిన విషయాలను పిల్లలకు జిజ్ఞాస కలిగించే విధంగా పొందికైన పదాలలో అందించారు. పిల్లలకు చదువు పట్ల ఆసక్తిని పెంచే విధంగా రాసిన గేయం అక్షరం.

**"అ ఆ ఇ ఈ అక్షరాలు**
**తరతరాల నిధులురా..."** అంటూ ప్రారంభించి,
**పుస్తకాల అనుభవాలు**
**పుటలు విప్పితే వెలుగురా**
**చదువుకుంటేనే జ్ఞానం**
**చదువుతోనే గౌరవం**
**చదువు అంటేనే విజ్ఞానం**
**సంస్కారానికి భూషణం"** [7]

అనే ఈ చిన్న గేయంలో ఎంతో అర్థాన్ని ఇనుమడింప చేశారు. పుస్తకాన్ని నమ్ముకుంటే ఎలాంటి వ్యక్తయినా ఉత్కృష్ట స్థానాన్ని పొందుతాడని ఆకర్షణీయంగా తెలియజేశారు.

'ఐకమత్యం' అనే మరో గేయంలో అందరూ కలిసి ఉండాలని పిల్లలకు చాటి చెప్పారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా 'పలక బలపం జై జై' అనే గేయంలో చెప్పారు. పరిసరాల విజ్ఞానాన్ని పిల్లలకి అందించాలని, పరిసరాల పరిశుభ్రతకు, స్వచ్ఛమైన గాలిని అందించడానికి చెట్లు ఎంత ముఖ్యమైనవో చెట్ల ప్రాధాన్యతను తెలియజేస్తూ రాసిన గేయం 'చెట్టు'.

**"భూమికి సింగారమై**
**అందంగా నిలుచును**
**చెట్టు ఒకటి ఉన్న చాలు**
**చైత్యరథం వచ్చును...**
**వెచ్చనైన గాలి పీల్చి**
**సమతుల్యత కాపాడును**
**బాటసారులందరికో**
**సేద తీర్చుచుండును**
**మేఘాలతో మాటలాడి**
**వానలు కురిపించును"**[8]

అని గేయంలో చెప్పడం ద్వారా ప్రాణికోటికి అవసరమైన ప్రాణవాయువును చెట్లు అందించి, ప్రాణుల నుండి శ్వాసక్రియ ద్వారా బయటికి వచ్చే బొగ్గు పులుసు వాయువును చెట్లు పీల్చుకుంటాయి అనే విజ్ఞాన శాస్త్ర అంశాన్ని పిల్లలందరికీ అర్థమయ్యేటట్టుగా చాలా చక్కగా ఇందులో అందించారు. పరిసరాలు రక్షించగా సైనికుడై నిలుచును అని చెట్టును సైనికుడితో పోల్చడం సర్వోత్తమమైన పోలిక. 'గాంధీ తాత' అనే గేయంలో గాంధీ తాత ప్రాసస్త్యాన్ని పిల్లలకి అర్థమయ్యే రీతిలో చక్కగా అందించారు. ఇలా ఈ పుస్తకంలో ఉన్న గేయాలన్నీ పిల్లలకు చైతన్యాన్ని విజ్ఞాన శాస్త్రాంశాలను, పంచేవిగాను, అద్భుతంగా ఉండటంతో ఈ పుస్తకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బాల సాహిత్య పురస్కారం వచ్చింది.

ఆకుపచ్చని పాట స్వచ్ఛ సర్వేక్షణ పిల్లల పాటలు అనే మరొక సంపుటిలో మొత్తం 17 గేయాలు ఉన్నాయి. ప్రధానమంత్రి 2019లో పిలుపునిచ్చిన మేరకు భారతదేశం స్వచ్ఛ భారత్‌గా మారాలనీ, అందుకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలి అనే పిలుపుని అందుకుని ఈ సంపుటిని రాసారు. పరిశుభ్రత అనేది ఇంటి నుండి ప్రారంభం అవ్వాలి. ఇళ్లలోనూ పాఠశాలల్లోనూ పిల్లలు పరిశుభ్రంగా ఎలా ఉండాలో అలతి అలతి పదాలతో చక్కని తెలుగు మాటలతో ఈ గేయాల ద్వారా తెలియజేశారు. 'విశ్వం' అనే మొట్టమొదటి గేయంలో "విశాల విశ్వమంతా ఈ వేళ ఎందుకు విచారిస్తూ ఉన్నది..." అంటూ ప్రారంభించి దానికి గల కారణాలను విశ్లేషిస్తూ ఇలా అంటారు. "హిమాలయాలు ఎందుకు కరిగి పారుతున్నవి? సముద్రాలు ఎందుకు సునామీగా మారుతున్నవి? అడవులన్నీ ఎడారులుగా ఎలా రూపుదిద్దుకున్నవి? పొలాలన్నీ మాయమై అపార్ట్‌మెంట్లు అవుతున్నాయి" అంటూ ప్రశ్నలను సంధించి, వీటికి సమాధానం తెలుసుకోవాలనే ఉత్సుకతను పిల్లల్లో కలిగేటట్లుగా రాశారు. భూమి వేడెక్కిపోతోంది. గ్లోబలైజేషన్ వల్ల ఓజోన్ పొర కన్నం పడటం, మానవ తప్పిదాల వల్ల ప్రకృతికి ఏర్పడుతున్న ముప్పును ఈ గేయం ద్వారా పిల్లలకు అర్థమయ్యేటట్టుగా తెలియజేశారు. పిల్లలు రారండి, అన్నిటికి కారణం ఒకటే వాతావరణ కాలుష్యం అంటూ ఈ గేయాన్ని ముగించారు. ఆరోగ్య దూతలుగా సఫాయీ కార్మికుల గురించి రాశారు. బుద్ధిజీవి అయిన మానవుడు హద్దు దాటితే ప్రకృతి వైఫల్యాలు ఎలా ఉంటాయో బుద్ధి జీవి అనే గేయం ద్వారా తెలియజేశారు. పరిశుభ్రత అనే గేయంలో స్వచ్ఛత గురించి గాంధీ తాత స్వచ్ఛంగా ఎలా ఉండాలో చెప్పడం గురించి ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాట గురించి చాటిచెప్పారు. కాలుష్యం

కోరలలో చిక్కుకొని "గాలి చూడు చెడు వాసన నీరు చూడు మురికి మురికి చెత్త లేని చోటు ఒకటి జాడలేదు వీధులందు..."[9] అంటూ వాపోయారు. "పంటలన్నీ విషం విషం పండ్లన్నీ ప్రమాదకరం వీటన్నిటికీ పరిష్కారంగా పచ్చదనం అల్లుకున్న ఆరోగ్యం వెల్లువెత్తు పరిసరాలు శుభ్రం అయితే ఆనందం వెల్లివిరియు చూడు చూడు తమ్ముడు వినుము వినుము చెల్లెలా"[10]

అని పరిష్కార మార్గాన్ని కూడా చూపించారు. చెట్లను పెంచాలి అనే విషయాన్ని పిల్లలకి అర్థం అయ్యేలాగా కాలుష్యం తగ్గాలంటే పచ్చదనం ఒకటే మార్గం అంటూ ఈ గేయం ద్వారా తెలియజేశారు. ఇందులో దివ్యదనం, స్వచ్ఛ దండు, ఆరుబయట, స్వచ్ఛ భారతం, పల్లె పచ్చగుంటే అనే గేయాలు పిల్లలు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ పరిసరాల పరిశుభ్రతకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చక్కగా రమణీయంగా తెలియజేశారు. ఇవన్నీ విజ్ఞాన శాస్త్రంతో పాటు చైతన్యాన్ని కలిగించే అంశాలు. ఇందులో చివరిగా స్వచ్ఛ గణపతి శీర్షికతో గణపతి నవరాత్రులలో మట్టి గణపతికి ఇవ్వాల్సిన ప్రాతినిథ్యాన్ని వివరించారు.

బాలల తాత బాపూజీ అనే పేరుతో అందించిన మరొక గేయ సంపుటిలో దేశభక్తిని పిల్లల్లో ఎలా పెంపొందించాలో దేశమంటే పిల్లలకి ఎలా చైతన్యపరచాలో సులభమైన పదాలతో అద్భుతంగా అందించారు. ఇది పూర్తిగా గాంధీజీ యొక్క జీవిత విధానాన్ని చాలా చాలా వివరణాత్మకంగా అందరికీ అర్థమయ్యే రీతిలో రాసిన పుస్తకం. ఇందులో పూర్తిగా గాంధీజీ జీవితంలోని ముఖ్యమైన సంఘటనలన్నీ పిల్లలందరికీ అర్థమయ్యేలాగా, కళ్ళకు కట్టినట్లూ చిన్న చిన్న పంక్తులలో అందించారు. స్వాతంత్ర్య సారధి అనే శీర్షికతో రాసిన గేయంలో... నిన్ను చూసి మురిసింది భరతావని గాంధీ తాత అని ప్రారంభించి జనహృదయ విజేతపు మహాత్ముడు గాంధీ తాత అంటూ ముగించడంలో గాంధీ పట్ల వీరికున్న గౌరవాన్ని తెలియజేస్తుంది. అంతేకాకుండా పిల్లలందరూ దేశభక్తులను గురించి స్వతంత్ర ఉద్యమ పోరాటంలో పాల్గొన్న గాంధీ గురించి, వారి హృదయాంతరాళాన్ని గూర్చి అత్యద్భుతంగా ఈ గేయ సంకలనంలో రచయిత ఆవిష్కరించారు.

ఇలా పత్తిపాక మోహన్ పిల్లల కోసం రాసిన గేయ సంపుటిలోను, ఇతర రచనలలోను విజ్ఞాన శాస్త్రాంశాలు, చైతన్యపరిచే అంశాలు కొదవ లేకుండా ఇతోధికంగా అడుగడుగునా తారసపడుతూనే ఉంటాయి. ఈ పరిశోధనా పత్రంలో కొన్ని మాత్రమే నేను పరిచయం చేశాను.

**పాదసూచికలు**

1) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 3
2) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 59
3) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 59
4) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 55
5) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 53
6) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 51
7) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 47
8) చందమామ రావే బాలల గేయాలు (2009) – పత్తిపాక మోహన్ – పుట 35
9) ఆకుపచ్చని పాట బాలగేయ సంకలనం (2010) – పత్తిపాక మోహన్ – పుట 22
10) ఆకుపచ్చని పాట బాలగేయ సంకలనం (2010) – పత్తిపాక మోహన్ – పుట 22

**ఉపయుక్త గ్రంథసూచి**

1) చందమామ రావే + బాల గేయాలు – పత్తిపాక మోహన్.
2) ఆకుపచ్చని పాట స్వచ్ఛ సర్వేక్షణ పిల్లల పాటలు – పత్తిపాక మోహన్.
3) బాలల తాత బాపూజీ – పత్తిపాక మోహన్
4) జయహో! బాల సాహిత్య – పత్తిపాక మోహన్.
5) నీతి దర్పణం – చాణక్యుడు
6) బృహత్పరాశర హోరాశాస్త్రం – పరాశరముని.

# 'సంస్కారం' నవల - అస్తిత్వవాదం

**డా. నూకల విజయలక్ష్మి,** తెలుగు అధ్యాపకురాలు, శ్రీమతి శ్యామలాదేవి మహిళా డిగ్రీ కళాశాల, హైదరాబాదు

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత యు.ఆర్.అనంతమూర్తి రచించిన నవల 'సంస్కారం'. ఈ నవలకు సాహిత్య అకాడమీ బహుమతి పొందడం ముదావహం. యు.ఆర్.అనంతమూర్తి కన్నడ సాహిత్య రంగంలో నవ్య వాదాన్ని ప్రవేశపెట్టిన ప్రముఖులలో ఒకరు. సంస్కార నవలకు తెలుగుసేత కె.నారాయణస్వామి, ఆర్వీయస్ సుందరం.

నవ్యవాదంలో సమాజం కంటే వ్యక్తి ప్రధానం. వ్యక్తికి ఉండే సమస్యలు వారిలోని అంతర్మథనం గురించి చర్చించడమే నవ్యవాదం యొక్క ముఖ్య ఉద్దేశం. నవ్య సాహితీ కవులు టి.ఎస్.ఎలియట్ వంటి ఆధునిక రచయితల ప్రభావంతోను, అస్తిత్వవాద మూలపురుషుడైన స్మార్తే ప్రభావం చేత వారి అనుసరించి నవ్యవాదం, అస్తిత్వవాదంపై రచనలు చేశారు. ఆ ప్రభావం యు.ఆర్.అనంతమూర్తి పైన కూడా పడడంతో వారు సంస్కార నవలను రాశారు.

"వ్యక్తికి సమాజానికి మధ్య (ముఖ్యంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో) వివిధ రంగాలలో ఉండే సంఘర్షణ తరచుగా వ్యక్తి అస్తిత్వం గురించి సందేహాలను రేకెత్తిస్తూ ఉంటుంది. ఇలాంటి సందేహాలను లేవనెత్తి వ్యక్తి ప్రధానమైన ఒక తాత్త్విక దృక్పథాన్ని ఆధునిక ప్రపంచంలో ప్రచురితం చేసినవాడు జ్యాపాల్ స్మార్తే."

జ్యాపాల్ స్మార్తే రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అస్తిత్వవాదాన్ని ఫ్రాన్స్‌లో ప్రవేశపెట్టాడు. దానిని తన కథలు, నవలలు, నాటకాలలో విపులంగా వివరించాడు. అస్తిత్వవాదానికి నిర్వచనం "చైతన్యాన్ని వ్యక్తిగతమైన అస్తిత్వమే నిర్ణయిస్తుంది. ఏది కావాలో ఎన్నుకునే సంపూర్ణమైన స్వేచ్ఛ మనిషికి ఉంది కానీ ఏది కావాలో అనేదానికి హేతుబద్ధమైన ఆధారం లేదు. అందువల్ల మనిషి నిరంతరం ఆదుర్దా – వైమనస్యాలతో (పరాయి వాడిననే లక్షణం) జీవిస్తాడు."

అస్తిత్వవాదం రచనలు మనకి వచన సాహిత్యంలో ఎక్కువగా కనిపిస్తాయి. "జీన్ పాల్ స్మార్తే, మార్సెల్ ప్రౌస్ట్ వంటి వారు ప్రతిపాదించిన అస్తిత్వవాదంలో కీలకం మనిషికి ఇచ్ఛా శక్తి ఉంది. తాను చేసే పనులకు తానే బాధ్యుడు" అంటారు కేతు విశ్వనాథరెడ్డి.

అస్తిత్వవాదంలో సాంప్రదాయక విలువల సాంఘిక ఆచారాలను తిరస్కరించి తన స్వీయ అనుభవాల నుండి ఎదుర్కొన్న సమస్యలకు తన స్వేచ్ఛ కోసం తాను చేసే పోరాటమే అస్తిత్వవాదం. మానవ సమాజంలోని మనిషిలో ఉన్న భిన్నతత్వాలు అంతరంగంలోని ద్వంద్వ ప్రవర్తిని, సంఘర్షణలను ఎదుర్కొంటూ చేసే పోరాటం సంస్కార నవలలో అనంతమూర్తి చక్కగా చిత్రించారు.

సంస్కార నవలను రచించడానికి ఆంగ్ల చిత్రం "ది సెవెంత్ సీల్" మూలం. యు.ఆర్.అనంతమూర్తి మొదటి నవల సంస్కారం. దీనిని కేవలం నాలుగు రోజుల్లో రచించారు. నవలలోని కథనం ఒక సినిమా స్క్రిప్ట్‌ని తలపిస్తుంది. బ్రాహ్మణ ఆచార, వ్యవహారాలు, వారి సంఘర్షణలు, అంతర్గత వైరుధ్యాలు, ద్వంద్వనీతులు, కపటత్వం, అస్తిత్వ పోరాటం అన్నీ కళ్ళకు కట్టినట్లు తెలియజేసే ప్రయత్నమే ఈ సంస్కార నవల. ఈ నవల అనంతమూర్తి తొలి నవల అంటే నమ్మడం కష్టం. బ్రాడ్ బరీ సవాల మూలంగా పుట్టిన సంస్కార నవల అద్భుత రచనయే కాక ఎన్నో సంచలనాలకు నాంది పలికింది.

సంస్కార నవలలోని కథ దుర్వాసపురంలోని నారయ్య అనబడే బ్రాహ్మణుడు మరణించడంతో మొదలవుతుంది. నారయ్య చావుకు అగ్రహారం మొత్తం ఉలిక్కిపడుతుంది. దుర్వాసపురం నియమం ప్రకారం నారయ్య దహన సంస్కారం జరిగే వరకు ఎవరు భోజనం చేయకూడదు.

కులభ్రష్టుడు, కులహీనుడైన నారయ్యకి దహన సంస్కారం కావాలి, కానీ వారసులు లేని అతడికి ఎవరు సంస్కారం చేస్తారనే ప్రశ్న ఆ ఊరి పెద్ద ప్రాణేశాచార్యులని సంశయంలో పడేస్తుంది.

బ్రాహ్మణుడిగా పుట్టిన నారయ్య తాను నిర్వర్తించవలసిన ధర్మాలను వదిలి విశృంఖలత్వంతో ప్రవర్తించడం. భోగాలాలసుడై జీవితాన్ని అనుభవిస్తూ మూర్ఛ రోగి అయిన భార్య మరణిస్తే కర్మ కాండలు చెయ్యకపోవడం, తల్లిదండ్రులకు శ్రాద్ధం పెట్టకపోవడం అధర్మం భగవద్గీతలో చెప్పినట్లుగా సహజ ధర్మాన్ని నిర్వర్తించడం అత్యుత్తమైనది. మనిషి పుట్టుకను బట్టి ఎవరు చేయవలసిన పనిని వారు చేయడమే ధర్మం. నారయ్య భోగలాలసుడుగా జీవించడానికి బ్రాహ్మణ్యాన్ని కాలరాచి తాను పాటించవలసిన స్వధర్మాన్ని వదిలిపెట్టడమే అధర్మం. అంతటి అధముడైన నారయ్యని దహన సంస్కారం జరిపిస్తే, తమకి పాపం చుట్టుకుంటుందనే భయంతో పాటు పీఠాధిపతి వెలివేస్తే తమ గతి ఏమిటి అనే భయం అగ్రహారం బ్రాహ్మణులందరిలో కనిపిస్తుంది.

సాధారణంగా అనాథలు మరణిస్తే వారికి దహన సంస్కారం చేయడం పుణ్యంగా భావిస్తారు. కానీ ఇక్కడ నారయ్య మరణిస్తే ఎందుకు అగ్రహారం మొత్తం దహన సంస్కారం చేయడానికి ఇష్టపడదు అనే ప్రశ్న వేసుకుంటే, మనం చేసే ప్రతి పనిలో దేవుణ్ణి, పితృదేవతలను, గురువులను తీసుకువస్తాం. నారయ్యకి దహన సంస్కారం జరిపిస్తే అతడు పితృదేవతల సరసన చేరతాడు. కులభ్రష్టుడు, కులహీనుడు అయిన నారయ్య అందుకు అర్హుడా? భ్రష్టుడైన ఒక వ్యక్తిని పితృదేవతల సరసన చేర్చవచ్చునా అన్నది అగ్రహారం బ్రాహ్మణుల సందేహం. దానికోసం తాళపత్ర గ్రంథాలు తిరగేసి, శాస్త్ర చర్చలు చేయవలసి రావడం, ఎన్ని చర్చలు చేసినా ఎన్ని శాస్త్రాలు వెతికినా సమస్యకి పరిష్కరం లభించకపోవడంతో, నారయ్య శవం దహన సంస్కారం కోసం ఎదురు చూస్తూనే ఉంటుంది. కానీ సంస్కారం చేయడానికి ఎవరు ముందుకు రారు.

అగ్రహారంలో పేద బ్రాహ్మణుడు అయిన దాసాచార్యులు "రెండు సంవత్సరాల నుండి మనకి సంతర్పణలు బ్రాహ్మణార్థాలకూ పిలుపు రాలేదు మనం తొందరపడి వాడి సంస్కారం చేసిన పక్షంలో బ్రాహ్మణార్థాలే సున్నా అవుతాయి" అన్న మాటలలో అతి సాధారణ మనుషుల జీవితాలలో ఉండే భయాలు, ఆందోళనలు వారిని ఎలా వెంటాడి వేధిస్తాయి అన్నదానికి ఈ మాటలే తార్కాణం. బ్రాహ్మణ్యమే జీవనాధారం అయినప్పుడు దానికోసం తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి మనిషి ఎలా పోరాడుతాడు. నారయ్య కుల భ్రష్టుడు కావడం వలన దాని పర్యవసానం మొత్తం అగ్రహారం బ్రాహ్మణుల మీద బలంగా పడడం చేత, ఇతర గ్రామ ప్రజలతో సత్సంబంధాలు లేకపోవడం. బ్రాహ్మణ్యమే జీవనాధారం అయినప్పుడు అగ్రహారాన్ని బహిష్కరిస్తారనే భయం దాసాచార్యులలో స్పష్టంగా కనిపిస్తుంది.

మనిషి తన అస్తిత్వం కోసం చేసే పోరాటంలో ఒక శాఖపై మరొక శాఖ బురద జల్లుకోవడం వంటి సంఘటనలు ఈ నవలలో మనకి కనిపిస్తాయి.

నారయ్య దహన సంస్కారం సమస్య క్లిష్టమవడంతో ప్రాణేశాచార్యులు ఎన్ని శాస్త్రాలు, గ్రంథాలు తిరగేసినా పరిష్కారం దొరకకపోవడం, కాశీలో వేదవేదంగాలు చదువుకున్నాననే అహంకారం ఆయనలో దాగి ఉన్నది. తమ అగ్రహారంలోనే కాక చుట్టుపక్కల గ్రామాలలో ఎంతో పేరును సంపాదించుకున్న ఆచార్యులకి అటువంటి పరిస్థితులలో కూడా తన ఖ్యాతిని గురించి మాత్రమే ఆలోచిస్తున్నాననే అని అనుకుంటూ, నారయ్య దహన సంస్కార సమస్యకి పరిష్కార మార్గం చూపించలేకపోయాను అనే భయం కూడా ఆయనలో ప్రవేశిస్తుంది. అయినప్పటికి సమస్య మొత్తం ప్రాణేశాచార్యుల భుజస్కంధాల మీద పడటం ఆయన తన సొంత వ్యక్తిత్వంతో నిర్ణయం తీసుకోలేకపోవడం ఇన్ని లోపాలను అనంతమూర్తి ఎత్తిచూపారు.

నారయ్య బ్రాహ్మణత్వాన్ని విసిరి పారేసి విశృంఖలత్వంతో జీవిస్తున్న అతడు ఒకసారి ప్రాణేశాచార్యులని ప్రశ్నిస్తాడు. "ముండల ఆస్తినంతా తానే వేసుకొని చేతబళ్ళు చేసి చెడుని ఆలోచించే గరుడ మీ దృష్టిలో బ్రామ్మణుడు" అని ఎగతాళి చేసి, "చివరికి గెలిచేది నేనో, మీరో చూద్దాం. నేను ఈ బ్రాహ్మణత్వాన్ని నాశనం చేస్తాను, చేసి తీరతాను. నా బాధ ఏమిటంటే నాశనం చేయడానికి ఈ అగ్రహారంలో బ్రాహ్మణత్వమే మిగల్లేదు కదా" అని సవాలు చేస్తాడు.

మరణించిన నారయ్య శవానికి దహన సంస్కారం నిర్ణయించలేని ఆచార్యులు పరిష్కార మార్గం కోసం మారుతిని ఆశ్రయించడం, ఆలయానికి వెళ్ళిన ప్రాణేశాచార్యులకి సమస్యకు పరిష్కార మార్గం లభించకపోవడం "ఏ ముఖంతో నన్ను నమ్మిన వాళ్లను చూసేది" అని కలత చెందుతాడు. పరిష్కార మార్గం తోచక తిరిగి వస్తున్న ఆచార్యులకి అడవిలో నారయ్య ఉంపుడుకత్తె చంద్రి కనిపించి ఆయన పాదాలపై పడి నమస్కారం చేయబోతుంటే తొలిసారి స్త్రీ స్పర్శతో అనుకోని ఉద్రేకానికి వెరపునకు లోనవుతాడు. చంద్రి అందించిన సౌఖ్యానికి దాసోహమంటాడు. తానెరుగని మరొక ప్రపంచం ఉన్నదని, జీవితం రాగపూరితమైందని గుర్తించి తనకి ఎదురైన అనుభవాన్ని అంగీకరిస్తాడు. మూఢనమ్మకాల నుండి మనిషి బయటపడాలంటే సనాతన సంప్రదాయ సంకెళ్ళని తొలగించుకొని తరచి చూస్తే తప్ప జీవితంలో ఎదురైన కఠోరవాస్తవాల ద్వారా అనుభవంలోకి వచ్చిన సంఘటనలు జరిగితే తప్ప దానిని నమ్మడం జరగదు. ఇక్కడ ప్రాణేశాచార్యులు నిష్కామ కర్మమే మోక్ష మార్గం అని నమ్మారు. ఆచార్యుల జీవితంలోకి అనుకోని విధంగా చంద్రి ద్వారా అనుభవం ఎదురైనప్పుడు, తాను నమ్మిన సిద్ధాంతంలోని డొల్లతనం బయటపడుతుంది. పరమ నిష్టాగరిష్టుడు ప్రాణేశాచార్యులు అన్న అహంకారం వీడి, కళ్ళ ముందు వాస్తవాలు, కఠిన సత్యాలు అనుభవంలోకి వస్తాయి.

ఇక్కడ ప్రాణేశాచార్యులకి ఎదురైన అనుభవం వల్ల తాను నమ్మిన సిద్ధాంతంలోని డొల్లతనాన్ని గుర్తించడానికి నారయ్య, చంద్రి ద్వారానే అది బోధపడుతుంది. నిష్కామ కర్మమే మోక్షమార్గం అని భావించిన ఆచార్యులు తనకి చంద్రి ద్వారా ఎదురైన అనుభవం వలన తానెరుగని మరొక జీవితం పరిచయమై దాని తాలూకు అనుభవాలని అంగీకరిస్తాడు. ఇన్నాళ్లు మోక్షం కోసం ఆరాటపడే ఆచార్యులలో కామాన్ని విసర్జించాననే భావంతో ఉన్న 'తాను కామాన్ని విసర్జించిన, కామం తనని విసర్జించలేదన్న కఠోర వాస్తవం గుర్తిస్తారు'. పులి లాంటి కామం అవకాశం కోసం ఎదురుచూస్తున్నదని అది సమయం వచ్చినప్పుడు ఒక గెంతు గెంతిందని అంగీకరించి తనని తాను పరిశీలించుకోవడం మొదలుపెడతాడు. నారయ్యకు తనకు మధ్య ఉన్న భేదం తొలగిపోయిందని తాను నారయ్య పంచుకున్న సుఖంలో పాలుపంచుకున్నాననే ఆత్మ విమర్శ ప్రాణేశాచార్యులలో కనిపిస్తుంది.

ఆచార్యులలో అంతర్మథనం మొదలవుతుంది. తనతో నారయ్య చేసిన సవాలు గుర్తుకు వచ్చి "మీ రోగ గ్రస్త భార్యను బయటకు గెంటండి. పురాణ ఋషుల్లా బాగా చేపల పులుసు చేయగల ఒక మత్స్యగంధిని కరుచుకొని పడుకోండి. కళ్ళు తెరిచి చూస్తే మీకు పరమాత్ముడి అనుభవం కలగపోతే నా పేరు నారయ్య కాదు" అని సవాలు విసిరిన నారయ్య మాటలని జ్ఞాపకం చేసుకుంటూ, చంద్రితో సుఖాన్ని పంచుకున్న ఆచార్యులలో తిరిగి అదే అనుభవం కోసం ఆయన మనస్సు తహతహలాడుతుంది. నారయ్య చెప్పిన మాట జ్ఞాపకం వచ్చి "గెలిచేది నేనో మీరో చూద్దాం... మత్స్యగంధిని కరుచుకొని పడుకోండి" అన్న మాటలని హరిజనవాడలోని బెళ్ళిని నగ్నంగా చూసినట్లు గుర్తుకు వచ్చిన ఆచార్యులకి ఆమె స్థనాలను వెళ్ళి మృదువుగా తాకాలని తనకు కలిగిన కొత్త అనుభవానికి ఆయన మనస్సు తహతహలాడుతుంది. ఒకప్పుడు ఆచార్యులు అనుకున్నది అనుభవం అంటే కేవలం మనుషులు కోరుకున్నది పొందడం అని అనుకునేవారు. తాను చంద్రితో గడిపిన అమోఘమైన, అద్భుతమైన క్షణాల వలన ఎదురైన అనుభవం ఆయన్ని చింతనలో పడవేస్తుంది. అప్పటివరకు జీవితం మొత్తం ఆధ్యాత్మికంగా ప్రయాణిస్తున్న ఆచార్యులకి తానెరుగని వేరొక ప్రపంచం ఉన్నదని గుర్తించి అంతర్మథనానికి లోనవుతారు. చివరికి గెలిచేది మీరో, నేనో చూద్దాం అన్న నారయ్య మాటలు తన నిష్ఠ దీనివల్ల పోగొట్టుకుంటున్నాననే భీతి ఆయనలో ప్రవేశిస్తుంది. నిష్కామ కర్మయె మోక్షమార్గం అని నమ్మిన తన సిద్ధాంతంలోని డొల్లతనం గురించి జరిగిన సంఘటన అగ్రహారం బ్రాహ్మణికం ముందు చెప్పాలనుకున్నా చెప్పలేకపోతారు.

ప్రాణేశాచార్యులు తన అస్తిత్వాన్ని తెలుసుకోవడానికి ఒంటరిగా వెళ్లాలనుకుని అజ్ఞాతంగా గడపాలనుకుంటారు. "అస్తిత్వవాదం కూడా ఈ బంధ విముక్తి కొరకే ఆవిర్భవించింది" అని సూరపరాజు రాధాకృష్ణ చెప్పడం జరిగింది. ఇక్కడ ప్రాణేశాచార్యులు తన భార్య భాగీరథి చనిపోయి ఆమె అగ్ని ఆహుతి అవుతుందటే ఆమెతో మానసిక అనుబంధం కలిగి ఎలాంటి మమకారాలు బంధాలు అంటవని అనుకున్న ఆచార్యులలో అస్తిత్వం కనిపిస్తుంది. భాగీరథి మరణంతో ఆచార్యులు తన అస్తిత్వాన్ని వెతకడం కోసం అగ్రహారాన్ని వదిలి ఒంటరిగా ప్రయాణిస్తారు. "మనిషి తన అస్తిత్వాన్ని నిలుపుకోవాలంటే మంద నుండి విడివడాలి. అంటే ప్రపంచంలో తాను ఒంటరిగా నడవాలి. ఇబ్సెన్ అదే అన్నాడు. 'మనిషి ఎంత బలవంతుడో అంత ఒంటరి' అన్నాడు.

ఆత్మ విమర్శ చేసుకుంటున్న ఆచార్యులలో చంద్రితో సంభోగించినందుకు తాను బాధ్యుణ్ణి కాకపోయినప్పటికీ ఆ ఘడియ నన్ను మార్చేసింది కదా! అని బాధపడతాడు. దీనికంతటికి మూలం కాశీలో సహవిద్యార్థి మహాబలుడి పతనం వల్ల కలిగిన నిరాశ, నిస్పృహ తనలో మిగిలిపోగా అజ్ఞాతంగా నారయ్యలో మహాబలుడిని చూసుకోవడం, నారయ్య మీద విజయం సాధించాలని ఆకాంక్ష తన మనస్సు అంతరాలలో నిలిచిపోవడం, ఒకదానితో మరొకటి పెనవేసుకుపోవడం అన్నీ తరచి చూస్తే చంద్రితో తాను గడిపిన క్షణాలకి స్పష్టమైన రూపం ఏర్పడింది. ఇన్నాళ్లు నారయ్యతో దేనికి విరుద్ధంగా పోరాడుతూ వచ్చానో అదే నేనయ్యాను అని ఆత్మ విమర్శ చేసుకుంటారు ప్రాణేశాచార్యులు. నారయ్యలా నేనయ్యానని అపరాధ భావం ఆయనలో ప్రవేశిస్తుంది. తాను తప్పు చేశాననే భయం వలన అగ్రహారాన్ని వదిలి రావడమే గాక బ్రాహ్మణుల ఎదుట చెప్పలేకపోవడం ఈ కారణాలన్నీ ప్రాణేశాచార్యులని సందిగ్ధంలో పడేశాయి. అందువలన అజ్ఞాతంగా బతకాలని ఒంటరిగా ప్రయాణిస్తాడు.

మూర్ఛ రోగితో వివాహం జరిగిన నారయ్యకు శరీర ధర్మాలు అవసరం లేదా ఇన్నాళ్లు అని విరుద్ధ భావాలని తలచి నారయ్య పట్ల తాను ప్రవర్తించిన తీరు గుర్తించి పశ్చాతాప పడతాడు. బ్రాహ్మణ ధర్మం ప్రకారం 'సర్పము ద్విజమే' నారయ్యని తాను సంస్కారం జరిపించక వదిలి వచ్చేసాననే దిగులు, భీతి ఆయనలో ఆవహిస్తాయి.

'స్వేచ్ఛ మనిషి శిక్ష' అని స్మార్తే అంటాడు. అటువంటి స్వేచ్ఛా జీవితంలో ఆచార్యులు అనేక సంఘర్షణలకు లోనవుతారు. ఆయన అంతర్మథనంలో ఎన్నో సంఘర్షణలు జరిగి మనిషి జీవితంలో జరిగే సంఘటనలు తాను తీసుకునే నిర్ణయాలకు తానే బాధ్యుడిగా గుర్తిస్తాడు. వాటి నుండి బయటపడి తన కర్తవ్యం గుర్తించిన ఆచార్యులకి కుళ్ళిపోతున్న నారయ్య శవం వెంటనే దహన సంస్కారం జరిపిస్తే కానీ తనకి భయం నుండి విముక్తి లభించదని వెంటనే దూర్వాసపురం అగ్రహారానికి వెళ్ళి ఇప్పటివరకు జరిగిన సంఘటనలన్నీ అగ్రహార బ్రాహ్మణుల ఎదుట నిలిచి అన్ని వారికి వివరించి ఇన్నాళ్లు తనకు ఇచ్చిన గౌరవ మర్యాదలన్నీ వదులుకుంటానని వారికి చెప్పి, వెంటనే నారయ్యకి దహన సంస్కారం చేయడానికి తామసిద్ధం అని ప్రకటించాలని, తాను అందరిలాంటి మనిషేనని దైవాంశ సంభూతుడను కాదని గుర్తించిన ఆచార్యులు, తన అహాన్ని విడిచి ఆచారాలన్ని మనుషులు కల్పించినవే అని మానవత్వమే నిజమైన ధర్మంగా గుర్తించిన ఆచార్యులు దుర్వాసపురం అగ్రహారానికి నిర్భీతిని జయించడానికి తన అనుశ్చిత స్థితి నుండి బయటపడి అగ్రహారానికి బయలుదేరి వెళ్తాడు.

ఇక్కడితో నవల ముగుస్తుంది. రచయిత ప్రాణేశాచార్యుల ద్వారా మనిషిలోని రుగ్మతలకి, సమాజానికి కూడా సంస్కారం జరిపిస్తారు.

**ఆధార గ్రంథాలు**

1. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు అస్తిత్వవాదం – నిఖిలేశ్వర్
2. కేతు విశ్వనాథరెడ్డి – బ్లాక్ స్పాట్.కామ్
3. సంస్కారం తెలుగు మూలం కె.నారాయస్వామి, ఆర్వీయస్ సుందరం
4. భారతీయ పరిచయ క్రమం అస్తిత్వవాద సాహిత్యం – ఈ మాట జులై 2021 సంచిక సూరపరాజు రాధాకృష్ణమూర్తి

# 'పర్వ', 'యుగాంత' రచనల తులనాత్మక పరిశీలన

**డా. అంకే శ్రీనివాసులు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర.), అనంతపురము

'పర్వ' నవల భారతీయ నవలా చరిత్రలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నవలగా, ఐతిహాసిక నవలగా మన్నలందుకున్నది. మహాభారతం ఆధారంగా సుదీర్ఘకాలం పరిశోధించి ప్రముఖ కన్నడ రచయిత ఎస్.ఎల్. భైరప్ప 'పర్వ' నవలను రచించారు.

'యుగాంత' కూడ మహాభారతం మీద జరిగిన పరిశోధనాత్మక గ్రంథం. యుగాంత వ్యాస సంపుటి. యుగాంతను మరాఠీ భాషా రచయిత్రి ఇరావతీకర్వే రచించారు. 1962 జూలైలో ఇరావతి మహాభారతం మీద తమ మొదటి పరిశోధనా వ్యాసమైన 'గాంధారి' ని రాశారు. మొత్తం పది వ్యాసాలలో చివరిదైన 'యుగాంత' 1967 ఏప్రిల్‌లో పూర్తి చేశారు. ఈ గ్రంథం 1967లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నది. 1962లో భైరప్ప మహాభారతాన్ని నవలగా రాయడం కోసం అధ్యయనం చేయడం ప్రారంభించారు. 2.10.1975 నుండి 17.12.1976 వరకూ ఒక సంవత్సరం రెండు నెలల పాటు 'పర్వ'ను రచించారు. 1979లో కన్నడలో ముద్రణ పొందినది. క్రమంగా భారతీయ భాషల్లోకి అనువాదమయ్యింది.

యుగాంతను మరాఠీ నుండీ తెలుగులోకి బాలచంద్ర ఆప్టే అనువదించారు. 'పర్వ'ను గంగిశెట్టి లక్ష్మినారాయణ తెలుగులోకి అనువాదం చేశారు. ఈ అనువాదానికి లక్ష్మినారాయణకి 2004లో 'కేంద్ర సాహిత్య అకాడమీ' అనువాద బహుమతి లభించింది. యుగాంత, పర్వలను తెలుగులో అకాడమీనే ప్రచురించడం ముదావహం.

భైరప్ప అనేక ఉద్యోగాలు చేసినా, తత్వశాస్త్ర ఆచార్యులుగా మైసూరులోని ప్రసిద్ధ రీజనల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో స్థిరపడ్డారు. ఇరావతి ప్రఖ్యాత పూనా దక్కన్ కాలేజ్‌లో సోషియాలజీ ఆంత్రోపాలజీ ఆచార్యులుగా పనిచేశారు.

భైరప్ప కన్నడ, ఆంగ్ల, సంస్కృత, గుజరాతీ, హిందీ భాషలో పండితులు. ఇరావతి కూడా మరాఠీ, ఆంగ్ల, సంస్కృత, హిందీ, బర్మీ భాషలలో పండితులు. 'యుగాంత' మహాభారతంలోని పాత్రల అస్తిత్వం, సంఘర్షణలను గురించి చేసిన మేధో విశ్లేషణాత్మక వ్యాస సంపుటి. పాత్రల మనస్తత్వాలు, అస్తిత్వం, మహాభారత కాలంనాటి సంస్కృతి సాంప్రదాయాలు, వాటి మధ్య విలవిల్లాడిన పాత్రలతో, తీవ్ర భావోద్వేగాలను కలిగించే సృజనాత్మక నవల 'పర్వ'. యుగాంతలోని పది వ్యాసాలలో ఒకటి భిన్నమైనది. మిగిలిన వ్యాసాలు, భీష్మ, గాంధారి, కుంతి, ద్రౌపది, విదుర, ద్రోణ, కర్ణ, కృష్ణ పాత్రలు మీద రాసినవి. మయసభ, యగాంతం పేరుతో ఉన్న వ్యాసాలు ఆనాటి సామాజికత మీద రాసినవి. మహాభారతాన్ని విశ్లేషించి శల్య, భీమ, అర్జున, ద్రౌపది, కృష్ణ, కర్ణ, యుయుత్స, ద్రోణ, భీష్మ, సంజయ, కుంతి పాత్రలను ఆధారం చేసుకొని పర్వ నవలగా మహాభారతాన్ని భైరప్ప పునః సృజించారు.

ఇరువురు రచయితలు పూనా భండార్కర్ ఇన్స్టిట్యూట్ వారు ముద్రించిన మహాభారత ప్రతులాధారంగానే తమ రచనలు చేశారు. వి.యస్. సుక్తాంకర్ సంపాదకత్వంలోని మహాభారత సంశోధిత ప్రతి ఆధారంగా ఇరావతి తమ పరిశోధన చేశారు. సుక్తాంకర్ మహాభారతాన్ని హేతుబద్ధంగా పరిశోధించాలనే మహోన్నత ఆశయంతో, దేశవ్యాప్తంగా వున్న అనేక సంస్కృత మహాభారత సంపుటాలను సేకరించడమే గాక శాస్త్రీయ పరిశోధనను ప్రారంభించిన మహాశయుడు. ప్రక్షిప్తాలను తొలగించి వీలైనంత వాస్తవ మహాభారత ప్రతిని తయారు చేయాలన్న ఆశయంతో పరిశోధన ప్రారంభించి, విరాటపర్వం వరకూ సంశోధిత ప్రతుల్ని తయారు చేశారు. ఈ ప్రతులాధారంగానే ఇరావతి 'యుగాంత' ను రచించారు. ఈ ప్రతులాధారంగానే డి.డి. కోశాంబి లాంటి ప్రసిద్ధ చరిత్రకారులు కూడా చరిత్ర రచన చేశారు.

అయితే భైరప్ప ఈ సంశోధిత ప్రతుల్ని పక్కనపెట్టి ముడి సంస్కృత ప్రతులే అధ్యయనం చేసి, పరిశోధించి 'పర్వ'ను సృష్టించారు. మూల సంస్కృత ప్రతుల్నీ, ప్రక్షిప్త రహిత సంశోధిత ప్రతుల్నీ భండార్కర్ సంస్థే ముద్రించడం ముదావహం. భైరప్ప మహాభారతం క్షేత్రపర్యటనలు కూడా చేసి భౌగోళిక నైసర్గిక స్థితుల్ని కూడా లోతుగా నవలలో చర్చించారు. ఇరావతి వ్యాస సంపుటిలో భౌగోళికమైన అంశాలు తక్కువ. మూల సంస్కృత ప్రతుల అధ్యయనం వల్ల పర్వనే గాకుండా ఇతర నవలలను కూడా భైరప్ప రచించారు. పర్వ నవలకు అనుషంగికంగా దాటు, వంశవృక్షం, నిరాకరణ నవలలను సృజించారు. ప్రాచీన సంప్రదాయాల్ని సామాజిక కట్టుబాట్లను ఆధునికంగా వ్యాఖ్యానిస్తూ ఈ నవలలను రాశారు. ఇరువురి మీద ఎఫ్.ఇ. ఫార్జిటర్, రాహుల్ సాంకృత్యాయన్ వంటి పూర్వ రచయితల ప్రభావం వుంది. ప్రక్రియ పరంగా యుగాంత, పర్వ రెండూ భిన్న ప్రక్రియలు. ముందే చెప్పినట్లు యుగాంత విమర్శా గ్రంథం. పర్వ సృజనాత్మకంగా రాసిన బృహన్నవల.

ఇరువురూ వేదయుగం, ఐతిహాసిక యుగం అనే చారిత్రక యుగవిభజనను అంగీకరించలేదు. మలివేద నాగరికతా కాలంలోనే రామాయణ మహాభారతాలు జరిగాయని నిరూపించారు. రాహుల్ సాంకృత్యాయన్ వంటి తొలితరం పరిశోధనలు కొందరు ఈ యుగ విభజనను చేశారు. కానీ వేదాల్ని, ఇతిహాసాల్ని తులనాత్మకంగా అధ్యయనం చేసి ఈ యుగ విభజన లేదని తేల్చిచెప్పారు. తొలి వేదకాలానికి, మలివేద కాలానికి చెప్పుకొనేంత వైరుధ్యమేమీ లేదని, నియోగాలు, క్షేత్ర భీజప్రాధాన్యాలు, బహుపత్నీ వివాహాలు, సద్యోగర్భాలు, సద్యోమరణాలు, సామాజిక కట్టుబాటు వేద ఇతిహాసిక కాలాలలో పెద్ద వైవిధ్య మేమిలేదని ఇద్దరు తేల్చారు. ఋగ్వేదంలో 'అభిచార మంత్రాలను' ఎవరినైనా ఓడించడానికీ, నాశనం చేయడానికీ, ఎవరినైనా తమ వశం చేసుకోవడానికీ ఉపయోగించేవారు. కర్ణ జన్మ సందర్భంలో కూడా 'అభిచార' విశేషణం ఉందని ఇరావతి తెలియజేశారు. ఈ సందర్భాన్ని కళాత్మకంగా నాటకీయంగా రాశారు భైరప్ప. ఇరావతి రచన ప్రభావం భైరప్ప మీద వుంది. అయితే యుగాంతను అధ్యయనం చేసినట్లు భైరప్ప చెప్పలేదు. ఆ అవసరం కూడా లేదని మనం గ్రహించాలి. వ్యాస, కర్ణులు ఇద్దరూ కానీనులనే వాస్తవాన్ని పరిశోధకులిద్దరూ చెప్పారు. ఋషిగా ఉన్నతమైన గౌరవాన్ని అందుకోవచ్చునని వ్యాసుడు నిరూపిస్తే, యోధుడిగా గౌరవ మర్యాదల్ని పొందవచ్చునని కర్ణుడు నిరూపించాడు. కానీనుడంటే పెళ్ళికాని స్త్రీకి జన్మించినవాడు. అంటే కన్యకు పుట్టినవారు కానీనులు. సంతతి లేని పురుషులు తమ భార్యలకు పెళ్ళికాక ముందే పుట్టిన భార్య సంతతిని కూడా తమ సంతానంగా స్వీకరించేవారు. తన విధవా కోడళ్ళకు సంతాన ప్రాప్తి కోసం సత్యవతి, భీష్ముడు (మరదళ్ళకోసం) వ్యాసుడిని హస్తినకు ఆహ్వానించారు. ఈ మౌళిక సామాజిక సూత్రం ఆధారంగానే ద్రౌపదికి మరొక భర్తగా కర్ణున్ని ప్రతిపాదించాడు కృష్ణుడు. ఈ సందర్భాలలో ఇరావతి, భైరప్ప విశ్లేషణలు అసాధారణమైనవి. ఈ రెండు విశ్లేషణల వల్లనే నాటి సామాజిక విషయాలలోని సంక్లిష్టత సులభంగా అర్థమవుతుంది. ఈ సన్నివేశంలో ఇరావతి విశ్లేషణ మేధో సంబంధమైనది. భైరప్ప విశ్లేషణ హృదయ సంబంధి. ఈ ఘట్టంలో ఇరావతి ప్రభావం భైరప్ప మీద స్పష్టంగా వుంది. అయితే భర్తకు తెలియకుండా భార్య సంతానాన్ని పొందే ఘట్టాన్ని భైరప్ప సమర్థంగా నడపలేదు. కంసుని జన్మ విషయంలో గర్భఛేదన శక్తి కొందరు పురుషులకు లేదంటూ భైరప్ప అతి వ్యాప్తి విశ్లేషణ చేశారు. ఇది ఆధునిక శాస్త్ర పరిశోధనకు విరుద్ధమైనది. స్త్రీ, పురుష సంగమాలలో గర్భ ఛేదనమంటూ వుండదు. సంతాన ప్రాప్తికై ఆపద్ధర్మంగా సామాజిక ఉల్లంఘనలు ఏకాలంలోనైనా ఉంటాయనడం మాత్రం వాస్తవం. కర్ణుడు భీరువని, అహంకారి అని, మొండివాడని, పొరపాట్లు చేసేవాడని ఇరువూరు అంగీకరించారు. కర్ణ పర్వంలో మద్రదేశ స్త్రీల మీద కర్ణుడు చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాకపోవచ్చునని ఇరావతి అభిప్రాయం. అయితే భైరప్ప ఉద్దేశం ప్రకారం ఆ వ్యాఖ్యలు వాస్తవమని చెప్పడానికే ఏకంగా నవల ప్రారంభంలోనే హిరణ్యవతి అనే పాత్రను సృష్టించి వంద పేజీలు ఖర్చుచేశారు. వాస్తవానికి పర్వలో ఆసక్తి లేని భాగం ఆ సన్నివేశమే! పాఠకునికి విసుగు తెప్పించే ఘట్టమిది. కర్ణుడు ఎదుర్కొన్న కులవివక్షను భైరప్ప కన్నా ఇరావతి స్పష్టంగా చెప్పారు. కర్ణుని వ్యక్తిత్వాన్ని, అతని అవలక్షణాలను స్పష్టంగా ఇరావతి అంచనా వేశారు. కర్ణుని ప్రత్యర్థి అయిన అర్జునుని మీద భైరప్పకు సరైన అభిప్రాయమే లేదు. కృష్ణుడు పాండవులతో కలవడానికి ముందు

పాండవ వర్గానికీ నాయకత్వం వహించినది అర్జునుడే! యుధిష్ఠిరుని పేరులో ఉన్న యోధత్వం వ్యక్తిత్వంలో లేదు. భైరప్ప భీమునికిచ్చిన ప్రాధాన్యత అర్జునునికి ఇవ్వలేదు. అహంకారిగానే అర్జునున్ని చిత్రించాడు. యుద్ధంలో కూడా వ్యూహ ప్రాధాన్యతను భైరప్ప గుర్తించలేదు. శిఖండిని భీష్మునితో పదోరోజు యుద్ధానికి దించడం, కర్ణ పర్వం వరకు ఘటోత్కచున్ని ప్రవేశపెట్టక పోవడంలో వున్న ఎత్తుగడల్ని భైరప్ప గుర్తించలేదు. అర్జునుని గొప్పదనాన్ని గుర్తించడమంటే కృష్ణుని చాతుర్యాన్ని వ్యూహమేధస్సుని గుర్తించడం. అందుకే కృష్ణార్జునులు అసాధారణ మేధను ఇరావతి చెప్పినట్లుగా భైరప్ప చెప్పలేదు. వారిద్దరి మధ్యనున్న నిర్వ్యాజ స్నేహాన్ని ఇరావతి చాలా గొప్పగా వివరించారు. అర్జునుని మీద భైరప్ప విశ్లేషణ మహాభారతానికి విరుద్ధమైనది. నవలా ప్రవాహంలో పాఠకుడు కొట్టుకుపోతాడు తప్ప, కాస్త నిలబడి ఆలోచిస్తే భైరప్ప భావనలు పక్షపాత పూరితమైనవని స్పష్టంగా తెలుస్తుంది. కృష్ణుని వ్యక్తిత్వాన్ని కూడా భైరప్పకన్నా ఇరావతి చక్కగా విశ్లేషించారు. ఇరువురూ భారత, భాగవత, హరివంశాల ఆధారంగానే తమ రచనలు చేసినప్పటికీ ఈ పాత్రల మీద వారి అవగాహన భిన్నంగా కనిపిస్తుంది.

యాదవుల వలసలు, జరాసంధుని యుద్ధపాటవం వంటి వాటి మీద ఇరువురు ఒకే విధమైన అభిప్రాయాల్ని కలిగివున్నారు.

ద్రౌపది వస్త్రావహరణ ఘట్టాన్ని గురించి చేసిన ఇరావతి విశ్లేషణ సమంజసంగా కనిపించదు. మహాభారతంలోనే కీలకమైన ఆ ఘట్టంలో ద్రౌపది మాట్లాడిన మాటలు సహేతుకంగా లేవని ఆమె అభిప్రాయం. అయితే ఆ ఘట్టాన్ని నడపడంలో భైరప్ప ప్రతిభాపాటవాలు అసాధారణమైనవి. ద్రౌపది దౌర్బల్యాన్ని, పాండవుల పరిస్థితిని చెప్పి, భైరప్ప పాఠకుడి కంట కన్నీరు తెప్పిస్తారు. భైరప్ప విశ్లేషణ వాస్తవికంగా, శాస్త్రీయంగానూ, సహేతుకంగానూ వుంది. స్వతహాగా తత్వశాస్త్ర బోధకుడైనందునవల్ల మాటల వెనుకనున్న మర్మాల్ని మనసు లోపలి పొరల్ని భైరప్ప అసాధారణంగా దృశ్యమానం చేశారు.

యుధిష్ఠిరున్ని విదురుని కొడుకుగా నిరూపించడానికి ఇరావతి చాలా కష్టపడ్డారు. ఈ వ్యాసం చాలా వివాదాస్పదమైంది. అనేక రహస్యాలు భారత కథలో ఏదో ఒక సందర్భంలో బట్టబయలవుతాయి. కానీ ఇరావతి చెప్పినట్లు యుధిష్ఠిరుడు విదురుని కొడుకుగా భారతం చెప్పలేదు. ఇరావతి వాదన సత్యదూరం. పినతండ్రిగా పాండవ పక్షపాతిగా కురుసభలో విదురుడు ఎదుర్కొన్న అవమానాల్ని భైరప్ప అద్భుతంగా వివరించాయి. ఆ సన్నివేశంలో ఇరావతి పాండవుల అస్తిత్వాన్ని ప్రమాదంలో పడవేసే వ్యాఖ్యలు చేశారు. కానీ విదురుని ప్రాధాన్యతను గుర్తించి, గౌరవించారు భైరప్ప. అయితే కర్ణుని పట్ల విదురునికి మాత్సర్యమున్నట్లు భైరప్ప చిత్రించడం సహేతుకంగా కనిపించదు. జీవితమంతా పాండవ పక్షపాతిగా మాట్లాడినప్పటికీ, విదురుడు పాండవ పక్షంలో యుద్ధం చేయకుండా వుండిపోయాడు. భీష్మ, ద్రోణ, కృపులు జీవితమంతా పాండవ పక్షంగా మాట్లాడి యుద్ధం చేయడానికి కౌరవ పక్షం చేరిపోయారు. ఈ సందర్భాలు స్పష్టంగా అర్థం కావాలంటే ఇరువురి రచనలు చదవాలి. ఏ ఒక్క రచనను చదివినా ఆ సందర్భాలు స్పష్టం కావు. అయితే ద్రోణుడు కౌరవ పక్షంలో చేరడానికి గల సహేతుకమైన కారణాలను విశ్లేషించడంలో ఇరువురూ మరింత కృషిచేసుండాల్సింది.

శకుంతల, గంగ, సత్యవతి పాత్రల గురించి భైరప్ప కన్నా ఇరావతి గొప్పగా విశ్లేషణ చేశారు. ద్రౌపది, గాంధారి, కుంతి పాత్రల వెనుకనున్న సామాజిక కట్టుబాట్లను మాత్రం ఇరువురూ అసాధారణంగా అంచన వేశారు. ఇరువురి అభిప్రాయాలు కురువంశానికి మూలపురుషుడైన యయాతి కూతురు మాధవి గురించి మాటమాత్రంగా కూడ ఇద్దరూ మాట్లాడకపోవడం ఆశ్చర్యం. 'మాధవి' మీదనే కన్నడ రచయిత్రి నిరూపమా నిరంజన్ రాసిన నవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆధునిక స్త్రీవాద ఉద్యమానికి ప్రాతిపదికగా 'మాధవి' నవలను విమర్శకులు అంచనా వేశారు. మాధవి పాత్ర మీద విశ్లేషణ, ప్రధాన కథకు ఆటంకమని భావించి మాధవి గురించి ఇరువురు రచయితలు మాట్లాడకపోయి వుండవచ్చు.

భీష్ముడి పాత్ర వెనుకనున్న మర్మాల్ని ఇరావతి ఛేదించారు. భీష్ముని పాత్రను ఆదర్శీకరించారని ఇరువురు నిరూపించారు. కోశాంబి భగవద్గీతను బోధించే అర్హత కృష్ణుని కన్నా భీష్మునికే ఉందని ఒక సందర్భంలో చెప్పారు. అయితే అది సమంజసం కాదు. మహాభారతంలోని ప్రధాన స్త్రీ పాత్రలన్నీ ఏదోవిధంగా భీష్మునితో బాధించబడినవే అని ఇరువురూ నిరూపించారు.

అంబ ఆత్మబలిదానం, అంబికా, అంబాలికను ఇష్టం లేకపోయినప్పటికీ నియోగం ఏర్పాటు చేయడం, గాంధారిని అంధునికిచ్చి పెళ్ళి చేయడం, మాద్రి వివాహం, కుంతికి సహేతుకంగా, రాజ్యభాగాన్ని సరైన సమయంలో ఇవ్వకపోవడం, ద్రౌపది వస్త్రాపహరణాన్ని ఆపే శక్తి, ఉన్నప్పటికీ ఆపే ప్రయత్నం చేయకపోవడం భీష్ముని వ్యక్తిత్వ దోషాలుగా ఇరువురు తేల్చిచెప్పారు. ఆ పాత్రచిత్రణలోని ఆదర్శం, పాత్ర జీవితంలో లేదని సహేతుకంగా విశ్లేషించారు. భీష్ముడి వ్యక్తిత్వంలోని డొల్లతనాన్ని తేట తెల్లం చేశారు. భీష్ముని ఆదర్శమంతా ప్రక్షిప్తమేనని, శాంతి పర్వంలోని భీష్ముని బోధనలు కూడా ప్రక్షిప్తాలేనని ఇద్దరూ ఒకే విధమైన అభిప్రాయాన్ని కలిగివున్నారు. శిశుపాలుడు భీష్ముని మీద లేవనెత్తిన ప్రశ్నలు యథార్థమైనవని ఇరువురూ అంగీకరించారు. ఏది ఏమైనా భీష్ముడు స్త్రీ సాంగత్యానికి దూరంగా వున్నప్పటికీ, అతని ప్రవర్తన వల్ల, నిర్ణయాల వల్ల స్త్రీలు తీవ్రమైన బాధల్ని, అవమానాల్ని పడాల్సి వచ్చింది. అయితే భీష్ముడు ధార్త రాష్ట్ర పక్షానికి సేనానాయకుడు కావడంలో ఉన్న సూక్ష్మాల్నీ ఇరువురూ చక్కగా వివరించారు. గాంగేయుడు యుద్ధాన్ని ఆపే ప్రయత్నంలో భాగంగానే సేనాపతిత్వాన్ని స్వీకరించాడని చెప్పారు. ఉద్దేశ్యపూర్వకంగా ఇరుపక్షాలూ భీష్ముణ్ణి యుద్ధం నుండి తప్పించాయని కూడ నిరూపించారు. అయితే భీష్ముడు యుద్ధం విరమించుకోవడానికి అంచనా వేయడంలో, వెనకున్న ఆ కాలంనాటి సామాజిక నియమాలను ఇరావతి కన్నా భైరప్ప ఒకడుగు ముందుకేశారని చెప్పాలి. భీష్ముని అపంశయ్యకు కారణం, వెనుక శుకుని ప్రాయోపవేశం వుందని సహేతుకంగా భైరప్ప నిరూపించారు. ఎందుకంటే వ్యాస, భీష్ములు సవతి సోదరులు. శుకుడు మాత్రమే కాదు, ధృతరాష్ట్ర పాండు, విదురులు కూడ వ్యాస సంతతేకదా! బహుశా భైరప్ప చేసిన క్షేత్ర పర్యటనల వల్ల, దశాబ్దం పైగా విశేషమైన అధ్యయనం చేయడం వల్ల ఈ అంశాలను వెలుగులోకి తెచ్చారు. శుకుడు చేసిన మృత్యు ఆహ్వానం భైరప్ప రచన మీద విశేషమైన ప్రభావం చూపింది. నహుషుడు, యుధిష్ఠిరుడు, శుకుడు, విదురుడు, వంటివారు చేసిన సన్యాసాశ్రమ ప్రవేశ ప్రభావం కారణంగానే ఆయన 'వంశవృక్షం' నవల సైతం రాశారు. 1964లో వంశవృక్షం నవల కన్నడదేశంలో సంచలనం సృష్టించింది. డెబ్బయ్యవ దశకంలో తెలుగులోకి వచ్చి, ఇక్కడ కూడా విశేష ఆదరణను పొంది తెలుగులో వంశవృక్షం ఆధారంగా సినిమా కూడా వచ్చింది. వేదర్షి వశిష్టుని గురించి ఇరావతి మాట్లాడలేదు. భైరప్ప కూడా పర్వ నవలలో చర్చించలేదు. కాని భైరప్ప ఆధునిక కాలంలో వశిష్టున్ని వెంకటరమణయ్యగా పునస్సృంచి 'దాటు' నవలను రాశారు.

ఉపపాండవులు యుద్ధం చేసినట్లుగా యుగాంత చెప్పలేదు. వారు పట్టాభిషిక్తులు కావడానికి అర్హులు అయినందువల్ల యుద్ధానికి దూరంగా ఉంచినట్లు ఇరావతి అవగాహన! కానీ భైరప్ప ఉపపాండవులతో కూడా యుద్ధం చేయించారు. కారణం వారు భావి పాలకులు కాబట్టి, వారు కూడా యోధులనే భావనలో భైరప్ప రాశారు. భారతం కూడా అభిమన్యునితో పాటు ఉపపాండవులూ యుద్ధం చేసినట్లుగానే వర్ణించింది. వేద, ఇతిహాస యుగ నాగరికతలు కాంస్యయుగానికి చెందినవిగా చరిత్రకారుల అభిప్రాయం. వేదాలు, ఇతిహాసాలలో విస్తృతంగా కనిపించే అయః అనే మాటకు ఇనుప ఖనిజమనే అర్థాన్ని చరిత్రకారులు అంగీకరించలేదు. క్రీ.పూ. 7,6 శతాబ్దాలలో మగధ బలపడటానికి ఇనుము ఖనిజం లభించడమేనని కోశాంబి అభిప్రాయం. రాహుల్ సాంకృత్యాయన్‌తో పాటుగా చాలా మంది చరిత్రకారులు క్రీ.పూ. 1000 కన్నా ముందు ఇనుపు ఖనిజ ప్రస్తావనల్ని అంగీకరించలేదు. ఇరావతి చరిత్రకారుల అభిప్రాయాలే ఆమోదించారు. భైరప్ప మాత్రం కొంత ధైర్యం చేశారు. బాణాలకు ఇనుప ములుకుల్ని, రథాలకు చీలల్ని ఇనుముతోనే తయారు చేయించారు ఆయన. అప్పుడప్పుడే వ్యవసాయ పనిముట్లు కూడా ఇనుముతో తయారు చేయడం ప్రారంభించినట్లు కూడ చెప్పారు. నేటి హర్యానాలోని కురుక్షేత్రకు సమీపంలోని 'సినౌలి' గ్రామ పొలాల్లో అనేకమైన రాగివస్తువులతో పాటు ఇనుప ఖనిజ ఆనవాళ్ళు కూడా లభించాయి. ఇవి క్రీ.పూ. 1700 కాలానికి చెందినవి. చరిత్రకారుల అభిప్రాయానికి విరుద్ధమైన ఆధారాలు అక్కడ లభించాయి. కాంస్యంతో పాటుగా ఇనుప ఖనిజాన్ని కూడా ఆకాలంలో ఉపయోగించారు. కానీ ఇనుము వేగంగా శిథిలం అవుతుంది. అందువల్ల 6,7 శతాబ్దాల కన్నా పూర్వకాలంలోనే ఇనుము లభ్యత వుంది. అయితే వాడకం విరివిగా ఉండకపోవచ్చు. అందువల్ల జరాసంధుడు మిగిలిన ఆర్యరాజ్యాల కన్నా

మగధను బలోపేతం చేయడంలో ఇనుప ఖనిజం ప్రధాన పాత్ర పోషించి వుండవచ్చు. మగధకు సమీపంలో సింగ్‌భం (జార్ఖండ్)లో 6,7 శతాబ్దాలలో ఇనుము లభించి వుండవచ్చునని కోశాంబి అంచనా! సింగ్‌భంని ఆ రోజుల్లో సింహభూమిగా పిలిచేవారు. ఎంతో శక్తివంతంగా, సంపన్నవంతంగా వుండే యాదవ శూరసేన రాజ్యాన్ని జరాసంధుడు అనేక పర్యాయాలు ఓడించగలిగాడు. యాదవులు బ్రతుకుజీవుడా అని ఎంతో దూరంలోని గుజరాత్‌లోని ద్వారకకు వెళ్ళిపోయారు.

జరాసంధుని మరణ సంఘటనను కూడా ఇరువురూ ఒకే విధమైన అభిప్రాయాన్నే వ్యక్తీకరించారు. కృష్ణుని అసాధారణ ధైర్య సాహసాలకు ప్రతిరూపంగానే వ్యాఖ్యానించారు. జరాసంధుని దాడులను తాళలేక వేల కిలోమీటర్ల దూరం పారిపోయిన శ్రీకృష్ణుడు, భీమార్జునుతో కలసి ఏకంగా జరాసంధుని రాజమందిరంలోకే వచ్చి ద్వంద్వ యుద్ధానికి సిద్ధపడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అదేమీ చిన్నపిల్లల ఆటకాదు. భైరప్ప చెప్పినట్లు మానవ మస్తత్వంలోని బలహీనత కాదు. జరాసంధునికి బద్ధ వ్యతిరేకులెవరో అతని ఆస్థానంలోగానీ, దగ్గరి బంధువుల్లో గానీ వుండి వుండాలి. వారి సహాయంతోనే లోపలికి రాగలిగారు. అది ఎవరు? జరాసంధునికీ, అతని కొడుకు సహదేవునికి తీవ్రమైన విభేదాలున్నట్లు భారత హరివంశాల ద్వారా తెలుస్తోంది. భైరప్ప కూడా దీనిని అంగీకరించాడు. కానీ తండ్రి హత్యలో కొడుకు పాత్ర గురించి ఏమీ చెప్పలేదు. జరాసంధుడు బార్హద్రథ వంశస్తుడు. బార్హద్రథ వంశం తర్వాత హర్యాంక వంశం మగధ పాలనను చేపట్టింది. హర్యాంక వంశస్థాపకుడైన బింబిసారున్ని అతని కొడుకైన అజాతశత్రువు సంహరించాడు. అజాతశత్రువుని కూడా అతని కొడుకు ఉదయనుడే వధించాడు. అందువల్ల జరాసంధున్ని వధించడానికి, అతని కొడుకు సహదేవుని పాత్రను కూడా సందేహించాల్సిందే! ఇరావతి, భైరప్పలు చారిత్రక విషయాల జోలికి వెళ్ళలేదు.

జరాసంధుని వయసు విషయంలో ఇరావతికన్నా, భైరప్ప స్పష్టంగా అంచనా వేశారు. కృష్ణుడు దేవకికి అష్టమ సంతానం. ఆమె అన్న కంసుడు. అందువల్ల కృష్ణ, కంసుల మధ్య వయోభేదం కనీసం 30, 35 సంవత్సరాలు! కంసుని భార్యలు జరాసంధుని కుమార్తెలు. జరాసంధుడు మరణించే సమయానికి 60-70 సంవత్సరాల వయస్కుడని భైరప్ప అంచనా! ఈ అభిప్రాయం శాస్త్రీయంగా వుంది. అయితే, భారత యుద్ధసమయానికి భీష్ముడు 120 సంవత్సరాల వయస్సు వున్నవాడని భైరప్ప చెప్పడం మాత్రం వాస్తవ విరుద్ధంగా వుంది. ఇరావతి భీష్మునికి 90 సం॥ కన్నా ఎక్కువ ఉండే అవకాశం లేదని తెలిపారు. ఇరువురూ తమ అభిప్రాయాలకు అవసరమైన ఉపపత్తులను కూడా చెప్పారు. కానీ ఇరావతి అభిప్రాయమే సహేతుకమైనది. ఎందుకంటే భీష్ముడు ఒక పక్షానికి సైన్యాధిపతిగా పదిరోజులు యుద్ధం చేసినట్లు మహాభారతం చెబుతోంది మరి! 120 సం॥ వృద్ధుడు యుద్ధం చేయగలడా! కృష్ణుడు కర్ణునికి ద్రౌపదిని ఆశ చూపాడు. అంటే అప్పటి కింకా ఆమెకు రుతుస్రావం జరుగుతూనే వుండాలి. ఆమెకు యాభై సంవత్సరాల కన్నా ఎక్కువ వయసు వుండే అవకాశం లేదు. ఆమెకు అరవై అంటే కర్ణుని వయసు 65-70 సం॥ వుండాలి. అందువల్ల ఇరావతి విశ్లేషణ సమంజసమైనది. భైరప్ప అంచనా అతిశయోక్తితో నిండినది.

ఆర్యజాతులు సేవించే మద్యపానం వంటి విషయాలను తెలియజేసి వాటిని వెలుగులోని తెచ్చినది రాహుల్ సాంకృత్యాయన్. మద్యపాన వ్యసనపరుల గురించి వేదాల్లో చెప్పిన అనేకమైన విషయాలను రాహుల్ తమ 'ఋగ్వేద ఆర్యులు' గ్రంథంలో వివరించారు. ఈ గ్రంథాన్ని భైరప్ప అధ్యయనం చేయలేదని చెప్పలేం. ఆనాటి సామాజిక అంశాల చిత్రణలో భైరప్పకు 'ఋగ్వేద ఆర్యులు' గ్రంథం సహాయం తీసుకున్నట్లుగానే కనిపిస్తుంది. గాంధారి కళ్ళగంతల విషయంలో కూడా పరిశోధకులిద్దరిదీ ఒకే అభిప్రాయం. పుట్టుగుడ్డి వాడికిచ్చి పెళ్ళి చేయడాన్ని తీక్షణంగా వ్యతిరేకిస్తూ కళ్ళకు గంతలు కట్టుకుందని చెప్పారు. గాంధారి వందమందికి తల్లి అనీ, మహాభారత అభిప్రాయాన్ని ఇరావతి అంగీకరించారు. కానీ భైరప్ప గాంధారికి కేవలం పదహైదు మంది మాత్రమే సంతానమని అభిప్రాయపడ్డారు. మిగిలిన ఎనభైయ్యారు మంది సంతానం ధృతరాష్ట్రునికి దాసీల ద్వారా కలిగిన వారని స్పష్టంగా భైరప్ప తేల్చిచెప్పారు. 'దు' అక్షర సామ్యమున్న పేర్లు కలిగిన వారంతా గాంధారి సంతానమని భైరప్ప వాదన. గాంధారి స్వగతాన్ని, మనసునీ గురించి ఇరువురూ ఒకే రకమైన అభిప్రాయాన్ని కలిగివున్నారు. అయితే గాంధారి పాతివ్రత్యం వెనకున్న మౌలికమైన విషయాల్ని భైరప్ప సమర్థవంతంగా వ్యాఖ్యానించారు.

హిడింబి, ఘటోత్కచుల పాత్రలను గురించి ఇరవతి చాలా తక్కువగా మాట్లాడారు. భైరప్ప ఈ పాత్రలకు విశేషమైన నాటకీయతను రంగరించి ఆ సన్నివేశాల్ని రక్తి కట్టించారు. హిడింబిని వదలి వచ్చినప్పటి నుండి యుద్ధ సమయం వరకూ ఒక్కసారి కూడా భీముడు ఆమెను కలవలేదని భైరప్ప వాదన. భారతంలో భీమ, హిడింబులు అనేక పర్యాయాల కలయిక గూర్చి ప్రత్యేకంగా చెప్పకపోయినా వారి మధ్య సంబంధాలు కొనసాగాయనడానికి భారతంలోనే ఆధారాలున్నాయి. భైరప్ప నవలీకరణ అద్భుతంగా చిత్రించినప్పటికీ, అవన్నీ వాస్తవమయ్యే అవకాశం తక్కువ.

కుంతి పాత్ర అస్తిత్వం మీద ఇరువురి అభిప్రాయాలు కలిస్తేనే సమగ్రత కలుగుతుంది. ఏ ఒక్కరి పరిశోధనా ఫలితాలు అంగీకరించినా అది అర్ధ సత్యమే అవుతుంది. మరీ ముఖ్యంగా క్షత్రియ, సూత వర్గాల విశ్లేషణలలో ఇరువురి భావనలు యదార్థమైనవి.

మహాభారతంలో జైనమత ప్రస్థావనలు కలగలిసి పోయామని 'యుగాంత' సాధికారికంగా నిరూపించింది. వాసుదేవతత్వం ప్రాచీన జైన సంప్రదాయమని, జైన సంస్కృతి, వేదసంస్కృతుల మధ్య పరస్పర సంబంధాలను యుగాంత స్పష్టంగా విశ్లేషించింది. కానీ పర్వలో జైన సంస్కృతీ సాంప్రదాయాల ప్రస్తావనలు లేవు. భైరప్ప మాతృభాష కన్నడం. ప్రాచీన కన్నడ సాహిత్యం జైన సాహిత్యానువాదం వల్లనే ప్రారంభమయ్యింది. అయినప్పటికీ పర్వ మీద జైన తత్వ ప్రభావం కనిపించదు.

ఖాండవ ప్రస్థాన్ని పాండవులు ఇంద్రప్రస్థంగా మార్చారు. ప్రాథమికంగా ఇక్కడ నాగులు నివసించేవారు. తక్షకుడు అనే నాగుడు అక్కడి నాగ గణానికి నాయకుడుగా వ్యవహరించేవారు. ఆ ప్రాంతాన్ని పాండవులు జయించడంలో వున్న అనేకమైన మౌళికాంశాలను, సామాజికాంశాలను భైరప్ప కన్నా సునిశితంగా ఇరావతి విశ్లేషించారు. ఖాండవ ప్రస్థ సంఘటనల వల్ల కురువులతో నాగులకు కనీసం నాలుగు తరాల శత్రుత్వం ఏర్పడిందని సాధికారికంగా ఇరావతి నిరూపించారు. 'ఖాండవ' పదవ్యుత్పత్తిని వివరించడమే గాక, కర్ణుని ప్రధాన అస్త్రమైన నాగాస్త్రానికి ప్రాతిపదిక కూడా ఖాండప్రస్థ సంఘటనే ఆధారమని సునిశితమైన పరిశీలన చేశారు. ఆర్య, ఆర్యేతర జాతుల సంఘర్షణలను, సాంస్కృతిక వైరుధ్యాలను, సామాజిక అంతరాలను విశదం చేశారు. విరాటపర్వంలోని ఉత్తరగోగ్రహం జరిగి వుంటుందా అనే మీమాంస భైరప్పలో వుంది. ఆ మాట 'నానేకె బరెయుత్తేనే' అనే గ్రంథంలో కూడా అనుమానాన్ని వ్యక్తం చేశారు. అందుకే మహాభారతంలోని అతిప్రధానమైన సంఘటనల్లో ఒక్కటైన ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని గురించి పర్వ నవలలో పెద్దగా మాట్లాడేదు. కానీ ఇరావతి ఆ ఘట్టం జరగడంలో వున్న ఆవశ్యకతను వివరించడమే కాకుండా అనేకమైన రాజకీయపుటెత్తులు కూడా ఉత్తర గోగ్రహణంలో దాగివున్నాయని తెలియజేశారు. సూత, శూద్ర, విశ్, క్షత్రియ, బ్రాహ్మణ వర్గాల వైవిధ్యాన్ని కూడా స్పష్టపరిచారు. సంస్కృత మహాభారతం వంద పర్వాల ఇతిహాసం. ఆ ఇతిహాసం మీద ఏళ్ళ తరబడి పరిశ్రమ చేసిన పరిశోధకులు ఇరావతి, భైరప్ప గార్లు. ఇద్దరి రచనలు చదవడం ద్వారానే నిజమైన మహాభారతం స్వరూపాన్ని దర్శించగలుగుతాం. ఒక్కరి పుస్తకాన్ని చదివితే పాక్షికంగానే పాఠకుడు మహాభారతాన్ని అర్థం చేసుకోగలుగుతాడు. మహాభారత ఔన్నత్య, వైశిష్ట్యాలను ఇనుమడింప జేసిన పరిశోధనలు 'యుగాంత', 'పర్వ'! యుగాంత, పర్వ కన్న కొంత ముందుగా రాయబడింది. అందువల్ల పర్వ మీద యుగాంత ప్రభావం ఉండటం సహజం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. ఋగ్వేద ఆర్యులు – రాహుల్ సాంకృత్యాయన్
2. భగవద్గీత – డి.డి. కోశాంబి
3. భగవద్గీత – ఎమ్. వీరభద్రప్ప
4. రాముడికి సీత యేమవుతుంది – ఆరుద్ర
5. Ancient Indian Historical Tradition _ F.E.Pargiter
6. On The Meaning of the Mahabharata _ V.S. Suktankar
7. The Mahabharatha (Editions) _ V.S. Suktankar
8. An Introduction to the Study of Indian History _ D.D. Kosambi

# తెలుగు ప్రజల వలస గోస - గోపల్లె జనాలు

డా. సుధారాణి

**ఉపోద్ఘాతం :** తెలుగువాళ్లు ఎన్నో రాజకీయ, సాంఘిక, మతసంబంధమైన వివిధ కారణాలతో వివిధ ప్రాంతాలకు వెళ్లి కుదురుకొన్నారు. శతాబ్దాల క్రిందట తెలుగునాట పరాయి పాలకులు ప్రజల పై పగబట్టారు. ధన, మాస, ప్రాణాలను హరిస్తున్నారు. ఉన్నచోట వారి ఉనికికి ప్రమాదం దాపురించింది. పోరాడి గెలవలేరు! ఓడిపోయి పౌరషాన్ని చంపుకోలేరు! అలా స్థానిక రాజుల దురాగతాలను తట్టుకొనలేకమూటముల్లె సర్దుకొని ఉన్న ఊరు విడచి ఉత్తరం నుండి కొన్ని వందల తెలుగు కుటుంబాలు దక్షిణదిశగా దారి పట్టాయి. అడివితల్లే ఆదుకొన్నది! ఆకులు అలములు తిన్నారు. వనాన్ని తొలిచి, జనవాసంగా మలచి, నల్లరేగడి భూములలో విత్తులు ఉపోద్ఘాతం-తెలుగువాళ్లు ఎన్నో రాజకీయ, సాంఘిక, మత సంబంధమైన వివిధ కారణాలతో వివిధ ప్రాంతాలకు వెళ్లి కుదురుకొన్నారు. శతాబ్దాల క్రిందట తెలుగునాట పరాయి పాలకులు ప్రజలపై పగబట్టారు. ధన, మాస, ప్రాణాలను హరిస్తున్నారు. ఉన్నచోట వారి ఉనికికి ప్రమాదం దాపురించింది. పోరాడి గెలవలేరు! ఓడిపోయి పౌరుషాన్ని చంపుకోలేరు! అలా స్థానిక రాజుల దురాగతాలను తట్టుకొనలేక మూటముల్లె సర్దుకొని ఉన్న ఊరు విడచి ఉత్తరం నుండి కొన్ని వందల తెలుగు కుటుంబాలు దక్షిణదిశగా దారి పట్టాయి. అడవితల్లే ఆదుకొన్నది! ఆకులు అలములు తిన్నారు. వనాన్ని తొలిచి, జనవాసంగా మలచి, నల్లరేగడి భూములలో విత్తులు నాటారు. జలాలను ఒడిసిపట్టి పొలాలకు మళ్లించి కరువు ప్రాంతంగా మలిచారు! సిరులు పండించారు. వ్యవసాయం జీవనాధారం అయింది. పాడిపంటలు ప్రధానవృత్తిగా చేసుకొన్నారు.

తమిళనాడలో మధురకి దక్షిణదిశలో ఉన్న పాండ్యమండల ప్రాంతంలో సుమారు ఎనిమిది వందల ఏండ్ల క్రిందట ఉత్తరానున్న తెలుగునాడు నుండి వెళ్లి, పాండ్య మండలంలోని తూత్తుకుడి జిల్లా గుడిపల్లి (కోవిల్పట్టి) ప్రాంతంలో తెలుగు సంతతికి చెందిన సేద్యపు కుటుంబాలు కొన్ని కుదురుకున్నాయి. ఇప్పటికీ 60% పైగానే తెలుగువారున్నారు.

**గోపల్లె ప్రస్థానం!**

వందల ఏండ్ల క్రిందట గమ్యం తెలియని ప్రయాణానికి చివరి మజిలీ అయ్యింది. వందల కోసుల దూరమైన అటవీ ప్రాంతమే ఆవాసమైంది. వనాన్ని ఊరుగా మలిచారు తెలుగు ప్రజలు. నల్లరేగడి భూమిని మగానిగా మార్చుకొన్నారు. ఘనమైన చరిత్రను ఇముడ్చుకొంది ఆపల్లె. తెలుగునాట తెలుగువారికి తెలియని తెలుగు వెలుగు పల్లె గోపల్లె. తమిళనాడులో ఉన్నా అక్కడివారి వేషభాషలు అచ్చమైన తెలుగే. ఆట, మాట, పాట అంతా తెలుగే! ఇంతింతై వటుడింతై అన్న చందాన ఆ గోపల్లె నేడు ఇద్దై చేవల్‌గా ప్రఖ్యాతి సాధించింది. తరాలు మారినా అక్కడివారు తెలుగుభాషను మరువలేదు.

తరతరాలుగా వలస జీవితం సలుపుతున్న గాయాలు, వలస వ్యధలను కథల రూపంలో పిల్లలకు అందించారు అక్కడి పెద్దలు. అలా చిన్నవాడు తన అవ్వ చెప్పిన వలసగాథ ఓ పిల్లోడి మనస్సులో నాటుకుపోయింది. ఏండ్లగా గుండెలోతుల్లో గూడు కట్టుకొన్న గాథ! శతాబ్దాల క్రిందటి గోపల్లె గోస! తెలుగువారు కొలువున్న వెలుగుల గోపల్ల. శతాబ్దాల క్రిందటి ప్రజల జీవన సరళి, వ్యవసాయ విధానం, కష్టాలు, నష్టాలు, సామాజిక జీవనంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, వ్యవసాయంలో అవలభించిన విన్నూత్న పద్దతులు చిత్రిస్తూ ఇద్దై చేవల్ ఇతి వృత్తాన్ని వారసత్వంగా సంక్రమించిన భాష, యాస, సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి తెలియజేసే లక్ష్యంతో తాను పెద్దయ్యాక అక్షరసేద్యం చేశాడు.

ఇడై చేవల్‌కు ఒక ప్రత్యేకత ఉంది. కీరా గారి బాల్య మిత్రుడు. ప్రఖ్యాత రచయిత తుంగళ కొండూరు అళగర్ స్వామి. స్వర్ణకారుడై కులవృత్తిని కాదనుకొని కళల వైపు పయనించి తన కల సాకారం చేసుకొన్నాడు. కంబరామాయణంలో కావడి చిందుపై పరిశోధన చేసి, తనదైన శైలిలో రచనలు సాగించారు. తమిళమణి, నవశక్తి పత్రికా సంపాదకులుగా పనిచేసి మలేషియాలోని కౌలాలంపూర్‌లో తమిళ నేషన్ పత్రికకు ప్రధాన సంపాదకుడుగా పనిచేశారు. కవిగా, రచయితగా, విశేష ప్రతిభ కనబరచి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాన్ని పొందారు. సమకాలీనులైన ఇరువురు ఒకే ఊరికి చెందినవారు కావడం విశేషం! ఇద్దరూ స్నేహితులు కావడం మరో విశేషం! అయితే ఇద్దరూ పెద్దగా చదువుకొన్నవాళ్ళు కాకపోవడం ఆశ్చర్యం! అంతేగాక ఆ ఇద్దరూ తెలుగు సంతతివారైనా తమిళ సాహిత్య రంగానికి విశేష కృషి చేయడం గొప్ప విషయం! ఒకే ఊరికి చెందిన ఈ ఇరువురు ప్రఖ్యాత రచయితలై కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాలు అందుకోవడం ఆల్ ఇండియా రికార్డ్.

ఇడూచేవల్‌లో శ్రీ కృష్ణ రామానుజం, లక్ష్మీ అమ్మలకు 1923 సం.లో సెప్టెంబర్ 16వ తేదీన పుట్టిన తమ బిడ్డకు రాయంకుల **శ్రీకృష్ణ రాజనారాయణ పెరుమాళ్ రామానుజం నాయకర్** అనే పొడవాటి పేరును పెట్టారు. రచయితగా ఎదుగుతూ తన పేరులోని అక్షరాలు కలిసివచ్చేలా **"కీరా"** అనే కలం పేరుతో పలు రచనలు చేసి ప్రసిద్ధికెక్కారు. తమిళ సమాజంలో కీరా అత్యంత ప్రతిష్ట కలిగిన వ్యక్తి. చదివింది 7వ తరగతే అయినా ఈయనకున్న అమోఘమైన జానపద విజ్ఞానాన్ని గుర్తించి పుదుచ్చేరి విశ్వవిద్యాలయం అతిథి ఆచార్య పదవినిచ్చి గౌరవించింది. తమిళనాడు ప్రభుత్వం ఈయనకు పాండిచ్చేరి విశ్వవిద్యాలయం ఫోక్ స్టడీ డైరెక్టర్‌గా నియమించింది. మాజి రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు కీరా అభిమాన రచయిత. ప్రముఖ కథానాయకులు సూర్య, కార్తిక్‌ల తండ్రి శివకుమార్ కీరాని తమకు అత్యంత ఆత్మీయులుగా భావించేవారు. దర్శకుడు, నటుడు పార్థిపన్ ఆయనను తన "తాతా" అని మురిపంగా పిలుచుకొంటారు. తెలుగులోనే ముచ్చటించుకొంటారు. తొలి మాండలిక పితామహుడుగా గుర్తింపు పొందిన ఘనత కీరాదే. చదివింది 7వ తరగతే అయినా చరిత్రను అధ్యయనం చేశారు. తమిళనాడులోని అన్ని జిల్లాల యాసను అవపోసన పట్టారు. ఇది అసాధార ప్రజ్ఞ! తమిళంలో ఎనలేని పట్టు సాధించారు.

"గోపల్లె పురం–" గోపల్లెపుర మక్కల్‌గా రెండు నవలలు తమిళం భాష, తూత్తుకుడి మాండలికంలో అక్షరీకరించారు. తెలుగువాడు తెలుగు ప్రజల గోపల్లెను తమిళంలో రాస్తే తమిళజనులు వారి హృదయాలకు హత్తుకొన్నారు. "గోపల్లె పుర మక్కల్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది." భాష తమిళమైనా ఇందులో నేపథ్యమంతా తెలుగైంది! కీరా తెలుగు చదవడం రాయడం రాదు! కేవలం తెలుగు మాట్లాడుతారు. "తన రచనలన్నీ తెలుగు మాట్లాడే జనాల గురించి రాసిననంటారు. తన రచనల శరీరం తమిళ భాషైతే అంతులో ఆత్మ తెలుగే! అంటారు. నాకు తెలుగు రాయడం తెలుసుంటే అందులోనే రాసుండేవాడినంటారు" ఈ రెండు నవలలు తెలుగుజనాలకు చేరాలని ఆయన కోరిక తీరింది. గోపల్లె పురం తెలుగులో గోపల్లెగా నంద్యాల నారాయణ రెడ్డి. గోపల్లె పుర జన మక్కల్–"గోపల్లె జనాలు" జయప్రకాష్ అనువదించారు.

గోపల్లె నేపథ్యం – పల్లెల్లో సాగే సరదాలు, సంప్రదాయాలు, బ్రిటిష్ వాళ్ళ కాలంలో పల్లెలు ఎలా ఉండేవి! ఆహారంలో వచ్చిన మార్పులు, కొన్ని శతాబ్ధాల క్రిందట ఏర్పడిన పల్లె నాటి నుండి నేటి వరకు ఏవిధంగా సమస్త జనజీవనంలో వచ్చిన మార్పులు ఇందులో కథకు కట్టారు. తాను విన్న చూసిన సమాజాన్ని, వ్యవస్థను తన ప్రాంతయాసలో రాశారు. అంతర్లీకరించారు కీరా రాజానారాయణ.

17–మే–2021 కీరా స్వర్గస్థులైనారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళి అర్పించి రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియులు చేశారు. కీరా పుస్తకాలను, వస్తువుల తదితరాలతో ఓ ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. వీరి కృతులను, మిగిలిన రచనలను పరిశీలించినపుడు తమిళ సాహిత్యంలో ఒక ఉన్నత స్థానాన్ని పొందిన వ్యక్తిగా కన్పిస్తారు.

ఈ నవల ఒక చరిత్ర! వందల ఏండ్ల వలస జీవితం! పల్లె పాటలు, జానపద గాథలు, స్పష్టమైన భాష, యాస వుంది. ఆ నవలలోని కొన్ని సన్నివేశాలను శివాజీ గణేశన్, రాధ నటించిన ముదల్ మర్యాద్ తమిళ చిత్రంలో వాడుకొన్నారు. అది తెలుగులో ఆత్మబంధువు చిత్రంగా విడుదల అయింది.

ఈ నవల సృజనాత్మకమైనదైనప్పటికీ అందులోని సంఘటనలు చారిత్రాత్మక, సామాజిక అంశాలతో కూడుకొని ఉన్నాయి. ఎనిమిది వందల ఏండ్ల క్రిందట వివిధ రాజకీయ, సంస్కృతిక కారణాలతో ఉత్తరాన్నుంచి దక్షిణాది వైపు వలస వెళ్లారు. అక్కడి అడవులను కొట్టి, నేలను తీర్చి సాగులోనికి తెచ్చి, కుదురుకొన్నారు. అడవి ఆవులను మచ్చిక చేసుకొని తమ ఊరికి గోపల్లె అని పేరు పెట్టుకొన్నారు. తరువాత ఆ గ్రామం పెరిగి పెద్దదై ఎన్నో కుటుంబాలను తనలో కలుపుకుంది. తరువాత స్వాతంత్రోద్యమకాలాన తెల్లవాళ్ళు ఈ నేలను విడిచి ఎలా వెళ్లిపోయారో గోపల్లె నవలకు కొనసాగింపుగా ఆ గ్రామం పెరిగి పెద్దదయి ఎంతో మందిని తమలో కలుపుకొని స్వాతంత్రోద్యమకాలాన ఎట్లా ఉండిందో చెప్పేదే రెండో నవలన గోపల్ల పురత్తుమక్కళ్ (గోపల్లె జనాలు) ఆనందవికటన్ పత్రికలో ధారావాహికంగా వచ్చినపుడు తమిళనాడే కాకుండా శ్రీలంక, సింగపూర్ లాంటి విదేశాలలో తమిళులు సైతం దీనిని మైమరచి చదివారు. దీనికే 1991 సం.లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఈ విధంగా వందల ఏళ్ళనాటి రైతు జీవితాలకు అద్దం పట్టింది. తెలుగు కుటుంబాల సుఖదుఃఖాలు ఇందులో కనిపిస్తాయి.

**గోపల్లె జనాలలో పరిశీలించదగ్గ కొన్ని అంశాలు**

గోపల్లెలో సూర్యోదయాన్ని వర్ణిస్తే రెండవ నవలలో గోపల్లె జనాలులో దండెం మీద ఆరవేసి ఉన్న చీరను మెల్లగా తీసుకున్నట్లు... ఎనిమి ఎండను నెమ్మదిగా లాక్కొని పడమటి కొండల్లో జారిపోయింది సంధ్యాదేవి మెల్లగా అలుముకొంటుంది. ఇలా వర్ణించడం వెనుక కీరా గారి ముఖ్య ఉద్దేశ్యం ఆంగ్లేయులు ఈ గడ్డపై అడుగిడడంతో ఇక్కడ చీకటి అలుముకొందని భావం. ఈ నవల చదువుతున్నంతసేపు మనం ఆనాటి ఆ గ్రామంలోనే వున్నట్టు అనిపిస్తుంది. పల్లె బతుకు తీరుతెన్నులను ఆయన వివరంగా చెప్పే సొగసు చాలా అద్భుతం.

ఈస్టిండియా కంపెనీ సెలవు తీసుకోని, బ్రిటిష్ గవర్నమెంట్ తన ఆధీనంలోనికి తెచ్చుకోవడం నుంచి మొదలవుతుంది. గోపల్లె ఆకారంలాగా ఆ ఊరి జనాల మనోభావాలు కూడా మెల్లమెల్లగా మారుతూ కాలానుగుణంగా అలవాట్లు, ఆచారాలలో చాలా మార్పులు చోటు చేసుకొన్నాయి. మగవాళ్ళు జుట్టును పెంచి కొప్పుముడి వేసుకొనేవారు తరువాత కాలంలో సగం మంది పైగా కుర్రవాళ్ళు తమ పిలకజుట్టు కత్తిరించి క్రాపులు చేయించుకొన్నారు. హరికునులాంతరు కొత్తగా వచ్చింది. అలాగే నిద్రరాకుండా ఉండటానికి ఒక ఆకు వచ్చిందంట కదా! అని తేయాకును ఎలా ఇక్కడ అడుగు పెట్టిందో చాలా సరదాగా, ఆసక్తికరంగా తెలియజెప్పారు. కొత్తగా వీధిబడులు ఏర్పడటం. బండ్లు ఎద్దులు ఉన్న ఆసాములు శ్రమ చేయడం పూర్వీకుల సాంప్రదాయం. మెత్తగా ఉన్న ఇసుకను తెప్పించి అందులో విద్యార్థులకు అక్షరాలు దిద్దించేవారు. ఆ కాలంలో దానాలలో శ్రేష్ఠమున్నది వాటిల్లో నిప్పు దానం ఒకటి! నిప్పుకోసం చాలామంది ఆడవాళ్ళు పొరిగింటికి పోయేవాళ్ళు. నిప్పు ఇచ్చినవారికి ఉపచారంగా ఊరులోని సంగతులను నాలుగుమాటలు చేర్చి, చేరవేసేవారు. ముఖ్యంగా మంగలివాళ్ళు, చాకలివాళ్ళు ఎక్కువగా సమాచారం చేరవేసేవారు. బర్మానుండి ఓడల్లో బియ్యం మూటల్లో దిగుమతి అయ్యేవి. సజ్జకూడు తిని చవిబారిన నోటికి వరికూడు అపురూపంగా ఉండేది. వరికూడు, పప్పు, సాంబారు వచ్చిన తరువాత పిల్లకాయలకు బాగా కొవ్వెక్కిపోయిందని మునిపెంగా తిట్టేవారు. తమిళనాట ప్రచారంలో ఉన్న జానపద కథను ఇందులో ప్రస్తావించారు.

దేవుడు మొదట జీవరాశులను సృష్టించినపుడు ఒక్కొక్కరికి ఒక్కోపని అప్పజెప్పాడు. అలా గొడ్డును జూసి నీవు నేలను దున్నడానికి మడకనులాగాలి! మనిషికి సాయంపడాలి! తల్లిపాలు లేని బిడ్డలు చనిపోకుండా మీ పాలు ఇచ్చి కాపాడాలి! ఇలాగంతా మీరు మనుష్యులను కాపాడాలి. గొడ్డు మౌనంగా నిలబడింది. నీమనస్సులో ఏముందో చెప్పు అంటే కొన్ని షరతులు చెప్పింది.

1. నన్ను దినమంతా గొడ్లసావిడిలో కట్టి పడేయక కాసేపు తిరిగేందుకు వదలాలి!
2. సజ్జకంకుల్ని గింజ తొక్కించేప్పుడు మా నోటికి చిక్కాలు బిగించకూడదు!

3. ఏడాదికి ఒకసారి మా పశువుల కొట్టంలో పొంగళ్ళు పెట్టి మాకు మర్యాదలు చెయ్యాలి!

4. ఆ రోజు మమ్మల్ని కడిగి కొమ్ములకు పసుపు పూసి కుంకుమ పెట్టి తినడానికి చెరకు, పొంగలి అన్న పెట్టాలి.

దేవుడి సాక్షిగా పెట్టుకొని వీటికంతా అంగీకరించాడు మనిషి. ఇదంతా నువ్వు అంగీకరించావంటే నేను చనిపోయినా కూడా నాతోలు నీకాళ్ళ చెప్పులుగా ఉంటుందని చెబుతుంది పశువు.అంతేగాక నీ పొలం పంట బాగాపండి కళ్ళంలో కొండంత ఎత్తుగా కుంకులు కుప్పవేసి ఉంటాయి. అప్పుడు కవిరాయుడు వచ్చి నిన్ను, నన్ను తేనెకంటే తీయగా పొగుడుతూ పాడుతాడు. అతడు ఎంతవరకు తీసుకోవడానికి వీలవుతోందో అంతవరకు తీసుకొని పోవడానికి అతనికి అనుమతి ఇవ్వాలి. అప్పుడే నేలమ్మ నీకు బంగారాన్ని పండిస్తుంది. ఇలా పాడే కవిరాయనికి కంబర్ అనే పేరు. వాడు పాటపాడి ముగించిన తరువాత పంటకల్లంలో రెండు చేతులు దూర్చి వీలైనంత గింజలను తీసుకొని పరచిన కండువాలో మూటగట్టి తీసుకొని వెళ్తాడు.

అలా పొలం నుండి మహనీలు వచ్చిన తరువాత సంసారులు ఇచ్చే మొదటి దానం ఇది. మిగిలిన వాళ్ళకంతా తమ దోసిళ్ళతో ధారాళంగా పోస్తారు. ఒక్క కంబరుకు మాత్రం తానే స్వయంగా తీసుకోవడానికి వదలి వేయడం వంశపారపరంగా వస్తోంది. ఏ విధంగా స్వభావాన్ని వృత్తులను బట్టి వచ్చి చేరుతాయో, చాలా చక్కగా ఈ నవలలో తెలియజేశారు. ఉదా. గారింటివారు – గారతో ఇల్లు కట్టింది వీరి పెద్దలే!

**ముగింపు**

స్వాతంత్ర్య పోరాటం, ముఖ్యంగా బొంబాయిలో నావికుల పోరాటం, ఐ.ఎన్.ఎస్ తల్వార్, గాంధీ సాగించిన ఉద్యమాల నేపథ్యంగా సాగిన ఈ కథ దేశానికి స్వాతంత్ర్యం దేశ విభజన వలన జరిగిన రక్తపాతాన్ని తట్టుకోలేక నిర్వేదంగా బెంగాల్‌లో ఒక చోట బాపూజీ నూలు వడుకుతూ ఉండిపోతాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేసింది మీరు మౌనంగా ఉన్నారే విలేకరులు అడిగిన దానికి సమాధానం ఏమీలేదు... ఏమీ లేదు... అన్న మహాత్మాగాంధీ గారి మాటలు నిర్లిప్తంగా గోపల్లె అంతా ప్రతిధ్వనించడంతో ముగుస్తుంది. అవి నేటి సమాజానికీ వర్తిస్తాయి.

ఈ విధంగా నల్లరేగడిభూముల్లో చెప్పుకోదగిన వ్యవసాయ విధానాలను దక్షిణాదిన ప్రవేశపెట్టి ఘనత తెలుగువారిదే. ఆనాటి సమకాలీన సమాజానికి, సంస్కృతి సాంప్రదాయులకు, ఆచారాలకు ఈ నవల అద్దంపడుతుంది. వీరు తెలుగునాడు నుండి తమిళనాడుకు వలస వెళ్లేప్పుడు ఇక్కడి మణులు మాణిక్యాలను తీసుకొని పోలేదు. వాటిని తన గర్భంలో దాచుకొన్న నేలతల్లే వారికి మిన్న అందుకే మట్టిని దైవంగా భావించి తాము వలస వెళ్లిన ప్రాంతానికి ఒక పసుపుగుడ్డలో పిడికెడు మట్టిని తీసుకొని వెళ్లి ఇప్పటికీ పూజిస్తున్నారు. దక్షిణ భారతీయ పల్లె సంస్కృతి అడుగడుగునా మనకు ప్రతిఫలిస్తుంది. మొత్తానికి ఒక్కమాటలో చెప్పాలంటే గోపల్లె–జనాలు నవల తెలుగువారి యథార్థ జీవన గాథ.

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథల్లో స్త్రీ పాత్రల వైశిష్ట్యం

**బులుసు సీతారామమూర్తి,** విశ్రాంత శాఖాధికారి, భారతీయ జీవితభీమా సంస్థ, తెలుగు భాషా సాహిత్యాభిమాని

"కథక చక్రవర్తి" శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారివి తెలుగుతనం ఉట్టిపడే ప్రపంచ స్థాయి కథలు. కథానికలకు గుండెబలం కండబలం యిచ్చి పోషించిన వారిలో శాస్త్రి అగ్రగణ్యులు. ఆధునిక కథా సాహిత్యానికి గురజాడ 'జీవం' పోస్తే శ్రీపాద వారు కథకి 'జవం' పెంచారు. శ్రీపాదవారు కథలు మొత్తం 75 విజయవాడ విశాలాంధ్ర ప్రచురణ సంస్థ ప్రచురించిన మూడు సంపుటాల్లో 25 కథలున్నాయి. నేను నాలుగు కథలను మాత్రమే ఎంపిక చేసుకున్నాను.

ప్రతీ కథలోనూ గ్రామీణ వాతావరణం, స్త్రీమూర్తుల అభిమానం, ఆప్యాయత, కొంటెమాటలు, ఎత్తిపొడుపు మాటలు వినిపిస్తూ వుంటాయి. కొందరు అమాయకులూ కనబడతారు. నాటి అమ్మాయిల్లో యువతుల్లో అప్పుడప్పుడు గడుసరితనం తొంగి చూస్తూ ఉంటుంది. నాటి మహిళలకు పరభాషా సంపర్కం లేనందున – వారి మాటల్లో సహజత్వం, తెలుగు నుడికారం జాతీయాలు, సామెతలు, అక్కడక్కడ శ్లేష, లౌక్యం కనబడుతుంది.

'అన్నంత పనీ జరిగింది' – అక్టోబర్ 1934లో 'ప్రబుద్ధాంధ్ర' లో ప్రచురింపబడిన కథ (1)

ప్రముఖ న్యాయవాది జయంతి చంద్రమౌళి పంతులుగారి కుటుంబ కథా చిత్రం. పంతులు కోర్టుకి కార్లో బయలుదేరుతూ ఉండగా ఒక పేద యువకుడు రామచంద్రం వారిని మూడు నిమిషాలు ఆపి, నాకేదైన పని ఇప్పించమని ప్రార్థిస్తాడు. అతని మాటతీరుకి సంతోషించి, "సరే మా యింట్లో ఉండిపో" అంటారు పంతులు. పంతులు ముద్దుల కుమార్తె సుభద్ర 8 ఏళ్లకే బాల వితంతువయింది. తల్లిలేని పిల్ల. పన్నెండేళ్లకే కథా రచయిత్రి అయిన సుభద్ర రాసిన కథలు 'భారతి' లో పడ్డాయి. పడుతున్నాయి. పంతులు వద్ద కొత్తగా పనిలో చేరిన రామచంద్రం సుభద్ర కథల్ని సాపు చేయడంతో బాటు కొన్ని పాత పదాలు మార్చి ఇంకా చక్కని పదాలతో కథకి శోభ తెచ్చాడని సుభద్ర మురిసిపోయింది. తన కథల్ని పుస్తకరూపంలో అచ్చు వేయించడానికి రామచంద్రాన్ని చెన్నపట్నం పంపించడానికి తండ్రిని ఒప్పిస్తుంది సుభద్ర. రెండే రెండు పంచలతో అవస్థలు పడుతున్న రామచంద్రానికి కొత్త దుస్తులు కొనిపిస్తుంది ఆ అమ్మాయి.

సుభద్ర చిన్నదైనా దయాగుణంలో పెద్దదని కథ ద్వారా తెలుస్తుంది. ఆడపిల్లన్ని గుమ్మం దాటి బయటకు పంపజాలని కాలంలో సుభద్ర కథా రచయిత్రి అవడానికి తండ్రి యొక్క సహకారం ఉన్నతాశయాలే కారణం.

కథలో రెండవ మహిళామణి జానకమ్మ. బాల వితంతువు. మిషనరీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుకుని ధైర్య సాహసాలు అలవర్చుకుంది. ఆడపిల్లలకి ట్యూషన్లు చెప్పుకుంటూ రాజమహేంద్రవరంలో స్వంత ఇంట్లో జీవితం గడుపుతోంది. పంతులు గారింట్లో రోజూ పాఠాలు చెబుతుంది. కాలక్రమేణా సుభద్ర, జానకమ్మల మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయి. సుభద్ర ఒకరోజు తండ్రితో "మాష్టారే మా అమ్మ అనుకుంటానండీ" అనేస్తుంది. తర్వాత జానకమ్మని "మనింటికి వచ్చేయమనండి నాన్నారూ" అని అడుగుతుంది. తర్వాత జానకమ్మ సుభద్రకి పిన్ని, చంద్రమౌళి పంతులుకి 'జానీ' అవుతుంది. అంటే పంతులు వితంతు పునర్వివాహం చేసుకున్నాడు. ఒక సంఘటన చూసిన జానకమ్మ – పెళ్ళీడు

వచ్చిన సుభద్రకి ఈడూ–జోడూ ఐన వరుడు రామచంద్రమే అని పంతులుగారికి నచ్చ చెబుతుంది. పెంపుడు తల్లయినా సుభద్ర ఇష్టపడిన మంచి వ్యక్తితో సుఖసంతోషాలతో జీవించాలని అనుకోవడం జానకమ్మ మంచితనానికి నిదర్శన.

"గూడు మారిన కొత్తరికం" – ఆగస్టు 1927 'అభ్యుదయ' లో పడిన కథ (2)

ఇది కూడా కుటుంబ కథా చిత్రమే. నాటి సామాజిక పరిస్థితులకు దర్పణం. ఇందులో కథానాయిక నరసమ్మకు పదహారో ఏడే పెళ్ళయిన సంవత్సరం తర్వాత కొత్తకాపురానికి పంపుతారు. తల్లిదండ్రులు. కొన్నాళ్ళు కొత్తకాపురం చేసి పుట్టింటికి వస్తే – సుభద్ర సఖీమణుల వల్ల, ఇతర అమ్మలక్కల ఉబుసుపోక పురాణాల వల్ల – యువదంపతులు పడిన ఇబ్బందుల్ని శ్రీపాదవారు చమత్కారంగా విశ్లేషించారు. ఈ కథలో నరసమ్మ సర్వ స్వతంత్రురాలు. పెళ్ళయిపోయినా తల్లి రాజమ్మని విడిచి ఉండలేని అమాయకురాలు. భర్తపట్ల సహజమైన ప్రేమానురాగాలు గల యువతి. చిన్ననాటి స్నేహితురాళ్ళతో చిక్కటి అనుబంధాలు సాగించే అమ్మాయి. కథలో సుభద్ర పాత్రను శ్రీపాదవారు చక్కగా వర్ణించారు.

"మార్గదర్శి" జనవరి 1928 'భారతి'లో పడిన కథ (3)

ఇది గొప్ప సందేశాత్మకమైన కథానిక. ఇందులో ఆధునిక యువతరానికి కళ్ళు తెరిపించే గొప్ప సందేశం ఉంది: "డిగ్రీ పూర్తి కాగానే ప్రభుత్వ ఉద్యోగంకోసం వెంపర్లాడి, అదృష్టవశాత్తు ఉద్యోగం సంపాదిస్తే – దొరికేది బానిస బ్రతుకే." యువకులు స్వయంగా వ్యాపారం లేక చిన్న తరహా పరిశ్రమ పెట్టుకుని తెలివిగా నిర్వహించుకోవడమే ఉత్తమం అన్నదే ఈ కథకుడు యిచ్చే సూచన. ఈ కథలో ముత్యాల మాటల్లాంటి సూక్తులు సలహాలు కోకొల్లలు. "పెట్టుబడి తక్కువా, బుద్ధి ఎక్కువాను – వర్తక శాస్త్రంలో ఇదొక సూత్రం. కానీ యిది ఎంత సుళువుగా కనబడుతుందో అంత కష్టం అయినది."

ఈ కథలోని ఎత్తుగడ ఇది – స్కూలు ఫైనలు పాసైన నవ యువకుడు ఒక ప్రముఖ వకీలు దగ్గరికి వచ్చాడు. సబ్ కోర్టులో ఖాళీ వచ్చింది, మీ సిఫార్సు కావాలని అడుగుతాడు. అప్పుడా న్యాయవాది –"శంభు శాస్త్రి కథ"ని "ఫ్లాష్‌బాక్"గా వినిపిస్తాడు. శంభు శాస్త్రి తండ్రి తంబూరా పుచ్చుకుని భిక్షాటనం చేసేవాడు. తండ్రి పోయాక, తల్లి ఒక రోజున "నాయనా– ఇంక నువ్వు సంపాదిస్తేనేగాని ఇల్లు గడవదు. నువ్వే ఏంచేయాలో ఆలోచించుకో " అంది. ఇక్కడొక ఉపకథ – ఒక వైశ్యుడు కొడుక్కి, కూతురికి దీపావళి బాణసంచాల కోసం చెరొక రూపాయి ఇస్తాడు. కొడుకు టపాసులు కొనేసుకొని సాయంత్రాని కల్లా వాటిని మసి చేసేస్తాడు. కానీ తెలివైన కూతురు మాత్రం రూపాయితో టపాసులు టోకులో కొని, పెరటి గుమ్మంలో అంగడి పెట్టుకొని టపాసులు అమ్మి, పది రూపాయలు లాభం తెచ్చుకుంటుంది. ఆ పది రూపాయలతో చిల్లర అంగడి పెట్టిసాగించి కాపురానికి వెళ్ళేటప్పుడు అత్తవారింటికి స్వార్జితం వెయ్యి రూపాయలు పట్టుకెళ్తుంది.

ఇంకొక స్త్రీపాత్ర సోదమ్మక్క– వకీలుగారి రెండో పెళ్ళి భార్య, వడ్డీవ్యాపారం చేస్తున్న తెలివైన మహిళ. శంభు శాస్త్రి తల్లితో ప్రీతిగా, ఆదరంగా మాట్లాడే విదుషీమణి. ఆ పరిచయంతో శాస్త్రి సోదమ్మక్క దగ్గర– ఒక్క రూపాయి అప్పు అడిగి పుచ్చుకుంటాడు. ఆ రూపాయితో తువ్వాళ్ళూ అంగవస్త్రాలు కొంటూ–అమ్ముతూ రాత్రి లోపల నాలుగు రూపాయలు లాభం గడిస్తాడు. ధైర్యం వస్తుంది. శాస్త్రి వ్యాపారం–సంచీతో మొదలుపెట్టి, భుజాల మూటల నుండి కావిడికి ఎదిగి, ఆఖరికి నడిబజారులో పెద్ద అంగడి పెట్టదలిచే వరకు పెరిగింది. శాస్త్రి పెద్ద అంగడి పెట్టడానికి సోదమ్మక్క – తక్కువ వడ్డీకి – నోటు రాయించుకోకుండా పాతిక వందల రూపాయల అప్పు ఇస్తుంది. ఆమె మంచితనం సహాయ పడే గుణం మానవత్వానికి నిదర్శనాలు. లక్షాధికారిగా ఎదిగిన శాస్త్రికి సోదమ్మక్క కూతురితోనే పెళ్లి నిశ్చయమవుతుంది.

వకీలు ఆ నిరుద్యోగ యువకుడికి 'మార్గదర్శి'గా చెప్పిన మాటలు : "కష్టపడు. బాగుపడు. అంతేగాని నౌకరీ యిప్పించమని నన్ను వేధించకు."

"కొత్తచూపు" నవంబరు 1948 'కిన్నెర'లో ప్రచురింపబడిన కథ (4)

ఇదొక 'పెళ్ళిచూపుల' ప్రహసనం. మహేంద్రవాడ అగ్రహారంలో, జరిగిన విప్లవాత్మకమైన, విలక్షణమైన సంఘటన. పెళ్ళివారిని పిలిపించింది పెళ్ళికూతురు మాతామహుడు. అప్పుడు పెళ్ళికొడుకు తండ్రి, పెళ్ళికొడుకు మేనమామ, పెళ్ళికొడుకు బావ, చివరికి పెళ్ళికొడుకు – నలుగురూ నాలుగు షరతుల జాపితాలు విన్పిస్తారు. పెళ్లికూతురు అన్నపూర్ణ, పాత, క్రొత్త సాంప్రదాయాల యుగసంధిలో పుట్టిన పిల్ల. పెళ్ళివారి 50 పైచిలుకు కోరికల్ని, షరతుల్ని విని కోపావేశంతో రంగప్రవేశం చేస్తుంది. పెళ్ళికొడుకుని తన ప్రశ్నకి జవాబు చెప్పమని అడుగుతుంది – "ఉత్తర భారత భూముల్లో భారత స్త్రీలెందరో మానభంగాలకు గురి అయారు. ఉత్తరాంధ్రలో కూడా స్త్రీల కెందరికో ఆ గతిపట్టింది. స్త్రీలకిది చావుబతుకుల సమస్య. మీకళ్ళెదుట మీయింటి స్త్రీలకట్టి అవమానం జరిగితే – మీరు శత్రువుల మీద పడగలరా?" జవాబు రాలేదు. ఇంట్లో తర్వాత అన్నపూర్ణ అంటుంది : "ఇప్పుడు యోగ్యులైన వరులకు శౌర్యం, బలపరాక్రమాలు, తెగబడి యుద్ధంచేసే ధైర్యం, రాక్షసవివాహం కూడా చేసుకోగలిగే సత్తా ఉండాలి." అగ్రహారంలో రామశాస్త్రి, భార్య రాజేశ్వరి, వస్తాదు సుబ్బయ్య కలిసి అగ్రహారంలో స్త్రీ పురుషులకి కర్రసాము, కత్తిసాము, మల్లయుద్ధం శిక్షణా కేంద్రం జరుపుతున్నారు. అందులో అన్నపూర్ణ కూడా శిక్షణ పొందింది. కొన్ని నెలల తర్వాత భట్టాచార్యుల ఆధ్వర్యంలో పోటీలు జరిపారు. అందులో అన్నపూర్ణ పట్టాకత్తులు తిప్పుతూ యువకులు విసిరిన 25 నిమ్మపళ్ళని రెండేసి ముక్కలు చేసిపారేస్తుంది. తర్వాత మల్లయుద్ధంలో సూరిశాస్త్రితో తలపడి ఓడిపోతుంది. న్యాయనిర్ణేత సుబ్బయ్య– అన్నపూర్ణ అధర్మ యుద్ధం చేసిందన్నాడు. అప్పుడు అన్నపూర్ణ తండ్రి రామశాస్త్రి – మా అమ్మాయికిష్టమైతే అమెని సూరిశాస్త్రి కిచ్చి వివాహం చేస్తాను అన్నాడు. అన్నపూర్ణ సిగ్గుతో తలవంచుకుంటుంది. కథ సుఖాంతం.

**ఉపసంహారణ :** స్త్రీలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్న ఈ కాలంలో – మన సమాజంలో ఇంకా ఎందరో అన్నపూర్ణలు, దుర్గాబాయి దేశముఖ్‌లు, ఝాన్సీలు, రుద్రమలు తయారు కావాలని ఆకాంక్షిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. లోకాఃసమస్తాస్సుఖినోభవంతు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. సరస్వతి దేవి ఇల్లిందల, స్వర్ణ కమలాలు (కథా సంపుటి), 1981.
2. వెంకట సుబ్బయ్య వల్లంపాటి, కథాశిల్పం
3. హేమ, ఇల్లిందల సరస్వతి దేవి జీవితము – రచనలు (సిద్ధాంత గ్రంథం), ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1992.

UGC CARE List Approved Journal Under Arts and Humanities Category

# తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు - సమీక్ష

## "Sahitya Academy Award Winning Writings in Telugu - A Review"

22, 23 డిసెంబర్, 2023



